Shaanti-Samaram-Nyaayam (Peace, War and Justice- Telugu)

# శాంతి సమరం న్యాయం

రచన
అబుల్ ఇర్ఫాన్

ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, సందేశ్‌భవన్
లక్కడ్‌కోట్, ఛత్తాబజార్, హైదరాబాద్-2
040-66710795, 91-9441515414

వెల..............................................................రూ. 100/-లు



Name of the Title : Shaanthi-Samaram-Nyaayam (Telugu) (Peace, War and Justice)

Compilation : **ABUL IRFAN** Hyderabad-2

All Rights Reserved with : Islamic Resource Centre

First Edition : February, 2008

Copies : 1000

Published by : Islamic Resource Centre, Lakkad kot, Chatta Bazar, Hyderabad-2, Ph: 66710795

Type set by : Alifain, IRC Graphics, Lakkad kot, Chatta Bazar, Hyderabad-2, Ph: 9441515414

Printed at : H.S. Offset Printers, 714, Chandni Mahal, Daryaganj, New Delhi-2, Ph: 011-23244240

Price : Rs. 100/-

IRC ప్రచురణల ప్రత్యేకత

1) తేట తెలుగులో భావ స్పష్టీకరణ
2) సులభ శైలిలో సాహిత్య మాధుర్యం
3) సంక్షిప్త వాక్యాల్లో సమగ్ర సమాచారం
4) 12 గ్రంథాల్లోనే ఇస్లాం సంపూర్ణరూపం

కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం

## దుష్ట శిక్షణ-శిష్ట రక్షణ

వారు (బాధలు భరించలేక) "దేవా! దుర్మార్గులు నివసిస్తున్న ఈ నగరం నుండి మమ్మల్ని బయటికితీసి కాపాడు. మాకు రక్షణ కల్పించి అండగా నిలిచేవారిని ఎవరినైనా నీ వైపు నుండి మా దగ్గరికి పంపు" అని మొరపెట్టు కుంటున్నారే! అలాంటి పీడితప్రజల రక్షణ కోసం మీరెందుకు పోరాడరు? (దివ్య ఖుర్ఆన్-4:75)




# విషయసూచిక


| నెం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | శాంతి ఎలా లభిస్తుంది? | 10 |
| 2. | సంతృప్త హృదయానికే శాంతి ప్రాప్తం | 13 |
| 3. | శాంతికి అసలైన సోర్స్ | 16 |
| 4. | యావత్తు సృష్టి ధర్మం ఇస్లామే | 19 |
| 5. | మానవుని జీవిత పరమార్థం | 21 |
| 6. | సమగ్ర ధర్మావగాహనే శాంతికి దోహదకారి | 23 |
| 7. | మానవచట్టాలు-దైవచట్టాలు | 26 |
| 8. | శాంతి ఉద్యమం ప్రారంభ దశ | 27 |
| 9. | మక్కా ప్రజల కవ్వింపు చర్యలు | 29 |
| 10. | జిహాద్ అనుమతి | 32 |
| 11. | సమర సన్నాహాలు | 36 |
| 12. | మక్కా ఖురైషీయుల దండయాత్ర | 39 |
| 13. | దైవ సహాయం | 41 |
| 14. | యుద్ధ ఖైదీల సమస్య | 42 |
| 15. | అవిశ్వాసుల పరాజయ ప్రతీకారజ్వాలలు | 45 |
| 16. | యూదుల ఆగడాలు | 46 |
| 17. | బనీఖైనుఖా యూదుల దేశబహిష్కరణ | 48 |
| 18. | మదీనాలో రెడ్ అలర్ట్ | 51 |
| 19. | ఉహుద్ కొండల్లో సమరజ్వాలలు | 54 |
| 20. | మోసపోయిన ముస్లిం బోధకులు | 57 |
| 21. | బనీనజీర్ యూదుల దేశబహిష్కరణ | 58 |
| 22. | దూమతుల్ జందల్ దండయాత్ర | 61 |
| 23. | బహుదైవారాధకులతో యూదుల కుమ్మక్కు | 62 |
| 24. | కందకంలో భవిష్యత్ సంకేతాలు | 64 |
| 25. | అరబ్బులకు అర్థంకాని పథకం | 67 |
| 26. | యూదుల నమ్మక ద్రోహం | 69 |

27. అంతర్గత శత్రువులు 73
28. తానొకటి తలచిన దైవమొకటి తలచున్ 74
29. అవిశ్వాసులపై ప్రకృతి ప్రకోపం 78
30. బనీఖురైజా యూదుల దుర్గతి 80
31. చెదురు మదురు సంఘటనలు 84
32. హుదైబియా పయనం (హజ్‌యాత్ర) 87
33. అవిశ్వాసుల హజ్ ఆటంకాలు 90
34. ముస్లింల రిజ్వాన్ శపథం 94
35. హుదైబియా శాంతి ఒప్పందం 97
36. దివి నుండి దిగిన విజయవార్త 100
37. హుదైబియా ఒడంబడిక పరిణామాలు 103
38. ఖైబర్ దండయాత్ర 106
39. ప్రప్రథమ కాబా (ఉమ్రా) యాత్ర 109
40. మక్కాలో తొలి కాబాయాత్ర ప్రభావం 112
41. మూతాలో విజయకేతనం 117
42. ఒప్పందం ఉల్లంఘనతో పశ్చాత్తాపం 120
43. మదీనా దాటిన యుద్ధరహస్యం 123
44. మక్కా దండయాత్ర 126
45. అబూసుఫ్యాన్ లొంగుబాటు 128
46. సత్యం రాకతో అసత్యం నిష్క్రమణ 130
47. సాధారణ క్షమాభిక్ష 134
48. హవాజిన్, సఖీఫ్ తెగల తిరుగుబాటు 139
49. ఖైదీలు, శత్రువుల పట్ల ప్రవక్త ఔదార్యం 141
50. తబూక్ దండయాత్ర 146
51. కపట విశ్వాసుల ఆగడాలు 148
52. తబూక్‌లో సైనిక కార్యకలాపాలు 153
53. తాయిఫ్ వాసుల ధర్మపరివర్తన 155
54. ప్రప్రథం హజ్ (కాబా) యాత్ర 158



55. శాంతిభద్రతలకు సమరమే శరణ్యం 160
56. ఇస్లాంలో బలత్కారం లేదు 165
57. శ్రేష్ఠ సమాజం బాధ్యతలు 168
58. చేసిన మేలు మరచిన అప్రాచ్యులు 172
59. జిజ్యా (రక్షణ రుసుం) 177
60. ముస్లిమేతరులతో శాంతి ఒప్పందం 181
61. శ్రేయోరాజ్యంలోని పాలకులు 184
62. ఇస్లాంలో న్యాయవ్యవస్థ 190
63. న్యాయవ్యవస్థ ప్రాతిపదికలు 193
64. హత్యా నేరం 195
65. మత భ్రష్టత్వం శిక్ష 198
66. దొంగతనం 198
67. మద్యం, మత్తుపదార్థాలు 199
68. అశ్లీలం మీద ఆంక్షలు 201
69. పరువు నష్టం దావా 202
70. వివిధ మతాలలో వ్యభిచార శిక్షలు 208
71. ఇస్లాంలో వ్యభిచార శిక్షలు 210
72. జిమ్మీలకు విధించే శిక్షలు 212
73. ప్రభుత్వం నేరస్థుల్ని వేటాడి శిక్షించదు 214
74. మానభంగం శిక్షలు 215
75. నేరనిరూపణ సాక్ష్యం 217
76. నేరవిచారణ విధానం 219
77. శిక్ష అములుపరచే పద్ధతులు 222



# పరిచయ పలుకులు

ఈనాడు మానవుడు సైన్సు, సాంకేతిక రంగాల్లో అనూహ్యామైన ప్రగతి సాధించాడు. ప్రతి రంగంలోనూ యంత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు అతని జీవిత సమరాన్ని సులభతరం చేశాయి. ఆహారోత్పత్తులు కూడా బాగా పెరిగిపోయి జీవితం మరింత సుఖవంతం అయింది. వివిధ రూపాల్లో జీవిత మాధుర్యాలు జుర్రుకోవడానికి ఎన్నెన్నో సాధనాసంపత్తులు సమకూరాయి. అయినప్పటికీ ఈ నవనాగరిక మానవుడు జీవితంలో ఇంకా ఏదో వెలితీ ఉన్నట్లు లోలోన మథనపడుతున్నాడు. అవ్యక్తమైన శాంతి కోసం పరితపిస్తున్నాడు.

ఏదో పోగొట్టుకున్నవాడిలా బాధపడుతూ దాన్ని తిరిగి పొందడానికి ఎక్కడెక్కడో తిరుగుతున్నాడు, ఏదేదో చేస్తున్నాడు. అన్నీఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లు అనుభవించ డానికి భౌతికవస్తువులన్నీ ఉన్నా ఒక విధమైన అసంతృప్తికి లోనై లోలోన క్రుంగిపోతున్నాడు. ఏపుట్టలో ఏపాము ఉందోనని దారినపోయే ప్రతి దానయ్య చెప్పేమాటలు విని గుళ్ళు, చర్చీలు, దర్గాలు చుట్టివస్తున్నాడు. బాబాలు, స్వాములు ఇచ్చే తీర్థం, తాయెత్తులు కూడా స్వీకరిస్తున్నాడు. ఇవన్నీ కొంతకాలం కాస్తంత ఉపశమనం కలిగించినా ఆ తరువాత మళ్ళీ షరా మామూలే అన్నట్లు అశాంతి, అసంతృప్తులు అంతరంగాన్ని కలచివేస్తున్నాయి. నాలుగు రోడ్ల కూడలిలో నిలబడి అయోమయంగా చూస్తూ నిజమైన శాంతికి ఆమడ దూరంలో గానుగెద్దులా తిరుగుతున్నాడు.

భౌతికావసరాల సేకరణ కోసం చేస్తున్న జీవిత సమరంలో నిండా మునిగిపోయిన నేటి మానవునికి ప్రకృతి యదార్థాలను అవలోకించి జీవిత పరమార్థం అన్వేషించడానికి క్షణం కూడా తీరిక దొరకడం లేదు. ఇలాంటి మనిషికి శాంతి ఎలా లభిస్తుంది. శాంతికి, సత్యానికి మధ్య ఏదైనా అవినాభావ సంబంధం ఉందా అని ఆలోచించవలసిన అవసరం లేదా? అలాంటి సంబంధం ఉంటే ఆ సత్యం ఏమిటో, ఎక్కడ ఉంటుందో చిత్తశుద్ధి కలిగిన సత్యాన్వేషకులకు ఎప్పటికైనా లభించకపోదు.

రెండు బిందువుల్ని కలిపే అతి చిన్న రేఖ ఒక్క సరళరేఖ మాత్రమే కాగలుగుతుంది. మిగిలినవన్నీ వక్రరేఖలే. ఇది ఎవరూ నిరాకరించలేని నిత్యసత్యం (Eternal Truth). ఆ సరళరేఖనే ఇస్లాం శాంతిమార్గం అంటోంది. వ్యక్తుల్లో, సముదాయాల్లో, సమాజంలో శాంతిని స్థాపించడమే దాని లక్ష్యం. ఈ లక్ష్యసాధన కోసం అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) మక్కాలో 13 ఏండ్లపాటు శాంతి ఉద్యమం నడిపారు. కాని కలహభోజనుడైన షైతాన్ ఈ శాంతి ఉద్యమాన్ని ఎలా సహిస్తాడు?

వాడు దాన్ని అంతమొందించడానికి అశాంతి, అరాచకం, అల్లకల్లోలాను రేకెత్తించే తన శిష్యగణాన్ని రంగంలోకి దించాడు. దైవప్రవక్త (స)ను, ఆయన అనుచరుల్ని ఎన్నో కష్టాలకు గురిచేసి స్వస్థలం వదలి మదీనా వలసపోయేలా చేశాడు. మదీనా వలసపోయినా షైతాన్ వారిని వెంబడించడం మానలేదు. ఈసారి కత్తులు కటారులతో రంగంలోకి దిగాడు. సత్యాసత్యాలు, శాంతి-అశాంతుల మధ్య సమరం తీవ్రమయింది. శాంతిస్థాపన కోసం, సత్యపరిరక్షణ కోసం శాంతికాములకు కరవాలం చేతపట్టక తప్పలేదు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం ప్రతి యుగంలో అంతిమ సాధనంగా ఖడ్గం అనివార్యమయింది.



శాంతికాముల ఎదురుదాడికి వెనుకంజ వేసిన షైతాన్ ఖడ్గం ద్వారానే బలవంతంగా లోకంలో శాంతి (ఇస్లాం) వ్యాపించిందని దుష్ప్రచారం చేస్తూ ప్రపంచప్రజల్ని తనకు అనుకూలంగా కూడగట్టడానికి ఈనాడు విశ్వప్రయత్నం చేస్తున్నాడు. శాంతిస్థాపన సమర యోధుల్ని, చివరికి శాంతిస్థాపన గురించి మాట్లాడేవారిని సైతం ఉగ్రవాదులుగా చిత్రిస్తూ మారణాయుధాలతో సర్వత్రా అశాంతి, అరాచకాలు సృష్టిస్తున్నాడు. అయితే ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా శాంతి ఉద్యమం అనేకమందిని ఆకట్టుకుంటోంది. షైతాన్ సృష్టించిన అపోహలు, అపార్థాల కారుమేఘాలు మెల్లమెల్లగా విడిపోతూ శాంతి, సత్యాలు సత్యాన్వేషకుల ముందు ప్రస్ఫుటమవుతున్నాయి.

మీ చేతిలో ఉన్న ఈ పుస్తకంలోని శాంతి, సమరం అనే విషయాలు ఈ వాస్తవాలకే అద్దం పట్టుతున్నాయి. జనసమద్దరం ఉండే ఏ ప్రాంతంలోనూ శాంతి తనంతతాను స్థాపన కాదు. శాంతిని పాడుచేయడానికి అశాంతి, అసాంఘిక శక్తులు ఎల్లప్పుడూ కాచుకొని ఉంటాయి. స్వార్థపరుడి స్వార్థానికి, దౌర్జన్యపరుడి దౌర్జన్యాయాలకు ఒక హద్దంటూ ఉండదు. వారి స్వార్థం, దౌర్జన్యాయాలకు మసీదులు, మందిరాలు, చర్చీలు, మఠాలు కూడా సురక్షితంగా ఉండలేవు.

“దేవుడు ప్రజలను ఒకరిద్వారా మరొకరిని తుదముట్టించకపోతే, దేవుని పేరు అత్యధి కంగా స్మరించబడే మఠాలు, మందిరాలు, చర్చీలు, మసీదులు, (ఇతర) ఆరాధనాలయాలు ధ్వంసమయ్యే ప్రమాదముంటుంది. (కనుక) దేవుడు (తన ధర్మానికి) సహాయం చేసేవారిని తప్పక ఆదుకుంటాడు. దేవుడు ఎంతో బలాఢ్యుడు, సర్వశక్తిమంతుడు.” (ఖుర్ఆన్–22:40)

కనుక శాంతిని కాపాడుకోవడానికి అలాంటి అరాచక శక్తులతో పోరాడక తప్పదు. అరాచశక్తుల్ని అంతమొందించడానికి ప్రచారం, ప్రజాభిప్రాయం మలిచే పనులతో పాటు అవసరమైతే సాయుధపోరాటం కూడా జరపవలసి ఉంటుంది. ఇది ప్రాణం మీదికి వచ్చినప్పుడు మార్గాంతరం లేని పరిస్థితిలో శాంతికాముకులు చేపట్టవలసిన అంతిమ సాధనం, అనివార్యమైన పోరాటం. దైవప్రవక్త (స) ధర్మసంస్థాపన కోసం, శాంతి-న్యాయాల కోసం ప్రజాభిప్రాయాన్ని మలిచే పని తరువాత మార్గంతరంలేని పరిస్థితిలో దుష్టశక్తులతో సాయుధపోరాటం ఎలా జరిపారో, చివరికి దేశంలో శాంతి, న్యాయాలు ఎలా నెలకొల్పారో ఈ పుస్తకంలో వివరంగా పేర్కొనడం జరిగింది.

సమాజంలో శాంతి, సుస్థిరతలు నెలకొన్న తరువాత వివిధ వర్గాల ప్రజలకు న్యాయం చేకూర్చే, నేరస్థులకు తగిన శిక్షలు విధించే సరైన న్యాయవ్యవస్థ కూడా కావాలి. అంచేత ఈ పుస్తకంలో న్యాయం, నేరాలు, శిక్షలను గురించి కూడా వివరించబడింది. షైతాన్ దుష్ప్రచారజాలంలో ఇస్లాం ఖడ్గంద్వారా వ్యాపించిందనే విషయంతోపాటు, ఇస్లాం మానవ హక్కుల్ని కాలరాసే భయంకర శిక్షల్ని విధిస్తుందనే మాట కూడా చిక్కుకుంది. కనుక ఇందులోని నిజానిజాలేమిటో ఈ పుస్తకంలో సుదీర్ఘంగా చర్చించడం జరిగింది.

**హైదరాబాద్-2**
**తేది: 2-12-07**

అబుల్ ఇర్ఫాన్
రచయిత

కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

# శాంతి-సమరం-న్యాయం

రాత్రి తొమ్మిదిన్నర అయింది. నిన్న మొన్నటి రాత్రి కాదు. ఇది ఇరవై సంవత్సరాల నాటి రాత్రి సంగతి. నేను అప్పుడే భోజనం చేసి 'గీటురాయి' కోసం ఏదైనా వ్యాసం రాద్దామని డ్రాయింగ్ రూంలో కూర్చున్నాను. ఇంకా ఒక్క అక్షరం కూడా రాయలేదు, అంతలో "అస్సలాము అలైకుమ్" అనే పలుకులు విన్పించడంతో కలం టేబుల్ మీద పెట్టి "వఅలైకుముస్సలాం! రండి, రండి!! అంటూ మిత్రుల్ని లోపలికి ఆహ్వానించాను.

వారిద్దరు లోపలికి రాగానే నేను కూర్చోండి అంటూ నా ఎదురుగా ఉన్న కుర్చీలను చూపాను. వారు కూర్చున్నారు.

"ఏం డాక్టర్ గారూ! ఏమిటీ విశేషాలు? ఖులాసాయేనా?" అన్నా నేను ఆనవాయితీగా.

"అంతా దేవుని దయ. ఇతను నా డిపార్ట్‌మెంటల్ ఫ్రెండ్ రామారావు. సికిందరాబాద్ లో అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ (ఎ.ఎస్.ఎం.)గా పనిచేస్తున్నాడు" అన్నాడు నా నవముస్లిం మిత్రుడు డాక్టర్ ముంతాజ్ ముహమ్మద్ ఖాన్.

"నమస్కారమండీ!" అన్నారు ఎ.ఎస్.ఎం. రామారావు గారు.

నేను సమాధానంగా "నమస్తే" అని చెప్పి కరచాలనం కోసం చేయి ముందుకు జాపాను. కరచాలనం తరువాత "టీ, కాఫీ ఏమైనా తీసుకుంటారా?" అని అడిగాను.

"టీ, కాఫీలు తరువాత, ముందు ఇతని సంగతి వినండి" అన్నాడు డాక్టర్ ముంతాజ్.

"సరే చెప్పండి, ఏమిటీ వీరి సంగతి?"

"ఇతను గత ఆర్నెల్ల నుంచి ఒకవిధమైన అశాంతికి గురయి లోలోన బాధ పడుతున్నాడు. డాక్టర్లు పరీక్షించి ఏ జబ్బూ లేదని చెప్పారట. ఆ తరువాత ఇతను మనశ్శాంతి కోసం ఎందరో దేవుళ్ళను దర్శించుకున్నాడట. తిరుపతికి వెళ్ళొచ్చాడు, తీర్థ యాత్రలు జరిపాడు, పూజలు చేశాడు, మొక్కుబడులు చేసుకున్నాడు. అయినా ఇతడ్ని పట్టి పీడిస్తున్న అశాంతి కాస్తయినా వదల్లేదు. చివరికి ఓరోజు ఇతను మసీదులోకి వెళ్ళి నమాజ్ చేస్తున్నట్లు కలగన్నాడట. ఆ సంగతి ఇతని నోటే వినండి. చెప్పు రామారావ్! నువ్వు కలలో ఏం చూశావో వివరంగా చెప్పు" అన్నాడు డాక్టర్ ముంతాజ్ ఖాన్.

"చెప్పండి రామారావు గారూ! మీరు కలలో ఎలా నమాజ్ చేశారు?" అడిగాను.

"నేను కలలో రోడ్డు మీద నడచిపోతున్నాను. కొద్ది దూరం పోయిన తరువాత పక్కకు తిరిగి చూస్తే ఒక మసీదు కన్పించింది. లోపల జనం నమాజ్ చేస్తున్నారు. అప్పుడు నేను కూడా అప్రయత్నంగా లోపలికి వెళ్ళి నమాజు చేస్తున్నవారి పక్కన నిలబడ్డాను. అంతే, ఆ తరువాత ఏం జరిగిందో తెలియదు. కల చెదరిపోయింది, నేను మేల్కొన్నాను. ఆ రోజు నుంచి నేను ఇస్లాంను గురించి తెలుసుకోవాలని ఆలోచించడం



మొదలెట్టాను. ఆ సంగతి ఇతనికి చెబితే నన్ను మీ దగ్గరికి పిలుచుకు వచ్చాడు మీరు వివరంగా తెలియజేస్తారన్న ఉద్దేశ్యంతో" అన్నారు ఎ.ఎస్.ఎం. రామారావు గారు.

అప్పుడు నేను ఇస్లాంను గురించి అతనికి పరిచయం చేస్తూ "ఇస్లాం అంటేనే శాంతి" అని చెప్పాను.

"ఏమిటీ! ఇస్లాం అంటే శాంతి అని అర్థమా!! ఎలాగండీ?" అన్నారు రామారావు గారు ఆశ్చర్యపోతూ.

"ఔను, ఇస్లాం అనే పదం 'సలం' అనే ధాతువు నుండి పుట్టింది. సలం అంటే శాంతి, విధేయత, సమర్పణ అని అర్థాలున్నాయి. ఇస్లాంలో దేవునికి ఉన్న అనేక పేర్లలో 'సలాం' అనే పేరు కూడా ఒకటుంది. సలాం అంటే శాంతిమయుడు, శాంతి ప్రదాత అని అర్థం. మనిషి ఇస్లాం స్వీకరించడం ద్వారా తనను తాను ఆ దేవునికి పూర్తిగా సమర్పించుకొని శాంతి పొందుతాడు. అలాంటి వ్యక్తినే 'ముస్లిం' అంటారు. ముస్లిం అంటే దైవవిధేయుడు, దేవునికి సర్వం సమర్పించుకున్నవాడు, శాంతిగా ఉండేవాడు, శాంతిని కోరుకునేవాడు అని అర్థాలున్నాయి" అన్నాను నేను.

## 1. శాంతి ఎలా లభిస్తుంది?

"అయితే మాత్రం ఇస్లాం స్వీకరించినంత మాత్రాన శాంతి ఎలా లభిస్తుందంటారు?" అన్నారు రామారావు గారు కాస్తంత అనుమానంగా.

"మీరు దైవత్వాన్ని, దైవమార్గాన్ని విభజించి అనేక దేవుళ్ళను ఆశ్రయించి అనేక మార్గాలను అనుసరిస్తున్నారు. దీనికి భిన్నంగా ఇస్లాంలో దైవత్వం అనేది అవిభాజ్యమైన ఏకాంకం. ఇక్కడ దేవుడు ఒక్కడే, ఆయన నిర్దేశించిన రుజుమార్గం కూడా ఒక్కటే. మనిషి సకలసృష్టికర్త, విశ్వపాలకుడు, సర్వశక్తిమంతుడయిన ఏకేశ్వరుడ్ని దృఢంగా విశ్వసించి తన సర్వస్వాన్ని ఆ దేవునికి సమర్పించుకొని, జీవిత సమస్త రంగాల్లో ఆయన ఆదేశాలను మాత్రమే పాటిస్తున్నప్పుడు మరే శక్తికీ భయపడవలసిన అవసరమే ఉండదు. కష్టసుఖాలకు, లాభనష్టాలకు మూలకారకుడు ఆ ఒక్క దేవుడే అని విశ్వసించిన మనిషి ఇతర శక్తులకు ఎందుకు భయపడతాడు? వాటి దయాదాక్షిణ్యాలపై ఎందుకు ఆశలు పెట్టుకుంటాడు? ఈ భయం, ఆశలు సర్వశక్తిమంతుడయిన ఒకే శక్తికి అంకితం చేసినప్పుడు మనిషికి శాంతి దానంతటదే లభిస్తుంది....."

ఇలా సాగింది మా సంభాషణ. రామారావు అడిగిన ప్రశ్నలకు ఒక్కొక్కదానికి వివరంగా సమాధానాలు ఇస్తూపోయాను. చివరికి అతను నేను నచ్చజెప్పిన విషయాల పట్ల సంతృప్తి చెందినట్లు అన్పించింది నాకు. మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి వీలుగా నేనతనికి ఇస్లాంకు సంబంధించిన కొన్ని పుస్తకాలు కూడా ఇచ్చాను.

"ఇర్ఫాన్ గారూ! ఇస్లాంను గురించి మీరు నాకు చాలా విషయాలు తెలియజేశారు. నా అనుమానాలన్నీ తీరిపోయాయి. ఇక నేను వెళ్ళొస్తా" అంటూ రామారావు గారు లేచి నిలబడ్డారు. డాక్టర్ ముంతాజ్ ఖాన్ కూడా నేనూ వెళ్తాను" అంటూ లేచాడు. నేను వాళ్ళిద్దర్నీ గేటు దాకా వదలి వీడ్కోలు చెప్పి పంపివేశాను.

ఇదండీ రామారావు గారి అశాంతి గాథ. ఇలా మన సమాజంలో ఎంతమంది నిజమైన శాంతి కోసం లోలోన పరితపిస్తున్నారో! ఇంతకూ రామారావు గారు నేను చెప్పిన విషయాల్ని గురించి ఆచరణాత్మకంగా ఏ మేరకు స్పందించారో తెలియదు. దాదాపు వారం రోజుల తరువాత మా మిత్రుడు డాక్టర్ ముంతాజ్ ఖాన్ నన్ను కలుసుకోవడానికి వచ్చాడు. అప్పుడు రామారావు సంగతి అడిగితే మా మిత్రుడు తల అడ్డంగా తిప్పాడు.

“అతను ఇస్లాం స్వీకరించడానికి పూర్తిగా సిద్ధమయ్యాడు. కాని ఈ సంగతి విని అతని బంధువులు ‘నీ ఉద్యోగం ఊడిపోతుంది, నీకు ఆస్తిలో చిల్లిగవ్వ కూడా రాద’ని అతడ్ని బెదరగొట్టారు. దాంతో అతను భయపడి ఇస్లాం స్వీకరించే పని మానుకున్నాడు” అన్నాడు మా మిత్రుడు.

అప్పుడు నాకు ఖుర్‌ఆన్ లోని ఈ సూక్తి జ్ఞాపకం వచ్చింది:

“ముహమ్మద్ (సల్లం)! నీవు కోరినవాడికి సన్మార్గం చూపలేవు. దేవుడు మాత్రమే తాను కోరినవాడికి సన్మార్గం చూపగలడు. సన్మార్గం అవలంబించే వారెవరో ఆయనకు బాగా తెలుసు.” (ఖుర్‌ఆన్-28:56)

ఈ క్రింది ఖుర్‌ఆన్ సూక్తులు కూడా గమనార్హమైనవి:

“సూర్యుని సాక్షి! అతని ఎండ సాక్షి! అతని వెనుక వచ్చే చంద్రుని సాక్షి! సూర్యరశ్మితో ప్రకాశించే పగటిసాక్షి! దాన్ని కప్పివేసే రాత్రిసాక్షి! ఆకాశం సాక్షి! దాన్ని (కప్పుగా) నిలబెట్టినవాడి సాక్షి! భూమిసాక్షి! దాన్ని (తివాచిలా) పరచినవాడి సాక్షి! మానవాత్మ సాక్షి! దాన్ని తీర్చిదిద్ది, దానికి పాపపుణ్యాలను గురించి తెలిపినవాడి సాక్షి! నిస్సందేహంగా ఆత్మప్రక్షాళనం చేసుకున్నవాడు ధన్యుడు. అంతరాత్మను అణచి పెట్టినవాడు నాశనమవుతాడు.” (91:1-10)

“ముసురుకొస్తున్న రాత్రి సాక్షి! ప్రకాశిస్తున్న పగటి సాక్షి! ఆడ, మగ జాతులను సృష్టించిన వాడి సాక్షి! మీరు చేసే ప్రయత్నాలు విభిన్న రకాలుగా ఉన్నాయి. ధనాన్ని దానం చేసి, దైవభీతిపరుడయి, మంచిని సమర్థించేవాడికి మేము సులువైన మార్గాన నడిచేందుకు సౌలభ్యం కలగజేస్తాము. పిసినారితనం వహించి, (దేవుడ్ని) ఖాతరు చేయకుండా, మంచిని ధిక్కరించేవాడికి మేము కష్టతర మార్గాన నడిచేందుకు సౌలభ్యం కలగజేస్తాము. అతను చచ్చిన తరువాత అతని ధనం అతనికి ఏ విధంగానూ ఉపయోగపడదు.” (92:1-11)

“(మానవ జీవితానికి) మార్గం నిర్దేశించవలసిన బాధ్యత మాపైనే ఉంది. ఇహలోకం మాదే; పరలోకమూ మాదే. కనుక నేను మిమ్మల్ని ప్రజ్వరిల్లే అగ్ని గురించి హెచ్చరిస్తున్నాను. సత్యాన్ని నిరాకరించి ముఖం తిప్పుకునే దౌర్భాగ్యుడు తప్ప మరెవరూ అందులో పడిపోరు.” (92:12-17)

ఇహలోకం మానవులకు ఓ పరీక్షావేదిక లాంటిది అందువల్ల సత్యస్వీకరణ విషయంలో ఎలాంటి బలాత్కారానికి తావీయకుండా దేవుడు మానవుడికి మంచిచెడుల విచక్షణాజ్ఞానంతో పాటు ఆ రెండిటిలో కోరినదాన్ని అవలంబించే, ఆచరించే స్వేచ్ఛ కూడా ప్రసాదించాడు. పైగా మనిషి ఏమార్గంలో పయనిస్తూ ఏపని కోసం కృషిచేస్తాడో



ఆమార్గంలో ఆపని నెరవేర్చడానికి అతనికి సౌలభ్యాలు ప్రసాదిస్తాడు. ఇలా దుర్జనుడికి దుష్కార్యాలు చేయడం సులభం, సత్కార్యాలు చేయడం కష్టమవుతుంది. అలాగే సజ్జనుడికి సత్కార్యాలు చేయడం సులభం, దుష్కార్యాలు చేయడం కష్టమవుతుంది.

ఏకేశ్వరోపాసనా భావనతో పాటు సాధారణ నీతి కూడా మనిషి నైజంలోనే ఉంది. అదీ ఈసూక్తుల్లో పేర్కొన్న సులువైన మార్గం. దాన్ని ఇస్లాం దైవప్రవక్తల మార్గదర్శకత్వం ద్వారా మరింత మెరుగుపట్టి మానవునికి చూపిస్తుంది. దీనికిభిన్నంగా ప్రకృతికి విరుద్ధమైన ప్రతిమార్గమూ కఠినమైనదే. అది మానవుడికి ఇహలోకంలో ఎన్నో సమస్యలు, పరలోకంలో మరెన్నోయాతనలు తెచ్చిపెడ్తుంది. ఈ కారణంగానే దీన్ని ఖుర్‌ఆన్ కఠిన మార్గమని చెబుతోంది. అయితే కఠిన మార్గంలోనే నడవదలచినవారికి దేవుడు ఆ మార్గాన్ని సులభతరం చేస్తాడు. ఈ క్రింది ఖుర్‌ఆన్ సూక్తులు కూడా చూడండి:

“(మానవుడు గౌరవ ప్రతిష్ఠలకు సిరిసంపదలే కొలమానం అనుకుంటున్నాడు). ఎంత మాత్రం కాదు. మీరసలు అనాథను ఆదరించరు; పేదవాడికి పట్టెడన్నం పెట్టే విషయంలో ఒకర్నొకరు ప్రోత్సహించుకోరు. (బంధువుల బలహీనలతను ఆసరాగా చేసుకొని, వారికి దక్కవలసిన) వారసత్వపు ఆస్తినంతటినీ కాజేస్తున్నారు. మీరసలు ధనవ్యామోహం ఊబిలో పూర్తిగా కూరుకుపోయారు.” (89:17-20)

“(ఇన్ని అన్యాయాలు, అక్రమాలకు పాల్పడుతూ కూడా దేవునికి భయపడకుండా పరలోకం, తీర్పుదినం ఏదీ లేదని వాదిస్తున్నారు మీరు.) ఏమాత్రం కాదు. యావత్తు భూమి దంచి, పిండిపిండి చేయబడినప్పుడు నీ ప్రభువు పంక్తులుతీరిన దైవదూతలతో అవతరిస్తాడు. ఆరోజు నరకం దగ్గరకు తీసుకురాబడుతుంది. ఆరోజు మానవుడికి అసలు సంగతి అర్థమవుతుంది. కాని అప్పుడు అర్థమవడం వల్ల ప్రయోజనం ఏమిటీ?” (89:21-23)

“అప్పుడతను (తీవ్రంగా పశ్చాత్తాపపడుతూ) “అయ్యయ్యో! నేనీ (పరలోక) జీవితం కోసం ముందుగా ఏదయినా (సత్కార్యం) చేసి పంపుకొనివుంటే ఎంత బాగుండేది!” అని వాపోతాడు. ఆతర్వాత ఆరోజు దేవుడు శిక్షించేలా (కఠినంగా) మరెవరూ శిక్షించలేరు. దేవుడు బిగించి కట్టేలా (గట్టిగా) మరెవరూ బిగించి కట్టలేరు.” (89:24-26)

“మానవుడా! నీవు (జీవిత సత్యం గురించి ఆలోచించకుండా ఐహిక కార్యకలాపాల్లో) ఎంత నిమగ్నుడవయి ఉన్నా, నీ పయనం మాత్రం నీ ప్రభువు వైపుకే నిరాఘాటంగా సాగిపోతోంది. చివరికి ఆయన సన్నిధికే నీవు చేరుకోవలసి ఉంటుంది.” (84:6)

“కాలచక్రం సాక్షి! మానవుడు ఘోరంగా నష్టపోయాడు. అయితే సత్యాన్ని విశ్వసించి (తదనుగుణంగా) సత్కార్యాలు చేస్తూ, సత్యం, సహనాలను గురించి పరస్పరం ఉపదేశించుకునేవారు మటుకు ఏమాతం నష్టపోరు.” (103:1-3)

ఈ అధ్యాయంలో దేవుడు కాలం మీద ప్రమాణం చేయడానికి కారణం అది ఎన్నో యదార్థాల్ని లోకానికి అందజేస్తుంది. కాలం విలువను గుర్తించినవారే ఆ యదార్థాల నుండి గుణపాఠం నేర్చుకుంటారు. కాలం ఎవరి కోసమూ నిరీక్షించదు. అది తన కర్తవ్యనిర్వహణలో బిరబిరా సాగిపోతూనే ఉంటుంది.

కాలం కడు కర్కశమైనది. అది ఎవరినీ కనికరించదు. ఎందరో రాజులు, రాజ్యాధినేతలు కాలగర్భంలో కలసిపోయారు. దైవదాసులపై దుర్భర దౌర్జన్యకాండ జరిపిన దైవ ధిక్కారులు, తలబిరుసు నియంతలు కూడా కాలప్రవాహంలో పూచిక పుల్లల్లా కొట్టుకు పోయారు. చరిత్ర పుటల్లో చెదురు మదురు ప్రస్తావనలు తప్ప వారి అవశేషాలు కూడా నేడు ధరణిపై మిగల్లేదు. కాలం కరవాలం కన్నా ఎంతో కటువైనది. అది ఏ ఒక్కరినీ విడిచి పెట్టదు. ఎన్నో కాల్పనిక సిద్ధాంతాలు కాలవాహినికి ఎదురీదలేక నిజంలేని ఇజాలుగా మిగిలిపోయాయి. కడకు కమ్యూనిజం కూడా ఉక్కు తెరల వెనుక వికృత నాట్యం చేసి శాశ్వతంగా కన్నుమూసింది.

కాలచక్రం చెప్పే ఈ చారిత్రక వాస్తవాల నుండి గుణపాఠం నేర్చుకున్నవాడే ధన్యుడు. కాల ప్రవాహానికి తట్టుకొని నిలబడే నిజమైన ఇజం, పరలోక మోక్షం ప్రసాదించే సత్యధర్మం ఇస్లాం మాత్రమేనని ఈ అధ్యాయం అధ్యయనం చేసేవారికి సులభంగా అర్థమవుతుంది.

## 2. సంతృప్త హృదయానికే శాంతి ప్రాప్తం

శాంతికి, మనస్సుకు అవినాభావ సంబంధం ఉంది. శాంతి మనిషి మానసిక స్థితిపై ఆధారపడి ఉంటుంది. సంతృప్తి చెందిన మనస్సుకే శాంతి లభిస్తుంది. దైవప్రవక్త (స) ప్రియఅనుచరుడు హ్జరత్ అలి (రజి) శాంతిని గురించి ప్రస్తావిస్తూ "ఆత్మసంతృప్తి కలవాడే ప్రశాంత జీవితం గడుపుతాడ"ని అన్నారు. మనిషి తనను తాను సర్వశక్తిమంతుడయిన దేవునికి సమర్పించుకొని జీవిత సకలరంగాల్లో ఆయన ఆదేశాలను శిరసావహిస్తున్నవాడే నిజమైన ఆత్మసంతృప్తి పొందుతాడు. అలాంటి మనిషిని ఉద్దేశించి దేవుడు ఖుర్‌ఆన్‌లో ఇలా  పేర్కొంటున్నాడు:

"(ఇక సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నుడయిన మనిషిని ఉద్దేశించి) "తృప్తి చెందిన మనసా! పద నీ ప్రభువు సన్నిధికి. నీవు ఆయన పట్ల సంతోషించావు, ఆయన నీ పట్ల ప్రసన్నుడయ్యాడు. (ఇక) నా పుణ్యదాసులలో చేరి నా స్వర్గంలో ప్రవేశించు" అని చెప్పడం జరుగుతుంది." (ఖుర్‌ఆన్-89:27-30)

మానవ అంతరంగం బహు విచిత్రమైనది. అది ఓ పట్టాన మనకు లొంగదు. అనుక్షణం అది తన పరిధిని దాటిపోవడానికి పరిపరి విధాల ప్రయత్నిస్తుంది. ఎవరైనా సన్మార్గంలో నడుస్తూ సత్కార్యాలు చేస్తున్నాడంటే, అతను తన అంతరంగాన్ని దాని సహజ పరిధిలో బంధించాడన్న మాట. నిజానికి అంతరంగంపై అదుపు సాధించడం గొప్ప (ఘన)కార్యమే. అంతరంగంపై అదుపు సాధించలేనివాడ్ని మనం సాధారణంగా చపల చిత్తుడు లేక చంచల స్వభావుడని అంటాం. మనిషి ప్రవర్తన రీత్యా ఖుర్‌ఆన్ ఈ అంతరంగాన్ని మూడు విధాలుగా విభజించింది.

ఖుర్‌ఆన్ పరిభాషలో మొదటిరకం అంతరంగాన్ని "నఫ్సుల్‌అమ్మారా" అంటారు. స్వభావం రీత్యా దీన్ని "దుష్టమనస్సు" లేక దుష్టబుద్ధి అని చెప్పవచ్చు. కోరలు చాచి బుసలు కొడ్తూ మీదికి వచ్చే భయంకర విషసర్పాన్ని చంపడం కన్నా దుష్ట మనస్సుని



చంపడమే గొప్ప కార్యమన్నాడు ఓ కవి. దీన్నిబట్టి ఈ రకమైన అంతరంగం మనిషికి ఎంత ప్రమాదకరమైనదో ఊహించవచ్చు. ఇది మానవుడ్ని రకరకాల చెడుల వైపు ఉసి గొల్పుతుంది. భయాందోళనలు కలిగించి సత్కార్యాల నుండి బయటికి లాగుతుంది. వివిధ భ్రమలు కల్పించి దుష్కార్యాల ఊబిలోకి నెట్టివేస్తుంది. రకరకాల ప్రలోభాలు చూపి, చివరికి మనిషిని నట్టేట ముంచుతుంది. నఫ్సుల్‌అమ్మారా (దుష్ట మనస్సు) గురించి ఖుర్‌ఆన్‌లో ఒకచోట ఇలా ఉంది:

"నేను నా ఆత్మశుద్ధిని గురించి గొప్పలు చెప్పుకోవడం లేదు. నా ప్రభువు కారుణ్య భాగ్యం లభిస్తే తప్ప (దుష్ట)మనస్సు ఎల్లప్పుడూ చెడు వైపుకే పురిగొల్పుతూ ఉంటుంది. నా ప్రభువు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు." (12:53)

రెండవ రకం అంతరంగాన్ని "నఫ్సుల్లవ్వామా" అంటారు. ఇది చేసే పనిని బట్టి దీన్ని "అంతరాత్మ" అని పేర్కొనవచ్చు. "అంతరాత్మ ప్రబోధన" అనే మాట అందరికీ సుపరిచితమే. చెడ్డపనులకు పాల్పడినప్పుడల్లా అంతరాత్మ మనల్ని నిందిస్తుంది, ఆక్షేపిస్తుంది, అభ్యంతరం చెబుతుంది. "ఆ పని చేస్తే నువ్వు నాశనమవుతావు, పట్టుబడి పోతావు" అని హెచ్చరిస్తుంది.

అంతరాత్మ సజీవంగా ఉంటే మనిషి ఎలాంటి చెడు వైపు ఆకర్షించబడలేడు. ఒకవేళ ఎప్పుడైనా ఆకర్షించబడినా అంతరాత్మ హెచ్చరిస్తూ, నిందిస్తూ అతడ్ని ప్రశాంతంగా ఉండనివ్వదు. ఈవిధంగా అంతరాత్మ మనల్ని చెడుపనుల జోలికి పోనివ్వకుండా అడుగడుగునా అడ్డు తగుల్తుంది. అంతరాత్మ ప్రబోధాన్ని ఆలకించేవారు ఇహలోకంలోనే కాదు, పరలోకంలోనూ విజయ శిఖరాలు అధిరోహించగలుగుతారు.

అంతరాత్మ ప్రబోధాన్ని ఖాతరు చేయకుండా దాన్ని అణచడానికి ప్రయత్నిస్తే మటుకు మనం దారితప్పి చీకటి అగాధాల్లోకి పడిపోయినట్లేనని గ్రహించాలి. ఎల్లప్పుడూ మన శ్రేయస్సు కోరుతూ మనకు రక్షకభటునిగా, బాడీగార్డ్‌గా పనిచేసే ఈ అంతరాత్మ (నఫ్సుల్లవ్వామా)ను అణచివేయడమంటే మన బాడీగార్డ్‌ని మనమే చేజేతులా చంపుకున్నట్లవుతుంది. బాడీగార్డ్ పోయాక మన పరిస్థితి ఏమవుతుందో తెలిసిందే. అడుగడుగునా ప్రమాదాలే ఎదురవుతాయి. ఈ అంతరాత్మను గురించే దేవుడు ఖుర్‌ఆన్‌లో ఇలా అంటున్నాడు:

"నేను ప్రళయం సాక్షిగా చెబుతున్నాను. (మీరనుకునేది ఎంతమాత్రం నిజం) కాదు. నేను తనను తాను నిందించుకునే ఆత్మసాక్షిగా చెబుతున్నాను..." (75:1-4)

పై సూక్తులలో విశ్వప్రభువు సత్యతిరస్కారుల కుశంకలను ఖండిస్తూ ప్రళయదినం తప్పక వస్తుందని, ఆరోజు మానవులంతా మళ్ళీ బ్రతికించబడతారని, వారినుంచి కర్మల లెక్క తీసుకోడం జరుగుతుందని ప్రళయదినం మీద, అంతరాత్మ మీద ప్రమాణం చేసి మరీ హెచ్చరిస్తున్నాడు.

నఫ్సుల్లవ్వామా (అంతరాత్మ)ను గురించి దైవప్రవక్త (సల్లం) వ్యాఖ్యానిస్తూ "ఏ విషయమైతే మీ హృదయంలో ఆక్షేపణ జనింపజేస్తుందో అదే చెడు" అన్నారు. అంటే

మనం చేస్తున్నది తప్పుడు పనని మన అంతరాత్మ ఆక్షేపిస్తుంది. ఈ అనుభూతే మనిషిని చెడు విషయాలకు దూరంగా ఉంచుతుంది. అంతరాత్మను గురించి దైవప్రవక్త (సల్లం) మరింత వివరంగా ఇలా తెలియజేశారు:

"జాగ్రత్తగా వినండి! మన దేహంలో ఒక మాంసపు ముద్ద ఉంది. అది మంచి స్థితిలో ఉంటే మొత్తం దేహం మంచి స్థితిలో ఉంటుంది. ఒకవేళ అది చెడిపోతే మొత్తం దేహమే చెడి పోతుంది. (అనారోగ్యం పాలవుతుంది). అదే హృదయం."

హృదయం నైతికంగా, ఆధ్యాత్మికంగా మంచిస్థితిలో ఉన్నప్పుడు నఫ్సుల్లవ్వామా (అంతరాత్మ) అనబడుతుంది. మనిషిని చెడు నుంచి నిరోధించే, మంచి వైపుకు ప్రేరేపించే "నఫ్సుల్లవ్వామా" అతని విశ్వాసాలు, ఆచరణలు, నీతినడవడికలపై "సెక్యూరిటీ గార్డ్"గా పని చేస్తుంది. శరీరంలోని ఈ సెక్యూరిటీగార్డ్ అనారోగ్యం పాలయి బలహీనమైపోయే కొద్దీ మనిషి "నఫ్సుల్ అమ్మారా" (దుష్ట మనస్సు)కు చేరువవుతూ చెడ్డ పనులు చేయడం ప్రారంభిస్తాడు. దీనికి భిన్నంగా మనిషి నఫ్సుల్లవ్వామా (అంతరాత్మ) ప్రబోధం విని తదనుగుణంగా నడచుకున్నట్లయితే క్రమేణా అతడు మూడవరకం అంతరంగమైన "నఫ్సుల్ ముత్మయిన్న" (సంతృప్త హృదయం)కు దగ్గరవుతాడు.

ఈ కోవకు చెందిన అంతరంగం గురించే ఈసూక్తి (89:27-30)లో ప్రస్తావించబడింది. ప్రఖ్యాత వ్యాఖ్యాన సహిత ఖుర్ఆన్ అనువాద గ్రంథమైన 'రూహుల్ బయాన్'లో వ్యాఖ్యానకర్త నఫ్సుల్ ముత్మయిన్న (సంతృప్త హృదయం) గురించి వివరిస్తూ "నఫ్సుల్ ముత్మయిన్న అంటే ఎలాంటి చెడు విషయాలులేని పరిశుద్ధమైన, అత్యున్నత సుగుణ సంపత్తితో కూడిన జ్యోతిర్మయ హృదయం అన్నమాట" అన్నారు.

"ఆయన తన వైపు మరలేవారికి మాత్రమే తన వైపుకొచ్చే మార్గం చూపిస్తాడు. అలాంటి వారే (ఈ ప్రవక్త అందజేసిన) సందేశాన్ని విశ్వసిస్తారు. దైవస్మరణతో వారి హృదయాలకు శాంతీ, సంతృప్తులు ప్రాప్తమవుతాయి. గుర్తుంచుకోండి! దైవస్మరణ వల్లనే మానవులకు మనశ్శాంతి లభిస్తుంది. దైవసందేశం స్వీకరించి సదాచార సంపన్నులైనవారు నిజంగా ఎంతో అదృష్టవంతులు. వారికి (పరలోకంలో) ఎంతో శ్రేష్ఠమైన ప్రతిఫలం లభిస్తుంది." (ఖుర్ఆన్-13:27-29)

భౌతికావసరాలు నెరవేరితే చాలు, ఇక ఏ సమస్యా ఉండదంటారు పదార్థ పూజారులు. ఈ విషయం కొంతవరకు నిజమే కాని, ఇదే అన్నిటికీ మూలమంత్రం కాజాలదు. సకల విధాల భోగభాగ్యాలతో తులతూగుతున్న పాశ్చాత్య దేశాల్లో ఎందరో ప్రజలు మనశ్శాంతి లభించక జీవితం పైనే విరక్తి చెందుతున్నారు. లక్షలు ఖర్చుపెట్టినా పొందలేని ఈ మనశ్శాంతి దేవుని స్మరణ ద్వారా మాత్రమే ప్రాప్తమవుతుందని పై సూక్తులలో ఖుర్ఆన్ చెబుతోంది. ఇక్కడ దేవుని స్మరణ అంటే ఓచోట తిష్ఠవేసి కళ్ళు మూసుకొని దైవనామం జపించడం కాదు. మనిషి తనను తాను పూర్తిగా దేవునికి సమర్పించుకొని జీవిత సమస్త రంగాల్లో ఆయన ఆజ్ఞలు, హితవులు పాటించాలి. అప్పుడే అతనికి నిజమైన మనశ్శాంతి, హృదయ సంతృప్తి లభిస్తాయి.



# 3. శాంతికి అసలైన 'సోర్స్'

శాంతికి అసలైన 'సోర్స్' (Source) సర్వశక్తిమంతుడయిన ఏకేశ్వరుడే. ఆయన అణువణువుపై అదుపు, అధికారం కలిగివున్న సర్వశక్తిమంతుడు; తాను కోరుకున్న ప్రతి వస్తువునూ శూన్యం నుండి సృష్టించగల సర్వసృష్టికర్త. ఆయనకు తన దైవత్వంలో, గుణగణాల్లో, శక్తిసామర్థ్యాల్లో మరెవరూ సాటి లేరు. ఆ దేవుని దైవత్వం అవిభాజ్యమైనది, సమగ్రమైనది. ఆయన ఏదైనా చేయదలచుకుంటే 'అయిపో' అంటే చాలు, అది ఇట్టే జరిగి తృటిలో ఉనికిలోకి వస్తుంది. ఇలాంటి దైవత్వం, ఇంతటి శక్తిసామర్థ్యాలు బహు దైవారాధకులు పూజించే ఏ ఒక్క దైవంలోనైనా ఉన్నాయా?

"ముహమ్మద్ (సల్లం)! ఇలా చెప్పు: 'సకల విధాల ప్రశంసలు దేవునికే శోభిస్తాయి. ఆయన ఎన్నుకున్న దైవదాసులకు శాంతి కలుగుగాక!' (నిజ దేవుడైన) అల్లాహ్ శ్రేష్ఠుడా లేక వీరాయనకు సాటికల్పించిన మిథ్యాదైవాలు శ్రేష్ఠమైనవా? సరే, భూమ్యాకాశాల్ని సృష్టించిన శక్తిస్వరూపుడెవరు? మీకోసం ఆకాశం నుండి వర్షం కురిపించి, తద్వారా మీకు సాధ్యంకాని మనోహరమైన తోటలను పండిస్తున్నదెవరు? ఆ దేవుడేగాక (ఈ పనులలో ఆయనకు సహాయపడేందుకు) మరొక దేవుడెవరైనా ఉన్నాడా? (లేదు.) కాని వీరే సన్మార్గం వదలి (దుర్మార్గంలో పడి)పోతున్నారు." (ఖుర్ఆన్-27:59,60)

"భూమిని నివాసయోగ్యంగా చేసిందెవరు? అందులో నదుల్ని పారజేసి, (కొండల) మేకుల్ని పాతిందెవరు? రెండు జలనిధుల మధ్య అడ్డంకిని పెట్టిందెవరు? అల్లాహ్‌తో పాటు మరోదైవం ఉన్నాడా? లేదు. అసలు వారిలో చాలామంది అజ్ఞానులే ఉన్నారు." (27:61)

"కష్టాలలో ఉన్నవాడు మొరపెట్టుకుంటున్నప్పుడు అతని మొర ఆలకించేదెవరు? చివరికి అతని కష్టాలు కడతేర్చుతుందెవరు? భూలోకంలో మిమ్మల్ని ప్రతినిధిగా చేసిందెవరు? అల్లాహ్‌తోపాటు మరో దైవం కూడా ఉన్నాడా (ఈ పనులు చేయడానికి)? మీరసలు (ఈ విషయాల్ని గురించి) చాలా తక్కువగా యోచిస్తారు." (ఖుర్ఆన్-27:62)

"నేలమీద, సముద్రం మీద కటిక చీకటిలో (సైతం) మీకు దారి చూపిస్తున్నదెవరు? ఎవరు తన కారుణ్యానికి (అంటే వర్షానికి) ముందుగా శుభవార్త తెచ్చే (చల్లటి) గాలులను పంపిస్తున్నది? అల్లాహ్‌తో పాటు మరోదైవం కూడా ఉన్నాడా (ఈ పనులు చేయడానికి)? వీరు చేస్తున్న సృష్టిపూజకు అల్లాహ్ ఎంతో అతీతుడు, మహోన్నతుడు." (27:63)

"ప్రాణులను తొలిసారిగా సృజిస్తున్నది, తర్వాత వాటిని పునరుత్పత్తి చేస్తున్నదెవరు? భూమ్యాకాశాల నుండి మీకు ఉపాధి ప్రసాదిస్తున్నదెవరు? అల్లాహ్‌తో పాటు మరో దైవం కూడా ఉన్నాడా (ఈ పనులు చేయగలిగేవాడు)? వారిని అడుగు 'మీ అభిప్రాయం నిజమైతే వీటికి (తగిన) ఆధారాలేమిటో చూపండి" అని. (ఖుర్ఆన్-27:64)

"మానవులారా! మీకు దేవుడు చేసిన మహోపకారాలు జ్ఞాపకం చేసుకోండి. దేవుడు తప్ప మీకు భూమ్యాకాశాల నుండి ఉపాధినిచ్చే మరో సృష్టికర్త ఉన్నాడా? (లేదు) ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. అలాంటప్పుడు మీరు ఎలా మోసపోతున్నారు?" (35:3)

"మేము స్వయంగా మిమ్మల్ని సృష్టించామే, మరి మీరెందుకు (మా మాటల్ని) అంగీక

రించరు? మీరు వదిలే రేతస్సును గురించి ఎప్పుడైనా కాస్త ప్రశాంతంగా ఆలోచించారా? దాని ద్వారా శిశువుని రూపొందిస్తున్నది మీరా లేక మేమా? మేము మీకోసం మరణం నిర్ణయించాం. మేము మీ రూపురేఖల్ని మార్చి మీరెరుగని ఆకారంలో మిమ్మల్ని తిరిగి సృజించలేని అశక్తులం కాము. (మేము తలచుకుంటే ఏదైనా చేయగలం.)" (56:57-61)

"మీకు మీ తొలిపుట్టుక గురించి తెలిసేవుంది. (ఈ విషయంలో మా శక్తిసామర్థ్యాల్ని మీరు అనుదినం చూస్తూనే ఉన్నారు.) అలాంటప్పుడు (మరణానంతరం కర్మవిచారణ కోసం మిమ్మల్ని పునర్జీవింపజేస్తామన్న మా మాటల్ని) మీరెందుకు గ్రహించరు?" (56:62)

"మీరు పొలాల్లో నాటే విత్తనాలను గురించి ఆలోచించారా? ఆ విత్తనాల ద్వారా పంటలు మీరు పండిస్తున్నారా లేక మేమా? మేము తలచుకుంటే ఆ పంటపొలాల్ని నుగ్గు నుగ్గు చేసేయగలం. అప్పుడు మీరు విచారపడుతూ "అయ్యయ్యో! మా శ్రమ, పెట్టుబడి అంతా వృథా అయ్యిందే! అసలు మా నొసటే దౌర్భాగ్యం రాసి ఉంది" అని రకరకాలుగా చెప్పుకుంటారు. సరే, మీరు త్రాగే ఈ నీటిని కళ్ళుతెరచి చూశారా? దాన్ని మేఘాల నుండి మీరు కురిపిస్తున్నారా లేక మేమా? మేము తలచుకుంటే దాన్ని తీవ్రమైన ఉప్పునీటిగా మార్చేయగలం. మరి మీరు (మాపట్ల) ఎందుకు కృతజ్ఞులై ఉండరు?" (56:63-70)

"పోనీ, మీరు మండించే ఈ నిప్పును గురించి ఎప్పుడైనా కాస్త ఆలోచించారా? దానికి ఉపయోగపడుతున్న చెట్లను మీరు సృష్టించారా లేక మేమా? మేము దాన్ని స్మారక చిహ్నంగా, వినియోగదారులకు జీవనసామగ్రిగా చేశాము." (ఖుర్ఆన్-56:71-73)

మానవుడు ఈ ప్రపంచంలోని అనేక వస్తువుల్ని వాడుకుంటూ ఎంతో ప్రయోజనం పొందుతున్నాడు. కాని ఆ వస్తువుల్ని సృష్టించి వాటివల్ల తనకు మేలు చేకూర్చుతున్న అదృశ్యశక్తిని గురించి అతను ఆలోచించడం లేదు. పైగా ఆ అదృశ్యశక్తి దైవత్వాన్ని, ఆయన గుణగణాలను విభజించి సృష్టికర్త, మృత్యుదేవత, పంటల దేవత, వరుణ దేవుడు, అగ్ని దేవుడు అంటూ రకరకాల పేర్లు పెట్టి వాటి ఊహాజనిత చిత్రాలను, విగ్రహాలను పూజిస్తున్నాడు. అయితే ప్రకృతిలోని ఈ చిత్రవిచిత్ర వస్తువులు, వాటి ప్రయోజకత్వం, వాటి మధ్య సమన్వయం, నిబద్ధతలను గురించి ప్రశాంత మనస్సుతో ఆలోచిస్తే వీటన్నిటికి మూలకారకుడు ఒకే దేవుడని గ్రహించగలం. ఆ దేవుడ్ని మాత్రమే ఆరాధించడం, ఆయన చూపే జీవనపథాన్నే అనుసరించడం మానవుని విధ్యుక్తధర్మం. ఖుర్ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు గమనించండి:

"ప్రవక్తా! వారినిలా అడుగు: 'దేవుడ్ని వదలి మీరు ప్రార్థిస్తున్న శక్తులేమిటో ఎప్పుడైనా మీరు కళ్ళు తెరచి చూశారా? అవి లోకంలో ఏం సృష్టించాయో కాస్త నాకు చూపించండి. పోనీ ఆకాశ నిర్మాణంలో వాటి పాత్ర ఏమిటో చెప్పండి. మీ అభిప్రాయం నిజమయితే దీనికి పూర్వం (మీ నమ్మకాలకు రుజువుగా) వచ్చిన గ్రంథంగాని, లేదా ఏదైనా (దైవిక)జ్ఞానంలోని కొన్ని అంశాలుగాని మీ దగ్గరుంటే తీసుకురండి." (46:4)

"దేవుడ్ని వదలి ప్రళయందాకా తమ ప్రార్థనలకు స్పందించని మిథ్యాదైవాలను మొరపెట్టుకునేవాడి కంటే మించిన మార్గభ్రష్టుడు మరెవరుంటారు? పైగా మొరపెట్టుకునే



వారు తమను మొరపెట్టుకుంటున్నారన్న సంగతి కూడా ఆ మిథ్యాదైవాలకు తెలియదే! అంతేకాదు, మానవులంతా సమావేశపరచబడే (ప్రళయ)దినాన వారు తమను ప్రార్థించిన వారికి శత్రువులయిపోతారు; వారి పూజాపురస్కారాలను తిరస్కరిస్తారు." (46:5,6)

"బహుదైవారాధన గురించి దేవుడు మీకెలాంటి ప్రమాణం పంపకపోయినా, మీరు ఆయన దైవత్వంలో ఇతరుల్ని భాగస్వాములు చేశారు. అలాంటి పని చేసి కూడా మీరు దేవునికి భయపడనప్పుడు, మీ కల్పిత మిథ్యాదైవాలకు నేనెందుకు భయపడాలి? మన ఉభయుల్లో నిర్భయం, నిశ్చింతలకు ఎవరెక్కువ అర్హులో మీరే చెప్పండి తెలిస్తే. సత్యాన్ని విశ్వసించి, అందులో బహుదైవారాధనా భావానికి ఏమాత్రం ఆస్కారమివ్వనివారికే శాంతీ స్థిమితాలు ప్రాప్తమవుతాయి. అలాంటివారే సన్మార్గంలో ఉంటారు." (6:81,82)

"తాను తప్ప మరో ఆరాధ్యుడు లేనివాడే అల్లాహ్. ఆయన గోచర అగోచర విషయాలన్నీ ఎరిగినవాడు, అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు. తాను తప్ప మరో ఆరాధ్యుడు లేనివాడే అల్లాహ్. ఆయన రాజాధిరాజు. పరమ పవిత్రుడు, శాంతిమయుడు, శరణునిచ్చేవాడు, సంరక్షకుడు, పర్యవేక్షకుడు, సర్వాధికుడు, సర్వోన్నతుడు, చండశాసనుడు. ప్రజలు చేస్తున్న బహుదైవారాధనకు అల్లాహ్ ఎంతో అతీతుడు, పరిశుద్ధుడు." (59:22,23)

"ఆకాశం దద్దరిల్లి బీటలువారినప్పుడు, తారలు చెదరి కాంతికోల్పోయినప్పుడు, సముద్రాలు పొంగి పొరలినప్పుడు, సమాధులు పూర్తిగా తెరవబడినప్పుడు- ఆ...అప్పుడు ప్రతి మనిషికీ తాను ముందు పంపుకున్నది, వెనుక వదలిపెట్టినది అంతా తెలిసిపోతుంది." (ఖుర్ఆన్-82:1-5)

"మానవుడా! దయామయుడైన నీ ప్రభువుని గురించి నిన్నేవిషయం మోసంలో పడవేసింది? ఆయన నిన్ను పుట్టించి, నీ అవయవాలను పొందికగా అమర్చాడు. నిన్ను తగిన విధంగా రూపొందించాడు. తాను తలచిన రీతిలో నిన్ను (అందంగా) మలిచాడు. కాదు, మీరు (పరలోక) తీర్పు విషయాన్ని నిరాకరిస్తున్నారు. కాని మీపై పర్యవేక్షకులు(గా దైవ దూతలు) నియమించబడ్డారు (అన్న విషయాన్ని మరచిపోతున్నారు). వారెంతో గౌరవనీయులైన లేఖకులు. మీరు చేసే ప్రతిపనీ, పలికే ప్రతిపలుకూ వారికి తెలుసు. (82:6-12)

(ఆరోజు) సజ్జనులు సుఖసంతోషాలలో ఓలలాడుతుంటారు. దుర్జనులు నరకానికి పోతారు. విచారణ దినాన వారందులో ప్రవేశిస్తారు. వారిక నరకం నుండి ఎట్టి పరిస్థితిలోనూ బయటపడలేరు. విచారణ దినమంటే నీకేం తెలుసు? ఔను, విచారణ దినమంటే నీకేం తెలుసు? ఆరోజు ఏ ఒక్కడూ తోటి మనిషికి ఎలాంటి సహాయం చేయలేడు. ఆరోజు నిర్ణయాధికారం పూర్తిగా దేవుని చేతిలో ఉంటుంది. (82:13-19)

"అంజూరం, ఆలివ్ (వృక్షా)ల సాక్షి! సీనాయ్ పర్వతాల సాక్షి! ఈ శాంతినగరం (మక్కా) సాక్షి! మేము మానవుడ్ని ఎంతో ఉత్కృష్ట జీవిగా సృజించాము. తరువాత మేమతడ్ని (సత్య నిరాకరణ వల్ల) వెనక్కి తిప్పి అతి నికృష్ట జీవిగా మార్చివేశాము. అయితే సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులయిన వారిని ఈ నికృష్టత్వం నుండి తప్పించాము. ఇలాంటి వారి కోసం మేము ఎన్నటికీ అంతంకాని గొప్ప సుకృతఫలం సిద్ధపరచి ఉంచాము." (ఖుర్ఆన్-95:1-6)

"కనుక (మానవుడా!) అలాంటప్పుడు నీవు పరలోక విచారణ గురించిన సత్యాన్ని ఎలా నిరాకరిస్తావు? దేవుడు అందరికంటే గొప్ప (న్యాయా)అధికారి కాదా?" (95:7,8)

యావత్తు సృష్టిరాసుల్లో మహోత్కృష్ట జీవులుగా సృజించబడిన మానవులు పెద్ద వారైన తర్వాత రెండువర్గాలుగా విడిపోతున్నారు. ఒక వర్గం సత్యాన్ని నిరాకరించి, నీతి రాహిత్యమనే చీకటికూపంలో పడిపోతుంది. మరోవర్గం సత్యాన్ని స్వీకరించి తదనుగుణంగా సాత్వికజీవితం గడుపుతూ పుట్టుకతో వచ్చిన ఉత్కృష్టతను సార్థకం చేస్తోంది.

మొదటి వర్గానికి చెందిన ఒక వ్యక్తి వందలాది మంది అమాయకుల్ని హతమార్చి, వేలాది ఇండ్లను దోచుకున్న పరమ దుర్మార్గుడయి ఉంటాడు. రెండో వర్గానికి చెందిన మరొక వ్యక్తి వందలాదిమంది జీవితాలను బాగుపరచి వేలాది కుటుంబాల కష్టాలను కడతేర్చిన సజ్జనుడయి ఉంటాడు. వీరిద్దరినీ దేవుడు ఒకే దృష్టితో చూస్తాడా? ఆ దుర్మార్గుడికి అతని దుష్కార్యాలకు తగిన శిక్ష, ఆ సజ్జనుడికి అతని సత్కార్యాలకు తగిన ప్రతిఫలం లభించాలని; క్షుణ్ణంగా విచారణ జరిపించి పూర్తి న్యాయం చేకూర్చాలని మానవ అంతరంగం అభిలషించదా? ఈ యదార్థం అంగీకరించిన మానవుడు పరలోకంలో కర్మలవిచారణ జరుగుతుందన్న దైవవచనాన్ని ఎలా నిరాకరించగలడు అని ఇక్కడ ఖుర్‌ఆన్ ప్రశ్నిస్తోంది.

ఒక సజ్జనుడు చేసిన అనేక సత్కార్యాలకు తగిన పారితోషికం లభించడం ఇహలోకంలో సాధ్యంకాదు. అలాగే ఒక దుర్మార్గుడు చేసిన అనేక నేరాలకు తగిన శిక్ష విధించిన తరువాత దాన్ని అమలుపరచడం కూడా ఇహలోకంలో సాధ్యంకాదు. "దక్షిణాఫ్రికాకు చెందిన మౌజెస్ సిట్‌హోల్ అనే నేరగాడు 38 హత్యలు, 40 మానభంగాలు, 6 దోపిడీలు చేశాడు. 1997లో న్యాయస్థానం అతనికి 2,410 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది." (ఈనాడు దినపత్రిక: 17-10-1999).

ఇంతటి సుదీర్ఘ శిక్షను అమలుపరచడం ఇహలోకంలో అసంభవమని తెలుస్తూనే ఉంది. అది పరలోకంలోనే సాధ్యమవుతుంది. దీన్నిబట్టి మానవుని జీవితం మరణంతో పూర్తిగా సమాప్తం కాదని, అతని కర్మలకు తగినశిక్ష లేక ప్రతిఫలం అనుభవించడానికి మరణానంతరం శాశ్వతంగా ఉండే మరోజీవితం ఉంటుందని, ఉండాలని మానవ అంతరంగం సహజంగానే ఘోషిస్తుంది. ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

"దుష్కార్యాలకు పాల్పడుతున్నవారు తమను, సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేస్తున్నవారిని మేము ఒకేగాటన కట్టివేస్తామని భావిస్తున్నారా? వారుభయుల చావుబ్రతుకులు (వాటి పర్యవసానాలు) ఒకటే అవుతాయనుకుంటున్నారా? చాలా తప్పుడు ఆలోచన వారిది. ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రతి మనిషికీ అతని సంపాదనకు తగిన ప్రతిఫలం ఇవ్వడానికి దేవుడు భూమ్యాకాశాల్ని సత్యం ప్రాతిపదికపై సృష్టించాడు." (45:21,22)

## 4. యావత్తు సృష్టి ధర్మం ఇస్లామే

ఇస్లాం అంటే శాంతి, సమర్పణ అని మనం గత పేజీలలో తెలుసుకున్నాం. ఇందులో విధేయతాభావం కూడా ఉంది. ఒక్క మానవుడు తప్ప యావత్తు విశ్వవ్యవస్థ, విశ్వవ్యవస్థలోని సమస్త సృష్టిరాసులు సృష్టికర్తకే విధేయలైపోయి ఆయన్ని మాత్రమే ఆరాధిస్తున్నాయి. అంటే వాటన్నిటి ధర్మం ఇస్లామే అన్నమాట. ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు చూడండి:



"భూమ్యాకాశాల్లోని అణువణువూ అల్లాహ్ ఔన్నత్యాన్ని, ఆయన పవిత్రతను ప్రశంసిస్తోంది. ఆయన మహా శక్తిమంతుడు, అసామాన్య వివేకవంతుడు. ఆయనే భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అధినేత. జీవన్మరణాలు ఆయన చేతిలోనే ఉన్నాయి. ఆయన ప్రతి పనీ చేయగల సమర్థుడు, సర్వ శక్తిమంతుడు. ఆయనే మొదటివాడు, ఆయనే చివరివాడు కూడా. ఆయనే బాహ్యశక్తి, ఆయనే నిగూఢశక్తి కూడా. ఆయనే సర్వజ్ఞుడు, సర్వజ్ఞాని." (57:1-3)

"సృష్టిప్రణాళికను రూపొందించి దాన్ని అమలుపరిచేవాడు ఆ దేవుడే. ఆయనకు అత్యంత శ్రేష్ఠమైన పేర్లున్నాయి. భూమ్యాకాశాల్లోని అణువణువూ ఆయన ఔన్నత్యాన్నే కీర్తిస్తోంది. ఆయన మహా శక్తిసంపన్నుడు, వివేకవంతుడు." (59:24)

"ఆయనే నీటితో నిండిన మేఘాలను సృజిస్తున్నాడు. ఆ మేఘాలు అద్భుతమైన గర్జనలతో ఆయన్ని స్తుతిస్తూ, ఆయన పవిత్రతను కొనియాడుతుంటాయి." (13:12,13)

"భూమ్యాకాశాల్లో ఉన్న సమస్త సృష్టిరాసులు దేవుని ముందు సాష్టాంగపడుతున్న విషయం నీవు గమనించ లేదా? సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, పర్వతాలు, వృక్షాలు, జంతువులు, అనేకమంది మానవులు, (దైవ)శిక్షకు అర్హులైపోయిన చాలామంది మానవులు కూడా (సాష్టాంగపడుతున్నారు). దేవుడు ఒకవ్యక్తిని నీచుడిగా, క్షుద్రుడిగా చేయదలచుకుంటే, అతడ్నిక ఎవరూ గౌరవించరు. దేవుడు తాను తలచిన పని తప్పకుండా చేస్తాడు." (22:18)

"ఆయనే (పరాత్పరుడు, పరమోన్నతుడయిన) అల్లాహ్. భూమ్యాకాశాల్లోని అణువణువూ తన ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా ఆయనకే సాష్టాంగపడుతోంది. ఉదయం, సాయంత్రం సమస్త వస్తువుల ఛాయలు కూడా ఆయనకే మోకరిల్లుతున్నాయి." (ఖుర్‌ఆన్-13:15)

పై సూక్తిలోని మూలభాషలో సజ్దా అనే పదంఉంది. సజ్దా చేయడమంటే సాష్టాంగ పడటం, సాగిలబడటం, శిరసావహించడం, వినయపూర్వకంగా తలవంచడం. విధేయత చూపడం అని అనేక అర్థాలున్నాయి. దీన్నిబట్టి విశ్వంలోని సమస్త సృష్టిరాసులు, దేవునికి విధేయత చూపుతూ, ఆయన నిర్దేశించిన ఆజ్ఞలకు కట్టుబడి పని చేస్తున్నాయి. దేవుడు నిర్దేశించిన ఈ ప్రకృతిశాసనాలను ఏజీవి, మరేతర సృష్టితాలు కూడా ధిక్కరించలేవు.

సూర్యచంద్ర నక్షత్రాలన్నీ తమకు నిర్దేశించిన ప్రకృతిచట్టాలకు కట్టుబడి ఉంటూ దేవునికి విధేయత చూపుతున్నాయి. యావత్తు నభోమండలంలోని రోదసీ వస్తువులన్నీ తమతమ నిర్ణీత కక్ష్యల్లో, నిర్దేశిత వేగాలతో సంచరిస్తున్నాయి. వాటిలో ఏ ఒక్కటీ దైవ శాసనాన్ని ధిక్కరించి ఇష్టానుసారం సంచరించలేదు. సూర్యుడు, సముద్రం, గాలి, మేఘాలు కూడా దైవచట్టం ప్రకారమే పనిచేస్తూ వృక్షజాతికి, జీవరాసులకు కావలసిన వర్షం, శీతోష్ణస్థితులు సమకూర్చుతున్నాయి. అలాగే జంతువులు, పక్షులు, జలచరాలు కూడా దేవుడు తమకు నిర్దేశించిన ఆజ్ఞల ప్రకారమే మనుగడ సాగిస్తున్నాయి.

అందుకే ఆయా సృష్టిరాసుల్లో శాంతి, సుస్థిరతలు కన్పిస్తున్నాయి. నక్షత్రాలు ఒక దానికొకటి ఢీకొనడం జరగడం లేదు. జంతువులు, పక్షులు మానవుల మాదిరిగా కుట్రలు కుతంత్రాలతో పరస్పరం యుద్ధాలు చేసుకుంటూ రక్తదాహం తీర్చుకోవడం లేదు. సముద్ర జలాల్లోని కోట్లాది జలచరాల్లో మనకు ఎక్కడా అశాంతి, అలజడులు కానరావు. నిర్జీవ సృష్టిరాసుల్లో కూడా మనకు కాస్తయినా అస్థిరత గోచరించదు. చివరికి సృష్టిరాసుల నిర్మాణంలోని అణువుల్లో కూడా ఎప్పుడైనా అలజడి జరిగినట్లు మన పరిశోధనల్లో వెల్లడి కాలేదు. ఒకవేళ ఎప్పుడైనా అణువుల్లో విచ్ఛిత్తి జరిగిందంటే దానికి కారణం మానవుని స్వార్థపూరితమైన నిర్వాకమే. ఈ విధంగా యావత్తు సృష్టిరాసులు సృష్టికర్తకు విధేయులై, అంటే ముస్లింలయి పోయినందునే వాటిలో శాంతి, సుస్థిరతలు గోచరిస్తున్నాయి. ఇదే దేవుడు నిర్దేశించిన ధర్మం ఇస్లాం. ఇదే ప్రకృతి చట్టం. ఈ ప్రకృతి చట్టాన్ని ఏ సృష్టిరాసి కూడా ధిక్కరించి ప్రశాంతగా మనుగడ సాగించలేదు.

చివరికి మానవుడు కూడా తనకు స్వాతంత్ర్యాధికారాలులేని కార్యరంగాల్లో దేవుడు నిర్దేశించిన ఈ ప్రకృతి చట్టానికే తలవొగ్గి వ్యవహరిస్తున్నాడు. దాన్ని అతను ఎట్టి పరిస్థితుల్లోనూ ధిక్కరించలేడు. ఉదా:- మానవుడు కాళ్ళకు బదులు చేతులతో నడవలేడు. కళ్లకు బదులు చెవులతో చూడలేడు. నోటికి బదులు ముక్కుతో మాట్లాడలేడు. తనకు అధికారాలు ఇవ్వబడిన కార్యరంగంలోనే దైవనిర్ణీత చట్టాలను నిరాకరించగలడు. ఉదా: అతను దేవుడు నిర్దేశించిన ఆరాధనా పద్ధతులు, సామాజిక ఆర్థిక రాజకీయ విధానాలను విశ్వాసపరంగా, క్రియాత్మకంగా తిరస్కరించి దేవునికి అవిధేయుడై పోగలడు.

యావత్తు సృష్టిరాసుల్లో దేవుడు బుద్ధిజీవులైన మానవులకు మాత్రమే మంచీ చెడు, సత్యం-అసత్యం, ధర్మాధర్మాల విచక్షణాజ్ఞానం, అందులో ఏదో ఒకదాన్ని ఎంచుకునే, దాని ప్రకారం నడచుకునే స్వేచ్ఛ ప్రసాదించాడు. కాని మానవుల్లో అనేకమంది ఈ స్వేచ్ఛను దుర్వినియోగపరుస్తూ దేవుని శిక్షకు అర్హులైపోతున్నారు. వారు దైవప్రవక్తలు బోధించిన ధర్మపథాన్ని, జీవన విధానాన్ని ధిక్కరించి దైవాగ్రహానికి గురవుతున్నారు. అయితే మరొకవైపు వారు తమకు స్వేచ్ఛ ఇవ్వబడని కార్యరంగాల్లో తమకు తెలియకుండానే దైవాజ్ఞల్ని శిరసావహిస్తున్నామన్న వాస్తవం గ్రహించలేక పోతున్నారు.

కాబట్టి మానవుడు తనకు స్వేచ్ఛ ఇవ్వబడిన కార్యరంగాల్లో కూడా దేవునికి విధేయుడై ఆయన శాసనాలు శిరసావహించాలని ఖుర్‌ఆన్ చెబుతోంది. వీటిని ధిక్కరిస్తే అతను ఇహలోకంలో అశాంతికి గురయి, పరలోకంలో నరకయాతనలు అనుభవిస్తాడని హెచ్చరిస్తోంది. అంచేత మానవుడు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు ప్రసాదించబడిన కార్యరంగాల్లో కూడా దేవునికి విధేయుడై, ఆయన శాసనాలు శిరసావహిస్తే ఇహలోకంలో శాంతీ, పరలోకంలో దేవుని ప్రసన్నతాభాగ్యం, స్వర్గసౌఖ్యాలు లభిస్తాయని చెబుతోంది.

# 5. మానవుని జీవిత పరమార్థం

ఇంతకు ముందు పేర్కొన్న ఖుర్‌ఆన్ సూక్తుల ప్రకారం యావత్తు సృష్టిరాసులు సృష్టికర్తనే స్మరిస్తున్నాయి. ఆ శక్తిస్వరూపుని ఔన్నత్యాన్నే కీర్తిస్తున్నాయి. ఆయన పవిత్రతనే



కొనియాడుతున్నాయి. అంటే అవన్నీ సృష్టికర్తను ఆరాధిస్తున్నాయన్న మాట. మానవుని జీవిత పరమార్థం కూడా సృష్టికర్తను ఆరాధించడమే. అయితే మానవుడు అఖండ ఏకాంకమయిన దైవత్వాన్ని విభజించినట్టే సృష్టికర్త నిర్దేశించిన సమగ్రమైన ఆరాధనా భావాన్ని కూడా ముక్కలు ముక్కలుగా చేసి దేవుని కోసం ఎంతో పరిమితమైన ఆరాధనా భావాన్ని నిర్ణయించుకున్నాడు. మానవుని జీవిత పరమార్థం గురించి ఖుర్‌ఆన్ ఇలా పేర్కొన్నది:

“మేము భూమ్యాకాశాల్ని, వాటి మధ్య ఉన్న సమస్తాన్ని ఏదో తమాషా కోసం సృష్టించలేదు. వాటిని మేము (ఒక మహోన్నత లక్ష్యం కోసం) సత్యం ప్రాతిపదికపై సృజించాం. కాని చాలామందికి (ఈసత్యం) తెలియదు.” (ఖుర్‌ఆన్–44:38,39)

“మేము భూమ్యాకాశాలను, వాటిలో ఉన్నవాటిని ఏదో ఆట (తమాషా) కోసం సృష్టించలేదు. మేమేదైనా ఆటవస్తువును తయారు చేసుకోదలచుకుంటే, ఈవిధంగానే చేయాలనుకుంటే మా దగ్గర ఉన్నవాటితోనే తయారు చేసుకునేవారం. కాని మేము (ఇక్కడ) సత్యం ద్వారా అసత్యంపై దెబ్బతీస్తున్నాం. ఇలా సత్యం అసత్యం తల పగలగొడ్తుంది. చూస్తుండగానే అసత్యం అంతిమశ్వాస విడుస్తుంది. కనుక మీ అభూత కల్పనలకు మీకు వినాశం తప్పదు.” (ఖుర్‌ఆన్–21:16–18)

పైనపేర్కొన్న సూక్తులలో సృష్టికర్త విశ్వవ్యవస్థను తాను లక్ష్యరహితంగా నిర్మించలేదని, దాని వెనుక ఒక మహోన్నత లక్ష్యం ఉందని అన్నాడు. ఆ లక్ష్యం ఏమిటో ఈ సూక్తులలో తెలియజేయలేదు. అది ఈ క్రిందిసూక్తిలో తెలియజేశాడు:

“నేను మానవుల్ని, జిన్నుల్ని (అంటే భూతాలను) నన్ను ఆరాధించడానికి తప్ప మరే లక్ష్యంతో పుట్టించలేదు.” (ఖుర్‌ఆన్–51:56)

మానవుని ప్రయోజనార్థమే సృష్టికర్త మొత్తం విశ్వాన్ని సృష్టించాడు. ఆ తరువాత మానవుణ్ని తన ఆరాధన కోసమే సృష్టించానని పై సూక్తిలో తెలియజేస్తున్నాడు.

ఈ సూక్తిలో రెండర్థాలు ఉన్నాయి. ఒకటి, దేవుణ్ని తప్ప మరెవ్వరినీ ఆరాధించకూడదు. రెండు, దైవారాధన తప్ప మరేపనీ చేయకూడదు. మొదటి విషయం అందరికీ అర్థమవుతోంది. కాని రెండోది నేడు అనేకమంది ముస్లింలకు సైతం అర్థం కావడం లేదు. కారణం వారి మస్తిష్కాలలో ‘ఆరాధన’ పదానికి పరిమిత భావం ఉండిపోవడమే.

ఇస్లాంలో ఆరాధన అనే పదానికి చాలా విస్తృతమైన భావం ఉంది. నమాజ్, ఉపవాసం, కాబాయాత్ర, దైవధ్యానం లాంటి పూజాపురస్కారాలే కాదు; ఉపాధి సముపార్జన, కుటుంబజీవనం, తోటి మానవులతో సంబంధాలు, వ్యాపారం, ఆర్థిక లావాదేవీలు, దేశ పరిపాలనా వ్యవహారాలు, యుద్ధం, స్నేహ ఒడంబడికలు, అంతర్జాతీయ సంబంధాలు సైతం ఆరాధన క్రిందికే వస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే మానవ జీవితంలోని సకల రంగాలకు చెందిన సమస్త వ్యవహారాలు దైవారాధనల క్రిందికే వస్తాయి. కాకపోతే ఇవన్నీ దేవుడు, ఆయన ప్రవక్త (సల్లం) అందజేసిన ఆదేశాల ప్రకారం పాటించినప్పుడే దైవారాధనలుగా పరిగణించబడతాయి.

ఆరాధనలోని ఈ విస్తృత భావం తెలుసుకుంటే మనిషి జీవితంలోని సమస్త వ్యవహారాల్లో ఎలాంటి అపమార్గం పట్టకుండా సృష్టికర్తను మాత్రమే ఆరాధించగలడు. అంటే మనిషి ఖుర్‌ఆన్, హదీసు పరిధుల్లో మాత్రమే తన వ్యవహారాలు సాగించాలన్న మాట.

ఒకే దేవుడ్ని ఆరాధిస్తున్నామని చెప్పుకునేవారు ఎన్ని నమాజులు చేస్తున్నా, ఎన్ని ఉపవాసాలు పాటిస్తున్నా- ఎంత ధ్యానం చేస్తున్నా- దైనందిన వ్యవహారాల్లో దైవేతర శక్తులకో లేక మనోవాంఛలకో దాస్యం చేస్తుంటే మాత్రం ఆ మేరకు వారు దైవారాధన పరిధిని అతిక్రమిస్తున్నట్లే. అంటే ఆయా వ్యవహారాల్లో వారు దేవునికి సాటి కల్పిస్తున్నారన్నమాట. ఈ వైఖరి దైవాగ్రహానికి గొనిపోతుంది.

కొందరు ఈవైఖరి కప్పిపుచ్చుకోడానికి లేక అజ్ఞానంవల్ల "ఇవి మతవిషయాలు, అవి ప్రపంచవ్యవహారాల"ని వాదిస్తారు. కాని ప్రపంచ వ్యవహారాలు కూడా దేవుని ఆజ్ఞలు, దైవప్రవక్త హితవుల వెలుగులోనే ఉండాలన్న యదార్థాన్ని వీరు గ్రహించక పోవడం ఎంతో విచారకరం.

ఇస్లాం సంపూర్ణ జీవనవ్యవస్థ. ఇందులో మతం వేరు, ప్రపంచం వేరన్న భావన లేదు. ప్రపంచవ్యవహారాలని చెప్పబడే విషయాలు కూడా దైవాజ్ఞల పరిధిలోనే ఉన్నాయి. కనుక ఇస్లాం ధర్మాన్ని విశ్వసించిన మనిషి ప్రపంచ వ్యవహారాలకు సంబంధించిన ఏ పని చేసినా అది దైవాజ్ఞల ప్రకారమే, అంటే ఖుర్‌ఆన్, హదీసుల వెలుగులోనే చేయవలసి ఉంటుంది. అప్పుడే అతను దేవుని దృష్టిలో పరిపూర్ణ ముస్లింగా పరిగణించబడతాడు. అలాంటి పరిపూర్ణ ముస్లిం మాత్రమే శాంతి, సంతృప్తులతో కూడిన జీవితం గడుపుతాడు. అలాంటి మానవుడే పరలోకంలో మోక్షం పొందగలుగుతాడు.

## 6. సమగ్ర ధర్మావలంబనే శాంతికి దోహదకారి

ఇస్లాం మానవుని జీవితంలోని సమస్త రంగాల్లో పరివేష్ఠించి ఉన్న సమగ్ర జీవన వ్యవస్థ. దీని ఆదేశాలు పూజాపురస్కారాలు, ధ్యానం, ఉపవాసవ్రతాల్లోనే కాకుండా సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో కూడా ఉన్నాయి.

### సామాజిక రంగంలో దైవాజ్ఞలు

ఇది ఎంతో విస్తృతమైన రంగం. ఈ రంగం మానవుని కుటుంబ జీవితం నుంచి ప్రారంభమవుతుంది.

ఎదురుగా కన్పిస్తున్న తల్లిదండ్రుల్ని గౌరవించని, వారికి సేవ చేయలేని మనిషి ఎంతటి భయభక్తులతో దైవారాధన చేస్తున్నప్పటికీ అది దేవుని దృష్టిలో స్వీకారయోగ్యం కాదు. ఒక దైవాజ్ఞను క్రియాత్మకంగా తిరస్కరించి మరో దైవాజ్ఞ శిరసావహించడం అనేవి పరస్పర విరుద్ధ విషయాలు. లాంటి వైఖరికి ఇస్లాంలో చోటు లేదు.

ఇస్లాంలో దేవుని హక్కులు, దాసుల హక్కులని రెండు భాగాలున్నాయి. నమాజ్, ఉపవాసం, ధ్యానం, హజ్‌యాత్ర మొదలైనవి దేవునిహక్కులు. ఆర్థిక విషయాలతో పాటు మానవ సంబంధాలకు చెందిన వ్యవహారాలన్నీ దాసులహక్కుల కిందికి వస్తాయి. దాసుల హక్కులు నెరవేర్చకుండా దేవుని హక్కులు నెరవేర్చడం వల్ల ప్రయోజనం లేదు.



దేవుని హక్కులు నెరవేర్చడంలో ఏవయినా పొరపాట్లు దొర్లితే దేవుడు క్షమిస్తాడని ఆశించగలం. కాని దాసుల హక్కులు కొల్లగొట్టడం జరిగితే, సంబంధిత దాసులకు వారి హక్కులు తిరిగిచ్చేసి వారికి క్షమాపణ చెప్పుకోనంతవరకూ ఆ మనిషిని దేవుడు క్షమించడు.

**తల్లిదండ్రుల సేవ:** దాసుల హక్కులలో 'తల్లిదండ్రుల సేవే' ప్రప్రథం స్థానం ఆక్రమిస్తుంది. దీన్ని గురించి ఖుర్‌ఆన్ ఇలా ఆదేశిస్తోంది:

"తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మసలుకోండి. మీ ముందు వారిద్దరిలో ఎవరైనా వృద్ధులైఉంటే వారిని 'ఉఫ్' అనికూడా విసుక్కోకండి. కసురుకుంటూ విదిలించి మాట్లాడకండి. వారితో గౌరవంగా మాట్లాడండి; దయార్ద్రహృదయంతో, వినయంతో వారిముందు తలవంచి ఉండండి. 'ప్రభూ! వీరు నన్ను చిన్నతనంలో ఎలా కరుణతో, వాత్సల్యంతో పెంచిపోషించారో అలా నీవు వీరిని కరుణించు' అని ప్రార్థించండి." (17:23,24)

**సంతాన శిక్షణ:** సంతానికి సరయిన శిక్షణ ఇవ్వడం తల్లిదండ్రుల బాధ్యత. సంతాన శిక్షణ గురించి ఖుర్‌ఆన్ ఇలా ఆదేశిస్తోంది:

"లుఖ్మాన్ తన కుమారునికి హితోపదేశం చేసిన సందర్భం గుర్తుకు తెచ్చుకో. అతను తన కుమారునితో 'బాబూ! దేవునికి (ఆయన దైవత్వంలో) ఎవరినీ సాటి కల్పించకు. దేవునికి సాటి కల్పించడం ఘోరమైన పాపం, దారుణమైన అన్యాయం' అన్నాడు." (31:13); కుమారా! నీవు ప్రార్థనా (నమాజ్) వ్యవస్థ నెలకొల్పు. (ప్రజలను) మంచిని గురించి ఆదేశించు, చెడు విషయాలనుండి వారించు. కష్టాలు వచ్చినప్పుడు సహనం వహించు. ఇవి ఎంతో ధైర్యసాహసాలతో కూడిన విషయాలు..... (31:16-19)

"దారిద్ర్యభయంతో మీ సంతానాన్ని చంపుకోకండి. మేము వారికీ ఆహారమిస్తున్నాం, మీకూ ఇస్తున్నాము. వారిని చంపడం ఘోరమైన పాపం." (17:31)

దేవుడు సృష్టికర్త, ఆరాధ్యుడు మాత్రమే కాదు; ఆయన శాసనకర్త, పోషకుడు కూడా. ప్రాణికోటిని పోషించే బాధ్యతను ఆయనే తీసుకున్నాడు. ఉపాధి సముపార్జనకు మానవులు కృషి మాత్రమే చేయగలరు. ఉపాధి ప్రదాత నిజానికి దేవుడే. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆయన ఆహారోత్పత్తి కుడా పెంచుతున్నాడు. అధికోత్పత్తి కోసం నేడు వ్యవసాయరంగంలో అద్భుత విధానాలు, అసాధారణ సాంకేతిక పద్ధతుల్ని మానవులకు అనుగ్రహించినవాడు కూడా ఆ ప్రభువే. కనుక భ్రూణహత్య పాపానికి పాల్పడకూడదని పై సూక్తి తెలియజేస్తోంది.

**దాంపత్యజీవితం:** "ఆయన మీకోసం మీజాతి నుండే జీవిత భాగస్వాము (స్త్రీ)లను సృజించాడు, వారి దగ్గర మీరు సౌఖ్యం పొందడానికి. ఇంకా ఆయన మీ మధ్య ప్రేమానురాగాలు, దయాదాక్షిణ్యాలను కూడా జనింపజేశాడు." (ఖుర్‌ఆన్-30:21)

"సాధారణంగా స్త్రీలపై పురుషులకు ఎలాంటి హక్కులున్నాయో న్యాయపరంగా పురుషులపై స్త్రీలకు కూడా అలాంటి హక్కులే ఉన్నాయి. కాకపోతే పురుషులకు స్త్రీలపై ఒక మెట్టు ఆధిక్యత ఉంది. దేవుడు శక్తిమంతుడు, వివేచనాపరుడు." (ఖుర్‌ఆన్-2:228)

“దేవుడు స్త్రీలపై పురుషులకు కొంత ఆధిక్యత ప్రసాదించడం వల్ల, పురుషులు తమ సంపదను స్త్రీల కోసం ఖర్చుపెడ్తున్నందు వల్ల పురుషులు స్త్రీలపై వ్యవహారకర్తలు అవుతారు. కనుక సుగుణవతులైన స్త్రీలు తమ భర్తలకు విధేయత చూపుతూ వారి కను సన్నలలో నడచుకుంటారు. పురుషులు (ఇంటి పట్టున) లేనప్పుడు దేవునిరక్షణలో వారి హక్కులు కాపాడుతుంటారు.” (ఖుర్ఆన్-4:34)

“మీ భార్యల పట్ల మంచితనం కలిగివుంటూ సంసారం చేయండి. ఒకవేళ వారు మీకు (ఒక విషయంలో) నచ్చకపోతే, నచ్చనిదానిలోనే దేవుడు మీకెంతో శ్రేయస్సు, మేలు పెట్టిఉండవచ్చు.” (ఖుర్ఆన్-4:19)

“భార్యాభర్తల మధ్య సంబంధాలు చెడిపోతాయని భయముంటే భర్త బంధువుల నుండి ఒక మధ్యవర్తిని, భార్య బంధువుల నుండి ఒక మధ్యవర్తిని పెట్టుకోండి. వారిద్దరు కలసి పరిస్థితి చక్కదిద్ద దలచుకుంటే దేవుడు దంపతుల మధ్య సానుకూలత కలిగిస్తాడు. దేవుడు సర్వజ్ఞాని, సమస్తం ఎరిగినవాడు.” (ఖుర్ఆన్-4:35)

**పరదా వ్యవస్థ:** “ప్రవక్తా! విశ్వసించిన పురుషులు తమ చూపులు (పరస్త్రీలపై పడకుండా వేరే వైపు) మరల్చుకోవాలని, తమ మర్మావయవాలను కాపాడుకోవాలని చెప్పు. వారికిది చాలా శ్రేష్ఠమైన పద్ధతి.” (ఖుర్ఆన్-24:30)

“(అలాగే) విశ్వసించిన స్త్రీలు తమ చూపులు (పరపురుషులపై పడకుండా వేరే వైపు) మరల్చుకోవాలని, తమ మర్మావయవాలు కాపాడుకోవాలని వారికి చెప్పు. అదీ గాక వారు తమ అలంకరణలను బయటికి కనబడనీయకూడదు. ఒకవేళ వాటంతటవే బయటపడితే తప్పులేదు. వారు తమ వక్షస్థలాలను ఓణీలతో కప్పుకోవాలి.” (ఖుర్ఆన్-24:31)

“ప్రవక్తా! నీ భార్యలకు, కుమార్తెలకు, ముస్లింస్త్రీలకు వారు తమ పైటలను తమ (ముఖాల)పై కప్పుకోవాలని చెప్పు. ఇదే సరైనపద్ధతి. దీనివల్ల వారిని ఎవరైనా గుర్తించి వేధిస్తారనే భయముండదు.” (ఖుర్ఆన్-33:59)

**సభ్యతా సంస్కృతులు:** “మిమ్మల్ని ఎవరైనా గౌరవసూచకంగా సలాం చేస్తే, మీరు అంతకంటే శ్రేష్ఠంగా వారికి ప్రతిసలాం చేయండి. లేదా అదేవిధంగానయినా చేయండి.” (ఖుర్ఆన్-4:86)

”విశ్వాసులారా! మీరు మీ ఇండ్లలోకి తప్ప ఇతరుల ఇండ్లలోకి వారి అనుమతి లేకుండా, వారికి సలాం చేయకుండా ప్రవేశించకండి.” (ఖుర్ఆన్-24:27)

“విశ్వాసులారా! మీ బానిసలు, ప్రాజ్ఞత వయస్సుకు చేరుకోని మీ బాలబాలికలు (పడగ్గదిలో) మీదగ్గరకు రావాలంటే వారు మూడు వేళల్లో మీ అనుమతి తీసుకోవాలి. అవి- ప్రాతఃకాల ప్రార్థనకు ముందు, మధ్యాహ్నం మీరు (విశ్రాంతికై) మీ పైఉడుపులు తీసివేసినప్పుడు, రాత్రివేళ ప్రార్థన తరువాత.” (ఖుర్ఆన్-24:58)

## ఆర్థిక రంగంలో దైవాజ్ఞలు

ఆర్థిక సమానత్వం పేరుతో బలప్రయోగాలు, రక్తపాతాలు జరపడాన్ని ఇస్లాం సహించదు. ఇస్లాం ఆర్థిక న్యాయం కోరుతోంది. సంపద ఎల్లప్పుడూ కొందరి దగ్గర కేంద్రీ



కృతమై ఉండకూడదని, సమాజంలో వికేంద్రీకరణ జరుగుతుండాలని చెబుతోంది. ఈ ఉద్దేశ్యంతోనే ఇస్లామీయ ఆర్థిక చట్టాలు రూపొందాయి.

**జకాత్ (పేదల ఆర్థికహక్కు):** “విశ్వాసులారా! ఎలాంటి క్రయవిక్రయాలు జరగని, స్నేహసహకారాలు ఉపయోగపడని, ఎవరి సిఫారసు చెల్లని దినం రాకముందే మేము మీకు ప్రసాదించిన సంపదనుండి (దైవమార్గంలో) ఖర్చుపెట్టండి.” (ఖుర్ఆన్-2:254)

“నమాజ్ వ్యవస్థ నెలకొల్పండి. (మీఅవసరాలు పోగా మిగిలిన సంపదలో ప్రతిఏడూ రెండున్నర శాతం పేదల ఆర్థిక హక్కు) జకాత్ చెల్లిస్తూ ఉండండి.” (ఖుర్ఆన్-2:110)

“అవి పంటకు వచ్చినప్పుడు వాటి పండ్లు హాయిగా తినండి. దాంతోపాటు పంట కోతకు వచ్చినప్పుడు అందులో నుంచి దేవుని హక్కు (పేదల ఆర్థికహక్కు) కూడా నెరవేర్చండి. దుబారా చేయకండి. దుబారా చేసేవారిని దేవుడు ప్రేమించడు.” (6:141)

“విశ్వాసులారా! మీరు సంపాదించిన దానిలోనూ, మేము నేలనుండి మీకోసం ఉత్పత్తి చేసిన దానిలోనూ శ్రేష్ఠమైనదాన్ని దైమార్గంలో ఖర్చుచేయండి.” (ఖుర్ఆన్-2:267)

**ఆస్తి పంపకం:** “తల్లిదండ్రులు, ఇతర బంధువులు వదలిన ఆస్తి కొద్దిగా ఉన్నా, ఎక్కువగా ఉన్నా అందులో పురుషులకూ వాటా ఉంది; స్త్రీలకూ వాటా ఉంది. ఇవి (దైవ)నిర్ణీత వాటాలు. (వాటిని తగ్గించడానికి లేదా పెంచడానికి ఎవరికీ అధికారం లేదు.) ఆస్తిపంపకం జరుగుతున్నప్పుడు వారసులుకాని (నిరుపేద) బంధువులు, అనాథలు, అగత్యపరులు ఎవరైనా వస్తే వారిక్కూడా ఎంతోకొంత ఇచ్చిపంపండి. వారితో మృదువుగా మాట్లాడండి.” (ఖుర్ఆన్-4:7,8)

“స్త్రీలకు లభించవలసిన మహర్ (వధుకట్నం)ను (విధిగా భావించి) వారికి సంతోషంగా ఇచ్చివేయండి. అయితే వారు సంతోషంగా కొంత మహర్ మాఫీచేస్తే దాన్ని మీరు నిరభ్యంతరంగా అనుభవించవచ్చు.” (ఖుర్ఆన్-4:4)

**అక్రమసంపాదన:** “విశ్వాసులారా! మీరు ఒకరి సొమ్మును మరొకరు అన్యాయంగా కబళించకండి. పరస్పరామోదంతో వ్యాపారలావాదేవీలు, ఇచ్చిపుచ్చు కోవడాలు జరుపు కోవచ్చు.” (ఖుర్ఆన్-4:29)

“తూకం తగ్గించేవారికి వినాశం తప్పదు. వారు ప్రజల నుండి (సరుకు) తీసుకునేటప్పుడు పూర్తిగా తూచి లేక కొలచి తీసుకుంటారు; ఇచ్చేటప్పుడు తగ్గించి ఇస్తారు. ఒక భయంకర దినాన తాము లేపి ప్రవేశపెట్టబడతామని వారికి తెలియదా?” (83:1-5)

“దేవుడు వడ్డీని అధర్మకార్యంగా నిర్ణయించాడు. కనుక ఈ హితబోధ అందినవారు ఇక ముందు వడ్డీ తినటాన్ని మానుకోవాలి.” (ఖుర్ఆన్-2:275)

# 7. మానవచట్టాలు-దైవచట్టాలు

ఒక ప్రాంతంలో, ఒక రాష్ట్రంలో, ఒక దేశంలో లేదా అంతర్జాతీయ స్థాయిలో ప్రజలందరికీ న్యాయం చేకూర్చగలిగే చట్టాలు ఏ మానవుడు లేక ఏ మానవసమూహం కూడా రూపొందించలేరు. మానవనిర్మిత చట్టాలు ఎంతటి సదుద్దేశ్యంతో రూపొందినా

కొన్ని చోట్ల స్వార్థం, పక్షపాతం, బంధుప్రీతి, ప్రాంతీయ- జాతీయ దురభిమానాలు తొంగి చూస్తూనే ఉంటాయి. వాటి కారణంగా ఘర్షణలు, అల్లర్లు, అరాచకాలు, హింసా దౌర్జన్యాలు జరుగుతాయి. ఈనాడు మనం వీటిని చూస్తూనే ఉన్నాం. మానవులందరికీ సరయిన న్యాయం చేకూర్చగలిగే చట్టాలను మానవుల్ని సృష్టించిన సృష్టికర్త మాత్రమే రూపొందించగలడు.

యావత్తుప్రపంచానికి, సకల మానవాళికి దేవుడే యజమాని, ప్రభువు, పోషకుడు, పాలకుడు అయినందున ఆయన ఏ ఒక్క మానవుడు, తెగ, జాతి, సమాజం, ప్రాంతం, దేశం పట్ల పక్షపాతం వహించే ప్రసక్తే లేదు. కనుక దైవచట్టాలే యావత్తు మానవాళికి ఆమోదయోగ్యమైన చట్టాలు కాగలుగుతాయి. అలాంటి చట్టాలు 1400 సంవత్సరాలు గడచినా ఎలాంటి మార్పులకు, చేర్పులకు గురికాని ఖుర్ఆన్‌లో మాత్రమే ఉన్నాయి. మానవులు తమనుతాము పూర్తిగా దేవునికి సమర్పించుకొని, ఆయన నిర్మించిన చట్టాల ప్రకారం పవిత్రజీవితం గడుపుతున్నప్పుడే వారికి నిజమైన మనశ్శాంతి లభిస్తుంది.

దేవుడు తన చట్టాల ద్వారా శాంతి (ఇస్లాం) స్థాపించడానికే ప్రతి యుగంలో, ప్రతి జాతిలో తన ప్రవక్తలను ఉద్భవింపజేస్తూ వచ్చాడు. చివరికి ఆ శాంతి స్థాపన కోసమే తన అంతిమ ప్రవక్త ముహమ్మద్ (సల్లం)ను ప్రభవింపజేసి, ఆయన ద్వారా ప్రళయం వరకూ మానవులకు అవసరమైన చట్టాలను ప్రసాదించాడు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఆ చట్టాల ప్రకారం స్వయంగా జీవితం గడిపి ప్రపంచ ప్రజలందరికీ ఆదర్శప్రాయులయ్యారు. నిజమైన శాంతి కోరుకునేవారికి ఇప్పుడు దివ్యఖుర్ఆన్ తర్వాత దాని క్రియాత్మక వ్యాఖ్యానంగా నిలచిన ఆ మహనీయుని జీవనసరళే శరణ్యం.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) అనేక చెడుగులకు, అసంఖ్యాకమైన మిథ్యా దైవాలకు ఆలవాలమైవుండిన ఆనాటి అరబ్ సమాజంలో మొట్టమొదట ఏకేశ్వర నినాదంతో శాంతిస్థాపన ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.

## 8. శాంతిఉద్యమం ప్రారంభదశ

ఏకేశ్వరనినాదం వినగానే సుదీర్ఘకాలంగా బహుదైవారాధనకు అలవాటుపడిన అరబ్బులు ఉలిక్కిపడ్డారు. ప్రారంభంలో ఆయన్ని వారు విచిత్రంగా చూస్తూ హేళన చేసేవారు. తరువాత ఏకేశ్వర ఉద్యమాన్ని నిరోధించడానికి ఆయన సంరక్షకుడయిన పెత్తండ్రి, ఖురైష్ తెగ అగ్రనాయకుడు, కాబామందిరం ధర్మకర్త అయిన అబూతాలిబ్ దగ్గరకు వెళ్ళి రాయబారాలు జరిపారు. అయినప్పటికీ మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) తన ఉద్యమాన్ని ఆపలేదు.

అదీగాక చిన్నప్పటి నుంచీ ఆ మహనీయుని సత్యసంధత, నిజాయితీలను చూస్తూవచ్చిన సహృదయులు ఒక్కొక్కరే ఏకేశ్వరవాదం స్వీకరించి ఆయనకు అనుచరులై పోసాగారు. అప్పుడు మక్కా బహుదైవారాధకులు హింసామార్గం అవలంబించారు. ఆయన్ని, ఆయన అనుచరుల్ని రకరకాలుగా వేధించడం మొదలుపెట్టారు. దైవప్రవక్త (సల్లం) శిక్షణలో ఆయన అనుచరులు సహనంతో పరిస్థితుల్ని ఎదుర్కొన్నారు. ఒకవైపు



బహుదైవారాధకులు హింసాదౌర్జన్యాలు, మరొక వైపు ప్రవక్త అనుచరుల సహనం, స్థిరత్వాలు గమనిస్తున్న మరికొందరు సహృదయులు దైవప్రవక్త (సల్లం) వ్యక్తిత్వం, దైవవాణి సత్యత వైపు దృష్టిసారించారు. వారిలో అనేకమంది ఇస్లాం (శాంతి) ధర్మం స్వీకరించడం కూడా జరిగింది. వారిలో మహా బలశాలులైన హమ్జా, ఉమర్ (రజి)లు కూడా ఉన్నారు. దాంతో ప్రవక్త అనుచరులపై ఖురైష్ నాయకుల వేధింపులు మరింత ఎక్కువైపోయాయి.

అప్పుడు దైవప్రవక్త (స) ఈ కష్టాల నుండి తప్పించడానికి కొందరు అనుచరుల్ని అబిసీనియాకు వలస పోవడానికి అనుమతిచ్చారు. వలస పోకుండా మక్కాలోనే ఉండి పోయిన ముస్లింలపై హింసాకాండ యధాతథంగా కొనసాగింది. దాదాపు మూడేళ్ళ పాటు సంఘబహిష్కరణ కూడా జరిగింది. ఆ కాలంలో దైవప్రవక్త (సల్లం), ఆయన అనుచరులు తిండి దొరక్క ఒక్కొక్కప్పుడు పస్తులు కూడా గడపవలసి వచ్చింది.

### హద్దుమీరిన హింసాకాండ

సంఘబహిష్కరణ ఆంక్షలు ఎత్తివేయబడిన తరువాత శాంతిస్థాపన ఉద్యమం మరో మలుపు తిరిగింది. ముస్లింల సంఖ్య క్రమంగా అధికం కాసాగింది. అయితే ఈలోగా శాంతిస్థాపన ఉద్యమానికి ఎంతగానో సహకరించిన ప్రవక్త సతీమణి హజ్రత్ ఖదీజా (రజి), పెత్తండ్రి అబూతాలిబ్ ఇహలోకం వీడిపోయారు. అబూతాలిబ్ పోయిన తరువాత ఖురైషీయుల ఆగడాలు హద్దుమీరి పోయాయి. ఆ గడ్డుకాలంలోనే అరేబియాలోనే పేరుమోసిన ఇంద్రజాలకుడు జిమాద్, సుప్రసిద్ధ కవిపుంగవుడు తుఫైల్ దౌసి (రజి)లు ఇస్లాం స్వీకరించారు.

వేరొక వైపు మదీనాపట్నం ప్రముఖులు కూడా కొందరు ఇస్లాం స్వీకరించి శాంతి స్థాపన ఉద్యమంలో దైవప్రవక్త (సల్లం)కు సహకరిస్తామని శపథం చేశారు. ఆ తరువాత ముస్లింలంతా మక్కా వదలి మదీనాకు వలస పోవాలని దైవాజ్ఞ వచ్చింది. ఈ ఆజ్ఞతో దైవప్రవక్త (సల్లం) కొందరు మినహా అందరినీ మదీనా వలస పొమ్మని ఆదేశించారు. ఈ విధంగా ముస్లింలంతా మదీనా చేరుకున్నారు.

ఇదంతా చూసిన ఖురైష్ నాయకులు ముహమ్మద్ (సల్లం) కూడా మక్కా వదలి పోయే అవకాశం ఉందని గ్రహించి ఆయన్ని హతమార్చడానికి పన్నాగం పన్నారు. ఓ రోజు వారు రాత్రివేళ దైవప్రవక్త (సల్లం) ఇంటిని చుట్టుముట్టి బయటికి రాగానే అందరూ మూకుమ్మడిగా విరుచుకుపడి ఆయన్ని చంపుదామని కాచుకొని కూర్చున్నారు. అయితే దైవప్రవక్త (సల్లం) వారి కళ్ళుగప్పి వెళ్ళిపోయారు. మక్కా పట్నం శివార్లలోని ఓ కొండగుహలో ప్రాణమిత్రుడు హజ్రత్ అబూబకర్ (రజి)తో కలసి మూడు రోజుల పాటు దాక్కొని ఉండవలసి వచ్చింది. ఆ తరువాత మదీనా చేరుకున్నారు. శత్రువులు ఆయన కోసం నగరం నలువైపులా గాలించి విసిగిపోయారు.

### మదీనాలో ఊపందుకున్న 'శాంతి'ఉద్యమం

మదీనాలో అంతకుముందే అనేకమంది ఇస్లాం స్వీకరించి ఉన్నందువల్ల దైవప్రవక్త (స)కు ఘనస్వాగతం లభించింది. ఆయన రాకతో మదీనా ప్రజలలో నూతన ఉత్సాహం

పెల్లుబికింది. అక్కడి ప్రధాన తెగలయిన "ఔస్, ఖజ్రజ్"లకు చెందిన చాలామంది ప్రజలు ఇస్లాం స్వీకరించడం ప్రారంభించారు. దైవప్రవక్త (స) మదీనా రాగానే మక్కా నుండి వలస వచ్చిన ముస్లింలకు, మదీనా ముస్లింలకు మధ్య సోదర బాంధవ్యం కలగజేశారు. మరోవైపు మదీనాలోని యూదులతో స్నేహఒప్పందం కూడా చేసుకొని శాంతీ సుస్థిరతలు నెలగొల్పడానికి కృషి చేశారు.

## గోముఖ వ్యాఘ్రం

అయితే జన్మతః జాత్యహంకారులైన యూదులు అంతిమ దైవప్రవక్త తమజాతిలో పుట్టకుండా తాము నిరక్షరకుక్షులని తెగడిన అరబ్బుల్లో పుట్టినందుకు ఇస్లాం పట్ల, ముహమ్మద్ ప్రవక్త పట్ల తీవ్రమైనద్వేషం పెంచుకున్నారు. మరోవైపు ఔస్, ఖజ్రజ్ తెగల్లో అత్యధికమంది ముస్లింలుగా మారిపోవడం, వడ్డీవ్యాపారం తదితర అక్రమ లావాదేవీలను నిషేధిస్తూ దైవప్రవక్త (స) సామాజిక, ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టడం కూడా వారికి కంటకప్రాయంగా తయారయ్యాయి. దాంతో వారు ముస్లింల మధ్య అనైక్యతా బీజాలు నాటడానికి, వారికి ఆర్థికఇబ్బందులు కలగజేయడానికి, క్రమంగా స్నేహ ఒప్పందం ఉల్లంఘించడానికి పాల్పడ్డారు.

ఇదిలా ఉంటే వేరొక వైపు మదీనాలోనే కొందరు అవిశ్వాసులు ముస్లిం వేషాలతో రంగంలోకి దిగి తమ కపటవిశ్వాసంతో దైవప్రవక్త (స)కు, ముస్లింలకు పక్కలో బల్లెమయి కూర్చున్నారు. పూర్వం మదీనాలోని ఔస్, ఖజ్రజ్ తెగలు అంతర్యుద్ధాలలో మునిగి తేలుతుండేవి. చివరికి ప్రజలు విసిగిపోయి అందరూ కలసి ఖజ్రజ్ తెగకు చెందిన అబ్దుల్లా బిన్ ఉబయి అనే ఆసామిని రాజుగా చేసుకొని ఆయన ఏలుబడిలో సమైక్యమయి ఉండాలని నిశ్చయించుకున్నారు. అలాంటి స్థితిలో ఈ రెండు తెగలకు చెందిన కొందరు ప్రముఖులు మక్కా వెళ్ళి ఇస్లాం స్వీకరించారు. దాంతోపాటు వారు దైవప్రవక్త (స)ను మదీనా వచ్చేయమని ఆహ్వానించడం, దాని ప్రకారం దైవప్రవక్త (స) తన అనుచరులతో మక్కా వీడి మదీనా వచ్చేయడం జరిగాయి.

ఆయన రాకతో మదీనాలో అనేకమంది ఇస్లాం స్వీకరించారు. మదీనాలో ఇప్పుడు దైవప్రవక్తే ప్రజలకు కేంద్రబిందువయి పోయారు. దాంతో అబ్దుల్లా బిన్ ఉబై మదీనా నాయకత్వం తననుండి చేజారిపోతోందని గ్రహించి ఇష్టం లేకపోయినా తన నమ్మిన బంట్లతో ఇస్లాంలో చేరిపోయాడు. అయితే దైవప్రవక్త (స) మీద కసి పెంచుకొని లోలోన విద్రోహచర్యలకు పాల్పడటం ప్రారంభించాడు. అయినప్పటికీ మదీనాలో ఇస్లాం క్రమక్రమంగా విస్తరిస్తూనే ఉంది.

# 9. మక్కా ప్రజల కవ్వింపు చర్యలు

అయితే మక్కాలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. ముస్లింలు మక్కా వదలి మదీనాకు వలసపోయినా మక్కా బహుదైవారాధకులు వారిని విరోధించడం మానుకోలేదు. దీనికితోడు మదీనాలోని ఔస్, ఖజ్రజ్ తెగలు మక్కా నుంచి వచ్చిన ముస్లింలకు ఆశ్రయం ఇవ్వడంతో వారి ఆగ్రహానికి ఆజ్యం పోసి నట్లయింది. ఇలాంటి



పరిస్థితిలో మదీనా నుండి సాద్ బిన్ ముఆజ్ (రజి) అనే ఓ ముస్లిం కాబా సందర్శనం కోసం మక్కా వెళ్ళి ఉమయ్య బిన్ ఖలఫ్ ఇంట్లో అతిథిగా బసచేశారు. ఆయన కాబాలో ప్రవేశిస్తున్నప్పుడు సత్యతిరస్కారి అబూజహల్ కాబాద్వారం దగ్గర నిలబడి "నీవు గనక ఉమయ్యాకు అతిథి కాకపోయివుంటే మేము నిన్ను ఇక్కడ్నుంచి ప్రాణాలతో బయటపడ నిచ్చేవారం కాము" అని బెదిరించాడు. అప్పుడు సాద్ (ర) "మీరు నన్ను కాబా దర్శనం చేయనీకుండా నిరోధిస్తే సిరియా నుండి మదీనా మీదుగా వచ్చే మీ వర్తకబిడారాలను నేను అడ్డుకుంటాను" అని హెచ్చరించారు.

దైవప్రవక్త (సల్లం) మక్కా వదలి మదీనాకు వలసపోయిన దగ్గర్నుంచి మక్కా ఖురైషీయులు ఆగ్రహావేశాలతో భావికర్తవ్యం గురించి తీవ్రంగా ఆలోచించసాగారు.

"చూస్తుండగానే ముస్లింలు అనేకమంది మక్కా ఖాళీచేసి వెళ్ళిపోయారు. ముహమ్మద్ కూడా అందరి కళ్ళుగప్పి మదీనా వెళ్ళిపోయాడు. అక్కడ అంతకుముందే చాలామంది ఆయన్ని విశ్వసించి ఉన్నారు. తర్వాత మదీనా చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా ముహమ్మద్ ప్రభావం పడుతోంది. ఇలా దేశమంతా ముస్లింలు వ్యాపించి కొద్ది కాలంలోనే మనల్ని నిలువ నీడలేకుండా చేస్తారు. ఆ పరిస్థితి రాకముందే మనం ముహమ్మద్ ఉద్యమాన్ని మొగ్గలోనే త్రుంచివేయాలి."

ఈ ఆలోచనతో మక్కా బహుదైవారాధకులు తల్లడిల్లిపోయారు. వారు కపటవిశ్వాసుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబైని హెచ్చరిస్తూ ఇలా ఒక ఉత్తరం పంపారు: "మా దగ్గర్నుంచి పారిపోయి వచ్చిన మా మనిషిని మీరు అక్రమంగా మదీనాలో ఉంచుకున్నారు. ఇది మీకు శ్రేయస్కరం కాదు. మీరు పోరాడి అతడ్ని మీ నగరం నుంచి వెళ్ళగొట్టండి. మామాట మన్నించి మీరలా చేస్తే సరి, లేకపోతే సమస్త ఆయుధాలతో మేము మదీనాపై దాడిచేస్తాం. మిమ్మల్నందర్నీ వధించి, మీ స్త్రీలను బానిసలుగా చేసి తీసికెళ్తాం."

అవకాశం కోసం చూస్తున్న ఇబ్నె ఉబైకి ఈ హెచ్చరిక కర్తవ్యం బోధించినట్లయింది. వెంటనే అతను బహుదైవారాధకులందర్నీ సమావేశపరచి ఆ లేఖను చదివి విన్పించాడు. తర్వాత వారిని రెచ్చగొడ్తూ ముస్లింలకు వ్యతిరేకంగా యుద్ధానికి పురిగొల్పసాగాడు.

ఇక్కడ ఈ రహస్య సమావేశం జరుగుతుండగానే క్షణాల మీద ఈ విషయం దైవ ప్రవక్త (స)కు తెలిసిపోయింది. ఆయన వెంటనే అక్కడకు చేరుకొని ఇలా మాట్లాడారు:

"సోదరులారా! మక్కా ప్రజలు మిమ్మల్ని మోసగింప జూస్తున్నారు. మీరు వారి వలలో పడిపోతే చాలా నష్టపోతారు. అందువల్ల మీరు వారికి నిర్ద్వందంగా సమాధానమిచ్చి మాతో చేసుకున్న ఒప్పందానికి కట్టుబడి ఉండండి. ఇదే మీకు అన్నివిధాల మేలైన పని. ఆలోచించుకోండి. ఖురైషీయులు మదీనాపై దాడిచేస్తే వారిని ఓడించడం మనకే సులువు. ఎందుకంటే ఒడంబడిక ప్రకారం మీరూ, మేము ఏకమయి వారికి ఎదురునిలుస్తాం. ఒకవేళ మీరు యుద్ధానికే తలపడితే చేజేతులా వినాశాన్ని కొనితెచ్చుకున్నట్లవుతుంది."

బహుదైవారాధకులు దైవప్రవక్త (సల్లం) మాటల్లోని యదార్థం గ్రహించి ఒప్పందానికే కట్టుబడి ఉంటామని చెప్పారు. ఆ తరువాత వారంతా అబ్దుల్లా బిన్ ఉబై వైపు అసహ్యంగా,

అనుమానాస్పదంగా చూసి వెళ్ళిపోయారు. ఇబ్నె ఉబయి నిర్ఘాంతబోయి గుడ్లప్పగించి నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాడు.

మక్కా ఖురైషీయుల యుద్ధదాహం సంగతి ముస్లిం యువకుల్లో రక్తం ఉడికించింది. శత్రువులు తమను చిత్రహింసలు పెట్టి, కట్టుబట్టలతో జన్మభూమిని వీడి పోయేలా చేసిన ఆ దుర్భర రోజులు వారి కళ్ళ ముందు ఇంకా మెదలుతూనే ఉన్నాయి. చివరికి వారు  దైవప్రవక్త (సల్లం)ను సైతం చంపడానికి ప్రయత్నించారు.

"ముహమ్మద్ (సల్లం)! సత్యతిరస్కారులు నీకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతుండిన సందర్భం గుర్తుకుతెచ్చుకో. వారు నిన్ను బంధించి ఉంచాలా, లేక హతమార్చివేయాలా, లేక దేశ బహిష్కరణ చేయాలా అని రకరకాలుగా ఆలోచిస్తూ పన్నాగాలు పన్నసాగారు. ఆవిధంగా వారు పన్నాగాలు పన్నుతుంటే, దేవుడు కూడా (తనదైన రీతిలో) పన్నాగాలు పన్నుతుండే వాడు. దేవుడే అందరికంటే గొప్ప పన్నాగం పన్నేవాడు." (ఖుర్ఆన్–8:30)

అందువల్ల ఇక అన్యాయాన్ని ఎంతమాత్రం సహించకూడదు; దౌర్జన్యాన్ని అరికట్టాలి; ఇస్లాంకు అవరోధాలు సృష్టిస్తున్న శత్రువులకు గుణపాఠం నేర్పాలి; కాబాదర్శనానికి పెట్టిన ఆంక్షల్ని అంతమొందించి భక్తులకు స్వేచ్ఛ కలిగించాలి" అని నిర్ణయించుకున్నారు మదీనా ముస్లిం యువకులు.

ఆ తరువాత వారు దైవప్రవక్త (సల్లం)ను కలుసుకొని, శత్రువులతో యుద్ధం చేయ డానికి అనుమతి అడిగారు. కాని కారుణ్యమూర్తి (సల్లం) యుద్ధానికి బదులు సంధికి, పగసాధింపుకు బదులు క్షమాపణకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇచ్చేవారు. నిజానికి ఇప్పటి పరిస్థితి చూస్తే ఖడ్గానికి బదులు ఖడ్గంతో జవాబియ్యకపోతే పరిస్థితి విషమించేలా ఉంది. కాని దానికైనా విశ్వప్రభువు నుండి అనుమతి రావాలికదా? అందువల్ల అప్పటిదాకా సహనం వహించమని దైవప్రవక్త (సల్లం) వారికి నచ్చజెప్పారు.

ఆ తర్వాత మక్కా ఖురైషీయులు చిన్నచిన్న దళాలను మదీనా పరిసర ప్రాంతాలకు పంపి ముస్లింలను కవ్వించడం ప్రారంభించారు. ఒకసారి వారు మదీనా వెలుపల పశువుల కాపర్లపై దాడి చేసి వారి పశువుల్ని దోచుకుపోయారు. ఇలా మక్కా అవిశ్వాసుల దౌర్జన్యాలు రోజురోజుకు మితిమీరి పోతున్నాయి. మదీనా ముస్లింలపై కవ్వింపు చర్యల్ని మానుకోలేదు. అప్పుడు ఆత్మరక్షణ, ధర్మరక్షణల కోసం కత్తిపట్టి శత్రువులతో పోరాడటా నికి దేవుని అనుమతి లభించింది. హిందూ పౌరాణిక భాషలో చెప్పాలంటే దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం ఇవ్వబడిన అనుమతి ఇది.

శక్తి, అవకాశం ఉండి కూడా దుష్టుల అన్యాయం, దౌర్జన్యాయాలను ఎదుర్కోకుండా రాజకీయాలు మనకెందుకులే అనుకొని మసీదులో జపం చేస్తూ కూర్చుంటే, కొన్నాళ్ళకు ఆ జపం చేసేవారు కూడా దుష్టుల దౌర్జన్యం నుండి తప్పించుకోలేరు. అలాగే దుష్టులు కయ్యానికి కాలుదువ్వుతూ ఖడ్గధారులై మీదికి వచ్చినప్పుడు శక్తి ఉండి కూడా వారిని ఎదుర్కోకుండా నరికేయండని వారి ఖడ్గాల క్రింద మెడలు వంచడం ఏమాత్రం పుణ్య కార్యం కాదు. పైగా అది ఆత్మవంచనావైఖరి, ఆత్మహత్యాసదృశం అవుతుంది.



# 10. జిహాద్ అనుమతి

జిహాద్ (పోరాటం) ప్రస్తావనకు ముందు దాన్ని గురించి ఇస్లాం సూచించిన మౌలిక విషయాలేమిటో తెలుసుకోవలసిన అవసరం ఉంది.

ఈ(హత్య) కారణంగానే మేము ఇస్రాయీల్‌సంతతివారికి ఇలా ఒక ఉత్తర్వు జారీ చేశాం:"ఎవరైనా ప్రతీకార హత్య(శిక్ష)గా లేక ధరణిపై కల్లోలం రేకెత్తించినందుకు శిక్షగా తప్ప ఏ మనిషినైనా చంపితే అతను యావత్తు మానవాళిని చంపినట్లే. అలాగే ఎవరైనా ఒక మనిషిప్రాణం కాపాడితే అతను యావత్తు మానవాళిని కాపాడినట్లే." (ఖుర్ఆన్–5:32)

"మీప్రభువు మీపై ఎలాంటి ఆంక్షలు విధించాడో తెలుపనా" అని వారికిలా చెప్పు: ఆయనకు ఎవరినీ సాటికల్పించకూడదు. తల్లిదండ్రులపట్ల సద్భావనతో మసలుకోవాలి... న్యాయప్రాతిపదికపై తప్ప దేవుడు నిషేధించిన ఏ ప్రాణినీ చంపకండి. మీరు అర్థం చేసుకొని మసలుకుంటారని దేవుడు మీకీ విషయాలు బోధిస్తున్నాడు. (ఖుర్ఆన్– 6:151)

"వారు తమ సంపద వినియోగిస్తున్నప్పుడు దుబారా ఖర్చుచేయరు; ఇటు పిసినారి తనం కూడా వహించరు. వారి ఖర్చు ఆరెండు అతిచర్యలకు మధ్యస్తంగా ఉంటుంది. వారు ఒక్కదేవుడ్ని తప్ప మరెవరినీ ప్రార్థించరు. దేవుడు నిషేధించిన ఏప్రాణినీ అన్యాయంగా హత మార్చరు. వ్యభిచారానికి ఏమాత్రం పాల్పడరు. ఈ పాడుపనులు చేసేవాడు తన పాపఫలం అనుభవిస్తాడు. ప్రళయం రోజు అతనికి రెట్టింపుశిక్ష పడుతుంది." (ఖుర్ఆన్–25:68)

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ఘోర పాపాలలో అన్నిటికంటే ఘోరమైన పాపాలు- ①దేవునికి సాటి కల్పించడం, ②నరహత్య, ③తల్లిదండ్రుల మాట వినకపోవడం,④అబద్ధం."

హజ్రత్ ఉమర్ (ర) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "విశ్వాసి ఏ అమాయకుడిపై రక్తపాతానికి పాల్పడనంతవరకు తన ధర్మంపరిధిలో ఉంటాడు."

దైవప్రవక్త (స) ప్రవచనం:"ప్రళయదినాన కర్మవిచారణ జరిగినప్పుడు అన్నిటికంటే ముందు నమాజ్ గురించి విచారణ జరుగుతుంది. దాసులమధ్య న్యాయవిచారణ జరిగి నప్పుడు అన్నిటికంటే ముందు హత్యాభియోగం గురించి విచారణ జరుగుతుంది."

ఇప్పుడు మక్కా అవిశ్వాసుల హింసాదౌర్జన్యాలు హద్దుమీరిన తర్వాత ఆత్మరక్షణ కోసం, ధర్మపరిరక్షణ కోసం యుద్ధం చేయాలని దేవుడు శక్తి, అధికారం సంపాదించిన ముస్లింలను ఆదేశిస్తున్నాడు:

"మీతో పోరాడే వారితో మీరు (ఆత్మ రక్షణార్థం) దైవమార్గంలో పోరాడండి. అయితే హద్దుమీరకూడదు. హద్దుమీరి ప్రవర్తించేవారిని దేవుడు ఎన్నటికీ ప్రేమించడు. (యుద్ధ భూమిలో) వారు మీకు ఎక్కడ ఎదురైనా సరే వారితో పోరాడండి. వారు మిమ్మల్ని ఎక్కడ (మక్కా) నుండి వెళ్ళగొట్టారో అక్కడ నుండి మీరూ వారిని వెళ్ళగొట్టండి. హత్య తీవ్రమైన విషయమే కాని, హింసా పీడనలు అంతకన్నా తీవ్రమైన విషయాలు. వారు ప్రతిష్ఠాలయం (కాబాగృహం) దగ్గర (మీతో) పోరాడనంతవరకూ మీరు కూడా వారితో పోరాడకండి.

అయితే వారు అక్కడా కయ్యానికి కాలుదువ్వితే మీరూ వారిని నిస్సంకోచంగా ఎదుర్కొని హతమార్చండి. సత్యతిరస్కారులకు ఇదే తగినశిక్ష." (ఖుర్ఆన్-2:190-191)

మక్కాలో అవిశ్వాసులు ముస్లింల జీవితాలను దుర్భరంచేసి వారిని మక్కా వదలి మదీనా వలసపోయేలా చేశారు. కాని అక్కడా వారిని ప్రశాంతంగా ఉండనివ్వకుండా రకరకాల కుట్రలు పన్నుతూ చివరికి మదీనాపై దాడిచేయడానికి సిద్ధమయ్యారు. అప్పుడు మానవ సంస్కరణోద్యమానికి అడుగడునా ఆటంకాలు సృష్టిస్తూ, సాయుధ పోరాటానికి దిగిన సత్యవిరోధులతో మీరు సాయుధులయి పోరాడండని ముస్లింలకు ఆజ్ఞ ఇవ్వబడింది. అయితే హద్దు మీరకూడదు. హదీసుల్లోని వివరాల ప్రకారం ముస్లింలు ఈ క్రింది విషయాలు తప్పనిసరిగా పాటించాలి:

✦ఏ జాతి లేక ఏ వర్గంతోనైనా యుద్ధం చేయడానికి ముందు ఆ జాతికి లేక ఆ వర్గానికి దైవసందేశం అందజేయాలి. అది దైవసందేశాన్ని తిరస్కరించి కయ్యానికి కాలుదువ్వినప్పుడు మాత్రమే యుద్ధం గురించి ఆలోచించాలి.

✦యుద్ధం జరగాలని ఎన్నడూ కోరుకోకూడదు. యుద్ధం జరిగితే మాత్రం రణ రంగంలో స్థిరంగా ఉండి ధైర్యంగా శత్రువుల్ని ఎదుర్కోవాలి. శత్రుసైనికులు దాడికి దిగక ముందే వారిపై దాడిచేయడానికి తొందరపడకూడదు.

✦మానవ సంస్కరణోద్యమానికి ఆటంకాలు సృష్టిస్తూ, సాయుధపోరాటానికి దిగిన అవిశ్వాసులతో,వారికి సహకరించేవారితో తప్ప ఇతరులతో పోరాడకూడదు.

✦కత్తి పట్టని స్త్రీలు, పిల్లలు, వృద్ధులను, క్షతగాత్రులను వధించకూడదు. నిద్ర పోతున్న లేక ఏమరుపాటులో పడివున్న శత్రువుల్ని కూడా వధించకూడదు.

✦ వెన్నుజూపి పారిపోయేవారిని వెంటాడి చంపకూడదు.

✦విజయం సాధించిన తర్వాత పరాజిత ప్రాంతాన్ని లూటీ చేయకూడదు, విధ్వంసానికి పాల్పడకూడదు. పౌరులు, కార్మికులు, కర్షకులు, సివిల్ ఉద్యోగులు, ఆరాధనాలయాల పూజారులు-సేవకులు, సన్యాసులపై చేయి చేసుకోకూడదు.

✦శత్రువు రణరంగం నుండి పారిపోయి లేదా ఖైదు నుండి తప్పించుకుపోయి ఎక్కడైనా దాక్కుంటే, వచ్చి లొంగిపోతే అతనికి ప్రాణరక్షణ హామీ ఇస్తామని ప్రకటించినప్పుడు ప్రకటన ప్రకారం మాట నిలబెట్టుకోవాలి.

✦శత్రుసైనికుల శవాలను ముక్కలుముక్కలుగా ఖండించి లేదా కొన్ని అవయవాలు కోసిపారేసి అవమానపరచ కూడదు.

✦ పంటలను, పశువులను నాశనం చేయకూడదు.

✦ అవసరమైన మేరకే సైనికశక్తిని వినియోగించాలి.

"ప్రజలు నిన్ను పవిత్ర మాసాలలో యుద్ధం చేయడం గురించి అడుగుతున్నారు. వారికిలా తెలియజెయ్యి: "ఆ మాసాలలో యుద్ధం చేయడం ఘోరమైన విషయం. అయితే



దైవమార్గంలో అవరోధాలు సృష్టించడం, దేవుడు పంపిన సందేశాన్ని నిరాకరించడం, దైవభక్తుల్ని ప్రతిష్ఠాలయం (కాబాగృహం)లో ప్రవేశించనీయకుండా నిరోధించడం, అక్కడ ఉండేవారిని బయటికి గెంటివేయడం- ఇవన్నీ దేవుని దృష్టిలో అంతకన్నా ఘోరమైన చర్యలు. హింసా పీడనలు హత్యా రక్తపాతాల కన్నా చాలా ఘోర మైనవి. వారికి సాధ్యపడితే మిమ్మల్ని మీధర్మం నుండి మరలించేవరకు మీతో పోరాడుతూనే ఉంటారు. అప్పుడు మీలో గనక ఎవరైనా ఈ ధర్మాన్ని వదలి సత్యతిరస్కారిగా మారి, చివరికి అదే స్థితిలో చనిపోతే మాత్రం అతని ఇహపర కర్మలన్నీ వ్యర్థమైపోతాయి. ఇలాంటి ఉభయభ్రష్టులే నరకవాసులు. నరకంలోనే వారు ఎల్లకాలం పడివుంటారు." (ఖుర్ఆన్-2:217)

"దీనికి భిన్నంగా (సత్యాన్ని) విశ్వసించి, (దైవప్రసన్నత కోసం) ఊరూ, వాడా వదలి వలసపోయి దైవమార్గంలో నిరంతరం పోరాటం సలిపేవారు మాత్రమే దైవానుగ్రహాన్ని ఆశించగలరు. దేవుడు గొప్ప క్షమాశీలి, అపార దయామయుడు." (ఖుర్ఆన్-2:218)

పైసూక్తి మూలభాషలో "జిహాద్" అనే పదం ఉంది. జిహాద్ అంటే లక్ష్యసాధన కోసం సర్వశక్తులు, వనరులు వినియోగించి తీవ్రంగా కృషిచేయడం, పోరాడటం (Struggle) అని అర్థం. ఈ విస్తృత భావంలో సాయుధ పోరాటం కూడా ఉంది. అయితే కేవలం సాయుధ పోరాటం కోసం ఖుర్ఆన్‌లో "ఖితాల్" అనే పదం వాడబడింది. కనుక లక్ష్యసాధన కోసం కలంద్వారా, వాక్కుద్వారా ప్రచారంచేసే వ్యక్తి కూడా "ముజాహిద్" (యోధుడు)గానే పరిగణించబడతాడు. ఆ మార్గంలో నడవడం, శ్రమించడం, ధన కనక వస్తువుల్ని వినియోగించడం, కష్టాలు సహించడం, సవాళ్ళను ఎదుర్కోవడం, సమస్యల్ని అధికమించడం మొదలైనవన్నీ జిహాద్ పరిధిలోకే వస్తాయి.

"ఒకవేళ వారు యుద్ధం మానుకొని తిరుగుబాటు వైఖరికి స్వస్తిచెబితే, దేవుడు ఎంతో క్షమాశీలి, కరుణామయుడు. (వారి తిరుగుబాటు వైఖరిని ఆయన క్షమించ వచ్చు.) అయితే (వారు యుద్ధవిరమణ చేయని పక్షంలో) మీరు అధర్మం, అరాచకం పూర్తిగా సమసిపోయి, దేవుడు నిర్దేశించిన ధర్మపథం మాత్రమే నిలిచి పోయేవరకు వారితో పోరాడాలి. తరువాత వారు తమ ఆగడాలు మానుకుంటే, మీరు దౌర్జన్యపరుల్ని తప్ప మరెవరినీ అణచి వేయకండి." (ఖుర్ఆన్-2:192,193)

చీకటిని పారదోలడానికి వెలుగును ప్రసరింపజేయవలసి ఉంటుంది. వెలుగును ప్రసరింపజేయనిదే చీకటి ఎన్నటికీ పోదు. అదేవిధంగా శాంతి స్థాపన కోసం అశాంతి, అరాచకాలను అంతమొందించవలసిన అవసరం కూడా ఉంది. అశాంతి, అరాచకాలను అంతమొందించడానికి పోరాటం (జిహాద్) ఒక్కటే శరణ్యం. దుష్టశిక్షణ జరగనిదే శిష్ట రక్షణ ఎన్నటికీ సాధ్యం కాదు. శిష్టరక్షణ మాత్రమే కాదు. శాంతి నిలయాలైన ఆరాధనా లయాల పరిరక్షణ కూడా సాధ్యం కాదు.

"(అన్యాయంగా) దాడికి పాల్పడినవారితో పోరాడేవారికి (ఆత్మరక్షణ పోరాటానికై) అనుమతి ఇవ్వబడుతోంది. కారణం వారు చాలా పీడించబడ్డారు. వారికి దేవుడు తప్ప కుండా సహాయం చేస్తాడు. వారు తమ ఇండ్ల నుంచి అన్యాయంగా వెడలగొట్టబడ్డారు. వారు "మా ప్రభువు అల్లాహ్" అన్నంత మాత్రానికే ఇలా జరిగింది. దేవుడు గనక ప్రజలను

ఒకరిద్వారా మరొకరిని తుదముట్టించకపోతే, దేవుని పేరు అత్యధికంగా స్మరించబడే మఠాలు, మందిరాలు, చర్చీలు, మసీదులు, (ఇతర) ఆరాధనాలయాలు ధ్వంసం చేయబడే ప్రమాదం ఉంటుంది. (కనుక) దేవుడు (తన ధర్మానికి) సహాయం చేసేవారిని తప్పక ఆదుకుంటాడు. దేవుడు ఎంతో బలాఢ్యుడు, సర్వశక్తిమంతుడు.” (ఖుర్ఆన్–22:39,40)

“పరలోక జీవితం కోసం ప్రాపంచిక జీవితం అమ్మదలచుకున్నవారు దైవమార్గంలో పోరాడాలి. దైవమార్గంలో పోరాడి అమరగతినొందినా లేక విజయం సాధించినా అలాంటి వ్యక్తికి మేము గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తాము. దిక్కులేక పోవడం చూసి అణచి వేయబడ్డ స్త్రీలు, పురుషులు, పిల్లలను రక్షించడానికి మీరు దైవమార్గంలో ఎందుకు పోరాడరు? వారు (బాధలు భరించలేక) “దేవా! దుర్మార్గులు నివసిస్తున్న ఈ నగరం నుండి మమ్మల్ని బయటికి తీసి కాపాడు. మాకు రక్షణ కల్పించి అండగా నిలిచేవారి నెవరినైనా నీ వైపు నుండి మా దగ్గరికి పంపు” అని మొరపెట్టుకుంటున్నారే! అలాంటి పీడిత ప్రజల రక్షణ కోసం ఎందుకు పోరాడరు మీరు?” (ఖుర్ఆన్–4:74,75)

మక్కా, దాని పరిసర ప్రాంతాల్లో ఇస్లాం స్వీకరించి మదీనాకు వలస వెళ్ళలేక పోయిన పీడిత ముస్లింల దుస్థితి ఈ సూక్తిలో పేర్కొనబడింది. అలాంటి పీడిత ప్రజలను దౌర్జన్యపరుల కబంధహస్తాల నుండి కాపాడేందుకు ముస్లింలు యుద్ధం చేయాలని దేవుడు ఆదేశిస్తున్నాడు. ఇది ధర్మయుద్ధమని, దేవుని ప్రసన్నత కోసం జరిపే పోరాటమని ఖుర్ఆన్ తెలియజేస్తోంది.

“విశ్వాసులారా! మిమ్మల్ని దుర్భరమయిన (నరక) యాతనల నుండి కాపాడగలిగే వ్యాపార పద్ధతిని గురించి మీకు తెలుపమంటారా? మీరు మనస్ఫూర్తిగా దేవుడ్ని, ఆయన ప్రవక్తను విశ్వసించి ధనప్రాణాలు ఒడ్డి దైవమార్గంలో పోరాడండి. మీరు విషయం గ్రహించ గలిగితే అందులోనే మీశ్రేయస్సుంది.” (61:10,11); “దేవుడు తనమార్గంలో పంక్తులుతీరి దృఢమైన కాంక్రీటుగోడలా స్థిరంగా నిలచి పోరాడేవారినే ప్రేమిస్తాడు.” (ఖుర్ఆన్–61:4)

“ఎవరు సత్యాన్ని విశ్వసించి, (దేవుని ప్రసన్నత కోసం) ఊరూ, వాడా వదలి వలస పోయి దైవమార్గంలో నిరంతరం పోరాటం సలుపుతారో వారు మాత్రమే దైవానుగ్రహాన్ని ఆశించగలరు. దేవుడు గొప్ప క్షమాశీలి, అపార దయామయుడు.” (ఖుర్ఆన్–2:218)

“సత్యాన్ని విశ్వసించినవారు దైవమార్గంలో పోరాడుతారు. సత్యతిరస్కార వైఖరి అవలంబించినవారు షైతాన్‌మార్గంలో పోరాడుతారు. కనుక మీరు (దైవమార్గంలో) షైతాన్ అనుచర మూకతో పోరాడండి. షైతాన్ పన్నే కుటిల పన్నాగాలు చాలా బలహీనమైనవని తెలుసుకోండి.” (ఖుర్ఆన్–4:76)

ఆ రోజుల్లోనే ఖురైష్ నాయకుల్లో ఒకడయిన అబూసుఫ్యాన్ నాయకత్వంలో మక్కావారి వర్తకబిడారం ఒకటి పెద్దఎత్తున వ్యాపారసామగ్రితో సిరియా నుంచి బయలు దేరింది. అబూసుఫ్యాన్ వర్తకబిడారాన్ని ముస్లింలు అడ్డుకుంటారేమోనని భయపడి, సహాయం కోసం ఒక మనిషిని మక్కా పంపాడు. అతను మక్కా వచ్చి బిడారం మీద ముస్లింలు దాడిచేయడానికి వస్తున్నారని, వెంటనే సహాయం చేయడానికి బయలు దేరాలని ఖురైష్ నాయకుల్ని ఉసిగొల్పాడు.



అప్పుడు మరో నాయకుడు అబూజహల్ వేయిమంది సైనికులతో మక్కా నుండి బయలుదేరాడు. ఈ సంగతి తెలిసి దైవప్రవక్త (సల్లం) కూడా 312 మంది యోధులతో మదీనా నుండి బయలుదేరారు. అబూసుఫ్యాన్ ముస్లింల దాడి నుంచి తప్పించుకోవ డానికి మదీనా సమీపం నుండి వెళ్ళే సాధారణ మార్గం తప్పించి వేరేమార్గం గుండా సురక్షితంగా మక్కా చేరుకున్నాడు. వర్తకబిడారం సురక్షితంగా మక్కా చేరుకున్నదని, సైన్యాన్నిక మక్కాకు తిప్పి తీసికెళ్ళమని అతను అబూజహల్‌కు కబురు పంపాడు. కాని అబూజహల్ తన సైనికసంఖ్యను, ఆయుధశక్తిని చూసుకొని విర్రవీగుతూ అతని మాటలు ఖాతరుచేయకుండా ముందుకుసాగాడు. ముస్లింలు మక్కావారి వ్యాపార బిడారాన్ని అడ్డుకోవడానికి పాల్పడకపోయినా, మక్కాఖురైషీయులు ఇలా ముస్లింలపై దాడిచేసి ఇస్లాంను శాశ్వతంగా అంతమొందించాలన్న లక్ష్యంతో 1000 మంది సైనికు లతో మదీనా దిశగా బయలుదేరారు.

# 11. సమర సన్నాహాలు

మక్కా అవిశ్వాసులు మదీనాపై దాడిచేయడానికి బయలుదేరారనే వార్త విని ఇస్లాం ఉద్యమ వైతాళికుడు ముహమ్మద్ (స) కర్తవ్యాన్ని గురించి ఆలోచించసాగారు.

ఉపద్రవం మెరుపువేగంతో ముంచుకొస్తోంది. ఈ పరిస్థితిలో దుష్టులను ధైర్యంగా ఎదుర్కోకపోతే ఇస్లామీయ ఉద్యమం శాశ్వతంగా నిర్వీర్యమైపోతుంది. మదీనాలో ముహాజిర్ల జీవన పరిస్థితులు మెరుగుపడలేదు. అటు అన్సారులకు ధార్మిక జీవితంలో వచ్చే వడిదుడుకుల్ని తట్టుకొని సుశిక్షితులయ్యే అవకాశం ఇంకా సరిగా లభించలేదు.

మరోవైపు యూదులు హద్దుమీరిన విరోధంతో కత్తులు నూరుతున్నారు. అంతకంటే ప్రమాదకరమైన వాళ్ళు ముస్లింలుగా నటిస్తున్న వంచకులు. వీరు ముస్లింలలో కలసి ఉంటూ క్షణానికో రంగుమారుస్తూ చీడపురుగుల్లా అంతర్గత ప్రమాదాన్ని తెచ్చిపెడ్తున్నారు. ఇలాంటి పరిస్థితిల్లో ఖురైషీయులు మదీనాపై దాడిచేస్తే ప్రస్తుతం ఉన్న కొద్దిమంది ముస్లింలు అంతమయ్యే ప్రమాదం లేకపోలేదు. ఒకవేళ వారు మదీనా మీద దాడి చేయకుండా సైనిక బలప్రదర్శనతో తమ వాణిజ్య బృందాన్ని తప్పించి సురక్షితంగా తీసి కెళ్ళినా, ముస్లింలు తమ ప్రత్యర్థుల్ని ఎదుర్కోలేని పిరికిపందలని దేశంలో అపహాస్యం పాలు కావలసివస్తుంది. వారి ప్రభావం పూర్తిగా అడుగంటి పోతుంది.

అక్కడితో ఆ విషయం ఆగిపోదు. మదీనా దరిదాపుల్లో ఉన్న తెగలన్నీ ఖురైషీయుల అండతో ముస్లింల మీద విజృంభిస్తాయి. మదీనాలోని బహుదైవారాధకులు, యూదులు, కపటముస్లింలు స్వైరవిహారం చేస్తారు. అప్పుడు ముస్లింలకు ఊపిరి పీల్చుకోవడం కూడా దుర్భరమవుతుంది. ఈ పరిస్థితిలో అటు వర్తకబృందాన్ని అడ్డుకోవడమో లేదా యుద్ధరంగంలోకి దిగి ఖురైషీయులతో ఢీకొనడమో చెయ్యాలి.

ఈ ఆలోచనతో దైవప్రవక్త (స) వెంటనే అనుచరుల్ని సమావేశపరచారు. పరిస్థితుల స్వరూపాన్ని వివరించి “ఒకవైపు ఉత్తరాన ఖురైషీయుల వర్తకబిడారాలు ఉన్నాయి. మరోవైపు దక్షిణాన వారి సైన్యం వస్తోంది. ఈ రెండింటిలో ఏదో ఒకటి మనకు లభిస్తుందని

దేవుడు వాగ్దానం చేశాడు. కనుక ఎటు పోదామో చెప్పండి'' అని అడిగారు.

కొందరు వాణిజ్యబృందం ఉన్న వైపుకెళ్దాం అన్నారు. కాని దైవప్రవక్త (స)కు అందులో ఔచిత్యం ఉన్నట్లు కన్పించలేదు. అంచేత ఆయన మళ్ళీ అదే ప్రశ్న అడిగారు.

"మీ చేతుల్ని (యుద్ధం చేయకుండా) కాస్త ఆపివుంచండి, నమాజ్ స్థాపించండి, జకాత్ చెల్లించండి" అని (లోగడ) ఆదేశించినవారిని నీవు గమనించావా? ఇప్పుడు వారిని (దైవమార్గంలో) పోరాడమని ఆజ్ఞాపిస్తే వారిలో కొందరు దేవునికి భయపడినట్లు (శత్రు)జనాన్ని చూసి భయంతో వణికిపోతున్నారు. అంతకంటే ఎక్కువే భయపడిపోతున్నారు. పైగా వారు "దేవా! (అప్పుడే) ఈ యుద్ధాజ్ఞను మాపై ఎందుకు విధించావు? మరికొంత అవకాశం ఎందుకివ్వలేదు?" అని వాపోయారు. వారికి చెప్పు: ఈ ప్రాపంచిక సౌఖ్యాలు క్షణభంగురం. భక్తిపరాయణులకు పరలోకజీవితమే శ్రేష్ఠమైనది, శాశ్వతమైనది.... మృత్యు విషయానికొస్తే, అది మీరు ఎక్కడున్నా, ఎట్టి పరిస్థితిలో వున్నా, చివరికి మీరు పటిష్ఠమైన భవనాల్లో వున్నాసరే వచ్చి తీరుతుంది. దాన్ని ఎవరూ అడ్డుకోలేరు." (ఖుర్ఆన్-4:77,78)

వాస్తవ పరిస్థితి అర్థం చేసుకున్న హజ్రత్ అబూబకర్ (రజి) లేచి ఇలా అన్నారు:

''మక్కాలో ఉన్నంతకాలం ఖురైషీయులు మనకు దారుణమైన చిత్రహింసలు పెట్టారు. వారి దౌర్జన్యకాండ భరించలేక ఇల్లూవాకిలి వదలివస్తే, ఇక్కడా మనల్ని వదలి పెట్టడంలేదు. అలాంటివారిని ఇక సహించకూడదు. మనం ఖురైష్‌సైన్యం వస్తున్న దిశకే వెళ్దాం. దైవప్రసన్నత కోసం, ధర్మరక్షణ కోసం ప్రాణాలైనా త్యజించి పోరాడుదాం.''

తరువాత హజ్రత్ ఉమర్ (రజి) అబూబకర్ (రజి) అభిప్రాయంతో ఏకీభవిస్తూ మాట్లాడారు. ఆ తరువాత హజ్రత్ మిఖ్దాద్ (రజి) లేచి నిల్చున్నారు.

''దైవప్రవక్తా! విశ్వప్రభువు మిమ్మల్ని ఎటుపొమ్మని ఆజ్ఞాపిస్తే అటే పదండి. మేమంతా మిమ్మల్ని అనుసరిస్తాం. ఇస్రాయీలీయులు తమ ప్రవక్తతో అన్నట్లు 'నీవు, నీదేవుడు వెళ్ళి పోరాడండి, మేమిక్కడే కూర్చొని ఉంటాం' అని మేము అనేవాళ్ళం కాము. 'మేము మీవెంట ఉండి చివరి రక్తబిందువు చిందేవరకు యుద్ధం చేస్తాం' అనంటాం మేము.''

హజ్రత్ మిఖ్దాద్ (రజి) పలుకుల్లో యూదుల పిరికితనం వెల్లడవుతోంది. ఇక్కడ మూసా ప్రవక్త (అలైహి) నిర్యాణం తరువాత యూదుల వైఖరి ఏమిటో ప్రస్తావించడం కూడా సందర్భోచితంగా ఉంటుంది. ఖుర్ఆన్‌లోని ఈ సూక్తి చూడండి:

"మూసా తర్వాత ఇస్రాయీల్‌సంతతి నాయకులకు ఎదురైన పరిస్థితులు తెలుసా నీకు? వారు (అప్పటి)తమ ప్రవక్త దగ్గరకెళ్ళి "మేము దైవమార్గంలో యుద్ధం చేయడానికి వీలుగా మాకు సారథ్యం వహించేందుకు ఒక రాజును నియమించు" అని విన్నవించుకున్నారు. దానికి దైవప్రవక్త "(సరే, నియమిస్తా.) కాని తీరా మిమ్మల్ని యుద్ధం చేయమని ఆదేశిస్తే మీరు నిరాకరిస్తారేమో!" అన్నాడు. "అదెలా! మమ్మల్ని మా ఇండ్లనుండి వెళ్ళగొట్టారు. మా పిల్లాజెల్లల్ని మాకు దక్కకుండా చేశారు. అలాంటప్పుడు మేము దైవమార్గంలో యుద్ధం ఎందుకు చేయం?"అన్నారు వారు. కాని తీరా యుద్ధంచేయమని ఆజ్ఞకాగానే కొందరుతప్ప అందరూ వెన్నుజూపి పారిపోయారు. దుర్మార్గుల సంగతి దేవునికి బాగాతెలుసు." (2:246)



మిఖ్దాద్ (రజి) వీరోచిత పలుకులు విని దైవప్రవక్త (స) ముఖపద్మం వికసించింది. తరువాత ఆయన ఇతర అనుచరుల వైపు చూస్తూ ''మీరు కూడా ఏదైనా మాట్లాడండి'' అన్నారు. అన్సారులు ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని దైవప్రవక్త (స) తమను ఉద్దేశించే అడుగుతున్నారని భావించారు. అప్పుడు హజ్రత్ సాద్ (రజి) ఇలా ప్రసంగించారు:

''నేనిప్పుడు అన్సారులందరి తరపున మాట్లాడుతున్నాను. దైవప్రవక్తా! మేము మిమ్మల్ని హృదయపూర్వకంగా విశ్వసించాం. మీ ప్రవచనాలు సత్యం, ధర్మం అని సాక్ష్యమిచ్చాం. మీ అమృతవాక్కులే మాకు శిరోధార్యాలని నమ్మేం. మీ విధేయతా ప్రతిజ్ఞ కూడా చేశాం. దైవప్రవక్తా! మీరిప్పుడు ఏది నిర్ణయిస్తారో దానికోసం నిస్సంకోచంగా ముందడుగు వేయండి. మేమంతా మిమ్మల్ని అనుసరిస్తూ మీవెంటే ఉంటాం.

దైవసాక్షిగా చెబుతున్నాను. మీరు మమ్మల్ని తీసుకొని సముద్రంలోకి దూకినా అందుకు మేము సిద్ధంగా ఉన్నాం. మాలో ఏ ఒక్కడూ వెనుకంజ వేసేవాడు కాడు. మీరు తలచిన వారితో యుద్ధం చేయండి. అన్నిటికీ మేము సిద్ధమే. నేనా దారిన ఎప్పుడూ ప్రయాణించి ఉండలేదు. దాన్ని గురించి నాకు తెలియదు. అయితే మేము శత్రువులకు వెన్నుజూపి పారిపోయే పిరికిపందలం కాము. యుద్ధరంగంలో దిగితే ప్రాణాలైనా బలిపెట్టి నిలుస్తాం. దైవచిత్తమయితే మా బలపరాక్రమాలు మీరే చూస్తారు.''

హృదయాంతరాళం నుంచి వెలువడిన ఈ వీరోచిత ప్రసంగం విని సత్యధర్మ వైతాళికుని మనోసాగరం ఆనందాతిశయంతో ఉప్పొంగిపోయింది.

హజ్రత్ సాద్ (రజి) చేసిన ప్రసంగం తరువాత దైవప్రవక్త (సల్లం) చివరి పలుకులుగా ''మిత్రులారా! దైవనామం స్మరించి బయలుదేరండి. మనపై దేవుని కరుణాకటాక్షాలు ఎంతగానో ఉన్నాయి. ఆయన నాకు పెద్ద సమూహం (సైనిక సమూహం) గురించే వాగ్దానం చేశాడు. యుద్ధానికి సిద్ధంకండి'' అని చెప్పారు.

"రెండు వర్గాలలో ఒక వర్గం మీకు చేజిక్కుతుందని దేవుడు మీకు వాగ్దానం చేశాడు. ఆ సందర్భం కాస్త గుర్తుకు తెచ్చుకోండి. అప్పుడు మీరు (ఆయుధాలు లేని) బలహీన (వ్యాపార) వర్గం మీకు చేజిక్కితే బాగుంటుందని భావించసాగారు. కాని దేవుడు తన ఆదేశాలతో సత్యాన్ని సత్యంగా నిరూపించదలిచాడు. అంతేకాకుండా నేరస్థులకు ఎంత వెగటు అన్పించినా సత్యం సత్యంగా, అసత్యం అసత్యంగా రుజువు కావడానికి ఆయన అవిశ్వాసుల్ని పూర్తిగా తుడిచి పెట్టాలని కూడా సంకల్పించుకున్నాడు." (ఖుర్ఆన్-8:7,8)

"మీరు (దైవమార్గంలో) విధిగా యుద్ధం చేయాలని ఆజ్ఞ అయింది. కాని అది మీకు రుచించడంలేదు. ఒక విషయం మీకు నచ్చక పోవచ్చు. కాని అందులోనే మీ శ్రేయస్సు ఉండవచ్చు. అలాగే ఒక విషయం మీకు నచ్చవచ్చు. కాని అందులోనే మీకు హాని ఉండవచ్చు. (మంచీచెడులు) దేవునికే బాగా తెలుసు, మీకు తెలియదు." (ఖుర్ఆన్-2:216)

జిహాద్ అనుమతి లభించగానే ముస్లింలు యుద్ధసన్నాహాలలో నిమగ్నులైపోయారు. కాని చాలీచాలని ఒనరులతో ఖురైషీయులతో తలపడటం అంటే మాటలా? సైనికులందరికీ కలిపి మూడు గుర్రాలు, డెబ్భయి ఒంటెలు మాత్రమే ఉన్నాయి. ఒక్కొక్క ఒంటె

మీద ముగ్గురు నలుగురు చొప్పున కూర్చోవలసి వచ్చింది. దైవప్రవక్త (స) కూర్చున్న ఒంటె మీద కూడా మరో ఇద్దరు యోధులు కూర్చున్నారు. అప్పటికీ వాహనాలు సరిపడక అనేకమంది కాలినడకన బయలుదేరారు. ఆయుధాలు కూడా అంతంత మాత్రమే ఉన్నాయి. ఖడ్గం ఉంటే బల్లెం లేదు; బల్లెం ఉంటే ఖడ్గం లేదు. ధనుర్బాణాలు కూడా తగినన్ని లభించలేదు. అంతేకాదు, అనేకమంది యోధులు కడుపునిండా తిండి లభించని కారణంగా బక్కచిక్కిన శరీరాలతో కూడా ఉన్నారు.

"ప్రవక్తా! విశ్వాసుల్ని యుద్ధానికి ప్రేరేపించు. మీలో ఇరవైమంది స్థిరంగా నిలబడే వారుంటే వారు రెండొందల మందిని జయించగలరు. అలాంటి యోధులు వందమంది ఉంటే వారు వేయిమంది సత్యతిరస్కారుల్ని జయించగలరు. దీనిక్కారణం సత్యతిరస్కారులకు అవగాహనా శక్తి కొరవడటమే. ప్రస్తుతం దేవుడు మీ భారం తేలికగా చేశాడు. మీలో ఇంకా బలహీనత ఉందని ఆయనకు తెలుసు. కనుక మీలో స్థిరంగా నిలబడే వారు వందమంది ఉంటే వారు రెండొందల మందిని, వేయిమంది ఉంటే రెండువేల మందిని దైవాజ్ఞతో జయించగలరు. అయితే స్థిరంగా నిలబడి ధైర్యంగా పోరాడేవారికే దేవుడు తోడుగా ఉంటాడు." (దివ్యఖుర్ఆన్-8:65,66)

ఇలాంటి విపత్కర సమయంలో యుద్ధరంగంలో దిగటమంటే మృత్యువుని కొనితెచ్చుకోవడమే. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇస్లాం రక్షణ కోసం ఖడ్గం చేపట్టడం తప్ప గత్యంతరం లేదు. అందువల్ల దైవప్రవక్త (స), ఆయన అనుచరులు దైవం మీద భారం వేసి హిజ్రీశకం 2వ సంవత్సరం రమజాన్ నెలలో రణరంగానికి బయలుదేరారు.

## 12. మక్కా ఖురైషీయుల దండయాత్ర

అటు మక్కా నుండి దాదాపు వేయిమంది అవిశ్వాసులు యుద్ధానికి సిద్ధమయ్యారు. వారికి వంద గుర్రాలు, ఏడు వందల ఒంటెలు కూడా సమకూరాయి. కాల్బల సైనికులు ధగధగ మెరిసిపోయే ఉక్కు కవచాలు ధరించారు. సైనికుల్ని ఉద్రేకపరచడానికి పరుషపదాలతో పాటలుపాడే పడతులు కూడా వెంట ఉన్నారు. ఉత్సాహంతో రొమ్ములు విరుచుకొని సమర వాయిద్యాలతో, దిక్కులు పిక్కటిల్లే నినాదాలతో అట్టహాసంగా బయలుదేరారు మక్కా బహుదైవారాధకులు. దారిలో ఎక్కడ ఒయాసిస్సు కన్పిస్తే అక్కడ మజిలీ చేసి సేద తీర్చుకుంటూ, సారా సేవిస్తూ, ప్రతీకారంతో పళ్ళు నూరుతూ ఒక్కొక్క మజిలీ దాటుకుంటూ బదర్ ప్రాంతంలోని యుద్ధ రంగానికి చేరుకున్నారు.

"కొందరు అహంకారంతో విర్రవీగుతూ, పటాటోపం ప్రదరిస్తూ తమ ఇండ్ల నుండి (యుద్ధానికి) బయలుదేరుతారు. అలాంటి (అవిశ్వాసుల)వైఖరి మీరు ఎన్నటికీ అవలంబించకండి. వారు (ప్రజల్ని) దైవమార్గం నుండి నిరోధిస్తుంటారు." (ఖుర్ఆన్-8:47)

బదర్‌లో ఖురైష్ సైనికులు ముందుగానే ఎత్తయిన కీలక ప్రదేశాలన్నీ ఆక్రమించుకొని ముస్లింల మీద విరుచుకుపడేందుకు సిద్ధమవుతున్నారు. ముస్లిం యోధులు వారికి దిగువ భాగాన ఇసుక ప్రదేశంలో స్థావరం ఏర్పరచుకున్నారు.

సంవత్సరాల తరబడి వర్షం కురవని ఆ ఎడారి ప్రాంతంలో ఆరోజు రాత్రి వర్షం



కురిసింది. ముస్లిం సైనికులు వెంటనే లేచి నేల మీద చిన్న చిన్న మళ్ళు చేసి వర్షపు నీటిని ఆపుకున్నారు. ఇసుకనేల కావడం వల్ల పొడిపొడిగా ఉన్న ఇసుకంతా పేరుకొని నేల గట్టిపడింది. ఇప్పుడు సులభంగా తిరగడానికి నేల అనుకూలంగా మారింది.

అయితే ఖురైషీయులు శిబిరాలు వేసుకున్న మట్టి ప్రదేశం బురద బురదగా మారింది. వారు తమకు అనుకూలంగా ఉందనుకున్న గట్టినేల చివరకు ఇలా రొతగా తయారయింది. పైగా అది జారుతూ కాలుతీసి పెట్టాలంటే భయంగా ఉంది. అనుకోని ఈ హఠాత్పరిణామానికి శత్రువులు కంగారుపడసాగారు.

"మీరు నిర్భయంగా, నిశ్చింతగా ఉండేందుకు దేవుడు మీపై ఒకవిధమైన మైకం ఆవహింపజేసినప్పటి సందర్భం: మీమీద షైతాన్ పడవేసిన మాలిన్యం తొలగించి మిమ్మల్ని పరిశుద్ధపరచడానికి, మీలో ధైర్యసాహసాలు జనింపజేసి మీ కాళ్ళకు స్థిరత్వం కలిగించడానికి ఆయన ఆకాశం నుండి మీమీద వర్షం కురిపించాడు." (ఖుర్ఆన్-8:11)

దైవసందేశహరుడు (సల్లం) కొందరు అనుచరుల్ని పిలుచుకొని పోయి యుద్ధరంగం చూపిస్తూ, ఇక్కడ ఫలానా శత్రువు వధించబడతాడు; అక్కడ ఫలానా శత్రువు ప్రాణం వదుల్తాడు" అని చెప్పారు. అనుచరులు సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ దేవుడు తమకీ విజయం తప్పకుండా చేకూరుస్తాడన్న అనుభూతితో పొంగిపోయారు.

ముస్లిం యోధులు నూతనుత్సాహంతో రణరంగంలో దూకడానికి నడుం బిగించారు. దైవప్రవక్త (సల్లం) తన అనుచరుల్లో జనించిన ఈ ఉత్సాహం గమనిస్తూ చేతులు జోడించి ఇలా ప్రార్థించారు: "దేవా! ఈ ఖురైష్‌అవిశ్వాసులు మిడిసిపడుతూ నీదాసుల మీదికి యుద్ధం చేయడానికి వచ్చారు. నీ ధర్మాన్ని తుడిచిపెట్టేందు కంకణం కట్టుకున్నారు. నీ ప్రవక్తను చంపడానికి సిద్ధమయ్యారు. ప్రభూ! నీవు మాకు సహాయం చేస్తానని మాటిచ్చావు. నీ వాగ్దానం నెరవేర్చుకో. ఈరోజు ఈ కొద్దిమంది దాసులు కూడా అంతమయిపోతే ఇక ప్రళయం వరకూ నిన్ను ఆరాధించే నిజమైన దాసులుండరు."

"నీవు నీ ప్రభువుని వేడుకుంటున్నప్పటి సందర్భం – దానికి సమాధానంగా ఆయన (ముస్లింలకు ధైర్యం చెబుతూ) "నేను మీకు సహాయంగా ఒకరి తరువాత మరొకరు చొప్పున వేయిమంది దైవదూతల్ని పంపిస్తున్నాను" అన్నాడు. మీ మనస్సులు కుదుటపడేందుకు దేవుడీ విషయాన్ని మీకు శుభవార్తగా తెలియజేశాడు. సహాయం ఎప్పుడు లభించినా, ఏ రూపంలో లభించినా అది దేవుని దగ్గర్నుండే లభిస్తుంది. దేవుడు ఎంతో శక్తిమంతుడు, వివేకవంతుడు." (ఖుర్ఆన్-8:9,10)

ఎంత విచిత్ర సన్నివేశం! ఒక వైపు దైవధిక్కారులు ప్రపంచమే సర్వస్వం అని, ప్రాపంచిక ఒనరులే విజయసాధనకు మూలకారణమని తలచి, తమ సైనికసంఖ్య, ఆయుధశక్తి చూసుకొని విర్రవీగిపోతుంటే, మరోవైపు దైవప్రవక్త (సల్లం) అసలు జీవితం పరలోక జీవితమని, ఇహలోక ఒనరులు దైవాభీష్టానికి సాధనాలు మాత్రమేనని, జయాపజయాలు దేవుని అధీనంలో ఉంటాయని విశ్వసిస్తూ చేయవలసిన ప్రయత్నాలన్నీ చేసి కూడా దేవుని కటాక్షం కోసం కన్నీటి ధారలతో మొరపెట్టుకుంటున్నారు!!

# 13. దైవ సహాయం

హిజ్రీ 2వ సంవత్సరం, రమజాన్ నెల 17వ తేది శుక్రవారం రోజు విశ్వాసులు, అవిశ్వాసుల మధ్య సంకుల సమరం జరిగింది.

మదీనా నుండి కొందరు బహుదైవారాధకులు యుద్ధం తీరు చూడటానికి యుద్ధ మైదానికి వచ్చారు. వారు బద్ర్‌కొండ మీద నిలబడి చూడసాగారు. కాస్సేపటికి ఆకాశంలో వారి పైనుండి ఒక మబ్బుతునక గుర్రాల సకిలింపులు, గిట్టల చప్పుళ్ళతో రివ్వున యుద్ధ మైదానం వైపు దూసుకుపోయింది. అందులో నుండి "తొందరగా ముందుకు సాగండి" అనే ఓ కంఠస్వరం కూడా వారికి విన్పించింది.

ఈ విచిత్ర ధ్వనులు విని బహుదైవారాధకులు తీవ్రమైన భయంతో కంపించి పోయారు. వారిలోఒకడు ఆ భయంతోనే నిలువుగుడ్లు వేసి ఊపిరి విడిచాడు. ఆ తర్వాత మిగిలిన వాళ్ళు అక్కడ్నుంచి మదీనా వైపు పరుగెత్తారు. దేవుడ్ని, ఆయన ప్రవక్త (స)ను దృఢంగా విశ్వసించి, వారి ఆజ్ఞలను పాటించేవారికి దేవుడు తప్పకుండా సహాయం చేస్తాడు. బదర్ యుద్ధంలో అవిశ్వాసులు గమనించిన దైవసహాయం అదే.

"నీప్రభువు తన దూతలకు ప్రత్యేకసూచనలు ఇచ్చిన సందర్భంలో వారితో ఆయన 'నేను మీవెంట ఉంటాను. మీరు విశ్వాసుల్ని స్థిరంగా ఉంచండి. నేనూ అవిశ్వాసుల గుండెల్లో బెదురు పుట్టిస్తాను. మీరు వారి మెడలపై, కీళ్ళపై వ్రేటు వేస్తూఉండండి' అన్నాడు. కారణం-వారు దేవునిపై, ఆయన ప్రవక్తపై తిరగబడ్డారు." (ఖుర్ఆన్-8:11-13)

"నిజానికి వారిని వధించింది మీరుకాదు; దేవుడే వారిని వధించాడు. అలాగే వారిపై (ఇసుక మంత్రించి) విసిరేసింది నీవు కాదు; దేవుడే విసిరేశాడు. విశ్వాసుల్ని ఒక మంచిపరీక్ష నుండి విజయవంతంగా గట్టెక్కించడానికే దేవుడు ఈవిధంగా చేశాడు." (ఖుర్ఆన్-8:17)

బదర్‌యుద్ధంలో 313మంది విశ్వసుల చేతిలో 1000మంది అవిశ్వాసులు చిత్తుగా ఓడిపోయారు. పెద్దపెద్ద నాయకులతో సహా శత్రుసైనికులు అనేకమంది వధించబడ్డారు. కొంతమంది ఖైదీలుగా పట్టుబడ్డారు. మిగిలినవారు ముస్లింల ధాటికి నిలువలేక కొన ఊపిరితో పడివున్న తమ నాయకుడ్ని సైతం వదిలేసి కాలికి బుద్ధి చెప్పారు.

"పరస్పరం తలపడిన రెండు వర్గాలలో గుణపాఠం గరిపే చిహ్నాలు మీకు ఇదివరకే (బద్ర్ యుద్ధంలో) గోచరించాయి. అందులో ఒకవర్గం దైవమార్గంలో పోరాడేవారిది. రెండో వర్గం అవిశ్వాసులది. చూసేవారు కళ్ళారా ఆ దృశ్యాన్ని చూశారు. అప్పుడు అవిశ్వాసుల వర్గం విశ్వాసుల వర్గానికి రెట్టింపు సంఖ్యలో ఉందని వారు గ్రహించారు. దేవుడు తాను తలచుకున్నవారిని తన సహాయసహకారాల ద్వారా బలోపేతం చేస్తాడు. కళ్ళున్నవారికి ఈ సంఘటనలో గొప్ప గుణపాఠం ఉంది." (ఖుర్ఆన్-3:13)

బద్ర్‌యుద్ధంలో శత్రు సైనికులు వేయిమంది ఉంటే, ముస్లిం యోధులు 313 మంది మాత్రమే ఉన్నారు. శత్రు సైనికులందరికీ సరిపడ వాహనాలు ఉన్నాయి. ముస్లిం యోధులకు రెండు గుర్రాలు, డెబ్భయి ఒంటెలు మాత్రమే ఉన్నాయి. ఒక్కొక్క ఒంటెపై ముగ్గురు, నల్గురు చొప్పున కూర్చొని ప్రయాణం చేయవలసి వచ్చింది. అప్పటికీ



కొందరు కాలినడక సాగించవలసి వచ్చింది. శత్రువులు ఖరీదైన శిరస్త్రాణాలు, యుద్ధ కవచాలు ధరించిఉంటే, ముస్లింలు చాలీచాలని ఆయుధాలతో రణరంగంలోకి దిగ వలసివచ్చింది. శత్రుసైనికులు కండలు తిరిగిన బలాఢ్యులు కాగా, ముస్లింయోధులు దారిద్ర్యం వల్ల నకనకలాడే కడుపులతో, బక్కచిక్కిన శరీరాలతో ఉన్నారు. శత్రువులు తమ సైనికసంఖ్యను, ఆయుధశక్తిని చూసుకొని విర్రవీగుతూ, హూంకరిస్తూ, ఈలలు వేస్తూ, సారా సేవిస్తూ, పడతులచేత పాటలు పాడించుకుంటూ, ప్రతీకారంతో ఉడికి పోతూ రంగంలోకి దిగారు. ముస్లిం యోధులు ధర్మసంస్థాపనా లక్ష్యంతో, దేవుని మీద భారం వేసి, ఆయన్ని అనుక్షణం స్మరిస్తూ, ప్రార్థనలు చేస్తూ, ఉపవాసాలు పాటిస్తూ యుద్ధమైదానంలోకి అడుగుపెట్టారు. దీన్నిబట్టి ఈరెండు పక్షాలలో ఏపక్షం సన్మార్గంలో ఉందో; న్యాయం, ధర్మం ఎవరి పక్షాన ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

విజయం ముస్లిం యోధుల్ని వరించింది. మహాప్రవక్త (సల్లం) కృతజ్ఞతా భావంతో దేవుని సన్నిధిలో సాష్టాంగపడ్డారు. ధర్మం గెలిచింది. అధర్మం పలాయనం చిత్తగించింది. ఆయుధాలు పుష్కలంగాఉన్నా, అత్యధిక సైనికబలమున్నా అవిశ్వాసులు డెబ్భయి మందికి పైగానే వధించబడ్డారు. మరో డెబ్భయి మంది ఖైదీలుగా పట్టుబడ్డారు. కాని సరైన ఆయుధాలు, కావలసినన్ని ఒనరులు, తగిన సదుపాయాలు లేకపోయినా దైవం మీద చెక్కుచెదరని విశ్వాసంతో వచ్చిన ముస్లింయోధుల్లో పధ్నాలుగు మంది మాత్రమే వీరమరణం పొందారు.

ముస్లింలు ఖైదీలను తీసుకొని విజయోత్సాహంతో మదీనా తిరిగొచ్చారు. మరుసటి రోజు దైవప్రవక్త (సల్లం) ఆదేశం ప్రకారం యుద్ధ ఖైదీలను మస్జిదె నబవీ స్తంభాలకు కట్టివేశారు. అప్పటికి చీకటి పడటం వల్ల వారి దగ్గర కాపలా కోసం కొందరు సైనికులు ఉండి మిగిలినవారంతా ఇండ్లకు వెళ్ళిపోయారు. దైవప్రవక్త (సల్లం) కూడా ఆ రాత్రి ఇషా నమాజ్ ముగించుకొని నిద్రకు ఉపక్రమించారు.

# 14. యుద్ధఖైదీల సమస్య

నడిరేయి దాటింది. యుద్ధఖైదీలున్న చోటు నుంచి మూల్గుడు విన్పించడంతో అక్కడ సమీపంలోనే నిద్రపోతున్న దైవప్రవక్త (సల్లం) మేల్కొన్నారు. పోయి చూస్తే, బిగువుగా కట్టిన త్రాళ్ళ వల్ల యుద్ధ ఖైదీలు బాధతో మూలుగుతున్నారు. కారుణ్యమూర్తి (సల్లం) హృదయం కరిగిపోయింది. అలా బాధపడుతున్న వారిలో పినతండ్రి అబ్బాస్ కూడా ఉన్నారు. సహజమైన బంధుప్రేమ పెల్లుబికింది. ఆయన పినతండ్రి వైపు జాలిగా చూశారు. దైవప్రవక్త (సల్లం) పరిస్థితి అర్థంచేసుకున్న అనుచరులు వెంటనే అబ్బాస్ కట్లు వదులుచేశారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) అందరి కట్లు కూడా వదులుచేయమని అన్నారు. అనుచరులు ఖైదీలందరి కట్లు వదులుచేసి ప్రశాంతంగా పడుకోవడానికి వీలుకల్పించారు. దాంతో కారుణ్యమూర్తి (సల్లం) హృదయం కుదుటపడింది.

తెల్లవారింది. దైవప్రవక్త (స) యోధుల్ని పిలిచి తాత్కాలికంగా ఖైదీలను తమ అధీనం లో ఉంచుకోమని చెప్పారు. యుద్ధఖైదీలు గెలిచినయోధుల అధీనంలో బానిసలుగా ఉండటమనేది పూర్వంనుంచీ వస్తున్న ఆచారం. అయితే ఖైదీల పట్ల సద్వర్తనంతో

మెలగాలని దైవాదేశం. దానిప్రకారం ఇస్లాం పొడగిట్టని పరమ దుర్మార్గులైనా, అష్టకష్టాలు పెట్టి జన్మభూమి నుంచి వెడలగొట్టిన వారైనా గతాన్ని త్రవ్వకుండా యుద్ధఖైదీల పట్ల మృదువుగా వ్యవహరించాలని దైవప్రవక్త (స) అనుచరులకు హితవుచేశారు. వారికి ఆహార, వస్త్రాల లోటు రానీయకుండా చూడాలని, జబ్బుపడితే చికిత్స చేయించాలని, ఇతర ముఖ్యావసరాలు కూడా స్తోమతను బట్టి తీర్చాలని నొక్కి చెప్పారు.

దైవప్రవక్త (సల్లం) ఆదేశాలు శిరసావహించడం కంటే ముస్లింలకు కావల్సిన పుణ్యం ఏముంటుంది? అందరూ సంతోషంగా తమతమ ఖైదీలను తీసుకొని వెళ్ళిపోయారు.

ఖైదీలలో కొందరు ముస్లింల బంధువులు కూడా ఉన్నారు. కాని వారి బంధుప్రేమ ఇస్లాం మీదున్న అభిమానాన్ని ఏమాత్రం సడలించలేక పోయింది. ఒక యోధునికి అబూ అజీజ్ అనే ఖైదీ లభించాడు. అతని సోదరుడు ముస్లింగా మారి మదీనాలో ఉంటున్నాడు. అబూఅజీజ్ అన్న అక్కడికి వచ్చి "ఈ ఖైదీపై గట్టి నిఘావేసి ఉంచు. అవసరమైతే వత్తిడి కూడా చెయ్యి ఇతని తల్లి గొప్ప ధనికురాలు. నష్టపరిహారం రూపంలో నీకు చాలా పైకం లభిస్తుంది" అన్నాడు అన్సార్ యోధునితో.

అబూఅజీజ్ విస్తుబోయాడు. "అన్నయ్యా! నీవు నా సొంత తమ్ముడవైవుండి కూడా నాపట్ల చూపే ఆపేక్ష ఇదేనా?" అన్నాడు అన్న వైపు కొరకొర చూస్తూ.

కాని ఆ అన్సార్‌యోధుడు అలా చేయలేదు. అబూఅజీజ్‌ని తనకంటే కూడా మిన్నగా చూసుకోసాగాడు. ఒక్కోసారి ఇంట్లో భోజనం సరిపడకపోతే తను ఖర్జూర పండ్లు తిని ఖైదీకి తృప్తిగా భోజనం పెట్టేవాడు. ఖైదీగా వచ్చిన అబూఅజీజ్ తన యజమాని కన్నా ఎక్కువ సుఖం అనుభవిస్తున్నాడు. యజమాని చూపుతున్న అసామాన్య ఔదార్యం, మంచితనాలు చూసి అతను సిగ్గుపడి పోయేవాడు.

ఆ మాటకు వస్తే ఆ ఒక్క అన్సార్‌యోధుడే కాదు, బదర్ యుద్ధవీరులంతా తమ తమ అధీనంలో ఉన్న ఖైదీల పట్ల అదేవిధంగా సద్భావంతో మెలుగుతున్నారు.

ఖైదీలుగా పట్టుబడినవారిలో సుహైల్ బిన్ అహ్ కూడా ఉన్నాడు. అతను దైవప్రవక్త (స)కు బద్ధవిరోధి. అతని విషయంలో కొందరు "దైవప్రవక్తా! ఇతను గొప్ప వాగ్ధాటికల వక్త. ఇతను తనవాగ్ధాటితో మీకు వ్యతిరేకంగా ఉద్రేకపూరితమైన ఉపన్యాసాలు చేస్తూ జనాన్ని రెచ్చగొడ్తుండేవాడు. అంచేత ఇతని పళ్ళు రాలగొట్టండి" అని సలహా ఇచ్చారు.

కాని మానవాళిపై కరుణామృతం చిలికించడానికి ప్రభవించిన కారుణ్యమూర్తి (సల్లం) అలా చేయగలరా? "తప్పు. నేను దైవసందేశహరుణ్ణయి ఉండికూడా అతని పళ్ళు రాలగొడ్తే దేవుడు నా పళ్ళు రాలగొడ్తాడు" అని సమాధానమిచ్చారు ఆయన.

ఆ తరువాత కొన్నాళ్ళకు దైవప్రవక్త (స) యుద్ధఖైదీల సమస్యను గురించి చర్చించ డానికి అనుచరులను సమావేశపరిచారు. ఖైదీలపై ఎలాంటి చర్య తీసుకోవాలో చెప్పమని వారి అభిప్రాయాలు అడిగారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ఇలా అన్నారు:

"వీరు దైవవిరోధులు. సత్యధర్మాన్ని అంతమొందించదలచుకున్న దుర్మార్గులు. మిమ్మల్ని అనేకసార్లు చంపడానికి ప్రయత్నించారు ఇలాంటి నీచుల్ని వదలి పెట్టకూడదు.



వీరందర్నీ వధించాలి. మనలో ఎవరు ఏ ఖైదీల బంధువులో వారే ఆ ఖైదీలను వధించాలి. దానివల్ల మన హృదయంలో బంధుప్రేమ కంటే దేవుని, దైవప్రవక్తల ప్రేమే అధికమని, దైవధర్మం ముందు సమస్త బాంధవ్యాలు బలదూర్ అని అవిశ్వాసులు తెలుసుకుంటారు."

తరువాత హజ్రత్ అబూబకర్ (రజి) తన అభిప్రాయం ఇలా వ్యక్తపరిచారు: "దైవప్రవక్తా! నష్టపరిహారం తీసుకొని వదలిపెడ్తే మంచిదని నా అభిప్రాయం. ఇలా చేయడంవల్ల ఒకవైపు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేద ముస్లింలకు ధన సహాయం అందించినట్లూ ఉంటుంది. మరోవైపు దైవానుగ్రహమయితే మనసు మారి ఖైదీలు ఇస్లాం స్వీకరించనూవచ్చు."

ఇతర సహచరులు కూడా అనేకమంది తమ తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. కాని దైవప్రవక్త (స)కు అబూబకర్ (రజి) అభిప్రాయమే నచ్చింది. దాని ప్రకారమే అమలు జరపడానికి నిశ్చయించారు. ఈ నిర్ణయాన్ని ఖైదీల బంధువులకు తెలియజేశారు.

మక్కానుంచి ఖురైషీయులు తమ బంధువుల్ని విడిపించుకోడానికి మదీనా వచ్చారు. దైవప్రవక్త (స) ఒక్కొక్క ఖైదీనుండి వేయి నుంచి నాలుగువేల దిర్హమ్‌లదాకా వారి వారి స్తోమతను బట్టి నష్టపరిహారం వసూలుచేసి బంధవిముక్తుల్ని గావించారు.

"దేశంలో శత్రువుల్ని పూర్తిగా అణచివేయనంత వరకు ఖైదీలను తనఅధీనంలో ఉంచు కోవడం ఏ దైవప్రవక్తకూ శోభించదు. మీరు ప్రాపంచిక ప్రయోజనాలు ఆశిస్తున్నారు. కాని దేవుని దృష్టిలో పరలోక ప్రయోజనాలే ఎంతో విలువైనవి. ఆయన అపార శక్తిసంపన్నుడు, అత్యంత వివేకవంతుడు. దేవుడు (మీ అదృష్టంలో) ముందే రాసి ఉండకపోతే, మీరు (ఖైదీల విడుదలకు) తీసుకున్నదానికి ఆయన మిమ్మల్ని కఠినంగా శిక్షించేవాడు. సరే, మీరు పొందిన ధనాన్ని అనుభవించండి. అది ధర్మ సమ్మతమైనది, పరిశుద్ధమయినది. దేవునికి భయపడుతూ ఉండండి. దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు." (ఖుర్ఆన్-8:67-69)

అయితే నష్టపరిహారం చెల్లించలేని పేద ఖైదీలు కొందరున్నారు. వారిని విడిపించ డానికి ఏబంధువూ లేడు. కాని వారిలో చదవను, వ్రాయను వచ్చినవారు కూడా ఉన్నారు. అలాంటివారి బంధవిముక్తికి దైవప్రవక్త (స) మార్గాన్వేషణ చేశారు. ఒక్కొక్కడు పదేసి ముస్లిం బాలబాలికలకు చదవడం, వ్రాయడం నేర్పి విముక్తి పొందవచ్చని ప్రకటించారు. చదువురాని నిరుపేద ఖైదీలను నష్టపరిహారం లేకుండానే విడిచిపెట్టారు.

దైవప్రవక్త (సల్లం) యుద్ధ ఖైదీల పట్ల కనబరచిన ఈ ఔదార్యం, సద్ప్రవర్తనలు చూసి అవిశ్వాసులు ఆశ్చర్యపోయారు. అంతేకాదు, ఆయన ప్రత్యుపకార భావం కూడా ప్రజలను ఎంతో ప్రభావితం చేసింది. గతంతో ఒకసారి ఆయన తాయిఫ్ నుండి మక్కా తిరిగొచ్చి నగరంలో ప్రవేశించబోతుంటే మక్కా ఖురైషీయులు ఆయన్ని అడ్డగించ ప్రయత్నించారు. అప్పుడు ముత్యిమ్ బిన్ అదీ దైవప్రవక్త (సల్లం)కు ఆశ్రయమిచ్చాడు. దైవప్రవక్త (సల్లం) ఆ విషయం గుర్తుచేస్తూ "ఇప్పటిదాకా ముత్యిమ్ బ్రతికి ఉండి, ఇక్కడ నిర్బంధించబడిన ఖైదీల విషయమయి అతను నాతో మాట్లాడితే నేను ఖైదీలను నష్టపరిహారం తీసుకోకుండానే వదలిపెట్టేవాడ్ని" అని అన్నారు.

ఖైదీలలో దైవప్రవక్త (స) అల్లుడు అబుల్‌ఆస్ కూడా ఉన్నాడు. కాని అల్లుడని నష్టపరిహారం వసూలుచేయకుండా విడిచిపెట్టలేదు. ఇతర ఖైదీలకు మాదిరిగానే నష్టపరిహారం తెప్పించుకొని విడుదలకమ్మని చెప్పారు ఆయన. భర్తను విడిపించుకోవడానికి హజ్రత్ జైనబ్ (రజి) తన తల్లి హజ్రత్ ఖదీజా (రజి) నుంచి తనకు సంక్రమించిన కంఠహారాన్ని మదీనాకు పంపించారు. కంఠహారం చూడగానే దైవప్రవక్త (స)కు గతస్మృతులు గుర్తుకొచ్చాయి. ఇహలోకం వీడిపోయిన తన అర్ధాంగిని తలచుకొని వ్యథ చెందారు. హృదయం మూగగా విలపించింది.

“కంఠహారం ఒక్కటే ఖదీజా జ్ఞాపకార్థంగా జైనబ్ దగ్గర మిగిలివుంది. మీకెవరికీ అభ్యంతరం లేకపోతే దీన్ని జైనబ్‌కు తిరిగి ఇచ్చివేద్దాం” అన్నారు ఆయన అనుచరులతో. తమ ప్రియతమ నాయకుడే అలా అన్నప్పుడు ఇక ఎవరికి అభ్యంతరం ఉంటుంది? అదీగాక ప్రవక్త ప్రసన్నత కన్నా కావలసిందేముంది? అంచేత అందరూ సంతోషంగా అంగీకరించారు. దైవప్రవక్త (స) విచారవదనం వికసించింది. కంఠహారాన్ని తన కుమార్తెకు తిప్పిపంపి అబుల్‌ఆస్‌ను విడుదల చేశారు.

## 15. అవిశ్వాసుల పరాజయ ప్రతీకారజ్వాలలు

బదర్ యుద్ధంలో పరాజయం చవిచూసిన మక్కా ఖురైషీయులు అవమాన భారంతో బాగా క్రుంగిపోయారు. అబూలహబ్ అయితే పుట్టెడు దుఃఖంతో వంగిపోయిన గడకర్రలా వ్రేలాడపడిపోయాడు. ఖురైషీయులు తమకు జరిగిన పరాభవాన్ని అంత తేలిగ్గా మరచిపోయే అభిమానహీనులు కాదు. కష్టనష్టాలు సహించి ప్రతిక్రియ కోసం ప్రయత్నించలేని పిరికిపందలూ కాదు. వారి హృదయాల్లో ప్రతీకారసెగలు ప్రజ్వరిల్లుతున్నాయి. మరోసారి ముస్లింల మీదికి దండెత్తి, వారిని అణచి పగ చల్లార్చుకోవాలని నిశ్చయించుకున్నారు.

ఈ లక్ష్యం నెరవేరే వరకు విశ్రాంతి తీసుకోకూడదని, కంటి నిండా నిద్ర పోకూడదని నిర్ణయించుకున్నారు పురుషులు. స్త్రీలు శిరోజాలు కత్తిరించుకొని ముస్లింలపై కసి తీర్చుకునేదాకా సువాసనల్ని ఉపయోగించమని, నగలు ధరించమని తమ తమ ఇష్టదేవతల ముందు ప్రమాణం చేశారు. ఖురైషీల అగ్రనాయకుడు అబూసుఫ్యాన్ ఇస్లాం సారథిని ఓడించే వరకు స్నానం చేయనని, తల దువ్వుకోనని తీవ్రంగా శపథం చేశాడు.

ఖురైషీలు యుద్ధ సన్నాహాలు ప్రారంభించారు. యుద్ధానికి కావలసిన వస్తువులన్నీ సేకరించడం మొదలెట్టారు. బదర్‌యుద్ధానికి ముందు ముస్లింల బారిన పడకుండా సురక్షితంగా వచ్చిన వర్తకబిడారాలు ‘దారున్నద్వా’లో ఆపిఉంచారు. ఒంటెల మీద లక్షల విలువగల వ్యాపారసామగ్రి కిటకిటలాడుతోంది. ఇంకా దాన్ని భాగస్తుల్లో పంచలేదు. ఖురైష్ నాయకులంతా సమావేశమై, భాగస్తులకు వారి పెట్టుబడి సొమ్ము వరకు ఇచ్చేసి లాభాన్ని సైనిక ఖర్చులకు, యుద్ధఏర్పాట్లకు వినియోగిద్దామని తీర్మానించారు.

వెంటనే సరుకు మార్కెట్‌లోకి తెచ్చి అమ్మివేశారు. సిరియా నుంచి వచ్చిన అనేక విలువైన, ఆకర్షణీయమైన వస్తువులు ఉండటం వల్ల జనం ఎగబడికొన్నారు. అనుకోకుండా ఆఏడు అపారమైన లాభాలు వచ్చాయి. భాగస్తులకు వారి మదుపుసొమ్ము వాపసుచేశారు.



లాభాలను సైనిక ఖర్చులకు తీసి యుద్ధసన్నాహాలు ఉధృతం చేశారు.

“అవిశ్వాసులు (ప్రజల్ని) దైవమార్గం నుండి నిరోధించే కార్యకలాపాల కోసం తమ ధనాన్ని వెచ్చిస్తున్నారు. ఇకముందు కూడా మరింత వెచ్చిస్తారు. అయితే చివరికి ఈ (పైశాచిక) కార్యకలాపాలే వారి పశ్చాత్తాపానికి కారణమవుతాయి. ఆతర్వాత వారు మాకు లొంగిపోతారు. ఆపై ఈ అవిశ్వాసులు నరకం వైపు తోలబడతారు. పరిశుభ్రత నుండి మాలిన్యాన్ని వేరుచేసి, ఆ మాలిన్యాలన్నిటిని ఒకదానిపె ఒకటి కుప్పగాపోసి, ఆకుప్పను నరకంలో పడేయడానికే దేవుడిలా చేస్తున్నాడు. వారే నష్టపోయేవారు.” (ఖుర్‌ఆన్–8:36,37)

బదర్ యుద్ధంలో ఖురైషీయులు చాలామంది తమ ఆప్తుల్ని పోగొట్టుకున్నారు. అబూసుఫ్యాన్ కొడుకు కూడా వధించబడ్డాడు. ఆ యుద్ధంలో అవిశ్వాసుల అంచనాలన్నీ తారుమారయ్యాయి. అంచేత ఈసారి భారీఎత్తున సైనికుల్ని, ఆయుధాల్ని సమీకరించాలని తహతహలాడిపోతున్నారు. అయితే ఇదంతా ఒక్కరోజులో జరిగే పనికాదు. పథకం ప్రకారం పనులు జరగాలంటే కొంతకాలమైనా పడ్తుంది. కాని అబూసుఫ్యాన్ ఆంతర్యంలో బుసలు కొడ్తున్న ప్రతీకారవాంఛను అదుపులో ఉంచలేక పోయాడు. యుద్ధసన్నాహాలు పూర్తి కాకుండానే అతను రెండొందల మంది ప్రతిభావంతులైన సైనికుల్ని తీసుకొని మదీనా బయలుదేరాడు.

మదీనా సమీపంలో ఉరైజ్ అనే ప్రదేశం ఉంది. అబూసుఫ్యాన్ ఆ ప్రదేశానికి చేరుకోగానే ఒక అన్సార్‌ముస్లిం పొలంపనులు చేసుకుంటూ కన్పించాడు. వెంట ఒక కూలీవాడు కూడా ఉన్నాడు. అబూసుఫ్యాన్ వాళ్ళిద్దర్ని నిర్దాక్షిణ్యంగా హతమార్చాడు. అక్కడున్న రెండు ఇళ్ళను, ఖర్జూరపు తోటలను కాల్చి పారిపోయాడు.

ఈ సంగతి తెలిసిన వెంటనే దైవప్రవక్త (స) కొందరు అనుచరుల్ని వెంటబెట్టుకొని అబూసుఫ్యాన్‌ని వెంటాడటానికి బయలుదేరారు. తమ వెనుక శరవేగంతో వస్తున్న ప్రమాదాన్ని అబూసుఫ్యాన్ సైనికులు గమనించారు. కాని వెనక్కివెళ్ళి ముస్లింలతో తలపడటానికి ధైర్యం చాల్లేదు. అదీగాక వీపు మీద బరువుతో నత్తనడక నడిచే ఈ ఒంటెలతో ప్రయాణం సాగిస్తే ముస్లింలకు చిక్కి బుగ్గిపాలయ్యే ప్రమాదం కూడా ఉంది పరిస్థితి. అందువల్ల ఒంటెల మీదున్న పిండి మూటలు జారవిడిచారు. బరువు తగ్గిన ఒంటెలతో వడివడిగా ప్రయాణం చేస్తూ ఎలాగో ముస్లిం సైనికుల నుండి తప్పించుకున్నారు.

ముస్లింలు తమకు భయపడి పిరికిపందలుగా పారిపోయిన శత్రుసైనికుల్ని వెంటాడలేదు. వారు జారవిడిచిన పిండి మూటల్ని మాత్రం తీసుకొని మదీనా తిరిగొచ్చారు. ఈ దండయాత్రను గజ్వె సవీఖ్ (పిండి దండయాత్ర) అంటారు.

## 16. యూదుల ఆగడాలు

దైవప్రవక్త (సల్లం) మదీనా వచ్చిన తొలి రోజుల్లో యూదులు ఆయన ప్రతిపాదించిన శాంతిఒప్పందంతో ఏకీభవించి సంతోషంగానే ఉన్నారు. అయితే ఆయనకు తమ మత రంగు పూసి తమ జాతిప్రాభవాన్ని ద్విగుణీకృతం చేసుకోవాలన్న దుష్ట పథకం ఎంతకూ నెరవేరక పోగా, దైవప్రవక్త (స) తన సందేశామృతంతో ప్రజాబాహుళ్యాన్ని ఆకట్టుకోవడం

చూసి యూదులు మండిపోయారు. అప్పటినుంచి వారు దైవప్రవక్త (స)కు, సత్యధర్మానికి ఆగర్భ శత్రువులుగా మారి అసహ్యంగా ప్రవర్తించసాగారు.

“(ముస్లింలారా!) గ్రంథప్రజలలో (అంటే యూదుల్లో) కొందరు మిమ్మల్ని రుజుమార్గం నుండి తప్పించగోరుతున్నారు. నిజానికి వారు తమను తాము తప్ప మరెవరినీ దారి తప్పించలేరు. కాని ఆ సంగతి వారు గ్రహించలేకపోతున్నారు.” (ఖుర్‌ఆన్–3:69)

“గ్రంథప్రజలారా! మీరు దేవుని సూక్తులు, సూచనలను గుర్తించినప్పటికీ వాటిని ఎందుకు నిరాకరిస్తున్నారు? గ్రంథప్రజలారా! మీరు సత్యాసత్యాలను కలగాపులగం చేసి సత్యాన్ని ఎందుకు అనుమానాస్పదం చేస్తున్నారు? వాస్తవం తెలిసి కూడా సత్యాన్ని ఎందుకు దాస్తున్నారు?

“గ్రంథప్రజలలో కొందరు పరస్పరం కూడబలుక్కుంటూ “విశ్వాసులపై అవతరించిన దాన్ని మీరు ఉదయం విశ్వసించి(నట్లు నటించి) సాయంత్రానికల్లా తిరస్కరించండి. ఈ విధంగా వారిని మనం మార్గభ్రష్టులయ్యేలా చేయగలం” అని చెప్పుకుంటారు.” (3:70–72)

తాము ఎంతో భక్తిపరాయణులమని, తాము తప్ప మరెవరూ మోక్షానికి అర్హులు కారని డాంబికాలు పలికే ఈజాతిలోని పెద్దలు, పండితులు సైతం దైవప్రవక్త (స) దగ్గరికి వచ్చినప్పుడల్లా ‘అస్సలాము అలైకుం’ అనే పదాన్ని దాని అసలుభావం మారి చెడుభావం వచ్చే విధంగా కొంచెం వత్తి పలికేవారు. అలాగే ఇతర సంభాషణల్లోనూ కొన్నిటి ఉచ్చారణ తారు మారుచేసి సామాన్యజనానికి అర్థంకాని విధంగా తప్పుడు మాటలు పలికేవారు.

“యూదులైనవారిలో కొందరు పదాలను వాటి సందర్భాన్నుండి మార్చివేస్తారు. నిజ ధర్మానికి హాని కలిగించే ఉద్దేశ్యంతో వారు నాలుకలు మెలితిప్పుతూ “మేము విన్నాం– త్రోసి పుచ్చాం, వినండి– విన్పించకండి, మా మాట వినండి” అని అంటారు. వారు “మేము విన్నాం, విధేయులై పోయాము; వినండి, కాస్త మావైపు చూడండి” అని అంటే వారికి శ్రేయస్కరంగా ఉండేది. అది సవ్యంగా కూడా ఉండేది. కాని దేవుడు వారి తలబిరుసు, తిరస్కారాల కారణంగా వారిని శపించాడు. అందువల్ల వారిలో చాలాకొద్ది మంది తప్ప ఎవరూ సత్యాన్ని విశ్వసించరు.” (ఖుర్‌ఆన్–4:46)

అంతేకాదు, దైవమార్గంలో ధనాన్ని వెచ్చించమంటూ ‘మీలో దేవునికి మంచి అప్పు ఇచ్చేవారెవరున్నారు?’ అనే ఖురాన్‌వాక్యం విని ‘ఓహో! దేవుడు ఇప్పుడు పేదవాడైపోయి తనదాసుల దగ్గర అప్పు అడుక్కోవడం మొదలుపెట్టాడన్న మాట!!” అని దైవాన్ని కూడా ఎగతాళి చేసేవారు. ఖుర్‌ఆన్‌లోని ఈగ, దోమల దృష్టాంతాలు విని ‘ముస్లింల దేవుడు చాలా వింత దేవుడు. దృష్టాంతం ఇవ్వడానికి ఆయనకు ఈగలు, దోమలు వంటి అల్ప ప్రాణులు తప్ప మరేమీ దొరకలేదు కాబోలు!” అని పరిహసించేవారు.

“విశ్వాసులారా! మీవారిని తప్ప ఇతరుల్ని ఆంతరంగీకులుగా చేసుకోకండి. వారు మీకు హాని తలపెట్టడంలో ఎలాంటి అవకాశాన్నీ జారవిడుచుకోరు. ఏ విధంగానయినా మిమ్మల్ని బాధించాలనే వారు కాచుకొని ఉంటారు. వారి మాటల్లో వైరం ఎప్పుడో బయట పడింది. ఇక వారి హృదయాల్లోనయితే అంతకన్నా ఎన్నోరెట్లు ద్వేషం నిండిఉంది...

“మీరు వారిని ప్రేమిస్తారుగాని, వారికి మీరంటే ఏమాత్రం అభిమానం లేదు. మీరు



(దైవ)గ్రంథాలన్నీ విశ్వసిస్తారు. (కాని వారు మీగ్రంథాన్ని విశ్వసించరు.) వారు మిమ్మల్ని కలసినప్పుడు “మేము కూడా విశ్వసిస్తున్నాం” అంటారు. అయితే మీ దగ్గర్నుండి వెళ్ళిపోగానే మీమీద పెంచుకున్న కసితో వారు పళ్ళు నూరుతారు. (దౌర్భాగ్యులారా!) మీరు పెంచుకున్న కసిలోనే మాడి చావండి....(విశ్వాసులారా! మీకేదైనా మేలు జరిగితే వారు విలవిల్లాడి పోతారు. కీడు జరిగితే మాత్రం తెగ సంబరపడి పోతారు. ఏమైనప్పటికీ మీరు సహనం వహించి దేవుని పట్ల భయభక్తులతో మసలుకుంటే, మీమీద వారి కుట్రలు, కుయుక్తులేవీ పనిచేయవు. వారి చేష్టలన్నీ దేవునికి బాగా తెలుసు.” (ఖుర్‌ఆన్–3:118–120)

యూదుల పెంకితనం మరింత పెచ్చరిల్లింది. నానాటికి వ్యాపిస్తున్న ఇస్లాం ధర్మాన్ని చూసి వారు ఆశ్చర్యపోతున్నారు. ‘‘స్నేహఒప్పందంతో ముహమ్మద్ (సల్లం) మనల్ని తన పక్షానికి తిప్పుకున్నాడు. ఆ తరువాత కొద్దికాలంలోనే ఇంటింటా ఇస్లాంజ్యోతి వెలిగించాడు. అంతటితో ఊరుకోకుండా యుద్ధరంగంలోకి దిగి బహుదైవారాధకుల్ని కూడా సునా యాసంగా ఎదుర్కోగలుగుతున్నాడు.’’

ఈ ఆలోచన రాగానే యూదులు హడలిపోయి ఇప్పటిదాకా కప్పుకొని ఉన్న కాపట్యపు ముసుగు పూర్తిగా తీసిపారేశారు. శాంతి ఒప్పందానికి కూడా తిలోదకాలిచ్చి వరలేని ఖడ్గంలా ఎదుటికి వచ్చారు. జనబాహుళ్యంలో ఇస్లాం పట్ల, దైవప్రవక్త (స) పట్ల అనేక అనుమానాలు రేకెత్తించసాగారు. ముస్లింలకు వ్యతిరేకంగా బహుదైవారాధకుల్ని రెచ్చగొట్టడం మొదలెట్టారు. అయినా కారుణ్యమూర్తి (సల్లం) వారి ఆగడాలను క్షమిస్తూనే ఉన్నారు. కాని వారది తెలుసుకోలేక మరింత మిడిసిపడుతున్నారు.

ఒకసారి ఓ ముస్లింమహిళ నగ చేయించుకోవడానికి ఓ యూదస్వర్ణకారుని దుకాణా నికి వెళ్ళింది. అక్కడ మరికొందరు యూదులు కూడా ఉన్నారు. ఈ దుర్మార్గులకు ఏం దుర్బుద్ధి పుట్టిందోగాని వారామెను ముఖం చూపించమని అడిగారు. దానికామె నిరాక రించడంతో ఓ కిరాతకుడు ఆమె వెనక్కిపోయి ఆమె పైవస్త్రానికి ఓ ముల్లు గుచ్చాడు. ఇది గమనించని ఆ మహిళ లేచి నిలబడగానే ఆమెవస్త్రం కాస్తా క్రిందకు జారింది. అది చూసి మిగిలిన యూదులంతా విరగబడి నవ్వారు. పాపం ఆ అమాయకురాలు ఈ అవమానం భరించలేక పెద్ద కేకపెట్టి భోరున ఏడ్వసాగింది.

ఆమె కేక విని సమీపంలోనే ఉన్న ఓ ముస్లిం పరుగెత్తుకొచ్చాడు. జరిగిన సంగతి తెలుసుకొని తోకతొక్కిన త్రాచులా లేచాడు. మరుక్షణమే ఆ యూదుడ్ని అమాంతం పైకెత్తి నేలకేసి విసిరికొట్టాడు. దానికి మిగిలిన యూదులు ఆగ్రహోదగ్రులయి ఒక్కసారిగా ఆ ముస్లింపై విరుచుకుపడి అతడ్ని హతమార్చివేశారు.

## 17. బనీఖైనుఖా యూదుల బహిష్కరణ

అంతలో అక్కడ దరిదాపుల్లో ఉన్న దాదాపు పాతిక మంది ముస్లింలు పరుగెత్తుకొని వచ్చారు. మరో వైపునుంచి ఏడొందల మంది యూదులు ఆయుధాలు ధరించి వచ్చారు. అంతమంది యూదుల్ని చూసి ముస్లింలు భయపడలేదు. వెంటనే వారు వరల్లో నుంచి ఖడ్గాలు లాగి పోరాటానికి ఉపక్రమించారు.

పాతిక మంది ముస్లింలు ఏడొందలు మంది యూదులతో తలపడుతూ వీరోచితంగా పోరాడసాగారు. వారి ధైర్యసాహసాలు చూసి యూదులు ఆశ్చర్యపోయారు. ముస్లింలు చాలా సేపు పోరాడారు. చివరికి వారి సత్తువ క్రమంగా తగ్గిపోసాగింది. అప్పుడు యూదుల వెనుక వైపు నుంచి “అల్లాహుఅక్బర్” అనే నినాదాలు వినవచ్చాయి. వెనువెంటనే దైవప్రవక్త (స) నేతృత్వంలో దాదాపు మూడొందల మంది సాయుధ ముస్లింలు వచ్చిపడ్డారు.

పరిస్థితి ప్రమాదసూచిక దాటిందని గ్రహించిన దైవప్రవక్త (సల్లం) యూదుల్ని సంబోధిస్తూ ఎంతో ఆవేదనాభరిత హృదయంతో ఇలా అన్నారు:

“యూద సోదరులారా! నేను దైవప్రవక్తనని మీకు బాగా తెలుసు. నామాట విని ఇస్లాం స్వీకరించండి. లేకుంటే చాలా నష్టపోతారు. బదర్ యుద్ధంలో బహుదైవారాధకులకు జరిగిన పర్యవసానం ఏమిటో మీరు చూశారు కదా! బాగా ఆలోచించుకోండి.”

కాని యూదులు వైరోన్మాదంతో ఊగిపోతూ “ముహమ్మద్! మోసపోకు. వారు అనుభవం లేనివారు. అలాంటివారిని ఓడించడం పెద్ద ఘనకార్యం అనుకుంటున్నావు కాబోలు. మాతో రంగంలోకి దిగు, యుద్ధం అంటే ఏమిటో తెలుస్తుంది” అన్నారు.

ఒప్పందం ఉల్లంఘనకు ఇంతకంటే ప్రబల నిదర్శనం మరేముంది? కయ్యానికి కాలుదువ్వే బహిరంగ ప్రకటన ఇది. దైవప్రవక్త (స) ఎంత నచ్చజెప్పినా వారు వినలేదు. చివరికి దైవప్రవక్త (స) వాళ్ళతో యుద్ధం చేయక తప్పలేదు. దైవప్రవక్త (స) ఆజ్ఞ కాగానే ముస్లింలు యూదుల సైన్యంలోకి దూసుకుపోయి తుఫానులా విరుచుకుపడ్డారు. యూదులు ముస్లింల ధాటికి నిలువలేక వెనుక్కి జరుగుతూ చివరికి పారిపోయి తమ కోటలోకి దూరి తలుపులు మూసుకున్నారు.

దైవప్రవక్త (స) వారి కోటను ముట్టడించమని అనుచరుల్ని ఆదేశించారు. తక్షణమే అనుచరులు కోటను ముట్టడించారు. అంతేకాకుండా యూదులకు బయటినుంచి ఆహార పదార్థాలు కూడా సరఫరాకాకుండా అన్ని వైపుల నుంచి కోటను దిగ్బంధం చేశారు. కాని ముస్లింలు ఎంత ప్రయత్నించినా కోటలోకి ప్రవేశించలేకపోయారు. ఆ విధంగా పదిహేను రోజులు గడచిపోయాయి. అటు కోటలో ఆహారపదార్థాలు నిండుకోవడంతో యూదులు పస్తులతో అల్లాడి పోయారు. చివరికి వారు కోట తలుపులు తెరచి ముస్లింలకు లొంగి పోయారు. దైవప్రవక్త (స) వారందర్నీ ఖైదీలుగా పట్టుకొని తీసికెళ్ళారు.

ఆనాటి అరబ్ యుద్ధనీతి ప్రకారం యుద్ధ ఖైదీలందర్నీ వధించాలి. అందువల్ల యూద ఖైదీలు తమకిక చావు తప్పదని భావించి భయపడ్డారు. వెంటనే వారు కపటుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబైని రంగంలోకి దించారు. అయితే దైవప్రవక్త (సల్లం) తన అనుచరుల్ని సంప్రదించిన తరువాత ఆ యూదులను మదీనా నుంచి బహిష్క రించాలని నిర్ణయించారు. ఇబ్నెఉబై బదర్ యుద్ధఖైదీల పట్ల దైవప్రవక్త (స) కనబరచిన ఔదార్యం, సౌమ్యతలు చూసి బనూఖైనుఖా యూదుల్ని మదీనా నుంచి బహిష్కరించ వద్దని, వారిని క్షమించమని ఆయన దగ్గరికెళ్ళి విన్నవించుకుందామని తలచాడు. కాని ముస్లింలు అతని ఉద్దేశ్యం కనిపెట్టి అతడ్ని దైవప్రవక్త (స) దగ్గరకు పోనీయకుండా నిరోధించారు.



బనూఖైనుఖా యూదులు గత్యంతరంలేక మదీనా విడిచిపెట్టి వెళ్ళిపోయారు. వారు సిరియా సరిహద్దులకు పోయి స్థిరపడ్డారు. యూదులు వదలిపెట్టి పోయిన కోటలు, ఇండ్లు, ఆయుధాలు, వెండి బంగారు రాసులు అన్నీ ముస్లింలకు దక్కాయి.

ఈ సంఘటనతో అరేబియాలో ఇస్లాం ఔన్నత్యం ఇనుమడించింది. అంతపెద్ద యూద తెగ, అందులో ఎంతో ధైర్యసాహసాలకు ప్రసిద్ధిచెందిన తెగకు మదీనాలో నిలువ నీడలేకుండా పోయింది. దీన్ని బట్టి ముస్లింలు ఎంత బలపడ్డారో తెలుస్తోంది. ఇక వారికి ఎదురే లేదు! ఈ ఆలోచన రాగానే మదీనా దరిదాపుల్లో ఉన్న బనీనజీర్, బనీఖురైజా అనే మరో రెండు యూదతెగలు ముస్లింలకు భయపడి మౌనంగా ఉండిపోయాయి.

బనీనజీర్ తెగ యూదుల్లో కాబ్ బిన్ అష్రఫ్ అనే ఓ కర్కోటకుడు ఉన్నాడు. మదీనా వెలుపలున్న ఓకోటలో నివసిస్తున్నాడు. అక్కడ మరికొందరు యూదులు కూడా ఉన్నారు. దైవప్రవక్త (స) పేరు వింటేనే కాబ్ మండిపడేవాడు. బదర్‌యుద్ధంలో అనేకమంది ఖురైషీయులు చంపబడ్డారని వినగానే అతను పట్టరాని కోపంతో చిందులు తొక్కాడు. అసహనంతో అరుస్తూ, గుండెలు బాదుకుంటూ మక్కా పరుగెత్తాడు.

కాబ్ వెళ్ళగానే మక్కా ప్రజల ముందు ముస్లింలను నిందిస్తూ వారిపై దుష్ప్రచారం మొదలెట్టాడు. అవిశ్వాసుల భావోద్రేకాలను రెచ్చగొడ్తూ ప్రసంగాలు చేశాడు. దైవప్రవక్త (సల్లం)కు వ్యతిరేకంగా బహుదైవారాధకుల్ని ఉసిగొల్పాడు. బదర్‌లో మరణించిన ఖురైష్ నాయకుల పేర్లను ప్రస్తావిస్తూ విషాద గీతాలు ఆలపించాడు.

మక్కా ఖురైషీయులు అతడ్ని తెగ పొగిడి ఆకాశానికి ఎత్తారు. అమితమైన గౌరవ మర్యాదలు జరిపారు. ఎంతో ఘనంగా ఆతిథ్యమిచ్చారు. మక్కాలో కాబ్ పలికే ఉద్రేక పూరితమైన మాటలకు వంతపాడే స్వార్థపరులైన కవులు కూడా కొందరు అతని చుట్టూ చేరారు. కాబ్ లాగానే వీరు కూడా తమ గేయాలు, కవితల ద్వారా జనాన్ని రెచ్చగొట్టారు.

ఈవిధంగా కాబ్ ముస్లింల పట్ల ఖురైషీయుల గుండెల్లో అమితమైన ద్వేషాగ్ని జ్వాలలు రేకెత్తించాడు. చివరికి స్త్రీలు కూడా కసి, ద్వేషాలతో కుతకుతలాడి పోయారు. వారు బదర్‌లో హతులైనవారి గురించి హృదయాన్ని కలచివేసే విషాద గీతాలు ఆలపించే వారు. అదీగాక దైవప్రవక్త (సల్లం)ను నిందిస్తూ విషం వెదజల్లే పాటలు కూడా పాడి ఖురైషీయుల గుండెల్లో ప్రతీకారాగ్నిని మరింత ప్రజ్వరిల్లజేసేవారు.

అయితే అప్పటికీ కాబ్ గుండెల్లో రగిలిన మంటలు చల్లారలేదు. అతను ద్వేషాగ్నితో మండిపోతూ మక్కా నుంచి మదీనా తిరిగొచ్చి ముస్లిం మహిళలపై బురద చల్లడానికి పాల్పడ్డాడు. వారి పవిత్రశీలంపై దాడిచేయడానికి పూనుకున్నాడు. ఆ కర్కోటకుడి కుచేష్ట లను ముస్లింలు చాలా కాలం సహించారు. కాని ఎంత కాలమని అలా సహిస్తూ ఊరు కుంటారు? అతని దుష్టచేష్టలు హద్దుమీరిపోయాయి. ముస్లింలలో ఓర్మి నశించింది. చివరికి వారు ఆ దుష్టుడ్ని తుదముట్టించదలిచారు.

ఈ పని కోసం దైవప్రవక్త (స) ముహమ్మద్ బిన్ మస్లమా (రజి)ని నియమించారు. బిన్ మస్లమాకు, కాబ్‌కు మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. కాని ఆయన ముస్లిం

అయిన సంగతి కాబ్‌కు తెలియదు. అంచేత ముహమ్మద్ బిన్ మస్లమా (రజి) ఓరోజు కాబ్ బిన్ అష్రఫ్ దగ్గరకు వెళ్ళి ఇలా అన్నాడు:

“నిజం చెప్పాలంటే అతను (అంటే దైవప్రవక్త) మమ్మల్ని జకాత్, చందాలు వగైరా ధనం అడుగుతున్నాడు. ఇలా అతను (నిధుల కోసం) మమ్మల్ని వేధిస్తున్నాడు. నేనిప్పుడు (అతని పోరు పడలేకనే) నీ దగ్గరకు అప్పు అడగటానికి వచ్చాను.”

కాబ్ ఈమాటలు విని “అప్పుడే ఏమయింది! మున్ముందు ఇతను మిమ్మల్ని మరిన్ని కష్టాల్లో పడవేస్తాడు” అని అన్నాడు.

“మేమతనికి విధేయులై ఉండటానికి ఒప్పుకున్నాం. అంచేత అతనికి జరిగే పర్యవసానం చూడకముందే మేమతడ్ని వదిలేయడం బాగుండదు కదా! అంచేత ప్రస్తుతం నీవు రెండు వసఖ్‌ల (బరువు) ఖర్జూరం మాకు అప్పుగా ఇవ్వు” అన్నారు బిన్ మస్లమా.

“సరే అలాగే ఇస్తాను. దాని కోసం నా దగ్గర ఏదైనా వస్తువు తాకట్టు పెట్టు.”

“ఏం తాకట్టు పెట్టాలి?”

“మీ భార్యలను కుదువబెట్టండి.”

“మేము మా భార్యలను నీ దగ్గర ఎలా కుదువబెట్టగలం? చూస్తే నువ్వు యావత్తు అరేబియాలోనే చాలా అందగాడివి. (పైగా రసికుడివి కూడా.)” అన్నారు బిన్ మస్లమా.

“అయితే మీ కొడుకుల్ని కుదువబెట్టండి” అన్నాడు కాబ్.

“మా కొడుకుల్నయినా ఎలా కుదువబెట్టగలం? ఒకటి రెండు వసఖ్‌లకు బదులుగా కుదువబెట్టబడినవారని రేపు జనం మాకొడుకుల్ని ఎత్తిపొడవరా? ఇది మాజాతికే సిగ్గుచేటు. మాకొడుకులకు బదులు మాఆయుధాలు కుదువబెడ్తాం” అన్నారు బిన్ మస్లమా (రజి).

చివరికి ఇలా ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత బిన్ మస్లమా (రజి) మళ్ళీ వస్తానని చెప్పి అక్కడ్నుంచి వెళ్ళిపోయారు. ఆయన తిరిగి అదేరోజు రాత్రి కాబ్ దగ్గరికి వచ్చారు. ఆయనతో పాటు మరో ఇద్దరు  ఉన్నారు. వాళ్ళను చూడగానే కాబ్ మేడ మీది నుంచి దిగివచ్చాడు. ముందేసుకున్న పథకం ప్రకారం బిన్ మస్లమా (రజి), ఆయన స్నేహితులు కాబ్‌ని మాటల్లోకి దించి హఠాత్తుగా కత్తులతో పొడిచి అతడ్ని కడతేర్చారు. ఆ తరువాత తిరిగొచ్చి విషయం దైవప్రవక్త (సల్లం)కు నివేదించారు.

## 18. మదీనాలో రెడ్ అలర్ట్

కాబ్ విసిరిన జాలంలో పడిపోయిన మక్కా ఖురైషీయులు ధుమధుమలాడుతూ యుద్ధసన్నాహాలు ప్రారంభించారు. దైవప్రవక్త (సల్లం) పినతండ్రి హజ్రత్ అబ్బాస్ (రజి) ఇదివరకే ఇస్లాం స్వీకరించి ఉన్నారు. అయితే ఆయన ఇంకా మదీనాకు వలసపోకుండా మక్కాలోనే ఉన్నారు. బహుదైవారాధకుల హడావిడి చూసి వెంటనే ఆయన ఖురైషీయులు మదీనాపై దాడిచేయడానికి యుద్ధసన్నాహాలు చేస్తున్నారని, ఈసారి అనేక ఆయుధాలు, వాహనాలతో భారీఎత్తు సైనిక సమీకరణ జరుగుతోందని రహస్యంగా దైవప్రవక్త (సల్లం)కు సమాచారం పంపించారు.



ఈ వార్త విని దైవప్రవక్త (స) ఆందోళన చెందలేదు. ఇలా జరుగుతుందని ఆయన ముందే ఊహించారు. కాని ఏడాది తిరక్కముందే బహుదైవారాధకులు అన్ని ఆయుధాలు, అంతపెద్ద సైన్యం సిద్ధం చేస్తున్నారని విన్న తరువాత ఆయన ఆశ్చర్యపడక తప్పలేదు.

ఖురైషీయులు యుద్ధసన్నాహాలలో నిమగ్నులయ్యారు. ఆయుధాలు, ఆహార పదార్థాలు సేకరిస్తున్నారు. ఎక్కడెక్కడ నుంచో పేరుమోసిన వీరులు, పహిల్వానులు వచ్చి సైన్యంలో భర్తీ అవుతున్నారు. దాని కోసం ఖురైషీయులు మక్కా చుట్టుప్రక్కల ఉన్న ఎన్నో తెగలను ప్రేరేపించి యుద్ధ ఒడంబడికలు చేసుకున్నారు. అనేకమంది కవులు, వక్తల్ని రప్పించి ముస్లింలకు వ్యతిరేకంగా బాగా నూరిపోశారు. తరువాత వారంతా వివిధ తెగల్లోకి పోయి తమ కవితా నైపుణ్యంతో, వాగ్ధాటితో యువకుల పౌరుషాన్ని రెచ్చగొట్టి యుద్ధంలో పాల్గొనేలా చేశారు. కొన్ని రోజుల్లోనే ఖురైషీయులు ఓ పెద్ద సైనికపటాలం తయారుచేశారు. ఆయుధాలు, ఆహారపదార్థాలు  కూడా అపారంగా సేకరించారు.

ఉక్కు కవచాలు ధరించి రకరకాల ఆయుధాలు చేతబూనిన మూడు వేలమంది సిపాయిలు దైవప్రవక్త (స)ను, ముస్లింలను చీల్చి చెండాటానికి తహతహలాడుతున్నారు. అబూసుఫ్యాన్ సర్వసేనాని. సైన్యంలో ఇతరత్రా పనుల కోసం పదిహేనుమంది స్త్రీలు కూడాఉన్నారు. అంతా సిద్ధమయ్యాక పెద్దపెట్టున కోలాహలంతో సైన్యం బయలుదేరింది.

ఈ సైన్యం అనేక ప్రదేశాలు దాటుకుంటూ ‘అతీఖ్’ అనే చోటికి చేరుకొని ఆగిపోయింది. ఇది మదీనాకు దాదాపు అయిదుమైళ్ళ దూరంలో ఉన్న కీలకప్రాంతం. ఖురైష్ సైన్యం అతీఖ్ చేరే సమయానికి ఖుబాలో ఉన్న దైవప్రవక్త (స)కు మక్కా నుండి ఆయన పినతండ్రి హజ్రత్ అబ్బాస్ (రజి) పంపిన రహస్య లేఖ అందింది. మక్కా ఖురైషీయులు మదీనాపై దాడిచేయడానికి వస్తున్నారని చేసిన హెచ్చరికే దాని సారాంశం. హజ్రత్ ఉబై బిన్ కాబ్ (రజి) ఉత్తరం చదివి విన్పించారు. ఈవార్త విని దైవప్రవక్త (స) “అలాగా! సరే ఈ విషయం ఇంకెవరి ముందూ ప్రస్తావించకండి” అన్నారు.

కాని ఈ వార్త బయటికి పొక్కి కాస్సేపటికే నగరమంతా వ్యాపించింది. దైవప్రవక్త (స) ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా హజ్రత్ అనస్ (రజి)ను, హజ్రత్ మూనిస్ (రజి)ను శత్రుసైన్యాన్ని గురించి సమాచారం తెలుసుకొని రమ్మని పంపారు. వారిద్దరు పోయి తిరిగొచ్చారు. “ఖురైష్ సైన్యం మదీనాకు అతి సమీపంగా వచ్చేసింది. వారి ఒంటెలు, గుర్రాలు మన పొలాలన్నిటిని మేసి ధ్వంసంచేశాయి. మదీనా పచ్చికబయళ్ళు కూడా పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయి” అనే వార్త విన్పించారు.

చీకటి తెరలు మదీనా నగరాన్ని దట్టంగా కప్పివేస్తున్నాయి. నగరం బయటి నుంచి ఉప్పెనలా ఉపద్రవం ముంచుకొస్తోంది. భయంకరమైన ఆ రాత్రి శత్రువులు ఏ క్షణాన ఎటువైపు నుంచి దాడిచేస్తారో తెలియకుండా ఉంది. ఒక్కొక్క ఘడియ ఒక్కొక్క యుగంలా గడుస్తోంది. కొందరు ముస్లింలు సైనిక దుస్తులు వేసుకొని ఖడ్గధారులయి రాత్రంతా నగర సరిహద్దుల్ని కాపలా కాస్తూ జాగరణ చేశారు. అయితే ఆ రాత్రి శత్రువుల నుండి ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండా క్షేమంగా గడచిపోయింది.

తెల్లవారింది. ఉదయభానుడు తన సువర్ణ కాంతులతో మదీనా నగరాన్ని పులకింప

జేశాడు. నగరంలో ఏదో హడావిడి కానవస్తోంది. దైవప్రవక్త (సల్లం) అత్యవసర సమావేశం ఏర్పాటుచేశారు. ముఖ్య అనుచరులతో సహా అనేకమంది సమావేశానికి హాజరయ్యారు. దైవప్రవక్త (సల్లం) పరిస్థితి సభికుల ముందుంచి ఇలా అన్నారు:

"ఖురైష్ సైన్యం నగరశివార్లలో మోహరించి ఉన్న సంగతి మీకందరికీ తెలుసు. ఇక ఏమాత్రం ఆలస్యంచేసినా పరిస్థితి విషమించేలాఉంది. శత్రువుని ఎలా ఎదుర్కొం దామో ఆలోచించండి. నగరం వెలుపల శత్రువు జోలికి పోకుండా మనం మదీనాలో ఉండిపోతేనే మంచిదని నా అభిప్రాయం. శత్రువు మదీనాపై దాడిచేయకుండా అక్కడే ఆగిపోతే మనకు ఎలాంటి చిక్కులేదు. మదీనా వీధులు, సందులు మనకు తెలిసినంత వివరంగా వారికి తెలియవు. అంచేత శత్రువులు మన మీదికి దాడిచేయడానికి వస్తే మనం నగరంలోనే ఉండి వారిని ఎదుర్కోవచ్చు. అనేకమందిని అవలీలగా పట్టి హత మార్చవచ్చు. మరి మీ ఉద్దేశ్యం ఏమిటో చెప్పండి."

దైవప్రవక్త (స) కంటే ఎక్కువ విజ్ఞతకల అభిప్రాయం ఎవరు వ్యక్తపరచగలరు? ప్రధాన సహచరులంతా సంతోషంతో ఈ అభిప్రాయంతో ఏకీభవించారు. కాని కపటవిశ్వాసి అబ్దుల్లా బిన్‌ఉబై కూడా ఈ అభిప్రాయాన్ని సమర్థించడం మాత్రం ఆశ్చర్యంగా ఉంది.

అయితే బదర్‌యుద్ధంలో పాల్గోలేక పోయినవారు కొందరున్నారు. బదర్ యుద్ధంలో పాల్గోలేకపోయామే అనే బాధ వాళ్ళను పీడిస్తోంది. ఆ యుద్ధంలో ముస్లింలకు లభించిన అద్భుత విజయం చూసిన యువకులు కూడా మరికొందరున్నారు. వీరంతా ఆవేశంతో నగరం నుండి బయలుదేరి యుద్ధం చేయాలని పట్టుబట్టారు. వీరి వాదనలతో మిగిలిన ముస్లింలలో కూడా నూతనోత్సాహం పెల్లుబికింది. అనేకమంది నగరం బయటికెళ్ళే యుద్ధం చేయడానికి తహతహలాడారు. వీళ్ళను బదర్‌వీరులు కూడా బలపరిచారు.

దైవప్రవక్త (సల్లం) పరిస్థితి అర్థంచేసుకొని సమావేశాన్ని ముగిస్తూ "అధిక సంఖ్యాక సభ్యుల అభిప్రాయం ప్రకారమే నగరం వెలుపలికెళ్ళి శత్రువులతో పోరాడుదాం" అని తీర్మానించారు. ఆ తర్వాత దైవప్రవక్త (స) హిజ్రీశకం 3వ సంవత్సరం, షవ్వాల్ నెలలో మదీనా నగర పాలకునిగా అంధఅనుయాయి హజ్రత్ ఇబ్నె ఉమ్మె మక్తూమ్ (రజి)ని నియమించి వేయిమంది యోధులతో బయలుదేరారు.

సైన్యంలో కపటవిశ్వాసుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబయి తన మూడొందల మంది అనుయాయులతో వచ్చిచేరాడు. అయితే రెండుమైళ్ళు పోయాక అతను నాటకం చాలించి తన అనుయాయుల్ని తీసుకొని సైన్యం నుంచి వేరయిపోయాడు. హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి) అతనికి అనేక విధాలుగా నచ్చజెప్పారు. దైవప్రవక్త (సల్లం)తో చేసుకున్న స్నేహ ఒడంబడికను కూడా గుర్తుచేశారు. అయినా అతను వినలేదు. పైగా "ముహమ్మద్ మామాట వినకుండా ఆ కుర్రకుంకలు చెప్పిన మాటలు విని అనుస రించాడు" అన్నాడు చురచుర చూస్తూ.

హజ్రత్ అబ్దుల్లా (రజి) అతని అనుచరులకైనా నచ్చజెబుతామని "సోదరులారా! దైవానికి భయపడండి. శత్రుసైన్యాలు సమీపానికి వచ్చిఉన్న ఇలాంటి క్లిష్ట సమయంలో మీరు మీప్రవక్త (స)ను, మీ సోదరయోధులను వదలి పోవడం భావ్యం కాదు" అన్నారు.



"శత్రువులతో పోరాడవలసి వస్తుందని నమ్మకముంటే మేము మిమ్మల్ని వీడిపోము. అలాంటి పరిస్థితి రాదని మా అభిప్రాయం" అని చెప్పి వెళ్ళిపోయారు ఆ విశ్వాసఘాతకులు.

ఆ కపటులతో "రండి, దైవమార్గంలో పోరాడండి. (శత్రు)దాడిని తిప్పికొట్టి (మీనగరాన్ని) కాపాడుకోండి" అని అన్నప్పుడు "యుద్ధం సంగతి మాకు తెలిసివుంటే మేము తప్పకుండా మీతో చేరేవాళ్ళం" అని అన్నారు. ఇలా అంటున్నప్పుడు వారు విశ్వాసం కన్నా అవిశ్వాసానికే ఎక్కువ చేరువగా ఉన్నారు. వారు తమ హృదయాల్లోలేని మాటలు చెబుతున్నారు. వారు తమ హృదయాల్లో దాచినదేమిటో దేవునికి బాగా తెలుసు. (3:166,167)

# 19. ఉహుద్ కొండల్లో సమరజ్వాలలు

కపటవిశ్వాసులు వెళ్ళిపోగా ఇక సైన్యంలో ఏడొందల మంది యోధులు మాత్రమే మిగిలారు. ఈ ఏడొందలమంది యోధులతో మూడువేలమంది శత్రుసైనికుల్ని ఎదుర్కోవ డానికి ముందుకుసాగారు సత్యధర్మ వైతాళికుడు ముహమ్మద్ (స). చివరికి ఈ సైన్యం మదీనా నుంచి నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న ఉహద్ ప్రాంతానికి చేరుకుంది.

దైవప్రవక్త (స) తన యోధులను కొండ దిగువభాగాన శత్రుసేనలకు అభిముఖంగా నిలబెట్టి పంక్తులను తీర్చిదిద్దారు. సైన్యాలకు తూర్పువైపు కొండల్లో ఓచిన్న సందు ఉంది. అటునుంచి శత్రువులు వచ్చి దాడిచేసే ప్రమాదం ఉంది. అంచేత దైవప్రవక్త (స) కీలకమైన ఆ ప్రదేశంలో ఏభైమంది విలుకాండ్రను ఉంచి వారినిలా ఆదేశించారు:

"మీరు ఇక్కడుండి వెనుక వైపునుంచి శత్రుదాడి జరక్కుండా చూడాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా శత్రువులు అటునుంచి మావెనుక వైపుగా వచ్చి దాడిచేస్తారు కనుక మీ స్థానంలో స్థిరంగా ఉండండి. ఒక్క అడుగ్గూడా కదలకూడదు. మేము గెలిచినా, శత్రుసైన్యంలో జొరబడినా మీరీ స్థానాన్ని వదలిపెట్టకూడదు. శత్రువులు మమ్మల్ని హత మార్చినా మీరు మా సహాయానికి రావలసిన పనిలేదు. మీరు ఇక్కడే ఉండి శత్రువుల మీద బాణాల విడుస్తూ ఉండండి. బాణాలకు గుర్రాలు భయపడి పరుగెత్తుతాయి."

దైవప్రవక్త (స) ఆదేశాలు స్వీకరించి ఆ యాభైమంది విలుకాండ్రు హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) నాయకత్వంలో ఆ కీలక ప్రదేశానికి వెళ్ళి నిలబడ్డారు.

హిజ్రీశకం 3వ యేట, షవ్వాల్ నెల 15వ తేది ఉదయం ధర్మాధర్మాల మధ్య, సత్యా సత్యాల మధ్య సంకుల సమరం ప్రారంభమయింది. ఉభయపక్షాలు భీకరంగా పోరాడసాగాయి. కాస్సేపటికి సత్యతిరస్కారులు ముస్లింల ధాటికి నిలువలేక పలాయనం చిత్తగించారు. యుద్ధమైదానం ఖాళీ అయింది. అవిశ్వాసులు పారిపోయారో లేదో ముస్లింలు వారు వదలిపోయిన వస్తువులు సేకరించడం మొదలుపెట్టారు. అటు కీలకప్రదేశంలో స్థిరంగా నిలబడమని నియమించబడిన విలుకాండ్రు కూడా ఆ ప్రదేశం వదలిపెట్టి సమరసొత్తు సేకరించడానికి పరుగెత్తారు.

ఇలా ముస్లింలు సమరసొత్తు సేకరించడంలో మునిగిపోయి ఉంటే అటు అవిశ్వాసులు పారిపోయినట్టే పారిపోయి కొండ వెనుక వైపు నుంచి కీలక ప్రదేశం గుండా తిరిగొచ్చి ముస్లింలపై విరుచుకుపడ్డారు. ఈ హఠాత్పరిణామానికి ముస్లింలు బిత్తర

పోయారు. తమను తాము సంబాళించుకొని ఎదురు దాడి చేసేలోగానే అవిశ్వాసులు అనేక మంది ముస్లింలను వధించారు. మిగిలినవారు ప్రాణాలకు తెగించి హోరాహోరిగా పోరాడసాగారు. కాని సైనిక పంక్తులు అస్తవ్యస్తమయ్యాయి.

“దేవుడు మీకు చేసిన (సహాయ) వాగ్దానాన్ని నెరవేర్చాడు. ప్రారంభంలో మీరే దేవుని ఆజ్ఞతో అవిశ్వాసుల్ని వధిస్తుండేవారు. కాని ఆ తరువాత మీరు కోరుకున్నదాన్ని (అంటే సమర సొత్తును) దేవుడు చూపగానే మీరు ధైర్యం కోల్పోయారు. (ప్రవక్త ఇచ్చిన) ఆజ్ఞ విషయంలో మీరు పరస్పరం విభేదాలకు లోనై అవిధేయత చూపారు. మీలో కొందరు ప్రాపంచిక సంపదను ఆశించారు. మరికొందరు పరలోక ప్రతిఫలం కోరుకున్నారు. అప్పుడు దేవుడు మిమ్మల్ని పరీక్షించడానికి శత్రువుల నుండి మీదృష్టిని (వేరే వైపునకు) మరల్చి పారిపోయేలా చేశాడు.” (ఖుర్ఆన్-3:152)

ఆ సందర్భంలో దైవప్రవక్త (స) శత్రువులు తీసిన ఒక గోతిలో పడిపోయి స్వల్పంగా గాయపడ్డారు. మరొక వైపు అవిశ్వాసులు దైవప్రవక్త (స) వధించబడ్డారని పుకారు పుట్టించారు. దాంతో ముస్లింలలో ఒక్కసారిగా సమరోత్సాహం తగ్గిపోయింది. వారిలో కొందరు నిరాశతో ఢీలా పడిపోయి యుద్ధం చేయకుండా పక్కకు తప్పుకున్నారు. మరికొందరు రణరంగం నుండి పారిపోవడానికి ప్రయత్నించారు.

“మీరు ఇట్టే స్వర్గంలో ప్రవేశిస్తామనుకుంటున్నారా? మీలో దైవమార్గంలో పోరాడే వారిని దేవుడు ఇంకాసరిగా పరీక్షించనే లేదు. వారు ఏమేరకు సహనం వహించి ధ్యేయ పథంలో స్థిరంగా ఉంటారో ఆయన చూడదలిచాడు. ఇదివరకు (దైవమార్గంలో పోరాడి) మరణించే అవకాశం రాకముందు మీరు దాన్ని కోరుతుండేవారు. ఇప్పుడది మీముందుకు వచ్చింది. మీరు దాన్ని కళ్ళారా చూసుకున్నారు కూడా. (కనుక మీరు ప్రాణాలకు తెగించి పోరాడాలిగాని, ధైర్యం కోల్పోయి ఢీలా పడిపోకూడదు.)-(ఖుర్ఆన్-3:142,143)

“ముహమ్మద్ దైవప్రవక్త మాత్రమే. ఇతనికి పూర్వం కూడా అనేకమంది దైవప్రవక్తలు వచ్చిపోయారు. మరి ఇతనిప్పుడు చనిపోతే లేక చంపబడితే మీరు (ధర్మపథం నుండి) వెనుదిరిగిపోతారా? గుర్తుంచుకోండి, అలా వెనుదిరిగిపోయేవాడు దేవునికి ఎలాంటి నష్టం కల్గించలేడు. దేవుడు తనకు కృతజ్ఞత చూపేవారికే తగినబహుమానం ఇస్తాడు.”

“దేవుని అనుజ్ఞ లేనిదే నిర్ణీత సమయానికి ముందు ఏ ప్రాణికీ చావు రాదు. ప్రతి ప్రాణికీ మరణకాలం వ్రాయబడి ఉంది. కేవలం ప్రాపంచిక ప్రతిఫలాపేక్షతో పనిచేసే వారికి మేము ప్రపంచంలోనే వారి ప్రతిఫలం ఇచ్చివేస్తాం. పరలోక ప్రతిఫలాపేక్షతో పని చేసేవారికి పరలోకంలో వారికి రావలసిన ప్రతిఫలం అనుగ్రహిస్తాం. కృతజ్ఞులై ఉండే వారికి మేము తప్పకుండా తగిన బహుమానం ప్రసాదిస్తాము.” (ఖుర్ఆన్-3:144,145)

“ఇంతకు పూర్వం ఎంతోమంది దైవప్రవక్తలు గతించారు. వారితో కలసి దైవభక్తులు ప్రాణాలొడ్డి (శత్రువులతో) పోరాడారు. అప్పుడు దైవమార్గంలో ఎదురైన కష్టాల వల్ల వారు ధైర్యం కోల్పోలేదు. పిరికిచర్యలకు పాల్పడి అధర్మానికి తలవంచనూ లేదు. అలాంటి స్థిర చిత్తులనే దేవుడు ప్రేమిస్తాడు. పైగా వారు “ప్రభూ! మా తప్పులు మన్నించు. నీ మార్గంలో మేమేదైనా హద్దుమీరి ఉంటే దాన్ని కూడా క్షమించు. మా కాళ్ళకు స్థిరత్వం చేకూర్చి



అవిశ్వాసులపై మాకు విజయం ప్రసాదించు.” అని వేడుకున్నారు. కనుక దేవుడు వారికి ప్రపంచంలో తగినప్రతిఫలం ఇచ్చాడు; పరలోకంలో అంతకంటే ఎంతో శ్రేష్ఠమైన ప్రతిఫలం ప్రసాదిస్తాడు. అలాంటి సద్వర్తునులనే దేవుడు అభిమానిస్తాడు. (3:146-148)

ఆ తరువాత దైవప్రవక్త (స) హతమార్చబడ్డారన్న వార్త నిజం కాదని తెలియడంతో ముస్లిం యోధులు చల్లగా ఊపిరి పీల్చుకొని తిరిగి విజృంభించారు. చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు ఎలాగో మొత్తంమీద అంతిమ విజయం ముస్లింలనే వరించింది. అటు అవిశ్వాసులు విజయం సాధించలేకపోయినా ముస్లింలకు జరిగిన అపార నష్టం చూసి మీసాలు మెలేశారు. వారి సేనాపతి అబూసుఫ్యాన్ “ఈ యుద్ధం బదర్‌యుద్ధంతో సమానమైనది. మేము బదర్ ప్రతీకారం తీర్చుకున్నాం. వచ్చే ఏడు బదర్‌లో మన ఉభయుల మధ్య మళ్ళీ పోటీ ఉంటుంది” అంటూ వెళ్ళిపోయాడు.

ఈ యుద్ధంలో దైవప్రవక్త (స) పినతండ్రి హజ్రత్ హమ్జా (రజి)ని అవిశ్వాసులు హతమార్చిన తరువాత ఆయన భౌతిక కాయాన్ని ముక్కలు ముక్కలుగా ఖండించారు. ఈ భయానక దృశ్యం చూడగానే దైవప్రవక్త (స) కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. ఆయన ఆవేదనాభరిత హృదయంతో “నేను ఎప్పటికైనా శత్రువులపై ఆధిక్యత పొంద గలిగితే వారిలో ముప్ఫయి మంది మనుషులకు ఇదే గతి పట్టిస్తాను” అని అన్నారు. దానిపై దివ్యఖుర్ఆన్ ఇలా ప్రతిస్పందించింది:

“మీరు ప్రతీకారం తీర్చుకో దలిస్తే మీపై ఏ మేరకు దౌర్జన్యం జరిగిందో ఆ మేరకే బదులు తీర్చుకోండి. అయితే సహనం వహిస్తే అది సహనం వహించేవారికి ఎంతో మంచిది. కనుక (ముహమ్మద్!) సహనం వహించు. నీకు సహన గుణం దేవుని ద్వారానే అబ్బింది. వారి చర్యలకు బాధపడకు. వారి మోసపు ఎత్తుగడలకు మనస్తాపం చెందకు. దైవఅవిధేయతకు దూరంగా ఉంటూ దేవుని అయిష్టతకు భయపడి సత్పురుషులుగా ఉండేవారికే ఆయన తోడుగా ఉంటాడు” (ఖుర్ఆన్. 16:126-128)

దైవప్రవక్త (స) విశ్వప్రభువు ఆజ్ఞ ముందు తలవొంచి శత్రువుల్ని క్షమించారు.

“(ముహమ్మద్! ఓరోజు) నీవు ఉదయం ఇంటి నుండి బయలుదేరి విశ్వాసుల్ని యుద్ధానికి సమాయత్త పరచడం ప్రారంభించావు. ఆ సందర్భం గుర్తుచేసుకో. దేవుడు సమస్తం వింటాడు, ఆయన సర్వం ఎరిగినవాడు. అప్పుడు మీలో రెండు వర్గాలు ధైర్యం కోల్పోయి (యుద్ధరంగం నుంచి) దాదాపు పారిపోజూశాయి. కాని దేవుడు వారిని ఆదు కున్నాడు. అసలు దేవుడే వారి రక్షకుడు, సహాయకుడు. కనుక విశ్వాసులు ఎల్లప్పుడూ ఆయన్నే నమ్ముకొని ఉండాలి. దేవుడు మిమ్మల్ని బద్ర్ యుద్ధంలో కూడా ఆదుకున్నాడు. అప్పుడు కూడా మీకు సరైన ఆయుధాలు, సరిపడ వనరులు లేవు. (అయినా మీకు మేము విజయం చేకూర్చాం.) అందువల్ల దేవునికి భయపడండి; ఆయనకు కృతజ్ఞులై ఉండండి.” (ఖుర్ఆన్. 3:121-123)

(విశ్వాసులారా!) బాధపడకండి. అధైర్యంతో క్రుంగిపోకండి. మీరు నిజమైన విశ్వాసులైతే చివరికి మీరే విజయం సాధిస్తారు. (సత్యాసత్యాల సమరంలో) మీరేకాదు, వారు కూడా దెబ్బతిన్నారు. (ఆమాత్రానికే ధైర్యం కోల్పోవడమా!) ఇవన్నీ మేము ప్రజల మధ్య తిప్పే కాలపు మిట్టపల్లాలు మాత్రమే. ఆయన మీలో నిజమైన విశ్వాసులెవరో పరీక్షిం

చడానికి, కొందరిని సత్యానికి సాక్షులు (అమరగతులు)గా చేయడానికి ఈవిధంగా చేశాడు. దేవుడు దుర్మార్గుల్ని ఎన్నటికీ ప్రేమించడు. ఆయన ఇలాంటి పరీక్ష ద్వారా నిజ మైన విశ్వాసులు ఎవరో ఏరివేసి, అవిశ్వాసుల్ని అణచి వేయదలిచాడు." (ఖుర్ఆన్-3:139-141)

ఒక విధంగా చెప్పలంటే ఈ (ఉహుద్)యుద్ధంలో ఏ వర్గానికీ స్పష్టమైన విజయం లభించలేదు. అయితే యావత్తు అరబ్ బహుదైవారాధకుల్లో ముస్లింలు ఓడిపోయారని, మక్కా ఖురైషీయులు ఘనవిజయం సాధించారని ప్రచారం జరిగింది. దాంతో కొన్ని తెగలు మదీనాపై దాడి చేయడానికి, ముస్లింలను హతమార్చడానికి పూనుకున్నాయి. దైవప్రవక్త (స) శత్రువుల కార్యకలాపాలను గురించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసు కుంటూ వాటి ప్రయత్నాలలో రెండిటిని భగ్నం చేశారు. ఆ తరువాత అవిశ్వాసులు కుట్రపూరితమైన కార్యకలాపాలకు పూనుకున్నారు.

## 20. మోసపోయిన ముస్లిం బోధకులు

కొన్నాళ్ళకు హుజైల్ తెగకు సన్నిహితులయిన అజల్, ఖారా తెగల వ్యక్తులు కొందరు మదీనా వచ్చి దైవప్రవక్త (సల్లం)ను కలుసుకున్నారు. వారాయనతో "ముహమ్మద్ గారూ! మా తెగవాళ్ళు ఇస్లాం వైపు ఆకర్షితులయ్యారు. వారికి ఇస్లాంధర్మం గురించి వివరించి, దాని ఆదేశాలేమిటో తెలియజేయవలసిన అవసరం ఉంది. అందువల్ల మీరు మా దగ్గరికి కొందరు బోధకులను పంపండి" అని మనవి చేశారు.

ఏ తెగవాళ్ళయినా ఇస్లాం స్వీకరిస్తే వారికి ధర్మవిద్య బోధించేందుకు తన అనుచరులు కొందరిని అక్కడికి పంపడం దైవప్రవక్త (స) సంప్రదాయం. దాని ప్రకారమే ఆయన ఇప్పుడు ఆరుగురు అనుచరుల్ని ఎంపికచేసి ఆ వ్యక్తుల వెంట పంపించారు. అయితే ఆ దుర్మార్గులు దారిలో మరికొన్ని తెగలతో కుమ్మక్కయి వాటిని ముస్లింలకు వ్యతిరేకంగా ఉసిగొల్పారు. ఆ తెగలవారు ముస్లింలను చుట్టుముట్టినప్పుడు జరిగిన యుద్ధంలో నలుగురు ముస్లింలు పోరాడి వీరమరణం పొందారు. మిగిలిన ఇద్దరిని దుర్మార్గులు మక్కా తీసికెళ్ళి ఖురైషీయులకు అమ్మివేశారు. ఖురైషీయులు వారిద్దరిని చిత్రహింసలు పెట్టి దారుణంగా హతమార్చారు.

ఈ సంఘటన జరిగిన కొన్నాళ్ళకు బనీఆమిర్ తెగ నాయకుడు అబూబరా దైవప్రవక్త (సల్లం)ను కలుసుకొని "ముహమ్మద్ గారూ! మా తెగలో ఇస్లాం ప్రచారం చెయ్యడానికి మీవాళ్ళను కొందర్ని పంపండి. వారి ప్రచారం వల్ల ఇస్లాం మరింత విస్తరించే అవకాశం ఉంది. ఆ విధంగా మీ కోరిక నెరవేరుతుంది" అన్నాడతను.

"కాని నజద్ విషయంలో నాకు అనుమానంగా ఉంది" అన్నారు దైవప్రవక్త (సల్లం). "అనుమానించకండి. వారు నా రక్షణలో ఉంటారు. మీరు నిస్సంకోచంగా పంపండి" అన్నాడు అబూబరా. అబూబరా రక్షణలో ఉండేవారెవరికీ ప్రమాదం ఉండదు. ఆ నమ్మకం తోనే దైవప్రవక్త (స) తన అనుచరుల్లో నలభై మందిని ఎంపికచేసి నజద్‌కు పంపారు.

వీరు మదీనా నుండి బయలుదేరి బిర్‌మవూనా అనే ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ బనీఆమిర్ తెగతోపాటు బనీసులైమ్ అనే మరో తెగ కూడా ఉంది. ముస్లింలు



ఒక ప్రతినిధి ద్వారా ఆ తెగ నాయకుడు ఆమిర్ ఇబ్నె తుఫైల్ దగ్గరకు ప్రవక్త సందేశాన్ని పంపించారు. కాని ఇబ్నె తుఫైల్ ప్రవక్త సందేశ పత్రాన్ని అగౌరవపరచడమే గాకుండా సందేశ పత్రం తెచ్చిన ప్రతినిధిని హతమార్చి మిగిలిన ముస్లింలపై బనీసులైంకు చెందిన ఉసయ్యా, రీల్, జక్వాన్ ఉపతెగలను ఉసిగొల్పాడు.ఆ దుర్మార్గులు పెద్ద గుంపుగా వచ్చి ముస్లింలపై విరుచుకుపడ్డారు. ఈ హఠాత్పరిణామానికి ముస్లింలు నిర్ఘాంతపోయారు.

వెంటనే వారు సంబాళించు కొని ఎదురుదాడి చేశారు. కాని అంత పెద్ద శత్రుమూక ముందు నిలవలేక ఇద్దరు తప్ప అందరూ ఆ పోరాటంలో అమరగతులయ్యారు. ఆ ఇద్దరిలో ఒకతను తీవ్రంగా గాయపడటంతో చనిపోయి ఉంటాడని భావించి శత్రువులు ఆయన్ని వదలిపెట్టి పోయారు. ఆ నిర్భాగ్య ముస్లిం ఆ తరువాత ఎక్కడెక్కడ తిరిగాడో, ఎన్నెన్ని కష్టాలు అనుభవించాడో! చివరికి ఎలాగో మదీనా చేరుకున్నాడు.

రెండవ ముస్లిం హజ్రత్ అమ్ర్ బిన్ ఉమయ్యా (రజి)ని ఇబ్నెతుఫైల్ బంధించి తీసికెళ్ళాడు. తరువాత అతను తన తల్లి ఒక బానిసను విముక్తం చేస్తానని మొక్కుబడి చేసుకొని ఉండటంవల్ల ఆమె కోరికపై ఆయన్ని విడిచిపెట్టాడు. హజ్రత్ అమ్ర్ బిన్ ఉమయ్యా (రజి) మదీనా చేరుకొని జరిగిన సంఘటన దైవప్రవక్త (స)కు వివరించారు.

దైవప్రవక్త (సల్లం) అవిశ్వాసుల నమ్మకద్రోహం సంగతి విని ఎంతో విచారం వ్యక్త పరుస్తూ "ఇదంతా అబూబరా పని. నేనందుకే ముందు మనవాళ్ళను పంపడానికి జంకాను" అన్నారు అనుచరులతో. తరువాత ఆయన తీవ్రమైన మనస్తాపంతో "దేవా! ఈ దుర్మార్గులపై ప్రతీకారం తీర్చుకో" అని ప్రార్థించారు. ఈ విధంగా ఆయన నెల రోజులదాకా ఆ దుర్మార్గుల్ని శపిస్తూ దైవాన్ని ప్రార్థించారు. సరిగ్గా ఒక నెల తరువాత ఆమిర్ బిన్ తుఫైల్ ప్లేగువ్యాధి సోకి చనిపోయాడు.

హజ్రత్ అమ్ర్ బిన్ ఉమయ్యా (రజి) తిరుగుప్రయాణంలో రాత్రివేళ శత్రుపక్షం వారనుకొని పొరపాటున ఇద్దరు మనుషుల్ని చంపారు. ఆయన నోట ఈ సంగతి విని దైవప్రవక్త (సల్లం) విచారం వెలిబుచ్చుతూ "ఆ ఇద్దరు బనీసాద్ తెగ యూదులు. బనీసాద్ తెగవాళ్ళు కూడా మనతో స్నేహఒప్పందం చేసుకొని ఉన్నారు. ఇది తెలియక చేసిన తప్పు. అయినప్పటికీ మనం ఆ తెగవాళ్ళకు రక్తపరిహారం చెల్లించవలసి ఉంటుంది. బనీసాద్ తెగ బనీనజీర్ తెగకు చెందిన ఉపతెగ. అంచేత మనం బనీనజీర్ తెగవాళ్ళతో సంప్రదించి రక్తపరిహారం చెల్లిద్దాం, పదండి" అన్నారు.

## 21. బనీనజీర్ యూదుల బహిష్కరణ

అయితే బనీనజీర్ తెగ యూదులు దైవప్రవక్త (సల్లం)ను ఎంతో గౌరవిస్తున్నట్లు నటిస్తూ, ఓ ఇంటిగోడ పక్క కూర్చోబెట్టి తియ్యటి మాటల్లోకి దించి, ఇంటి కప్పు పైనుంచి బండరాయి జారవిడిచి చంపడానికి ప్రయత్నించారు. సృష్టికర్త ఈ కుట్ర సంగతి దైవప్రవక్త (సల్లం)కు తెలియజేసి, ఆయన్ని అక్కడ్నుంచి మెల్లిగా జారుకునేలా చేశాడు.

మరునాడు దైవప్రవక్త (సల్లం) బనీనజీర్ యూదులకు అల్టిమేటం ఇస్తూ "మీరు ఒప్పందం ఉల్లంఘించారు. నన్నే అంతమొందించడానికి కుట్ర పన్నారు. ఇక చాలు ఈ

మైత్రి. వెంటనే ఈప్రాంతం ఖాళీచేసి వెళ్ళిపోండి. పదిరోజులు గడువిస్తున్నాం. ఆ తర్వాత కూడా మీరీ ప్రాంతంలో ఉన్నారా.... మీకు వినాశం తప్పదు'' అని హెచ్చరించారు.

ఈ అల్టిమేటం విని యూదులు నిలువునా కంపించి పోయారు. ఇక ఈ ప్రాంతంలో ఉండటం తమ ధనప్రాణాలకు క్షేమకరం కాదని గ్రహించి వారిలో అత్యధికులు వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యారు. అయితే వారు వేరేప్రాంతానికి వెళ్ళిపోవడానికి తీసుకున్న నిర్ణయం కపటవిశ్వాసి ఇబ్నెఉబైకు తెలిసి అతను వారికి ధైర్యంచెబుతూ ఇలా వార్త పంపాడు:

''మీరు వెళ్ళిపోకండి. ఇక్కడ మీ తోటలు, పొలాలు ఉన్నాయి. అందమైన మేడలు, కోటలు ఉన్నాయి. వీటన్నిటిని వదలిపెట్టి ఎక్కడికి వెళ్తారు? వద్దు, వెళ్ళనవసరం లేదు. నాదగ్గర రెండువేల మంది సైనికులున్నారు. వారు మీకోసం ప్రాణాలు తెగించి పోరాడుతారు. మీరు మీ కోటలలో ప్రవేశించి తలుపులు బిగించుకోండి. ఆ తరువాత విషయాలు మేము చూసుకుంటాం. మీకు ఎలాంటి ప్రమాదం లేదు.''

బనీనజీర్ తెగనాయకుడు హుయ్యి బిన్ అఖ్తబ్ ఈ హామీ మాటలు విని సంతోషంతో ఎగిరి గంతేశాడు. తన తెగకు కొండంత అండ దొరికిందని భావించి విర్రవీగాడు. అతను దైవప్రవక్త (స) ఇచ్చిన అల్టిమేటం ఖాతరు చేయకుండా ''మేమీ ప్రాంతాన్ని ఖాళీచేసి వెళ్ళిపోయే ప్రసక్తే లేదు. మీ ఇష్టమొచ్చినట్లు చేసుకోండి'' అని తెగేసి చెప్పాడు.

దైవప్రవక్త (స) ఇచ్చిన గడువు ముగిసింది. కాని బనీనజీర్ తెగవాళ్ళు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయలేదు. వారు తమ కోటలలో దాక్కొని తలుపులు మూసేసుకున్నారు. దృఢంగా ఉన్న తమ కోటల్ని, కపటవిశ్వాసుల అండదండల్ని చూసుకొని విర్రవీగారు.

“కపటవైఖరి అవలంబించిన వారిని నీవు గమనించలేదా? వారు గ్రంథప్రజలకు చెందిన తమ సత్యతిరస్కార సోదరులతో ‘మిమ్మల్ని వెళ్ళగొడ్తే మీతోపాటు మేము కూడా బయలుదేరుతాం. మీ విషయంలో మేము ఎవరిమాటా వినము. ఒకవేళ యుద్ధం జరిగితే మేము తప్పక మీకు సహాయం చేస్తాం’ అని అంటారు. కాని వీరసలు పచ్చి అబద్ధాలకోరులు. అందుకు దేవుడే సాక్షి. ఒకవేళ గ్రంథప్రజలు బహిష్కరించబడితే వీరు మాత్రం వారివెంట బయలుదేరరు. అలాగే వారితో యుద్ధం జరిగితే వారికి ఈ కపటులు ఏమాత్రం సహాయం చేయరు. ఒకవేళ సహాయం చేయడానికి యుద్ధరంగంలో దిగినా, (మరుక్షణమే) వీరు వెన్నుజూపి పారిపోతారు. ఇక వారికి ఎటునుంచి కూడా ఎలాంటి సహాయం లభించదు.”

“అసలు వారి హృదయాల్లో దైవభయం కన్నా మీభయమే ఎక్కువగా తిష్ఠవేసి ఉంది. దానిక్కారణం వారిలో విజ్ఞతా వివేచనలు నశించి పోవడమే. వారు సంఘటితమై మిమ్మల్ని ఎన్నడూ (బహిరంగంగా) ఎదుర్కోలేరు. ఒకవేళ ఎప్పుడైనా ఎదుర్కోడానికి సిద్ధపడినా వారు కోటద్వారాలు మూయబడిన జనపదాలలో కూర్చొని, లేదా గోడలవెనుక దాక్కొని పోరాడుతారు. వారు పరస్పరం తీవ్రంగా కలహించుకుంటారు. వారు సంఘటితంగా ఉన్నట్లు మీకు కన్పించవచ్చు. కాని వారి హృదయాలు పరస్పరం ద్వేషంతో నిండి ఉన్నాయి. ఈ పరిస్థితికి కారణం వారిలో బుద్ధి వివేచనలు లోపించడమే.” (ఖుర్ఆన్. 59:11-14)

హిజ్రీశకం 4వ సంవత్సరం రబీవుల్అవ్వల్ నెలలో దైవప్రవక్త (స) యుద్ధ ప్రకటన



చేశారు. అప్పుడు ముస్లింలు బనీనజీర్‌తెగ యూదుల కోటలను ముట్టడించి యుద్ధం ప్రారంభించారు. ఇలా అనేక రోజులు గడచిపోయాయి. దైవప్రవక్త (స) కోట వెలుపల దారిలో యుద్ధానికి అవరోధంగా ఉన్న ఖర్జూరపు చెట్లను నరికేయమని అనుచరుల్ని ఆదేశించారు. ఈ చెట్లవల్ల కోటలను ముట్టడించడం ముస్లింలకు కష్టమైపోయింది.

“(ఈ దాడి సందర్భంగా) మీరు కొన్ని ఖర్జూరపు చెట్లు నరికి, మరికొన్నిటిని నరక్కుండా వదిలేశారంటే అది దేవునిఆజ్ఞ వల్లనే జరిగింది. దుర్మార్గుల్ని అవమానం పాల్జేయడానికే (ఆయన ఈ ఆజ్ఞ జారీచేశాడు).” (ఖుర్ఆన్-59:5)

దైవప్రవక్త (సల్లం) ఆదేశం ప్రకారం అనుచరులు చెట్లను నరకడం ప్రారంభించారు. దాంతో ప్రమాదం ముంచుకొస్తోందని తలచి యూదులు బెంబేలెత్తిపోయారు. వారు ఇబ్నెఉబై మీద పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. అతను రాలేదు. అతని రెండువేల సైన్యమూ లేదు. నలువైపులా నిరాశా కారుమేఘాలు కమ్ముకున్నాయి. అయితే దైవప్రవక్త (స) కారుణ్యకడలిపై వారికి నమ్మకముంది. ఆ నమ్మకంతోనే వారు కాళ్ళబేరానికి వచ్చారు.

''సోదరా ముహమ్మద్! మమ్మల్ని కాపాడండి. మేము ఇక్కడ్నుంచి వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్నాం'' అన్నారు వారు దైవప్రవక్త (సల్లం)ను విన్నవించుకుంటూ.

''సరే, ఖాళీచేసి వెళ్ళిపోండి. ఆయుధాలు మాత్రం ఇక్కడే వదిలేసి వెళ్ళాలి. అలాగే ఇతర సామగ్రి కూడా ఇక్కడే వదలిపెట్టి వెళ్ళాలి. ఒక ఒంటెపై ముగ్గురు మనుషులతో పాటు, ఎంత ఆహారధాన్యం తీసికెళ్ళగలిగితే అంత మేరకు తీసికెళ్ళవచ్చు'' అంటూ దైవప్రవక్త (సల్లం) సమాధానమిచ్చారు వారికి.

యూదులు ఈ షరతును ఒప్పుకున్నారు. ఒప్పుకోక ఏం చేస్తారు? ప్రమాదం పీకల మీదికొచ్చి కూర్చుంది! స్నేహ ఒప్పందం ఉల్లంఘించి నమ్మక ద్రోహానికి పాల్పడ్డారు!! ఈ విధంగా తాము తవ్వుకున్న గోతిలో తామే పడ్డారు. కపట విశ్వాసుల్ని నమ్ముకొని ఉన్నదంతా ఊడగొట్టుకున్నారు.

బనీనజీర్ యూదులు బహిష్కృతులై మదీనా నుండి బయలుదేరారు. జరిగిన అవమానభారం తగ్గించుకోవడానికన్నట్లు వారి స్త్రీలు మదీనా వీధుల్లో పాటలు పాడుతూ, తప్పెట్లు మోగిస్తూ నడిచారు. ఈవిధంగా వీరు మదీనా నుండి ఖైబర్ ప్రాంతానికి వెళ్ళి అక్కడే స్థిరపడి పోయారు. మరికొందరు సిరియా దిశగా వెళ్ళి దాని పరిసర ప్రాంతాల్లో నివాసాలు ఏర్పరచుకున్నారు.

బనీనజీర్ యూదులు తమ ఆస్తిపాస్తులన్నిటినీ మదీనాలో వదిలేసి వెళ్ళిపోయారు. వాటిలో అనేక ఆయుధాలు కూడా ఉన్నాయి. సారవంతమైన పొలాలు, సస్యశ్యామలమైన తోటలు కూడా ఉన్నాయి. అవన్నీ సమరసొత్తు రూపంలో ముస్లింలకు లభించాయి.

“ఆయనే గ్రంథప్రజలలో (నమ్మకద్రోహానికి పాల్పడి) అవిశ్వాసులయిపోయిన వారిని మొదటి దాడిలోనే వారి ఇండ్ల నుండి బయటికి గెంటివేశాడు. వారు వెళ్ళిపోతారని మీరు కలలో కూడా ఊహించలేదు. వారూ తమను తమ కోటలు దేవుని నుండి కాపాడుతాయని భావించారు. అయితే వారి ఊహ కూడా పోని దిశ నుండి దేవుడు వారిని చుట్టుముట్టాడు.

ఆయన వారి హృదయాలలో భయోత్పాతం సృష్టించాడు. తత్ఫలితంగా వారు తమ ఇండ్లను చేజేతులా నాశనం చేసుకున్నారు. మరోవైపు విశ్వాసుల చేతులతో కూడా నాశనం కొని తెచ్చుకున్నారు. కనుక కళ్ళున్న ప్రజలారా! గుణపాఠం నేర్చుకోండి." (ఖుర్‌ఆన్-59:2)

ఖురైష్ సేనాపతి అబూసుఫ్యాన్ ఉహద్ యుద్ధం నుండి వెళ్ళిపోతూ "వచ్చే ఏడు మళ్ళీ బదర్‌లో మన ఉభయవర్గాల మధ్య పోటీ ఉంటుంద"ని ముస్లింలను హెచ్చరించి వెళ్ళిపోయాడు. ఇప్పుడా సమయం వచ్చింది. దైవప్రవక్త (స) మదీనా పాలకుడిగా హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహ (రజి)ని నియమించి, అనుయాయుల్ని తీసుకొని బదర్ ప్రాంతానికి వెళ్ళారు. కాని అక్కడ ఖురైష్‌సైనికుల జాడేలేదు. ముస్లింలు అక్కడ ఎనిమిది రోజుల పాటు ఎదురుచూసి వారు రాకపోవడంతో తిరిగి వెళ్ళిపోయారు.

## 22. దూమతుల్ జందల్ దండయాత్ర

హిజ్రీశకం 5 సంవత్సరం, రబీవుల్‌అవ్వల్ నెలలో సిరియా సరిహద్దులోని దూమతుల్ జందల్ ప్రాంతపు క్రైస్తవరాజు అకీదర్ బిన్ మలిక్ మదీనా మీద దాడిచేయడానికి సన్నాహాలు చేస్తున్నాడని దైవప్రవక్త (సల్లం)కు తెలిసింది. అదీగాక ఆ రాజు ఆరబ్బు బాటసారులపై, వాణిజ్య బిడారాలపై దాడులు చేస్తూ దోచుకుంటున్నాడని కూడా తెలిసింది.

అందువల్ల దైవప్రవక్త (సల్లం) అనుచరులతో సంప్రదింపులు జరిపిన తరువాత అతడ్ని ఎదుర్కోవడానికి సిద్ధమయ్యారు. కొన్ని రోజుల్లోనే వేయిమంది ముజాహిద్‌లు సమకూరారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) సబా బిన్ అర్తఫా గిఫ్ఫారీ (రజి)ని మదీనా గవర్నర్‌గా నియమించి సైన్యాన్ని తీసుకొని దూమతుల్ జందల్‌కు బయలుదేరారు.

ఈ దండయాత్ర గురించి శత్రువుకు తెలియకుండా ఉండేందుకు ఆయన రాత్రి వేళల్లో మాత్రమే ప్రయాణం చేస్తూ కొన్నాళ్ళ తరువాత ఓరోజు రాత్రి పండువెన్నెల్లో ఒక పచ్చిక బీడులో ప్రవేశించారు. ఆ ప్రాంతం నుంచి దూమతుల్ జందల్ పట్టణం చాలా దగ్గర్లోనే ఉంది. అందువల్ల పట్నంలోని క్రైస్తవసైనికులు తమపై దాడిచేయడానికి సిద్ధంగా ఉంటారని ముస్లిం యోధులు భావించారు. కాని చూస్తే అక్కడ సైనిక కోలాహలం మచ్చుకైనా లేదు.

ముస్లిం యోధులు మధ్యాహ్నం వేళకు దూమతుల్ జందల్ పట్నంలోకి ప్రవేశించారు. కాని అక్కడి పరిస్థితి చూసి వారు ఆశ్చర్యచకితులయ్యారు. పట్నం వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. ఒక్క పురుగూ లేదు. ఇండ్లు, దుకాణాలు కూడా ఖాళీగా పడి ఉన్నాయి. కాకపోతే అక్కడక్కడ కొన్ని కుక్కలు మాత్రం మొరుగుతున్నాయి.

ముస్లిం సైనికులు పట్టణ వీధుల్లో తిరుగుతూ తలుపులు బార్లా తెరచి ఖాళీగా పడి ఉన్న ఇండ్ల వైపు విస్తుబోయి చూస్తున్నారు. పట్నం వదలి ఈజనం ఎక్కడికి పోయారో వారికి అర్థం కాలేదు. ఒకచోట ఒక ఇంటి కిటికీ నుంచి ఓ మనిషి తొంగిచూస్తున్నట్లు కన్పించాడు. వెంటనే ఓ సైనికుడు ఆ ఇంట్లో జొరబడి ఆ మనిషిని బయటికి లాక్కొచ్చాడు. పాపం ఆ మనిషి ముస్లిం సైనికుల్ని చూసి గజగజ వణికిపోసాగాడు.

"భయపడకు. చెప్పు మీ రాజు ఎక్కడికి పోయాడు?" అడిగారు దైవప్రవక్త (సల్లం).



"ప్రభూ! మీరు వస్తున్నారని తెలిసి మా రాజు డెమాస్కస్‌కు పారిపోయాడు" అన్నాడా వ్యక్తి కొంచెం భయపడుతూనే.

"అంటే మేం వస్తున్న సంగతి మీ రాజుకు ముందే తెలిసిందన్నమాట!"

"ఆ... తెలిసింది. మీరు వస్తున్నట్లు గూఢచారులు కొన్నాళ్ళకు ముందే మా రాజుకు సమాచారం అందజేశారు. అంచేత ఆయన ముందుగా పట్టణాన్ని ఖాళీచేయించి ప్రజల్ని వేరేచోటికి పంపించాడు. పట్నంలో మారాజు, ఆయన సైనికులు మాత్రమే ఉండిపోయారు. నిన్న రాత్రి ఇద్దరు పశువుల కాపర్లు వచ్చి ముస్లింల చక్రవర్తి వస్తున్నాడని చెప్పగానే మా రాజు కూడా సైన్యాన్ని తీసుకొని రాత్రే డెమాస్కస్‌కు పారిపోయాడు."

"మరి నువ్వెందుకు పారిపోలేదు?" అడిగారు దైవప్రవక్త (సల్లం). "నాకు పారిపోవడానికి అవకాశం దొరకలేదు" అన్నాడా క్రైస్తవుడు. "సరే, మేము నిన్ను విడిచిపెడ్తున్నాం. నువ్వు స్వేచ్ఛగా నీ ఇష్టమొచ్చిన చోటికి వెళ్ళవచ్చు" అన్నారు దైవప్రవక్త (సల్లం). ఈ మాట విని ఆ క్రైస్తవుడు సంతోషిస్తూ దైవప్రవక్త (స)కు కృతజ్ఞతలు చెప్పి అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

## 23. బహుదైవారాధకులతో యూదుల కుమ్మక్కు

ముస్లింలు స్వల్పకాలంలో అనేకచోట్ల విజయపతాకాలు ఎగరవేయడంతో యావత్తు అరబ్ తెగలు నీరుగారిపోయాయి. మక్కా ఖురైషీయులు కూడా ఇస్లామీయ ఉద్యమకారులశక్తి ముందు తమ ఓటమిని అంగీకరించారు. ముస్లింలతో మళ్ళీ పోరుకు తలపడటానికి వారికి ధైర్యం చాలడం లేదు. అంచేత వారి ప్రసక్తే మానేసి తమ దైనందిన కార్యకలాపాల్లో నిమగ్నులైపోయారు.

అయితే కల్లోల స్వభావకులైన యూదులు రంగంలోకి దిగడంతో బహుదైవారాధకులకు ధైర్యం వచ్చింది. ఇస్లాం అజేయశక్తిగా ఎదిగిందని, ఒకటి రెండు తెగలు దాన్ని ఎదుర్కోలేవని భావించిన అరబ్బుతెగలు యూదుల ప్రోత్సాహంతో ఇస్లాంను తుడిచిపెట్టేందుకు మొత్తం ఏకమయి దాడిచేయాలని నిర్ణయించుకున్నాయి.

బనూనజీర్ తెగ యూదులు తాము సృష్టించిన అలజడుల మూలాన మదీనా నుంచి ఇదివరకే బహిష్కరించబడ్డారు. అప్పుడా తెగవాళ్ళు ఖైబర్‌కు పోయి స్థిరపడ్డారు. అయితే వారు తమకు జరిగిన పరాభవానికి ఉడికిపోతూ పగతీర్చుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. వారు తమ ప్రతీకారం తీర్చుకోవడానికి బహుదైవారాధకుల్ని పావులుగా వాడుకోవడానికి నిర్ణయించుకున్నారు. దాని ప్రకారం వారి నేతలు ఒక పథకం ఆలోచించి ముందుగా ఖురైషీయుల దగ్గరకు పోయారు.

ఆ నాయకుల్లో హుయ్యి బిన్ అఖ్తబ్, సలామ్ బిన్ అబిల్ లాంటి ప్రముఖులు కూడా ఉన్నారు. వీరంతా దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా ఖురైషీయులకు బాగా నూరిపోశారు. వాళ్ళను ఉద్రేకపరచి ముస్లింల మీదికి పురిగొల్పారు. అణగారిన వారి ద్వేషాన్ని ఉత్తేజపరుస్తూ "భయమెందుకు? మేము మీకు తోడుగా ఉన్నాం. ఈ సంగతి చెప్పి మీకు వాగ్దానం చేయడానికే మేము ఇంత దూరం వచ్చాం" అని చెప్పారు.

ఈ మాటలు విని ఖురైషీయుల హృదయాలలో నూతన ఉత్తేజం ఉప్పొంగింది. తమకు యూదుల మద్దతు దొరికినందుకు తెగ సంబరపడిపోయారు. ఆ సంబరంలో యూద నాయకులకు ఖరీదైన ఆతిథ్యమిచ్చి సత్కరించారు.

"ఎంత మంచివారు మీరు! అసలు మీలాంటి వారంటేనే మాకిష్టం. ముహమ్మద్‌కు శత్రువులయి అతడ్ని తుదముట్టించడానికి సిద్ధమయినవారిని మేము ప్రాణప్రదంగా ప్రేమిస్తాం" అన్నారు వారు ఆనందసాగరంలో మునిగి తేలుతూ.

"సోదరులారా! మీ దగ్గర ఇదివరకటి నుంచే దైవగ్రంథం ఉంది. ముహమ్మద్‌తో మాకున్న భేదాభిప్రాయం కూడా మీరెరగనిది కాదు. మీరే చెప్పండి... మామతం గొప్పా లేక ముహమ్మద్ మతం గొప్పా?" అన్నారు ఖురైష్ బహుదైవారాధకులు.

"ఏమిటీ! ముహమ్మద్ మతాన్ని గురించి అడుగుతున్నారా? మీ మతం ఎక్కడా, అతని మతం ఎక్కడా! సత్యం ఎక్కడా, అసత్యం ఎక్కడా!! మీ మతం ముందు ముహమ్మద్ మతం ఏపాటిది?" అదను కనిపెట్టి గురిపెట్టారు యూదులు.

"శభాష్! మీరే మా శ్రేయోభిలాషులు. మత గ్రంథాలన్నీ క్షాళనచేసిన మీరు అసత్యం చెప్పరని మాకు తెలుసు" యూదులు పన్నిన ఉచ్చులో బిగుసుకు పోతున్నామని గ్రహించని ఖురైషీయులు వారి స్తోత్రగానాలకు పూనకం వచ్చినవారిలా ఊగిపోయారు.

"మాకంఠంలో ప్రాణం ఉన్నంతవరకు ముహమ్మద్‌తో మేము పోరాడుతూనే ఉంటాం. అతని ధర్మం ఏమేరకు వ్యాపిస్తుందో మేమూ చూస్తాం. ముహమ్మద్‌ని, అతని ధర్మాన్ని సర్వనాశనం చేసిగాని వదలిపెట్టం" తిరుగులేని నిర్ణయం వ్యక్తపరిచారు.

యూదులు విసిరిన ఉచ్చులో ఖురైష్ నాయకులు పూర్తిగా బిగుసుకు పోయారు. యుద్ధానికి పోవలసిన తేదీ కూడా నిశ్చయమైపోయింది.

యూదులు అంతటితో ఊరుకోలేదు. వారు ఇతర తెగల దగ్గరకు కూడా పోయి విషబీజాలు నాటడం ప్రారంభించారు. ఉద్రేక పూరితమైన ఉపన్యాసాలతో ప్రజలను రెచ్చగొట్టారు. గత్ఫాన్ తెగలోకి పోయి వారికి అనేకనేక ఆశలు చూపిస్తూ "మీరీ యుద్ధంలో మాతో సహకరిస్తే, మేము ఖైబర్‌లో పండే పంటలో సగం మీకిస్తాం" అన్నారు.

అదేవిధంగా వారు బనీఅసద్, ఫజారా, ముర్రా తెగల దగ్గరికి కూడా పోయి తమ పథకాన్ని అమలుపరిచారు. వారందరికీ నూతన ధర్మం వల్ల పొంచివున్న ప్రమాదం గురించి తీవ్రంగా హెచ్చరించారు. తమ ధర్మ పరిరక్షణ కోసం ప్రాణాలు సైతం తెగించి పోరాడాలని ఉద్రేకపరిచారు. ఆశల గుర్రాలు ఎక్కించి అదిలించి వదలి పెట్టారు.

ఇప్పుడు దైవప్రవక్త (సల్లం)కు వ్యతిరేకంగా యావత్తు అరేబియా ఒకటై పోయింది. ఒక్క యూదులేమిటీ! బహుదైవారాధకులేమిటీ!! సమస్త దుష్టశక్తులు సత్యజ్యోతిని ఆర్పడానికి సమాయత్తమయ్యారు. కారుణ్యమూర్తి (స)ని కడతేర్చడానికి కంకణం కట్టుకున్నారు. తీర్మానాలు అయ్యాయి. నిర్ణయాలు జరిగాయి. పథకాలు రూపొందాయి. భారీఎత్తున ఆయుధాలు, ఇతర అవసరాలు సమకూరాయి. కొద్ది రోజుల్లోనే బ్రహ్మాండమైన సైనిక పటాలం తయారయింది.



బాగా బలిసి కండలు తిరిగిన పదివేల మంది రక్తపిపాసులు సిద్ధమయ్యారు! ఆపాదమస్తకం ఉక్కు కవచాలతో, ధగధగ మెరిసే ధనుర్బాణాలతో, కళ్ళు చెదిరే ఖడ్గాలతో కూడిన ఈ సైనిక మహావాహిని ఆవేశపు కెరటాలను లేపుతూ, ఉద్రేకపు నురుగులు కక్కుతూ మదీనా దిశగా ప్రవహించింది!!

అరబ్ తెగలన్నీ ఏకమై మదీనాపై విరుచుకు పడనున్నాయని దైవప్రవక్త (స)కు సమాచారం అందింది. ఆయన తన ముఖ్యానుచరులందర్నీ సమావేశపరిచారు. పరిస్థితిని వివరించి కర్తవ్యం గురించి వారిని సంప్రదించారు. అనుచరులంతా ముక్తకంఠంతో "ఈసారి బయటకి పోకుండా మదీనాలోనే ఉండి శత్రువుల్ని ఎదుర్కొందాం" అన్నారు. దానికి దైవప్రవక్త (సల్లం) కూడా అంగీకరించారు.

## 24. కందకంలో భవిష్యత్ సంకేతాలు

ఈరాన్ జాతీయుడయిన హజ్రత్ సల్మాన్ ఫార్సి (రజి) ఈరాన్ యుద్ధ తంత్రాలను గురించి బాగా ఎరిగినవారు. అనుభవశాలి కూడా. ఆయన ఇలా అన్నారు: "ఎలాంటి భద్రతలేని బహిరంగ మైదానంలో దిగి యుద్ధం చేయడం మంచిది కాదు. ఏదైనా కీలక ప్రదేశంలో సైన్యాలను సమీకరించి చుట్టూ కందకం తవ్వితే బాగుంటుంది."

ఈ అభిప్రాయం దైవప్రవక్త (స)కు నచ్చింది. "నిజమే. ఇలా చేస్తేనే బాగుంటుంది. లేవండి, సాధ్యమైనంత త్వరగా ఈ పని ప్రారంభించాలి" అన్నారు ఆయన.

తక్షణమే ముస్లింలు రంగంలోకి దిగారు. పారలు, పలుగులు సేకరించారు. బనీ ఖురైజా యూదులు ముస్లింలతో ఇదివరకే స్నేహఒప్పందం చేసుకొని ఉన్నారు. అంచేత కందకం త్రవ్వకానికి కావలసిన పనిముట్లు చాలా వరకు వారినుంచే లభించాయి.

మదీనా పట్టణానికి మూడు వైపుల చిన్న చిన్న కొండలు, ఖర్జూరపు తోటలతో నిండిపోయి సందులేకుండా సురక్షితంగా ఉంది. ఒకేఒక వైపు మాత్రం ఖాళీగా ఉంది. దైవప్రవక్త (స) కొంతమంది అనుచరుల్ని వెంటబెట్టుకొని పట్టణం వెలుపలికి పోయి చుట్టూ పరిశీలించారు. ఖాళీగా ఉన్న వైపు అగడ్త త్రవ్వడం అవసరమని భావించారు. అగడ్తకు సంబంధించిన పథకాన్ని ఆయనే రూపొందించారు. తరువాత ఆ ప్రదేశాన్ని పదేసి మందికి పదిపది గజాల చొప్పున పంచిచ్చారు. వెంటనే త్రవ్వకం మొదలైంది.

దైవప్రవక్త (సల్లం) కూడా త్రవ్వకం పనిలో పాల్గొన్నారు. స్వయంగా తమ నాయకుడు కూడా పనిలో పాల్గొనడం చూసి అనుచరులు ద్విగుణీకృత ఉత్సాహంతో పనిచేయడం మొదలెట్టారు. పని చకచకా జరిగిపోతోంది.

అది శీతాకాలం. రాత్రివేళల్లో విపరీతమైన చలి. పైగా అనేకమంది అనుచరులు తిండి లేక మూడేసి రోజులు పస్తులు కూడా ఉండవలసి వచ్చింది. అలాంటి క్లిష్ట పరిస్థితిలో కూడా ముస్లింలు ఎంతో నిగ్రహంతో పని చురుగ్గా చేయసాగారు.

కాని అనేకమంది ఆకలితో నకనకలాడుతున్నారు. కళ్ళు లోపలికి పీక్కుపోయాయి. ఒక అనుచరుడు ఆకలితో బాధపడుతూ దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వచ్చాడు.

“దైవప్రవక్తా! మూడు రోజుల నుంచి తిండి లేదు. ఆకలికి తాళలేక ఇదిగో పొట్ట మీద రాళ్ళు కట్టుకున్నాను” అంటూ అతను చొక్కా పైకెత్తి కడుపు మీద కట్టుకున్న రెండు రాళ్ళు చూపించాడు.

దైవప్రవక్త (సల్లం) అనుచరుని పరిస్థితి చూసి చాలా జాలిపడ్డారు. కాని ఏం చేయగలరు? ఆయన కూడా లోలోన ఆకలితో బాధపడుతున్నారు. అందువల్ల అనుచరుని మాటలకు సమాధానంగా ఆయన తన చొక్కా పైకెత్తి చూపారు.

అది చూసిన తరువాత అనుచరుని కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. తన ప్రియతమ నాయకుని పొట్టపై మూడు రాళ్ళు కట్టబడి ఉన్నాయి.

ఇలా ఎంతోమంది పస్తులతో ఉండి కూడా ఉత్సాహంగా త్రవ్వకం పని చేస్తున్నారు. కొందరు పలుగులతో మట్టి త్రవ్వుతున్నారు. మరికొందరు పారలతో మట్టి తీసి దూరంగా పడవేస్తున్నారు. ఇంకొందరు అవసరమొస్తే శత్రువుల మీద విసరడానికి పనికొస్తాయని బయటి నుంచి రాళ్ళు తెచ్చి అగడ్తకు లోపలి వైపున వేస్తున్నారు.

అయితే అనస్ (రజి) అనే ఓ బాల అనుచరుడు దైవప్రవక్త (సల్లం) ఆకలితో కడుపు మీద కట్టుకున్న రాళ్ళు చూసి చాలా ప్రభావితుడయ్యాడు. అతను వెంటనే కందకం త్రవ్వుతున్న తన తండ్రి అబూతల్హా (రజి) దగ్గరికెళ్ళి తెలియజేశారు. హజ్రత్ అబూతల్హా (రజి) కూడా ఈ సంగతి విని చాలా బాధపడ్డారు.

“అయితే బాబూ! నువ్వు వెంటనే దైవప్రవక్త దగ్గరికెళ్ళి, భోజనం చేయడానికి మా నాన్న పిలుస్తున్నారని చెప్పి ఆయన్ని మనింటికి పిలుచురా. ఆయనతో పాటు మరో ఇద్దరు ముగ్గురు వచ్చినా పరవాలేదు. కాని ఒక విషయం గుర్తుపెట్టుకో. మనింట్లో అన్నం కొద్దిగానే ఉంది. అంచేత నువ్వు దైవప్రవక్త (సల్లం) ఒంటరిగా ఉన్నప్పుడు మాత్రమే ఈ విషయం తెలియజేసి పిలుచుకురా” అని చెప్పారు హజ్రత్ అబూతల్హా (రజి).

అనస్ (రజి) వెంటనే దైవప్రవక్త (సల్లం) దగ్గరకు పరుగెత్తారు. కాని అక్కడ దైవప్రవక్త (సల్లం) అనేకమంది అనుచరుల మధ్య కూర్చొని ఉన్నారు. అందువల్ల అనస్ (రజి) వచ్చిన పనేమిటో చెప్పకుండా మౌనంగా నిల్చున్నారు.

అయితే దైవప్రవక్త (సల్లం) ఆ అబ్బాయిని చూడగానే “ఏమిటి నిన్ను అబూతల్హా పంపించాడా?” అని అడిగారు. “అవ్.....ఔనండీ!” అన్నారు అనస్ (రజి) నసుగుతూ.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని ఉద్దేశించి “సహచరులారా! అబూతల్హా ఇంటికి పదండి. ఆయన మనకు ఈపూట భోజనం ఏర్పాటు చేశాడు” అన్నారు బిగ్గరగా.

దైవప్రవక్త (సల్లం) పిలుపు విని దాదాపు ఎనభై మంది అనుచరులు సిద్ధమయ్యారు. దైవప్రవక్త (సల్లం) వారందరినీ వెంటబెట్టుకొని అబూతల్హా ఇంటికి బయలుదేరారు.

అనస్ (రజి) ఈ పరిస్థితి చూసి కంగారుపడుతూ ఇంటికి పరుగెత్తారు. “నాన్నా! నాన్నా!! దైవప్రవక్త చాలామందిని పిలుచుకొస్తున్నారు” అన్నారు ఆయన రొప్పుతూ.

“ఉమ్మెసులైమ్! విన్నావుగా. ఇప్పుడేం చేద్దాం?” అన్నారు హజ్రత్ అబూతల్హా (రజి).



“కానివ్వండి. దేవుడే మనకు సహాయం చేస్తాడు” అన్నారు హజ్రత్ ఉమ్మెసులైమ్ (రజి).

అంతలో దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని తీసుకొని వచ్చారు.

హజ్రత్ అబూతల్హా (రజి) దైవప్రవక్త (సల్లం) చెవి దగ్గరకొచ్చి “దైవప్రవక్తా! ఇంట్లో రెండు రొట్టెలు మాత్రమే ఉన్నాయి” అన్నారు మెల్లిగా. “మరేం పరవాలేదు. నీవు రొట్టెలతో పాటు నేతిగిన్నె కూడా తెచ్చి నా ముందు పెట్టు” అన్నారు దైవప్రవక్త (స) చిరునవ్వుతో.

హజ్రత్ అబూతల్హా (రజి) లోపలికి వెళ్ళి ఒక పాత్రలో రొట్టెలతో పాటు నేతిగిన్నె పెట్టుకొని తీసుకొచ్చారు. అప్పుడు దైవప్రవక్త (స) నేతిగిన్నెను పైకెత్తి వంచితే అందులో నుంచి రెండు మూడు బొట్లు నెయ్యి రొట్టె మీద పడింది. దాన్ని ఆయన తన చూపుడు వ్రేలితో మొత్తం రొట్టె మీద రాశారు. వెంటనే ఆ రొట్టె పైకి ఉబుకుతూ పాత్ర అంచు దాకా వచ్చింది. దాని మీద ఓగుడ్డ కప్పి “బిస్మిల్లాహి అల్లాహుమ్మ ఆజమ్ ఫీహల్ బర్కత్” అని పఠించారు.

ఆ తర్వాత పదేసి మంది చొప్పున అనుచరుల్ని భోంచేయడానికి లోపలికి పిలిచారు. అప్పుడు పదిమంది అనుచరులు వచ్చి గుడ్డ క్రింద చేయిదూర్చి ఒక్కొక్క రొట్టె తీసుకొని తినడం ప్రారంభించారు. మొదటి విడత పదిమంది కడుపు నిండా తిని వెళ్ళగానే రెండవ విడత పదిమంది వచ్చేవారు. ఇలా ఎనభైమంది కడుపునిండా తిని లేచారు. ఆ తర్వాత దైవప్రవక్త (స) తిన్నారు. అయినా రొట్టెలు ఏమాత్రం తరగకుండా పాత్రనిండా అలాగే ఉన్నాయి. చివరికి హజ్రత్ అబూతల్హా (రజి), ఆయన భార్యాపిల్లలు కూడా కడుపునిండా తిన్నారు దైవప్రవక్త (స) ద్వారా బహిర్గతమైన ఈ మహిమను తలచుకుంటూ.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని తీసుకొని తిరిగి కందకం త్రవ్వకంలో నిమగ్నులయి పోయారు. ఇలా అనుచరులు కందకం త్రవ్వుతుంటే అందులో ఓ పెద్ద బండరాయి అడ్డొచ్చింది. హజ్రత్ సల్మాన్ ఫార్సి (రజి), ఆయన జట్టు సభ్యులు పలుగులతో దాన్ని కొట్టికొట్టి విసిగిపోయారు. ఎంతకొట్టినా ఆ రాయి కాస్త కూడా పగల్లేదు. చుట్టుపక్కల కందకం త్రవ్వుతున్న ఇతర సహచరులు కూడా వచ్చి తమ బలాలను ప్రదర్శించారు. కాని ఆ రాయి మాత్రం చెక్కు చెదరలేదు.

ఈ విశేషం చూసి వారు ఎంతో ఆశ్చర్యపోతూ విషయం దైవప్రవక్త (సల్లం) దృష్టికి తీసికెళ్ళారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) తాను చేస్తున్న పని వదిలేసి బయలుదేరారు.

దైవప్రవక్త (సల్లం) వచ్చిన తరువాత కొందరు మాట్లాడుతూ “ఈ రాయిని పగల గొట్టడం సాధ్యమయ్యే పనిలా కన్పించడం లేదు. అంచేత ఈ చోటు వదలి పక్కకు జరిపి త్రవ్వుకోవడం మంచిది” అని సలహా ఇచ్చారు.

దైవప్రవక్త (సల్లం) చిరునవ్వు నవ్వుతూ పలుగు తీసుకున్నారు. అగడ్తలోకి దిగి “బిస్మిల్లా” అంటూ బలంగా ఒకే ఒక దెబ్బ వేశారు. ఆ దెబ్బకు రాయి మీద సన్నని పగులు ఏర్పడి, అందులో నుంచి తళుక్కున ఓ కాంతిపుంజం వెలువడింది. వెంటనే దైవప్రవక్త (సల్లం) ‘అల్లాహుఅక్బర్’ అన్నారు. అప్రయత్నంగా అనుచరుల నోట కూడా అల్లాహు అక్బర్ అనే పలుకులు వెలువడి ఆ ప్రదేశమంతా మార్మోగింది.

దైవప్రవక్త (స) రాతిపై మరోదెబ్బ వేశారు. దాంతో రాయి మరికాస్త పగిలి అందులో నుంచి మళ్ళీ వెలుగు విరజిమ్మింది. దైవప్రవక్త (స) రాయిమీద ఇంకో దెబ్బవేశారు. దాంతో బండరాయి ముక్కలుముక్కలుగా పగిలి దేదీప్యమానమైన వెలుగు విరజిమ్మింది. క్షణంపాటు పరిసరాలన్నీ ప్రకాశించాయి. దైవప్రవక్త (సల్లం) 'అల్లాహు అక్బర్' అన్నారు. అనుచరులు కూడా అదేవిధంగా నినదించారు.

దైవప్రవక్త (స) కందకం నుండి పెకొచ్చిన తర్వాత ఒడ్డు మీద నిల్చున్న అనుచరులు తొంగితొంగి చూడసాగారు. అంతటి బలమైన ఆ చట్టును దైవప్రవక్త (స) మూడే మూడు దెబ్బలకు నుజ్జునుజ్జు చేయడం పట్ల వారు ఆశ్చర్యచకితులయ్యారు.

"ఇందులో ఆశ్చర్యం ఏముంది? ఇది దైవదౌత్య మహిమ." అన్నారు ఒకరు.

"ఔను. ఇది నిస్సందేహంగా దైవమహిమే. ఇంతటి శక్తిమంతమైన రాయి పగలడం మానవశక్తికి అతీతమైన పని" అన్నారు మరొకరు.

"దైవప్రవక్తా! మీరా బండరాయి మీద పలుగుతో కొట్టినప్పుడు అందులో నుంచి వెలుగు కిరణాలు ప్రసరించాయేమిటీ?" అని అడిగారు కొందరు అనుచరులు.

"నువ్వు కూడా ఆ వెలుగుని చూశావా?" దగ్గరే నిలబడివున్న సల్మాన్ ఫార్సి (రజి)ని అడిగారు దైవప్రవక్త (సల్లం).

"చూశాను దైవప్రవక్తా! నాతో పాటున్న ఇతర సహచరులు కూడా ఆ వెలుగుని చూశారు" అన్నారు సల్మాన్ ఫార్సి (రజి).

"నేను మొట్టమొదట పలుగుతో ఆ రాయి మీద కొట్టినప్పుడు జిబ్రీల్ దూత ప్రత్యక్షమయి నాకు యమన్ దేశపు తాళపుచెవులు ఇచ్చారు. రెండవసారి కొట్టినప్పుడు సిరియా దేశపు తాళపుచెవులు అప్పగించారు. మూడవసారి కొట్టినప్పుడు ఈరాన్ దేశపు తాళపుచెవులు ఇచ్చి 'ఈ మూడు దేశాలు మీ అనుచర సముదాయం అధీనంలోకి వస్తాయి' అన్నారు జిబ్రీల్ దూత" వివరించారు దైవప్రవక్త (స) చిరునవ్వుతో.

ఈ శుభవార్త విని ముస్లింలు పరమానందభరితులయ్యారు. హర్షాతిరేకంతో దిక్కులు పిక్కుటిల్లేలా మరోసారి 'అల్లాహుఅక్బర్' అంటూ నినదించారు.

మొత్తంమీద త్రవ్వకం పని ఆరు రోజుల్లోనే పూర్తయింది. కందకం తయారయింది. ఇప్పుడు మదీనా పట్టణానికి పూర్తి భద్రత ఏర్పడింది.

## 25. అరబ్బులకు అర్థంకాని పథకం

పట్టణం వెలుపల ఓ కొండ ఉంది. అది కందకానికి కేవలం ఆరు మైళ్ళ దూరంలో ఉంది. రెండిటి మధ్య విశాలమైన మైదానం ఉంది. దైవప్రవక్త (సల్లం) సైన్యాన్ని ఆ మైదానంలో మోహరింపజేయాలని నిర్ణయించారు.

అటు శత్రువుల సైనిక దళాలు అప్పుడే మదీనా పొలిమేరల సమీపానికొచ్చి మోహరించసాగాయి. సర్వసేనాని అబూసుఫ్యాన్ ముస్లింల కోసం తెగ ఉత్సాహంతో ఎదురు



చూస్తున్నాడు. కాని అక్కడ కన్పించకపోవడంతో అతను మదీనా దారి పట్టాడు. మదీనా పట్టణానికి సమీపంగా వచ్చి విడిది చేశాడు.

ముస్లింలు మదీనా నుంచి కదలినట్లు సూచనలేమీ కానరావడం లేదు. అసలు వారి పరిస్థితి ఏమిటో, సైనిక కార్యకలాపాలు ఎలా ఉన్నాయో సమాచారం అందితేగాని తదుపరి చర్య తీసుకోవడానికి వీలుపడదు. అంచేత అబూసుఫ్యాన్ కొన్ని గూఢచార బృందాలను తయారుచేసి మదీనా వైపు పంపించాడు.

ఈ బృందాలు ఒకదాని వెంట మరొకటి చొప్పున రహస్యంగా బయలుదేరాయి. కాని తీరా మదీనా సమీపానికి చేరుకునేటప్పటికి అక్కడ కొత్తగా వెలసిన దృశ్యం చూసి కొయ్యబారి పోయారు. మక్కా బహుదైవారాధకులు ఇదివరకెప్పుడూ ఇలాంటి విశేషం చూడలేదు. నమ్మశక్యంకాని ఆ దృశ్యం చూసి వారు నోరెళ్ల బెట్టారు.

"ఏమిటిదీ! కందకంలా ఉందే!! ఔను కందకమే. ఎంతో లోతుగా, పొడవుగా త్రవ్వుకున్నారు. ఇది మదీనా రక్షణ కోసం చేసిన ఏర్పాటు కాబోలు!! అయితే మన సైన్యం ఈ కందకాన్ని దాటగలదా? ఏపని కోసం మనం ఇన్ని వ్యయప్రయాసలకు ఓర్చి ఇంత పెద్ద సైన్యాన్ని సమీకరించుకొని వచ్చామో ఆ పని నెరవేరుతుందా, లేదా? కొంపదీసి మనం వేసుకున్న పథకం తల్లక్రిందులు అవదుకదా!" ఇలా పరిపరి విధాల ఆలోచిస్తూ సైనిక స్థావరాలకు తిరిగొచ్చి విషయం తమ నాయకులు చెప్పారు గూఢచారులు.

ఈ చావుకబురు వినగానే ఖురైషీయులందరికీ నడుములు విరిగినంత పనయింది. దేహమంతా చలిచీమలు ప్రాకినట్లనిపించింది. "ఇదేదో కొత్తవ్యూహంలా ఉంది. అరేబియాలో ఇదివరకెప్పుడూ ఇలాంటి విడ్డూరం మనం చూడలేదే! ఏమిటీ యుద్ధతంత్రం!!" ఎంతో ఆశ్చర్యపోయి, నిస్సత్తువతో అంతా హతాశులయ్యారు.

అటు మదీనా వెలుపల ముస్లిం సేనలు అవిశ్వాసులతో పోరాడటానికి తహతహలాడుతున్నాయి. 'సల్అ' కొండ దిగువ భాగంలోని ఎత్తయిన కీలక ప్రదేశంలో ఓ ప్రత్యేక సైనికశిబిరం వెలసింది. ఇది దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) కోసం నిర్మించబడిన తాత్కాలిక సైనిక స్థావరం. ఇక్కడ కూర్చొని ఆయన జరగబోయే యుద్ధాన్ని గురించి ఓ సమగ్రమైన పథకం రూపొందించారు.

పథకం ప్రకారం ఆయన సైన్యాన్ని అనేక విభాగాలుగా విభజించారు. కొన్ని సైనిక విభాగాలను ముందుగానే కందకం పొడుగూతా పహరా ఉంచారు. శత్రువులు దాటి వస్తారని అనుమానమున్న అగడ్త భాగాల దగ్గర మరింత పకడ్బందీగా గస్తీ దళాలను కూడా ఏర్పాటు చేశారు. మిగిలిన సేనలు శత్రువులను ఎదుర్కోవడానికి పంక్తులుతీరి నిలబడ్డాయి. కందకం ఆవల శత్రుసైన్యాలు వచ్చి బుసలు కొడ్తున్నాయి.

మధ్యలో పెద్ద కందకం ఉండటం వల్ల ఇరుపక్షాల సైన్యాలు నేరుగా ఢీకొనడానికి వీలులేకుండా పోయింది. శత్రుసైనికులు ఏమీ పాలుపోక కోపంతో చిందులు తొక్కుతున్నారు. అశ్వరూఢులైన కొందరు కందకం దాటడానికి విఫలయత్నం చేశారు.

ఇటు ముస్లింయోధులు ఎడతెరిపి లేకుండా బాణాలు కురిపించసాగారు. వీరి

బాణాల ధాటికి నిలువలేక శత్రువులు వెనక్కి తగ్గారు. అయినా వారు అధైర్యం చెందలేదు. అగడ్తకు ఆవల వైపునుంచి వారు కూడా బాణాలు వదలడం మొదలెట్టారు.

అలా సాయంత్రందాకా యుద్ధం చేశారు. చీకటిపడిన తర్వాత వారు తమ స్థావరాలకు వెళ్ళిపోయారు. మరునాడు సూర్యోదయం కాగానే మళ్ళీ కందకం దాటి రావడానికి ఎంతో ప్రయత్నించారు. కాని ఆరోజు కూడా వారికది సాధ్యపడలేదు. పట్టరాని కోపంతో పళ్ళు పటపట కొరుక్కుంటూ వెనక్కి వెళ్ళిపోయారు.

వారు అనుకున్నది ఒకటైతే ఇక్కడ జరిగింది మరొకటి. తమ పథకం తారుమారైంద"ని భావించి దిక్కుతోచని స్థితిలో పడ్డారు ఖురైషీయులు. దానికి తోడు రాత్రి వేళల్లో విపరీతమైన ఈదురు గాలులు కూడా మొదలయ్యాయి. ఆపై ఎముకలు కొరికే చలి! నరాల్లోని రక్తం గడ్డ కట్టుకుపోతోంది. సైనిక పంక్తులు చెదిరిపోతున్నాయి.

ఒక వైపు కందకం దాటడానికి చేస్తున్న ప్రయత్నాలన్నీ విఫలమవుతున్నాయి. మరో వైపు ప్రాణాలు తోడేసే చలిపులి ఆపాదమస్తకం గజగజ వణికిస్తోంది. దైవప్రవక్త (స)ను అంత మొందించి, సత్యధర్మాన్ని సమాధి చేయడానికి వచ్చిన బహుదైవారాధకులు చివరికి ఇలా ఇరకాటంలో పడ్డారు. వారి సైనికులు ఢీలా పడిపోయారు. క్రమశిక్షణ సన్నగిల్లిపోయింది. సర్వత్రా నిరాశా నిస్పృహలు అలుముకున్నాయి. ఎవరి నోట విన్నా "ఇక ముహమ్మద్‌ని జయించడం మన వల్ల కానిపని" అన్న మాటలే విన్పిస్తున్నాయి.

## 26. యూదుల నమ్మక ద్రోహం

బనూనజీర్ యూదతెగ నాయకుడు హుయ్యి బిన్ అఖ్తబ్ సైనికుల పరిస్థితి చూసి భయపడ్డాడు. సైనికుల్ని ఒకచోట చేర్చడానికి ఎంతో ప్రయాసపడుతున్నాడు. "సైనికుల పరిస్థితి ఇలాగే మరికొన్ని రోజులు కొనసాగితే వారి మనోస్థయిర్యం సన్నగిల్లి పోతుంది. అంచేత తక్షణమే ఏదో ఒకటి చెయ్యాలి" అనుకున్నాడు.

వెంటనే అతను సేనాపతి అబూసుఫ్యాన్ దగ్గరికి పరుగెత్తాడు."నాజాతి వాళ్ళయిన బనీఖురైజా యూదులు కూడా మీ పక్షాన ఉన్నారు. వారి శక్తి సామర్థ్యాలు మీకు తెలుసు. రంగంలో దిగితే విజయమో వీరస్వర్గమో అన్నదే వారి ధ్యేయం" అన్నాడతను.

"అయితే ఇక ఆలస్యం ఎందుకూ? త్వరగా పోయి ముహమ్మద్‌తో చేసుకున్న స్నేహఒప్పందం తెంచెయ్యమని చెప్పిరా" అన్నాడు అబూసుఫ్యాన్.

హుయ్యి ఆ తర్వాత బనీఖురైజా తెగవాళ్ళ దగ్గరకి పరుగుపెట్టాడు. "ఎలాగైనా వాళ్ళకు నచ్చజెప్పాలి. మభ్యపెట్టి అయినా ముస్లింలతో చేసుకున్న ఒప్పందాన్ని తెంచి వేయించి వారిని ఖురైషీయుల పక్షం వైపు తిప్పాలి" అనుకున్నాడు మనసులో.

కొంచెం దూరం ఉండగానే అతని వాలకం చూసి బనీఖురైజా నాయకుడు కాబ్ బిన్ అసద్ అనుమానించాడు. ఇతనేదో కల్లబొల్లిమాటలు చెప్పి ఒప్పందాన్ని త్రెంచి వేయించడానికి వస్తున్నాడని పసిగట్టాడు. వెంటనే కోట సింహద్వారాలు మూయించాడు. అతడ్ని కలుసుకోవడానికి కూడా ఇష్టపడలేదు.



హుయ్యి కోట ద్వారం దగ్గరికి వచ్చాడు. ఎన్నో ప్రమాణాలు చేసి మీ శ్రేయస్సు కోసమే వచ్చాను, తలుపు తీయమని అడిగాడు. ఖురైజా నాయకుడు తలుపు తెరవలేదు. హుయ్యి తలుపు తెరిపించడానికి చాలా ప్రయత్నించాడు. చివరికి అతను బనీఖురైజా నాయకుడ్ని రెచ్చగొడ్తూ "మీరు తలుపులు ఎందుకు మూయించారో నాకు తెలుసు. నేనూ మీకున్న దాంట్లో భాగస్వామిని అవుతానేమోనని భయపడ్తున్నారు మీరు" అన్నాడు.

ఈమాట వినగానే కాబ్ అభిమానం ముంచుకు వచ్చింది. వెంటనే అతను తలుపులు తెరిపించాడు."చూశారా! మీకోసం నేను ఎలాంటి పేరుప్రతిష్ఠల మూట పట్టుకొచ్చానో. బ్రహ్మాండమైన సైనికవాహిని! నురుగులు కక్కే సైనికవాహిని!! యావత్తు అరేబియా కదలి వచ్చింది. ఖురైష్, గత్ఫాన్... ఒకరేమిటి? సమస్త తెగలు వచ్చిపడ్డాయి. అంతా ముహమ్మద్ రక్తం కళ్ళ చూడటానికి తహతహలాడి పోతున్నారు. అనుకున్న పని నెరవేరనిదే ఇక్కడ్నుంచి కదలమని శపథం కూడా చేశారు" అన్నాడు హుయ్యి కోటలోకి ప్రవేశిస్తూ.

హుయ్యి అతిశయోక్తులకు కాబ్ కొంచెం తికమక పడ్డాడు. "హుయ్యీ! నువ్వు నా పరువు తీయడానికి ప్రయత్నిస్తున్నావు. నేను ముహమ్మద్‌తో ఒడంబడిక చేసుకున్న సంగతి నీకు తెలుసు. ఇప్పుడీ ఒడంబడికను ఉల్లంఘించడం నావల్ల కాదు. ముహమ్మద్ ఎల్లప్పుడూ మా పట్ల నమ్మకంగానే ప్రవర్తించాడు. అలాంటి నిజాయితీపరుడికి వ్యతిరేకంగా నేనీ విశ్వాసఘాతుకానికి పాల్పడలేను" అన్నాడు కాబ్.

కాబ్ మాటలకు హుయ్యి ఏమాత్రం నిరాశపడలేదు. అతని అభిమానాన్ని మరింత రెచ్చగొట్టడానికి ప్రయత్నించాడు. "కాబ్! ఈరోజు మొత్తం జాతి గౌరవం కాపాడేపని నీ చేతిలో ఉంది. దాని పరాభవం కూడా నీ చేతిలోనే ఉంది. దాన్నిబట్టి నీవే ఆలోచించుకో. ఇలాంటి అవకాశం చేజారిపోతే మళ్ళీ రాదు. నా మాట విని సంకోచించకుండా ఒప్పందాన్ని తెంచి ఖురైష్ సైనికులకు దారివ్వు. వారు ప్రవాహంలా ముందుకు పురోగమిస్తారు. నిమిషాల్లో ముహమ్మద్‌ని, అతని అనుచరుల్ని తుడిచిపెడ్తారు. ఆ తరువాత యావత్ అరేబియాపై మన ప్రభావం పడుతుంది. అంతేకాదు, మన మతవ్యాప్తి కోసం కూడా దారి సుగమం అవుతుంది. మదీనా సిరిసంపదలు కూడా మనకే దక్కుతాయి."

ఈసారి ప్రయోగించిన అస్త్రం వృథా పోలేదు. హుయ్యి ఇంద్రజాలానికి కాబ్ మంత్రముగ్ధుడయ్యాడు. కాని దాన్ని ఆచరణలో పెట్టడానికి కాబ్ వెనకాడుతూనే ఉన్నాడు. ఒప్పందం ధిక్కరణ వల్ల కలిగే దుష్పరిణామాలు అతని హృదయాన్ని మాటిమాటికి పట్టి కలచివేస్తున్నాయి. "ఒకవేళ ఖురైష్, గత్ఫాన్ తెగలు ఓడిపోతేనో..? వాళ్లు కాలికిబుద్ధిచెప్పి ఎలాగో బయటపడతారు. కాని నేను ఏకాకి నవుతాను. ఆ తర్వాత సర్వనాశనమవుతాను. బనీనజీర్, బనీఖైనుఖా తెగల మాదిరిగా నేను, నా తెగవాళ్ళు కూడా ఘోరంగా అప్రతిష్ఠ పాలవుతాము." ఈ ఆలోచన రాగానే వంటి మీద జెర్రులు ప్రాకినట్లన్పించింది కాబ్‌కు.

కాని కాబ్ ముఖకవళికలు కనిపెట్టిన హుయ్యి ఎంతో చాకచక్యంతో అతని వంటి మీద జెర్రుల్ని వదలగొట్టాడు. అనుమానభూతాన్ని పారదోలాడు. బలవంతంగా ఓ చిరునవ్వు ఒలకబోస్తూ- "కాబ్! నీ అనుమానం ఏమిటో నాకు తెలుసు. దురదృష్టవశాత్తు మనం ఒకవేళ ఓడిపోతే, ఖురైషీయులు కూడా పారిపోతే... అప్పుడు నేను ఖైబర్ వదలిపెట్టి

ఇక్కడికే వచ్చి మీదగ్గర ఉంటాను. ఏ కష్టమొచ్చినా మీతోపాటు నేనూ పాలుపంచుకుంటా, సరేనా?'' అన్నాడు.

కాబ్ మనస్సు కుదుటపడింది. ఇప్పుడు పూర్తిగా దిగివచ్చి హుయ్యితో రాజీపడ్డాడు. హుయ్యి విజయగర్వంతో అబూసుఫ్యాన్ దగ్గరికెళ్ళి ఈ వార్త విన్పించాడు. అబూసుఫ్యాన్ ముఖం చాటంత అయింది. "నిజమా! అయితే రేపీపాటికి అంతా మాకు లొంగిపోతారు. ముహమ్మద్ మాకు బందీగా దొరికిపోవడం ఖాయం'' అంటూ సంబరపడి పోయాడతను.

ముస్లిం యోధులు ఎడతెరిపి లేకుండా ధనుర్బాణాలతో పోరాడుతూనే ఉన్నారు. ఆహారపదార్థాలు కొరవడినా ఖాతరు చేయకుండా ఉత్సాహంతో యుద్ధరంగంలో స్థిరంగానే ఉన్నారు. సరిగ్గా అదే సమయంలో బనీఖురైజా తెగ యూదులు దైవప్రవక్త (సల్లం)తో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించిన వార్త ముస్లిం సైనికుల్లో దావానలంలా వ్యాపించింది. అందరూ నిర్ఘాంతపోయారు. ఇప్పుడు వీరు కూడా దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది.

ఒక వైపు కందకం ఆవల శత్రుసైనికులు కాచుకొని ఉన్నారు. మరోవైపు ఒప్పందాన్ని భంగం చేసిన యూదులు ఉన్నారు. అంతర్గత శత్రువులయిన ఈ యూదులు ఎప్పుడు దాడి చేస్తారో తెలియదు. స్త్రీలు, పిల్లల భద్రతకు కూడా ముప్పు ఏర్పడింది. యూదుల నమ్మక ద్రోహం వల్ల ఖురైషీయుల దారి సుగమం అయింది. ఈ దారి గుండా వారు మదీనాలోకి ఏ క్షణాన్నయినా ప్రవేశించే ప్రమాదం ఉంది.

బనూఖురైజా యూదులు ఒప్పందం ధిక్కరించిన వార్త విషయంలో నిజానిజాలు తెలుసుకొని రావడానికి దైవప్రవక్త (సల్లం) వెంటనే ఒక మనిషిని పంపించారు. అతను అక్కడికి పోయి చూస్తే యూదులంతా యుద్ధ సన్నహాలు చేస్తూ ఉద్రేకంతో ఉరకలు వేస్తున్నారు. ఏ ఒక్కడూ అతని మాట ఆలకించేటట్లు కన్పించలేదు. అందరూ ఆయుధాలు, వాహనాలను సమకూర్చుకోవడంలో నిమగ్నులైపోయారు.

దైవప్రవక్త (సల్లం) మరో ఇద్దర్ని సాద్ బిన్ ఉబాదా, సాద్ బిద్ ముఆజ్ (రజి)లను కూడా పంపారు. సాద్ బిన్ ఉబాదా (రజి) ఖజ్రజ్‌తెగ నాయకులు. సాద్ బిన్ ముఆజ్ (రజి) ఔస్‌తెగ నాయకులు. ఈయనకు బనూఖురైజా యూదులతో కూడా సంబంధం ఉంది. అంచేత దైవప్రవక్త (స) వీరిద్దరిని పంపిస్తూ "వార్త నిజమే అయితే గప్‌చిప్‌గా వచ్చి నాకు తెలియజేయండి. బయటికి పొక్కితే ప్రజలలో నిరుత్సాహం, అనాసక్తత ఏర్పడతాయి. వార్త నిజం కాకపోతే బహిరంగంగా ఎలుగెత్తి చెప్పండి'' అని చెప్పారు.

వారిద్దరు బనూఖురైజా వాడలోకి పోతే వారిక్కూడా అదే పరిస్థితి ఎదురయింది. యూదులు ఒప్పందం అతిక్రమించి నమ్మకద్రోహానికి పాల్పడ్డారు. వారినాయకుని వైఖరి మరీ సిగ్గుచేటుగా ఉంది. దైవప్రవక్త (స)ను బహిరంగంగా తూలనాడుతూ "ఎవరా దైవ ప్రవక్త? మాకూ ముహమ్మద్‌కు మధ్య ఎలాంటి ఒప్పందం లేదు'' అని తెగేసి చెప్పాడు.

ప్రవక్త అనుచరులు అతని మాటలు విని రెచ్చిపోయారు. కాని ఏం చేయగలరు? పరిస్థితి చాలాక్లిష్టంగా ఉంది. అప్పటికే ఇద్దరు అనుచరులు బాగా రెచ్చిపోయి యూదులతో



కలబడే స్థితికి వచ్చారు. కాని సాద్ బిన్ ముఆజ్ (రజి) మిత్రులిద్దరికీ నచ్చజెప్పి అదుపులో ఉంచారు. "అంతేకాదు, అంతకంటే ఎక్కువగానే మీతో మా సంబంధాలు తెగిపోయాయి'' అంటూ ఈ ముగ్గురూ అక్కడ్నుంచి చరచరా వెళ్ళిపోయారు.

వారు ముగ్గురూ సైనిక స్థావరానికి చేరుకొని దైవప్రవక్త (సల్లం)కు పరిస్థితి రహస్యంగా నివేదించారు. కాని ఈ రహస్యం ఎంతోసేపు రహస్యంగా ఉండలేదు. కొన్ని క్షణాల్లోనే సైనికులందరికీ తెలిసిపోయింది. నగరమంతా అట్టుడికి పోయింది. ప్రజల హృదయాల్లో నిరాశాచీకట్లు ఆవరించాయి.

"కందకం అయితే బాగానే తయారుచేసుకున్నాం. కాని ఇప్పుడు దీనివల్ల ప్రయోజనం ఏమిటీ? యూదుల కోట వైపు నుంచి శత్రువులు దాడిచేయడానికి మార్గం ఏర్పడింది. ఇప్పుడేం చెయ్యాలి? మార్గాంతరం ఏమిటీ?'' ఎవరి నోట విన్నా ఇవే మాటలు.

శత్రువులు కందకం చుట్టూ చేరి కొత్తగా ఏర్పడిన దారి గుండా నగరంలో చొచ్చుకు రావడానికి ప్రయత్నిస్తున్నారు. ముస్లింలు వారిని తీవ్రంగా ప్రతిఘటిస్తూ ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారు. అదే స్థితిలో ముస్లింలు అనేకరోజులు పోరాడవలసి వచ్చింది.

అవి ముస్లింలకు కఠినాతి కఠినమైన రోజులు. ఆహారపదార్థాల కొరత తీవ్రంగా ఉంది. దానివల్ల ముస్లిం యోధులు కొందరు రెండేసి మూడేసి రోజులు పస్తులుండవలసి వస్తోంది. ఒక్కొక్క సారి ఆకలి బాధ భరించలేక వ్రేలాడపడి పోయేవారు.

వారి పరిస్థితి చూసి దైవప్రవక్త (సల్లం) ఆలోచనలో పడ్డారు. ఈ పరిస్థితి సైనికుల మనోస్థయిర్యాన్ని దెబ్బతీయవచ్చు. దీన్ని అధికమించాలంటే ఏంచెయ్యాలి? ఒక ఉపాయం తట్టింది. తక్షణమే ఆయన గత్ఫాన్ తెగవారి దగ్గరకు ఒక దూతను పంపిస్తూ "మీరు మాకు వ్యతిరేకంగా యుద్ధం చేయకుండా వెళ్ళిపోతే మదీనాలో పండే పంటలో మీకు మూడో వంతు పంటనిస్తాం'' అని చెప్పారు. దానికి గత్ఫాన్ తెగవాళ్ళు ఎంతో సంతోషించారు. సరే, ఎందుకైనా మంచిదని ఆ విషయాన్ని ధృవపరచుకునేందుకు వారు దైవప్రవక్త (సల్లం) దగ్గరకు ఒక ప్రతినిధిని పంపించారు.

అయితే కథ అడ్డం తిరిగింది. వచ్చిన ప్రతినిధి మూడో వంతు పంటకు ఒప్పుకోలేదు. అర్థ పంట కావాలని పట్టుబట్టాడు. దైవప్రవక్త (సల్లం) ఓ క్షణం ఆలోచించి ఇదంతా చూస్తున్న అన్సార్ నాయకులు సాద్ బిన్ ముఆజ్, సాద్ బిన్ ఉబాదా (రజి)లను దగ్గరకు పిలిచి మీ అభిప్రాయం ఏమిటని అడిగారు.

"దైవప్రవక్తా! ఈ వ్యవహారం దైవాజ్ఞే గనక అయితే దీన్ని నిరాకరించడానికి మాకు ఎలాంటి అధికారం లేదు. మీరు ఎలా నిర్ణయించినా దాన్ని ఆమోదించడానికి, అమలు పరచడానికి మేము ఎల్లప్పుడూ సిద్ధమే. ఒకవేళ దైవాజ్ఞ కాకుండా నిర్ణయం తీసుకునే అధికారం మనకు ఉన్నట్లయితే మటుకు కొన్ని విషయాలు మీ ముందు నివేదించు కోవాలని ఉంది'' అన్నారు హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి).

"ఇదంతా మీ శ్రేయస్సు కోసమే చేస్తున్నాను. ఈ విధంగా చేస్తే శత్రువుల బలం కొంతయినా తగ్గుతుందని నా అభిప్రాయం'' అన్నారు దైవప్రవక్త (సల్లం).

"దైవప్రవక్తా! మేము అవిశ్వాసులుగా ఉన్నప్పుడే మా దగ్గర్నుంచి ఏ ఒక్కడూ సుంకం రూపేణ పీసమెత్తు వస్తువయినా తీసుకోలేక పోయాడు. ఇప్పుడు మేము మీ సహచర భాగ్యంతో ముస్లింలమై ఎంతో ఔన్నత్యం సంపాదించాం. అందువల్ల వారి కోసం ఇప్పుడు మా దగ్గర ఉన్నది ఖడ్గం ఒక్కటే" అన్నారు అనుచరులు ఆవేశంతో.

ధీర సహచరుల నోట వెలువడిన ఈ పరుష వచనాలు వినగానే దైవప్రవక్త (సల్లం) గత్ఫాన్ తెగతో ఒప్పందం చేసుకోవడం మానుకున్నారు. తరువాత గత్ఫాన్ తెగ ప్రతినిధిని వెనక్కి పంపి తృప్తిగా నిట్టూర్చారు.

## 27. అంతర్గత శత్రువులు

అయినప్పటికీ ముస్లింల పరిస్థితి రోజులు గడుస్తున్న కొద్దీ విషమిస్తూ పోతోంది. ఆహారపదార్థాలు నిండుకోవడం వల్ల అనేకమంది ఆకలిబాధతో అలమటిస్తున్నారు. కందకం ఆవల శత్రువులు సందు దొరికితే దూకివచ్చి దాడిచేయడానికి కాచుకొని ఉన్నారు. అంచేత ముస్లిం యోధులు కళ్ళలో వత్తులు వేసుకొని అహర్నిశలూ కాపలా కాయవలసి వస్తోంది. వీటన్నిటికి తోడు ముస్లిం సైన్యంలో కపటవిశ్వాసుల రూపంలో మరో ప్రమాదం పొంచిఉంది. ఈ దుర్మార్గులు ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో ముస్లింలతో ఎలా సహక రిస్తారు? వారు పరస్పరం కూడబలుక్కొని దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వచ్చారు.

"అయ్యా! మా ఇళ్ళు భద్రంగా లేవు. మా భార్యాపిల్లలు అపాయకర స్థితిలో ఉన్నారు. నగరం పోవడానికి మాకు అనుమతివ్వండి" అంటూ రకరకాల సాకులు చెప్పసాగారు.

దైవప్రవక్త (స) వారి సాకులను గురించి ఆరాతీయకుండా ఇండ్లకు వెళ్ళిపోవడానికి అనుమతిచ్చారు. కాని ఆ దుర్మార్గులు అంతటితో తృప్తిచెందకుండా, తాము యుద్ధరంగం నుంచి తప్పుకోవడమే గాకుండా ముస్లింలను కూడా పురిగొల్పసాగారు. కల్లబొల్లి మాటలతో వారిని భయపెట్టేవారు. దైవప్రవక్త (స)ను గురించి సందేహాస్పదమైన మాటలు పలికేవారు:

"ముహమ్మద్ మనకు బాగా నూరిపోశాడు. అదిగో సిరిసంపదలు వచ్చిపడు తున్నాయి; ఇదిగో రోమ్, ఈరాన్ దేశాల నుంచి మణిమాణిక్యాలు ఊడిపడుతున్నాయి అన్నాడు. కాని ఇక్కడ పరిస్థితి చూస్తే ఏదైనా అవసరమొచ్చి నగరంలోకి పోవాలన్నా ప్రాణాంతకంగా ఉంది" అన్నారు కపటవిశ్వాసులు. ఖుర్‌ఆన్ వారి బూటకపు విశ్వాసాన్ని ఎలా బయటపెట్టిందో చూడండి:

"కపటులు, హృదయాల్లో రోగమున్నవారిని గురించి ఆలోచించండి. వారు (తమ కాపట్య రోగాన్ని బయటపెట్టుకుంటూ) "దేవుడు, దైవప్రవక్త చేసిన వాగ్దానాలన్నీ బూటకం, మోసం తప్ప మరేమీ లేదు" అని తెగేసి చెప్పారు. వారిలో కొందరు (ఈ అగ్నికి ఆజ్యం పోస్తూ) "యస్రిబ్ (మదీనా)వాసులారా! ఇక మీరిక్కడుండే అవకాశం సన్నగిల్లి పోయింది. (ఇక్కడుండటం ఇక ఏమాత్రం క్షేమం కాదు.) వెనక్కి మరలండి" అని అన్నారు. వారిలో ఒక వర్గం "మాఇళ్ళు ప్రమాదంలో చిక్కుకున్నాయి" అంటూ వెళ్ళిపోవడానికి ప్రవక్తను అనుమతి అడిగింది. నిజానికి వారి ఇళ్ళు ఎలాంటి ప్రమాదంలో చిక్కుకోలేదు. వారసలు (యుద్ధరంగం నుండి) పారిపోదలిచారు. (ఖుర్‌ఆన్-33:12,13)



"ఒకవేళ నగరం నలువైపుల నుండి శత్రువులు లోపలికి చొచ్చుకొనివస్తే, అప్పుడీ కపటులు అరాచకం సృష్టించడానికి పిలిస్తే వెంటనే వీరు ఆ రంగంలోకి దూకుతారు. ఆ సంక్షోభంలో చేరి దాన్ని ఎగదోయడానికి వీరు ఏమాత్రం వెనకాడరు. గతంలో వారు (యుద్ధ రంగం నుండి) పారిపోమని దేవుని సన్నిధిలో ప్రమాణం చేశారు. దేవుని సన్నిధిలో చేసిన ప్రమాణం గురించి (వారిని) తప్పకుండా నిలదీయడం జరుగుతుంది." (33:14,15)

"ప్రవక్తా! ఇలా చెప్పెయ్యి: 'మృత్యువు లేక వధ నుండి పారిపోతే, ఈ పారిపోవడం మీకెలాంటి ప్రయోజనం కలిగించదు. ఆ తర్వాత జీవితసౌఖ్యాలు జుర్రుకోవడానికి మీకు కొంచెం మాత్రమే అవకాశం లభిస్తుంది.' వారినిలా అడుగు: 'దేవుడు మీకు నష్టం కలిగించ దలచుకుంటే ఆయన పట్టునుండి మిమ్మల్ని ఎవరు కాపాడగలరు? ఒకవేళ దేవుడే మిమ్మల్ని అనుగ్రహించదలిస్తే ఆయన అనుగ్రహాన్ని ఎవరు అడ్డుకోగలరు?' దేవునికి వ్యతిరేకంగా వీరికి ఎలాంటి సంరక్షకుడూ, సహాయకుడూ లభించడు." (ఖుర్‌ఆన్-33:16,17)

"మీలో ఆటంకాలు సృష్టించేవారెవరో దేవునికి బాగాతెలుసు. వారు తమ సోదరులతో '(ఇక ఆ ప్రవక్తను వదిలేసి) మా దగ్గరకు వచ్చేయండి' అంటారు. ఒకవేళ వారు యుద్ధంలో పాల్గొన్నా నామమాత్రంగా పాల్గొంటారు. పైగా మీకు తోడ్పడటంలో పిసినారితనం వహిస్తారు. ప్రమాదం వచ్చిపడినప్పుడు చచ్చిపోయేవాడు గుడ్లు తేలవేసినట్లు వారు నీవైపు నిలువుగుడ్లు వేసి చూస్తారు. అయితే ఆ ప్రమాదం కాస్తా తప్పిపోగానే లాభాల పేరాశతో రంకెలు వేసు కుంటూ మీ దగ్గరకు వస్తారు. వీరసలు (సత్యాన్ని) విశ్వసించనే లేదు. అందుకే దేవుడు వారి కర్మలన్నిటిని వ్యర్థంచేశాడు. ఇలా చేయడం ఆయనకు చాలా తేలిక." (ఖుర్‌ఆన్-33:18,19)

"కపటులు, హృదయంలో రోగమున్న (దుష్టబుద్ధికల)వారు, దారుణమైన వదంతులు వ్యాపింపజేసేవారు తమ దుశ్చర్యలు మానుకోకపోతే మేము వారికి వ్యతిరేకంగా నిన్ను సమాయత్తపరుస్తాం. అప్పుడు వారికీ నగరంలో నీతోపాటు ఉండటం కష్టమై పోతుంది. నలువైపుల నుండి వారిపై అభిశాపం పడుతుంది. ఎక్కడ కన్పిస్తే అక్కడ వారు పట్టుబడి చంపబడతారు. ఇలాంటివారి విషయంలో ఇది పూర్వం నుంచీ వస్తున్న దైవసంప్రదాయమే. దైవసంప్రదాయంలో నీవు ఎలాంటి మార్పు చూడలేవు. (ఖుర్‌ఆన్-33:60-62)

## 28. తానొకటి తలచిన దైవమొకటి తలచున్

కపటుల పరిస్థితి ఇక్కడిలా ఉంటే, మరోవైపు బహుదైవారాధకులు తమల్ని ఆదుకో వడానికి యూదులు ఎప్పుడొస్తారా అని తీవ్రంగా ఎదురుచూస్తున్నారు. వారు తమకోటల గుండా దారి ఎప్పుడిస్తారు, ఆ దారిగుండా వెళ్ళి మదీనాపై దాడిచేసి తమ దుష్ట కోరికల్ని ఎప్పుడు నెరవేర్చుకుందామా అని సమయం కోసం కాచుకొని ఉన్నారు.

మదీనా చుట్టూ త్రవ్విన కందకం ఒకచోట వెడల్పు కొంచెం తక్కువగా ఉంది. భద్రతాఏర్పాట్లు కూడా ఏమంత కట్టుదిట్టంగా లేవు. ఈసంగతి గమనించిన అవిశ్వాసులకు రొట్టె విరిగి నేతిలో పడినట్లయింది. వారిలో ఎనలేని ఉత్సాహం పెల్లుబికింది. ముందుగా ఆరితేరిన కొందరు వీరులు కత్తులు సిద్ధంచేసుకొని, హుషారైన గుర్రాలు ఎక్కి కందకాన్ని అవలీలగా దాటగలిగారు. దాంతో వారి ఆనందం అవధులు దాటింది. అలా కందకం

దాటి వెళ్ళినవారు ముస్లింల చేతిలో పరాజయం పాలై పారిపోయారు. మరికొందరు కందకం దాటడానికి ప్రయత్నించి అందులో పడి ఊపిరి విడిచారు.

ఇప్పుడు ఇరుపక్షాల మధ్య యుద్ధం ధనుర్బాణాలకు పరిమితమైపోయింది. అయితే ముస్లింలకు ఒక్కొక్క ఘడియ ఒక్కొక్క యుగంలా గడిచిపోతోంది. అనుక్షణం భయాందోళనలతో గడపవలసి వస్తోంది. రేయింబవళ్ళూ రెప్పవాల్చకుండా కందకాన్ని కాపలా కాయవలసివస్తోంది. నిద్రలేమికి కళ్ళు తిరుగుతున్నాయి. క్షణక్షణానికి తీవ్రరూపం దాల్చుతున్న కదనరంగం చూసి గుండెలు గొంతుల్లోకి వస్తున్నాయి.

“ఆ సమయంలో మీరు ఏం చేస్తుండేవారో దేవుడు ఓకంట గమనిస్తుండేవాడు. వారు మీపైకి క్రిందినుంచి, పైనుంచి దాడి చేయడానికి వచ్చారు. (అది అతిక్లిష్ట పరిస్థితి.) అప్పుడు జనం భయంతో కళ్ళు తేలవేశారు. వారి గుండెలు దడదడ కొట్టుకోసాగాయి. దేవుని విషయంలో మీరు రకరకాలుగా అనుమానించసాగారు. అప్పుడు విశ్వాసులు కఠినాతికఠినమైన పరీక్షకు గురైపోయారు; ఘోరాతిఘోరంగా కుదిపివేయబడ్డారు.” (ఖుర్ఆన్-33:10,11)

సరిగ్గా అలాంటి సమయంలోనే విశ్వప్రభువు గత్ఫాన్ తెగ నాయకుడొకనికి ఇస్లాం స్వీకారభాగ్యం ప్రసాదించి రంగంలోకి దించాడు.

గత్ఫాన్ తెగకు చెందిన నయీమ్ బిన్ మస్ఊద్ అనే ఆ మనిషి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి “దైవప్రవక్తా! అల్లాహ్ దయవల్ల నేను ముస్లిం అయ్యాను. అయితే నేను ఇస్లాం స్వీకరించిన సంగతి ఇంకా ఎవరికీ తెలియదు. అంచేత మీరు తలచుకున్న విధంగా నన్ను వినియోగించుకోండి. మీ ఆజ్ఞ శిరసావహించడానికి నేను సిద్ధంగా ఉన్నాను” అన్నాడతను ఎంతో ఉత్సాహంతో.

“చాలా సంతోషం, నయీమ్! మీరొక్కరే కదా? ఈ పరిస్థితిలో మీకు తోచినట్లు చేసి ఈ ఆపద దూరంచేయండి. మీరేం చేయాలనుకున్నా దానికి నేను అనుమతిస్తున్నాను” అన్నారు దైవప్రవక్త (స). నయీమ్ బిన్ మస్ఊద్ (రజి) ఆ తర్వాత దైవప్రవక్త (స) దగ్గర సెలవు తీసుకొని అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

“అయితే ఇప్పుడు ఎక్కడికెళ్ళాలి? ఏం చెయ్యాలి? శత్రువుల దుష్టయత్నాలను ఎలా వమ్ము చేయాలి? వారిని ఓడించడానికి నావంతు ప్రయత్నం ఏమిటీ? ఎలాంటి పథకం రూపొందించాలి?” ఇలా అనేక విధాల ఆలోచించారు నయీమ్ (రజి). చివరికి మెరుపులాంటి ఒక ఉపాయం తట్టింది. మంచి పథకమే! కళ్ళు మెరిశాయి. వెంటనే ఆయన కార్యాచరణకు ఉపక్రమించి బనూఖురైజా యూదులవాడకు దారితీశారు.

హజ్రత్ నయీమ్ (రజి)కు బనూఖురైజా తెగలో మంచి పలుకుబడి ఉంది. ఆ తెగవాళ్ళు నయీమ్ సహచర్యం లభించడమే గొప్ప భాగ్యమని తలుస్తారు. అందువల్ల ఆయన ఆ వాడలో అడుగుపెట్టగానే బనూఖురైజా పెద్దలు ఎదురెళ్ళి చిరునవ్వుతో స్వాగతమిచ్చారు. అతిథి గృహానికి తీసికెళ్ళి రాచమర్యాదలు చేశారు. యోగక్షేమాలు విచారించి ప్రత్యేక ఆసనం మీద కూర్చోబెట్టారు.

హజ్రత్ నయీమ్ (రజి) వారి ఆతిథ్యానికి, గౌరవమర్యాదలకు కృతజ్ఞతలు చెప్పారు.



ఆ తర్వాత ఆయన దేశ పరిస్థితులను గురించి, వ్యాపార వ్యవహారాలను గురించి ఎంతో ఆసక్తి కరమైన కబుర్లు చెప్పనారంభించారు. మరికొందరు పెద్దలు, చిరుపెద్దలు కూడా వచ్చి చుట్టూ గుమికూడారు. మాటామంతీ అయ్యాక ఆయన అసలు విషయానికి వచ్చారు.

“మిత్రులారా! ఈ తెగతో నాకు ఎంత సన్నిహిత సంబంధం ఉందో మీకు తెలుసు కదా! ప్రత్యేకించి మీ పట్ల నాకున్న ప్రేమాభిమానాలు వేరే చెప్పాలా?” మొదటి బాణం సంధించారు ఆయన.

“ఔనౌను. ఆ విషయం మాకెందుకు తెలియదూ? మీరు మొదటి నుంచీ మాకు మంచి శ్రేయోభిలాషులే” ముక్తకంఠంతో అన్నారు యూదనాయకులంతా.

“మీరు ముహమ్మద్‌తో చేసుకున్న ఒప్పందం భంగపరచి ఖురైష్, గత్ఫాన్ తెగలతో చేతులు కలిపారని విన్నాను. కాని ఆ తెగలవాళ్ళు సుదీర్ఘముట్టడితో ఇప్పటికే బాగా అలసి పోయినట్లు కన్పిస్తున్నారు. మనం గెలిస్తే అంతకన్నా అదృష్టం మరొకటి ఉండదు. కాని దురదృష్టవశాత్తు ఓడిపోతే? అప్పుడేం చేస్తారు? ఖురైషీయులు మాత్రం చల్లగా జారుకుంటారు. మైదానంలో మీరు ఒంటరిగా మిగిలిపోతారు. చివరికి మీరొక్కరే ముస్లింలను ఎదుర్కోవలసి ఉంటుంది. అప్పుడు మీరు ఘోరమైన ప్రమాదంలో పడిపోతారు. ఇదివరకు బనూఖైనుఖా, బనూనజీర్ తెగలకు పట్టిన గతి మీకు తెలుసు. బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి” రెండవ బాణం సంధించారు హజ్రత్ నయీమ్ (రజి).

“అయితే ఇప్పుడేం చెయ్యమంటారు? మీరే ఏదైనా ఉపాయం చెప్పండి” అన్నారు యూద నాయకులు ఆదుర్దాగా.

“ఇప్పుడీ ప్రమాదం నుండి బయటపడటానికి ఒకేఒక మార్గం ఉంది. మొదట వారి మనుషులు కొందరిని మీదగ్గర తాకట్టు పెట్టమనండి. ఆ తర్వాత వారితో చేరిపోండి. ఆ మనుషులు కూడా ప్రముఖ వ్యక్తులైఉండాలి. ఇలా అయితే మీకూ తృప్తి ఉంటుంది. వారు కూడా ముహమ్మద్‌ని చంపే వరకు వెనక్కి తిరిగిపోయే మాటెత్తరు”

హజ్రత్ నయీమ్ (రజి) ఇచ్చిన సలహా విని అందరూ సంతోషం వెలిబుచ్చారు. “చాలా బాగుంది మీ అభిప్రాయం. మీ సలహా తప్పకుండా పాటిస్తాం” అన్నారు అందరూ సంతోషం వెలిబుచ్చుతూ.

“మరి నే వెళ్ళొస్తా. జాగ్రత్త, ఈ విషయం ఎవరికీ తెలియకూడదు సుమా!”

“అబ్బే! ఆమాత్రం మాకు తెలియదటండీ? అదంతా మేము చూసుకుంటాంగా. మీరు నిశ్చింతగా వెళ్ళిరండి” అన్నారు యూదనాయకులు నయీమ్ (రజి)ని సాగనంపుతూ.

“నయీమ్ ఎంత మంచివాడు! మన యోగక్షేమాలంటే ఎంత శ్రద్ధ! మన కోసం పని కట్టుకొని మరీ ఇంతదూరం వచ్చాడు! ఎంత ప్రేమ! ఎంత అభిమానం!!” మరికొందరు తెగ పొగుడుతూ నయీమ్ (రజి)ని వాడ వెలుపలదాకా పంపివచ్చారు.

హజ్రత్ నయీమ్ (రజి) లోలోన సంతోషిస్తూ ఖురైష్ నాయకుడు అబూసుఫ్యాన్ దగ్గరకి వెళ్ళారు. అక్కడ అబూసుఫ్యాన్‌తో పాటు మరికొందరు నాయకులు కూడా

ఉన్నారు. నయీమ్ (రజి)ని చూడగానే వారంతా సాదరంగా ఆహ్వానించారు. కుశల ప్రశ్నలయ్యాక హజ్రత్ నయీమ్ (రజి) విషయాన్ని మెల్లగా బయటపెట్టారు.

“సోదరులారా! మీపట్ల నాకున్న ప్రేమాభిమానాలు గురించి ప్రత్యేకించి చెప్ప నవసరం లేదనుకుంటాను” అన్నారు ఆయన.

“అరెరె ఎంతమాట! మీరు మా శ్రేయోభిలాషులన్న సంగతి మాకు తెలియదటండీ!” అన్నారు అబూసుఫ్యాన్‌తో సహా కొందరు ఉన్నతాధికారులు.

“ఈమధ్యనే నాకో సంగతి తెలిసింది. అది కాస్తా మీచెవిన పడేస్తే మీ శ్రేయోభి లాషిగా నా బాధ్యత తీర్చుకున్నట్లవుతుందని వచ్చాను” అన్నారు నయీమ్ (రజి).

“అలాగా! ఏమిటా సంగతి?” అడిగారు అంతా ఒక్కసారిగా ఆత్రంతో.

“బనూఖురైజా తెగవాళ్ళు ముహమ్మద్ (సల్లం)తో చేసుకున్న ఒప్పందాన్ని భంగంచేసి పశ్చాత్తాపం చెందుతున్నారని విన్నాను” చెప్పారు హజ్రత్ నయీమ్ (రజి).

“నిజమా!?” అన్నారు ఖురైషీయులు నిర్ఘాంతపోయి చూస్తూ.

“కాని వారంతటితో ఊరుకోలేదు. ముహమ్మద్ తమతో పాత ఒప్పందానికి మళ్ళీ ఇష్టపడితే ఖురైష్, గత్ఫాన్ తెగలకు చెందిన కొందరు మనుషుల్ని అప్పగిస్తాం అని, ఆయన వారిని వధించి పగతీర్చుకోవచ్చని ఆయన దగ్గరికి రాజీధోరణి వ్యక్తపరిచే విజ్ఞప్తిని కూడా పంపుకున్నారట. ఆ మనుషులు కూడా సాధారణ మనుషులు కాదట! ప్రముఖ వ్యక్తుల్ని అప్పగిస్తారట!!” అన్నారు హజ్రత్ నయీమ్ (రజి) ఆఖరి బాణం సంధిస్తూ.

“ఎంత దుర్మార్గులు! ఎంత నమ్మక ద్రోహులు!!” కోపంతో చిందులు తొక్కారు ఖురైష్ నాయకులు.

“సోదరులారా! విన్నారు కదా? జాగ్రత్త! మీ శ్రేయస్సు కోరి చెబుతున్నాను. వారెన్ని సాకులు చెప్పినా మీరు మాత్రం వారికి మీ మనుషుల్ని అప్పగించకండి. మరచి కూడా అలా చేయకూడదు సుమా!!” అన్నారు హజ్రత్ నయీమ్ (రజి).

“ఇంకా ఆ దుర్మార్గుల దగ్గరికి మా మనుషుల్ని పంపిస్తామా? నిజంగా మీరు మా శ్రేయోభిలాషులు. మీరే గనక ఈ సమయంలో ఈవార్త తెలియజేసి ఆదుకోకపోతే మేమెంతో ప్రమాదంలో పడేవాళ్ళం” ఖురైషీయుల్లో కృతజ్ఞతా భావం తొంగిచూసింది.

హజ్రత్ నయీమ్ (రజి) అక్కడ్నుంచి బయలుదేరి గత్ఫాన్ తెగవాళ్ళ దగ్గరికి వెళ్ళారు. ఖురైషీయుల దగ్గర ఏ మాటలైతే చెప్పారో ఇక్కడ కూడా ఆయన అవే మాటలు చెప్పారు. ఈ మాటలు విని గత్ఫాన్ తెగ నాయకులు కూడా యూదుల్ని అసహ్యించుకొని తరువాత నయీమ్ (రజి)ని తమ శ్రేయోభిలాషిగా భావించి శ్లాఘించారు.

ఆ తరువాత హజ్రత్ నయీమ్ (రజి) విజయోత్సాహంతో దైవప్రవక్త (సల్లం) సన్నిధికి తిరిగొచ్చారు. తాను చేసివచ్చిన పనిని గురించి ఆయనకు నివేదిక సమర్పించారు.

నయీమ్ (రజి) మాటలకు అటు ఖురైష్ నాయకులు, ఇటు గత్ఫాన్ నాయకులు



ఉభయులూ భయపడ్డారు. తక్షణమే ఉభయతెగల నాయకులు సమావేశమయ్యారు.

తీవ్రంగా ఆలోచించారు. దానిపై ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా అభిప్రాయం వెలి బుచ్చారు. చివరికి రెండు తెగల నాయకులు ఒక నిర్ణయానికి వచ్చారు. దాని ప్రకారం వెంటనే ఉభయ తెగల వాళ్ళు తమ నాయకులు కొందరిని చర్చల కోసం బనూ ఖురైజా యూదుల దగ్గరికి పంపించారు.

ఈ ఉమ్మడి ప్రతినిధి వర్గం బనూఖురైజా తెగ దగ్గరికి పోయింది. వాళ్ళను చూసి బనూఖురైజా యూదులు ఇదివరకంతటి ఉత్సాహం చూపలేదు.

ఖురైష్-గత్ఫాన్ ప్రతినిధివర్గం సభ్యులు యూదులు తలపెట్టిన విశ్వాసఘాతుకానికి లోలోన కుతకుతలాడి పోతున్నారు.

“సోదరులారా! మేమిక్కడికి వచ్చి చాలా రోజులయింది. ఇంకా ఎక్కువ రోజులు ఉండటం కష్టం. ఈ సుదీర్ఘ ముట్టడితో మేము ఇప్పటికే చాలా విసిగిపోయాము. అంచేత ఇప్పుడు ఏదో ఒకటి నిర్ణయం జరగాలి. వీలైనంత త్వరగా మీరూ వచ్చి మాతో చేరండి. మనమంతా కలిసి ఒకేసారి పెద్దపెట్టున ముస్లింల మీద దాడిచేద్దాం” అన్నారు వారు.

‘రేపు శనివారం కదా! శనివారం రోజు మేము యుద్ధం చేయలేము. మరో రోజు పెట్టుకుందాం. కాని ఒక విషయం. ఒకవేళ ముహమ్మద్ గెలిచేలా ఉంటే మాత్రం మీరు మమ్మల్ని విడనాడి పోమని హామీనివ్వాలి. దాని కోసం మాకు నమ్మకం కలగడానికి మీ మనుషులు కొందరిని మా దగ్గర తాకట్టు పెట్టండి. ఆ తరువాతే మేము మీతో సహకరించ గలం” అన్నారు యూదులు.

ఈ మాటలు వినగానే ఖురైష్, గత్ఫాన్ తెగవాళ్ళు నయీమ్ చెప్పిన మాటల్లో ఎలాంటి సందేహం లేదని భావించారు. బనీఖురైజా యూదులు నిజంగా ఏదో మోసం తలపెట్టారని అనుమానిస్తూ “అసాధ్యం. మీదగ్గరికి మామనుషుల్ని పంపే ప్రసక్తే లేదు” అన్నారు వారు. వారి మాటలు విని బనీఖురైజా యూదులు కూడా నయీమ్ చెప్పింది నిజమే అనుకుంటూ “అయితే మేము మీతో సహకరించే ప్రసక్తి లేదు” అన్నారు ప్రతినిధి వర్గంతో. ప్రతినిధి వర్గం మారుమాట్లాడకుండా అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

ఈవిధంగా హజ్రత్ నయీమ్ (రజి) పన్నిన యుద్ధతంత్రం ఫలించి శత్రువుల ఐక్య సంఘటన నిట్టనిలువుగా చీలిపోయింది.

ఈ సమాచారం ముస్లిం శిబిరంలో వెలుగు రవ్వలు వెదజల్లింది. నిరాశా నిస్పృహలు పటాపంచలై పోయాయి. వాడిన ముఖాలన్నీ ఒక్కసారిగా వికసించాయి. దైవానుగ్రహం పొంగిపొరలింది. దైవదూతల దీవెనలు ప్రతిధ్వనించాయి. విజయపతాకం రెపరెప లాడింది! అంతా ఆనందమయం!! సర్వత్రా సంతృప్తికరం!!!

## 29. అవిశ్వాసులపై ప్రకృతి ప్రకోపం

మరునాడు దైవకారుణ్యం ధారాపాతంగా వర్షించింది....చూస్తుండగానే నీలాంబరం లో మిలమిల మెరిసే నక్షత్రాలు చకచకా అంతర్ధానమయ్యాయి.

ఆ తరువాత నలువైపుల నుంచి కారుమేఘాలు గబగబా కమ్ముకున్నాయి. చల్లటి ఈదురుగాలి కూడా ప్రారంభమయింది. యుద్ధ మైదానమంతా అంధకారమయమయింది. ఆ వెనువెంటనే ఉరుములు, మెరుపులతో వాతావరణం భయానకంగా మారింది. ఈదురు గాలి ఉధృతమయింది. కొన్ని క్షణాల్లోనే అది పెనుతుఫానుగా పరిణమించింది.

పెద్ద ప్రళయమే ముంచుకొస్తోంది. కన్ను పొడుచుకున్నా కానరాని కటిక చీకటిలో హఠాత్తుగా దాడిచేసిన ఈ తుఫాను ఎవరికి ఎలాంటి ముప్పు తెచ్చి పెడ్తుందో! వందల మైళ్ళ వేగంతో వీస్తున్న ఈదురుగాలుల హోరుతో మదీనా కొండలు మార్మోగుతున్నాయి. ఖర్జూరపు చెట్లు కూకటివేళ్ళతో సహా లేచి గాలిలో ఎగురుతున్నాయి.

శరవేగంతో వీస్తున్న గాలి హోరుకు కందకం ఆవల ఉన్న శత్రు సైనికులు భయపడి అరుపులు, కేకలు పెడ్తున్నారు. వారు వేసుకున్న గుడారాలు తుఫాను తాకిడికి గాలిపటాల్లా ఎగిరిపోతున్నాయి. సామగ్రి చెల్లాచెదరయి పోయింది. కుంపట్ల మీదున్న పెద్ద పెద్ద వంట పాత్రలు సైతం ఎగిరి తలక్రిందయి పడిపోయాయి.

తుఫాను క్షణక్షణానికి ఉధృతం కాసాగింది. విపరీతమయిన చలితో వీస్తున్న గాలికి సైనికులు గజగజ వణికిపోతున్నారు. నాయకుల వ్యూహం తారుమారయింది. సైనిక వ్యవస్థ అస్తవ్యస్త మయింది. సైనికులు ఆత్మరక్షణ కోసం పడరాని పాట్లు పడుతున్నారు. రానున్న ప్రమాదం మనసులో మెదలగానే వారి గుండెలు దడదడలాడసాగాయి.

అంతా గాఢాంధకారం. రక్తాన్ని గడ్డకట్టించే చలి. కళ్ళు చెదరగొట్టే మెరుపులు. చెవులు చిల్లులు పడే ఉరుములు. ఉధృతంగా వీస్తున్న గాలి జోరు. దేహాలకు తూట్లు వేసే ఇసుకరేణువులు. ప్రకృతి విలయతాండవం చేస్తోంది. మరణ రక్కసి తరుముకుంటూ వస్తోంది. సైనికులు భయంతో పెడబొబ్బలు పెడ్తున్నారు.

"అమ్మో! మా ప్రాణాలు పోతున్నాయి. సర్వనాశనమవుతోంది!!"

సేనాపతి అబూసుఫ్యాన్ పరిస్థితి విషమించిందని గ్రహించాడు. ఈ ప్రకృతి బీభత్సంలో ముస్లింలతో పోరి గెలవలేమనుకున్నాడు. ఇక ఇక్కడుంటే తనకూ, తన సైన్యానికి సర్వనాశనం తప్పదని భావించాడు. సైనికులు పెడ్తున్న భయంకర కేకలు విని అదిరిపోయాడు.

"ఖురైష్ సోదరులారా! ఇక మనమీ ప్రదేశంలో ఒక్కక్షణం కూడా ఉండలేం. చూడండి ప్రకృతి ఎలా భీకరరూపం దాల్చిందో! గుడారాలు ఎగిరి పోతున్నాయి. సామగ్రి చిందర వందరై పోయింది. పశువులు అల్లాడిపోతున్నాయి. యూదులు కూడా మనల్ని మోస గించారు. పదండి, ప్రమాదం ముంచుకొస్తోంది. ఇదిగో నేను వెళ్తున్నాను" అంటూ అబూసుఫ్యాన్ ఓ గుట్ట మీదనుంచి పొలికేకలు పెట్టాడు.

ఆ తరువాత అతను గుర్రంపై ఎగిరి కూర్చొని దౌడుతీయించాడు. సేనాపతే యుద్ధ రంగం వదలిపోతే ఇక సైనికులు అక్కడ ఉండగలరా! వారు కూడా వెంటనే ఆ చీకటిలోనే, ఆ తుఫానులోనే చేతికందిన సామాను తీసుకొని మూటాముల్లెలు సర్దుకున్నారు. ఉధృ తంగా వీస్తున్న గాలి తాకిడికి తడబడుతున్న కాళ్ళతోనే వడివడిగా నడుస్తూ, కటికచీకటిలో



కళ్ళుచించుకొని తచ్చాడుతూనే బ్రతుకుజీవుడా అంటూ మక్కా దారిపట్టారు.

ఖురైష్ సైనికుల్ని చూసి వారి మిత్రపక్షమైన గత్ఫాన్‌తెగ సైనికులు కూడా గత్యంతరం లేక గబగబా కాలికి బుద్ధిచెప్పారు.

తుఫాను ఉధృతం క్రమంగా తగ్గిపోయింది. మేఘాలు మెల్ల మెల్లగా విడిపోయాయి. ప్రకృతి శాంతించింది. కాస్సేపటికి వాతావరణం యథాస్థితికి వచ్చింది.

"విశ్వాసులారా! మీకు దేవుడు చేసిన మేలు గుర్తుకు తెచ్చుకోండి. మీపైకి (శత్రు) సైన్యాలు దాడిచేయడానికి వచ్చినప్పుడు, మేము వారి మీదికి పెనుతుఫాన్ పంపాం. పైగా (మీకంటికి కన్పించని అదృశ్య సైనికుల్ని (దైవదూతల్ని) కూడా పంపాము." (ఖురాన్-33:9)

"దేవుడు సత్యతిరస్కారుల ముఖాలను వెనక్కి తిప్పివేశాడు. వారు మనసులో కసి నింపుకొని ఎలాంటి ప్రయోజనం సాధించకుండానే ఉత్త చేతులతో వచ్చినదారే వెళ్ళిపోయారు. విశ్వాసుల వైపున పోరాడేందుకు ఒక్క దేవుడే సరిపోయాడు. దేవుడు ఎంతో బలాఢ్యుడు, మహా శక్తిమంతుడు." (ఖుర్ఆన్-33:25)

తూర్పు దిగ్మండలం నలుపు చీర వదలి తెల్ల వస్త్రం కప్పుకుంటోంది. ఆ తరువాత కాస్సేపటికి సహస్రకోటి కిరణాలతో ఉదయ భానుడు ముసిముసి నవ్వులతో మేల్కొన్నాడు. ప్రకృతి ఆహ్లాదకరంగా ఉంది. ప్రభాత సమయం ప్రార్థన ముగించుకున్న ముస్లింయోధులు కందకం కట్ట మీదికి వచ్చి సంభ్రమాశ్చర్యాలతో చూడసాగారు. కందకం ఆవల యుద్ధ మైదానం నిర్మానుష్యంగా పడివుంది. శత్రుశేషం మచ్చుకైనా కన్పించలేదు. దాంతో అంతా సంతోషాతిశయంతో 'అల్లాహు అక్బర్' అన్నారు. ఆ నినాదంతో పరిసరాలు మార్మోగాయి.

దైవప్రవక్త (సల్లం) ఆ నిర్జనప్రదేశం చూసి "ఇప్పుడిక ఖురైషీయులు మీ మీద ఎన్నటికీ దాడిచేయడానికి రాలేరు. మీరే వారిపై దాడిచేయడానికి వెళ్తారు" అన్నారు ప్రియఅనుచరులతో.

శత్రువు పీడ విరగడైనందుకు విప్పారినముఖాలతో ముజాహిద్‌లు నగరానికి తిరిగి వచ్చారు. ఈసంఘటన హి.శ. 5వ యేట, జీఖాదానెలలో జరిగింది. 25 రోజులకు పైగా జరిగిన ఈ యుద్ధంలో పెద్దగా శ్రమ పడకుండానే ముస్లింలకు విజయం లభించింది.

## 30. బనీఖురైజా యూదుల దుర్గతి

దైవప్రవక్త (సల్లం) యుద్ధరంగం నుండి మధ్యాహ్నం వేళకు ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో ప్రవేశించి ఆయుధాలు తీసివేశారు. సరిగ్గా అదే సమయంలో దైవదూత జిబ్రీల్ (అలై) ప్రత్యక్షమయ్యారు. "ఏమిటీ, మీరు అప్పుడే ఆయుధాలు దించారా! మేము మటుకు ఇంకా ఆయుధాలు దించలేదు" అన్నారు ఆయన.

"మరే వ్యవహారమైనా మిగిలి ఉందా?" అడిగారు దైవప్రవక్త (సల్లం) ఆశ్చర్యంగా. "ఆ... బనూఖురైజా వ్యవహారం ఇంకా మిగిలిఉంది. వీళ్ళను కూడా ఇప్పుడే అణచి వేయాలి" అన్నారు హజ్రత్ జిబ్రీల్ (అలై).

"వారు (ప్రపంచంలో) యుద్ధజ్వాలలు రగిల్చినప్పుడల్లా దేవుడు వాటిని చల్లార్చవలసి

వస్తున్నది. వారు ఎల్లప్పుడూ ధరణిపై ఏదోఒక ఉపద్రవం సృష్టించడానికే ప్రయత్నిస్తుంటారు. దేవుడు ఇలాంటి కలహకారుల్ని ఎన్నటికీ ప్రేమించడు." (ఖుర్ఆన్-5:64)

ఈ ఆజ్ఞ వినగానే దైవప్రవక్త (స) ఒక ప్రకటన చేస్తూ"దైవధర్మంలో స్థిరంగా ఉన్న యోధులంతా బనీఖురైజావాడకు చేరుకోనంతవరకు ఈరోజు అసర్ నమాజ్ చేయ కూడద"ని చెప్పారు. ఆ తర్వాత ఆయన అలీ (రజి)కి ఒకచిన్న సైనిక దళాన్నిచ్చి పంపారు.

ఈ సైనికదళం యూదులవాడ సమీపానికి చేరుకుంది. దాన్ని చూడగానే యూదులు కోటగోడలు ఎక్కి, తమను బెదిరించడానికి మాత్రమే ఈ చిన్నదళం వస్తోందని తలచి, దైవప్రవక్త (సల్లం)ను, ముస్లింలను నానా దుర్భాషలాడటం మొదలెట్టారు. ఆ తరువాత కాస్సేపటికే దైవప్రవక్త (సల్లం) సారథ్యంలో భారీసైన్యం రావడంతో వారి గుండెలు గుభిల్లుమన్నాయి. వెంటనే వారు కోటద్వారాలు మూసుకొని, దుర్భేద్యమైన ఈ కోటలే తమను కాపాడుతాయని భావించారు.

ఈ యూదులు అతిక్లిష్ట పరిస్థితుల్లో స్నేహఒప్పందానికి తిలోదకాలిచ్చి, మదీనాపై దాడిచేయడానికి వచ్చిన విదేశీ శక్తులతో చేతులు కలిపారు. దైవప్రవక్త (సల్లం)ను, ఆయన అనుచరులను శాశ్వతంగా అంతమొందించడానికి కుట్రలు పన్నారు. అలాంటి విశ్వాస ఘాతకులు, దేశద్రోహులను వదలిపెట్టకూడదని భావించారు ముస్లింలు. అందువల్ల వారు కోటను ముట్టడించి యుద్ధం ప్రారంభించారు.

యూదులు కోటబురుజుల నుండి ముస్లింలను ఎదుర్కోవడానికి ప్రయత్నించారు. కాని బయట నుంచి ముస్లింలు విడుస్తున్న బాణాల ధాటికి నిలువలేక ఆ ప్రయత్నం విరమించుకొని కోట లోపల దూరి కూర్చున్నారు. ముస్లింలు కూడా మొండికేసి అక్కడే రోజుల తరబడి యూదుల కోసం కాచుకొని కూర్చున్నారు.

ఇలా ముట్టడి మూడు వారాలు కొనసాగింది. ఆవిధంగా యూదులు ఎన్ని రోజులని కలుగులోని ఎలుకల్లా కోటలోనే పడిఉంటారు? అదీగాక నిల్వ చేసుకున్న ఆహార పదార్థాలు కూడా అయిపోవచ్చాయి. ఇంకా కొన్నాళ్ళు కోటలోనే ఉంటే మలమల మాడి చస్తారు. పోనీ కోట బయటికి వద్దామంటే ముస్లిం యోధులు ఆకలిగొన్న పులుల్లా గాండ్రిస్తూ కోట గుమ్మం దగ్గరే మాటువేసి కూర్చున్నారు. ఇప్పుడు దారేమిటీ?

యూదులు బెంబేలు పడిపోయారు. నాయకులంతా సమావేశమయి ప్రత్యామ్నాయ మార్గం కోసం తీవ్రంగా సమాలోచనలు జరిపారు.

"మనం ముహమ్మద్‌తో చేసుకున్న ఒడంబడికను భంగంచేసి చాలా పొరపాటు చేశాం. పరిస్థితి చేజారిపోయింది. ఇప్పుడు మనకు ఒకేఒక మార్గం ఉంది. మనమంతా ఇస్లాం స్వీకరించి ముహమ్మద్‌కు లొంగిపోదాం. ఇలా చేస్తే మన ధన మాన ప్రాణాలకు ముప్పు రాదు. ముస్లింలతో కలసిమెలసి ప్రశాంత జీవితం గడపవచ్చు" అన్నాడు వారి అగ్రనాయకుడు కాబ్. ఈ ప్రతిపాదన వినగానే యూదుల్లో పెద్ద కలకలం బయలుదేరింది.

"వీల్లేదు. వీల్లేదు. ముహమ్మద్‌కు లొంగిపోవడం కన్నా మనకు వేరే అవమానం మరొకటి ఉండదు. తౌరాత్ గ్రంథాన్ని మేము ఎన్నటికీ విడనాడము. ప్రాణాన్నయినా



వదులుకుంటాం గాని, తౌరాత్‌ని వదలుకోము." తీవ్రంగా నిరాకరించారు అందరూ.

"అయితే మరో పని చేద్దాం. మనం మన భార్యాపిల్లల్ని హతమార్చుదాం. ఖడ్గాలు ధరించి బయటికి వెళ్దాం. ప్రాణాలకు తెగించి ముస్లింలతో పోరాడుదాం. ఒకవేళ మన మంతా వధించబడితే మన కోసం ఏడ్చేవారెవరూ ఉండరు. గెలిస్తే వేరే స్త్రీలను వివాహం చేసుకుందాం. కొన్నాళ్ళలో మళ్ళీ సంతానం కలుగుతుంది" అన్నాడు కాబ్.

ఈ ప్రతిపాదన కూడా ఎవరికీ నచ్చలేదు. "పాపం ఆడవాళ్ళను చంపటం ఏమీ బాగా లేదు. వారు పోతే మన జీవితాల్లో ఇక రుచీపచీ ఏముంటుందని?" అన్నారు కొందరు. కాబ్ మౌనంగా ఉండిపోయాడు. ఆ తరువాత మరికొన్ని ప్రతిపాదనలు వచ్చాయి. ఒక్కొక్కరు ఒక్కొక్క అభిప్రాయం వెలిబుచ్చారు. అందరి అభిప్రాయాలు క్రోడీకరించి చివరికి ఒక విషయం తీర్మానించారు.

"మనల్ని సిరియా పోవడానికి అనుమతించమని ముహమ్మద్‌ని అడుగుదాం. బనూ ఖైనుఖా, బనూనజీర్ తెగల విషయంలో ఇలాగే జరిగింది" అంటూ కాబ్ బిన్ అఖ్తబ్ తుది నిర్ణయం తెలియపరిచాడు. ఈ నిర్ణయం అందరికీ నచ్చింది. వెంటనే ఓ ప్రతినిధి వర్గాన్ని దైవప్రవక్త (సల్లం)తో రాయబారం జరపడానికి పంపించారు. ఆ ప్రతినిధివర్గం దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళింది.

"అయ్యా! మా వల్ల పొరపాటు జరిగిపోయింది. దయచేసి మమ్మల్ని సిరియా వెళ్ళిపోవడానికి అనుమతించండి" అన్నాడు ప్రతినిధివర్గం నాయకుడు.

"మీకీ అనుమతి లభించదు. ఓ పని చేయండి. ఔస్ తెగ మీ పాత మిత్రపక్షమే కదా! ఆ తెగలో ఎవరినైనా ఎన్నుకోండి. అతను ఏది నిర్ణయిస్తే దానికి మేము కట్టుబడి ఉంటాం. మీరు కూడా దాన్ని సమ్మతించవలసి ఉంటుంది" అన్నారు దైవప్రవక్త (స).

యూద ప్రతినిధులు ఓ క్షణం ఆలోచించి సాద్ బిన్ ముఆజ్ (రజి)ను మధ్యవర్తిగా ఉండి ఈ సమస్యను పరిష్కరించమన్నారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఔస్‌తెగకు చెందిన కొందరు ముస్లింలను పంపుతూ సాద్ బిన్ ముఆజ్‌ని పిలుచుకొని రమ్మని చెప్పారు. ఆ సమయంలో హజ్రత్ సాద్ (రజి) యుద్ధంలో గాయపడటం వల్ల మసీదుకు ఎదురుగా ఉన్న రఫీదా సల్మా ఇంట్లో ఉండి చికిత్స పొందుతున్నారు. ఔస్‌తెగ మనుషులు అక్కడికెళ్ళి దైవప్రవక్త ఆదేశం విన్పించారు. హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) అందుకు అంగీకరించగానే ఆయన్ని వారు పల్లకీలో కూర్చోబెట్టి తీసికెళ్ళారు. ఔస్‌తెగవాళ్ళు తమ పాత మిత్రపక్షానికి అను కూలంగా తీర్పిస్తే బాగుంటుందని భావిస్తున్నారు.

అందువల్ల వారు దారిలో హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి)తో మాట్లాడుతూ "ఇప్పుడు మీ తీర్పే తుది నిర్ణయం. అంచేత మీరు మన పాత మిత్రులైన బనీఖురైజా యూదులకు సహాయం చేస్తే బాగుంటుంది" అన్నారు. దానికి హజ్రత్ సాద్ (రజి) "నేను న్యాయం ప్రకారమే తీర్పు చెబుతాను. ఎవరి విమర్శలకు భయపడేవాణ్ని కాను" అని అన్నారు.

సాద్ (రజి) పల్లకి సమీపానికి రాగానే దైవప్రవక్త (స) ఔస్‌తెగ ముస్లింలతో "మీ నాయకుడు వస్తున్నాడు ఎదురెళ్ళి స్వాగతం చెప్పి గౌరవప్రదంగా తీసుకురండి" అన్నారు.

ఔస్‌తెగ ముస్లింలు లేచి సాద్ (రజి)కు స్వాగతంచెప్పి గౌరవప్రదంగా పల్లకీ నుంచి దించితెచ్చారు. సాద్ (రజి) రాగానే దైవప్రవక్త (స)కు సలాం చెప్పి కూర్చున్నారు.

"సాద్! మీ పాతమిత్రులు తమ వ్యవహారాన్ని మీకు అప్పగించారు. ఇప్పుడు తుది నిర్ణయం మీ చేతిలో ఉంది" అన్నారు దైవప్రవక్త (స).

హజ్రత్ సాద్ (రజి) అన్సార్ ముస్లింల వైపు చూస్తూ "మీరు దేవుడ్ని సర్వోపగతుడిగా భావించి నా తీర్పును సంతోషంగా అంగీకరిస్తామని మాటివ్వండి" అన్నారు. దానికి అన్సార్ ముస్లింలంతా "మీ తీర్పు మాకిష్టమే" అన్నారు ముక్తకంఠంతో.

తరువాత హజ్రత్ సాద్ (రజి) దైవప్రవక్త (స)ను, ముహాజిర్ ముస్లింలను ఉద్దేశించి "మీరు కూడా దేవుడ్ని సర్వోపగతుడిగా భావించి నా తీర్పును సంతోషంగా ఒప్పుకుంటామని మాటివ్వండి" అన్నారు. దైవప్రవక్త (స) కూడా సాద్ (రజి) ఇచ్చే తీర్పుని గౌరవిస్తామని చెప్పారు. ముహాజిర్ ముస్లింలు ఆ విషయాన్ని సమర్థిస్తూ తమ ఆమోదాన్ని తెలిపారు.

హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) యూదుల స్వభావం మొదటి నుంచీ బాగా ఎరిగిన వారు. ఆయన ఓ క్షణం ఆలోచించి పరిస్థితి అర్థం చేసుకున్నారు.

ఈ నీచులు ముస్లింలతో మంచిగా ఉంటూనే దైవమార్గంలో గోతులు తవ్వడానికి పూనుకున్నారు. శత్రువుల వల్ల తనకు గాయమైనప్పుడు, బనూఖురైజా యూదుల నమ్మక ద్రోహం పర్యవసానం చూసేవరకు తనను సజీవంగా ఉంచమని ఆయన దైవాన్ని ప్రార్థించారు. ఆ అవకాశం ఇప్పుడు వచ్చింది. ఆయన వెంటనే తన నిర్ణయాన్ని ఇలా తెలిపారు:

"బనీఖురైజా తెగ యూదులలో ఎవరెవరు యుద్ధం చేయగల శక్తిమంతులో వారంతా తక్షణమే వధించబడాలి. స్త్రీలు, పిల్లలను బందీలుగా చేసుకోవాలి. వారి ఆస్తిపాస్తులన్నీ ముస్లింలకు పంచబడాలి."

ఈ నిర్ణయం వినగానే యూదులకు మిన్ను విరిగి మీద పడినట్లయింది. కాళ్ళ కింద భూమి బద్దలయినట్లు అన్పించింది. ఏ ఒక్కరి నోటా మాట పెగల్లేదు. అందరూ నిలువుగుడ్లు వేసి చూడసాగారు. తక్షణమే ముస్లింలు కొందరు పెద్ద పెద్ద గోతులు తవ్వారు. పురుషులందర్నీ బంధించి గోతుల దగ్గరికి తీసికెళ్ళారు. అక్కడ వారిని వధించి గోతుల్లోకి త్రోసి పూడ్చిపెట్టారు.

"గ్రంథప్రజలలో శత్రుసేనలకు తోడ్పడినవారిని దేవుడు వారి కోటలనుండి బయటికి తీశాడు. వారి హృదయాల్లో (మీ పట్ల) భయోత్పాతం సృష్టించాడు. ఈ కారణంగానే ఈరోజు మీరు వారిలో కొందరిని హతమార్చి, మరికొందరిని బందీలుగా పట్టుకోగలిగారు. అంతే కాదు, ఆయన వారి భూములు, ఇండ్లు, ఇతర ఆస్తిపాస్తులకు మిమ్మల్ని వారసులుగా చేశాడు. వారి ప్రాంతంలో మీరు ఇదివరకెన్నడూ కాలు కూడా మోపి ఉండలేదు; అలాంటి ప్రాంతాన్ని కూడా దేవుడు మీకు స్వాధీనం చేశాడు." (ఖుర్ఆన్. 33:26,27)



స్నేహఒప్పందాన్ని భంగపరచి కయ్యానికి కాలుదువ్విన శత్రువులకు ఇలాంటి శిక్షే విధించాలని యూదుల ధర్మశాస్త్రం కూడా ఇలా చెబుతోంది:

"యుద్ధము చేయుటకు మీరొక పురము మీదికి సమీపించునప్పుడు సమాధానము నిమిత్తము రాయబారమును పంపవలెను. సమాధానమని అది నీకు ఉత్తరమిచ్చి గుమ్మములను తెరచిన యెడల దానిలోనున్న జనులందరు నీకు పన్ను చెల్లించి నీ దాసులగుదురు. అది మీతో సమాధానముపడక యుద్ధమే మంచిదని యెంచినయెడల దాని ముట్టడి చేయుడి. నీ దేవుడైన యెహోవా దాని నీ చేతికప్పగించునప్పుడు దానిలోని మగవారినందరిని కత్తివాత హతము చేయవలెను. అయితే స్త్రీలను, చిన్నవారిని, పశువులను, ఆ పురములోనున్నది యావత్తును దాని కొల్లసొమ్ముంతటిని నీవు తీసికొనవచ్చును. నీ దేవుడైన యెహోవా నీకిచ్చిన నీ శత్రువుల కొల్లసొమ్మును నీవు అనుభవించుదువు."

(బైబిల్ పాతనిబంధన, ద్వితీయోపదేశ కాండము, 20వ అధ్యాయము:10-14)

ఈ విధంగా బనూఖురైజా తెగ యూదుల అధ్యాయం సమాప్తమయింది. హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) కోరిక నెరవేరింది. తరువాత ఆయన శత్రువులు కలిగించిన గాయంతోనే శాశ్వతంగా కన్ను మూశారు.

## 31. చెదురుమదురు సంఘటనలు

హి.శ. అయిదవ యేట జిల్‌హజ్ నెలలో తీరప్రాంతంలోని జహ్నియా తెగవాళ్ళు తిరుగుబాటు చర్యలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందింది. అప్పుడు దైవప్రవక్త (సల్లం) హజ్రత్ అబూఉబైదా బిన్ జిరాహ్ (రజి) నాయకత్వంలో 300 మంది యోధుల్ని సైపుల్ బహర్ (తీరప్రాంతం) వైపు పంపించారు.

ఈ ప్రయాణంలో ఆహారపదార్థాలు తరిగిపోయి యోధులు ఆకలితో చాలా బాధ పడ్డారు. కొన్నాళ్ళపాటు రోజుకు రెండుమూడు ఖర్జూరాలు మాత్రమే తిని గడపవలసి వచ్చింది. చివరికి ఖర్జూరాలు కూడా అయిపోయినప్పుడు చెట్లఆకులు తినవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈవిధంగా యోధులు సముద్రతీరంలో పదిహేనురోజులు గడిపారు. చివరికి ఒక రోజు తీరం మీదికి ఓ పెద్ద చేప వచ్చిపడింది. అప్పుడు యోధులు పరమ సంతోషంతో దాని మాంసం తినడం ప్రారంభించారు. దాని కొవ్వు కూడా కరగబెట్టి వాడుకున్నారు. ఇలా పదిహేను రోజులపాటు చేపమాంసం, కొవ్వు తిని మళ్ళీ బలం పుంజుకున్నారు.

ఆ సంవత్సరంలోనే దైవప్రవక్త (సల్లం) నజద్ ప్రాంతానికి కూడా ఒక సైనిక దళం పంపారు. ఈ దళం హనీఫాతెగకు చెందిన యమామా ప్రాంతం నాయకుడు సుమామా బిన్ ఉసాల్‌ని ఖైదీగా పట్టుకున్నది. తరువాత మదీనా తిరిగొచ్చి అతడ్ని మసీదులో ఒక స్తంభానికి కట్టివేశారు. కాస్సేపటికి దైవప్రవక్త (సల్లం) వచ్చి అతడ్ని చూశారు.

ఆయన సుమామాని సంబోధిస్తూ "సుమామా! మాగురించి నీ అభిప్రాయం ఏమిటీ?" అనడిగారు. దానికి సుమామా "మీరు నన్ను హతమార్చితే విలువైన రక్తంగల ఒక మనిషిని హతమార్చిన వారవుతారు. మీరు గనక నాకు మేలు చేస్తే, చేసిన మేలును సదా గుర్తుంచుకునే ఒక వ్యక్తికి మేలు చేసినవారవుతారు. ఒకవేళ మీరు నాదగ్గర ధనం

తీసుకోదలిస్తే నేను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను, అడగండి ఎంతకావాలో" అన్నాడు.

దైవప్రవక్త (స) ఈ విధంగా మూడు రోజులు అడిగారు. అడిగిన ప్రతిసారీ అతను ఇలాగే సమాధానమిచ్చేవాడు. చివరికి దైవప్రవక్త (స) అతడ్ని విడిచిపెట్టమని అనుచరుల్ని ఆదేశించారు. అనుచరులు అతడ్ని తాళ్ళు విప్పి వదలిపెట్టారు.

సుమామా ఖైదు నుండి విడుదల కాగానే సమీపంలోని ఒక ఒయాసిస్సుకు వెళ్ళి స్నానం చేసి దైవప్రవక్త (స) దగ్గరకు తిరిగొచ్చాడు. ఆయన ముందు సద్వచనం పఠించి ముస్లిం అయిపోయాడు. తరువాత ఆయన దైవప్రవక్త (స)తో ఇలా అన్నారు:

"దైవప్రవక్తా! దీనికి పూర్వం నేను అందరికంటే ఎక్కువ మిమ్మల్ని, అన్ని ధర్మాలకన్నా ఎక్కువ మీధర్మాన్ని ద్వేషించేవాడ్ని. కాని ఈరోజు నేను అందరికంటే ఎక్కువ మిమ్మల్ని, అన్ని ధర్మాలకన్నా ఎక్కువ మీ ధర్మాన్ని అభిమానిస్తున్నాను. దైవప్రవక్తా! నేనసలు ఉమ్రా ఆచారం పాటించే ఉద్దేశ్యంతో మక్కా వెళ్తుంటే దారిలో మీ సైనికులు నన్ను బందించి తెచ్చారు. ఇప్పుడు నేను మీరనుమతిస్తే ఉమ్రా చేయాలనుకుంటున్నాను."

దైవప్రవక్త (సల్లం) ఈ మాట విని సంతోషంగా సుమామా (రజి)కు ఉమ్రా చేయడానికి అనుమతి ఇచ్చారు. ఆ తరువాత ఆయన ఉమ్రా కోసం మక్కా వెళ్ళి కాబా ప్రదక్షిణ చేస్తుంటే అక్కడి ఖురైష్ నాయకులు ఆయన ధోరణి గమనించి "సుమామా! నువ్వు కూడా మతభ్రష్టుడయి పోయావా?" అన్నారు.

దానికి సుమామా (రజి) సమాధానమిస్తూ "కాలేదు. నేనిప్పుడు ముహమ్మద్ మహనీయుని చేతి మీదుగా ఇస్లాం స్వీకరించాను. ఇంకా బాగా వినండి. ఇక నుండి ముహమ్మద్ (స) గారి అనుమతి లేకుండా మీకు యమామా నుండి ఒక్క గోధుమ గింజ కూడా పంపడం జరగదు" అని అన్నారు.

సుమామా (రజి) యమామా తిరిగొచ్చిన తర్వాత అలా చేసి చూపారు కూడా. దాంతో మక్కా ఖురైషీయులు దైవప్రవక్త (స) దగ్గరకొచ్చి "దయచేసి యమామా నుండి వచ్చే ధాన్యాన్ని మాకు సరాఫరా కాకుండా నిలుపుదల చేయించకండి" అని విన్నవించుకున్నారు. అప్పుడు దైవప్రవక్త (స) "మక్కా ప్రజలకు యథాప్రకారం ధాన్యం సరఫరా కానివ్వు" అని హజ్రత్ సుమామా (రజి)ను ఆదేశించారు.

దూమతుల్ జందల్ దండయాత్ర నుంచి తిరిగి వస్తున్నప్పుడు దైవప్రవక్త (సల్లం) ఒక చోట పశుపతి ఐనియాకు మదీనా పచ్చిక బయళ్ళలో పశువుల్ని మేపుకోవడానికి అనుమతి ఇచ్చారు. ఐనియా తన మందీమార్బలంతో మదీనా వచ్చి యేడాది పాటు తన పశువుల్ని బాగా మేపుకున్నాడు. తరువాత అతనికి దైవప్రవక్త (సల్లం) చేసిన ఉపకారానికి బదులుగా అపకారం తలపెట్టే దుర్బుద్ధి పుట్టింది. అతను ఓరోజు అవకాశం చూసి దైవప్రవక్త (సల్లం)కు చెందిన ఒంటెలపై దాడిచేశాడు. ఒంటెల కాపరిని హతమార్చి, అతని భార్యను పట్టుకొని ఒంటెలతో సహా పారిపోయాడు.

ఈ దుర్ఘటన సంగతి మొట్టమొదట హజ్రత్ అస్లమా బిన్ అమ్ బిన్ అకూ (రజి)కు తెలిసింది. తక్షణమే ఆయన నగరంలో బిగ్గరగా కేకలేస్తూ ముస్లింలకు ఈ విషయం



తెలియజేసి, ద్రోహుల వెంటపడ్డారు. దైవప్రవక్త (సల్లం) ఈ విషయం తెలియగానే ఐనియాను పట్టుకోవడానికి కొందరు సహచరుల్ని తీసుకొని బయలుదేరారు.

కొంత దూరం పోయిన తరువాత దైవప్రవక్త (సల్లం) జీఖురా సరస్సు దగ్గర ఆగి హజ్రత్ సాద్ బిన్ జైద్ (రజి) నాయకత్వంలో తన అనుచరులలో కొందరిని పంపించారు. వారు ఐనియాను వెంటాడి పట్టుకున్నారు. ముస్లింలకు తమ ఒంటెలతో పాటు ఐనియా ఒంటెలు కూడా చిక్కాయి. వారు పశువులకాపరి భార్యను కూడ విడిపించుకున్నారు. తరువాత ఒంటెలను తీసుకొని జీఖురా చేరుకున్నారు. అక్కడ ఒక రాత్రి గడిపి దైవప్రవక్త (సల్లం) వెంట మదీనా తిరిగి వచ్చారు.

హిజ్రీశకం 6వ ఏట దైవప్రవక్త (సల్లం) ధర్మప్రచారం కోసం హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)ని దూమతుల్ జందల్ చుట్టు పక్కలున్న గ్రామాలకు పంపారు. అక్కడి ప్రజలు ఇంకా ఇస్లాం స్వీకరించలేదు. వారి నాయకుల్లో అసీగ్ బిన్ ఉమర్ కల్బి క్రైస్తవ మతస్థుడు. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) అక్కడకు వెళ్ళి ధర్మప్రచారం చేశారు. తత్ఫలితంగా అసీగ్ బిన్ ఉమర్ ఎంతో ప్రభావితుడయి ఇస్లాం స్వీకరించాడు. దాంతో ఆ గ్రామాల ప్రజలు కూడా అనేకమంది ఇస్లాం స్వీకరించారు.

కొన్నాళ్ళకు ఇర్నియా అనే ప్రాంతం నుండి అకల్ తెగకు చెందిన కొందరు వ్యక్తులు మదీనా వచ్చి దైవప్రవక్త (సల్లం) ముందు ఇస్లాం స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. వారి ఇస్లాం స్వీకార ప్రకటన పట్ల దైవప్రవక్త (సల్లం) సంతోషం వ్యక్తపరిచారు. వారు కొన్నాళ్ళపాటు మదీనాలోనే ఉండిపోయారు.

అయితే ఓ రోజు వారు దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి ఇలా విన్నవించుకున్నారు: "దైవప్రవక్తా! మేము ప్రధానఆహారంగా పశువులపాలు తాగి జీవించడానికి అలవాటు పడ్డాము. ఇక్కడ మదీనాలో ఉండి సత్తుపిండి, ఖర్జూరాలు తినలేక పోతున్నాం. వీటివల్ల మా ఆరోగ్యం పాడయిపోతోంది. చర్మవ్యాధులతో చాలా బాధపడుతున్నాం."

దైవప్రవక్త (సల్లం) ఈ మాటలు విని "అలాగయితే మీరు ఖుబా కొండ ప్రాంతానికి వెళ్ళండి. అక్కడి పచ్చిక బయళ్ళలో నా ఒంటెలు ఉన్నాయి. వాటి పాలు తాగుతూ జీవితం గడపండి" అని చెప్పారు.

అప్పుడు అకల్ తెగకు చెందిన ఆ మనుషులు సంబరపడిపోతూ మదీనా నుంచి ఆరేడు మైళ్ళ దూరంలో ఉన్న ఖుబా కొండ ప్రాంతానికి వెళ్ళారు. అక్కడి పచ్చిక బయళ్ళలో గుడారాలు వేసుకొని ఒంటెల పాలు తాగుతూ గడపసాగారు. కొన్నాళ్ళలోనే వారు ఒంటె పాలు తాగి బలం పుంజుకొని బాగా బలసిపోయారు.

ఇలా కష్టపడకుండా ఉచితంగా బలమైన ఆహారం లభిస్తున్నందుకు దైవానికి, దైవప్రవక్త (స)కు కృతజ్ఞులయి ఉండటానికి బదులు వారు విద్రోహ చర్యలకు పాల్పడ్డారు. ఒక రోజు వారు అవకాశం చూసి దైవప్రవక్త (స) ఒంటెలకు కాపరిగా ఉన్న యసార్ అనే వ్యక్తిని నిర్దాక్షిణ్యంగా చంపి, అతని కాళ్ళుచేతులు నరికారు. అంతటితో తృప్తిచెందకుండా అతని కళ్ళలో తుమ్మముళ్ళు గుచ్చి, కాళ్ళుచేతులులేని ఆ శవాన్ని ఓ చెట్టు

కొమ్మకు వ్రేలాడదీశారు. తరువాత అక్కడున్న ఒంటెలన్నిటినీ తోలుకుపోయారు.

మరునాడు దైవప్రవక్త (సల్లం)కు ఈ సమాచారం అందగానే ఆయన కజర్ బిన్ ఖాలిద్ (రజి) నాయకత్వంలో ఇరవై మంది రౌతులను పంపించారు. వారు శరవేగంతో వెళ్ళి దారిలోనే ఆ విద్రోహుల్ని పట్టుకున్నారు. వాళ్ళను తాళ్ళతో కట్టి మదీనాకు తీసుకొచ్చారు. దైవ ప్రవక్త (సల్లం) వాళ్ళకు మరణశిక్ష విధించారు. వెంటనే అనుచరులు దాన్ని అమలుపరిచారు.

## 32. హుదైబియా పయనం (హజ్‌యాత్ర)

మక్కా నుండి మదీనా వచ్చి ఆరేండ్లు కావస్తున్నా ముస్లింలు కాబా దర్శన భాగ్యానికి నోచుకోలేక పోయారు. కాబాలయాన్ని కళ్ళారా తిలకించి, ప్రదక్షిణ చేసి, దాని అపార శుభాలను పొందాలన్న వారి కోరిక కోరికగానే ఉండిపోయింది.

ఒకరోజు రాత్రి దైవప్రవక్త (స) మక్కా నగరంలో ప్రవేశిస్తున్నట్లు, ఆయన చుట్టూ ఆయన అనుచరులు మూగి ఉన్నట్లు కలగన్నారు. తెల్లవారుజామున నమాజ్ తరువాత ఆయన రాత్రి కన్న కలను గురించి ప్రస్తావిస్తూ "మీరు త్వరలోనే (కాబా) ప్రతిష్ఠాలయంలో ప్రవేశించబోతున్నారు. దైవచిత్తమయితే మీరు తప్పకుండా ప్రతిష్ఠాలయంలో ప్రవేశిస్తారు. ఎలాంటి భయాందోళనలు లేకుండా ప్రశాంతంగా ప్రవేశిస్తారు" అని అన్నారు.

ఈ శుభవార్త విని అనుచరులు ఆనందపరవశులయ్యారు. మక్కా ముస్లింల ప్రియ జన్మభూమి. కాని శత్రువులు వారిని అనేక హింసలు పెట్టి అక్కడ్నుంచి బలవంతంగా వెళ్ళిపోయేలా చేశారు. ధర్మంకోసం, దైవప్రీతి కోసం వారు మాతృభూమిపై ఉన్న మమతను బలవంతంగా చంపుకొని, ఆవేదనాభరిత హృదయాలతో మక్కా వదలి మదీనాకు పోవలసి వచ్చింది. ఆ బాధ వారిని అనుక్షణం వేధిస్తుండేది. పైగా ఇప్పటికీ వారిలో అనేకమంది ముహాజిర్ కుటుంబాలు, పిల్లాజెల్లా మక్కాలోనే ఉన్నారు.

అందువల్లనే దైవప్రవక్త (సల్లం) నోట ఈ శుభవార్త వెలువడగానే వారి ఆనందం అవధులు దాటింది. ముందెన్నడూ లేనంత ఉత్సాహంతో ఇండ్లకు వెళ్ళి తమ కుటుంబ సభ్యులకు, ఇతర బంధుమిత్రులకు ఈ శుభవార్త తెలియజేశారు.

అయితే మక్కాలో ప్రవేశించడం సాధ్యమేనా? కాబాలయాన్ని ఎలా సందర్శించ గల్గుతారు? అసలే ఖురైషీయులు ముస్లింల పేరు వింటేనే మండిపడ్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మక్కాలో అడుగుపెట్టేందుకు వారితో యుద్ధం చేయవలసి వస్తుందా? లేక వారే మక్కా వీడిపోతారా? పరిస్థితి అర్థంగాక ముస్లింలు తికమక పడసాగారు.

ఆ తర్వాత దైవప్రవక్త (స) కాబాయాత్ర ప్రకటన గావించారు. ప్రకటన వినగానే జనం ప్రయాణ సన్నాహాలు ప్రారంభించారు. ఈయేడు హజ్‌యాత్ర చేయవలసిఉందని దైవప్రవక్త (స) ఇతర తెగలలో కూడా ప్రకటన గావించారు. కొన్ని తెగలు దైవప్రవక్త (స) ఆదేశాన్ని శిరోధార్యంగా భావించి ప్రయాణఏర్పాట్లు చేసుకొని మదీనా చేరుకున్నారు.

అయితే కొన్ని తెగలు మాత్రం మక్కా బయలుదేరడానికి బద్ధకం చేశాయి. మరి



కొందరయితే సాకులు చూపారు. "దైవప్రవక్తా! మేము ఈయేడు అనేక సమస్యల్లో చిక్కుకొని ఉన్నాము. మోయలేని ఆపదలు వచ్చిపడ్డాయి. సంతానం, సిరిసంపదలు మా కాళ్ళకు బంధాలు వేశాయి" అంటూ రకరకాల సాకులు చెప్పారు వారు.

అంతటితో వారు మౌనంగా ఉండలేదు. "చూశారా ఈ పిచ్చివాళ్ళు ఏం చేయబోతున్నారో! మక్కా వెళ్ళి పర్వతాలను ఢీకొనబోతున్నారు, పులులతో చెలగాటమాడబోతున్నారు! అసలు అక్కడికి పోయి ఒక్కడయినా ప్రాణాలతో తిరిగివస్తాడా అని?" ఈవిధంగా వారు తమ సమావేశాల్లో ముస్లింలను హేళన చేయడం ప్రారంభించారు.

ఈ మాటలు కొందరు ముస్లిం ప్రముఖుల చెవుల్లో పడ్డాయి. హజ్రత్ ఉమర్ (రజి) వారి మాటలు విని పళ్ళు పటపట నూరారు. "దైవప్రవక్తా! ఈ దుర్మార్గుల తలల్ని నరికివేయాలి" అన్నారు ఆయన ఆవేశంతో. కాని విశ్వకారుణ్యమూర్తి (సల్లం) అందుకు ఒప్పుకోలేదు. ప్రయాణానికి సిద్ధం కమ్మని ఆయన అనుచరులను ఆదేశించారు.

ప్రయాణ సన్నాహాలు పూర్తి అయ్యాయి. దైవప్రవక్త (సల్లం) నగరంలో ఇబ్నె ఉమ్మె మఖ్తూమ్ (రజి)ను గవర్నర్‌గా నియమించి హిజ్రీశకం 6వ ఏట, జీఖాదా ఒకటో తేదీన అనుచరుల్ని తీసుకొని మదీనా నుండి బయలుదేరారు. దారిలో మరికొన్ని తెగలు వచ్చి కలిశాయి. ఆ విధంగా ఈ యాత్రికుల సంఖ్య 1400కు చేరింది. వీరంతా ఉమ్రా సంకల్పం చేసుకొని మక్కా దారిపట్టారు. దైవప్రవక్త (సల్లం) తన ఒంటె 'ఖుస్వా'పై కూర్చొని యాత్రిక బృందానికి నాయకత్వం వహించి ముందు నడుస్తున్నారు. ఆయన వెంట ఆయన సతీమణి హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) కూడా ఉన్నారు.

యాత్రికుల వెంట డెబ్బయి బలిపశువులు ఉన్నాయి. ఖడ్గాలు, ధనుర్బాణాలు తప్ప ఇతరత్రా ఆయుధాలు ఏమీ లేవు. ఖడ్గాలు కూడా వరల్లో ఉన్నాయి.

దైవప్రవక్త (స) నగరం బయటికి వచ్చి దైవాన్ని ఇలా ప్రార్థించారు: "దేవా! నీవే మా ప్రయాణ సహచరుడివి. నీవే మా భార్యాపిల్లల రక్షకుడివి. దేవా! ప్రయాణ కాఠిన్యాల బారినుండి, మేము తిరిగొచ్చి మా భార్యాపిల్లల్ని దుస్థితిలో చూడటం అనే ఆపద నుండి నేను నీ శరణు కోరుతున్నాను. దేవా! మాకోసం మా ప్రయాణాన్ని సులభతరం చెయ్యి."

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) అక్కడ్నుంచి బయలుదేరారు. అలా ప్రయాణించి ఉస్ఫాన్ అనే ప్రాంతానికి చేరుకొని ఆగిపోయారు. అనుచరులు కూడా ఆగిపోయి గుడారాలు వేసుకున్నారు. గుంజలు పాతి పశువుల్ని కట్టివేశారు. పొయ్యిలు రాజేసి అన్నం ఉడకబెట్టడం ప్రారంభించారు. కొందరు ప్రయాణ బడలికతో నడుం వాల్చారు.

అటు మక్కాలో ఖురైషీయులకు దైవప్రవక్త మక్కా వస్తున్నారని తెలిసింది. ఇంకే ముంది! వారి గుండెలు పగిలినంత పనయింది. తమతో యుద్ధాలు చేసిన ముహమ్మద్ (స) మళ్ళీ మక్కా ముఖం చూస్తారనుకోలేదు వారు. కాని ఇప్పుడెలా? వారికి సావకాశంగా ఆలోచించి తగిన పథకం రూపొందించుకునేంత వ్యవధి లేదు. అయితే సైనికుల్ని మాత్రం ఆదరాబాదరాగా సమీకరించుకున్నారు. సైన్యాధికారులుగా ఖాలిద్, ఇక్రమాలు నియమితులయ్యారు. వీరిద్దరూ మక్కా దారిలో ఓచోట ముస్లింల కోసం మాటుకాచి కూర్చున్నారు.

మక్కాలో ఖురైషీయులు ఏం సన్నాహాలు చేస్తున్నారో ఉస్ఫాన్‌లో విడిది చేసిన ముస్లింలకు తెలియదు. వారు ఉస్ఫాన్‌లో ఉండగానే దూరాన దుమ్మురేగుతూ కన్పిం చింది. ఎవరో వేగంగా ఇటువైపే వస్తున్నాడు. అతను మక్కా నుండి వస్తున్నాడు. కనుక అక్కడి వార్తలేమయినా చెబుతాడేమోనని అందరూ అతని వైపే చూడసాగారు.

కాస్సేపటికి ఆ వ్యక్తి ముస్లింల దగ్గరికి వచ్చాడు. అతను బనీఖుజాఅ తెగకు చెందిన మనిషి. పేరు బిషర్ బిన్ సుఫ్యాన్. బనీఖుజాఅ తెగ ముస్లింల మిత్రపక్షం. బిషర్ కూడా ముస్లింల సానుభూతిపరుడే. అందువల్ల అతను ఖురైషీయులను గురించి నిజమైన సమాచారమే చెబుతాడని దైవప్రవక్త (స)కు నమ్మకం ఉంది. ఆ నమ్మకంతోనే ఆయన ఖురైషీయుల విశేషాలను గురించి అడిగారు. దానికి బిషర్ ఇలా అన్నాడు:

"ఖురైషీయులకు మీరు వస్తున్న సంగతి తెలిసిపోయింది. వారు మీపై కారాలు మిరియాలు నూరుతున్నారు. ఖాలిద్ బిన్ వలీద్ ఓ పెద్ద సైనికదళం తీసుకొని, మీపై మెరుపుదాడి చేయడానికి దారిలో మాటుకాచి కూర్చున్నాడు."

అప్పుడు దైవప్రవక్త (స) తన అనుచరుల్ని ఉద్దేశించి "మిత్రులారా! ఖురైషీయులు మీతో పోరాడటానికి బయలుదేరారు. మన ప్రయాణం ఈ దారినే సాగితే మనం వారితో ఢీకొనక తప్పదు. అప్పుడు ఘోర రక్తపాతం తప్పదు. ఇది నాకిష్టం లేదు. కనుక ఈమార్గం తప్పించి వేరే మార్గాన తీసుకొని పోయేవారు ఎవరైనా ఉన్నారా మీలో?" అని అడిగారు.

"దైవప్రవక్తా! నేను తీసికెళ్తాను వేరే మార్గం గుండా" అన్నాడు ఒకతను. "అయితే నువ్వు ముందు నడు. మేము నీ వెనకాల నడుస్తాం" అన్నారు దైవప్రవక్త (స).

ఆ వ్యక్తి దైవప్రవక్త (సల్లం) ఒంటె ముకుతాడు పట్టుకొని ముందుకు దారితీశాడు. ఇది కొండలు, పెద్దపెద్ద ఇసుక తిన్నెలతో కూడిన భయంకరమైన దారి. మొత్తానికి ఎలాగో ప్రయాణం సాగించి ముస్లిములు మక్కా నుండి దాదాపు ఇరవయి మైళ్ళ దూరంలో ఉన్న 'హుదైబియా' ప్రాంతానికి చేరుకున్నారు.

హుదైబియా చేరుకోగానే దైవప్రవక్త (స) ఒంటె చతికిలబడింది. దాన్ని లేపడానికి ఎంత ప్రయత్నించినా సాధ్యపడలేదు. ఒంటె ఇలా చతికిలబడి లేవకుండా మొరాయిం చడంలో ఏదో నిగూఢ రహస్యం ఉండవచ్చని భావించారు దైవప్రవక్త (స). అందువల్ల అక్కడే గుడారాలు వేసి ఆగిపొమ్మని ఆయన అనుచరుల్ని ఆదేశించారు.

ఈ వింత చూసి అనుచరులకు అమితమైన ఆశ్చర్యం వేసింది. పైగా తాము విన్న శుభవార్తేమిటి? ఇప్పుడు దాదాపు మక్కా దరిదాపులకు వచ్చి అర్ధాంతరంగా ఇక్కడ దిగబడి పోవడమేమిటి? అన్న ఆలోచనలతో వారు నిరుత్సాహానికి గురయ్యారు.

నమాజు వేళయింది. కాని ఉజూ చేయడానికి ఆ ప్రాంతంలో నీళ్ళే లేవు. తెచ్చుకున్న నీళ్ళు అయిపోయాయి. ఇప్పుడేం చేయాలి? ఆవిషయాన్నే అనుచరులు దైవప్రవక్త (స)ని అడిగారు. దైవప్రవక్త (సల్లం) దగ్గరున్న కూజాలో కొంచెం నీళ్ళున్నాయి. అప్పుడు ఆయన ఆ కూజా మూతిపై చేతి వ్రేళ్ళు పెట్టారు. వెంటనే ఆయన వ్రేళ్ళ కొనల నుంచి నీటిధారలు పొంగివచ్చాయి. దాంతో అనుచరులు సంతోషిస్తూ తమకు కావలసినన్ని నీళ్ళు వాడుకోవ



డమేగాకుండా, తమ తోలుతిత్తుల్ని కూడా నింపుకున్నారు. ఇలా దైవప్రవక్త (స) పవిత్ర హస్తాల వ్రేళ్ళకొనల నుండి పొంగివచ్చిన నీటితో పధ్నాలుగు వందలమంది అనుచరులు ప్రయోజనం పొందారు. ఒంటెలు, మేకలు కూడా ఆ నీటిని తనివితీరా త్రాగాయి.

కొన్నాళ్ళకు తోలుతిత్తుల్లోని నీళ్ళు కూడా అయిపోయి తిరిగి నీటికొరత ఏర్పడింది. అప్పుడు అనుచరులు మళ్ళీ దైవప్రవక్త (స) దృష్టికి ఈ సమస్య తీసికెళ్ళారు. ఆ ప్రదేశంలో హుదైబియా పేరుతో ఒక బావి ఉంది. కాని అందులో నీరు మాత్రం లేదు. అప్పుడు దైవ ప్రవక్త (స) ఆ బావి దగ్గరికెళ్ళారు. ఆయన తన అంబులపొది నుండి ఒక బాణం తీసి, దాన్ని బావిలో పడవేయమని చెప్పి హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి)కు అందజేశారు. బరా బిన్ ఆజిబ్ (రజి) ఆ బాణం తీసుకొనిపోయి బావిలో పడవేశారు. దాంతో బావిలో ఒక్క సారిగా నీటి ఊట ఉబికింది. చూస్తుండగానే ఆ నీటి ఊట ఉప్పొంగి కొన్ని క్షణాల్లోనే బావి నీళ్ళతో నిండిపోయింది. ముస్లింలు పరమ సంతోషంతో ఆ నీటిని తనివితీరా త్రాగి స్నానాదులు ముగించుకున్నారు.

## 33. అవిశ్వాసుల (హజ్) ఆటంకాలు

మక్కాలో ఖురైషీయులు ఖాలిద్ రాక కోసం తీవ్రంగా ఎదురుచూస్తున్నారు. ఖాలిద్ విజయవంతంగా తిరిగొస్తేనే తమకు అరేబియాలో గౌరవం దక్కుతుందని, లేకపోతే ఇక తాము శాశ్వతంగా అవమానభారంతో క్రుంగిపోక తప్పదని వారు భావించసాగారు.

ఖాలిద్ రానేవచ్చాడు. అతను ఏం కబురు విన్పిస్తాడోనని ఖురైషీయులు ఊపిరి బిగబట్టి కూర్చున్నారు. "మన పథకం తారుమారైంది. ముహమ్మద్, ఆయన అనుచరులు వేరే దారి గుండా హుదైబియాకు వచ్చి విడిదిచేశారు" అన్నాడు ఖాలిద్ రాగానే.

"ఏమిటీ! ముహమ్మద్ హుదైబియాకు వచ్చేశాడా!!" నాయకులంతా దిగ్భ్రాంతి చెందారు. క్షణంపాటు నిశ్శబ్దం రాజ్యమేలింది. "అయితే ఇప్పుడేం చేద్దాం?"

"పదండి, దారున్నద్వాలో సమావేశమయి ఆలోచిద్దాం." ఖురైష్ నాయకులంతా దారున్నద్వాలో సమావేశమయ్యారు. అందరి ముఖాలు మాడిపోయి ఉన్నాయి. ఏం చెయ్యాలో ఎవరికీ పాలుపోవడం లేదు.

కొంపదీసి ముస్లింలు మక్కాలోకి చొచ్చుకు వస్తే...? అమ్మ బాబోయ్! ఇంకేమైనా ఉందా!! ఉన్న పలుకుబడి కాస్తా మంటకలిసిపోదూ? సంఘంలో తలెత్తుకొని తిరగ్గలరా?

"కాదు, మనం ఏదో ఒకటి చేసి సంఘంలో గౌరవం దక్కించుకోవాలి" ఖురైషీయుల పౌరుషం పడగలు విప్పింది. "మన బొందిలో ప్రాణం ఉన్నంత వరకు ముహమ్మద్ మక్కాలో అడుగు పెట్టడం అసంభవం" ఆవేశం బుసలు కొట్టింది.

"కాని ఇక్కడ మక్కాలో కూడా ముహమ్మద్ అనుచరులున్నారు పక్కలో బల్లెంలా. ముస్లింలతో పేచీ పెట్టుకుంటే మనకు సర్వనాశనం తప్పదేమో!" వారిలో ఒకని సందేహం.

"ముహమ్మద్ మనతో యుద్ధం చేయడానికి రాలేదంటున్నారు కదా! అలాంటప్పుడు ఆయన మనకు హాని తలపెట్టే అవకాశం లేదు. ఒకవేళ అతను మనసు మార్చుకొని

మనతో కయ్యానికి దిగుతాడే అనుకుందాం. అప్పుడు మనం వెన్నుజూపి పారిపోయే టంతటి పిరికిపందలమా? వాళ్ళను చీల్చిచెండాడమూ??" అన్నాడు మరొకడు.

"ఇంతకూ అసలు ఏం చేద్దామంటారు?" అడిగాడు అగ్రనాయకుడు అబూసుఫ్యాన్.

"బనీఖుజాఅ తెగ మనుషులు కొందరిని పంపుదాం. వారెళ్ళి ముహమ్మద్ కోరుతున్న దేమిటో తెలుసుకొని వస్తారు. దాన్ని బట్టి మనం నిర్ణయం తీసుకోవచ్చు."

"కాని ఖుజాఅ తెగవాళ్ళు ముహమ్మద్ అనుకూలురు, ముస్లింల శ్రేయోభిలాషులు. అలాంటివారి వల్ల ప్రయోజనం కంటే ప్రమాదమే ఎక్కువ" అన్నాడు అబూసుఫ్యాన్.

"నువ్వేమీ భయపడకు. వాళ్ళ జుట్టు మనచేతిలో ఉంది. మక్కాలోనే వారి పొలాలు, తోటలున్నాయి. వారి భార్యాపిల్లలు కూడా ఇక్కడే ఉన్నారు. ద్రోహం చేస్తే మన పట్టునుండి తప్పించుకొని పారిపోలేరు" అన్నాడు ఓ తలపండిన నాయకుడు.

ఈ ప్రతిపాదన అందరికీ నచ్చింది. ముస్లింల దగ్గరికి రాయబారం పంపవలసిన ప్రతినిధుల్ని కూడా ఎన్నుకోవడం జరిగింది.

ప్రతినిధి వర్గం దైవప్రవక్త (సల్లం) సన్నిధికి పోయింది. దైవప్రవక్త (సల్లం) ప్రతినిధి వర్గానికి ఘనంగా స్వాగతమిచ్చి ఆదరించారు. ప్రతినిధివర్గం నాయకుడు బుదైల్ బిన్ వరఖా తన రాకకు కారణం చెప్పాడు.

"బుదైల్! మీరు ఖురైషీయుల దగ్గరికెళ్ళి, ముస్లింలు కాబా దర్శనం కోసం వచ్చారని, వారి హృదయాల్లో కాబా పట్ల గౌరవభావం ఉందని చెప్పండి. వారు ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడకుండా ఉంటే మేము ప్రశాంతంగా కాబా దర్శనం చేసుకొని వెళ్ళిపోతాం" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ప్రతినిధి వర్గం మక్కా తిరిగొచ్చింది. బుదైల్ విషయాన్ని ఖురైషీయులకు వివరిస్తూ కాబాదర్శనం కోసం వస్తున్న ఈ యాత్రికుల్ని అడ్డుకోవడం భావ్యం కాదని సలహా ఇచ్చాడు. ఈమాట విని ఖురైషీయుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

"ముహమ్మద్‌తో సంధి చేసుకోవాలి. ముస్లింలకు కాబాదర్శనం చేసుకోవడానికి అనుమతివ్వాలి" అన్నారు కొందరు. "వీల్లేదు. ముహమ్మద్ మక్కాలో అడుగు పెట్టడానికి వీల్లేదు" అన్నారు చాలామంది. "నిజమే. ముహమ్మద్ మన భూభాగంపై అడుగుపెడితే మన పరువు కాస్తా పోతుంది" అన్నాడు అబూసుఫ్యాన్. "అయితే మరేం చేద్దాం?" అడిగారు కొందరు.

"హులైస్ బిన్ అల్ఖమాను పంపిద్దాం. అతని నాయకత్వంలోని అహాబీష్ తెగకున్న శౌర్యపరాక్రమాలు అందరికీ తెలుసు. అతని ద్వారా మన పని నెరవేరి, ముహమ్మద్ మదీనా తిరిగి వెళ్ళిపోతే మనకు శాంతి లభిస్తుంది. ఒకవేళ ముహమ్మద్ అతని ప్రతిపాదనను తిరస్కరిస్తే అతనికి ఆవేశం వస్తుంది. అప్పుడతను మనతో కలసి పోరాడు తాడు" అన్నాడు అబూసుఫ్యాన్.

అప్పుడు ఖురైషీయులు హులైస్‌ని రాయబారిగా చేసి పంపించారు. దైవప్రవక్త



(స) దూరాన్నుంచే హులైస్ రాకను గమనించి అనుచరులతో ఇలా అన్నారు:

"అదిగో హులైస్ వస్తున్నాడు. అతని తెగవాళ్ళు భయంకరమైన యోధులు. ఖుర్బానీ పశువుల్ని అతని ముందుకు తోలండి. వాటిని చూసి, మనం కాబాదర్శనం కోసం మాత్రమే వచ్చామని, వినాశం కోసం రాలేదని తెలుసుకుంటాడు."

ప్రియతమ నాయకుడి ఆదేశం ప్రకారం ముస్లింలు "లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్" అంటూ బలిపశువుల్ని హులైస్ ముందుకు తోలారు.

హులైస్ ఈ దృశ్యం చూశాడు. ఖుర్బానీ కోసం సాంప్రదాయకంగా తీర్చిదిద్దిన పశువుల గుంపు చూసి అతని కళ్ళు చెమర్చాయి. ఖురైషీయులు నిజంగానే ముస్లింలపై అన్యాయానికి పాల్పడుతున్నారని గ్రహించాడు. అందువల్ల అతను దైవప్రవక్త (స)ను కలుసుకోకుండానే మక్కా వెళ్ళిపోయాడు.

హులైస్ విజయవంతంగా తిరిగొస్తాడని, తమ గుండెల్లో మండుతున్న ప్రతీకార జ్వాలల్ని చల్లార్చే శుభవార్త మోసుకొస్తాడని ఖురైష్ నాయకులు తెగ సంబరపడిపోతూ అతని రాక కోసం వేయి కళ్ళతో ఎదురుచూడసాగారు. కాస్సేపటికి హులైస్ గంభీర వదనంతో వచ్చాడు. రాగానే ఖురైషీయుల ఆశలను వమ్ముచేస్తూ, వారి గుండెలకు తూట్లు వేస్తూ ఇలా అన్నాడు:

"దైవగృహాన్ని దర్శించుకోవడానికి వస్తున్న ఈభక్తుడ్ని మీరు అడ్డగింపజూస్తున్నారా? దైవసాక్షి! ఇలాంటి విషయంపై మేము మీతో ఒప్పందం చేసుకోలేదు. అరబ్ తెగలన్నీ కాబాదర్శనం చేసుకోవచ్చుగాని, ఒక్క అబ్దుల్ ముత్తలిబ్ కొడుకే ఈ భాగ్యానికి నోచుకో లేడా? వంశప్రతిష్ఠ దృష్ట్యా చూసినా అతను మీకేమీ తీసిపోడే! ఒకవేళ మీరే గనక ముహమ్మద్‌ను కాబా సందర్శించనీయకపోతే నా అధీనంలో ఉన్న తెగలన్నిటినీ తీసుకొని మీనుంచి వేరైపోతాను. అంతేకాదు, ముహమ్మద్ పక్షాన ఉండి మీ అంతుచూస్తాను."

సింహగర్జనల్లాంటి హులైస్ మాటలు వినగానే ఖురైష్‌నాయకుల ముఖాన కత్తివాటుకు నెత్తుటి చుక్క లేదు. అందరూ నిర్ఘాంతపోయి ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. పక్కకు పోయి కూడాబలుక్కున్నారు.

"వీడేదో పిడుగులా ఉన్నాడు. ఘనకార్యం వెలగబెట్టి వస్తాడనుకుంటే చివరికి మన పాలిటే తలకొరివిలా తయారయ్యాడే! మనకు సహాయం చేయకపోతే పోనీ, కనీసం వీణ్ణి వదిలించుకోనయినా వదిలించుకుందాం" అనుకున్నారు వారు.

"చూడు తమ్ముడూ! ఇది మా సొంత వ్యవహారం. దీన్ని మాకే వదిలెయ్. అందరికీ ఆమోదయోగ్యమైన విషయమేదో మేము చూసుకుంటాం" అంటూ వారు హులైస్ కోపాన్ని చల్లార్చారు. ఖురైషీయుల మాటలకు హులైస్ మెత్తబడ్డాడు. వారి వ్యవహారంలో తాను జోక్యం చేసుకోనని చెప్పి అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

ఖురైషీయులు ఒకరికి కీడు తలపెట్టడానికి ప్రయత్నించి తామే కీడు కొనితెచ్చు కున్నారు. అయితే అది క్రియారూపం దాల్చి కాటేయకముందే దాన్ని చాకచక్యంగా

వదలించుకొని 'హమ్మయ్య' అంటూ చల్లగా ఊపిరి పీల్చుకున్నారు.

ఖురైషీయులు ఈసారి ఉర్వా బిన్ మస్‌వూద్‌ని వాడుకోదలిచారు. ముస్లింల దగ్గరికి పోయిన ప్రతిరాయబారీ ఉత్తచేతులతో తిరిగిరావడం చూసి ఉర్వా మొదట ఖురైషీయుల మాటల్ని త్రోసిపుచ్చాడు. కాని ఖురైషీయులు జిడ్డులా పట్టుకొని వదలిపెట్టక పోవడంతో చివరికి ఒప్పుకున్నాడు. ఉర్వా దైవప్రవక్త (స) దగ్గరికి పోయి ఇలా అన్నాడు:

"ముహమ్మద్! మీరు యుద్ధసన్నాహాలతో మీ స్వస్థలం మక్కాను జయించడానికి వచ్చారా? కాని అక్కడ ఖురైషీయులు మిమ్మల్ని మట్టుపెట్టేందుకు కాచుకొని ఉన్నారు. వారు మిమ్మల్ని ఎలాంటి పరిస్థితిలో కూడా మక్కాలో అడుగు పెట్టనీయమని ప్రతిన బూనారు. వారు తలచుకుంటే మీరు కట్టుకున్న ఆశాసౌధాలన్నీ ఒక్క దెబ్బతో కూలిపోతాయి. కాస్త మీరే ఆలోచించుకోండి."

ఈ మాటల్ని హజ్రత్ అబూబకర్ (రజి) సహించలేకపోయారు. "ఇక చాలించు నీ మాటలు. దైవం నీ ముఖం మాడ్చ! మేము మా ప్రియతమ నాయకుడ్ని అంత సులభంగా వదలుకుంటా మనుకుంటున్నావా?" అన్నారు ఆయన.

"ఎవరితను?" అడిగాడు ఉర్వా. "ఇతను ఖహాఫా కొడుకు అబూబకర్" సమాధాన మిచ్చారు దైవప్రవక్త (స). "ఇతను గతంలో నాకో మేలు చేసివున్నాడు. ఆ రుణాన్ని నేనింతవరకు తీర్చలేదు. అదే గనక లేకపోయి ఉంటే ఇతని నోటి దురుసుకు తక్షణమే సమాధానం ఇచ్చేవాడ్ని" అన్నాడు ఉర్వా బిన్ మస్‌వూద్.

ఆ తరువాత ఉర్వా దైవప్రవక్త (సల్లం)తో తన సంభాషణ కొనసాగించాడు. అతను చేతులు తిప్పి తిప్పి మాట్లాడుతూ ఆ చేతుల్ని మాటిమాటికి దైవప్రవక్త (స) నోటి దగ్గరికి పోనిస్తున్నాడు. దైవప్రవక్త (స) వెనుక ఖడ్గం తీసుకొని ఆయనకు ప్రత్యేక అంగరక్షకుడిగా నిలబడి ఉన్న హజ్రత్ ముగీరా (రజి) దాన్ని సహించలేక పోయారు.

ఆయన కత్తి దూసి చూపిస్తూ "జాగ్రత్త! నీ చేతుల్ని మరోసారి దైవప్రవక్త (స) నోటి దగ్గరికి పోనిచ్చావో.... అవి మళ్ళీ తిరిగిరావు" అన్నారు ఉరిమి చూస్తూ.

ముహమ్మద్ (స) పట్ల ఆయన అనుచరులకున్న అచంచల విశ్వాసం, అపార ప్రేమాభిమానాలు చూసి ఉర్వా ఆశ్చర్యపోయాడు. ముస్లింలు యుద్ధం చేయడానికి రాలేదని, రక్తపాతం వారి ఉద్దేశ్యం కాదని, కాబాదర్శనం కోసమే వచ్చారని గ్రహించాడు. అంచేత అతను ఖురైషీయుల గురించి ఇక పొగడటం మానేసి మక్కా తిరిగొచ్చాడు.

ఉర్వా దూరాన ఉండగానే అతని వాలకం చూసి ఖురైష్ నాయకులకు అనుమానం వచ్చింది. అందువల్ల అతను దగ్గరికి రాగానే వారు ఉత్సాహం చూపలేకపోయారు.

"మిత్రులారా! నేను కిస్రా (ఈరాన్) దర్బార్‌నీ చూశాను, ఖైసర్ (రోమ్) ఆస్థానం చూశాను. నజాషీ (అబిసీనియా) కొలువుని కూడా చూశాను. కాని దైవసాక్షి! ముహమ్మద్ పట్ల ఆయన అనుచరుల్లో ఉన్న గౌరవ విశ్వాసాలను నేను ఏ చక్రవర్తి అనుచరుల్లోనూ ఇంతవరకు చూడలేదు. ముహమ్మద్ ఉజూ చేస్తుంటే ఆయన అనుచరులు ఆ ఉజూ నీటిని కూడా కింద పడనీకుండా పట్టుకొని ఎంతో పవిత్రంగా వాడుకుంటున్నారు. చివరికి



ముహమ్మద్ తల నుండి ఓ వెంట్రుక ఊడినా దాన్ని వారు కళ్ళకద్దుకొని భద్రపరచు కుంటున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఎలాంటి కిష్టపరిస్థితులు ఎదురైనా సరే వారు తమ నాయకుడ్ని వదలుకోవడానికి ఏమాత్రం సిద్ధంగా లేరు. దీన్నిబట్టి మీరే ఆలోచించు కోండి" అన్నాడు ఉర్వా బిన్ మస్‌వూద్.

కాని ఇంత చెప్పినా ఖురైష్ నాయకులకు తలకెక్కలేదు. ఏమైనా సరే ముస్లింలను మక్కాలో ప్రవేశించనీయకూడదని గట్టిగా నిర్ణయించుకున్నారు వారు.

ఆ తరువాత వారు యాభై మంది ఆరితేరిన విలుకాండ్రను ఎన్నుకున్నారు. రాత్రివేళ పోయి ముహమ్మద్ (స)పై ఆకస్మిక దాడి చెయ్యమని చెప్పి వారిని పంపించారు.

ఈ యాభైమంది రాత్రివేళలో హుదైబియా చేరుకున్నారు. కాని పథకం తల్లక్రిందు లయింది. పాపం వారు ముస్లిం శిబిరాలపై నాలుగైదు బాణాలు వదిలారో లేదో తక్షణమే ముస్లింలు మేల్కొని వారిని బందీలుగా పట్టుకొని దైవప్రవక్త (స) ముందు ప్రవేశపెట్టారు.

దైవప్రవక్త (స)పై దాడి చెయ్యడానికి వచ్చిన ఈ గెరిల్లా వీరులు చివరికి గొర్రెల్లా దైవప్రవక్త (స) సమక్షంలో తలలొంచి నిలబడవలసి వచ్చింది. ప్రవక్త అనుచరులు వారి వైపు ఉరిమిచూస్తున్నారు. బందీలు ఇక తమకు చావు తప్పదని తలచి వణికిపోతున్నారు.

"ఇంత ద్రోహానికి పాల్పడిన మీకు నేను ప్రాణభిక్ష ఎలా పెట్టాలి?" దైవప్రవక్త (స) వారి కళ్ళలో సూటిగా చూస్తూ అడిగారు.

"అయ్యా! మా బుద్ధి గడ్డి తిన్నది. మమ్మల్ని కనికరించండి. మీరు ఎంతో దయార్ద్ర హృదయులు. మీ క్షమాగుణంపై మాకు నమ్మకం ఉంది. దయచేసి మమ్మల్ని నిరాశ పరచకండి" అని పరిపరి విధాల వేడుకున్నారు శత్రుసైనికులు.

"సరే వెళ్ళండి, మిమ్మల్ని క్షమిస్తున్నాను. ముహమ్మద్ ఇక్కడికి రక్తపాతం జరపడానికి రాలేదని మీ జాతివాళ్ళకు చెప్పండి ఇప్పుడయినా వారికి స్పృహ వస్తుందేమో" అన్నారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)

శత్రుసైనికులు బ్రతుకు జీవుడా అంటూ ముస్లింల పట్టు నుండి బయటపడ్డారు. అయితే ఇంతటి ఘోరమైన నేరాన్ని సైతం ముహమ్మద్ (స) క్షమించినందుకు వారు చాలా ఆశ్చర్యపోయారు. ఏమైనా ఇక తమ జాతికి కీడు తప్పదనుకున్నారు. కాస్త అవమానం జరిగినా కనీసం ప్రాణాలైనా దక్కాయని సంతోషిస్తూ వారు మక్కా దారిపట్టారు.

ఇలా కవ్వించి కయ్యం పెట్టుకోవాలన్న ఖురైషీయుల ఎత్తుగడ నీరుగారిపోయింది.

# 34. ముస్లింల రిజ్వాన్ శపథం

దైవప్రవక్త (సల్లం) తాము కాబాదర్శనం నిమిత్తమే వచ్చామని ఖురైషీయులకు తెలియజేయడానికి రాయబారిగా హజ్రత్ ఖరాష్ బిన్ ఉమయ్యా (రజి)ని పంపారు.

హజ్రత్ ఖరాష్ (రజి) ఒంటె ఎక్కి మక్కా బయలుదేరారు. ఆయన నేరుగా అబూ సుఫ్యాన్ ఇంటికి వెళ్ళారు. ఆ సమయంలో అబూసుఫ్యాన్ ఇంటి ఆవరణలో కూర్చొని

ఉన్నాడు. ఆయనతో పాటు ఇక్రమా బిన్ అబూజహల్, ఖాలిద్ బిన్ వలీద్, అమ్ర్ బిన్ ఆస్ వగైరా ప్రముఖులు కూడా ఉన్నారు. వారిలో ముస్లింల దగ్గరికి రాయబారిగా వెళ్ళి వచ్చిన హులైస్ బిన్ అల్ఖమా కూడా ఉన్నాడు.

"ఖురైషీయులారా! నేను దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ప్రత్యేక దూతను. మేము మీతో యుద్ధం చేయడానికి రాలేదని, కాబాదర్శనం కోసమే వచ్చామని తెలియజేయడానికి నేను మీ దగ్గరికి వచ్చాను. అందువల్ల మీరు మమ్మల్ని కాబా దర్శనం చేసుకోనివ్వండి. మమ్మల్ని నిరోధించకండి" అన్నారు హజ్రత్ ఖరాష్ (రజి).

"ఒకవేళ మేము మిమ్మల్ని కాబా దర్శనం చేసుకోనివ్వకుండా నిరోధిస్తే...?" అన్నాడు ఇక్రమా బిన్ అబూజహల్.

"అప్పుడు మేము యుద్ధం చేస్తాం. మిమ్మల్నందర్నీ హతమార్చి కాబాదర్శనం చేసుకుంటాం" అన్నారు హజ్రత్ ఖరాష్ (రజి) ఎలాంటి జంకూ గొంకూ లేకుండా.

"ఓహో! నువ్వు మమ్మల్ని బెదిరించడానికి వచ్చావన్న మాట!! కాని నీ చావుబ్రతుకులు మా చేతిలో ఉన్న సంగతి మరచిపోతున్నావు సుమా!" అన్నాడు ఇక్రమా.

"పొరపడుతున్నావు ఇక్రమా! ప్రతి ఒక్కడి చావుబ్రతుకులు సకల సృష్టికర్త, సర్వలోక ప్రభువయిన అల్లాహ్ చేతిలో ఉన్నాయి. ఆయన ఆజ్ఞ లేనిదే నువ్వేమీ చెయ్యలేవు."

అల్లాహ్ పేరు వినగానే అవిశ్వాసులు మండిపడ్డారు. వెంటనే వారిలో కొందరు లేచి ఖరాష్ (రజి) ఒంటెను చంపేసి, ఆయన మీదికి లంఘించారు.

హజ్రత్ ఖరాష్ (రజి) ఆగ్రహోదగ్రులయి చర్రున కత్తి దూసి వారిముందు నిలబడ్డారు. "నీచులారా! మీరు చర్చలకు వచ్చిన రాయబారినే చంపడానికి సిద్ధమయ్యారా!! మీలో ఆత్మాభిమానం మచ్చుకైనా లేదా? మీరంతగా యుద్ధజ్వాలల కోసం వెంపర్లాడుతుంటే, రండి మాతో పోరాడండి. కాని ఒక విషయం గుర్తుంచుకోండి. నేను ఏ ప్రజల వైపున రాయబారిగా వచ్చానో, వారు మీపై విరుచుకుపడి మిమ్మల్ని పూర్తిగా మట్టుపెడ్తారు. నా చావు మీ అందరిపాలిట మరణమృదంగం అవుతుంది" అన్నారు ఆయన.

వరలేని ఖడ్గం చేతిలో పట్టుకొని కళ్ళలో నిప్పులు కురిపిస్తున్న ఖరాష్ (రజి)ని చూసి సత్యతిరస్కారులు వెనుకంజ వేశారు. హులైస్‌కు కూడా ఖురైషీయుల వైఖరి నచ్చలేదు. "ఖురైషీయులారా! ఏమిటి ఈ అన్యాయం? ఎంతటి పిరికిపంద జాతి కూడా రాయబారిని వధించదు. మీరితడ్ని చంపితే మీ జాతిమీద మాయనిమచ్చ ఏర్పడుతుంది. మీకు ధైర్యముంటే బయటికెళ్ళి ముస్లింలతో పోరాడండి" అన్నాడతను.

"నిజమే. రాయబారిగా వచ్చిన మనిషిని చంపితే మన జాతికి పెద్ద కళంకం వస్తుంది. ఖరాష్! నీవు వెళ్ళిపోయి, మేము ముస్లింలను ఎట్టి పరిస్థితిలోనూ మక్కాలో ప్రవేశించనీయం అని మీ ప్రవక్తకు చెప్పెయ్యి" అన్నాడు ఇక్రమా.

అప్పుడు హజ్రత్ ఖరాష్ (రజి) ఖడ్గం వరలో పెట్టేసి వెళ్ళిపోయారు. ఆయన కాలినడకన హుదైబియా చేరుకొని దైవప్రవక్త (సల్లం)కు విషయం తెలియజేశారు.



ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) తన అనుచరుల్ని సంప్రదించారు. ఖురైషీయులతో చర్చలు జరిపి తగిన పరిష్కారం తెచ్చే సమర్థుడైన ప్రతినిధిని పంపదలచుకున్నారు. ఈ పని కోసం ఆయన హజ్రత్ ఉస్మాన్ (రజి)ని ఎంపిక చేసి పంపించారు.

మక్కాలో ఉస్మాన్ (రజి) సోదరుడు ఒకాయన ఉన్నాడు. అతని మద్దతుతో ఉస్మాన్ (రజి) మక్కా వెళ్ళారు. అక్కడ ఖురైష్ నాయకుల్ని కలుసుకొని వచ్చిన పని వివరించారు.

"మేము మీ ముందు రెండేరెండు విషయాలు ఉంచుతున్నాం. మమ్మల్ని కాబా ప్రదక్షిణ చేసుకోనివ్వండి. దానికి మీరు ఒప్పుకోకపోతే యుద్ధానికి సిద్ధంగా ఉండండి."

ఖురైషీయులు ఈమాట విని "అలా కుదరదు. కావాలంటే నువ్వొక్కడివే కాబా ప్రదక్షిణ చేసుకో. అంతేగాని ఇతరుల ప్రస్తావన ఎత్తకు. వారు అటు నుంచి అటే వెళ్ళిపోవాలి" అన్నారు.

ఈ మాటలు వినగానే హజ్రత్ ఉస్మాన్ (రజి)కు వళ్ళు మండిపోయింది. "ఏమిటీ? ముస్లింలు కాబాదర్శనానికి నోచుకోకుండా వెళ్ళిపోవాలా, నేనొక్కడ్ని మాత్రం కాబాప్రదక్షిణ చేసుకోవచ్చా? కాదు, ముస్లింలందరికీ కాబాప్రదక్షిణ చేసుకునే అవకాశం ఇవ్వాల్సిందే" అన్నారు హజ్రత్ ఉస్మాన్ (రజి) పట్టుదలతో.

ఖురైషీయులు అందుకు ససేమిరా ఒప్పుకోలేదు. హజ్రత్ ఉస్మాన్ (రజి) కూడా పట్టు విడవకుండా కాబాదర్శనం చేసుకునే అవకాశాన్ని ముస్లింలందరికీ ఇవ్వాలని అన్నారు. ఇలా చర్చలు ఎటూ తెగకుండా కొన్నాళ్ళు కొనసాయాయి.

చర్చలు ఇంకా ఓకొలిక్కి రాలేదు. అదీగాక ఖురైషీయులు ఉస్మాన్ (రజి)ని మక్కా నుండి వెళ్ళనివ్వకుండా ఆపి ఉంచారు. ఈలోగా ఉస్మాన్ (రజి)ని హత్యచేశారని పుకారు పుట్టింది. ఆయన తిరిగి రాకపోవడంతో ముస్లింలు ఈ వార్త నిజమే ననుకున్నారు.

ఇంకేముంది! ముస్లింలలో పెద్ద కలకలం చెలరేగింది. వారు ఆగ్రహోదగ్రులయిపోయారు. అందరిలోనూ పౌరుషం పడగ విప్పింది. "ఎంత ద్రోహానికి వడిగట్టారు వీరు! పైగా పవిత్రమాసంలో ఈ ఘాతుకచర్య!! వీరికి పవిత్రమాసం పట్లగాని, యాత్రికుల పట్లగాని ఏమాత్రం గౌరవం లేదు" అన్నారు దైవప్రవక్త (స) ఈమాట విని.

రాజనీతి ఉల్లంఘించి దౌత్యవేత్తను చంపడమంటే స్పష్టంగా యుద్ధ ప్రకటన చేయడమే. అంచేత వెంటనే దైవప్రవక్త (స) ప్రధాన అనుయాయుల్ని సమావేశపరిచారు.

"ఖురైషీయుల నుండి ఉస్మాన్ (రజి) హత్యకు ప్రతీకారం తీర్చుకోవడం మన విధి. ప్రతీకారం తీర్చుకోకుండా మనం ఇక్కడ్నుంచి ఒక్క అడుగ్గూడా వెనక్కి మరలకూడదు" అన్నారు దైవప్రవక్త (సల్లం). ఈ మాట చెప్పి ఆయన ఓ తుమ్మచెట్టు క్రిందకు పోయి కూర్చున్నారు. అనుచరులు కూడా అక్కడికెళ్ళి తమ ప్రియతమ నాయకుని చుట్టూ గుమికూడారు.

ఓ మహోన్నత కార్యం కోసం వారు కంకణం కట్టుకున్నారు. దైవప్రీతి కోసం. ధర్మ రక్షణ కోసం ఓ మహోద్యమానికి సిద్ధమయ్యారు. దైవప్రవక్త (స)కు పూర్తిగా విధేయులయి ధర్మపరిరక్షణ కోసం ముస్లింలు తమ సర్వస్వం త్యాగం చెయ్యడానికి ముందుకొచ్చారు.

దైవప్రవక్త (సల్లం) చేయి జాపారు. అనుచరులు ఒక్కొక్కరే ముందుకొచ్చి ఆయన చేతిలో చేయి వేసి, శపథం చేశారు. ఘోరమైన శపథం! ఇక విజయమో, వీరమరణమో తేల్చుకోవడమే తరువాయి పని!!

## 35. హుదైబియా శాంతి ఒప్పందం

మక్కాలో ఖురైష్ నాయకులు మరోసారి సమావేశమయి ఓ నిర్ణయానికి వచ్చారు. "ఈసారి సుహైల్ బిన్ అమ్రని పంపుదాం. అతను ముహమ్మద్ దగ్గరకు వెళ్ళి ఈ సంవత్సరం ముహమ్మద్, ఆయన అనుచరులు వెళ్ళిపోయి వచ్చేయేడు ఉమ్రా చెయ్యమని అయనకు నచ్చజెపుతాడు" అన్నారు ఖురైష్ నాయకులు.

ఈ విధంగా చేస్తే తమ గౌరవప్రతిష్ఠలకు భంగంరాదని వారి ఉద్దేశ్యం.

ఆ తరువాత వారు హజ్రత్ ఉస్మాన్ (రజి)ని పంపివేశారు. ఆయన హుదైబియాకు తిరిగివచ్చారు. ఆయన్ని చూడగానే ముస్లింలంతా తాము విన్న వార్త నిజం కాదని గ్రహించి చల్లగా ఊపిరి పీల్చుకున్నారు. అంతలో ఖురైషీయుల దౌత్యవేత్తగా సుహైల్ బిన్ అమ్ర్ కూడా అక్కడికి చేరుకున్నాడు.

కాని ఇక్కడ చూస్తే ముస్లింలు పెద్దఎత్తున యుద్ధ సన్నాహాలు చేయడంలో నిమగ్నులై ఉన్నారు. వారి యుద్ధ సన్నాహాలు చూసి సుహైల్ భయపడ్డాడు. ఎలాగైనా ఈ యుద్ధాన్ని నిలుపుదల చేయించాలని తలచి దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళాడు.

"మహాశయా! నేను మీ దగ్గరకు చర్చలు జరపడానికి వచ్చాను. కాని ఇక్కడ చూస్తే మీ అనుచరులు యుద్ధసన్నాహాలు చేస్తున్నట్లు కన్పిస్తున్నారు. అక్కడేమో ఖురైషీయులు ఈ యేడు మిమ్మల్ని మక్కాలో ప్రవేశించనీయమని ప్రతిన బూనారు. నేను కొన్ని షరతులు తీసుకొచ్చాను. వీటిలో మన ఉభయపక్షాల శ్రేయస్సు ఉంది. వీటిని మీరు ఒప్పుకుంటే ఓ భయంకర యుద్ధాన్ని నివారించినవారవుతారు. అనేకమంది ప్రాణాలు దక్కుతాయి. అంతటి మహత్కార్యం సాధించిన ఘనత కూడా మీకు లభిస్తుంది" అన్నాడు సుహైల్.

"సరే, చెప్పండి. ఏమిటా షరతులు?" అడిగారు దైవప్రవక్త (సల్లం).

"❶ ఈ ఏడు ముస్లింలు మదీనా తిరిగివెళ్ళిపోయి వచ్చే ఏడు రావాలి. అయితే అప్పుడు మీరు మక్కాలో మూడ్రోజులు మాత్రమే ఉండాలి. వెంట ఒక్కొక్క ఖడ్గమే వరలో పెట్టుకొని తెచ్చుకోవాలి. ఇతర ఆయుధాలేమీ ఉండకూడదు" అన్నాడు సుహైల్.

"ఊ... ఇంకా?"

"❷ మన ఉభయ పక్షాల మధ్య పదేళ్ళ వరకు యుద్ధంగాని, ఒకరికి వ్యతిరేకంగా మరొకరు ఎలాంటి చర్యా తీసుకోవడంగాని జరగరాదు."

"ఊ.... ఇంకేమయినా ఉన్నాయా?"

"❸ ఈ పదేళ్ళ కాలంలో ఖురైషీయులకు చెందిన ఏ మనిషి అయినా అతని



సంరక్షకుని అనుమతి లేకుండా మీ దగ్గరకు పారిపోయి వస్తే అతడ్ని మా దగ్గరికి తిప్పి పంపాలి. అయితే ముస్లింలలో ఎవరైనా మదీనా నుండి మక్కా వస్తే మటుకు మేమతడ్ని మీ దగ్గరికి తిప్పి పంపడం జరగదు."

దైవప్రవక్త (సల్లం) క్షణంపాటు కళ్ళు మూసుకొని మౌనంగా ఉండిపోయారు. దైవ సందేశం అవతరించే సమయంలో ఆయన పరిస్థితి ఇలాగే మారుతుంది.

ఆయన అనుచరులు మాత్రం క్రూరమైన ఈ షరతులు విని ఆగ్రహంతో ఉడికిపోసాగారు. అయితే దైవప్రవక్త (స)ను చూసి ఆవేశాన్ని బలవంతంగా అణచుకున్నారు. దైవప్రవక్త (సల్లం) కళ్ళు తెరచి "సరే, చెప్పండి ఇంకా" అన్నారు.

"❹ ఈ పదేళ్ళ కాలంలో ఏ అరబ్బు తెగయినా తన ఇష్టమొచ్చిన పక్షంతో ఒప్పందం చేసుకోవచ్చు...ఇవీ ఖురైషీయుల షరతులు. ఇక మీరే ఆలోచించి నిర్ణయించుకోండి. మీ వివేచనా నిర్ణయాలపై మాకు పూర్తినమ్మకం ఉంది" అన్నాడు సుహైల్ బిన్ అమ్ర్.

దైవప్రవక్త (స) ఈ షరతులన్నిటిని అంగీకరించి సంధి పత్రం రాయమని అలి (రజి)ని ఆదేశించారు. దైవప్రవక్త (స) తమ ఆశలకు భిన్నంగా ఇలాంటి షరతుల్ని ఆమోదిస్తారని ముస్లింలు ఊహించనైనా ఊహించలేకపోయారు. అందువల్ల వారు విస్తుపోయి చూస్తూ దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. తరువాత వారిలో ఆవేశం, ఆత్మాభిమానాలు పెల్లుబికాయి.

"దైవప్రవక్త (స) ఈ షరతుల్ని ఎందుకు ఒప్పుకున్నట్లు? ఒకవేళ నచ్చజెప్పినా ఖురైషీయులు వినకుండా మొండికేసి మనల్ని కాబాదర్శనం చేసుకోనీయకుండా నిరోధిస్తే, వారి మంకుతనాన్ని వదలగొట్టే శక్తి మనకు లేదా? వాళ్ళు మనల్ని మక్కాలో ప్రవేశించనీయకుండా ఎన్నటికీ అడ్డుకోలేరు" అని చెప్పుకున్నారు వారు తమలోతాము.

హజ్రత్ ఉమర్ (రజి) ఆవేశం అణచుకోలేక దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి "ఏమిటీ, మీరు దైవప్రవక్త కాదా?!" అని అడిగారు.

"అందులో సందేహం ఏముంది?" అన్నారు దైవప్రవక్త (స)

"మనం ముస్లిములం కామా?!"

"నిస్సందేహంగా మనం ముస్లిములమే."

"వారు బహుదైవారాధకులు కాదా?!"

"అందులో కూడా ఎలాంటి అనుమానం లేదు."

"అయితే మరి మనం ధర్మం విషయంలో ఈ అవమానం భరించవలసిన అగత్యం ఏమిటీ? ఈ విధంగా వారికి లోకువయి సంధి చేసుకోవడం ఎందుకు?"

"ఉమర్! ఆవేశపడకు. నేను దేవుని దాసుడ్ని. ఆయన సందేశహరుడ్ని. ఇది ఆయన నిర్ణయమే. ఆయన మనకు నష్టం వాటిల్లనివ్వడు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

హజ్రత్ ఉమర్ (రజి) కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. ఆయన మనసు కుదుటపడలేదు. అక్కడ్నుంచి లేచి హజ్రత్ అబూబకర్ (రజి) దగ్గరికెళ్ళి ఇలాగే ప్రశ్నించారు.

"ఉమర్! ఆందోళన చెందకు. ముహమ్మద్ (సల్లం) దేవుని సందేశహరుడు. ఆయన ఏది చేసినా దైవాజ్ఞ ప్రకారమే చేస్తారు. కాస్త ఓపిక పట్టు. దేవుడు మనకే విజయం చేకూర్చుతాడని ఆశించు" అన్నారు హజ్రత్ అబూబకర్ (రజి).

హజ్రత్ ఉమర్ (రజి) కకావికలమైన మనసుతో అక్కడ్నుంచి వెళ్ళారు.

దైవప్రవక్త (సల్లం) ఆదేశాన్ని శిరసావహిస్తూ హజ్రత్ అలి (రజి) సంధి పత్రం రాయడానికి సిద్ధమయ్యారు.

"అలి! వ్రాయ్, కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"ఆగండి. అలాంటి పదాలు రాయడం మాకు అలవాటు లేదు. కరుణామయుడెవరో, కృపాసాగరుడెవరో మాకు తెలియదు. అల్లాహ్ పేరుతో అని మాత్రమే రాయండి" అన్నాడు సుహైల్ ఆదిలోనే ఆక్షేపిస్తూ.

"సరే అలాగే రాస్తాం.... అలి! వ్రాయ్... ఈ దిగువ విషయాలపై దైవప్రవక్త ముహమ్మద్, సుహైల్ బిన్ అమ్రితో సంధి చేసుకున్నాడు."

అలి (ర) రాయడం మొదలెట్టారు. కాని సుహైల్ వెంటనే అలి చేయి పట్టుకున్నాడు.

"ఇలా కాదు. ఖురైషీయులు మిమ్మల్ని దైవప్రవక్తని ఒప్పుకుంటే ఇక ఈ జగడం, ఒప్పందాలు దేనికి? మీరు మీ తండ్రి పేరు మాత్రమే రాయించాలి" అన్నాడు సుహైల్.

"మీరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా నేను మాత్రం దైవప్రవక్తనే" అంటూ....

"అలి! వ్రాయ్... ఈ దిగువ షరతులపై అబ్దుల్లా కుమారుడు ముహమ్మద్, అమ్ కొడుకు సుహైల్‌తో సంధి చేసుకున్నాడు అని వ్రాయ్" అన్నారు దైవప్రవక్త (స).

సంధిపత్రం రాయడం ఇంకా పూర్తికానేలేదు. అంతలో ఒక యువకుడు మక్కా నుంచి పారిపోయి రొప్పుతూ ముస్లిముల దగ్గరికి వచ్చాడు. కాళ్ళకు, చేతులకు సంకెళ్ళు ఉన్నాయి. వాడిపోయిన అతని ముఖంలో దైన్యం కొట్టవచ్చినట్లు కన్పిస్తోంది.

ఈ పీడితుడు ఎవరో కాదు, సుహైల్ కొడుకే. పేరు అబూజందల్. ముస్లిం అయిన నేరానికి అతని జీవితం మక్కాలో దుర్భరమయింది. ఖురైషీయుల చేతుల్లో ఎన్ని బాధలు పడ్డాడో! వారి నుండి తప్పించుకోడానికి మరెన్ని తిప్పలు పడవలసి వచ్చిందో!!

అబూజందల్ (రజి)ని చూడగానే సుహైల్ కళ్ళు అగ్నికణాలయ్యాయి. అతను కొడుకు దగ్గరికి పోయి పళ్ళు పటపట నూరుతూ విసురుగా ఒక్క లెంపకాయ వేశాడు.

"వీడు నాకొడుకు. నేను వీడి సంరక్షకుడ్ని. సంధిప్రకారం మాకు చెందిన ఏఒక్కరినీ నిరోధించడానికి మీకిప్పుడు అధికారం లేదు. వీడ్ని నాకప్పగించండి" అన్నాడు సుహైల్.

"సంధిపత్రం రాయడం ఇంకా పూర్తికాలేదు కదా?" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"సంధిపత్రం రాయడం పూర్తికాకపోయినా సంధిషరతులు మన మధ్య ముందే నిర్ణయమయి పోయాయి" అన్నాడు సుహైల్.



"ఆవేశపడకండి. ఇతడ్ని మా దగ్గర వదలి పెట్టండి."

"వీల్లేదు. అలాగైతే మాకీ ఒప్పందం అవసరమే లేదు" అన్నాడు సుహైల్ కటువుగా.

దైవప్రవక్త(స) ఎంతో అనునయంగా నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. కాని సుహైల్ మొండికేశాడు. కారుణ్యమూర్తి (స) హృదయం బాధగా మూల్గింది. కాసేపు తలవంచుకొని మౌనంగా ఉండిపోయారు. ఆ తర్వాత అబూజందల్ (ర) వైపు తిరిగారు.

"బాబూ! సహనం వహించు. దేవుడు తప్పకుండా ఏదో ఓ దారిని సుగమం చేస్తాడు. ఇప్పుడు ఒప్పందం జరిగిపోయింది. మనం వాగ్దానభంగం చేయలేము కదా!" అన్నారు ఆయన దయార్ద్ర హృదయంతో.

సంధిపత్రం రాయడం పూర్తయింది. సంతకాలు కూడా అయ్యాయి. తర్వాత సుహైల్ ఆవేశంతో ఊగిపోతూ కొడుకు మెడ పట్టుకొని ఈడ్చుకుంటూ తీసికెళ్ళసాగాడు.

"ముస్లిం సోదరులారా! నేను ఇస్లాం స్వీకరించాను. నన్నీ పరిస్థితిలో చూడదలిచారా మీరు? నన్ను మళ్ళీ అవిశ్వాసుల కబంధహస్తాల్లో పెడుతున్నారా?" అంటూ అబూజందల్ (రజి) చంటిపిల్లాడిలా విలపించారు.

హృదయవిదారకమయిన ఈ దృశ్యం చూసి ముస్లింలు చలించిపోయారు. హజ్రత్ ఉమర్ (రజి) ఉండబట్టలేక వర నుంచి ఖడ్గం తీసి అబూజందల్ (రజి) దగ్గరికి పోయి "ఇదిగో, ఈ కత్తి తీసుకొని ఎదిరించి నిన్ను నీవు కాపాడుకో" అన్నారు.

కాని హజ్రత్ అబూజందల్ (రజి) అందుకు సాహసించలేకపోయారు. సుహైల్ ఆయన్ని బలవంతంగా మక్కా పట్నానికి లాక్కెళ్ళాడు.

ముస్లింలు కోపోద్రేకాలను బలవంతంగా దిగమింగి నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయారు. ఒప్పందంలోని నాల్గవ షరతు ప్రకారం ఖుజాఆ తెగవాళ్ళు ముస్లింల పక్షంతో కలిశారు. బకర్ తెగ ఖురైషీయులతో చేతులు కలిపింది.

## 36. దివి నుండి దిగిన విజయవార్త

ఆ తరువాత దైవప్రవక్త (స) అందరూ తలలు గొరిగించుకొని, ఖుర్బానీ పశువుల్ని బలివ్వవలసిందిగా ఆదేశించారు. కాని ముస్లింలు తాము అవిశ్వాసులకు లొంగిపోయి వారి క్రూరమైన షరతుల్ని అంగీకరించవలసి వచ్చిందన్న విచారసాగరంలోనే ఇంకా మునిగిఉన్నారు. వారిలో ఏఒక్కరూ ప్రవక్త (స) ఆజ్ఞను పాటించే స్థితిలో లేరు.

అనుచరులు తన ఆజ్ఞ పాటించకపోవడం చూసి దైవప్రవక్త (స) ఆశ్చర్యపోయారు. బాధపడ్డారు కూడా. ఆయన విచారవదనంతో తన గుడారంలోకి వచ్చారు.

"ఈరోజు ప్రజలకు ఏమయిందో, నా ఆదేశాన్ని పాటించడానికి సిద్ధంగా లేరు" అన్నారు ఆయన సతీమణి హజ్రత్ ఉమ్మెసల్మా (రజి)తో.

"ఏమయింది? మీరేం ఆదేశించారు?" అడిగారు ఉమ్మెసల్మా (రజి). "నేను తలలు గొరిగించుకొని ఖుర్బానీ ఇవ్వమని ఆదేశించాను" అన్నారు దైవప్రవక్త (స).

"మీ అనుచరులు విచారగ్రస్తులయి ఉన్నందున మీ ఆజ్ఞ పాటించలేకపోతున్నారు. అంచేత ముందుగా మీరు తల గొరిగించుకోండి. మిమ్మల్ని చూసి వారు కూడా అలా చేస్తారు" అని చెప్పారు విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఉమ్మెసల్మా (రజి).

ఈ అభిప్రాయం సమంజసంగా తోచింది. వెంటనే ఆయన మంగలిని పిలిపించుకొని తల గొరిగించుకున్నారు. ఆయన్ని చూసి అనుచరులు కూడా తలలు గొరిగించుకున్నారు.

ఆ తరువాత అందరూ బలిపశువుల్ని జిబహ్ చేసి మదీనాకు తిరుగు ప్రయాణమయ్యారు. ప్రయాణం చాలా భారంగా సాగుతోంది. మదీనా నుండి బయలుదేరినప్పటి ఉత్సాహం తిరుగు ప్రయాణంలో కన్పించడం లేదు.

ఖురైషీయులు విధించిన షరతులు దైవప్రవక్త (సల్లం) ఎందుకు ఆమోదించారో ఎంత ఆలోచించినా అనుచరులకు అర్థం కాలేదు. ఈ ఒప్పందంలో వారికి అంతా నష్టమే కన్పిస్తోంది. ఎంతో ఉత్సాహంతో కాబాలయాన్ని దర్శించుకుందామని వస్తే, కాబా దర్శనభాగ్యం లభించకపోగా చివరికిలా తమ ఆత్మాభిమానానికి విఘాతం కల్గించే షరతులకు లొంగిపోవలసి వచ్చింది.

ఈ విషయం గురించి హజ్రత్ ఉమర్ (రజి) ప్రయాణంలో కూడా దైవప్రవక్త (స)ను అనేక సార్లు అడిగారు. కాని దైవప్రవక్త (స) ఎలాంటి సమాధానం ఇవ్వకుండా మౌనంగా ఉండిపోయారు. దాంతో ఉమర్ (రజి)కు దుఃఖం పొరలివచ్చింది. దైవప్రవక్త (స)ను విసిగించానే అని ఆయన లోలోన బాధపడ్డారు.

కాస్సేపటికి హఠాత్తుగా వెనుక నుండి ఓ పిలుపు వినవచ్చింది. "ఉమర్! దైవప్రవక్త (సల్లం) నిన్ను పిలుస్తున్నారు."

దైవప్రవక్త (సల్లం) పిలుస్తున్నారనగానే ఉమర్ (రజి) గుండెలు దడదడలాడాయి. కొంపదీసి తాను చేసిన తప్పుకు దివ్యావిష్కృతి ద్వారా దైవాగ్రహం విరుచుకుపడలేదు కదా అన్న అనుమానం వచ్చి ఆయన ఓ క్షణం పాటు నిలువునా కంపించిపోయారు. అలా భయపడుతూనే ఆయన దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళారు.

కాని అక్కడ చూస్తే దైవప్రవక్త (స) దివ్యమోము పూర్ణచంద్రుడిలా వెలిగిపోతోంది. పెదవులపై దరహాసం తొణికిసలాడుతోంది.

"ఉమర్! ఇప్పుడిప్పుడే నాపై ఖుర్‌ఆన్ అధ్యాయం ఒకటి అవతరించింది. సుమధుర వాణి! హృదయాన్ని ఆనందసాగరంలో ఓలలాడించే దివ్యసందేశం!! దాని ముందు ఎంత పెద్ద ప్రాపంచిక సంతోషమైనా బలాదూరే. ఇదిగో విను....

"ముహమ్మద్ (స)! మేము నీకు స్పష్టమైన విజయం ప్రసాదించాం. దేవుడు నీ గత పొరపాట్లు, భావిపొరపాట్లు మన్నించి నీపై తనఅనుగ్రహం పరిపూర్తి చేయాలని, నీకు రుజుమార్గం చూపి, పెద్ద సహాయం చేయాలని (ఈ శుభవార్త నీకు విన్పిస్తున్నాడు). (48:1-3)

ఆయనే ముస్లింల విశ్వాసం ద్విగుణీకృతం కావడానికి వారి హృదయాలలో శాంతీ స్థిమితాలను అవతరింపజేశాడు. భూమ్యాకాశాల సైన్యాలన్నీ దేవుని అధీనంలోనే ఉన్నాయి. ఆయన సర్వం ఎరిగినవాడు, ఎంతో వివేకవంతుడు. (ఇలా చేయడానికి కారణం) విశ్వసించిన



స్త్రీపురుషుల్ని శాశ్వతనివాసం కొరకు సెలయేరులు పారే స్వర్గవనాలలో ప్రవేశింపజేయాలని, వారి నుండి చెడుల్ని తొలగించాలని- దేవుని దృష్టిలో ఇది గొప్పవిజయం-" (48:4-6)

ప్రవక్తా! నీముందు శపథం చేస్తున్నవారు నిజానికి దేవుని ముందు శపథం చేస్తున్నారు. వారి చేయి దేవుని చేతిలో ఉంది. ఇప్పుడీ ప్రమాణాన్ని ఎవరైనా భంగపరిస్తే దాని కీడు వారిపైనే పడుతుంది. ఎవరు దేవుని ముందు ప్రమాణంచేసి దాన్ని నెరవేరుస్తారో, దేవుడు వారికి త్వరలోనే గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తాడు. (48:10)

"విశ్వాసులు చెట్టు క్రింద నీ చేతిలో చేయి వేసి శపథం చేస్తున్నప్పుడు దేవుడు వారి పట్ల ప్రసన్నుడయ్యాడు. వారి ఆంతర్యాల స్థితి ఆయనకు తెలుసు. అందువల్ల వారిపై ఆయన శాంతీ స్థిమితాలు అవతరింపజేశాడు. బహుమానంగా వారికి సమీప విజయాన్ని, అపార సమరసొత్తును అనుగ్రహించాడు. దాన్ని వారు (త్వరలోనే) సాధిస్తారు. దేవుడు మహా శక్తిమంతుడు, ఎంతో వివేచనాపరుడు. (48:18,19)

దేవుడు మీకు పెద్ద ఎత్తున సమరసొత్తు లభిస్తుందని వాగ్దానం చేస్తున్నాడు. ప్రస్తుతం ఆయన మీకు ఈ విజయం ప్రసాదించి, భవిష్యత్తులో మీకు వ్యతిరేకంగా ఇతరులు తోక జాడించకుండా వారిని నిలువరించాడు. మరోవైపు విశ్వాసులకు ఒక నిదర్శనంగా చేశాడు. మీరు సన్మార్గంలో స్థిరంగా ఉండేందుకు దేవుడు మీకు మరింత సద్బుద్ధి ప్రసాదించాలన్న ఉద్దేశ్యం కూడా దీని వెనక ఉంది. అదీగాక మరికొన్ని సమరసొత్తులు కూడా మీకు లభిస్తాయని దేవుడు వాగ్దానం చేస్తున్నాడు. వాటిని మీరింకా సాధించలేదు. దేవుడు వాటిని చుట్టుముట్టి ఉంచాడు. దేవుడు ప్రతి పనీ చేయగల సమర్థుడు, సర్వ శక్తిమంతుడు. (48:20,21)

ఇప్పుడీ అవిశ్వాసులు గనక మీతో పోరాడితే తప్పకుండా వెన్నుజూపి పారిపోతారు. వారికి ఎలాంటి మద్దతు, సహాయం లభించవు. ఇది పూర్వకాలం నుండీ వస్తున్న దైవసంప్రదాయం. దైవసంప్రదాయంలో నీవు ఎన్నడూ మార్పు చూడలేవు. (48:22,23)

దేవుడే మక్కా లోయలో వారి చేతుల్ని మీనుండి, మీ చేతుల్ని వారినుండి (యుద్ధం జరగకుండా) నిరోధించాడు. నిజానికి ఆయన వారిపై మీకు ఇంతకు ముందే ఆధిక్యత (విజయం) ప్రసాదించాడు. మీరు చేస్తున్నదంతా దేవుడు గమనిస్తూనే ఉన్నాడు. (48:24)

సత్యాన్ని తిరస్కరించినవారు, మిమ్మల్ని ప్రతిష్ఠాలయంకు రానివ్వకుండా నిరోధించినవారు, బలిపశువుల్ని వాటి బలి ప్రదేశానికి చేరనీకుండా అడ్డుకున్నవారు వారేకదా! (మక్కాలో) మీరెరుగని స్త్రీపురుష విశ్వాసులు లేకుండాఉంటే, పొరపాటున మీరు వారిపై కూడా దాడిచేస్తారన్న ప్రమాదం, దానివల్ల మీరు అప్రతిష్ఠపాలవుతారన్న భయం కూడా లేకుండా ఉంటే (ఈ యుద్ధాన్ని మేము నిరోధించేవారం కాదు). దేవుడు తాను కోరిన వారిని తన కారుణ్యఛాయలోకి తీసుకోవడానికే (ఈ యుద్ధాన్ని నిరోధించాడు). ఈ విశ్వాసులు వేరే చోటికి పోయివుంటే (మక్కాలోని) అవిశ్వాసుల్ని మేము తప్పక కఠినంగా శిక్షించేవాళ్ళం. (48:25)

ఈ అవిశ్వాసులు మొండి పట్టుదలకు పోయినప్పుడు దేవుడు తన ప్రవక్తకు, విశ్వాసులకు సహనం, సంయమనాలు ప్రసాదించాడు. వారిని భయభక్తులవైఖరికి కట్టుబడిఉండేలా చేశాడు. వారే భయభక్తులు కలిగివుండటానికి ఎక్కువ అర్హులు. దేవుడు సర్వం ఎరిగినవాడు. (48:26)

దేవుడు తన ప్రవక్తకు స్వప్నం చూసిన సంగతి నిజమే. అది సత్యంతో కూడుకున్న స్వప్నం. (దానిప్రకారం) దేవుడు తలిస్తే (త్వరలోనే) మీరు తప్పకుండా ప్రతిష్ఠాలయం (కాబా గృహం)లో నిర్భయంగా, నిశ్చింతగా ప్రవేశిస్తారు. అక్కడ మీ తలలను పూర్తిగా గొరిగించు కుంటారు లేదా కత్తిరించుకుంటారు. మీకు ఎలాంటి భయముండదు. మీకు తెలియని విషయాలు (ఎన్నో) ఆయనకు తెలుసు. అందువల్ల ఈ స్వప్నం నిజం కావడానికి ముందుగా ఆయన ఈ సమీప విజయాన్ని మీకు పసాదించాడు." (ఖుర్ఆన్-48:27)

ఈ సూక్తులు విని ముస్లిములు పరమ సంతోషంతో పొంగిపోయారు. ఇక ఉమర్ (రజి) ఆనందమయితే అవధులు దాటింది. ఓ నిమిషానికి ముందున్న ఆయన మనోవ్యథ అంతా ఇప్పుడు పటాపంచలైపోయింది.

"దైవప్రవక్తా! మనం దైవగృహాన్ని సందర్శిస్తామని మీరు వాగ్దానం చేసి ఉన్నారు. కాని ఆ వాగ్దానం నెరవేరనే లేదు. అదే మాకు బాధగా ఉంది" అన్నారు అనుచరులు.

"కాని ఈ సంవత్సరమే మనం దైవగృహాన్ని సందర్శిస్తామని నేను మీతో అన్నానా?"

"లేదు. అలా అనలేదండీ మీరు."

"అయితే ఓపిక పట్టండి. ఆ వాగ్దానం తప్పక నెరవేరుతుంది. ఆలస్యంగానైనా మనం మక్కా వెళ్ళి కాబాగృహాన్ని దర్శిస్తాం" అన్నారు దైవప్రవక్త ముహమ్మద్ (స).

"ముహమ్మద్ (స) దేవుని సందేశహరుడు. ఆయన అనుచరులు అవిశ్వాసులకు ఏమాత్రం లొంగని దృఢమనస్కులు. అయితే వారు పరస్పరం మృదుహృదయులు, దయామయులు. నీవు ఎప్పుడైనా వారిని చూస్తే వారు రుకూ, సజ్దాలు (ప్రార్థన) చేయడంలో, దేవుని అనుగ్రహం, ఆయన ప్రసన్నతలు అర్థించడంలో నిమగ్నులై ఉండటం కన్పిస్తుంది. వారి ముఖాలపై సాష్టాంగప్రణామ చిహ్నాలు ఉంటాయి. ఆ చిహ్నాల్ని బట్టే వారిని గుర్తించవచ్చు. ఇవి తౌరాత్‌లో వారిని గురించి వర్ణించబడిన లక్షణాలు."

"ఇన్జీల్‌లో వారి లక్షణాలు ఈవిధంగా పోల్చబడ్డాయి: ఒక పొలం ఉంది. అందులో మొదట విత్తనం నుండి చిన్న మొలక అంకురిస్తుంది. తరువాత అది పటిష్ఠమవుతుంది. ఆ తర్వాత కాస్త లావెక్కి కాడగా మారుతుంది. ఆపై ఆ మొక్క తన కాండం మీద నిటారుగా నిలబడుతుంది. అప్పుడు రైతులకు ఆ దృశ్యం కనులపండువగా ఉంటుంది; అవిశ్వాసులు అసూయాగ్నిలో మాడిపోవడానికి (ఈవిధంగా విశ్వాసుల సద్గుణ సంపత్తి పుష్పించి ఫలిస్తుంది). వారిలో సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులయిన వారిని దేవుడు మన్నించి గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తానని వాగ్దానం చేశాడు." (ఖుర్ఆన్-48:29)

## 37. హుదైబియా ఒడంబడిక పరిణామాలు

ముస్లిములు మదీనా చేరుకున్నారు. వారు మదీనా తిరిగొచ్చారో లేదో ఖురైషీయులకు చెందిన అబూబసీర్ అనే ఒకతను మక్కా నుండి పారిపోయి వచ్చాడు.

అబూబసీర్ (రజి) మక్కాలో బహుదైవారాధకుల చిత్రహింసలు భరించలేక మదీనా పారిపోయి వచ్చారు. అయితే కాస్సేపటికి మక్కా బహుదైవారాధకులకు చెందిన ఇద్దరు



మనుషులు కూడా ఆయన్ని వెంబడిస్తూ మదీనా వచ్చారు. వారిద్దరి దగ్గర అబూబసీర్ (రజి) యజమాని దైవప్రవక్త (సల్లం) పేరిట రాసిన ఓ లేఖ ఉంది. ఆ లేఖలో హుదైబియా ఒడంబడికను ప్రస్తావిస్తూ అబూబసీర్ (రజి)ని అప్పగించమని కోరడం జరిగింది.

ఒకవైపు అసహాయ స్థితిలో ఉన్న అబూబసీర్ (రజి) దీన వదనం! మరోవైపు ఖురైషీయులతో చేసుకున్న శాంతిఒప్పందం!! దైవప్రవక్త (స) క్షణంపాటు ఆలోచనలో పడ్డారు. తరువాత ఓ నిర్ణయానికి వచ్చారు.

"అబూబసీర్! ఖురైషీయులతో మనం ఒప్పందం చేసుకొనిఉన్నాం. మనం ఒప్పందాన్ని ఉల్లంఘించలేము కదా! ఒప్పందాన్ని ఉల్లంఘించడం అధర్మం. అందువల్ల నీవు నీ తెగవాళ్ళ దగ్గరికి తిరిగివెళ్ళిపో" అన్నారు ఆయన బాధగా.

"దైవప్రవక్తా! మీరు నన్ను మళ్ళీ అవిశ్వాసుల దగ్గరికి పంపి వారి దౌర్జన్య కాండకు బలి కమ్మంటున్నారా? దేవుడు నన్ను వారి కబంధహస్తాల నుండి కాపాడాడు. కాని మళ్ళీ నన్ను...."

"భయపడకు నాయనా! సహనం వహించు. దేవుడు ఏదోమార్గం చూపించకపోడు. వారి హింసాకాండకు గురవుతున్నవారు ఇంకా కొందరున్నారు. దేవుడు వారిని అలాగే వదలిపెట్టడు. వెళ్ళు బాబూ! వెళ్ళు."

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) గుండె దిటవుచేసుకొని ఆ అభాగ్యజీవిని ఖురైషీయులకు అప్పగించారు. ఖురైషీయులు అబూబసీర్ (రజి)ని బంధించి తమతో పాటు తీసికెళ్ళారు. ముస్లిములు ఏమీచేయలేక ఆ దీనుడి వైపు అసహాయంగా చూస్తూ కంటతడి పెట్టుకున్నారు.

"ఖురైష్ మనుషులిద్దరు అబూబసీర్ (రజి)ని తీసుకొని జుల్‌హులీఫా ప్రదేశానికి చేరుకున్నారు. అక్కడ కాస్తంత విశ్రాంతి తీసుకుందామని ఆగిపోయారు.

వారిలో ఒకడితో హజ్రత్ అబూబసీర్ (రజి), "నీ ఖడ్గం చాలా బాగుందే! ఏది చూద్దాం, ఓసారి ఇటివ్వు" అన్నారు. అతను ఖడ్గం ఇచ్చాడు. వెంటనే అబూబసీర్ (రజి) ఆ ఖడ్గంతో అతడ్ని ఒక్క దెబ్బతో కడతేర్చారు.

ఈ హఠాత్పరిణామం చూసి రెండవవాడు పలాయనం చిత్తగించాడు. అతను మదీనా వెళ్ళి మసీదులో ప్రవేశించాడు. అతని ముఖంలో కానవస్తున్న భయాందోళనలను దైవప్రవక్త (స) గమనించి "ఏమిటి ఇలా వచ్చావు! క్షేమమే కదా!?" అని అడిగారు.

"ఏం చెప్పను మహాశయా! మీ మనిషి నా స్నేహితుడ్ని చంపేశాడు. నేనెలాగో తప్పించుకొని వచ్చాను. లేకుంటే నాకూ అదే గతి పట్టేది" అన్నాడు ఖురైష్ మనిషి.

అంతలో హజ్రత్ అబూబసీర్ (రజి) కూడా అక్కడికి చేరుకున్నారు.

"దైవప్రవక్తా! మీరు నన్ను ఖురైషీయులకు అప్పగించి మీ కర్తవ్యం నెరవేర్చుకున్నారు. ఇక మీపై ఎలాంటి బాధ్యతలేదు. కాని నేను నా ఆత్మరక్షణ కోసం ఈపని చేశాను" అని చెప్పి ఆయన అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

హుదైబియా ఒప్పందంలో ఒక షరతు ఈవిధంగా ఉంది: "మక్కా నుండి ఎవరైనా పారిపోయి మదీనా వెళ్ళిపోతే అతడ్ని మక్కాకు తిరిగి పంపివేయాలి. కాని మదీనా నుండి ఎవరైనా మక్కాకు వస్తే అతడ్ని మదీనాకు తిరిగి పంపడం జరగదు."

ఈ షరతు ప్రకారం దైవప్రవక్త (సల్లం) మక్కానుండి పారిపోయి వచ్చిన ముస్లిం పురుషుల్ని తిరిగి మక్కాకు తిప్పి పంపుతుండేవారు. ఇలా కొంతమంది ముస్లిం పురుషుల్ని తిప్పిపంపారు. ఆ తర్వాత ముస్లింస్త్రీలు మక్కా నుండి రావడం ప్రారంభించారు. మొట్ట మొదట ఉమ్మెకుల్సూమ్ (రజి) మక్కానుండి పారిపోయి మదీనా వచ్చారు. వెంటనే ఆమె సోదరుడు వచ్చి ఒప్పందం ప్రకారం ఆమెను తమకు అప్పగించమని అడిగాడు.

"విశ్వాసులారా! విశ్వసించిన స్త్రీలు (మక్కా నుండి) మీ దగ్గరకు (మదీనా) వలస వచ్చినప్పుడు (వారి విశ్వసనీయతను) మీరు ఒక సారి పరీక్షించుకోండి. నిజానికి వారి విశ్వాసస్థితి గురించి దేవునికే బాగా తెలుసు. వారు నిజమైన విశ్వాసులే అని మీరు నిర్ధారించుకుంటే ఇక వారిని అవిశ్వాసుల దగ్గరికి తిప్పిపంపకండి. వారు అవిశ్వాసులకు (భార్యలుగా) ధర్మసమ్మతం కాలేరు. అవిశ్వాసులు కూడా వారికి (భర్తలుగా) ధర్మసమ్మతం కాలేరు. ఆ స్త్రీలకు ఇవ్వబడిన మహర్ ధనాన్ని వారి (భర్తల)కి తిరిగి ఇచ్చివేయండి. అప్పుడు మీరు ఆ స్త్రీలకు మహర్ ధనం చెల్లించి వారిని వివాహమాడవచ్చు. అందులో ఎలాంటి తప్పు లేదు." (దివ్యఖుర్ఆన్–60:10)

దైవప్రవక్త(స) ఆమెను అవిశ్వాసులకు అప్పగించడానికి నిరాకరిస్తూ "ఒప్పందంలోని షరతు పురుషుల విషయంలో ఉందిగాని, స్త్రీల విషయంలో లేద"ని అన్నారు. అప్పుడు మక్కా బహుదైవారాధకులు సంధి షరుతుల్లోని పదజాలం గమనించి జరిగిన పొరపాటుకు తలలు బాదుకున్నారు.

హజ్రత్ అబూబసీర్ (రజి) మదీనా నుంచి నేరుగా సముద్ర తీరానికి పోయి అమీస్ అనే చోట ఆగిపోయారు. వెంట తెచ్చుకున్న ఖర్జూర పండ్లతో, సముద్రపు చేపలతో క్షుద్బాధ తీర్చుకుంటూ అక్కడే కాలం గడపసాగారు.

మక్కాలో ఖురైషీయుల హింసాదౌర్జన్యాలకు గురయి అష్టకష్టాలు అనుభవిస్తున్న ఇతర ముస్లింలు ఈ విషయం తెలుసుకొని ఒక్కొక్కరే రహస్యంగా అబూబసీర్ (రజి) దగ్గరికి చేరుకోవడం ప్రారంభించారు. సుహైల్ కొడుకు హజ్రత్ అబూజందల్ (రజి) కూడా అక్కడికి చేరుకున్నారు. ఈవిధంగా కొంతకాలానికే మక్కా నుండి డెబ్భయి మందికి పైగా ముస్లింలు పారిపోయి వచ్చి ఇక్కడ స్థిరపడిపోయారు.

మక్కా నుంచి సిరియాకు పోయే, సిరియా నుండి తిరిగొచ్చే వర్తక బిడారాలన్నీ ఈ ప్రాంతం గుండానే వచ్చి పోవలసి ఉంటుంది. హుదైబియా ఒప్పందం ప్రకారం మక్కా నుండి పారిపోయే ముస్లింలు మదీనా వెళ్ళడానికి వీలులేనందున వారంతా ఈ ప్రాంతానికే చేరుకొని, ఇక్కడకు వచ్చే వాణిజ్య బృందాలపై గెరిల్లాదాడులు చేస్తూ వాటిని దోచుకోవడం ప్రారంభించారు. ఒకవేళ వారిలో ఎవరైనా ఇస్లాం స్వీకరిస్తే అలాంటివారికి వారి వ్యాపార సామగ్రి తిరిగి ఇచ్చేవారు. ఈవిధంగా చివరికి ఈ పీడితముస్లింలే మక్కా ఖురైషీయులకు పెద్ద బెడదగా తయారయ్యారు. ఏ షరతుల వల్ల తమప్రతిష్ఠ పెరుగుతుందని భావించారో



ఆ షరతులే ఇప్పుడు వారి బ్రతుకుతెరువుకు అవరోధాలుగా మారి ఆందోళన కల్గిస్తున్నాయి.

ఈ పోరు పడలేక ఖురైషీయులు మదీనా వెళ్ళి దైవప్రవక్త (సల్లం) ముందు మొర పెట్టుకున్నారు. ఒప్పందంలో తాము విధించిన షరతుల్ని ఇప్పుడు తామే ఉపసంహరించుకుంటున్నామని, సముద్రతీరాన ఉన్న శరణార్థుల్ని మదీనా పిలిపించుకొని తమను ఇక్కట్ల నుంచి గట్టెక్కించమని వేడుకున్నారు ఖురైష్ నాయకులు.

దైవప్రవక్త (సల్లం) శత్రువుల అభ్యర్థనను మన్నించారు. ఆయన హజ్రత్ అబూబసీర్ (రజి) దగ్గరికి ఒక లేఖ పంపి అమీస్‌లో నిరాశ్రయజీవితం గడుపుతున్న శరణార్థుల్ని తీసుకొని మదీనా వచ్చేయమని ఆజ్ఞాపించారు.

ఈ లేఖ అబూబసీర్ (రజి) దగ్గరకు చేరుకునే సమయంలో ఆయన వ్యాధిగ్రస్తులయి ఉన్నారు. అంచేత ఆయన అబూజందల్ (రజి)ని పిలిచి దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞ విన్పిస్తూ "నీవు వెంటనే మనవాళ్ళను తీసుకొని మదీనా వెళ్ళిపో" అని చెప్పారు.

హజ్రత్ అబూజందల్ (రజి) అనుచరుల్ని తీసుకొని హిజ్రీశకం 7వ ఏట మదీనా చేరుకున్నారు. ఆ తరువాత కొన్నాళ్ళకే హజ్రత్ అబూబసీర్ (రజి) చనిపోయారు.

ఇప్పుడు యావత్తు ముస్లింలు సంతోషంతో గడపసాగారు. మక్కా, మదీనాల మధ్య సురక్షితమైన రాకపోకలు ప్రారంభమయ్యాయి. దాంతో మక్కా ప్రజలు మదీనా వచ్చి తమ బంధుమిత్రుల్ని కలుసుకుని, వారితో లావాదేవీలు జరుపుకునే అవకాశం లభించింది. వారిలో అనేకమంది బహుదైవారాధకులు ముస్లింల జీవనసరళిని సమీపం నుంచి చూసి ప్రభావితులై ఇస్లాం స్వీకరించడం మొదలెట్టారు. ముస్లింలు మొదట్లో ఏ ఒప్పందాన్ని తమకు అవమాన కరమయినదిగా, ఘోర పరాజయంగా తలచారో, అదే ఇప్పుడు వారి ప్రతిష్ఠను ఈవిధంగా పెంచి అద్భుత విజయంగా పరిణమించింది.

## 38. ఖైబర్ దండయాత్ర

దైవప్రవక్త (సల్లం) తన అనుచరులతో హుదైబియా నుండి మదీనాకు తిరిగొచ్చిన మూడు నెలలకే 'ఖైబర్'యూదులు ముస్లింలపై తిరుగుబాటుకు పాల్పడి యుద్ధ సన్నాహాలు చేస్తున్నారని పిడుగులాంటి వార్త విన్పించింది.

ఖైబర్ ప్రాంతం మదీనా నుండి ఉత్తర దిక్కున దాదాపు వంద మైళ్ళ దూరంలో ఉన్న అత్యంత సారవంతమైన నేల. ఇక్కడ కొండల మధ్య ఉన్న ఏడు లోయల్లో అనేక నదులు, బావులతో పాటు ఖర్జూరం, ద్రాక్ష, నిమ్మ, అంజూరం వగైరా పండ్లతో కూడిన ఎన్నో తోటలు కూడా ఉన్నాయి. యూదులు పాలస్తీనా నుంచి బహిష్కరించబడిన తరువాత మొదటిసారిగా ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు. ఖైబర్ సమీపంలో ఉన్న ఫదక్, ఖురాలోయ, తైమా ప్రాంతాల్లో కూడా యూదులు నివసిస్తున్నారు. ఆ తర్వాత బనీనజీర్ తెగయూదులు కూడా మదీనా నుండి వచ్చి ఖైబర్‌లో నివాసం ఏర్పరచుకున్నారు.

ఈ యూదులు స్నేహఒప్పందం ఉల్లంఘించి ముస్లింలపై కాలుదువ్వడంతో దైవప్రవక్త (స) వారిని మదీనా నుండి బహిష్కరించారు. అప్పుడు వారు ఖైబర్‌కు వచ్చి

నివశించసాగారు. కాని ఖైబర్‌లో కూడా ముస్లింవ్యతిరేక కార్యకలాపాలు మానుకోలేదు. అంచేత దైవప్రవక్త (స) ఖైబర్ యూదుల్ని ముట్టడించడానికి పూనుకున్నారు.

హిజ్రీశకం 7వ సంవత్సరం, ముహర్రం నెలలో దైవప్రవక్త (సల్లం) మదీనాలో సబా బిన్ అరఫ్తా (రజి)ను గవర్నర్‌గా నియమించి దాదాపు 1600 మంది యోధుల్ని తీసుకొని ఖైబర్‌కు బయలు దేరారు. నాలుగు రోజులు ప్రయాణం చేసి ఖైబర్, గత్ఫాన్ పట్టణాల మధ్య ఉన్న ‘అజీ’ లోయాకు చేరుకున్నారు.

పొలాల్లో పనిచేసుకుంటున్న కొందరు యూదులు ఇలా ముస్లింయోధులు అకస్మాత్తుగా ఖైబర్ సమీపానికి రావడం చూశారు. వెంటనే వారు ఖైబర్‌కు పరుగెత్తుకెళ్ళి ఈ విషయం తమ నాయకులకు తెలియజేశారు. అది విని యూదనాయకులు క్షణంపాటు నివ్వెరపోయారు. ఏం చెయ్యాలో అర్థంగాక కాస్సేపు అయోమయంలో పడిపోయారు. తరువాత తేరుకొని పథకం రూపొందించారు.

గత్ఫాన్ తెగలతో యూదులకు స్నేహసంబంధాలున్నందున మదీనాను జయించడం జరిగితే తాము మదీనాలోని తమ వ్యవసాయరాబడిలో అర్ధభాగం ఇస్తామన్న షరతుపై ఇంతకుముందే వారు గత్ఫాన్ తెగతో యుద్ధఒడంబడిక చేసుకున్నారు. గత్ఫాన్ నాయకులు తమ దగ్గరున్న నాలుగు వేలమంది యుద్ధవీరులు కూడా తోడయితే ముస్లింలను మట్టి కరిపించవచ్చని యూదులకు హామీ ఇచ్చారు. అందువల్ల యూదులు వారి సహాయం కోసం ఎదురుచూడసాగారు.

కాని ముస్లింలు తమ ప్రియతమ నాయకుని ఆదేశం ప్రకారం అజీ లోయలో దిగి గుడారాలు వేసుకున్నారు. గత్ఫాన్ తెగవాళ్ళు తమకు సమీపంలోనే ముస్లింయోధులు విడిది చేయడం చూసి వారు తమ నివాసప్రాంతాలపై దాడిచేస్తారేమోనని భయపడి ఇళ్ళలో నుంచి బయటికే రాకుండా ఉండిపోయారు.

ఆరోజు రాత్రి ముస్లింలు స్నానాదులు ముగించుకొని హాయిగా నిద్రపోయారు. తెల్లవారుజామున నమాజు చేసి ఆయుధాలు ధరించి ఖైబర్‌కు బయలుదేరారు. పోగానే ఖైబర్ కోటలను చుట్టుముట్టారు. ఇరుపక్షాల మధ్య కొన్నాళ్ళు తీవ్రంగా యుద్ధం జరిగింది.

యూదులు ముస్లింల ధాటికి నిలువలేక పోయారు. చివరికి వారు గత్యంతరంలేక కాళ్ళబేరానికి వచ్చారు. కనాన నాయకత్వాన ప్రతినిధివర్గం సంధికోసం దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చింది. సంప్రదింపుల తరువాత ఈ షరతులపై ఒప్పందం కుదిరింది.

(1) యూదసైనికుల ప్రాణాలకు రక్షణ ఉంటుంది.

(2) వారి భార్యాపిల్లల్ని విడిచి పెట్టడం జరుగుతుంది.

(3) యూదులు తమ స్థిర చరాస్తుల్ని ముస్లింలకు అప్పగిస్తారు.

(4) యూదులు తమ సేద్యభూములను ముస్లింలకు అప్పగించిన తరువాత వారా భూములలో వ్యవసాయం చేస్తూ పండినపంటలో అర్థభాగం తీసుకుంటారు.

ఈ యుద్ధంలో 93 మంది యూదులు చనిపోయారు. ముస్లింయోధుల్లో 15 మంది అమరగతులయ్యారు. అనేక మంది ఖైదీలు పట్టుబడ్డారు. ఈ ఖైదీలలో యూద



నాయకుడు హుయ్యి బిన్ అఖ్తబ్ కూతురు సఫియా కూడా ఉంది.

సమరసొత్తులో తౌరాత్ ప్రతులు కూడా అనేకం లభించాయి. కొందరు యూదులు దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి తౌరాత్ ప్రతుల్ని తమకు ఇచ్చేయమని విన్నవించుకున్నారు. దైవప్రవక్త (స) వారి విన్నపం మన్నించి తౌరాత్ ప్రతుల్ని యూదులకు తిరిగిచ్చేశారు.

దైవప్రవక్త (స) సమరసొత్తును, ఖైదీలను యోధులకు పంచారు. రాకుమారి సఫియా హజ్రత్ వహ్యా (రజి) వాటాకు వచ్చింది. అయితే యూదుల్లో సఫియాకున్న గౌరవం, హోదా అంతస్తుల దృష్ట్యా ఆమెను దైవప్రవక్త (స) వహ్యా (రజి) నుండి కొని స్వేచ్ఛ ప్రసాదించారు. దాంతో సఫియా ప్రభావితురాలయి ఇస్లాం స్వీకరించింది.

ఆ సందర్భంలో ఓ యూద స్త్రీ మేకమాంసం వండి దైవప్రవక్త (స)కు, ఆయన అనుచరులకు ఆతిథ్యమిచ్చింది. దైవప్రవక్త (సల్లం) ఓ మాంసం ముక్క నోట్లో పెట్టుకొని “తినకండి, ఇందులో విషం ఉంది” అన్నారు అనుచరులతో.

కాని అనుచరుల్లో హజ్రత్ బషర్ బిన్ బరా (రజి) ఒక ముక్క నోట్లో పెట్టుకోగానే తీవ్రమైన విషప్రభావంతో కాస్పేపటికే ఊపిరివిడిచారు. తరువాత దైవప్రవక్త (సల్లం) ఈ కుట్ర గురించి ప్రశ్నించడానికి ఆ యూద స్త్రీని పిలిపించారు.

“ఏమిటీ ఈ అఘాయిత్యం? ఈ మాంసంలో విషం కలిపావెందుకు?” అని అడిగారు ఆయన. “మీకెవరు చెప్పారు ఇందులో విషం ఉందని?” అన్నది ఆమె తొణక్కుండా.

“ఎవరో ఎందుకు, ఈ మాంసమే చెబుతోంది” అన్నారు దైవప్రవక్త (సల్లం). “ఔను. నేనే ఇందులో విషం కలిపాను” అన్నది ఆ యూద స్త్రీ. “ఎందుకు కలిపావు?”

“మా జాతికి పట్టిన దుర్గతి మీకు తెలుసు. ఈ యుద్ధంలో నా తండ్రి, పినతండ్రి, భర్త అందరూ చనిపోయారు. అందువల్ల నేనే ఈ పని చేశాను. నిజంగా మీరు దైవప్రవక్తే అయితే ఆ విషయాన్ని ఈ మాంసమే చెబుతుంది. ఒకవేళ మీరు చక్రవర్తి అయివుంటే (ఈ విషప్రయోగంతో) మాకు సుఖం లభిస్తుంది” అన్నది ఆమె.

ఇంత ఘోరానికి పాల్పడినా ఆ యూద స్త్రీపై దైవప్రవక్త (సల్లం) ఎలాంటి చర్య తీసుకోకుండా క్షమించి వదలిపెట్టారు.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) ఖైబర్‌లో హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి)ని తన ప్రతినిధిగా నియమిస్తూ యూదుల పట్ల సత్ప్రవర్తన కలిగిఉండాలని, వారితో మతపరమైన వివాదాలకు దిగకూడదని ఉపదేశించారు.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని తీసుకొని ఖైబర్ నుండి బయలుదేరారు. ఖైబర్ నుండి ఫదక్ ప్రాంతానికి రాగానే అక్కడి యూదులు సంధి చేసుకోవడానికి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చారు. తమ ఆస్తిపాస్తులు తీసుకొని తమకు ప్రాణభిక్ష పెడ్తే చాలని వారు విన్నవించుకున్నారు. దైవప్రవక్త (సల్లం) వారి విన్నపం అంగీకరించారు. ఫదక్ యూదులతో యుద్ధం జరగనందున వారి స్థిరచరాస్తులు యోధులకు పంచకుండా ప్రభుత్వ ఆస్తులుగా పరిగణించబడ్డాయి.

ముస్లింలు అక్కడ్నుంచి ఖురాలోయకు చేరుకున్నారు. అక్కడి యూదులు ఎదురు తిరిగి ముస్లింలపై బాణాలు ఎక్కుపెట్టారు. అంచేత ముస్లింలు వారి కోటలు ముట్ట డించారు. చివరికి వారు కూడా ఖైబర్‌యూదుల్లాగా తమ పంటభూములు అప్పగించి వాటిని సాగుబడి చేసినందుకు తమకు అర్ధపంట ఇచ్చే షరతుపై లొంగిపోయారు.

ఆ తరువాత ముస్లింలు అక్కడ్నుంచి తైమా అనే ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడి యూదులు కూడా ఖురాలోయ యూదుల మాదిరిగా సంధిచేసుకొని లొంగిపోయారు. ఆ తరువాత ముస్లింలు అక్కడ్నుంచి బయలుదేరి మదీనా దారిపట్టారు.

## 39. ప్రప్రథమ కాబా(ఉమ్రా)యాత్ర

హుదైబియా రిజ్వాన్ శపథంలో పాల్గొన్నవారంతా కాబాయాత్రకు సిద్ధంకావాలి" అంటూ దైవప్రవక్త (స) ప్రకటన గావించారు. ఆ శుభఘడియల కోసమే ముస్లింలు ఎంతో నుండి ఎదురుచూస్తున్నారు. గతసంవత్సరం "హజ్‌యాత్ర" చేయడానికిపోతే మక్కా ఖురైషీయులు ఎన్నోషరతులు విధించి వారిని నగరం వెలుపలి నుంచే వెనక్కిపంపివేశారు. దాంతో ఆయేడు ముస్లింలు కాబా దర్శనభాగ్యానికి నోచుకోలేకపోయారు. ఇప్పుడా అదృష్టం సమీపించింది. దైవప్రవక్త (స) ప్రకటన వినగానే వారు రెట్టింపు ఉత్సాహంతో మక్కా బయలుదేరడానికి సిద్ధమయ్యారు.

గతసంవత్సరం 1400మంది మాత్రమే అయితే ఈ సంవత్సరం 2000మంది బయలు దేరారు. వారిలో దైవప్రవక్త (స) వందమంది సాయుధ అశ్వరూఢుల్ని ఎంపికచేసి వారికి ముహమ్మద్ బిన్ మస్లిమా (రజి)ను సేనాపతిగా నియమించారు.

శత్రువులు మోసానికి పాల్పడి హఠాత్తుగా దాడిచేస్తే వాళ్ళను ఎదుర్కోవడానికి ముందుజాగ్రత్తగా దైవప్రవక్త (సల్లం) ఈ సాయుధ అశ్వరూఢులను ఒకరోజు ముందుగానే పంపించారు. బయలుదేరే ముందు ఆయన సేనాపతిని మక్కాలో ప్రవేశించకుండా పట్నం దగ్గరలో ఉన్న ఏదైనా లోయలో విడిది చెయ్యవలసిందిగా ఆదేశించారు.

ఈ యోధులు వెళ్ళిపోయాక మరునాడు దైవప్రవక్త(స) మిగతా అనుచరుల్ని తీసుకొని మదీనా నుండి బయలుదేరారు. వీరందరూ ప్రయాణఆయుధాల్ని మాత్రమే దగ్గర ఉంచు కున్నారు. ముందు నాజియా బిన్ జుజుబ్ (ర) ఖుర్బానీ ఒంటెలతో ప్రయాణంచేస్తున్నారు.

ముహమ్మద్ బిన్ మస్లిమా (ర) జహ్రాన్ చేరుకొని అక్కడ కొందరు ఖురైష్ వ్యక్తుల్ని కలుసుకున్నారు. వారాయన వెంటనున్న సాయుధసైనికుల్ని చూసి కంగారుపడ్డారు.

"ఇంతకూ ముహమ్మద్ ఎక్కడున్నారు?" అడిగారు ఖురైషీయులు. "దైవచిత్తమైతే ఆయన రేపు ఉదయానికల్లా ఇక్కడికి చేరుకుంటారు" అన్నారు బిన్ మస్లిమా (రజి).

దైవప్రవక్త (సల్లం) కూడా వస్తున్నారని వినగానే ఖురైషీయులు భయపడిపోయారు. తక్షణమే వారు మక్కా వెళ్ళిపోయారు. "ఇంకేముంది, ముహమ్ముద్ మక్కా వచ్చేస్తున్నారు. మామూలుగా కాదు. యుద్ధసన్నాహాలతో వస్తున్నారు" అన్నారు వారు ఖురైష్‌నాయకులతో.

ఈ మాటలు వినగానే ఖురైషీయులకు కంపరమెత్తింది. ఆదరాబాదరగా వారు



ముక్రజ్ అనే వ్యక్తి నాయకత్వంలో ఒక ప్రతినిధివర్గం నియమించి ముహమ్మద్ (స) హుదైబియా ఒప్పందం ఉల్లంఘించి ఇలా సాయుధదళాలతో ఎందుకొస్తున్నారో తెలుసు కొని రమ్మని పంపించారు. ఈ ప్రతినిధి వర్గం దైవప్రవక్త (సల్లం)ను కలుసుకున్నది.

"మహాశయా! మీ బాల్యం ఎంతో అద్భుతమయింది. మీ యౌవనపు జీవితం కూడా నిష్కళంకమయినది. ఇప్పటి వరకూ మీరు ఎవరినీ మోసగించలేదు. మరిప్పుడు ఏమైంది మక్కాలోకి ఆయుధాలతో ప్రవేశిస్తున్నారు? మన ఒప్పందం ప్రకారం ప్రయాణ ఆయుధాలు మాత్రమే మీదగ్గర ఉండాలని, అవి కూడా వరలలో ఉండాలని మీకు తెలుసు కదా!" అన్నాడు ప్రతినిధివర్గం నాయకుడు ముక్రజ్.

"మేము ఆయుధాలను మక్కాలోకి తీసుకొని రాము. మీరు నిశ్చింతగా ఉండండి" అన్నారు దైవప్రవక్త (సల్లం) వారికి అభయమిస్తూ.

"అలాగానా! అయితే పరవాలేదు. మేము ఎప్పుడూ మిమ్మల్ని నిజాయితీపరుడిగా, వాగ్దానపాలకుడిగానే చూశాము" అన్నాడు ముక్రజ్ తృప్తిగా నిట్టూర్పు విడుస్తూ.

ముక్రజ్ తన సహచరులతో మక్కా వెళ్ళిపోయి ఖురైష్ నాయకులకు పరిస్థితి వివరించాడు. ముహమ్మద్ (సల్లం) ఒడంబడికను ఉల్లంఘించబోరని, ఆయన కాబా దర్శనార్థమే వస్తున్నారని, ఇక్కడికి ఆయుధాలను కూడా తీసుకురారని ఆయన ఖురైష్ అగ్రనాయకులకు తెలియజేశాడు.

అయితే ముస్లింలు మక్కాలో ప్రవేశిస్తుండగా వారిని తాము చూడలేమని బహుదైవా రాధకులు అన్నారు. అందువల్ల స్త్రీలు, పిల్లలు, వృద్ధులతో సహా అందరూ నగరం విడిచిపెట్టి బయటికి వెళ్ళిపోయారు. పట్నం వెలుపల కొండలపై డేరాలు వేసుకొని ముస్లిం యాత్రికుల కోసం ఎదురుచూడసాగారు.

దైవప్రవక్త (సల్లం) అశ్వరూఢులైన ముస్లిం యోధులను మక్కా వెలుపలే ఉండి పొమ్మని ఆదేశించారు. వారి మద్దతు కోసం మరో రెండొందల మంది ముజాహిద్‌లను ఉంచారు. బలిపశువుల్ని 'జీతువా' అనే ప్రదేశంలో వదలి, వాటి కాపలా కోసం కొందరిని ఉంచారు. ఆ తరువాత ఆయన మిగిలిన అనుచరుల్ని తీసుకొని మక్కా నగరానికి బయలుదేరారు.

అనుచరులు దైవప్రవక్త (సల్లం)ను తమ మధ్యలోకి తీసుకున్నారు. ఇబ్నె రవాహ (రజి) దైవప్రవక్త (సల్లం) కూర్చున్న ఒంటె ముకుతాడు పట్టుకొని ముందు ముందు నడవసాగారు. అదొక అద్భుత సన్నివేశం! భక్తిపరాయణత ఉట్టిపడేలా దైవగృహం వైపు తరలివస్తున్న విశిష్ఠ యాత్రికావాహిని!!

ఏ ప్రదేశం నుండయితే ఒక నిశీధి రాత్రిన ఒంటరిగా, రహస్యంగా పారిపోవలసి వచ్చిందో ఆ ప్రదేశానికి ఇప్పుడు పట్టపగలు వేలాది అనుచరులతో కలసి దైవప్రవక్త (సల్లం) వస్తున్నారు. ఒకనాడు బిక్కుబిక్కుమంటూ వందలాది శత్రువులను తప్పించుకొని పోవలసి వచ్చిన ముహమ్మద్ (సల్లం) ఈనాడు ధైర్యంగా, ఠీవిగా, రాజాధిరాజులా అట్ట హాసంతో తిరిగివస్తున్నారు.

ఇంతటి మహాభాగ్యం ప్రసాదించిన విశ్వప్రభువుకు ఏ దాసుడు కృతజ్ఞత చెప్పుకోడు? అందులో దైవప్రవక్త....?? "లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్......" మహాప్రవక్త (సల్లం) నోట అప్రయత్నంగా ఈ దివ్యవచనాలు వెలువడ్డాయి.

మరుక్షణమే ఒకేసారి యావత్తు అనుచరుల నోట కూడా అవే పలుకులు! ముస్లింలు నోట వెలువడిన ఈ పలుకులు మక్కాకొండల్లో ప్రతిధ్వనించాయి. దాంతో కొండలపై డేరాలలో నుండి తొంగిచూస్తున్న బహుదైవారాధకుల గుండెలు ఝల్లుమన్నాయి. అసూయ, ఆశ్చర్యాలతో అసహాయ స్థితిలో చూస్తుండిపోయారు ఈ సన్నివేశాన్ని వారు.

ముస్లింలు నగరంలోకి ప్రవేశించారు. దైవగృహాన్ని కళ్ళారా తిలకించి ఆనందించారు.

ఇబ్నెరవాహ (రజి) ఆనందపారశ్యంతో ఓ గేయం పాడారు. విశ్వాసుల ప్రతిభా ఔన్నత్యాలు చాటే పలుకులవి! బహుదైవారాధకుల ఆత్మాభిమానాన్ని రెచ్చగొడ్తూ విసరిన సవాలది!! కాని విశ్వకారుణ్యమూర్తిగా ప్రభవించిన అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)కు ఇది నచ్చలేదు. అలా పలకవద్దని ఆయన్ని వారించారు.

"అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడు. ఆయన తనదాసునికి సహాయపడి, చేసిన వాగ్దానం నిలబెట్టుకున్నాడు. ఆయనే ఇతర సైన్యాలన్నిటినీ చిత్తుగా ఓడించి తన సైన్యాన్ని గెలిపించాడు" అని పలకమని ఆయన చెప్పారు.

ఇబ్నె రవాహ (రజి) అలాగే వాటిని బిగ్గరగా ఉచ్చరించారు. ఇది చూసి ఇతర అనుచరులు కూడా ప్రవక్త ప్రవచనాన్ని ముక్తకంఠంతో ఉద్ఘాటించారు.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) "హజరె అస్వద్" (నల్లరాయి)ని ముద్దాడారు. ఏడుసార్లు కాబాప్రదక్షిణ చేశారు. ప్రదక్షిణ పిదప సఫా, మర్వా కొండల దగ్గరికెళ్ళి వాటి మధ్య ఏడుసార్లు తిరిగారు. మర్వా కొండ చేరువలో నిలబడి ఒక ఒంటెను బలిచ్చారు. ఆ తర్వాత క్షవరం చేయించుకున్నారు. అనుచరులు కూడా అదేవిధంగా ఆయన్ని అనుసరిస్తూ 'ఉమ్రా' విధులు నెరవేర్చారు.

కొండలపై కట్టుకున్న గుడారాల నుండి ఖురైషీయులు ఈ అద్భుత సన్నివేశాన్ని సంభ్రమాశ్చర్యాలతో చూస్తున్నారు. "ముస్లింలు ఈనాడు ఎంత ఆనందంతో, భక్తిపారవశ్యంతో కాబా ప్రదక్షిణ చేస్తున్నారు! దేవుని పట్ల, ఆయనప్రవక్త పట్ల ఎంత దృఢవిశ్వాసం ఉంది వీరి హృదయాల్లో!! అనుకున్నది సాధించేవరకు ఎన్ని త్యాగాలకైనా వెనకాడటం లేదంటే వీరు ఎంతటి వజ్ర సంకల్పులు!!" అని చెప్పుకున్నారు వారిలో కొందరు.

"ముస్లింలంటే ఏదో అనుకున్నాంగాని, వీరిలో ఇంత విశ్వాసం, సాహసం, సమైక్యతలు ఉన్నాయని తెలియదే!" అనుకున్నారు మరికొందరు. అయితే ఈరోజు ముస్లింలను ఇలా చూడవలసి వస్తున్నందుకు ఖురైషీయులు ఎంతో విచారం వెలిబుచ్చారు.

ఇలా ఖురైషీయులు ముస్లింలను గురించి రకరకాల వ్యాఖ్యలు చేశారు. అయితే వారందరి భావోద్రేకాలు, అభిప్రాయాలు ఒకే విధంగా లేవు. వారిలో కొందరి ఆలోచనలు ముస్లింల వైపు మొగ్గాయి. దేవుడు వారి హృదయాల్లో విశ్వాస కాంతిని ప్రసరింపజేశాడు. వారు అవకాశం దొరికితే ఇస్లాం స్వీకరించాలని భావిస్తున్నారు.



హుదైబియా ఒప్పందం ప్రకారం ముస్లింలు మక్కాలో మూడ్రోజులు మాత్రమే ఉండ వలసివుంది. ఆ మూడ్రోజులు ముగిశాయి. కనుక ఖురైష్ నాయకులు ఈ విషయం గుర్తుచేయడానికి సుహైల్‌ని, శువైతిబ్‌ని దైవప్రవక్త (సల్లం) దగ్గరికి పంపారు.

వారిద్దరు వెళ్ళి "నిర్ణీత గడువు ముగిసింది. ఇక మీరు వెంటనే మక్కా ఖాళీచేసి వెళ్ళిపోవాలి" అన్నారు. "వెళ్ళిపోతాం. కాని నేనిక్కడ వివాహం చేసుకొని, ఆ తరువాత ఏర్పాటుచేసే విందు భోజనానికి మిమ్మల్ని కూడా ఆహ్వానించాలనుకుంటున్నాను. మీకు అభ్యంతరం లేదుకదా?" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఖురైష్ ప్రతినిధులు సందిగ్ధంలో పడిపోయారు. "ముస్లింలతో కలసి తాము ఈ విందులో పాల్గొంటే పరిస్థితి ఏరూపం దాల్చుతుంది? ఖురైషీయుల్లో చాలామందిపై ఇప్పటికే ముస్లింల విశ్వాసప్రభావం పడింది. ఇక ఈవిందులో పాల్గొంటే మరెంత మంది ఖురైషీయులు ముస్లింలుగా మారిపోతారో! అయ్యబాబాయ్!! ఇక మక్కాలో ఖురైషీయులకు పుట్టగతులుంటాయా?" ఈ ఆలోచన రాగానే వారిద్దరు భయపడిపోయారు.

"వద్దు. మీ విందుభోజనమూ వద్దు; మీరూ వద్దు. మీకిచ్చిన మూడురోజుల గడువు ముగిసింది. దయచేసి తక్షణమే ఇక్కడ్నుంచి వెళ్ళిపోండి" అన్నాడు వారిలో ఒకడు.

హజ్రత్ సాద్ బిన్ ఉబాదా (ర) కూడా అక్కడే ఉన్నారు. ఈ మాటలు వినగానే ఆయన ఆవేశం అణచుకోలేక "వ్యర్థ ప్రేలాపనలు కట్టిపెట్టు. ఈ భూభాగం నీది కాదు, నీ అబ్బదీ కాదు. దైవప్రవక్త (సల్లం) ఇష్టమొచ్చినప్పుడే వెళ్ళిపోతారు. మీరంతా కట్టకలసి చేసుకునేదేమిటో చేసుకోండి" అన్నారు ఆయన వారిద్దరి వైపు ఉరిమిచూస్తూ.

"సాద్! వీరు మనల్ని కలుసుకోవడానికి వచ్చారు. వారిపై నువ్విలా విరుచుకుపడితే వారికి బాధ కలుగుతుంది. కాస్త శాంతించు" అన్నారు దైవప్రవక్త (స) చిరునవ్వుతో.

తరువాత ఆయన "నా ప్రియఅనుచరులారా! ఇక మనం ఇక్కడ నుండి బయలు దేరాలి. ఏఒక్క ముస్లిం కూడా ఈరోజు సాయంత్రం మక్కాలో ఉండకూడదు" అని ప్రకటించారు. ఈ ప్రకటనతో ముస్లింలు ప్రయాణానికి సిద్ధమయ్యారు. అందరూ మూటాముల్లెలు సర్దుకొని మదీనాకు తిరుగు ప్రయాణమయ్యారు.

ముస్లింలు మక్కా నుండి వెళ్ళిపోయారు. మక్కా వెలవెల పోయింది. నగరం శ్మశాన వాతావరణాన్ని తలపింపజేస్తూ సర్వత్రా నిశ్శబ్దం ఆవరించింది. ఖురైషీయులు మక్కా నుండి వెళ్ళిపోతున్న ముస్లింలను చూసి అసూయతో తల్లడిల్లిపోయారు. కొండలపై గుడారాలు పీకేసి ఉసూరుమంటూ నగరానికి తిరిగొచ్చారు. ఈ మూడు రోజులు వారికి మూడేండ్లు గడిచినట్లు అన్పించింది. అయినా వారికి ముస్లింల గండం తప్పినట్లు సూచనలు కానరావడం లేదు.

## 40. మక్కాలో తొలి కాబాయాత్ర ప్రభావం

ఖురైష్ నాయకుల అనుమానం క్రమంగా నిజం కాసాగింది. ముస్లింలు మక్కాలో మూడురోజులే ఉన్నా వారు వదలిపోయిన ప్రభావంమాత్రం ప్రజల ఆలోచనలకు పదును

పెట్టడం ప్రారంభించింది. అనేక మంది దైవప్రవక్త (స) ప్రచారం చేస్తున్న నూతన ధర్మం గురించి పదేపదే ఆలోచిస్తున్నారు. మరికొందరు అదే నిజమైన ధర్మమని భావిస్తున్నారు.

ఖాలిద్ బిన్ వలీద్ ముస్లింలకు ఒకనాటి బద్ధశత్రువు. ఉహుద్ యుద్ధంలో ఖురైషీయుల హీరోగా వెలిగిపోయాడు. ఇస్లాం పేరెత్తితేనే మండిపడేవాడు. అలాంటి ఖాలిద్ కూడా ఇప్పుడు తీవ్రమైన ఆలోచనలో పడిపోయాడు. గతంలో ముస్లింలతో చేసిన యుద్ధాలను గురించి సమీక్షించాడు.

"బదర్, ఉహుద్, కందకం యుద్ధాలలో తాము సర్వసాధన సంపత్తితో ఎంతగా పోరాడినా అంతిమ విజయాలు కనీస ఒనరులు కూడా లేని ముస్లింలనే వరించాయి. దీన్నిబట్టి మహత్తరమైన అదృశ్యశక్తి ఏదో వారికి సహాయం చేస్తోందని అర్థమవుతోంది. కనుక ఇస్లామే సత్యం, నిజధర్మం కావచ్చు."

ఖాలిద్ మెదడు వేడెక్కింది. వెంటనే నిర్ణయానికి రాలేకపోయాడు. అంతలో ఒకతను గుర్రం దిగి ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ వచ్చాడు.

"నేను మదీనా నుండి వస్తున్నాను. మీ అన్నయ్య వలీద్ బిన్ వలీద్ ఈ ఉత్తరం మీకివ్వమని నన్ను పంపించాడు" అంటూ ఆ మనిషి ఖాలిద్ చేతికి ఒక ఉత్తరం అందించి వెళ్ళిపోయాడు. ఖాలిద్ గబగబా ఆ ఉత్తరం తెరచి చదవడం ప్రారంభించాడు.....

"ప్రియమైన తమ్ముడు ఖాలిద్‌కు- ఉభయకుశలోపరి. దైవప్రవక్త ముహమ్మద్ (స) ఉమ్రా చేయడానికి మక్కా వచ్చినప్పుడు నేను ఆయన వెంట ఉన్నాను. మక్కాలో ఆయన నీగురించి ప్రస్తావిస్తూ 'ఖాలిద్ ఏడ'ని అడిగారు. నేను నీకోసం మక్కాలో చాలా వెతికాను. కాని నీవు కన్పించలేదు. అప్పుడు దైవప్రవక్త నాతో ఇలా అన్నారు: 'ఖాలిద్‌లాంటి ఉత్తముడు, వివేచనాపరుడు ఇంకా ఇస్లాంకు దూరంగా ఉన్నాడంటే చాలాఆశ్చర్యం కలుగుతోంది. ఇస్లాం గురించి, దాని బాగోగుల గురించి ఖాలిద్‌కు తెలియకుండా ఉండవు. అతని శక్తిసామర్థ్యాలు ఇస్లాం కోసం ఉపయోగపడితే ఎంత బాగుండు.'

"తమ్ముడూ! నేను నిజం చెబుతున్నాను. ఇస్లాం లాంటి సమగ్ర జీవిత విధానం, మహోన్నత ధర్మం మరొకటి లేదు. ముహమ్మద్ (స) లాంటి మానవోత్తముడు, కరుణా సముద్రుడు లోకమంతా గాలించినా ఎవరూ దొరకరు. నీవింకా ఆలస్యం చేసి ఆయన ప్రేమాభిమానాలకు దూరంకాకు. సాధ్యమయినంత త్వరగా నువ్వు ఇస్లాం స్వీకరించి ఆ మహనీయునికి ప్రీతిపాత్రుడవుతావని ఆశిస్తున్నాను...

ఇట్లు/మీ అన్నయ్య/వలీద్

ఈ ఉత్తరం మండుతున్న గాయానికి మందులా పనిచేసింది. విపరీతమైన దాహంతో ఉన్నప్పుడు గుక్కెడు మంచినీళ్ళు దొరికితే ఎలా ఉంటుందో అలాంటి అనుభూతికి లోనయ్యాడు ఖాలిద్ బిన్ వలీద్.

"ఔను. ముహమ్మద్ (సల్లం) దైవప్రవక్తే. ఇందులో ఇక నాకు ఎలాంటి సందేహం లేదు. ఆయన మాంత్రికుడు కానేకాదు. ఆయన ప్రచారంచేస్తున్న ధర్మమే సత్యధర్మం" అంతరాత్మ ఘోషతో అతని అంతరంగం దేదీప్యమానంగా వెలిగిపోయింది.



ఈ మాటలే అతని నోట కూడా అప్రయత్నంగా వెలువడ్డాయి. "ఏమిటీ! ఖాలిదేనా ఈ మాటలు అంటున్నది!" మక్కా ప్రజలు ముక్కు మీద వేలేసుకున్నారు.

"నేనిప్పుడు ముస్లింని. ఇస్లామీయ విప్లవ ధ్వజవాహకుడ్ని. ముహమ్మద్ (సల్లం) బోధిస్తున్నది ముమ్మాటికీ దైవసందేశమే. ఇందులో అనుమానించడానికి ఇక ఎలాంటి ఆస్కారం లేదు. కాబట్టి విజ్ఞత, వివేచనలు ఉన్నవాడు ముహమ్మద్ (స)ని అనుసరించక తప్పదు" అన్నాడు ఖాలిద్ నలుగురిలో నిలబడి నిర్భయంగా.

అతని మాటలు విన్న ఖురైషీయులకు వళ్ళు మండిపోయింది. మండుతున్న కళ్ళతో కొరకొర చూసి నోటికొచ్చినట్లు తిట్టిపోశారు. కొందరు మతభ్రష్టుడయ్యారన్నారు. మరి కొందరు మతిభ్రమించింది అన్నారు. ఇక ఖురైషీయుల అగ్రనాయకుడు అబూసుఫ్యాన్ అయితే పళ్ళు నూరుతూ, చిందులు తొక్కుతూ ఖాలిద్‌ని హతమార్చడానికి సిద్ధమయ్యాడు.

అతని ఉగ్రవేషం చూసి ఇక్రమా నవ్వాపులేక పోయాడు. "అబూసుఫ్యాన్! ఆగాగు. ఎందుకంత కోపం? ఇక్కడ ఖాలిద్ ఒక్కడే కాదు, ఇంకా చాలామంది ఉన్నారు ఇస్లాం వైపు మొగ్గినవారు. అప్పుడే ఏమైంది? ఈ సంవత్సరం గడవని. ఈ నగరంలో బహుశా బహుదైవారాధకుడిగా ఒక్కడూ మిగలడనుకో" అన్నాడతను.

ఇక్రమా మాటలు విన్నాక అబూసుఫ్యాన్‌కు మతి పోయినంత పనయింది. పాపం! అబూసుఫ్యాన్ ఏం చెయ్యాలో దిక్కుతోచక అయోమయంలో పడిపోయాడు.

ప్రస్తుతం ఖాలిద్ ఒంటరివాడయ్యాడు. తన ఆలోచనలను సమర్థించే ఆప్తమిత్రుల కోసం తహతహలాడిపోయాడు. ఏమైతేనేం ముందుగా సఫ్వాన్‌ని కదిలించి చూశాడు: "సఫ్వాన్! ముహమ్మద్‌ని చూస్తున్నావుగా? ఆయన ప్రజల హృదయాల్ని సునాయాసంగా చూరగొంటున్నారు. మనమూ ఆయన అనుచరవర్గంలో ఎందుకు చేరిపోకూడదు?"

సఫ్వాన్ తండ్రి, సోదరులు బదర్‌యుద్ధంలో హతమార్చబడ్డారు. అప్పటి నుంచి అతను దైవప్రవక్త (స)పై పగబట్టిన పాములా బుసలుకొడ్తున్నాడు. ఈ స్థితిలో ఖాలిద్ మాటలు అతనికి అగ్నిపైఆజ్యం పోసినట్లయింది." అసాధ్యం. లోకమంతా ఆయనవెంట పడినా నేను మాత్రం ఆ ధర్మాన్ని విశ్వసించను" అన్నాడు సఫ్వాన్ ఉడికిపోతూ.

ఖాలిద్ ఈసారి ఇక్రమాను కదిలించాడు. కాని అక్కడా అతనికి నిరాశే ఎదురయింది. చివరికి అతనొక్కడే మదీనా బయలుదేరాడు. ఈ విషయం ఎవరికీ చెప్పలేదు. అయితే అతను బయలుదేరే సమయానికి ఓ మిత్రుడు ఉస్మాన్ బిన్ తల్హా వచ్చాడు. ఖాలిద్ అతడ్ని చూసి ఓ క్షణం ఆలోచనలో పడిపోయాడు...

"ఇతనికి తన ప్రయాణ రహస్యం చెబితే విని తనకు తోడ్పడుతాడా లేదా? అసలే అతని తండ్రి, పినతండ్రి, నల్గురు అన్నదమ్ములు ఉహుద్ యుద్ధంలో చనిపోయారు. దానివల్ల అతని మనస్సులో ముస్లింలంటే కాస్త గుర్రుండవచ్చు. అయినా అడిగి చూద్దాం ఏమంటాడో" అనుకుంటూ ఖాలిద్ ధైర్యంచేసి మనసులోని మాట బయటపెట్టాడు.

ఉస్మాన్ ఓనిమిషం ఆలోచించి ఇస్లాంపట్ల తన ఆసక్తిని వ్యక్తపరిచాడు. అంతేకాదు, ఖాలిద్‌తో పాటు మదీనా బయలుదేరడానిక్కూడా సిద్ధమయ్యాడు. "సరే, అలాగే వెళ్దాం.

మక్కాలో నాక్కాస్త పని ఉంది. ఆపని పూర్తికాగానే బయలుదేరుదాం" అన్నాడు ఉస్మాన్.

ఆ పని కూడా పూర్తి కావచ్చింది. ఫలానా రోజు నగరం వెలుపల కలుసుకుందామని ముందే నిర్ణయించుకున్నారు. దాని ప్రకారం మిత్రులిద్దరూ ఓ రోజు నగరం వెలుపల కలుసుకొని చక్కా మదీనా దారిపట్టారు.

ఇస్లామీయ ఉద్యమాన్ని అంతమొందించడానికి మక్కా బహుదైవారాధకులు చేస్తున్న ప్రతి యత్నమూ విఫలమవుతోంది. వారి పథకాలన్నీ ఒక్కొక్కటిగా బెడిసికొడుతున్నాయి. ముస్లిం యోధులతో జరిగిన తొలి యుద్ధంలోనే వారు ఘోర పరాజయం చవిచూశారు. ఆ తరువాత ఉహుద్ యుద్ధంలో మొదట విజయ పతాకం కాస్తంత ఊగుతున్నట్లు కన్పించినా చివరికి అపజయమే కలిగింది. కందకం యుద్ధంలో కూడా ఓటమి పాలయ్యారు. పోనీ హుదైబియా ఒప్పందమయినా ఇస్లాం వ్యాప్తిని అరికడుతుందేమో అనుకుంటే అదీ లేదు. పైగా దానివల్ల ముస్లింల సంఖ్య ఇంకా పెరుగుతూనే పోయింది. మరికొద్ది కాలంలోనే వారు యావత్తు అరేబియాలో విస్తరించినా ఆశ్చర్యం లేదు.

ఈ ఆలోచనలతో మక్కా ఖురైషీయులు అవమాన భారంతో రోజురోజుకు క్రుంగి పోతున్నారు. కొందరయితే ఈ అవమానభారం మరింత దుర్భరం కాకముందే దాన్నుంచి బయటపడటానికి ప్రత్యామ్నాయ మార్గాలు కూడ వెతకడం ప్రారంభించారు. అలాంటి వారిలో అమ్ర్ బిన్ ఆస్ ఒకడు. అతను అభిమానం, పౌరుషంగల గొప్పసేనాని. ఉహుద్ పరిణామం తరువాత అతనో నిర్ణయానికి వచ్చాడు.

"మిత్రులారా! ముహమ్మద్ ధర్మం రోజురోజుకు వ్యాపిస్తూనే ఉంది. తగ్గే సూచనలు కన్పించడంలేదు. అందుకని నాకో ఆలోచన తట్టింది. చెప్పమంటారా?" అన్నాడు. "సరే చెప్పు" అన్నారు ఖురైష్ నాయకులు కుతూహలంతో.

"మనం అబిసీనియా వెళ్ళి నజాషీ దగ్గర రాజకీయ ఆశ్రయం పొందాలి. ముహమ్మద్ అరేబియాను జయించినట్లయితే మనం అక్కడే ఉండిపోదాం. నజాషీ రాజ్యంలో మనకు కాస్తయినా గౌరవం ఉంటుంది. ఈ విధంగా మనం ముహమ్మద్ దాస్యం నుండి బయట పడగలం. ఒకవేళ మన జాతివాళ్ళే గెలిస్తే మనం మన ప్రాంతానికి తిరిగిరావచ్చు. అప్పుడు మనం స్వేచ్ఛగా, గర్వంగా తలెత్తుకొని తిరగ్గలగుతాం. ఏ ప్రమాదం ఉండదు. హాయిగా గౌరవంగా జీవించవచ్చు" అన్నాడు అమ్ర్.

"బాగుంది. చాలా బాగుందీ పద్ధతి. అలాగే చేద్దాం" అన్నారు అమ్ర్ అనుచరులు. మరునాడే వారు అబిసీనియా బయలుదేరారు. నజాషీకి కానుకలుగ సమర్పించుకోవ డానికి వెండిబంగారాలతో పాటు విలువైన తివాచీలు కూడా వెంట తీసికెళ్ళారు.

నజాషీ ఖురైష్ నాయకులకు స్వాగతమిచ్చాడు. వారు తెచ్చిన కానుకల్ని సంతోషంగా స్వీకరించాడు. అలా ఖురైషీయులు నజాషీ రాజ్యంలో సుఖంగా గడపసాగారు.

దైవప్రవక్త (స) నజాషీ పేరిట రెండు లేఖలు వ్రాశారు. వాటిని ఇబ్నె ఉమయ్యా (రజి) తీసుకొని అబిసీనియా చేరుకున్నారు. అమ్ర్ ఆయన్ని చూడగానే ఇతను దైవప్రవక్త (స) రాయబారిగా వచ్చిఉంటాడని గ్రహించి నజాషీ దగ్గరికి వెళ్ళాడు.



"మహారాజా! మీ దగ్గరికి మదీనా నుండి ఓ రాయబారి వచ్చాడు. అతను మనందరి గర్భశత్రువు తరపున వచ్చిన దూత. అతడ్ని నాకప్పగించండి, హతమారుస్తాను" అన్నాడు.

అమ్ర్ ఎవర్ని గురించి ఇలా అంటున్నాడో నజాషీ గ్రహించాడు. అతను అమ్ర్ వైపు ఉరిమి చూశాడు. తరువాత అతని చెయ్యి అప్రయత్నంగా పైకి లేచింది. మరుక్షణమే అమ్ర్ చెంప ఛెళ్ళుమన్నది.

ఒక్కసారిగా అమ్ర్ చుట్టూ అంధకారం అలుముకున్నది. కాళ్ళక్రింద భూమి చీలి నట్లు అన్పించింది. కాస్సేపటికి అమ్ర్ కళ్ళు తెరిచాడు. చూస్తే నజాషీ కళ్ళు అగ్నికణాలను కురిపిస్తున్నాయి. "మహాప్రభో! క్షమించండి. బుద్ధి గడ్డితిని ఏదో వాగాను. మీకీ మాటలు నచ్చవని తెలిస్తే నేనసలు నోరు విప్పేవాడ్ని కాను" అన్నాడు అమ్ర్ తడబడుతూ.

"తుచ్ఛుడా! ఎవరనుకున్నావు ఈ రాయబారి? ఒక సత్పురుషుడు, మూసా, ఈసా ప్రవక్తల్లానే దైవదూత జిబ్రీల్ ద్వారా దైవసందేశాన్ని గ్రహించే మహాప్రవక్త అయిన ముహమ్మద్ (స) రాయబారిని నీకు అప్పగించాలా? ఆయన్ని నువ్వు హతమారుస్తావా?"

నజాషీ ఆవేశంతో చెబుతున్నాడు. అతను చెబుతున్న మాటల్లో దైవప్రవక్త పట్ల అతనికున్న అచంచలవిశ్వాసం, అభిమానాలు బహిర్గతమవుతున్నాయి. దాంతో అమ్ర్ ప్రభావితుడయ్యాడు. "మహారాజా! మీరంటున్నది నిజమేనంటారా?" అన్నాడతను.

"ఓరి పిచ్చివాడా! నా మాట నమ్ము. ఆయన సత్యధర్మాన్ని తీసుకొచ్చిన అంతిమ దైవప్రవక్త (సల్లం). శత్రువులంతా లొంగిపోయి, ఆయన ధర్మం నలుదిశలా విస్తరిస్తుందని నువ్వు త్వరలోనే తెలుసుకుంటావు" అన్నాడు నజాషీ.

అమ్ర్ కంటిపొరలు ఒక్కసారిగా తొలగిపోయాయి. అతని అంతరంగంలో విశ్వాస కణం రగుల్కొంది. ముఖం అప్పుడే వికసించిన కలువపువ్వులా కళకళలాడసాగింది. అతనిప్పుడు ఇస్లాం ధర్మానికి చేరువయ్యాడు.

అమ్ర్ బిన్ ఆస్ ఆ తర్వాత నజాషీ దగ్గర సెలవు తీసుకొని అరేబియా వెళ్ళిపోయాడు. అక్కడ ఒక ఒంటెను కొని మదీనా బయలుదేరాడు. దారిలో ఒకచోట ఖాలిద్ బిన్‌వలీద్, ఉస్మాన్ బిన్ తల్హా కన్పించారు. "ఖాలిద్! ఏమిటి విశేషం? ఎక్కడికీ ప్రయాణం?" అడిగాడు అమ్ర్ ఆత్రంగా.

"ముహమ్మద్ దగ్గరికెళ్తున్నాం. మార్గం తేజోవంతంగా ఉంది. మాట సమంజసంగా ఉంది. అలాంటప్పుడు ఇంకెన్నాళ్ళిలా తప్పించుకొని తిరుగుదాం? పద మాతోపాటు, ఇస్లాం స్వీకరిద్దాం" అన్నాడు ఖాలిద్.

"నేనూ అదే ఉద్దేశ్యంతో బయలుదేరాను, పదండి" అన్నాడు అమ్ర్ బిన్ ఆస్. ముగ్గురి మార్గం ఒకటే. లక్ష్యం ఒకటే. గమ్యం కూడా ఒకటే. ముగ్గురూ సంతోషంగా మదీనా బయలుదేరారు.

దైవప్రవక్త (సల్లం) మసీదులో అనుచరుల మధ్య కూర్చొని ధర్మబోధ చేస్తున్నారు. కాస్సేపటికి ఆయన ధర్మబోధను హఠాత్తుగా ఆపి ఇలా అన్నారు:

"అనుచరులారా! మక్కా నగరం తనకు ప్రాణప్రదమైన తురుపు ముక్కల్ని మన వైపుకు విసిరింది. ఖాలిద్ బిన్ వలీద్, ఉస్మాన్ బిన్ తల్హా, అమ్ర్ బిన్ ఆస్- ఈ ముగ్గురూ నగరంలో ప్రవేశించారు. వెళ్ళి పిలుచురండి."

ఈ శుభవార్త వినగానే ప్రవక్త అనుచరులు ఆనంద డోలికల్లో ఊగిపోయారు. ఖాలిద్ అన్న వలీద్ అయితే సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ వెంటనే లేచి తమ్ముడికి స్వాగతం చెప్పడానికి బయటికి పరుగెత్తారు. మార్గమధ్యలోనే ఆయన ఆ ముగ్గురిని కలిశారు.

"త్వరగా నడవండి. దైవప్రవక్త (స)కు మీరు ముగ్గురు వస్తున్నారని తెలిసింది. ముస్లింలందరూ మీకోసం ఎంతో ఆతృతతో ఎదురుచూస్తున్నారు." అన్నారాయన.

"ఏమిటీ! దైవప్రవక్త (స)కు మేమెలాంటి సమాచారం పంపలేదే! మేం వస్తున్న సంగతి వారికెలా తెలిసింది?" ఖాలిద్ ఆశ్చర్యపోతూ అడిగాడు.

"దైవప్రవక్త (స)కు ఆయన ప్రభువు అవసరమైనప్పుడల్లా అగోచర విషయాలు తెలుపుతుంటాడు" వలీద్ (రజి) సమాధానమిచ్చారు.

ఈ నలుగురూ మసీదులో ప్రవేశించగానే అక్కడున్నవారి ముఖాలు ఒక్కసారిగా సంతోషంతో విప్పారాయి. "ఖాలిద్! ఏమిటి సంగతి ఇలా వచ్చావు?" ప్రేమగా అడిగారు దైవప్రవక్త (సల్లం) చిరునవ్వు నవ్వుతూ.

"మేము ముగ్గురం ఇస్లాం స్వీకరించడానికి వచ్చాం" అన్నాడు ఖాలిద్ ముక్తసరిగా.

ఆ తరువాత ఆ ముగ్గురూ సద్వచనం పఠించి ఇస్లాం స్వీకరించినట్లు ప్రకటించారు. దాంతో 'అల్లాహు అక్బర్' అనే నినాదంతో మసీదు మార్మోగింది. వారి ఇస్లాం ప్రకటనతో దైవప్రవక్త (సల్లం)తో పాటు ముస్లింలందరూ పరమానంద భరితులయ్యారు.

## 41. 'మూతా'లో విజయకేతనం

మహాప్రవక్త (సల్లం) ఇస్లామీయ ఉద్యమాన్ని మరింత విస్తృతం చేశారు. మదీనా చుట్టు పట్ల ఉన్న తెగలవారికే గాక సుదూరప్రాంతాల్లో ఉండే తెగలక్కూడా దైవసందేశం అందేజేయడానికి ఆయన ప్రచారబృందాలు పంపించారు. అప్పుడు కొన్ని తెగలు ఇస్లాం స్వీకరించాయి. కాగా మరికొన్ని తెగలు దైవప్రవక్త (స)కు బద్ధ శత్రువులయ్యాయి.

సిరియాలోని 'జాతుత్తలహ్' అనే ప్రాంతానికి ధర్మప్రచారం కోసం ప్రవక్త అనుచర బృందం ఒకటి వెళ్ళింది. అయితే శత్రువులు ప్రచారబృందంలోని వారందరినీ దారుణంగా హతమార్చివేశారు. ఒకడు మాత్రమే ఎలాగో తప్పించుకోగలిగాడు. బస్రాగవర్నర్ దగ్గరికి కూడా దైవప్రవక్త (స) తన ప్రతినిధి హారిస్ బిన్ ఉమైర్ (రజి)ని పంపించారు.

హజ్రత్ హారిస్ (రజి) బస్రా వైపు ప్రయాణంసాగిస్తూ సిరియా సరిహద్దు సమీపంలోని మూతా ప్రాంతానికి చేరుకున్నారు. మూతా రోమ్ రాజ్యంలోని భూభాగమే. కాని మూతా గవర్నర్ షుర్జిల్ బిన్ అమ్ర్ దౌత్యనీతికి తిలోదకాలిచ్చి హజ్రత్ హారిస్ బిన్ ఉమైర్ (రజి)ని బంధించి, ఆ తరువాత హతమార్చివేశాడు.



ఈ రెండు దుర్ఘటనలు దైవప్రవక్త (సల్లం) హృదయాన్ని ఎంతగానో కలచివేశాయి. ధర్మ ప్రచారకులుగా, దౌత్యవేత్తలుగా పోయిన ముస్లింలను ఇలా దౌత్యనీతిని ఉల్లంఘించి అన్యాయంగా హతమార్చడం మానవతకే కళంకం. ఆత్మాభిమానం ఉన్నవారు ఎవరూ ఈ అమానుషాన్ని సహించలేరు. ఈ విద్రోహుల్ని అలా వదలిపెడ్తే మరెన్ని ఘాతుకాలకయినా పాల్పడవచ్చు. అందువల్ల దైవప్రవక్త (సల్లం) తక్షణమే 3000 మంది ముజాహిద్‌లతో కూడిన సైనికదళాన్ని సిద్ధం చేశారు. హజ్రత్ జైద్ బిన్ హారిసా (రజి)ను సేనాపతిగా నియమించారు. ఆ తరువాత ముజాహిద్‌లను ఇలా ఆదేశించారు:

"ఒకవేళ జైద్ అమరగతుడయితే జాఫర్ సేనాపతి అవుతాడు. జాఫర్ అమరగతుడైతే అబ్దుల్లా బిన్ రవాహ సేనాని అవుతాడు. అబ్దుల్లా కూడా అమరగతుడయితే సైనికులు తాము కోరిన వ్యక్తిని సేనాపతిగా ఎన్నుకోవాలి."

యోధులు ఉత్సాహంతో యుద్ధానికి బయలుదేరారు. దైవప్రవక్త (సల్లం) యోధులకు వీడ్కోలు చెప్పడానికి వచ్చారు. ఆయన యుద్ధపతాకాన్ని హజ్రత్ జైద్ (రజి) చేతికి అందించారు. తరువాత సేనలను ఒకచోట ఆపి ఇలా ఉపదేశించారు:

"యోధులారా! ఎల్లప్పుడూ దైవానికి భయపడుతూ ఉండాలి. ఆయనకు ఆగ్రహం కల్గించే పనులకు దూరంగాఉండాలి. దైవవిరోధులతో యుద్ధం చెయ్యండి. అయితే మోసం చేయకూడదు. నీతీ నిజాయితీలకు తిలోదకాలివ్వకండి. స్త్రీలను అగౌరవపరచకండి. వృద్ధుల జోలికిపోకండి. అనవసరంగా చెట్లను నరకకండి. ఇళ్ళను పడగొట్టవద్దు...

"వినండి. శత్రువులతో యుద్ధంచేయడానికి ముందు వారి ముందు మూడు విషయాలు ఉంచండి. మొదట దైవసందేశం విన్పించి ఇస్లాం స్వీకరించమని చెప్పండి. అందుకు అంగీకరిస్తే వారిని ముస్లింలుగా పరిగణించండి. తరువాత దైవమార్గంలో హిజ్రత్ చేయమని చెప్పండి. హిజ్రత్ చేయడానికి సిద్ధమయితే వారు ముహాజిర్‌లవుతారు. ముహాజిర్లకు లభించే హక్కులన్నీ వారికి లభిస్తాయి. ఒకవేళ వారు ఇస్లాం స్వీకరించి హిజ్రత్ చేయడానికి సిద్ధంగా లేకపోతే సమరసొత్తులో వారికి వాటా లభించదు. వారొకవేళ ఇస్లాం స్వీకరించడానికి అంగీకరించకపోతే 'జిజ్యా' చెల్లించమని అడగండి. జిజ్యా ఇవ్వడానికి సిద్ధమయితే స్వీకరించండి. నిరాకరిస్తే యుద్ధం చేయండి."

ముజాహిద్‌లు హిజ్రీశకం 8వ సంవత్సరం, జమాదిల్అవ్వల్ నెలలో మదీనా నుండి బయలుదేరారు. కొన్నాళ్ళకు సిరియా సరిహద్దులు దాటి రోమ్‌సామ్రాజ్యంలో ప్రవేశించారు.

రోమ్ సామ్రాజ్యంలోని "మూతా" ప్రాంతం పాలకుడు షుర్జిల్ బిన్ అమ్ర్ ముస్లింల యుద్ధ సన్నాహాలను గురించి ముందే తెలుసుకొని లక్ష మంది సైనికుల్ని సమీకరించాడు. అదీగాక రోమ్ చక్రవర్తి సహాయం కూడా కోరాడు. రోమ్ చక్రవర్తి తన సోదరుడికి లక్షమంది సైనికుల్ని ఇచ్చి పంపించాడు. ఇలా శత్రుసేనలు అత్యధిక సంఖ్యలో, అపారమైన ఆయుధ సంపత్తితో ముస్లింలను ఢీకొనడానికి సిద్ధమయ్యాయి.

సిరియాలో అడుగుపెట్టే వరకూ ముస్లింలకు ఈ విషయం తెలియదు. వారు లక్ష మంది రోమ్ సైనికుల్ని చూసి నిర్ఘాంతపోయారు. ఇప్పుడేం చేయాలి? పరిస్థితి దైవప్రవక్త

(స)కు తెలియజేయడమా? లేక ఈ భారీసైన్యానికి ఎదురునిలిచి పోరాడటమా? ముజాహిద్‌లు సందిగ్ధంలో పడిపోయారు. రెండురోజుల వరకు ఎటూ తేల్చుకోలేక పోయారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహ (రజి)లోని పౌరుషం బుసలుకొట్టింది.

“సోదరులారా! మనం ఎప్పుడూ సంఖ్యాధిక్యతను దృష్టిలో పెట్టుకొని యుద్ధం చెయ్యలేదు. అశ్వాలపై, ఆయుధాలపై కూడా మనం ఎన్నడూ ఆధారపడలేదు. మన అసలు ఆయుధం దైవధర్మం. పదండి. విజయమో, వీరమరణమో ఏదో ఓ కోరిక నెరవేరుతుంది. దైవనామం స్మరించి ముందుకు సాగండి” అన్నారు ఆయన.

ఇబ్నెరవాహ (రజి) ప్రసంగం వినగానే సేనాపతి జైద్ బిన్ హారిస్ (రజి) ఒక చేతిలో పతాకం, మరొక చేతిలో ఈటె తీసుకొని లేచినిలబడ్డారు. సేనాపతిలోని సమరోత్సాహం చూడగానే మిగిలిన యోధులలో నూతనుత్తేజం జనించింది. ఆ వెనువెంటనే అందరూ రోమ్ సేనలతో ఢీకొనడానికి సిద్ధమయ్యారు.

ఇరు పక్షాలు యుద్ధరంగంలో ప్రవేశించాయి. ఒకవైపు లక్ష మంది రోమ్ యోధులతో కూడిన సైనికవాహిని యుద్ధనురుగులు కక్కుతోంది. రెండోవైపు కేవలం మూడు వేల మంది ముస్లింయోధులు దైవంపై భారంవేసి నడుం బిగించారు.

హజ్రత్ జైద్ (రజి) ఒక చేతిలో ధ్వజం, రెండవ చేతిలో ఖడ్గం పట్టుకొని తుఫానులా శత్రుసైన్యంలోకి దూసుకుపోయారు. భయంకరంగా పోరాడి అనేకమంది శత్రు సైనికుల్ని కూల్చివేశారు. కాని శత్రుసైనికులు అత్యధిక సంఖ్యలో ఉండటం వల్ల జైద్ (రజి) పైన నలువైపుల నుంచి బాణాలు ఎడతెరిపిలేకుండా వచ్చిపడుతున్నాయి. అయినా ఆయన ధైర్యంతో పోరాడారు. చివరికి ఆయన శరీరం నిండా గాయాలతో కుప్పకూలిపోయారు.

తక్షణమే హజ్రత్ జాఫర్ (రజి) సమరధ్వజం ఎత్తుకొని శత్రువులపై విరుచుకుపడ్డారు. ఎదురొచ్చిన శత్రుసైనికుల్ని హతమారుస్తూ ముందుకు పురోగమించారు. కాని శత్రువులు చక్రబంధం వేసి జాఫర్ (రజి) కుడిచేతిని తెగ్గొట్టారు. ఆ చేతిలో ఉన్న పతాకం జారింది. వెంటనే ఆయన దాన్ని ఎడమ చేతిలోకి తీసుకున్నారు. శత్రువులు ఆయన ఎడమ చేతిని కూడా తెగ్గొట్టారు. హజ్రత్ జాఫర్ (రజి) దాన్ని క్రింద పడనీయకుండా మొండి చేతులతో గుండెలకు అదిమి పట్టుకున్నారు. కాని మరుక్షణమే ఓ రోమ్‌సైనికుడు దాడి చెయ్యడంతో హజ్రత్ జాఫర్ (రజి) కూడా అమరగతులయ్యారు.

వెంటనే హజ్రత్ ఇబ్నె రవాహ (రజి) పరుగెత్తి పతాకం చేతిలోకి తీసుకున్నారు. పతాకం తీసుకోగానే రెండవచేతిలో ఉన్న ఖడ్గంతో శత్రువుల మీదికి లంఘించారు. ఆయన చాలా సేపటివరకు వీరోచితంగా పోరాడారు. చివరికి సత్తువ తగ్గిపోవడంతో కాస్త ఢీలాపడి పోయి వెనుకంజవేశారు. ఇది గమనించిన ఒక ముజాహిద్ వెంటనే కాస్త మాంసం తెచ్చి, తిని బలం పుంజుకోమని అన్నాడు.

ఇబ్నెరవాహ (రజి) ఆ మాంసం నోట్లో పెట్టుకున్నారు. అంతలో పెద్దపెట్టున యుద్ధ కలకలం విన్పించింది. ఇబ్నెరవాహ (రజి) నోట్లోని మాంసపు ముక్క తీసిపారేసి “ఇబ్నెరవాహా! ఇంకా నువ్వు ప్రపంచంలోనే ఉన్నావా!!” అని కేకలు పెడుతూ కదనరంగంలోకి దూకారు.



శత్రువులతో పోరాడుతూ చివరికి ఆయన కూడా అమరగతులయ్యారు.

దైవప్రవక్త (స) నియమించిన ముగ్గురు సేనాపతులు కూడా అమరగతులయ్యారు. అప్పుడు ముజాహిద్‌లు ఖాలిద్ బిన్ వలీద్ (రజి) సైన్యాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. హజ్రత్ ఖాలిద్ (రజి) తక్షణమే సమరధ్వజం తీసుకొని సుడిగాలిలా శత్రుపక్షంలోకి దూసుకు పోయారు. ఇదివరకటి సేనాపతులకన్నా భయంకరంగా పోరాడి అనేక మంది శత్రువుల్ని కడతేర్చారు. చీకటిపడగానే ఆరోజు యుద్ధం ముగిసింది.

మరుసటి రోజు సైనికపంక్తుల్ని పునర్వ్యవస్థీకరించి యుద్ధం ప్రారంభించారు. దాని వల్ల సమరస్వరూపం మారిపోయి ముస్లింలు విజయం సాధించారు.

## 42. ఒప్పందం ఉల్లంఘనతో పశ్చాత్తాపం

హుదైబియా ఒప్పందం జరిగిన తొలిరోజుల్లో ఖురైషీయులు, వారి మిత్రపక్షాలు సంధిషరతుల్ని గౌరవిస్తుండేవారు. తరువాత వాటిని ఉల్లంఘించడం ప్రారంభించారు.

హుదైబియా ఒప్పందం జరిగిన కొన్నాళ్ళకు ఇస్లాం వల్ల తమకు ప్రమాదం తప్పిందని, ఇప్పుడిక తమ పాతశత్రువైన ఖుజాఅ తెగపై ప్రతీకారం తీర్చుకోవాలని బకర్ తెగవాళ్ళు భావించారు. ఒప్పందం ప్రకారం ఖుజాఅ తెగ ముస్లింల మిత్రపక్షంగా మారితే, బకర్ తెగ ఖురైషీయులతో చేతులు కలిపింది. ఒక రోజు రాత్రివేళ బకర్ తెగవాళ్ళు ఖురైషీయుల సహకారంతో మక్కా దరిదాపుల్లో నివసించే ఖుజాఅ తెగపై మెరుపు దాడిచేశారు. ఘోరమైన రక్తపాతం జరుపుతూ వారి ఇళ్ళను దోచుకోవడం ప్రారంభించారు.

దాంతో ఖుజాఅ తెగవాళ్ళు భీతావహులై రక్షణ కోసం కాబాలయానికి పారిపోయారు. శత్రువులు కాబా పవిత్రతను ఖాతరు చేయకుండా అక్కడా రక్తపాతం జరిపి అనేకమందిని ఊచకోత కోశారు. ఖుజాఅ తెగవాళ్ళు అనేకమంది కాబాలోనే ప్రాణాలు కోల్పోయారు. మిగిలినవారు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని వీలున్న వైపుకు పారిపోయారు.

ఈ హత్యాకాండ జరుగుతున్నప్పుడు కొందరు ఖుజాఅ తెగవాళ్ళు దైవప్రవక్త (స)ను పేరుపెట్టి పిలుస్తూ “మహానుభావా! దైవసందేశహరుడా!! మమ్మల్ని ఆదుకో. బకర్ తెగ మాపై దౌర్జన్యకాండకు పాల్పడింది. మమ్మల్ని కాపాడు” అని బిగ్గరగా కేక పెట్టారు.

ఈ కేక వందలమైళ్ళ దూరంలోని మదీనానగరంలో ఉన్న దైవప్రవక్త (స) చెవులకు తాకింది. ఆ సమయంలో ఆయన విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ మైమూనా (రజి) ఇంట్లో ఉజూ చేస్తున్నారు. వెంటనే ఆయన “లబ్బయిక్, లబ్బయిక్” (వస్తున్నాను, వస్తున్నాను) అని సమాధానమిచ్చారు.

హజ్రత్ మైమూనా (రజి) ఆశ్చర్యపోతూ “దైవప్రవక్తా! మీరిలా ఎవరి మాటకు సమాధానమిస్తున్నారు?” అని ప్రశ్నించారు. “ఖుజాఅ తెగవాళ్ళ మొర నా చెవులకు తాకింది. దానికి జవాబుగా నేనిలా అన్నాను“ చెప్పారు దైవప్రవక్త (సల్లం).

సరిగ్గా అదే సమయంలో దౌర్జన్యకాండ జరుగుతున్న కాబాలయంలో దైవప్రవక్త (సల్లం) పలికిన ఈ పలుకులు దిక్కులు పిక్కటిల్లేలా ప్రతిధ్వనించాయి. దాంతో బకర్

తెగవాళ్ళు భయపడిపోయి హత్యాకాండ ఆపి వెళ్ళిపోయారు. ఈ హత్యాకాండలో ఖుజాఅ తెగ మనుషులు దాదాపు ముప్ఫయి మంది చనిపోయారు.

ఈ సంఘటన జరిగిన రెండుమూడు రోజుల తరువాత ఖుజాఅ తెగ నాయకులు బుదైల్ బిన్ వరఖా, అమ్ర్ బిన్ సాలమ్, వారి అనుచరులు కొందరు మదీనా చేరుకొని దైవప్రవక్త (సల్లం)కు తమ దయనీయ స్థితిని విన్నవించుకున్నారు.

ఖుజాఅ ప్రజలపై జరిగిన హింసాకాండ సంగతి విని దైవప్రవక్త (సల్లం) చలించి పోయారు. దుర్మార్గులు హుదైబియా ఒప్పందాన్ని ఉల్లంఘించడమే కాకుండా కాబా ప్రతిష్ఠను సైతం మంటకలిపి రక్తపుటేరులు ప్రవహింపజేశారు. అలాంటి రాక్షసుల్ని విచ్చలవిడిగా వదలిపెడ్తే మరెన్ని దారుణాలకయినా పాల్పడవచ్చు.

దైవప్రవక్త (సల్లం) ఓ క్షణం ఆలోచించి "అమ్ర్! భయపడకండి. మీకు తప్పకుండా సహాయం లభిస్తుంది" అని అభయమిచ్చారు. ఈమాట విని ఖుజాఅ తెగనాయకులు కాస్త ఊరట చెందారు. తమకు అనుకూలంగా దైవప్రవక్త (స) గట్టిచర్య తీసుకుంటారని తలచి వారు మక్కా తిరుగు ప్రయాణమయ్యారు.

హుదైబియా ఒప్పందం ప్రకారం తమ మిత్రపక్షమైన ఖుజాఅ తెగను ఆదుకోవడం ముస్లింల విధి. అంచేత దైవప్రవక్త (స) ఖురైషీయుల ముందు మూడు షరతులు పెట్టి, అందులో ఒక దాన్ని అంగీకరింపజేయమని చెప్పి ఒక మనిషిని మక్కా పంపించారు.

దైవప్రవక్త (సల్లం) ప్రతినిధి మక్కా వెళ్ళి ఖురైష్ నాయకుల ముందు ఈ మూడు షరతులు ఉంచారు: "ఖుజాఅతెగ మనుషులు ఎంతమంది వధించబడ్డారో వారి రక్త పరిహారం చెల్లించండి. లేదా బకర్ తెగకు మీ సహాయసహాకారాలన్నీ నిలిపి వేయండి. లేదా హుదైబియా ఒప్పందం రద్దు చేసుకుంటున్నామని ప్రకటించండి."

ఖురైషీయుల తరపున ఓ నాయకుడు "మేము మూడో షరతును అంగీకరిస్తున్నాం" అన్నాడు. మూడోషరతును అంగీకరించామని చెప్పారేగాని, ప్రవక్త ప్రతినిధి వెళ్ళిపోయాక చాలా పశ్చాత్తాపంచెందారు. వెంటనే వారు అబూసుఫ్యాన్ని మదీనా పంపారు.

అబూసుఫ్యాన్ మదీనా చేరుకొని నేరుగా దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళడానికి ముఖం చెల్లక తన కూతురు హజ్రత్ ఉమ్మెహబీబా (రజి) ఇంటికి వెళ్ళాడు. ఆమెను మధ్యవర్తిగా పెట్టి దైవప్రవక్త (సల్లం)తో చర్చలు జరుపుదామని భావించాడు.

హజ్రత్ ఉమ్మెహబీబా (రజి) దైవప్రవక్త (స) సతీమణి. తండ్రిని వదలివచ్చి అనేక ఏండ్లు గడిచాయి. అంచేత ఆమె తనను చూడగానే పరమ సంతోషంతో స్వాగతిస్తుందని తలిచాడు అబూసుఫ్యాన్. కాని ఇంటికి పోతే ఆమె సరిగా మాట్లాడను కూడా లేదు. లోపలికెళ్ళి పడకమీద కూర్చోబోతే, ఆమె వెంటనే పడక చుట్టివేశారు. అబూసుఫ్యాన్ నిర్ఘాంతపోయాడు.

"ఏమిటమ్మా నీ ధోరణి! నాకేమీ అర్థంకావడం లేదు. నాకంటే నీకీ పడకంటేనే ఎక్కువ ఇష్టమా?" అని అడిగాడతను. "నాన్నా! నీవు సత్యతిరస్కారివి. ఇది దైవప్రవక్త (స) పడక. దీనిపై కూర్చోడానికి నీకేమాత్రం అర్హత లేదు" అన్నారు ఉమ్మెహబీబా (రజి).



అబూసుఫ్యాన్ ఈసారి నిజంగానే కొయ్యబారి పోయాడు. "నువ్వు నా దగ్గర్నుంచి వెళ్ళిపోయాక నీ తరహాయే మారిపోయింది" అని గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు. చివరికి ఎలాగో దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళాడు. ఆయనకు ఖురైషీయుల సందేశం విన్పించి ఒప్పందాన్ని పునరుద్ధరించమని మనవి చేశాడు. దైవప్రవక్త (స) ఈ మాట విని మౌనంగా ఉండిపోయారు. అతను ఎన్ని మాటలు చెప్పినా ఒక్కదానికీ సమాధానం ఇవ్వలేదు.

అబూసుఫ్యాన్ చేసేదిలేక హజ్రత్ అబూబకర్ (రజి) దగ్గరికి వెళ్ళి ఆయన్ని మధ్య వర్తిగా చెయ్యడానికి ప్రయత్నించాడు. కాని అబూబకర్ (రజి) అతని మాటలు వినడానికే ఇష్టపడలేదు. తరువాత హజ్రత్ ఉమర్ (రజి) దగ్గరికెళ్ళాడు. అప్పటికే అబూసుఫ్యాన్ సంగతి తెలుసుకున్న ఉమర్ (రజి) అతడ్ని చూడగానే ధుమధుమ లాడిపోయారు.

"ఏమిటీ? నేను నీకు దైవప్రవక్త (స) దగ్గర సిఫారసు చేయాల్నా! నేనసలు నీ కాళ్ళు విరగ్గొట్టి పంపాలనుకుంటున్నా" అన్నారు ఆయన. ఉమర్ వాలకం చూస్తే అంతపని చేసేలా ఉన్నాడని తలచి అబూసుఫ్యాన్ నోరుమూసుకొని అక్కడ్నుంచి జారుకున్నాడు.

ఈసారి అతను హజ్రత్ అలి (రజి) ఇంటికి పోయాడు. ఇంట్లో అలి (రజి), ఆయన భార్య ఫాతిమా (రజి), కొడుకు హసన్ (రజి) ఉన్నారు. అబూసుఫ్యాన్ అలి (రజి)కి తన గోడు చెప్పుకొని దైవప్రవక్త (సల్లం)కు సిఫారసు చెయ్యమని అర్థించాడు.

"అబూసుఫ్యాన్! దైవప్రవక్త (సల్లం) ఏదైనా ఒక నిర్ణయం తీసుకుంటే ఇక అందులో మరొకరు జోక్యం చేసుకోవడానికి సాహసించలేరు" అన్నారు హజ్రత్ అలి (రజి).

అయినా అబూసుఫ్యాన్లో ఇంకా ఆశ చావలేదు. "ఫాతిమా! నువ్వయినా కాస్త నా కోసం సిఫారసు చెయ్యి తల్లీ!" అని అభ్యర్థించాడు. "అబూసుఫ్యాన్! ఇలాంటి వ్యవహారాల్లో స్త్రీలు జోక్యం చేసుకోలేరని మీకు తెలుసు కదా!" అన్నారు ఆమె.

"అయితే నీ పిల్లవాడి చేత 'నేను రెండు పక్షాల మధ్య రాజీ కుదిర్చాను' అని ఒక్క మాట చెప్పించు, చాలు. ఈ ఒక్క మాట చెప్పిస్తే ఈరోజు నుండి నీ పిల్లవాడు యావత్తు అరబ్బులకు నాయకుడన్పించుకుంటాడు" అన్నాడు అబూసుఫ్యాన్.

"అబూసుఫ్యాన్! రాజకీయ వ్యవహారాల్లో పిల్లలు ఏం చెయ్యగలరు? ఈ విషయం మీకూ తెలుసుకదా! అయినా మీ విషయంలో దైవప్రవక్త (స) మౌనం వహించినప్పుడు మరొకరు నోరు మెదపగలరా?" అన్నారు హజ్రత్ ఫాతిమా (రజి).

పాపం! అబూసుఫ్యాన్కు తల తిరిగిపోయింది. ఆశాకిరణం కనుచూపు మేరలో కూడా కన్పించడం లేదు. అతను అలి(ర) వైపు మరోసారి ఆశగా చూస్తూ "అబుల్హసన్! నేను పెద్ద ఆపదలో చిక్కుకున్నాను. ఇందులో నుంచి బయటపడే మార్గం కన్పించడం లేదు. ఈ స్థితిలో నేనేం చెయ్యాలో కాస్త సలహా అయినా ఇవ్వు" అని దీనంగా అడిగాడు.

"ఇప్పుడు నేనేం సలహా ఇవ్వగలను? మీరు మాటతప్పారు. పరిస్థితి చేజారిపోయింది. అయితే ఓ పని చెయ్యి. మసీదుకెళ్ళి 'నేను హుదైబియా ఒప్పందాన్ని పునరుద్ధరిస్తున్నాను' అని బిగ్గరగా చాటిచెప్పు. తరువాత మక్కా వెళ్ళిపో" అన్నారు అలి (రజి).

“ఇలాచేస్తే ప్రయోజనం ఉంటుందంటావా?” అడిగాడు అబూసుఫ్యాన్. “ఉంటుం దని నేను గట్టిగా చెప్పలేను. కాని అంతకుమించి మరోమార్గం లేదు” అన్నారు అలి(ర).

అబూసుఫ్యాన్ మసీదుకెళ్ళి అలి (రజి) ఇచ్చిన సలహా ప్రకారమే ‘నేను హుదైబియా ఒప్పందాన్ని పునరుద్ధరిస్తున్నాన’ని బిగ్గరగా చాటి మక్కా వెళ్ళిపోయాడు.

మక్కాలో అబూసుఫ్యాన్ రాకకోసం ఎదురుచూస్తున్న ఖురైష్ నాయకులు అతను రాగానే సంతోషంతో స్వాగతం పలికారు. కుశలప్రశ్నలయ్యాక అసలువిషయం అడిగారు. అతను అలి సలహాపై తాను మసీదుకెళ్ళి అక్కడ హుదైబియా ఒప్పందాన్ని పునరుద్ధరిస్తున్నా నని చేసిన ప్రకటన గురించి వివరించాడు.

ఖురైష్ నాయకులు ఈ సంగతి విని క్షణంపాటు ముఖాలు చిట్లించుకున్నారు. తర్వాత అందరూ విరగబడి నవ్వారు. అబూసుఫ్యాన్ బిత్తరపోయి వింతగా చూడసాగాడు. అంతలో అందరి ముఖాలు గంభీరంగా మారిపోయాయి.

“ఇదా నువ్వు మదీనా పోయి వెలగబెట్టిన ఘనకార్యం! ఇది జరిగే పనేనా? ఈ మాటవింటే జనం నవ్విపోతారు. అలి నిన్ను ఆట పట్టించడానికే ఇలాంటిసలహా ఇచ్చాడు. ఆమాత్రం కూడా నువ్వు గ్రహించలేకపోయావే!! ఎక్కడైనా ఈవిధంగా ఒడంబడిక పునరుద్ధ రించడం జరిగిందా?” అన్నారు. అబూసుఫ్యాన్ సిగ్గుతో తల వంచుకున్నాడు.

## 43. మదీనా దాటిన యుద్ధరహస్యం

మక్కా బహుదైవారాధకులు మళ్ళీ సమావేశమయ్యారు. హుదైబియా సంధిని భంగం చేసి ముస్లింల మిత్రపక్షమైన ఖుజాఅ తెగకు చెందిన అనేకమందిని వధించినందుకు చాలా పశ్చాత్తాపపడ్డారు. ఒప్పందాన్ని ఉల్లంఘించడమంటే ముస్లింలతో యుద్ధాన్ని కొనితెచ్చుకోవడమే. ఒకవేళ ముస్లింలు తమపై దండెత్తితే ఖుజాఅ తెగవాళ్ళు వారికి తప్పకుండా సహాయపడతారు. ఈ ఆలోచన రాగానే ఖురైషీయులు భయపడిపోయారు. అంచేత వారు ఈ వ్యవహారంపై సుదీర్ఘ చర్చలు జరిపి ఒక నిర్ణయానికి వచ్చారు.

“తక్షణమే మనం ఖుజాఅ తెగవాళ్ళతో సంధి చేసుకోవాలి. అంతేకాదు, ఆ తెగలో ఎంతమంది వధించబడ్డారో వారందరి రక్తపరిహారం కూడా వారసులకు చెల్లించాలి”

ఖురైషీయులు ఈ నిర్ణయాన్ని అమలుపరచడానికి మళ్ళీ అబూసుఫ్యాన్‌నే ఎన్ను కున్నారు. అతను సరాసరి బుదైల్ దగ్గరికి వెళ్ళాడు. బుదైల్ ఖుజాఅ తెగలో బాగా పలుకుబడి ఉన్న నాయకుడు, గొప్ప ధనికుడు కూడా. మక్కాలోనే నివశిస్తున్నాడు. అంచేత అబూసుఫ్యాన్ అతనితో మాట్లాడి రాజీ కుదుర్చుకున్నాడు. వధించబడినవారి రక్తపరిహారం కూడా చెల్లించాడు. సంధి పటిష్టం కావడానికి వీరిద్దరు కలసి ఖుజాఅ తెగలోని ఇతర నాయకుల దగ్గరికి పోయారు.

ఈలోగా ఒప్పందం ఉల్లంఘించి రక్తపాతం జరిపిన వారిపై తీసుకోవలసిన చర్యలను గురించి విశ్వప్రభువు నుండి ఓ ప్రకటన వెలువడింది. కాబా పవిత్రతను భంగపరచిన బహుదైవారాధకులు ఇక కాబామందిరానికి ధర్మకర్తలుగా కొనసాగడానికి



ఎంతమాత్రం అర్హులు కారని కూడా ఆ ప్రకటనలో స్పష్టం చేయబడింది.

“విశ్వాసులారా! బహుదైవారాధకులు అపవిత్రులు గనక ఈ సంవత్సరం వారిని ప్రతిష్ఠాలయం (కాబాగృహం) దరిదాపులకు రానివ్వకండి. ఒకవేళ (మీ వ్యాపారం మందగించి) మీరు లేమికి గురవుతారని భయపడితే (అలా భయపడనవసరం లేదు.) దేవుడు తలిస్తే తన ప్రత్యేక అనుగ్రహంతో మిమ్మల్ని ధనికులుగా చేస్తాడు. దేవుడు సర్వజ్ఞాని, మహా వివేకవంతుడు.” (ఖుర్ఆన్-9:28)

“దేవుని దృష్టిలో సత్యాన్ని నిరాకరించి దాన్నిక స్వీకరించని అవిశ్వాసులే యావత్తు సృష్టిలో అత్యంత నీచులు. వారిలో (ముఖ్యంగా) నీతో (స్నేహ)ఒప్పందం చేసుకొని, దైవభీతి కాస్తయినా లేకుండా దాన్ని మాటిమాటికి ఉల్లంఘించేవారున్నారు. వారు గనక యుద్ధంలో మీ ఎదుటికి వస్తే, వారి అడుగుజాడల్లో నడిచే ఇతరులు వారిని చూసి భీతావహులై పారిపోయేలా వారిని కఠినంగా శిక్షించండి. ఇలా ఒప్పందం అతిక్రమించే వారి పర్యవసానం చూసయినా వారికి కనువిప్పు కలుగుతుంది.” (ఖుర్ఆన్. 8:55-57)

“ఏ జాతయినా మీరు చేసుకున్న ఒప్పందం ఎప్పుడైనా ఉల్లంఘిస్తుందని మీరు భయపడితే ఆ ఒప్పందాన్ని దాని ముందు విసరేయండి. నమ్మకద్రోహం చేసినవారిని దేవుడు ఎన్నటికీ ప్రేమించడు. సత్యతిరస్కారులు (ఏదో చమత్కారంచేసి) తాము తప్పించుకున్నామని భావించరాదు. వారు మాపట్టు నుండి ఎన్నటికీ తప్పించుకోలేరు.” (ఖుర్ఆన్-8:58,59)

దైవప్రవక్త (సల్లం) ఇంటికి వచ్చి “ఆయిషా! వెంటనే ప్రయాణఏర్పాట్లు చెయ్యి” అని చెప్పారు. హజ్రత్ ఆయిషా (రజి) ప్రయాణ ఏర్పాట్లు చెయ్యడంలో నిమగ్నులయి పోయారు. కాస్సేపటికి హజ్రత్ అబూబకర్ (రజి) వచ్చారు. కూతురి ఆర్భాటం చూసి “ఏమిటమ్మా ఈ హడావిడి? ఈ ప్రయాణ ఏర్పాట్లు ఎందుకు? దైవప్రవక్త (సల్లం) ఏదైనా కార్యక్రమం చేపట్టారా?” అని అడిగారు. “నాకేమీ తెలియదు నాన్నా!” అన్నారు హజ్రత్ ఆయిషా (రజి).

అంతలో దైవప్రవక్త (స) వచ్చారు. “దైవప్రవక్తా! నన్నూ ప్రయాణానికి సిద్ధం కమ్మం టారా?” అనడిగారు అబూబకర్. “ఆ... సిద్ధంకండి” అన్నారు దైవప్రవక్త (స).

“ఇంతకూ మన ప్రయాణం ఎక్కడికీ?” అడిగారు అబూబకర్. “ఖురైషీయుల దగ్గరికి పోవాలి. ఈ విషయాన్ని రహస్యంగా ఉంచాలి. జాగ్రత్త! ఎవరి ముందూ ఈ విషయాన్ని ప్రస్తావించకూడదు” చెప్పారు దైవప్రవక్త (సల్లం).

తరువాత ఆయన ముస్లింలందరూ యుద్ధానికి సిద్ధం కావలసిందిగా ప్రకటన చేశారు. దైవాన్ని, పరలోకాన్ని విశ్వసిస్తున్నవారంతా రమజాన్‌కు ముందే మదీనా చేరుకోవా లని చుట్టు పక్కలున్న ముస్లిం తెగలక్కూడా సందేశం పంపించారు.

అయితే హజ్రత్ హాతిబ్ బిన్ అబీబల్తా (రజి) మక్కా ఖురైషీయులకు ఒక మేలు చేసి వారి దౌర్జన్యం నుండి మక్కాలోని తనబంధువుల్ని కాపాడుకోవచ్చన్న ఉద్దేశ్యంతో ఈ రహస్యాన్ని ఒక లేఖలో రాసి మక్కా వెళ్తున్న ఓ స్త్రీకి అందజేశారు. ఆమె ఆ లేఖ తీసుకొని బయలుదేరగానే దేవుడు ఈ విషయాన్ని తన ప్రవక్తకు తెలియజేశాడు.

దైవప్రవక్త (సల్లం) వెంటనే, ఆమెను వెంబడించి ఉత్తరం తీసుకురావడానికి కొందరు అనుచరుల్ని మక్కా దిశగా పంపారు. వారు వెళ్ళి ఆమెను కలుసుకొని ఉత్తరం సంగతి అడిగారు. ఆమె తనదగ్గర ఎలాంటి ఉత్తరం లేదని బుకాయించడానికి ప్రయత్నించింది.

అప్పుడు ప్రవక్తఅనుచరులు ఆమెను తీవ్రంగా మందలిస్తూ "మర్యాదగా ఆ ఉత్తరం మాకిచ్చేయి లేదంటావా బలవంతం చేసయినాసరే మేమా ఉత్తరం బయటికి తీయవలసి వస్తుంది" అన్నారు. దాంతో ఆమె భయపడి, తన కొప్పులో దాచిన ఉత్తరం తీసి వారికి అప్పగించింది. వారా ఉత్తరం తీసుకొని మదీనా వెళ్ళి దైవప్రవక్త (స)కు అందజేశారు.

ఉత్తరం అందిన తరువాత దైవప్రవక్త (సల్లం) హజ్రత్ హాతిబ్ (రజి)ని పిలిపించి "ఏమిటి ఈ నిర్వాకం?" అని అడిగారు. "దైవప్రవక్తా! నా విషయంలో తొందరపడకండి. నేను మతభ్రష్టుణ్ణయి ఇలా చేయలేదు. ఇస్లాం పట్ల నాకిప్పటికీ దృఢవిశ్వాసం ఉంది. మక్కాలో నా బంధువులు ఉన్నారు. నేను ఖురైష్‌తెగవాడ్ని కాను. ఖురైషీయుల సంరక్షణలో అక్కడ ఉంటున్నవాడ్ని. ఖురైషీయుల బారినుండి నా బంధువుల్ని కాపాడేవారెవరూ లేరక్కడ. అంచేత నేను వారికి ఏదైనా సహాయంచేస్తే వారు నాబంధువుల జోలికి రారనే ఉద్దేశ్యంతో మాత్రమే నేనీ లేఖ రాసి పంపాను" అన్నారు హజ్రత్ హాతిబ్ (రజి).

ఈ మాట విని దైవప్రవక్త (స) ఆయన విశ్వాసం, నిజాయితీలను శంకించకుండా వదలిపెట్టారు. అయితే హజ్రత్ ఉమర్ (రజి) ఆవేశంతో లేచి "అనుమతించండి, ఒక్క వ్రేటుతో ఈ గోముఖవ్యాఘ్రం తల నరికిపారేస్తా"నని అన్నారు.

మహాప్రవక్త ముహమ్మద్ (స) హజ్రత్ ఉమర్ (రజి)ని వారిస్తూ "ఉమర్! ఇతను బద్ర్ యుద్ధంలో పాల్గొన్నాడు. నీకేం తెలుసు, దేవుడు బద్ర్ యుద్ధంలో పాల్గొన్న విశ్వాసుల్ని (పరలోకంలో) కలిసి, 'మీరేమి చేసివున్నా, నేను మీతప్పులు క్షమించాను' అని చెప్ప వచ్చు"అని అన్నారు. ఉమర్ (ర) ఈమాట విని "వాస్తవం దేవునికి, ఆయన ప్రవక్తకే తెలుసు" అన్నారు. ఆ సందర్భంగా ఖుర్‌ఆన్‌లో అవతరించిన సూక్తులు గమనార్హం:

"విశ్వాసులారా! మీరు గనక నామార్గంలో పోరాడేందుకు, నాప్రసన్నత కోసం (స్వస్థలం వదలి) బయలుదేరితే నాకూ, మీకూ (ఉమ్మడి) శత్రువులైన వారితో స్నేహం చేయకండి. మీ దగ్గరకొచ్చిన సత్యాన్ని తిరస్కరించినవారికి మీరెలా స్నేహహస్తం అందిస్తారు? మీరు కేవలం మీ ప్రభువయిన దేవుడ్ని విశ్వసించారన్న కారణంగా వారు మిమ్మల్ని, దైవప్రవక్తను దేశం నుండి వెళ్ళగొట్టారే! అలాంటివారికి మీరు రహస్యంగా స్నేహసందేశం పంపుతారా? మీరు రహస్యంగా గాని, బహిరంగంగాగాని చేసే ప్రతిపనీ నాకు తెలుసు. మీలో ఎవరైనా సరే ఇలాంటి చేష్టలకు పాల్పడితే అతను నిస్సందేహంగా సన్మార్గం తప్పినట్లే."

"వారు మీ మీద ఆధిక్యత వహిస్తే, వారు మీ పట్ల శత్రువైఖరి అవలంబించి మిమ్మల్ని తప్పకుండా మాటలతో, చేతలతో (రకరకాలుగా) వేధిస్తారు. మీరు ఏవిధంగానైనా మళ్ళీ అవిశ్వాసులయి పోవాలని వారు కోరుకుంటున్నారు. మీ సంతానం, బంధుత్వాలు ప్రళయ దినాన ఏమాత్రం పనికిరావు. ఆరోజు దేవుడు మీమధ్య (ఈనాడున్న) బాంధవ్యాలన్నీ త్రెంచి వేస్తాడు. ఆయన మీరు చేస్తున్న పనులన్నీ గమనిస్తూనే ఉన్నాడు." (ఖుర్‌ఆన్. 60:1-3)



# 44. మక్కా దండయాత్ర

దైవప్రవక్త (స) చేసిన ప్రకటన వినగానే ముజాహిద్‌లు ఎంతో ఉత్సాహంతో ప్రయాణ సన్నాహాలు ప్రారంభించారు. మదీనా వెలుపల నివసించే అనేకతెగలు కూడా సమరోత్సా హంతో ఉరకలువేశాయి. ఒంటెలు, గుర్రాలు, ఆయుధాలు అన్నీ సిద్ధం చేసుకొని మదీనా వచ్చేశారు యోధులందరూ. అది హిజ్రీశకం 8వ సంవత్సరం, రమజాన్ నెల పదకొండవ తేది. దైవప్రవక్త (స) పదివేల మంది అనుచరులతో మదీనా నుండి బయలుదేరారు.

పదివేల మంది అనుచరులే! ముస్లిం సేనలో ఇంతమంది యోధులు ఇదివరకెన్నడూ లేరు. ఇంతమంది యోధులతో, అపార ఆయుధాలతో ఖురైషీయుల మెడల్ని సులభంగా వంచవచ్చు. కాని దైవప్రవక్త (స) సైనికసంఖ్యపైగాని, ఆయుధశక్తిపైగాని ఎన్నడూ ఆధారపడలేదు. ఆయనకు, ఆయన అనుచరులకు ఆధారమల్లా దేవుడు మాత్రమే. దైవవిశ్వాసమే వారి బలం. అదే వారి విజయ రహస్యం. అందుకే దైవప్రవక్త (స) ఇలా ప్రార్థించారు: "దేవా! ఖురైషీయులను అజాగ్రత్తగా ఉంచు. వారి గూఢచారులను ఏమరుపాటుకు గురిచెయ్యి. వారి సకల సాధనసంపత్తిని నిరుపయోగం చెయ్యి."

ఇస్లామీయ సైనికవాహిని మక్కా వైపు పురోగమించింది. దైవప్రవక్త (స) ఈ పథకాన్ని అంత రహస్యంగా ఉంచారంటే కారణం మక్కాపై హఠాత్తుగా మెరుపు దాడిచేసి విజయం సాధించాలన్న కోరిక కాదు. మక్కాను తన అనుచరులు ఎలాగూ జయిస్తారన్న నమ్మకం ఉంది. కాని ఎలాంటి రక్తపాతం జరగకుండా ఉండాలన్నదే ఆయన ఆకాంక్ష. ఖురైషీయులు యుద్ధసన్నాహాలు ప్రారంభించక ముందే ముస్లింలు అకస్మాత్తుగా మక్కా సమీపిస్తే మక్కా అవిశ్వాసులు లొంగిపోతారు లేదా ప్రాణభయంతో పారిపోతారు. ఈవిధంగా రక్తపాతం జరగకుండా ఉంటుంది. అదే ఆయన కోరిక.

యుద్ధరహస్యాలు తెలుసుకొని వాటిని మక్కా చేరవేయడానికి శత్రువులెవరైనా ఉండవచ్చు. ఆ విషయం పరిశీలించి సమాచారం తీసుకురావడానికి దైవప్రవక్త (స) కొందరు గూఢచారుల్ని పంపించారు. వారు గుర్రాలపై సైన్యానికిముందు వేగంగా వెళ్ళారు. దారి పొడుగూతా శత్రుజాడలను గమనిస్తూ పోతుంటే ఓచోట ఒక వ్యక్తి తారట్లాడుతూ కన్పించాడు. వెంటనే కొందరు అతడ్ని బంధించి దైవప్రవక్త (స) సన్నిధికి తెచ్చారు.

దైవప్రవక్త (స) అడిగినప్పుడు ఆవ్యక్తి హవాజన్‌తెగ గూఢచారి అని, ముస్లిం యోధుల్ని గురించి సమాచారం సేకరిస్తున్నాడని తెలిసింది. గట్టిగా అడిగితే అతనిలా అన్నాడు:

"హవాజన్ తెగవాళ్ళు యుద్ధసన్నాహాలు చేస్తున్నారు. వారు సఖీఫ్ తెగ సహాయం అడిగారు. డెమాస్కస్ నుండి ఆయుధాలు రావలసిఉన్నందున మరికొన్నాళ్ళు వ్యవధి కావాలని అన్నారు వారు. సఖీఫ్‌తెగ సహాయం కోసమే హవాజన్ తెగ ఎదురుచూస్తోంది."

దైవప్రవక్త (స) శత్రుగూఢచారి చెప్పిన మాటలు విని అతడ్ని నిర్బంధించి జాగ్రత్తగా కనిపెడుతూ ఉండమని ముజాహిద్‌లకు ఉత్తర్వులిచ్చారు.

సైన్యం ముందుకు సాగింది. దారిలో ప్రవక్త పినతండ్రి హజ్రత్ అబ్బాస్ (ర) కలుసు కున్నారు. ఆయన ఇస్లాం స్వీకరించి కుటుంబసమేతంగా మక్కా నుండి వస్తున్నారు.

దైవప్రవక్త (స) అమితానందంతో పినతండ్రిని ఆలింగనం చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యుల్ని ఎంతో ఆదరించి మదీనా పంపివేశారు. అబ్బాస్ (రజి) సైన్యంలో ఉండిపోయారు.

సైన్యం మరికాస్త ముందుకుసాగిన తర్వాత అబూసుఫ్యాన్ బిన్ హారిస్, అబ్దుల్లా బిన్ ఉమయ్యా ఎదురయ్యారు. ఇబ్నె హారిస్ దైవప్రవక్త (సల్లం) పినతండ్రి కుమారుడు. అబ్దుల్లా స్వయాన మేనత్త కొడుకు. వీరిద్దరు ఇస్లాం స్వీకరించాలన్న ఉద్దేశ్యంతో తమ భార్యాపిల్లలతో సహా మక్కా నుండి వస్తున్నారు.

కాని మక్కాలో వీరిద్దరు ఇస్లాంకు బద్ధశత్రువులుగా పనిచేసి ఉన్నందున దైవప్రవక్త (స) వారిని కలుసుకోవడానికి ఇష్టపడలేదు. హజ్రత్ అబ్బాస్ (రజి), హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) వారిద్దరి తప్పులు క్షమించమని దైవప్రవక్త (స)కు నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. కాని దైవప్రవక్త (సల్లం) వారి సిఫారసు త్రోసిపుచ్చుతూ ఇలా అన్నారు:

“నాకు వారి అవసరం లేదు. ఇబ్నెహారిస్ మమ్మల్ని చాలా బాధపెట్టాడు. దైవమార్గం లో ఎన్నో అవరోధాలు సృష్టించాడు. ఇబ్నెఉమయ్యా మమ్మల్ని ముప్పతిప్పలు పెట్టడంలో ఇతరులకు ఏమాత్రం తీసిపోలేదు.”

ఇబ్నె హారిస్ దైవప్రవక్త (సల్లం) మాటలు విని తీవ్రమైన మనస్తాపానికి లోనయ్యాడు. “అయ్యో దైవమా! నీదారి లేకపోతే ఇక నాకు ఏదారి? నాకిప్పుడు కన్పిస్తున్న దారల్లా ఒక్కటే. నేను నాకొడుకును తీసుకొని ఏ ఎడారిప్రదేశానికో వెళ్ళిపోతాను. అక్కడే పడివుండి ఆకలిదప్పులతో అలమటిస్తూ ప్రాణం విడుస్తాను. నా కొడుకు కూడా నాలాగే చస్తాడు” అంటూ విలపించాడు.

ఇబ్నె హారిస్ విలాపం విని కారుణ్యమూర్తి హృదయం కరిగిపోయింది. వెంటనే వారిని అనుమతించారు. అప్పుడు వారిద్దరు దైవప్రవక్త (సల్లం) ముందు ఇస్లాం స్వీకరించి సంతోషంతో పరవశించిపోయారు.

ముస్లిం యోధులు ‘ముర్రజ్జహ్రాన్’లో విడిది చేశారు. ముర్రజ్జహ్రాన్ మక్కాకు ఎనిమిది మైళ్ళ దూరంలోఉన్న ఓ సువిశాలమైన మైదానం. మాజాహిద్‌లు అక్కడే శిబిరాలు వేసు కున్నారు. ఒంటెలను, గుర్రాలను మైదానంలో అక్కడక్కడ కట్టివేశారు. భోజనాలు చేసి విశ్రాంతి తీసుకున్నారు.

హజ్రత్ అబ్బాస్ (రజి) ముజాహిద్‌ల ఉత్సాహం, సంఖ్యాబలం చూసి ఆలోచనలో పడ్డారు. “దైవప్రవక్త (స) ముజాహిద్‌లతో మక్కాలో ప్రవేశిస్తే ఖురైషీయులు కోపోద్రేకాలతో ఊగిపోతారు. వారి పౌరుషం పడగలు విప్పుతుంది. ఫలితంగా ఖురైష్ ప్రజలు సర్వనాశన మవుతారు. అవమానభారంతో క్రుంగిపోతారు. అలాకాకుండా సంధి కోసం వారిని పిలవాలి. దైవవిధేయతలోనే వారి శ్రేయస్సు, గౌరవప్రతిష్ఠలు ఉన్నాయని నచ్చజెప్పాలి.”

సూర్యాస్తమయమయింది. చూస్తుండగానే నలువైపుల నుండి చీకట్లు కమ్ము కున్నాయి. ప్రతితెగ విడివిడిగా మంటలు రాజేయవలసిందిగా దైవప్రవక్త (సల్లం) ఆదేశించారు. అనుచరులు అలాగే చేశారు. చీకట్లను పారదోలుతూ అనేక అగ్నిమంటలు వెలిశాయి. మైదానమంతా ఒక్కసారిగా కాంతిమంతమయింది.



# 45. అబూసుఫ్యాన్ లొంగుబాటు

దైవప్రవక్త (స)కు దుల్దుల్ అనే పేరుగల ఓ కంచరగాడిద ఉంది. హజ్రత్ అబ్బాస్ (రజి) దాని మీద ఎక్కి గస్తీ చెయ్యడానికి బయలుదేరారు. ఆయన ఓ ఎత్తయిన గుట్టపై నిలబడి, ఏ గొర్రెలకాపరో, కట్టెలమ్ముకునేవాడో కన్పిస్తాడేమోనని ఓమారు చుట్టూ కలియ జూశారు. వారి ద్వారా ఖురైషీయులకు పరిస్థితి వివరించి ముస్లిం సైనికులకు లొంగి పొమ్మని చెపుదామని భావించారు ఆయన.

కాస్సేపటికి ఆయన నిలబడిన గుట్టకు దగ్గర్లో రెండు మానవాకారాలు చూచాయిగా కన్పించాయి. ఆ ఇద్దరు వ్యక్తులు పరస్పరం మాట్లాడుకుంటున్నారు. హజ్రత్ అబ్బాస్ (రజి) చప్పుడు చెయ్యకుండా వారి సంభాషణను జాగ్రత్తగా వినసాగారు.

“చూశావా ఆ దృశ్యం? ఇలాంటి అగ్నిమంటల్ని, సైనికుల్ని నేను ఇదివరకెప్పుడూ చూడ లేదు” అన్నాడు వారిలో ఒకడు. “ఇవి ఖుజాఅ తెగ రాజేసిన అగ్నిమంటలు కావచ్చు. వారు మనపై ప్రతీకారంతో యుద్ధానికి సిద్ధమయ్యారు” అన్నాడు రెండోవాడు.

“కాదు, కాదు. ఇది ఖుజాఅ తెగ రాజేసిన మంటలు కాజాలవు. ఒకేసారి ఇన్ని అగ్ని మంటలు! పైగా నురుగులు కక్కుతున్న ఇంత పెద్ద సైనికవాహిని!! కాదు. ఇవి ఖుజాఅ సేనలంటే నేను నమ్మలేను” అన్నాడు మొదటివాడు.

“అబూసుఫ్యాన్!” కేక వేశారు హజ్రత్ అబ్బాస్ (రజి) ఇక ఉండబట్టలేక. “ఎవరూ? అబ్బాస్! నువ్వా!!” అడిగాడు అబూసుఫ్యాన్ బిత్తరపోతూ.

“ఔను, నేనే అబ్బాస్‌ని. ఇవి ముహమ్మద్ (సల్లం) బిన్‌అబ్దుల్లా (రజి) అగ్నిమంటలు” అన్నారు హజ్రత్ అబ్బాస్ (రజి). “అబ్బాస్! నువ్వు ఇక్కడ.....? చాలా ఆశ్చర్యంగా ఉందే!” అన్నాడు అబూసుఫ్యాన్ హజ్రత్ అబ్బాస్ (రజి) దగ్గరికి వస్తూ.

‘ఓరి పిచ్చివాడా! ఇంకా నీకు మత్తు వదల్లేదా? ఇది దైవసందేశహరుని సైన్యం. ఈ సైన్యం గనక మక్కాలో ప్రవేశిస్తే ఖురైషీయులు రెచ్చిపోకమానరు. అప్పుడు వారికి సర్వ నాశనం తప్పదు. చివరికి వారి విషాదగాథ వినేవారు కూడా ఎవరూ మిగలరు.”

“అబ్బాస్! నువ్వు చెబుతున్నది నిజమే. అయితే ఇప్పుడు నన్నేం చెయ్యమంటావో నువ్వే చెప్పు.” “నావెంట నడు. దైవప్రవక్త (సల్లం) దగ్గరికి తీసికెళతాను. అక్కడ అన్ని విషయాలు మాట్లాడుకుందాం” అన్నారు హజ్రత్ అబ్బాస్ (రజి).

అబూసుఫ్యాన్ హజ్రత్ అబ్బాస్ వెనక తెల్లగాడిదపై ఎక్కి కూర్చున్నాడు. అతనితో పాటు వచ్చిన రెండోవాడు మక్కా తిరిగివెళ్ళిపోయాడు. అబ్బాస్ (రజి) అబూసుఫ్యాన్‌ని తీసుకొని తెగలవారిగా ఏర్పడిన సైనికదళాల ప్రక్కనుంచి పోతుంటే ముజాహిద్‌లు అబూసుఫ్యాన్‌ని చూసి ఆశ్చర్యపోయారు. కాని వారిద్దరు ఎక్కిన వాహనం చూసి ఎవరూ నోరు మెదపలేక పోయారు. ఎందుకంటే అది దైవప్రవక్త (సల్లం) వాహనం.

అలా సైనిక దళాలను దాటుకుంటూ పోతుంటే వారి వాహనంపై హజ్రత్ ఉమర్ (రజి) దృష్టి పడింది. అంతే, ఆయన తోకతొక్కిన త్రాచుపాములా కస్సున లేచారు.

“ఓరీ దైవవిరోధీ! అబూసుఫ్యాన్!! దైవసైన్యానికి చిక్కిపోయావులే. ఉండు నీ భరతం పడతా” అంటూ పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ ప్రవక్త (స) శిబిరం వైపు నడిచారు.

హజ్రత్ అబ్బాస్ (రజి) ఆయన ఉద్దేశ్యం కనిపెట్టి అంతకంటే వేగంగా వెళ్ళి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి చేరుకున్నారు. హజ్రత్ అబ్బాస్ (రజి) చేరుకున్న మరుక్షణంలోనే హజ్రత్ ఉమర్ (రజి) దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి-

“దైవప్రవక్తా! నాకు అనుమతివ్వండి. ఒక్కవ్రేటుతో ఈదుర్మార్గుడి శిరస్సు ఖండిస్తాను” అన్నారు. “దైవప్రవక్తా! నేనితనికి అభయమిచ్చాను” అన్నారు అబ్బాస్ (రజి).

తిరిగి ఆయన ఉమర్ (రజి) వైపు చూస్తూ “ఈరోజు దైవప్రవక్త (స)తో మరొకరు మాట్లాడటానికి వీల్లేదు” అన్నారు. ఈమాట వినగానే ఉమర్ (ర) మరింత రెచ్చిపోయారు. అబ్బాస్ (రజి) కూడా ఆవేశంతో ఊగిపోయారు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. అయితే పరిస్థితి విషమించకముందే దైవప్రవక్త (సల్లం) కలగజేసుకున్నారు.

“అబ్బాస్! వెళ్ళండి. అబూసుఫ్యాన్‌ని తీసుకొని మీ శిబిరానికి వెళ్ళిపోండి. మళ్ళీ రేపు రండి” అన్నారు ఆయన. మరునాడుదయం హజ్రత్ అబ్బాస్ (రజి) అబూసుఫ్యాన్‌ని వెంటబెట్టుకొని దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చారు.

“అబూసుఫ్యాన్! అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యదైవం లేడని నీకింకా నమ్మకం కలగ లేదా?” అన్నారు దైవప్రవక్త (సల్లం).

“దైవప్రవక్తా! మీరెంత ఉదారస్వభావులు, ఎంత విశాల హృదయం కలవారు!! నాకిప్పుడు నమ్మకం కలిగింది. అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యదైవం ఉంటే ఆయన నాకు సహాయపడేవాడు” అన్నాడు అబూసుఫ్యాన్.

“మరి నా దైవదౌత్యం పట్ల నీకింకా విశ్వాసం కలగలేదా?”

“మీరెంత దయార్ద్రహృదయులు! అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ దైవప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను” అన్నారు అబూసుఫ్యాన్ (రజి).

“దైవప్రవక్తా! అబూసుఫ్యాన్ నాయకత్వపు హోదా అంటే పడిచస్తాడు. తానూ ఒక నాయకుడనిపించుకునేలా అతనికి ఏదైనా ఇవ్వండి” అన్నారు అబ్బాస్ (రజి) ఆ తర్వాత.

“సరే, కాబాగృహంలో ప్రవేశించేవారికి, తమ సొంతఇళ్ళలోనే దాక్కొని తలుపులు మూసుకునేవారికి అభయమిస్తున్నాను. అలాగే అబూసుఫ్యాన్ ఇంట్లో శరణుజొచ్చేవారికి కూడా అభయమిస్తున్నాను” అన్నారు దైవప్రవక్త (స).

తరువాత అబ్బాస్ (రజి), అబూసుఫ్యాన్ (రజి)లు అక్కడ్నుంచి వెళ్ళిపోయే ముందు దైవప్రవక్త (స) అబ్బాస్ (రజి)ని పిలిచి “ఇదిగో ఈ లోయ ఇరుకుప్రదేశం దగ్గర అబూసుఫ్యాన్‌ని ఆపిఉంచండి. ఇస్లాంఔన్నత్యం ఏమిటో అతనికి తెలుస్తుంది” అని చెప్పారు.

హజ్రత్ అబ్బాస్ (రజి) అబూసుఫ్యాన్‌ని తీసుకొని ప్రవక్త (స) ఆదేశించిన ప్రదేశానికి పోయి నిలిచారు. ముస్లిం సైనికులు మక్కా నగరానికి బయలుదేరారు. ఒక్కొక్క తెగ ఒక్కొక్క సైనికదళంగా ఏర్పడి వారిద్దరి ముందు నుంచి పోతోంది. అలా తమల్ని దాటి



పోతున్న సైనికదళాల్ని చూసి అబూసుఫ్యాన్ ఈ సైనికులు ఏతెగకు చెందినవారని అడిగితే వారు ఫలానా తెగవారని అబ్బాస్ (రజి) సమాధానమిస్తున్నారు.

అన్నిటికీ చివర్లో దైవప్రవక్త (స) నేతృత్వంలోని సైనికదళం వచ్చింది. ఈ సైనికులు ఆపాదమస్తకం ఉక్కు కవచాలు ధరించి ఉన్నారు.

“ఈ సైనికులు ఎవరు?” అడిగారు అబూసుఫ్యాన్ (రజి). “వీరు ముహాజిర్‌లు, అన్సార్‌లు. ఇది దైవప్రవక్త (స) ఆధ్వర్యంలోని ప్రత్యేక దళం” చెప్పారు అబ్బాస్ (రజి).

“ప్రవక్త ప్రత్యేక దళమే! ఇలాంటి సైనికుల్ని ఎదిరించగల ధైర్యసాహసాలు ఎవరి కుంటాయి?”--- “మరేమనుకుంటున్నావ్! ఇదే దైవదౌత్యపు ఔన్నత్యమంటే.”

“నిజమే అబ్బాస్! నువ్వు చెబుతున్నది ముమ్మాటికీ నిజమే. అసలు విషయం ఇదే” అన్నారు హజ్రత్ అబూసుఫ్యాన్ (రజి) ఇస్లాం ఔన్నత్యాన్ని అంగీకరిస్తూ.

## 46. సత్యం రాకతో అసత్యం నిష్క్రమణ

మక్కా నగరం సమీపించింది. సైనికులు ‘జీతువా’ ప్రదేశానికి చేరి ఆగిపోయారు. అక్కడ దైవప్రవక్త (స) సైన్యాన్ని పునర్వవస్థీకరించారు. నాలుగు ప్రధానదళాలుగా విభజిస్తూ పునర్వవస్థీకరించారు.

ఒక దళానికి ఖాలిద్ బిన్ వలీద్ (రజి)ని సేనాపతిగా నియమించి మక్కాలో దిగువ భాగం ద్వారం గుండా ప్రవేశించమని ఆదేశించారు. మరొక దళానికి జుబైర్ బిన్ అవ్వామ్ (రజి)ని సేనాపతిగా చేసి ఉత్తరంవైపు ద్వారం గుండా ప్రవేశించమని ఆజ్ఞాపించారు. మూడవ దళానికి సాద్ బిన్ ఉబాదా (రజి)ని సేనాపతిగా నియమించి పశ్చిమ ద్వారం గుండా నగరంలో ప్రవేశించమని ఆదేశించారు. నాలుగవ దళానికి దైవప్రవక్తే (స) సేనాపతి అయ్యారు. ఇందులో ముహాజిర్ ముస్లింలున్నారు. వీరంతా నగరం ఎగువభాగం ద్వారం గుండా ప్రవేశించవలసిఉందని దైవప్రవక్త (స) ఆ దళం యోధులకు తెలియజేశారు.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) ముజాహిద్‌లకు తగిన ఆదేశాలు ఇచ్చారు. ముఖ్యంగా తమతో యుద్ధానికి దిగినవారితో మాత్రమే పోరాడాలని, అనివార్య పరిస్థితి వస్తే తప్ప ఒక్క రక్తపు బొట్టు కూడా చిందించకూడదని ఉపదేశించారు. అయితే దైవప్రవక్త (సల్లం) ప్రత్యేకంగా కొందరి పేర్లు తెలియజేసి వారిని మాత్రం ఎక్కడ కన్పించినా సరే హతమార్చాలని ఆదేశించారు.

సాధ్యమైనంతవరకూ ఎలాంటి రక్తపాతం జరగకుండా మక్కాను జయించాలని దైవ ప్రవక్త (సల్లం) అనుకుంటున్నారు. దాని కోసం ఆయన సేనాపతుల భావోద్రేకాలను ఓకంట కనిపెడుతూ జాగ్రత్తగా మసలుకోసాగారు.

ముజాహిద్‌లు నగరంలో ప్రవేశించడానికి సిద్ధమయ్యారు. దైవప్రవక్త (సల్లం) దృష్టి అబూసుఫ్యాన్ (రజి)పై పడింది. అబూసుఫ్యాన్ (రజి) తల దించుకొని ఉన్నారు. ఆయన ముఖం కళావిహీనమయి ఉంది. “అబూసుఫ్యాన్! ఏమిటీ అలా ఉన్నావు? నీవు మన సలహాసంప్రదింపుల్లో పాల్గొన లేదేమిటీ?” అడిగారు దైవప్రవక్త (సల్లం).

“దైవప్రవక్తా! ఖురైషీయులు ఇప్పుడు మీస్వాధీనంలోకి రాబోతున్నారు. కాని మన సైన్యంలో కొందరు ప్రతీకారంతో వేగిపోతున్నవారు కూడా ఉన్నారు. విజయం లభిస్తే దయచేసి శత్రువులు మనల్ని చూసి నవ్వడానికి ఆస్కారం ఇవ్వవద్దని నేను మనవి చేసుకుంటున్నాను. వారి పట్ల మృదువుగా వ్యవహరించమని అభ్యర్థిస్తున్నాను” అన్నారు అబూసుఫ్యాన్ (రజి).

“లేదు అబూసుఫ్యాన్! నేనలా చేయను. నీవు నిశ్చింతగా ఉండు. మక్కాలో ముస్లింల బంధువులు కూడా ఉన్నారు. దైవప్రవక్తలు ఇబ్రాహీం, ఇస్మాయీల్ (అలై)లు తమ స్వహస్తాలతో నిర్మించిన పవిత్ర కాబా కూడా ఉంది. అబూసుఫ్యాన్! నువ్వేమీ బెంగ పెట్టుకోకు. నీ జాతి ప్రజల దగ్గరకెళ్ళి ఇలా ప్రకటించు-

“ముహమ్మద్ ఒక మంచిసోదరుడిలా మక్కాలో ప్రవేశిస్తాడు. ఈరోజు విజేతలుగాని, పరాజితులుగాని ఎవరూ లేరు. ఈరోజు శాంతీసమైక్యతల రోజు. ప్రేమాసౌభ్రాతృత్వాల రోజు. సొంతఇండ్లలో ఉండి తలుపులు మూసుకునేవారికి, కాబాలో ప్రవేశించేవారికి రక్షణ ఉంది. అలాగే అబూసుఫ్యాన్ ఇంట్లో ఆశ్రయం పొందేవారిక్కూడా రక్షణ ఉంది.”

దైవప్రవక్త (స) అమృత పలుకులు విని అబూసుఫ్యాన్ (రజి) సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఆయన నగరంలోకి పరుగెత్తి ఈ శుభవార్త ప్రకటించారు. క్షణాల్లో ఈ శాంతిసందేశం నగరపౌరులందరికీ తెలిసిపోయింది. భయంతో దడదడలాడుతున్న గుండెలు కాస్తా కుదుటపడ్డాయి.

దైవప్రవక్త (సల్లం), తన పదివేల మంది అనుచరులతో నగరంలో ప్రవేశించారు.

దాదాపు ఎనిమిదేండ్ల క్రితం ఏ ప్రాంతం నుండయితే ఆయన ఒకేఒక అనుచరుడితో నిస్సహాయ స్థితిలో నలువైపుల నుండి బద్ధవిరోధులు వెంటాడుతుండగా పోవలసివచ్చిందో ఆ ప్రాంతానికే ఇప్పుడు పదివేల మంది సమరయోధులతో నిర్భయంగా వచ్చేస్తున్నారు.

ముస్లిం సైనికవాహిని ముందుకు సాగిపోతోంది. అన్సార్ దళం నాయకుడు సాద్ బిన్ ఉబాదా (రజి)లో సమరోత్సాహం ఉప్పొంగింది.

“ఈరోజు సమరజ్వాలలు చెలరేగే దినం. రక్తపాతం జరిగే దినం. ఈరోజు కాబాలో ప్రతి పనీ ధర్మసమ్మతం అవుతుంది. ఈరోజు దేవుడు ఖురైషీయులను అప్రతిష్ఠపాల్జేస్తాడు” అంటూ ఆయన నినాదాలు చేశారు.

అబూసుఫ్యాన్ (రజి) ఈ రక్తపాత నినాదాలు వినగానే దైవప్రవక్త (సల్లం) దగ్గరికెళ్ళి “దైవప్రవక్తా! సాద్ అన్న మాటలు విన్నారా?” అన్నారు ఆరోపణా ధోరణిలో.

“ఏమన్నాడేమిటి?” అడిగారు దైవప్రవక్త (సల్లం)

అబూసుఫ్యాన్ (రజి) తాను సాద్ (రజి) నోట విన్న మాటలన్నీ విన్పించారు. వెంటనే దైవప్రవక్త (స) సాద్ బిన్‌ఉబాదా (రజి)ని పిలిపించి ఆయన చేతిలోని పతాకాన్ని తీసుకొని ఆయన కుమారునికి అప్పగించారు. ఇప్పుడు అన్సార్ దళానికి సాద్ కుమారుడు ఖైస్ (రజి) నాయకుడయ్యాడు. ఈ మార్పు అబూసుఫ్యాన్ (రజి)కు సంతృప్తి కలిగించింది.



దైవప్రవక్త (స) ఒంటె మీద కూర్చొని నగర ముఖద్వారం గుండా మక్కాలో ప్రవేశిస్తున్నారు. గొప్ప సమరయోధుడిగా విజయగర్వంతో గుండెలు విరుచుకొని ప్రవేశించడం లేదు. ఒంటె మీద తన వెనుక మాజీ బానిసయిన జైద్ (రజి) కుమారుడ్ని కూర్చోబెట్టుకొని ఎంతో అణుకువ, వినయవిధేయతలు కలిగిన దైవదాసుడిగా శిరస్సును ఒంటె మూపురం దాకా వంచి మరీ, దైవవాణి (ఫతహ్ సూరా) పఠిస్తూ ప్రవేశిస్తున్నారు!

ఈ అపూర్వ దృశ్యం బహుదైవారాధకులను ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఏమైనప్పటికీ అవిశ్వాసులు ముస్లింలకు లొంగిపోయారు. వారు తమ తమ ఇండ్లలో దూరి తలుపులు మూసుకున్నారు. కిటికీల గుండా, తలపుసందుల గుండా తొంగిచూడసాగారు.

ఒకతను దైవప్రవక్త (స)తో ఏదో మాట్లాడటానికి వచ్చాడు. ఒక సాధారణ వ్యక్తి సువిశాల సామ్రాజ్యానికి అధిపతి అయిన చక్రవర్తితో నిర్భయంగా మాట్లాడగలడా? ఆ మనిషి తడబడుతూ రెండుమూడు మాటలు మాట్లాడి భయంతో వణికిపోసాగాడు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) అతనికి ధైర్యం చెబుతూ “భయపడకు. నేను చక్రవర్తిని కాను. ఎండిన మాంసపు ముక్కలు తినే ఓ సామాన్య స్త్రీకి పుట్టినవాడ్ని” అన్నారు.

ముస్లింసేనలు శాంతియుతంగా మక్కాలో ప్రవేశించాయి. కత్తులు, ఈటెలకు పని తగల్లేదు. రక్తం ప్రవహించలేదు. ఒకచోట మాత్రం కాస్తంత అలజడి చెలరేగింది.

హజ్రత్ ఖాలిద్ (రజి) ప్రవేశించిన ముఖద్వారం దగ్గర ఇక్రమా బిన్ అబూజహల్, సఫ్వాన్ బిన్ ఉమయ్యాలతో సహా కొందరు బద్ధశత్రువులు ముజాహిద్‌లను అటకాయించి కయ్యానికి కాలుదువ్వారు. అందువల్ల వారితో పోరాడక తప్పలేదు. దాడి జరిగిన కాస్సేపటికే శత్రువులు ముస్లింల ముందు నిలువలేక పలాయనం చిత్తగించారు. ఈ దాడిలో పదిమంది ఖురైషీయులు, ఇద్దరు ముస్లింలు మరణించారు.

ఈ దుర్ఘటన దైవప్రవక్త (స)కు తెలిసింది. ఆయన ఖాలిద్ (ర)పట్ల ఆగ్రహం వ్యక్తపరిచారు. అయితే ఖాలిద్ (రజి) చివరిక్షణం వరకూ ప్రయత్నించారని, గత్యంతరంలేని పరిస్థితిలో మాత్రమే శత్రువులపై కత్తిదూశారని కొందరు ముజాహిద్‌లు తెలిపారు. అప్పుడు దైవప్రవక్త (స) “సరే, దేవుడు చేసిందేదో మన మంచికే చేశాడు” అన్నారు.

మక్కా విజేత నగర ప్రవేశం చేశాడు. “అల్లాహు అక్బర్” నినాదంతో నగరం ప్రతిధ్వనించింది. దాంతో బహుదైవారాధకుల గుండెలు ఝల్లుమన్నాయి.

ఇప్పుడు దైవప్రవక్త (స) ఎక్కడ విడిదిచేస్తే బాగుంటుంది? “దైవప్రవక్తా! మీరు మీ సొంతింట్లో ఎందుకు విడిది చెయ్యకూడదు?” అన్నారు కొందరు అనుచరులు.

“మక్కాలో ఇక నాకు సొంతిల్లు ఎక్కడుందని?” అన్నారు ఆయన. “ఇక్కడ మీరు కోరుకున్న ఇంట్లో నిరభ్యంతరంగా ఉండొచ్చు” అన్నారు మరికొందరు.

“వద్దు. నేను ఎవరి ఇంట్లోనూ విడిదిచేయను” అన్నారు దైవప్రవక్త (సల్లం). అప్పుడు ముస్లింలు తమ ప్రియతమ నాయకుడి కోసం ఎత్తయిన ప్రదేశంలో ఓ ప్రత్యేకమైన కుటీరం నిర్మించారు. అందులో ఆయన బసచేశారు.

నగరంలో పూర్తిగా శాంతియుత వాతావరణం నెలకొన్నది. కాబా ధర్మకర్త ఉస్మాన్ బిన్ తల్హా వచ్చి దైవప్రవక్త (సల్లం)కు వినయపూర్వకంగా నమస్కరించాడు.

"రాజాధిరాజా! మక్కావిజేతా!! స్వాగతం! సుస్వాగతం!! ఇదిగో ప్రతిష్ఠాలయం తాళపు చెవులు తీసుకోండి. తరతరాల నుంచి మావంశంలో ఉంటూవస్తున్న ఈ తాళపు చెవుల్ని ఈరోజు మీకు హస్తగతం చేస్తున్నాను" అంటూ అతను వణుకుతున్న చేతులతో కాబా మందిరం తాళపుచెవుల్ని దైవప్రవక్త (సల్లం) చేతికి అందించాడు.

దైవప్రవక్త (సల్లం) చిరునవ్వు నవ్వుతూ తాళపుచెవులు తీసుకున్నారు.

దైవప్రవక్త(స) మదీనా వలసపోవడానికి పూర్వం ఓరోజు కాబాగృహానికి వెళ్ళి ఉస్మాన్‌ని తాళపుచెవులు ఇవ్వమని అడిగితే, అతను నిరాకరిస్తూ దురుసుగా సమాధానమిచ్చాడు. అప్పుడు దైవప్రవక్త (స) "ఉస్మాన్! గుర్తుంచుకో. నువ్వీ తాళపు చెవుల్ని ఏదో ఓరోజు నా చేతికి అందిస్తావు. అప్పుడు నేను తలచిన వారికి వీటిని ఇచ్చేస్తాను" అన్నారు.

ఆ మాటకు ఉస్మాన్ తీవ్రంగా స్పందిస్తూ "అలా జరిగితే ఆరోజు ఖురైషీయులకు వినాశం, అవమానం కలిగే దుర్దినం అవుతుంది" అన్నాడు. "కాదు. ఆరోజు వారు శాంతి యుతంగా, గౌరవప్రదంగా ఉంటారు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఈ మాటలు ఉస్మాన్ బిన్ తల్హా (రజి) చెవుల్లో ఇప్పటికీ ప్రతిధ్వనిస్తున్నాయి. అతను ఆనాడే అనుకున్నాడు, ఆ మహనీయుడు అన్నట్లే జరుగుతుందని. ఇది ఈరోజు జరగడం కూడా అతను కళ్ళారా చూసుకున్నాడు.

దైవప్రవక్త (స) కాబా తలుపులు తెరిపించి లోపలికి ప్రవేశించారు. ఆయన వెంట అనుచరులు కూడా ఉన్నారు. దైవప్రవక్త (స) లోపల ప్రవేశించగానే ఒంటె మీద కూర్చొని వుండే ఏడుసార్లు కాబా ప్రదక్షిణ చేశారు. కాబాలో 300 విగ్రహాలు ఉన్నాయి.

దైవప్రవక్త "సత్యం వచ్చేసింది. అసత్యం నిష్క్రమించింది. అసత్యం ఎప్పటికైనా నిష్క్ర మించేదే" అన్న ఖుర్ఆన్‌సూక్తి పఠిస్తూ చేతిలోని బాణంకొనతో ఒక్కొక్క విగ్రహాన్ని పొడవడం ప్రారంభించారు. అలా పొడిచిన ప్రతి విగ్రహమూ ఒరిగి క్రింద పడిపోసాగింది.

లోపల గోడలపై హజ్రత్ ఇబ్రాహీం (అలై), హజ్రత్ ఇస్మాయీల్ (అలై)ల చిత్రాలు కూడా ఉన్నాయి. వారి చేతుల్లో శకునం చూసే బాణాలు ఉన్నాయి.

"వీరు దైవప్రవక్తలు. జూదం, శకునాల్లాంటి దుష్కార్యాలకు ఆమడ దూరం ఉండిన పవిత్రులు. కాని దుర్మార్గులు వీరిని ఇలా వక్రంగా చిత్రించారు" అన్నారు ఆయన.

హజ్రత్ ఉమర్ (రజి) ఆ చిత్రాలన్నిటిని తుడిచివేశారు. అలా కాబాగృహం శుద్ధి అయిన తర్వాత దైవప్రవక్త (స) ఇద్దరు అనుచరులతో గర్భగుడిలోకి వెళ్ళి నమాజ్ చేశారు. ఆనందాతిశయంతో విశ్వప్రభువుకు కృతజ్ఞతలు సమర్పించి బయటికి వచ్చారు.

దైవప్రవక్త (సల్లం) కాబా నుంచి బయటికి వస్తుంటే ఆయన చేతిలో కాబా తాళపు చెవులు ఉండటం చూసి హజ్రత్ అలి (రజి) సంతోషిస్తూ లేచి "దైవప్రవక్తా! దేవుడు మీపై శాంతిశ్రేయాలు వర్షింపజేయుగాక. యాత్రికులకు నీటి సరఫరా పనితో పాటు,



కాబానిర్వహణ బాధ్యత మా కప్పగించండి" అన్నారు.

దైవప్రవక్త (స) సమాధానం ఇవ్వకుండా "ఉస్మాన్ బిన్‌తల్హా ఏడి, ఎక్కడికెళ్ళాడు?" అని అడిగారు. వెంటనే కొందరు అనుచరులు వెళ్ళి ఉస్మాన్ బిన్ తల్హాని పిలుచుకొచ్చారు.

"ఉస్మాన్! ఇదిగో నీ తాళపుచెవులు. ఈరోజు సద్వర్తనం, నిజాయితీల దినం. ఈ తాళపు చెవులు ఈరోజు నుంచి ఇక ఎల్లప్పుడూ నీ కుటుంబంలోనే ఉంటాయి. దుర్మార్గులు తప్ప మరెవరూ దీన్ని మీ దగ్గర్నుంచి లాక్కోలేరు" అన్నారు దైవప్రవక్త (సల్లం) తాళపుచెవులు అతనికి శాశ్వతంగా అప్పగిస్తూ.

ఉస్మాన్ బిన్ తల్హా సంతోషాతిశయంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు. అతని కనుగొలుకుల నుండి ఆనందాశ్రువులు రాలసాగాయి. అతని నోట అప్రయత్నంగా "అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ ఆయన సందేశహరుడని నేను సాక్ష్యమిస్తున్నాను" అన్న మాటలు వెలువడ్డాయి.

## 47. సాధారణ క్షమాభిక్ష

కాబాప్రాంగణంలో వేలాది జనం గుమిగూడి ఉన్నారు. దైవప్రవక్త (సల్లం)ను, ఆయన్ని విశ్వసించినవారిని ఎన్నో హింసలు పెట్టిన సత్యతిరస్కారులు వీరు. దైవప్రవక్త (సల్లం) తమ విషయంలో ఏం నిర్ణయం తీసుకుంటారోనని భయపడుతూ ఊపిరి బిగబట్టి ఎదురుచూస్తున్న మక్కా బహుదైవారాధకులు వీరు.

దైవప్రవక్త (సల్లం) వారి ఎదుటకు వచ్చి నిలబడ్డారు. జనసమూహంపై నిశ్శబ్దం ఆవరించింది.

"ప్రజలారా! అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడు. ఆయన ఒక్కడే. ఆయనకు ఎవరూ సాటి లేరు. ఆయన తన దాసునికి సహాయంచేసి వాగ్దానం నిలబెట్టుకున్నాడు. ఇతర వర్గాలన్నిటినీ ఏకాకులుగా చేసివేశాడు. బాగా వినండి. గర్వకారణాలైన సమస్త విషయాలు, పురాతన హత్యలు, హత్యా ప్రతీకారాలన్నీ ఇప్పుడు నా కాళ్ళ క్రింద నలిగి పోయాయి. కాబా నిర్వహణ, యాత్రికులకు నీటిసరఫరా పనులు తప్ప అజ్ఞానకాలపు అహంభావాల్ని, కుల గోత్రాల పట్ల గర్వపడటాన్ని దేవుడు రూపుమాపాడు. మానవులంతా ఆదం సంతతిలోనివారే. ఆదం మన్నుతో సృజించబడ్డారు" అని ప్రసంగించిన తరువాత దైవప్రవక్త (సల్లం) దివ్య ఖుర్ఆన్‌లోని ఈ సూక్తి పఠించారు:

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీపురుష జంట నుండి పుట్టించాము. తరువాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాము. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు. నిస్సందేహంగా దేవుడు సర్వజ్ఞాని, సమస్త విషయాలు తెలిసినవాడు." (49:13)

ప్రజలు దైవప్రవక్త (స) ప్రసంగం వింటున్నారు. అయితే తమల్ని గురించి ఆయన ఏం నిర్ణయం తీసుకుంటారోనన్న ఆదుర్దాయే వారిలో ఎక్కువగా గోచరిస్తోంది. వారు బిక్కుబిక్కుమంటూ బిత్తరచూపులు చూస్తున్నారు. వారి గుండెలు దడదడలాడుతున్నాయి.

“ఖురైష్ ప్రజలారా! నేనీ రోజు మీ పట్ల ఏ విధంగా ప్రవర్తిస్తానో మీకు తెలుసా?” అడిగారు దైవప్రవక్త (సల్లం).

“సద్వర్తనంతోనే ప్రవర్తిస్తారు. మీరు మా ఉత్తమ సోదరులు. ఉత్తమ సోదరుని కుమారులు” అన్నారు ప్రజలు కాస్తంత ధైర్యంచేసి ముక్తకంఠంతో.

“సరే, వెళ్ళండి. ఈరోజు మీ మీద ఎలాంటి ఆరోపణ లేదు. మీరంతా స్వతంత్రులు” అన్నారు కారుణ్యమూర్తి (స).

అంతే..... మక్కా ప్రజలపై పూలవాన కురిసింది. సంతోషాతిశయంతో వారి ముఖాలు ఒక్కసారిగా కలువపువ్వుల్లా వికసించాయి. కృతజ్ఞతా భావంతో వారి కళ్ళు మహాప్రవక్త (స) ఔదార్యాన్ని ప్రశంసించాయి.

ఎందుకూ...?రక్తపిపాసులయి వెంటపడినా, నానాబాధలు పెట్టి వేధించినా, పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేసినా, మూడేండ్లపాటు సంఘబహిష్కరణ చేసినా, స్వస్థలం వదలిపెట్టిపోయేలా తీవ్రమైన వత్తిడి తెచ్చినా, మదీనాపై దాడిచేసినా, దైవగృహాన్ని దర్శించ నీయకుండా ఆటంకపరచినా తమల్ని దైవప్రవక్త (స) క్షమించారు. తమపై అపార కరుణా మృతం చిలికించారు. ప్రతీకారం వదలి అమితమైన ఔదార్యం కనబరిచారు. తమకు శిక్ష విధించకుండా, బానిసలుగా బంధించకుండా స్వేచ్ఛ ప్రసాదించి వదలిపెట్టారు.

మరుసటిరోజు ఖుజాఅ తెగవారి చేతికి హుజైల్ తెగ మనిషి ఒకడు చిక్కాడు. అతనితో ఖుజాఅ తెగవాళ్ళకు పాతవైరం ఉంది. అంచేత అవకాశం జారవిడుచుకోకుండా వారా వ్యక్తిని వెంటనే హతమార్చారు.

హుదైబియా ఒప్పందం ప్రకారం ఖుజాఅ తెగవాళ్ళు ముస్లింలకు మిత్రపక్షమ య్యారు. అంచేత ఈ దుర్ఘటన సంగతి తెలియగానే దైవప్రవక్త (స)కు పట్టరాని కోపం వచ్చింది. తక్షణమే ఆయన ప్రజలను సమావేశపరచి వారి ముందు ఆవేదనాభరిత హృదయంతో ఇలా ప్రసంగించారు:

“ప్రజలారా! వినండి. ఏరోజయితే దేవుడు భూమ్యాకాశాల్ని సృజించాడో ఆరోజు నుండే ఆయన మక్కాను పుణ్యక్షేత్రంగా చేశాడు. ఇప్పుడిది ప్రళయం దాకా పుణ్యక్షేత్రంగానే ఉంటుంది. ఇక్కడ ఎలాంటి రక్తపాతం చెయ్యడంగాని, చెట్లు నరకడంగాని ఎవరికీ ధర్మసమ్మతం కాదు. నాకు పూర్వం ఇది ఎవరికీ ధర్మసమ్మతం చెయ్యబడ లేదు. నా తర్వాత కూడా ఎవరికీ ధర్మసమ్మతం కాబోదు. ఇక్కడి ప్రజలపై దైవాగ్రహం విరుచుకుపడి నప్పుడు మాత్రమే నాకయినా ఈపని ధర్మసమ్మతం చేయబడింది. ఇప్పుడీ క్షేత్ర పవిత్రత తిరిగొచ్చింది. ఈ విషయాన్ని మీరు ఈసభలో పాల్గొనలేకపోయినవారికి కూడా తెలియ జేయండి. ఒకవేళ మీతో ఎవరైనా దైవప్రవక్త ఇక్కడ యుద్ధం చెయ్యలేదా అని అడిగితే ‘దేవుడు దీన్ని తనప్రవక్త కోసం ధర్మసమ్మతం చేశాడుకాని, మీకోసం కాద’ని చెప్పేయండి.”

దైవప్రవక్త ప్రసంగంతో ప్రజల కళ్ళ మీదున్న చీకటితెరలు తొలగిపోయాయి. అజ్ఞానపు కారుమేఘాలన్నీ కనుమరుగైపోయాయి. సత్యతేజస్సుతో వారి ఆంతర్యాలు ప్రకాశవంత మయ్యాయి. ఈవిధంగా ప్రజలు తమ హృదయాల్లో ఆధ్యాత్మిక మహాభాగ్యం నింపుకొని



ఇండ్లకు వెళ్ళిపోయారు. వెళ్లగానే తమ స్వహస్తాలతో తమ విగ్రహాలను ధ్వంసంచేశారు. ఆ తర్వాత దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి సత్యధర్మం స్వీకరించి ముస్లింలైపోయారు.

దైవప్రవక్త (సల్లం)కు, నూతన ధర్మానికి బద్ధవిరోధులైనవారు సైతం ఇస్లాం స్వీకరించ డానికి ముందుకొచ్చారు. దైవప్రవక్త (సల్లం)కు అత్యంత ప్రియమైన పినతండ్రి హజ్రత్ హమ్జా (రజి)ని హతమార్చిన వహ్షీ కూడా ఇస్లాం స్వీకరించాడు. దైవప్రవక్త (సల్లం) కుమార్తె హజ్రత్ జైనబ్ (రజి)ని కత్తితో బెదిరించి అనరానిమాటలతో అవమానించిన హబ్బార్ బిని అస్వద్ కూడా ఇస్లాం స్వీకరించాడు. హజ్రత్ హమ్జా (రజి) గుండెకాయ తీసి నమిలి మింగడానికి ప్రయత్నించిన హిందా కూడా ఇస్లాం స్వీకరించింది.

ఈవిధంగా ప్రజలు తండోపతండలుగా దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి ఇస్లాం స్వీకరించసాగారు. ఈరోజు వారు కక్షలు, కార్పణ్యాలు విడనాడి మనస్ఫూర్తిగా సత్య ధర్మానికి చేరువవుతున్నారు.

“(ప్రవక్తా!) దేవుని సహాయం లభించి, విజయం లభించిన తర్వాత ప్రజలు తండోప తండలుగా దైవధర్మంలో చేరుతూ ఉండటం నీవు గమనిస్తూనే ఉన్నావు. కనుక నీ ప్రభువు ఔన్నత్యం స్తుతిస్తూ, ఆయన పవిత్రతను ప్రశంసిస్తూ ఉండు. దాంతోపాటు ఆయన సన్నిధిలో నీ పొరపాట్లకు క్షమపణ కోరుకో. ఆయన గొప్ప క్షమాశీలి.” (ఖుర్ఆన్, 110:1-3)

దైవప్రవక్త (సల్లం) ముఖపద్మం అనందకిరణాలు విరజిమ్ముతోంది. ఆయన హృదయం విశ్వప్రభువు పట్ల కృతజ్ఞతా భావంతో నిండిపోయింది. పెదవుల నుండి స్తుతి స్తోత్రాలు జాలువారుతున్నాయి.

అపార కృపాశీలుడయిన సృష్టికర్త తనకు విజయశ్రీ ప్రసాదించాడు. మక్కా నగరాన్ని తనకు హస్తగతం చేశాడు. ఇక్కడ తన గౌరవప్రతిష్ఠలను ఇనుమడింపజేశాడు. తనకూ, తన అనుచరులకు కాబా దర్శనభాగ్యం కలిగించాడు. శత్రుభయాన్ని దూరంచేశాడు. సర్వత్రా శాంతిసౌరభం వెదజల్లాడు.

దైవప్రవక్త (సల్లం) బద్ధవిరోధుల్లో ఒకడైన సఫ్వాన్ బిన్ ఉమయ్యా మక్కా విజయం తరువాత మక్కా నుండి పారిపోయాడు. సఫ్వాన్ ఎక్కడ కన్పించినా ముస్లింలు అతడ్ని హతమార్చడానికి పొంచివున్నారని కొందరు సఫ్వాన్‌కు తెలియజేశారు. అంచేత అతను ముస్లింల కంటబడకుండా ప్రయాణంచేస్తూ జిద్దా దారి పట్టాడు.

అయితే సఫ్వాన్ పినతండ్రి కుమారుడు ఉమైర్ బిన్ వహబ్ (రజి) దైవప్రవక్త (సల్లం) దగ్గరికెళ్ళి ఇలా విన్నవించుకున్నారు: “దైవప్రవక్తా! సఫ్వాన్ తన తెగనాయకుల్లో అగ్రగణ్యుడు. అతను మక్కా నుండి పారిపోయి సముద్రంలో దూకి చావడానికి సిద్ధ మయ్యాడు. అతడ్ని కనికరించి రక్షణ హామీ ఇవ్వండి.”

దైవప్రవక్త (స) ఈమాట విని “సరే, వెళ్ళి అతడ్ని వెతకి పిలుచుకొని రా. నేనతని ప్రాణానికి హామీ ఇస్తున్నాను” అన్నారు.

“అయితే దైవప్రవక్తా! మీరిచ్చిన హామీని అతను నమ్మడానికి వీలుగా నాకేదయినా మీ వస్తువు ఇవ్వండి” అన్నారు ఉమైర్ (రజి) మళ్ళీ.

అప్పుడు దైవప్రవక్త (స) తన తలపాగా తీసి ఇచ్చారు. ఉమైర్ (రజి) ఆ తలపాగా తీసుకొని జిద్దా వెళ్ళారు. అదే సమయంలో సఫ్వాన్ జిద్దా రేవులో ఓడ ఎక్కడం కన్పించింది.

వెంటనే ఉమైర్ (రజి) అటుగా పరుగుపెడుతూ "సఫ్వాన్! సఫ్వాన్!! ఆగాగు. దైవప్రవక్త (సల్లం) నిన్ను క్షమించారు. ఆయన దగ్గర్నుంచి నేను నీ ప్రాణరక్షణకు హామీ తెచ్చాను. ఓడ దిగిరా" అన్నారు బిగ్గరగా కేకవేస్తూ.

సఫ్వాన్ ఓడ నుంచి దిగకుండానే "ఆయన హామీ ఇచ్చినట్లు ఆధారం ఏమిటీ?" అని అడిగాడు ఓ పట్టాన నమ్మలేక. "ఇదిగో! ఆయన తన తలపాగా తీసి ఇచ్చారు" అంటూ ఉమైర్ (రజి) తన దగ్గరున్న ప్రవక్త తలపాగా చూపించారు.

అప్పుడు సఫ్వాన్ ఓడ దిగి వచ్చాడు. ఉమైర్ (రజి) అతడ్ని తీసుకొని మక్కా బయలు దేరారు. ఇద్దరూ మక్కా చేరుకొని దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళారు.

"దైవప్రవక్తా! మీరు నన్ను క్షమించారట, నిజమేనా?" అన్నాడు ఒకింత ఆశ్చర్యంతో. "ఆ.... నిజమే" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఈ మాట వినగానే సఫ్వాన్‌కు తాను చేసిన దౌర్జన్యాలు ఓసారి గుర్తుకొచ్చాయి. అయినప్పటికీ తనను క్షమించానని దైవప్రవక్త (సల్లం) స్వయంగా చెబుతున్నారు. అంచేత అతను విస్తుబోయి క్షణం పాటు నోరెల్లబెట్టాడు.

"అయితే నాకు రెణ్ణెల్లు అవకాశం ఇవ్వండి" అన్నాడు సఫ్వాన్ ఆశ్చర్యం నుంచి తేరుకొని. "రెణ్ణెల్లు కాదు, నాల్గు నెలలు ఇస్తున్నా, వెళ్ళు" అన్నారు దైవప్రవక్త (స).

దైవప్రవక్త (సల్లం) నోట ఈమాట వినగానే సఫ్వాన్ సంతోషంతో పొంగిపోయాడు. ఆ తరువాత కొన్నాళ్ళకే అతను ఇస్లాం స్వీకరించి ముస్లింలలో చేరిపోయాడు.

అదేవిధంగా అబూజహల్ కొడుకు ఇక్రమా కూడా మక్కా విజయం తరువాత ప్రాణ భయంతో నగరం నుండి పారిపోయాడు. ఈ సంగతి తెలిసి అతని ముస్లిం భార్య ఉమ్మె హకీం బిన్తె హారిస్ (రజి) దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వచ్చి, తన భర్తను క్షమించి ప్రాణభిక్ష పెట్టమని ప్రాధేయపడ్డారు. అందుకు దైవప్రవక్త (సల్లం) సంతోషంగా అతనికి ప్రాణ రక్షణ హామీ ఇచ్చారు.

అయితే ఇక్రామా బిన్ అబూజహల్ అప్పటికే జిద్దా రేవు నుంచి కదలి అబిసీనియా వైపు ప్రయాణమయ్యాడు. ఓడ బయలుదేరిన తరువాత ముఖానికి పట్టిన చెమట తుడుచుకొని 'అమ్మయ్యా!' అంటూ తృప్తిగా గాలి పీల్చుకున్నాడు.

ప్రయాణీకులతో కిటకిటలాడుతున్న ఆ ఓడ పిల్లగాలికి మెల్లగా ఊగుతో ముందుకు సాగిపోతోంది. నడి సముద్రంలోకి పోయిన తరువాత ఆ పిల్లగాలి కాస్తా పెద్దగాలయి పోయింది. మరి కాస్సేపటికి అది ఉధృతమయి తుఫానులా మారింది. ఓడ తుఫాను తాకిడికి తూగుటుయ్యాలలా ఎడాపెడా ఊగసాగింది.

దాంతో ప్రయాణీకులు భయపడిపోయారు. తుఫాను మరింత ఉధృతం కావడంతో ఓడ మునిగిపోయే ప్రమాదం ఏర్పడింది. ప్రయాణీకులు ఏడ్పులు, పెడబొబ్బలు పెడుతూ



తమతమ ఇష్ట దేవతల్ని మొరపెట్టుకోవడం మొదలెట్టారు. కాని తుఫాను ఏమాత్రం తగ్గ లేదు. అది మరింత భీకరంగా తయారై ఓడను ఎత్తి కుదేస్తూ ముంచివేసే స్థితికి చేరుకుంది. ప్రయాణీకులు మరింత భయంతో రోదిస్తూ ఇష్టదేవతలను వేడుకుంటున్నారు.

అప్పుడు కొందరు అనుభవశాలురు లేచి "ఇది సృష్టికర్త, సర్వేశ్వరుడయిన దేవుడ్ని తప్ప మరెవరినీ వేడుకునే సమయం కాదు. ఆయన మాత్రమే తలచుకుంటే మనం ఈ ఆపద నుండి బయటపడగలం" అన్నారు.

ఈ మాటలు వినగానే ఇక్రమా కళ్ళపై వున్న అజ్ఞానపొరలు తొలగిపోయాయి.

"ఏమిటీ!? ఇక్కడ దేవుడు తప్ప మరెవరూ సహాయం చేసేవారు లేరా? మరి ఈ విషయాన్నే కదా ఆ పుణ్యాత్ముడు ఇరవయి యేండ్ల నుంచి చెబుతూ వస్తున్నది. మనం అనవసరంగా ఆయనతో పోరాడుతున్నాం" అని అతను మనసులో అనుకున్నాడు.

ఆ తరువాత వెంటనే అతను "ఈ తుఫాను నుంచి క్షేమంగా బయటపడితే నేను నేరుగా ముహమ్మద్ మహనీయుని (సల్లం) దగ్గరకు పోయి ఆయన చేతిలో చేయి వేసి కలుపుతాను" అని గట్టిగా నిర్ణయించుకున్నాడు.

తుఫాను మెల్లగా తగ్గుముఖం పట్టింది. ఓడ వడిదుడుకులు లేకుండా సవ్యంగా ముందుకు సాగింది. కాస్సేపటికి తుఫాను పూర్తిగా తగ్గిపోయింది. ఓడ అబిసీనియా రేవుకు చేరుకుంది. ప్రయాణీకులు దైవానికి కృతజ్ఞతలు చెప్పి దిగిపోయారు.

ఇక్రమా హృదయం కూడా దేవుని పట్ల కృతజ్ఞతా భావంతో నిండిపోయింది. కొన్నాళ్ళ తరువాత అతను జిద్దాకు తిరిగొచ్చి, అక్కడ్నుంచి నేరుగా మదీనా చేరుకొని దైవప్రవక్త (సల్లం)ను కలుసుకొని ఇస్లాం స్వీకరించాడు.

మక్కా విజయం తరువాత ఇలా అనేకమంది ప్రముఖులు ఇస్లాం స్వీకరించి ముస్లింలలో చేరిపోయారు. వీరిలో ఏ ఒక్కరూ ఖడ్గ భయంతో ఇస్లాం స్వీకరించలేదు. ఆ ధర్మంలోని సత్యతను, దైవప్రవక్త (సల్లం)లోని అత్యున్నత సుగుణ సంపతిని అర్థం చేసుకున్న తరువాతే వారంతా ఇస్లాం స్వీకరించారు.

కాకపోతే మక్కా పరివాహక ప్రాంతంలో కొన్ని తెగలు విద్వేషంతో దాడిచేసినప్పుడు దాన్ని ఎదుర్కోవడానికి ఒక దండనాయకుడు ఖాలిద్ (రజి) రెండు చోట్ల ఖడ్గానికి పని చెప్పవలసివచ్చింది. ఆయన తొందరపాటు వైఖరికి దైవప్రవక్త (స) విచారం వ్యక్తపరచి, శత్రువర్గానికి రక్తపరిహారం కూడా చెల్లించారు. మొత్తానికి మక్కా నగరం, దాని పరిసర ప్రాంతాలు సత్యధర్మంతో పావనమయ్యాయి. ప్రజలు తాము పూజించిన విగ్రహాలను తమ చేజేతులా ధ్వంసం చేశారు. ఇండ్లలో, మందిరాల్లో ప్రతిష్ఠించుకున్న రాతిబొమ్మలను బయటికి తీసి పగలగొడ్తూ ఇలా అన్నారు:

"నిన్నటిదాకా మాకు మీమీద ప్రేమాభిమానాలు ఉండేవి. ఈరోజు మేము మిమ్మల్ని అసహ్యించుకుంటున్నాం. నిన్నటివరకు మిమ్మల్ని ధూపదీప నైవేద్యాలతో పూజించాము. ఈరోజు మిమ్మల్ని మా కాళ్ళ కింద పడేసి తొక్కుతున్నాము. ఇంతకు ముందు మేము చాలా మోసానికి గురయివున్నాము. ఇప్పుడు మా అజ్ఞాన తెరలు తొలగిపోయాయి."

# 48. హవాజిన్, సఖీఫ్ తెగల తిరుగుబాటు

మక్కాలో పనులన్నీ ముగిసేటప్పటికి పదిహేను రోజులు గడచిపోయాయి. అప్పుడు దైవప్రవక్త (స) మనస్సు కుదుటపడింది. ఇక మదీనాకు తిరుగుముఖం పట్టవలసిఉంది.

ఈలోగా హవాజిన్ తెగ గురించిన ఒకవార్త అందింది. ఆ తెగవాళ్ళు ముస్లింలపై దాడి చేయడానికి సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది. రక్తపాతం నివారించాలంటే వారి యుద్ధ సన్నాహాలు పూర్తికాక ముందే అక్కడికి చేరుకోవాలి.

దైవప్రవక్త (సల్లం) మక్కా నగరాన్ని జయించారని, అత్యధికమంది ఖురైషీయులు ముస్లింలయి పోయారని వినగానే ఖురైషీయుల ప్రత్యర్థి తెగలు ఆందోళన చెందసాగాయి. ఈ తెగలు ముస్లింల మిత్రపక్షంగా కూడా లేవు. అలాంటి తెగలలో మక్కా, తాయిఫ్ పట్టణాల మధ్య నివసిస్తున్న హవాజిన్, సఖీఫ్ తెగలు ముఖ్యమైనవి. ఇప్పుడీ రెండు తెగలు ముస్లింలకు వ్యతిరేకంగా యుద్ధసన్నాహాలు చేయసాగాయి.

అందువల్ల హి.శ. 8వ ఏట షవ్వాల్ నెలలో దైవప్రవక్త (స) పన్నెండు వేల మంది యోధుల్ని తీసుకొని మక్కా నుండి బయలుదేరారు. మదీనా నుండి తెచ్చిన పదివేల మందిగాక మరో రెండువేల మంది మక్కా నవముస్లింలు అదనంగా చేరిపోయారు.

ముజాహిద్‌లంతా ఆయుధాలు ధరించి ప్రయాణానికి సిద్ధమయ్యారు. కావలసినన్ని ఆహారపదార్థాలు కూడా సమకూర్చుకున్నారు. మక్కా నుండి ముస్లిం సేనావాహిని నురుగులు కక్కుతూ బయలుదేరింది. ఇంతటి గొప్ప సైన్యం అరబ్బులు దేశంలో ఇదివరకెన్నడూ చూడ లేదు. ముజాహిద్‌ల ఆనందోత్సాహాలు అవధులు దాటాయి. వారికీ రోజు విశ్వాసబలంతో పాటు సంఖ్యాబలం కూడా సమృద్ధిగా లభించింది. అన్నిటికి మించి విశ్వప్రభువు కారుణ్యఛాయలు, ఆయన కటాక్షవీక్షణలు వారిపై ఉన్నాయి.

ముస్లింలు మక్కా జయించారని వినగానే హవాజిన్ తెగవాళ్ళు కోపంతో చిందులు తొక్కారు. తక్షణమే వారు మాలిక్ బిన్ ఔఫ్‌ని నాయకునిగా ఎన్నుకొని మిత్ర పక్షాలన్నిటిని యుద్ధానికి పురిగొల్పారు. సఖీఫ్ తెగవాళ్ళను కూడా యుద్ధంలో పాల్గొనడానికి పిలిచారు. ఇంకా ఇతర తెగలను కూడా ముస్లింలకు వ్యతిరేకంగా యుద్ధానికి ప్రేరేపించారు. చూస్తుండగానే మాలిక్ నాయకత్వంలో ఓ పెద్ద సైనికపటాలం తయారయింది.

మాలిక్ రూపొందించిన వ్యూహం దైవప్రవక్త (సల్లం)కు తెలిసిపోయింది. వెంటనే ఆయన సైన్యాన్ని తీసుకొని పోయి హునైన్ లోయలో విడిదిచేశారు.

ముస్లింలు హునైన్ లోయలో ఓరాత్రి గడిపి మరునాడు తెల్లవారగానే బయలుదేరారు. సైన్యానికి ముందు హజ్రత్ ఖాలిద్ (రజి) ఉన్నారు. వెనుక దైవప్రవక్త (సల్లం) కంచరగాడిదపై కూర్చొనివున్నారు. సైన్యం హునైన్‌లోయ దాటవలసి ఉంది. లోయ చాలా ఇరుకుగా ఉన్నందున సైనికులు లోపలికి ప్రవేశించి చాలా జాగ్రత్తగా నడవసాగారు. అవిధంగా లోయలో కొంచెం దూరం నడచిన తరువాత హఠాత్తుగా సైనికుల్లో కలకలం మొదలయింది. పంక్తులు చిందర వందరయ్యాయి. సైనికులు భయాందోళనలతో ఎటుపడితే అటు పరుగెత్తసాగారు.



దైవప్రవక్త (సల్లం) లోయ కుడివైపున నిలబడి ఉన్నారు. పర్వతసానువుల నుండి బాణాలు వచ్చి పడుతుంటే సైనికులు ప్రాణభీతితో పారిపోతున్నారు.

“సైనికులారా! ఎటు పరుగెత్తుతున్నారు మీరు? ఇదిగో ఇటు చూడండి. నేను దైవప్రవక్తను; అబ్దుల్లా కుమారుడు ముహమ్మద్‌ని. నావైపు రండి” అంటూ దైవప్రవక్త (సల్లం) సైనికుల్ని బిగ్గరగా పిలుస్తున్నారు.

కాని ఆ భయానక స్థితిలో, ఆ గందరగోళంలో ఆయన పిలుపు ఎవరు వింటారు? పైనుంచి బాణాలు వచ్చిపడుతుంటే ముస్లిం యోధులు భీతావహులై పరుగులు పెడ్తున్నారు. పర్వతసానువులపై, కొండగుహల్లో నక్కిన హవాజిన్ సైనికులు క్రిందికి దిగివచ్చి ముస్లిం సైనికులపై బాణాలతో దాడిచేయడం మొదలెట్టారు.

ఖురైష్ ప్రజల్లో చాలామంది ఈ మధ్యనే ఇస్లాం స్వీకరించడం వల్ల దాని ఔన్నత్యం ఏమిటో వారింకా తెలుసుకోలేకపోయారు. సమరసొత్తు లభిస్తుందన్న ఆశతో మాత్రమే వచ్చారు. అలాంటివారే ఈ హఠాత్పరిణామానికి బిత్తరపోయి పారిపోసాగారు.

ముస్లింలకు అది కఠిన పరీక్షా సమయం. ముహాజిర్, అన్సార్ ముస్లింలు మాత్రం దైవప్రవక్త (స)ను ప్రాణం కన్నా మిన్నగా చూసుకుంటూ, కంటికి రెప్పలా కాపాడుకుంటూ శత్రువులతో వీరోచితంగా పోరాడుతున్నారు.

దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞ ప్రకారం హజ్రత్ అబ్బాస్ (రజి) గట్టిగా కేకలేస్తూ “ప్రవక్త అనుచరులారా! ఎక్కడున్నారు మీరు? ముహమ్మద్ (స) ఇంకా మన మధ్య సజీవంగానే ఉన్నారు, ఇటు వచ్చేయండి” అంటూ పిలిచారు.

హజ్రత్ అబ్బాస్ (రజి) కంఠస్వరం యావత్తు లోయలో ప్రతిధ్వనించింది. దాంతో పారిపోతున్న ముస్లింయోధులు క్షణాల్లో దైవప్రవక్త (సల్లం) వద్దకు చేరుకున్నారు. భయాందోళనలు దూరమయ్యాయి. వారి హృదయాల్లో నూతనుత్తేజం జనించింది. యుద్ధ వ్యూహం కొత్త పుంతలు తొక్కింది. పరిస్థితి స్వరూపం మారిపోయింది.

ముస్లింలు ఇప్పుడు స్థిరంగా నిలబడి ధైర్యంగా శత్రువుల్ని చీల్చిచెండాటం మొదలెట్టారు. ఈవిధంగా అంతిమవిజయం ముస్లింలకే లభించింది. శత్రుపక్షంలో దాదాపు డెబ్భయిమంది హతమయ్యారు. ముస్లింలలో ఆర్గురు అమరగతులయ్యారు.

హవాజిన్ తెగవాళ్ళు ముస్లింల చేతిలో చావుదెబ్బ తినడంతో వారి మిత్రపక్షమైన సఖీఫ్‌తెగ ప్రజలు తాయిఫ్‌కు పారిపోయారు. తాయిఫ్ పౌరులు వారి సానుభూతిపరులే.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) ముజాహిద్‌లను తీసుకొని సఖీఫ్ తెగవారుండే తాయెఫ్ నగరానికి బయలుదేరారు. అయితే ఈ సంగతి ముందే తెలుసుకున్న సఖీఫ్ తెగవాళ్ళు పటిష్ఠమైన తమ కోటలలో ప్రవేశించి తలుపులు మూసేసుకున్నారు.

ముస్లిం యోధులు తాయెఫ్ నగరాన్ని ముట్టడించారు. ఈ ముట్టడి దాదాపు నెల రోజులు కొనసాగింది. కాని ముస్లింలు ఎంత ప్రయత్నించినా నగరంలోకి ప్రవేశించలేక పోయారు. శత్రువులు కూడా కోట బురుజుల పైనుండి బాణాలు వదలడం తప్ప బయటికి రావడానికి సాహసించలేక పోయారు.

చివరికి దైవప్రవక్త (సల్లం) యుద్ధం విరమించి తాయఫ్ నుండి బయలుదేరమని అనుచరుల్ని ఆదేశించారు. యుద్ధం ముగియక ముందే వెళ్ళిపోవలసి వస్తున్నందుకు అనేక మంది బాధపడ్డారు. కొందరు సఖీఫ్ ప్రజల్ని శపించమని అన్నారు. కాని దైవప్రవక్త (స) శపించకుండా వారిని రుజుమార్గం పైకి తీసుకురమ్మని దైవాన్ని ప్రార్థించారు.

## 49. ఖైదీలు, శత్రువుల పట్ల ప్రవక్త ఔదార్యం

ఆ తరువాత దైవప్రవక్త (స) తాయెఫ్ నుండి జీరానాకు బయలుదేరారు. హవాజిన్ తెగతో యుద్ధంచేసి గెలుచుకున్న సమరసొత్తు జీరానాలోనే ఉంది. అందువల్ల ఆయన జీరానాకు చేరుకోగానే ఈ సమరసొత్తును ముజాహిద్‌లకు పంచడానికి పూనుకున్నారు.

ఈలోగా హవాజిన్ తెగ మనుషులు కొందరు దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి ఇస్లాం స్వీకరించారు. తర్వాత వారు ఖైదీల విడుదలతో పాటు సామగ్రి వాపసుకై విజ్ఞప్తి చేశారు.

“దైవప్రవక్తా! మమ్మల్ని కనికరించండి. ఖైదీలలో మీ బంధువులు కూడా ఉన్నారు. మాకు మీ ఔదార్యం పట్ల ఎంతో నమ్మకం ఉంది” అన్నారు వారు.

“అయితే మీరు స్త్రీలను, పిల్లలను తీసుకుంటారా లేక సామగ్రిని తీసుకుంటారా?” అని అడిగారు దైవప్రవక్త (సల్లం).

“దైవప్రవక్తా! మీరు మాకు ఈ రెండిటిలో ఏదో ఒకదాన్నే కోరుకొమ్మని చెబుతున్నారా? అయితే మాకు మా భార్యాపిల్లల్ని ఇచ్చేయండి. వాళ్ళను గురించే మాకు దిగులుగా ఉంది” అన్నారు హవాజిన్ తెగవాళ్ళు.

“ముత్తలిబ్ సంతతి భాగాన్ని అయితే నేను మీకు వాపసు చేయగలను. కాని ఇతరుల వాటాల విషయంలో వారిని అడిగి తెలుసుకోవలసి ఉంటుంది. దానికి మీరు ఓ పని చెయ్యండి. నేను జుహర్ నమాజ్ పూర్తిచేయగానే మీరు లేచి నాతో సిఫారసు చేయించు కోండి, నేను మీకు సిఫారసు చేస్తాను” అన్నారు దైవప్రవక్త (సల్లం).

దైవప్రవక్త (స) సూచన ప్రకారమే ఆయన జుహర్ నమాజ్ ముగించగానే హవాజిన్ తెగవాళ్ళు లేచి నిలబడ్డారు. ఖైదీలను విడుదల చేయించమని దైవప్రవక్త (స)ను అభ్యర్థించారు. అప్పుడు దైవప్రవక్త (స) ఓ చిన్న ప్రసంగం చేసి, తాను ముత్తలిబ్ సంతతి ప్రజల వాటలో వచ్చే యుద్ధ ఖైదీలను హవాజిన్ తెగవాళ్ళకు వాపసు చేస్తున్నట్లు ప్రకటించారు.

దైవప్రవక్త (సల్లం) ప్రసంగంతో ఉత్తేజితులయిన ముహాజిర్, అన్సార్ ముస్లింలు తమతమ వాటాలకు వచ్చే ఖైదీలను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. కొన్ని తెగలు మాత్రం మౌనంగా ఉండిపోయాయి.

అప్పుడు దైవప్రవక్త (సల్లం), ఈ విషయంలో ఎవరికైనా బాధగా ఉంటే అలాంటివారికి మరెప్పుడైనా ఖైదీలు లభించినప్పుడు ఒక ఖైదీకి బదులు ఆరుగురు ఖైదీలను ఇస్తామని వాగ్దానం చేశారు. ఈ వాగ్దానం విని ఆ తెగలు కూడా తమ ఖైదీలను హవాజిన్ తెగవాళ్ళకు తిరిగిచ్చేయడానికి అంగీకరించారు.

ఈవిధంగా కాస్సేపట్లో దాదాపు ఆరువేల మంది యుద్ధ ఖైదీలు విడుదలయ్యారు.



ఆ తరువాత హవాజిన్ తెగవాళ్ళు సంతోషంతో దైవప్రవక్త (స) దగ్గర సెలవు తీసుకొని తమ ప్రాంతానికి బయలుదేరారు. అప్పుడు వారితో దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

“మాలిక్ దగ్గరకు వెళ్ళి, అతను నాదగ్గరకు వచ్చి ఇస్లాం స్వీకరిస్తే అతని భార్యా పిల్లల్ని వాపసుచేయడమే గాకుండా వంద ఒంటెలను కూడా ఇస్తానని చెప్పండి.”

అలాగే చెబుతామని హవాజిన్ తెగవాళ్ళు అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) మొత్తం సమరసొత్తు నుంచి ప్రభుత్వ ధనాగారం కోసం అయిదో వంతు తీసి మిగిలిన దాన్ని ముజాహిద్‌లకు పంచారు. కొత్తగా ఇస్లాం స్వీకరించినవారి పట్ల ఆయన కాస్త ఉదారంగా ప్రవర్తిస్తూ, వారికి రావలసినదాని కంటే కొంచెం ఎక్కువే ఇచ్చారు. ప్రభుత్వధనాగారం కోసం తీసిన వాటా నుంచి కూడా మరికొంత ఇచ్చివేశారు.

అయితే ఈ వైఖరి కొందరు అన్సార్ ముస్లింలకు నచ్చలేదు. సమరసొత్తు పంపిణిలో దైవప్రవక్త (స) ఖురైషీయుల పట్ల ఉదారంగా వ్యవహరించి, తమపట్ల వివక్ష చూపారని బాధపడ్డారు. మెల్లగా వారిలో గుసగుసలు ప్రారంభమయ్యాయి. కొందరయితే దైవప్రవక్త (సల్లం) తన తెగవాళ్ళతో కలసిపోయారని బాహాటంగానే అనేశారు.

హజ్రత్ సాద్ బిన్ ఉబాదా (రజి) ఈ విషయాన్ని దైవప్రవక్త (సల్లం)కు తెలియజేశారు. ఆయన పరిస్థితి గ్రహించి “అయితే సాద్! నువ్వెళ్ళి నీ తెగవాళ్ళను సమావేశపరచు. నేను వచ్చేస్తున్నాను” అని చెప్పారు. దైవప్రవక్త (స) ఆదేశం ప్రకారం హజ్రత్ సాద్ (రజి) అన్సార్ యోధులను ఓ చోట సమావేశపరిచారు. అంతలో దైవప్రవక్త (స) వచ్చారు.

“ప్రియ అనుచరులారా! ఏమిటీ గుసగుసలు? దేన్ని గురించి ఆరోపణలు చేస్తున్నారు మీరు? ఓసారి మీ గతం గురించి ఆలోచించుకోండి. నేను మీదగ్గరికి వచ్చేముందు మీరు మార్గవిహీనులుగా ఉండేవారు. నాద్వారా దేవుడు మీకు సన్మార్గం చూపించాడు. మీరు నిరుపేదలుగా ఉన్నప్పుడు దేవుడు నాద్వారా మీకు సిరిసంపదలు ప్రసాదించాడు. మీరు అంతఃకలహాలలో మునిగితేలుతున్నప్పుడు నాద్వారా దేవుడు మీలో ప్రేమాభిమానాలు కలిగించాడు. ఇవన్నీ వాస్తవాలు కావా?” అంటూ అడిగారు ఆయన వారి కళ్ళలోకి సూటిగాచూస్తూ.

“వాస్తవమే దైవప్రవక్తా! వాస్తవమే. దేవుడు, ఆయన ప్రవక్త మాకెంతో మేలు చేశారు. వారి దయాదాక్షిణ్యాలు లేకపోతే మేమీ స్థితికి ఎదిగేవాళ్ళము కాము” అన్నారు అన్సార్ ముస్లింలు సిగ్గుతో తలలు దించుకుంటూ.

“కాదు. మీరావిధంగా అనడానికి బదులు, నీ తెగవాళ్ళు నిన్ను తిరస్కరించినప్పుడు మేము నీకు మద్దతు ఇచ్చామని ఎందుకు అనరు? నీ తెగవాళ్ళు నిన్ను బహిష్కరించినప్పుడు మేము నిన్ను చేరదీసి ఆశ్రయమిచ్చామని ఎందుకు చెప్పరు మీరు? నువ్వు ఉత్త చేతులతో ఇక్కడికి వచ్చినపుడు మేము నీకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించి ఆదుకున్నామని నాకు మీరెందుకు గుర్తుచేయరు? ఇవన్నీ వాస్తవాలే. ఇందులో ఏమాత్రం అతిశయోక్తి లేదు. వీటిని నేను ఒప్పుకుంటున్నాను.”

ఈ మాటలు వినగానగానే అన్సార్ ముస్లింలకు దుఃఖం పొర్లుకొచ్చింది.

"అన్సార్ మిత్రులారా! మీరు దేవుడు చేసిన మహోపకారాలు మరచిపోకండి. నేను కొత్తగా ఇస్లాంలో చేరినవారికి అందులో దృఢమైన విశ్వాసంతో స్థిరంగా ఉండేందుకు, వారిని సంతోష పెట్టేందుకు కొన్ని ఒంటెలు, మేకలను అదనంగా ఇచ్చాను. మీ మంచితనం పట్ల నాకు నమ్మకం ఉంది. అందుకే మీకా విధంగా సమరసొత్తు ఇవ్వలేదు. ఈమాత్రానికే మీరిలా అయిపోతున్నారా?

"నా ప్రియ అనుచరులారా! ఇతరులు తమ ఇండ్లకు ఒంటెలు, మేకల్ని తీసికెళ్ళారు. కాని మీకు దేవుడు, ఆయనప్రవక్త దక్కారు. ఇది మీకు సంతోషదాయకం కాదా? దైవసాక్షి! హిజ్రత్ గనక లేకపోయినట్లయితే మదీనాయే నా స్వస్థలమయ్యేది. అన్సారులే నాజాతి వాళ్ళయ్యేవారు. అన్సారులు ఒక వైపు, ఇతరులంతా ఒకవైపు ఉంటే నేను అన్సారుల పక్షానే ఉంటాను. దేవా! నా అనుచరులకు శాంతీసౌభాగ్యాలు ప్రసాదించు. వారిపై, వారి సంతానం పై నీ కరుణామృతం చిలికించు."

అన్సార్ ముస్లింలు ఈ ప్రసంగం విని తీవ్రమైన పశ్చాత్తాపంతో కుమిలి కుమిలి రోదించడం మొదలెట్టారు. "వద్దు. మాకు దైవప్రవక్త (స) చాలు. ఇంకేమీ వద్దు. దైవప్రవక్తా! మాకింకేమీ వద్దు" అన్నారు వారు ఏకధాటిగా కన్నీరు కారుస్తూ.

ఈ విధంగా దైవప్రవక్త (సల్లం) ఈ వివాదాన్ని పరిష్కరించారు. కాస్సేపటికి హవాజిన్ తెగనాయకుడు మాలిక్ బిన్ ఔఫ్ వచ్చి ఇస్లాం స్వీకరించాడు. దైవప్రవక్త (స) అతనికి అతని భార్యాపిల్లల్ని వాపసుచేశారు. వాగ్దానం ప్రకారం వంద ఒంటెల్ని కూడా ఇచ్చారు. మాలిక్ బిన్ ఔఫ్ (రజి) హృదయం కృతజ్ఞతా భావంతో నిండిపోయింది.

"ఇంతకు పూర్వం దేవుడు మీకు అనేక సందర్భాలలో సహాయం చేసిఉన్నాడు. ఇటీవల జరిగిన హునైన్ యుద్ధంలో కూడా చేశాడు. ఆరోజు మీరు మీ సంఖ్యాబలం చూసుకొని విర్రవీగారు. కాని మీ సంఖ్యాబలం మీకు ఎలాంటి ప్రయోజనం కలిగించలేకపోయింది. ఎంతో విశాలమైన భూమి మీకు ఇరుకైపోయింది. మీరు వెన్నుజూపి పారిపోసాగారు.

"అప్పుడు దేవుడు తన ప్రవక్తకు, విశ్వాసులకు మనోనిబ్బరం ప్రసాదించాడు. మరోవైపు మీకు కన్పించని (దైవదూతల) సైన్యాన్ని కూడా దించి సత్యతిరస్కారుల్ని శిక్షించాడు. సత్యాన్ని తిరస్కరించేవారికి తగిన శాస్తి అదే. ఈ విధంగా సత్యతిరస్కారుల్ని శిక్షించిన తరువాత దేవుడు తాను తలచిన వారికి పశ్చాత్తాంచెందే సద్బుద్ధి కూడా ప్రసాదించాడు. దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు." (ఖుర్‌ఆన్, 9:25-27)

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని తీసుకొని మక్కాకు బయలుదేరారు. మక్కా చేరుకున్నాక అక్కడ ఉమ్రా ఆచారం పాటించారు. మక్కా ప్రజలకు ధర్మబోధ చేయడానికి హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి)ని అక్కడే ఉంచారు. ఆ తరువాత ఆయన ముజాహిద్‌లను తీసుకొని మదీనా బయలుదేరారు.

దైవప్రవక్త (సల్లం) మదీనా చేరుకున్న తరువాత కూడా అనేకమంది ఆయన దగ్గరకు ఇస్లాం స్వీకరించడానికి రాసాగారు. కాబ్ బిన్ జహీర్ అనే ఓ కవిపుంగవుడు దైవప్రవక్త



(స) పేరు వింటేనే నఖశిఖ మండిపడేవాడు. అతను దైవప్రవక (స)ను తూలనాడుతూ జనాన్ని రెచ్చగొట్టే గేయాలు రచించి ప్రచారం చేసేవాడు. అతని సోదరుడు బుజైర్ (రజి) కూడా దైవప్రవక్త (స)కు బద్ధవిరోధే. కాని అతను ఇస్లాం స్వీకరించడంతో దైవప్రవక్త (స) అతడ్ని క్షమించారు. ఆ విషయాన్నే అతను కాబ్ ముందు ప్రస్తావిస్తూ "దైవప్రవక్త (స) దగ్గరికెళ్ళి క్షమాపణ చెప్పుకో. ఆయన నీ తప్పులన్నీ మన్నిస్తారు" అని సలహా ఇచ్చాడు. అప్పుడు కాబ్ వెంటనే మదీనా బయలుదేరాడు.

కాబ్ మదీనాలో ఓ ముస్లిం మిత్రుడ్ని కలుసుకొని తన ఉద్దేశ్యాన్ని తెలియజేశాడు. మరునాడు వారిద్దరూ మసీదుకు వెళ్ళారు. కాబ్ మారువేషంలో దైవప్రవక్త (సల్లం) ముందుకు వచ్చి నిలబడ్డాడు.

"దైవప్రవక్తా! కాబ్ బిన్ జహీర్ మదీనా వచ్చి ఉన్నాడు. అతనిప్పుడు తన తప్పుల పట్ల పశ్చాత్తాపం చెందాడు. మిమ్మల్ని కలుసుకొని క్షమాపణ చెప్పుకోవాలనుకుంటున్నాడు. అతని హృదయం ఇస్లాం వైపునకు మొగ్గింది. మరి నేనతడ్ని తీసుకువస్తే మీరతడ్ని క్షమిస్తారా?" అడిగాడు మారువేషంలో ఉన్న కాబ్.

"ఆ... తప్పకుండా క్షమిస్తాను" అన్నారు దైవప్రవక్త (స). "అయితే దైవప్రవక్తా! నేనే కాబ్‌ని" అన్నాడు కాబ్ తన వేషం తీసేస్తూ. దైవప్రవక్త (స) అతడ్ని క్షమించారు. అతను దైవప్రవక్త (స) క్షమాగుణానికి ఎంతో ప్రభావితుడయి తక్షణమే ఇస్లాం స్వీకరించాడు.

దైవప్రవక్త (సల్లం) ప్రజలకు ధర్మబోధ చెయ్యడంలో నిమగ్నులై ఉన్నప్పటికీ, సత్యతిరస్కారుల చర్యల్ని ఓ కంట కనిపెడుతూనే ఉన్నారు.

ఓసారి ముస్లింలు "తై" తెగవారితో పోరాడవలసి వచ్చింది. ఆ పోరాటంలో తై తెగ చిత్తుగా ఓడిపోయింది. ఆ తెగనాయకుడు అద్దీ బిన్ హాతిం తై ఇస్లాంకు బద్ధవిరోధి. కాని అతను ముస్లింలను ఎదుర్కోలేక భార్యాపిల్లల్ని తీసుకొని సిరియాకు పారిపోయాడు. ముస్లింలు సమరసొత్తును, యుద్ధ ఖైదీలను తీసుకొని మదీనా తిరిగొచ్చారు.

ఆ యుద్ధఖైదీలలో అద్దీ బిన్‌హాతిం సోదరి సఫ్ఫానా కూడా ఉంది. ఖైదీలను విడిచి పెట్టాలో లేక ముజాహిద్‌లకు పంచాలో ఇంకా నిర్ణయం తీసుకోలేదు. అలాంటి పరిస్థితిలో అటుగా దైవప్రవక్త (సల్లం) రావడం చూసి సఫ్ఫానా ఇలా అన్నది:

"దైవప్రవక్తా! దయజూపండి. తండ్రి చనిపోయాడు. సోదరుడు పారిపోయాడు. ఈ దీనురాలిని కనికరించండి." దైవప్రవక్త (సల్లం) వెనక్కి తిరిగి చూసి "ఎవరూ నీ సోదరుడు?" అని అడిగారు. "అద్దీ బిన్ హాతిం" అన్నది ఆమె. "అతనా! అతను దైవవిరోధి, దైవప్రవక్త విద్వేషి!!" అంటూ దైవప్రవక్త (సల్లం) ముందుకు సాగారు.

సఫ్ఫానా నిరాశచెందకుండా మళ్ళీ విన్నవించుకుంది. దైవప్రవక్త (సల్లం) ఆమెను మన్నించి విడుదల చేశారు. పైగా ఎంతో పైకం కూడా ఇచ్చి ఆమెను సిరియా పంపివేశారు.

సఫ్ఫానా సిరియా వెళ్ళి సోదరుడికి తానెలా బయటపడగలిగిందో వివరంగా చెప్పింది. దైవప్రవక్త (స) నిజాయితి, దాతృత్వాలను గురించి అతని ముందు ప్రశంసించింది. అద్దీ దైవప్రవక్త (స) సచ్ఛీలం సంగతి విని ఎంతో ఆశ్చర్యపోయాడు.

"అయితే ఆయన్ని గురించి నీ అభిప్రాయం ఏమిటీ?" ప్రశ్నించాడు అద్దీ. "నువ్వు వెంటనే ఆయన దగ్గరికి వెళ్ళిరా. ఆయన నిజంగా దైవప్రవక్తే అయితే నీలాంటివాడ్ని ఆదరించడానికి వెనకాడడని నాకు నమ్మకం ఉంది. ఒకవేళ ఆయన చక్రవర్తి అయితే ఆయన దగ్గర నీకు విలువ ఉండక పోదు" అన్నది అతని సోదరి.

ఈ మాట విన్న తర్వాత అద్దీ మరునాడు మదీనా బయలుదేరాడు. "దేవుడు అద్దీ బిన్‌హాతిం చేతిని నా చేతిలోకి ఇస్తాడు" అని దైవప్రవక్త (స) తన సహచరులతో అన్నట్లు అద్దీకి సమాచారం అందింది. ఈ సంగతి కూడా అతడ్ని ప్రభావితం చేసి ఉండవచ్చు.

అద్దీ మదీనా చేరుకున్నాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) కొందరు అనుచరులతో కలసి మసీదులో కూర్చున్నారు. అద్దీ మసీదులో ప్రవేశించి సలాం చేశాడు.

"ఎవరు నాయనా నువ్వు?" అడిగారు దైవప్రవక్త (సల్లం) ప్రశాంత వదనంతో. "నేను అద్దీ నండీ! హాతింతై కొడుకుని" చెప్పాడు అద్దీ.

"అద్దీ అంటే నువ్వేనా!" అంటూ దైవప్రవక్త (సల్లం) లేచి అద్దీ చేతిని తన చేతిలోకి తీసుకొని అతడ్ని ఇంటికి పిలుచుకెళ్ళారు. దారిలో ఓ ముసలమ్మ దైవప్రవక్త (సల్లం)ను ఆపి తన పరిస్థితి విన్నవించు కోసాగింది. ఆమె వెంట ఓ పసిబాలుడు కూడా ఉన్నాడు. ఆమె చెబుతున్న మాటలు దైవప్రవక్త (స) ఓపిగ్గా వింటుంటే అద్దీకి ఆశ్చర్యం వేసింది.

"ఓ సాధారణ స్త్రీ చెబుతున్న మాటలు ఎంతో సేపటి నుంచి అంత ఓపిగ్గా వింటున్నాడంటే ఈయన చక్రవర్తి ఎంతమాత్రం కాలేడు" అద్దీ అంతరాత్మ ఘోషించింది.

దైవప్రవక్త (స) వృద్ధురాలితో మాట్లాడాక అద్దీని వెంటబెట్టుకొని ఇంటికి వెళ్ళారు.

"అద్దీ! ఈ దిండు మీద కూర్చో" అన్నారు దైవప్రవక్త (స) ఖర్జూరపుపీచుతో నిండిన ఒక దిండును చూపిస్తూ. తాను మాత్రం మరో దిండు లేనందున నేలపైనే కూర్చున్నారు.

కాని దైవప్రవక్త నేలమీద కూర్చుంటే తాను దిండుమీద కూర్చోవడం అమర్యాదగా ఉంటుందని తలచి "దిండు మీద మీరే కూర్చోండి" అన్నాడు అద్దీ సిగ్గుపడిపోతూ.

"అదేం కుదరదు. మీరే దిండు మీద కూర్చోవాలి" అన్నారు దైవప్రవక్త (స). అప్పుడు అద్దీకి దిండు మీద కూర్చోక తప్పలేదు. "ఈయన చక్రవర్తి కానే కాడు. చక్రవర్తి అయితే ఇలా ప్రవర్తించడు" అనుకున్నాడు మనసులో దిండు మీద కూర్చొంటూ.

"అద్దీ ఇప్పుడు చెప్పు నీ పరిస్థితి ఏమిటో. నువ్వు 'రకూసి'వి కదూ? క్రైస్తవానికి, సాబియానికి మధ్య ఉండే మతాన్ని అవలంబించావు కదూ?" అడిగారు దైవప్రవక్త (స).

"ఔను మహాశయా! నేను 'రకూసి'నే" అన్నాడు అద్దీ.

"నువ్వు నీ జాతిప్రజల నుంచి సమరసొత్తులోని నాల్గవ భాగం వసూలు చేసేవాడివి కదూ? నువ్వు అవలంబించిన మతంలో ధర్మసమ్మతంకాని ధనాన్ని నువ్వు తీసుకునే వాడివి, ఔనా?" ప్రశ్నించారు దైవప్రవక్త (సల్లం) మళ్ళీ.

ఈ మాటలు విన్న తరువాత అద్దీకి ముహమ్మద్ (సల్లం) తప్పకుండా దైవప్రవక్తే



అయిఉంటారని నమ్మకం కుదిరింది. అందువల్ల అతను నిజాన్ని అంగీకరిస్తూ "ఔనండీ! నేనీ విధంగానే చేస్తున్నాను" అన్నాడు.

"అద్దీ! ముస్లింలు ఈరోజు పేదవాళ్ళుగా ఉన్నారని భావించి నువ్వు ఇస్లాం స్వీకరించడానికి వెనకాడుతున్నావు కాబోలు. కాని ముస్లింలు సిరిసంపదలతో తులతూగే రోజు ఎంతో దూరం లేదు. ఆనాడు వీరు దానధర్మాలు చేసినా వాటిని తీసుకునేవాళ్ళు లభించరు. లేదా ఈరోజు ముస్లింలు తక్కువ సంఖ్యలో ఉన్నారని తలచి నువ్వు ఇస్లాంని ఆశ్రయించడానికి సిద్ధంగా లేవనుకుంటా. కాని హజ్‌యాత్ర కోసం ఖాదిసియా నుండి ఒక స్త్రీ ఒంటరిగా ఒంటె మీద బయలుదేరి, దారిలో దైవభయం తప్ప మరెవరి భయం లేకుండా ప్రయాణం చేస్తోందన్న వార్త నువ్వు త్వరలోనే వింటావు.

లేదా ఈనాడు ముస్లింలకు రాజ్యాధికారం లేనందున నీకీ ధర్మం స్వీకరించడం ఇష్టం లేదు కాబోలు. కాని అద్దీ! గుర్తుంచుకో. బాబిల్ శ్వేతవీధులను ముస్లింలు జయించారని, (ఈరాన్ చక్రవర్తి) కిస్రా ధనాగారాలు ముస్లింల స్వాధీనమయ్యాయని నువ్వు త్వరలోనే వింటావు" అన్నారు దైవప్రవక్త (సల్లం) భవిష్యత్తులో జరగనున్న సంఘటనల్ని వివరిస్తూ.

"ఏమిటీ! కిస్రా ఇబ్నె హర్మూజ్ ధనాగారాలే!!" అన్నాడు అద్దీ ఆశ్చర్యపోయి చూస్తూ. "ఔను. కిస్రా ఇబ్నె హర్మూజ్ ధనాగారాలే" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఈ మాటలన్నీ విన్నాక అద్దీ కళ్ళ ముందున్న అపోహలు తొలగిపోయాయి; అజ్ఞానపు కారుచీకట్లు మటుమాయమైపోయాయి. ఇక ఉండబట్టలేక అప్పటికప్పుడు అతను ఇస్లాం స్వీకరించి దైవసిపాయిలలో చేరిపోయాడు.

## 50. తబూక్ దండయాత్ర

దాదాపు యావత్తు అరేబియా ముస్లింల అధీనంలోకి వచ్చింది. ఇస్లాం వ్యతిరేకశక్తుల బలం తగ్గిపోయింది. సర్వత్రా దైవధర్మమే ప్రకాశించసాగింది. అయితే ఇంకా ఇస్లామీయ రాజ్యసరిహద్దుల్ని పటిష్ఠం చేయవలసిఉంది. అరేబియా ఉత్తర సరిహద్దులో ఉన్న సిరియా రోమన్ల అధీనంలో ఉన్నందున ఆ ప్రాంతపు సరిహద్దుల భద్రత కోసం మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. ఈ సమస్యను గురించి దైవప్రవక్త (సల్లం) నిరంతరం యోచిస్తూ ఉండేవారు. రోమ్ సైన్యాలు ఏ క్షణమయినా ఇస్లామీయ రాజ్యంపై దాడిచేసే ప్రమాదముందని ఆయనకు అనుమానంగా ఉంది.

ఈ అనుమానం కొన్నాళ్ళకే నిజమయ్యే సూచనలు కానవచ్చాయి. రోమన్లు మదీనాపై దాడిచెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారని సమాచారం అందింది. తక్షణమే ఆయన శక్తికల వారంతా యుద్ధానికి సిద్ధం కావలసిందిగా ప్రకటన చేశారు.

ఏదైనా దండయాత్రకు పోవలసివస్తే దైవప్రవక్త (స) సాధారణంగా ముజాహిద్‌లకు యుద్ధం చేయవలసిన ప్రాంతం పేరు ముందుగా చెప్పేవారు కాదు. అలాంటిది ఈసారి ఆయన యుద్ధస్థలం పేరును ముందుగానే తెలియజేశారు. దాంతోపాటు ప్రయాణం చేయవలసిన దిశ కూడా తెలిపారు.

ఈసారి ముజాహిద్‌లు సుదీర్ఘ ప్రయాణం చేయవలసి ఉంది. పైగా అది తీవ్రమైన ఎండాకాలం. పకడ్బందీగా భారీఎత్తున సన్నాహాలు చేయవలసిన అవసరముంది. అత్యధిక సైనికులు, ఆయుధాలు, వాహనాలను సమీకరించవలసి ఉంది. ఇన్ని కారణాల వల్ల దైవప్రవక్త (సల్లం) ఈసారి యుద్ధ పథకాన్ని రహస్యంగా ఉంచలేదు.

దైవప్రవక్త (సల్లం) ప్రకటన వినగానే ముస్లింలు యుద్ధసన్నాహాలు ప్రారంభించారు. ఈ భారీదండయాత్ర కోసం అపారమైన ఆయుధాలు, ఆహారపదార్థాలు కావాలి కనుక దైవప్రవక్త (సల్లం) ధన, కనక, వస్తు త్యాగాల కోసం ప్రజలను ప్రేరేపించారు.

దైవప్రవక్త (సల్లం) బోధతో ఉత్తేజితులైన ప్రజలు విశాలహృదయంతో భూరి విరాళాలు అందజేశారు. కొందరు ధర్మసంస్థాపనా మార్గంలో తమ సర్వస్వం త్యాగం చెయ్యాలన్న వీరావేశంతో తమ శక్తికి మించిన విరాళాలు కూడా ఇచ్చారు.

హ్రజత్ ఉస్మాన్ (రజి) వేయి దీనార్‌ల విలువగల వస్తువుల్ని దైవప్రవక్త (సల్లం)కు అందజేశారు. ఆయన ధనికులైనప్పటికీ ఈ విరాళం ఆ కాలంలో అత్యధికమైనదే.

హ్రజత్ ఉమర్ (రజి) ధనత్యాగం విషయంలో అబూబకర్ (రజి)ని మించిపోవాలని నిర్ణయించుకొని తన యావదాస్తిలో అర్ధభాగం తీసుకొని వచ్చారు. దైవప్రవక్త (సల్లం) అది చూసి "భార్యాపిల్లల కోసం ఏమైనా మిగిల్చి పెట్టావా లేదా?" అని అడిగారు. దానికి హ్రజత్ ఉమర్ "వాళ్ళ కోసం సగం వదలిపెట్టాను" అన్నారు.

ఆ తరువాత హ్రజత్ అబూబకర్ (రజి) ఇంట్లో ఉన్నదంతా ఊడ్చి తెచ్చి ప్రవక్త (సల్లం) పాదాల చెంత పోశారు. ఈ అసాధారణ దాతృత్వం చూసి ఆయన అబ్బురపడ్డారు.

"అబూబకర్! ఉన్నదంతా తెచ్చినట్లుంది. మరి ఇంట్లో భార్యాపిల్లల కోసం ఏం వదలిపెట్టావు?" అని అడిగారు ఆయన. "భార్యాపిల్లల కోసం దేవుడు, దైవప్రవక్త చాలు" అన్నారు హ్రజత్ అబూబకర్ (రజి).

ఇది ధనికుల పరిస్థితి. మధ్యతరగతి ప్రజలు కూడా ఈమహాకార్యం కోసం శక్తివంచన లేకుండా తమకున్న దాంట్లోనే అత్యధికంగా విరాళాలు అందజేశారు. పేదవాళ్ళు కూడా తమ సంపాదనలో అంతో ఇంతో తెచ్చి విరాళాల గుట్టలో పెట్టేశారు.

కొందరు ముస్లింలు ఈ దండయాత్రకు కావలసిన ఏర్పాట్లన్నీ స్వయంగానే సిద్ధం చేసుకున్నారు. ఇంకాస్త శక్తి కల్గినవారు స్వంత ఏర్పాట్లు చేసుకోవడమేగాక, ఇతరుల కోసమని కొన్ని వస్తువుల్ని కూడా దైవప్రవక్త (సల్లం) ముందు ప్రవేశపెట్టారు.

పేదవాళ్ళు తమకు కావలసిన యుద్ధావసరాలను సమకూర్చుకోలేక పోయారు. వారు దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి తమ కోసం ఏదైనా ఏర్పాట్లు చేయమని మనవి చేసుకున్నారు. దైవప్రవక్త (స) అలా సాధ్యమైనంతవరకు అనేకమందికి ఏర్పాట్లు చేశారు. మిగిలినవారికి ఆయన తన అసహాయత వ్యక్తపరిచారు. ధర్మయుద్ధంలో పాల్గొనాలని ఎంతో ఉత్సాహంతో వచ్చిన వీరు, దైవప్రవక్త (స) తన అసహాయత వెలిబుచ్చడంతో ఢీలాపడి పోయారు. ధర్మయుద్ధం చేసే భాగ్యానికి తాము నోచుకోలేక పోతున్నామేనని కంటతడి పెట్టుకొని వాడిన ముఖాలతో వెనుదిరిగి పోయారు.



"అలాగే నీ దగ్గరకు వచ్చి వాహన సౌకర్యం కల్పించమని మనవి చేసుకున్నవారి విషయంలో కూడా ఎలాంటి ఆక్షేపణ లేదు. వారి విజ్ఞప్తికి సమాధానంగా "మీకు నేను వాహన సౌకర్యాలు కల్పించలేను" అన్నావు నీవు. అప్పుడు వారు గత్యంతరంలేక అశ్రుపూరిత నయనాలతో వెళ్ళి పోయారు. సొంత ఒనరులతో ధర్మపోరాటంలో పాల్గొనే భాగ్యం తమకు లేకపోయిందే అని వారు ఎంతగానో బాధపడ్డారు." (ఖుర్ఆన్-9:92)

ఇదీ దేవుడు, దైవప్రవక్త (స) పట్ల అపార ప్రేమాభిమానాలున్న అనుచరుల పరిస్థితి. కాని కపటులు వైఖరి యుద్ధప్రకటన వినగానే నెత్తిమీద పిడుగు పడినట్లు నిలువుగుడ్లు వేశారు. వీరు స్వయంగా యుద్ధానికి బయలుదేరకపోగా బయలుదేరే వారిని కూడా ఆటంకపరచడానికి ప్రయత్నించారు.

# 51. కపట విశ్వాసుల ఆగడాలు

ఏమిటీ! ఇంత తీవ్రమయిన ఎండాకాలంలో యుద్ధానికి బయలుదేరుతున్నారా!! కాస్త ఆలోచించండి. పైన నిప్పులు కురిపించే సూర్యుడు; క్రింద చుర్రున కాలే ఇసుక నేల; ఆపై సుదీర్ఘ ప్రయాణం!! అమ్మోయ్! ఇలాంటి పరిస్థితిలో బయలుదేరితే ఇంకేమైనా ఉందా!! చీమల్లా మలమల మాడి చావరూ!!! అయినా ఒక వైపు పొలాల్లో పంటలు, తోటల్లో పండ్లు పండి కోతకు సిద్ధంగా ఉంటే ఈ ప్రయాణ సన్నాహాలు ఏమిటీ?" అంటూ కపటవిశ్వాసులు ముజాహిద్‌లను అధైర్య పరచసాగారు.

"(తబూక్ యుద్ధానికి బయలుదేరకుండా) వెనకుండిపోయినవారు దైవప్రవక్తకు సహకరించకుండా ఇంట్లో కూర్చుండి పోయామనుకుంటూ తెగ సంబరపడ్డారు. దైవమార్గంలో ధనప్రాణాలొడ్డి పోరాడటం వారికి ఇష్టం లేకపోయింది. పైగా వారు ప్రజలతో "ఇంత తీవ్రమయిన వేసవి వేడిలో బయలుదేరకండి" అన్నారు. "నరకాగ్ని వేడి ఇంతకంటే తీవ్రంగా ఉంటుంద"ని చెప్పు. వారీ విషయం గ్రహిస్తే ఎంత బాగుంటుంది! ఇప్పుడు వారు (తమ నిర్వాకం పట్ల) నవ్వుకుంటే నవ్వుకోని. చివరకు వారు తమ దుష్కార్యాల ఫలితంగా పరలోకంలో హృదయ విదారకంగా రోదిస్తారు." (ఖుర్ఆన్-9:81,82)

పైకి ముస్లింలని చెప్పుకుంటున్న ఈ దుర్మార్గులు దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞను బహిరంగంగా త్రోసిపుచ్చలేక తప్పించుకునే మార్గాలు వెతికారు. దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి రకరకాల సాకులు చెప్పసాగారు.

"దైవప్రవక్తా! మాఇళ్ళు భద్రంగా లేవు. మమ్మల్ని యుద్ధం నుండి మినహాయించండి." "మేమిప్పుడు యుద్ధం చేయలేని స్థితిలో ఉన్నాము. మమ్మల్ని విడిచి పెట్టండి." "మా భార్యాపిల్లలకు దిక్కెవరూ లేరు. మమ్మల్ని మదీనాలోనే ఉండనివ్వండి."

"దేవుణ్ణి, అంతిమదినాన్ని విశ్వసించేవారు తమ ధనప్రాణాలతో పోరాడకుండా (ఇంట్లో కూర్చోనీయవలసిందిగా) ఎన్నడూ నిన్ను సెలవు అడగరు. దైవభీతి పరాయణులు ఎలాంటి వారో దేవునికి బాగా తెలుసు. దేవుణ్ణి, అంతిమదినాన్ని మనస్ఫూర్తిగా నమ్మనివారే ఇలాంటి విజ్ఞప్తులు చేసుకుంటారు. వారి హృదయాల్లో అనుమాన రోగం ఉంది. ఆ అనుమానంతోనే వారు సతమతమయి పోతున్నారు." (ఖుర్ఆన్-9:44,45)

"వారికి నిజంగా (యుద్ధానికి) బయలుదేరాలన్న ఉద్దేశ్యముంటే దానికోసం వారు తగిన సన్నాహాలు చేసుకునేవారు. కాని వారు బయలుదేరడం దేవునికి ఇష్టం లేదు. అందుకే ఆయన వారిని బద్ధకస్తులుగా చేశాడు. "(ఇంట్లో) కూర్చుండి పోయేవారితో పాటు మీరూ కూర్చోండి" అని వారికి చెప్పడం జరిగింది." ఒకవేళ వారు మీతోపాటు బయలుదేరి ఉంటే మీకు లేనిపోని ఇబ్బందులు తెచ్చిపెట్టేవారు. పైగా వారు మీమధ్య కలహాలు సృష్టించడానిక్కూడా తీవ్రంగా ప్రయత్నించేవారు. మీలో ఇప్పటికీ కొందరు వారిమాటలు చెవియొగ్గి వినేవారున్నారు. దేవునికి దుర్మార్గుల సంగతి బాగా తెలుసు." (ఖుర్ఆన్-9:46,47)

"ఇంతకు పూర్వం కూడా వారు కలహాలు సృష్టించాడానికి ప్రయత్నించారు. నీ పని విఫలం చేయడానికి వారు రకరకాల పన్నాగాలు పన్ని చూసుకున్నారు. చివరికి వారి అభిమతానికి వ్యతిరేకంగా సత్యం వచ్చి దేవుని పనే నెరవేరింది." (ఖుర్ఆన్-9:48)

జుద్దా బిన్ ఖైస్ అనే కపటవిశ్వాసి దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వచ్చి "మహాశయా! నన్ను ఇక్కడే ఉండి పోవడానికి అనుమతివ్వండి. రోమ్‌స్త్రీలు చాలా అందంగా ఉంటారు. వాళ్ళను చూస్తే నేను నిగ్రహించుకోలేను. అంచేత అక్కడకు పంపి నన్ను అనవసరంగా మనోవికారానికి గురిచేయకండి" అన్నాడు.

"వారిలో ఒకడు "నాకు (ఇంట్లో ఉండిపోవడానికి) అనుమతివ్వండి. (అనవసరంగా) నన్ను మనోవికారానికి గురిచేయకండి" అంటాడు. విను, వారు మనోవికారంలోనే పడి వున్నారు. ఇలాంటి అవిశ్వాసులకు నరకం చుట్టిముట్టి ఉంది." (ఖుర్ఆన్-9:49)

ఇలా ఈ కపటులు లేనిపోని కారణాలు చూపించి యుద్ధానికి బయలుదేరకుండా మదీనాలోనే ఉండిపోయారు. అయితే వారిలో కొందరు తమ దుష్టపన్నాగాల ద్వారా ముజాహిద్‌ల ఐక్యతను దెబ్బతీయడానికి ఈ దండయాత్రలో పాల్గొన్నారు.

సువైలిం అనే ఓ యూదుని ఇల్లు కపటుల కార్యకలాపాలకు నిలయమయింది. ఇక్కడ కపటవిశ్వాసులు తరచుగా సమావేశమవుతూ రహస్య సమాలోచనలు జరుపుతారు. ముస్లింలకు వ్యతిరేకంగా పథకాలు రూపొందిస్తారు. దైవప్రవక్త (సల్లం)కు ఈ విషయం తెలిసింది. కపటులు విషం వెదజల్లుతూ ముస్లింలను యుద్ధానికి బయలుదేరనీకుండా నిరోధిస్తున్నారని కూడా ఆయనకు సమాచారం అందింది.

ఈ సమాచారం అందిన వెంటనే దైవప్రవక్త (సల్లం) సువైలిం ఇంటిని తగలబెట్టమని కొందరు అనుచరుల్ని పంపారు. వారు వెళ్ళి ఆ ఇంటికి నిప్పెట్టారు. లోపల రహస్యంగా సమావేశమయి చర్చలు జరుపుకుంటున్న కపటులంతా గుండెలు బాదుకుంటూ బయటికి పరుగెత్తారు. ఈ సంఘటనతో వారి కార్యకలాపాలు తాత్కాలికంగా ఆగిపోయాయి.

దైవప్రవక్త (స) ప్రకటన విని సుదూరప్రాంతాల నుండికూడా ముజాహిద్‌లు మదీనా వచ్చారు. కొన్ని రోజుల్లోనే బ్రహ్మాండమయిన సైన్యం తయారయింది. యుద్ధ సన్నాహాలు పూర్తయ్యాయి. హజ్రత్ అబూబకర్ (రజి) సర్వసేనానిగా నియమించబడ్డారు.

దాదాపు పురుషులంతా యుద్ధానికి వెళ్తున్నందున మదీనా పరిరక్షణ కోసం దైవప్రవక్త (సల్లం) హజ్రత్ ముహమ్మద్ బిన్ మస్లిమా (రజి)ని గవర్నర్‌గా నియమించారు. ఆయనకు



సహాయంగా హజ్రత్ అలి (రజి)ని కూడా నియమించారు.

అబూఆమిర్ అనే ఒక క్రైస్తవ సాధువు ముస్లింలకు, బహుదైవారాధకులకు మధ్య జరిగిన అనేక యుద్ధాలలో ప్రముఖపాత్ర వహించి దైవప్రవక్త (స)పై ప్రతీకారం తీర్చుకోవడానికి ప్రయత్నించాడు. కాని అరబ్ తెగలన్నీ ఏకమైనా ఇస్లాం అంతం కాకపోవడంతో అతను రోమ్ చక్రవర్తి వద్దకెళ్ళి ఇస్లాం వల్ల కలిగే ప్రమాదం గురించి హెచ్చరించాడు.

అబూఆమిర్ సాగిస్తున్న ఇస్లాంవ్యతిరేక కార్యకలాపాలలో మదీనా కపటులు కూడా చేరిపోయారు. అతను ఇస్లాంకు వ్యతిరేకంగా రోమ్ సైన్యాలను, ఉత్తర అరేబియాలోని క్రైస్తవరాజ్యాల సైన్యాలను కూడగట్టేందుకు రోమ్‌కు బయలుదేరాడు. ఆ సమయంలో కపటులు అబూఆమిర్‌తో మంతనాలు జరిపి తమ రహస్య కార్యకలాపాలు సాగించడానికి మదీనాలో ఒక మసీదు నిర్మించాలని నిర్ణయించారు.

ఇస్లాం తెరచాటున ఇస్లాం వ్యతిరేక కార్యకలాపాలు సాగించడానికి మసీదు ఎంతో అనువయిన కేంద్రం. అందుకే వారీ నిర్ణయం తీసుకొని మసీదు నిర్మించారు. ఇక్కడ రోమ్ గూఢచారులు, అబూఆమిర్ ఏజెంట్లు కూడా కపటుల్ని నిస్సంకోచంగా కలుసుకొని తగిన పన్నాగాలు పన్నవచ్చని కూడా వారుభయుల మధ్య ఒక అంగీకారం కుదిరింది.

మదీనాలో ఇంతకుముందే రెండు మసీదులు ఉన్నాయి. ఇప్పుడు మూడవ మసీదు నిర్మించాల్సిన అవసరంలేదు. కాని కపటులు వర్షాకాలంలో, చలికాలంలో వృద్ధులు నమాజు కోసం అంతదూరం పోలేరన్న సాకు చెప్పి ఈ మూడవ మసీదు నిర్మించుకున్నారు.

అంతటితో ఆగక వారు తమ మత ముసుగును మరింత పటిష్ఠపరచుకోవడానికి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "తమరు ఓసారి ఈ (జిరార్) మసీదులో నమాజు చేయించి దీనికి ప్రారంభోత్సవం చేయండి" అన్నారు అతివినయం ఒలకబోస్తూ.

కాని దైవప్రవక్త (స) ఆ విషయాన్ని దాటవేస్తూ "నేనిప్పుడు యుద్ధసన్నాహాలలో నిమగ్నమయి ఉన్నాను. తబూక్ దండయాత్రకు వెళ్తున్నాను. తిరిగొచ్చాక దాని సంగతి చూస్తాను" అన్నారు.

హిజ్రీ 9 వ సంవత్సరం, రజబ్ నెలలో ముప్ఫయివేల మంది ముజాహిద్‌లతో కూడిన భారీ సైనికవాహిని అమితోత్సాహంతో మదీనా నుండి కదిలింది. ఉప్పొంగుతూ, ఉరకలు వేస్తూ గలగలపారే సెలయేరులా సిరియా దిశగా ప్రయాణమయింది.

ఆకాశం నుండి అగ్నికణాలు కురుస్తున్నాయి. క్రింద ఇసుక నేల పాదాలను పెనంలా మాడ్చివేస్తోంది. వడగాల్పులు గొంతు తడిని ఆర్పివేస్తున్నాయి. పశువులు కూడా నీటి కోసం తపించి పోతున్నాయి. కాని కనుచూపుమేరలో ఎక్కడా నీటి సూచనలే లేవు. క్షణక్షణానికి దప్పిక అధికమవుతోంది. నాలుకలు పిడచలు కట్టుకొని పోతున్నాయి. ముఖాలు వాడి మాడిపోతున్నాయి. ప్రయాణ వేగం తగ్గిపోయింది.

కొందరు సహచరులు దైవప్రవక్త (సల్లం) దగ్గరికి పోయి తమ బాధ గురించి చెప్పుకున్నారు. నీటి కోసం దైవాన్ని ప్రార్థించమని విన్నవించుకున్నారు. దైవప్రవక్త (సల్లం) అలాగే నని నీటి కోసం దైవాన్ని ప్రార్థించారు.

ఇంకేముంది! దైవానుగ్రహం పొంగిపొరలింది. చూస్తుండగానే నిర్మలాకాశంలో మబ్బు తునకలు ప్రత్యక్షమయ్యాయి. క్షణాల్లో ఆకాశమంతా మేఘావృతమయింది. ఆ వెనువెంటనే చిటపట చినుకులతో వర్షం ప్రారంభమయింది. అది కాస్సేపటికి ఉధృతమై కుండపోత వర్షం కురిసింది. ముజాహిద్‌ల ఆనందం అవధులు దాటింది. ఎక్కడ చూసినా నీరే నీరు! జనం తనివితీరా తాగారు. కావలసినంత నీటితో స్నానాలు చేశారు. నీటి తిత్తులన్నీ నింపుకొని భద్రపరచుకున్నారు. రొట్టెలు తయారుచేసుకొని కడుపారా తిన్నారు. పశువులు కూడా బాగా నీళ్ళు తాగి దప్పిక తీర్చుకున్నాయి.

వర్షం వెలసింది. ముజాహిద్‌ల అలసట తీరింది. అందరూ పరమసంతోషంతో దైవానికి కృతజ్ఞతలు అర్పించుకున్నారు. నడిఎండాకాలంలో, కటిక ఎడారి ప్రదేశంలో ఈ వర్షం నిజంగా దైవానుగ్రహం కాకపోతే మరేమిటి? నిస్సందేహంగా ఇది విశ్వప్రభువు అనుగ్రహమే! ఆయన ప్రవక్త (సల్లం) చేసిన ప్రార్థనా ఫలితం!!

అందరూ ఈ విషయాన్ని గురించే వింతగా చెప్పుకోసాగారు. కాని కేవలం సమరసొత్తు ఆశించి వచ్చిన కపటవిశ్వాసులు మాత్రం ఈ మాటలను సహించలేకపోయారు.

“అరె! ఏం మహాత్యాన్ని గురించి చెప్పుకుంటున్నారయ్యా మీరు? ఇవి ఏదో ఎండవల్ల ఏర్పడిన మేఘాలు మాత్రమే. వచ్చాయి, వర్షించాయి. ఇందులో మహత్యం ఏముందని మీరు మహా వింతగా చెప్పుకుంటున్నారు?” అన్నారు వారు.

మనస్ఫూర్తిగా దేవుణ్ని, ఆయన ప్రవక్త (స)ను విశ్వసించినవారు కపటుల కువిమర్శలను గురించి పట్టించుకోలేదు. కాని కపటులు ఆ విషయంతో ఊరుకోలేదు.

“రోమన్లు అంటే ఏమనుకుంటున్నారు మీరు? అరబ్బులతో పోరాడి గెలిచాం కదా, ఇక రోమన్ల సంగతి ఏముందిలే అని తలుస్తున్నారా? అసలు మీకు రోమన్ల శౌర్య పరాక్రమాలను గురించి పూర్తిగా తెలియదు. అందుకే మీరు తొందరపడ్డారు. ఇప్పుడు ప్రమాదం కొనితెచ్చుకోబోతున్నారు. మిమ్మల్ని చూస్తుంటే మాకెంతో జాలివేస్తోంది. రోమన్ సైనికులు మిమ్మల్ని తాళ్ళతో బంధించి ఈడ్చుకెళ్తున్న దృశ్యాలే మాకళ్ళ ముందు అనుక్షణం మెదలుతున్నాయి” అన్నారు వారు ముజాహిద్‌లతో.

కపటుల పలుకులు దైవప్రవక్త (స) చెవిన పడ్డాయి. ఆయన ముఖం ఎర్రబారింది. వెంటనే ఆయన హజ్రత్ అమ్మార్ (రజి)ని పిలిచి “అమ్మార్! అక్కడ కూర్చున్న వాళ్ళేదో గందరగోళం సృష్టించేలా ఉన్నారుగాని, కాస్త వాళ్ళను ఇలా పిలుచుకురా, సంగతేమిటో కనుక్కుందాం” అని చెప్పారు.

హజ్రత్ అమ్మార్ (రజి) కపటుల దగ్గరికెళ్ళి “పదండి, దైవప్రవక్త (సల్లం) మిమ్మల్ని పిలుస్తున్నారు” అని అన్నారు. దైవప్రవక్త (స) పిలుస్తున్నారనగానే కపటుల గుండెలు గుభేలుమన్నాయి. తమల్ని గురించి ఆయనకు అంతా తెలిసిపోయిందని భయపడ్డారు. ఎలాగో వారు దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చారు. కాని ఇక్కడా వారు నాటకం ఆడారు.

“దైవప్రవక్తా! మేమేదో తమాషాగా అలా అన్నాం. అంతేగాని, ఈ విషయం గురించి మేము గంభీరంగా ఏదీ మాట్లాడలేదు” అంటూ పచ్చి అబద్ధం కక్కేశారు.



“మీరు మాట్లాడుతున్నదేమిటని అడిగితే “మేమేదో పరిహాసంగా అంటున్నాం” అంటారు వారు. వారికి చెప్పు: “మీరు దేవునితో, ఆయన సూచనలతో, ఆయన ప్రవక్తతోనా పరిహాస మాడేది? ఇకనైనా సాకులు చెప్పడం మానుకోండి. మీరు సత్యాన్ని విశ్వసించిన తరువాత తిరస్కారవైఖరి అవలంబించారు. మేము మీలో కొందరిని క్షమించినా మిగిలినవారిని తప్పకుండా శిక్షిస్తాము. వారు పరమదుర్మార్గులు.” (ఖుర్ఆన్–9:65,66)

కపటులు అంతటితో తమ దుష్టచర్యలు మానుకోలేదు. వారు దొరికే ప్రతి అవకాశాన్ని వాడుకోవడానికి ప్రయత్నించారు. ఒక రోజు దైవప్రవక్త (స) ఒంటె తప్పిపోయింది. దాన్ని వెతకడానికి కొందరు బయలుదేరారు. దరిదాపుల్లో ఉన్న కొండలు, ఇసుకతిన్నెలు అన్నీ గాలించారు. కాని ఒంటె జాడ కన్పించలేదు. అప్పుడు దైవప్రవక్త (స) పట్ల జనంలో అనుమాన బీజాలు నాటేందుకు జైద్ బిన్ అసీత్ అనే కపటికి మంచి అవకాశం లభించింది.

జైద్ తరచుగా అమ్మార్ బిన్ హజమ్ (రజి) ఉండే శిబిరానికి వస్తుండేవాడు. అక్కడే అతను గోష్టులు, సమావేశాలు నిర్వహిస్తుండేవాడు. ఆరోజు ప్రవక్త ఒంటె కన్పించలేదని తెలియగానే అతను సమావేశంలో జనాన్ని ఉద్దేశించి “ముహమ్మద్ తనకు ఆకాశం నుండి దైవసందేశం వస్తున్నట్లు చెబుతున్నాడుగాని, ఆయనకు తన ఒంటె ఎక్కడికి పోయిందో మాత్రం తెలియదు!” అంటూ దెప్పిపొడిచాడు.

ఈ సంగతి కూడా దైవప్రవక్త (సల్లం)కు తెలిసింది. ఆయన అనుచరులతో ముచ్చటిస్తున్న సమయమది. హజ్రత్ అమ్మార్ (రజి) కూడా అక్కడే ఉన్నారు.

“ఒకతను ఇలా అంటున్నాడు. కాని నేను అగోచర విషయాలు తెలిసినవాణ్ని కానని మీకందరికీ తెలుసు. దేవుడు తెలిపిన విషయాలే నాకు తెలుస్తాయి. అంతకుమించి ఒక్క వియయమూ నాకు తెలియదు” అన్నారు దైవప్రవక్త ఆవేదనా పూరిత మనస్సుతో.

ఆ తర్వాత కొద్ది క్షణాలకే దేవుడు దివ్యావిష్కృతి ద్వారా తన ప్రవక్తకు ఒంటె జాడ తెలిపాడు. దైవప్రవక్త (స) తన అనుచరులకు ఒంటె ఉన్న ప్రదేశాన్ని తెలిపి వెళ్ళి దాన్ని తోలుకురమ్మని చెప్పారు. అనుచరులు పోయిచూస్తే అక్కడ నిజంగానే ఒంటె కన్పించింది. సంతోషంతో వారు ఒంటెను తోలుకొచ్చి దైవప్రవక్త (సల్లం)కు అప్పగించారు.

హజ్రత్ అమ్మార్ (ర) తప్పిపోయిన ఒంటెను చూసిన తర్వాత నేరుగా తన శిబిరానికి వెళ్ళిపోయారు. అక్కడున్న వారికి జరిగిన వృత్తాంతం విన్పించారు. జైద్ నిర్వాకం గురించి అమ్మార్ (రజి)కు ఇంకా తెలియదు. అయితే ఆయన చెప్పిన వృత్తాంతం విన్న తరువాత ఒక మిత్రుడు “అమ్మార్! మీరు ఏమనిషి గురించి ఇలా చెబుతున్నారో అతను జైద్. అతనే దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా ఈ కారుకూతలు కూశాడు” అని తెలిపాడు.

ఈ సంగతి తెలియగానే హజ్రత్ అమ్మార్ (రజి) పట్టరాని కోపంతో పళ్ళు నూరుతూ జైద్ మీదికి లంఘించారు. అతని గుండెపై ఎక్కి విపరీతంగా కొట్టసాగారు. “సోదరులారా! చూశారా వీడ్ని. వీడు మనల్ని కాటెయ్యడానికి మన దగ్గర దాక్కున్న త్రాచుపాము... దుర్మార్గుడా! మాతో కలసిఉంటూ ఇదా నీవు చేస్తున్న నిర్వాకం! పో బయటికి. నీ ముఖం చూపించకు ఇకనుంచి” అంటూ ఆయన జైద్‌ని చితగ్గొట్టి బయటికి గెంటివేశారు.

"వారు దేవునిపేరుతో ప్రమాణాలు చేస్తూ తాము మీలోని వాళ్ళమేనంటారు. కాని వారు మీలోనివాళ్లు కానేకారు. వారసలు పిరికిపందలు, భయస్తులు. (బాధ్యతల నుండి తప్పించుకోడానికి) వారికేదైనా ఆశ్రయంగాని, కొండగుహగాని లేదా దూరికూర్చునే ఓ చిన్న బిలంగాని దొరికితే చాలు, వెంటనే వారు పరుగెత్తికెళ్ళి అందులో దాక్కుంటారు." (9:56,57)

"ఈ కపటులు తమ మనసులో ఉన్న రహస్యాల్ని బట్టబయలుచేసే అధ్యాయం ఏదైనా అవతరిస్తుందేమోనని భయపడుతున్నారు. ప్రవక్తా! వారికిలా చెప్పు: 'మీరు అలాగే అపహాస్యం చేస్తూ ఉండండి. మీరు భయపడుతున్న విషయాలను దేవుడు త్వరలోనే బట్టబయలు చేస్తాడు."

"మీరు మాట్లాడుతున్నదేమిటని అడిగితే 'మేమేదో పరిహాసంగా అంటున్నాము' అంటారు వారు. వారికి చెప్పు: 'మీరు దేవునితో, ఆయన సూక్తులతో, ఆయన ప్రవక్త తోనా పరిహాసమాడేది? ఇకనైనా సాకులు చెప్పడం మానుకోండి. మీరు సత్యాన్ని విశ్వసించిన తర్వాత తిరస్కారవైఖరి అవలంబించారు. మేము మీలో కొందరిని క్షమించినా మిగిలిన వారిని మాత్రం తప్పకుండా శిక్షిస్తాం. వారు పరమ దుర్మార్గులు." (ఖుర్ఆన్.9:64-66)

"కపటపురుషులు, కపటస్త్రీలు అంతా ఒకే కోవకు చెందిన తోడుదొంగలు. వారు (ప్రజలకు) చెడువిషయాల్ని గురించి ఆదేశిస్తారు. మంచివిషయాల నుంచి నిరోధిస్తారు. వారు సత్కార్యాలు చేయకుండా తమ చేతులు కట్టివేసుకున్నారు. వారసలు దేవుడ్నే విస్మ రించారు. అంచేత దేవుడు కూడా వారిని విస్మరించాడు. కపటులు పరమదుర్మార్గులు. కపట స్త్రీపురుషులకు, అవిశ్వాసులకు నరకాగ్ని సిద్ధపరచి ఉంచానని, అందులోనే వారు ఎల్లకాలం పడిఉంటారని దేవుడు వారికి వాగ్దానంచేశాడు. అదే వారికి తగిన శిక్ష. దేవుడు వారిని నాశనం చేయ! వారికి శాశ్వతయాతన తప్పదు." (ఖుర్ఆన్-9:67,68)

"(కపటులారా!) మీ తీరుతెన్నులన్నీ అచ్చం మీకు పూర్వముండిన కపటుల తీరుతెన్ను ల్లాగే ఉన్నాయి. వారు మీకంటే ఎక్కువ బలవంతులు, ఎక్కువ సంతానం సిరిసంపదలు కలవారు. కాని వారు (మా ఉపదేశాలు పెడచెవినపెట్టి) తమవంతు సౌఖ్యాలు బాగా జుర్రు కున్నారు. వారిలాగే ఇప్పుడు మీరూ మీవంతు సౌఖ్యాలు జుర్రుకోండి. గతంలో వారు ఎలా పనికిమాలిన వాదనల్లో పడిపోయారో మీరూ అలాగే పనికిమాలిన వాదనల్లో పడిపోయారు. చివరికి వారు చేసుకున్న కర్మలన్నీ ఇటు ఇహలోకంలోనూ, అటు పరలోకంలోనూ వ్యర్థమై పోయాయి. అలాంటివారే నష్టపోయేవారు." (ఖుర్ఆన్-9:69)

## 52. తబూక్‌లో సైనిక కార్యకలాపాలు

సైన్యం అక్కడ్నుంచి బయలుదేరి ముందుకు సాగింది. సుదీర్ఘ ప్రయాణం చేసిన తరువాత ముజాహిద్‌లు "తబూక్" సమీపానికి చేరుకున్నారు. ఆ ప్రాంతం సిరియా, అరేబియాల సరిహద్దుపై ఉంది. అయితే అక్కడకు చేరుకోగానే రోమన్లు కోటద్వారాలు మూసుకున్నారని తెలిసింది.

ఇప్పుడేం చెయ్యాలి? నగరంలోకి జొరబడి పోరాడటమా లేక ఇక్కడ్నుంచే తిరిగి వెళ్ళి పోవడమా? దైవప్రవక్త (స) ఆలోచనలో పడ్డారు. ఈ విషయమై ఆయన అనుచరుల్ని సమావేశపరచి సంప్రదింపులు జరిపారు.



"దైవప్రవక్తా! దైవాజ్ఞ అయితే ముందుకు పదండి" అన్నారు హజ్రత్ ఉమర్ (రజి). "దైవాజ్ఞ వస్తే నేను మీతో ఎందుకు సంప్రదిస్తాను?" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఆ తరువాత ప్రవక్త అనుయాయులు కూడా పరస్పరం సంప్రదించుకున్నారు. చివరికి నగరంలో ప్రవేశించకుండా బయటే ఉండిపోవాలని నిర్ణయం జరిగింది. నిర్ణయం ప్రకారం ముజాహిద్‌లు నగరం వెలుపలే శిబిరాలు వేసుకున్నారు.

రోమన్లు ముస్లిం సైన్యాలను చూసి కంగారు పడిపోయారు. వారు కోట బయటికి రావడానికే భయపడ్డారు. అలాంటివారు ఇక ముస్లిం యోధుల్ని ఎలా ఎదిరించగల్గుతారు? ఇప్పుడు వారికి ముస్లిల శక్తిగురించి పూర్తిగా తెలిసింది. ముస్లింలు గొప్పశక్తిగా రూపొందారని రోమ్‌కు చుట్టుపక్కలున్న దేశాలు కూడా గ్రహించాయి.

దైవప్రవక్త (సల్లం) తబూక్‌లోనే అనేక రోజులున్నారు. అయినా ఎలాంటి యుద్ధ సూచనలు కానరాలేదు. రోమన్లు ఏమాత్రం కవ్వింపుచర్యలకు పాల్పడలేదు.

రోమన్లు ఇక ముస్లింలకు లొంగిపోయారని తలచి దైవప్రవక్త (సల్లం) నిశ్చింతగా ఉండిపోలేదు. సరిహద్దుల్లో రక్షణఏర్పాట్లు చేసి ఇరుగుపొరుగు శత్రుప్రమాదాన్ని కూడా నివారించవలసి ఉంది. దాన్ని గురించి కూడ దైవప్రవక్త (సల్లం) ఆలోచించారు. ఇరుగు పొరుగు రాజ్యాలతో, తెగలతో శాంతిఒప్పందాలు చేసుకుందామని భావించారు. ఈ ఆలోచనతో ఆయన తబూక్ నుండే అనేకరాజ్యాలకు లేఖలు రాశారు. ఆ రాజులు వచ్చి దైవప్రవక్త (సల్లం)తో శాంతి ఒప్పందాలు చేసుకొని వెళ్ళిపోయారు.

అయితే తబూక్ సమీపంలోని దూమతుల్ జందల్ ప్రాంతం రాజు అకీదర్ బిన్ అబ్దుల్ మలిక్ తిరుగుబాటువైఖరితో ఒప్పందం చేసుకోవడానికి రాలేదు. అంచేత దైవప్రవక్త (స) ఖాలిద్ బిన్ వలీద్ (రజి)కు ఓ సైనికదళం ఇచ్చి ఆ ప్రాంతానికి పంపారు.

అప్పుడాయన ఇలా చెప్పారు: "అకీదర్ నీకు అడవిగోవును వేటాడుతూ కన్పిస్తాడు. వెంటనే నీవతడ్ని బంధించి తీసుకొనిరా." ఖాలిద్ (ర) అలాగేనని బయలుదేరారు. రాత్రంతా ప్రయాణంచేసి తెల్లవారేటప్పటికి అకీదర్ ఉండే రాజమందిరం సమీపానికి చేరుకున్నారు.

అది వేసవికాలం, వెన్నెల రాత్రి. అకీదర్ రాజమందిరం కప్పు మీద భార్య దగ్గర రంగుల కలలుకంటూ హాయిగా పడుకొని ఉన్నాడు. కాస్సేపటికి ఎక్కడ్నుంచో ఓ అడవిగోవు వచ్చి కొమ్ములతో రాజమందిరం తలుపులను కుమ్మడం మొదలెట్టింది. అకీదర్ భార్య ఆశ్చర్యంతో చూస్తూ భర్తను లేపి ఆ దృశ్యం చూపింది. వెంటనే అకీదర్ తన తమ్ముడు హసాన్‌ని పిలుచుకొని గుర్రంమీద ఆ అడవిగోవును వేటాడటానికి బయలుదేరాడు.

అడవిగోవు వాళ్ళను చూసి పరుగెత్తింది. అకీదర్, అతని తమ్ముడు దాని వెంటపడి కొంచెం దూరం వెళ్ళారో లేదో ఖాలిద్(రజి) సైనికులు వచ్చి వాళ్ళను చుట్టుముట్టారు. అకీదర్ కాస్సేపు పెనుగులాడి పట్టుబడ్డాడు. అతని తమ్ముడు హతమార్చబడ్డాడు.

ఖాలిద్ బిన్ వలీద్ (రజి) అకీదర్‌ని బంధించి తెచ్చి దైవప్రవక్త (సల్లం) ముందు ప్రవేశపెట్టారు. అయితే దైవప్రవక్త (సల్లం) అతడ్ని క్షమించి ప్రాణభిక్ష పెట్టారు. అకీదర్ సంతోషంతో తన విధేయత ప్రకటించి జిజ్యా చెల్లించడానికి అంగీకరించాడు.

ఆ తరువాత అతను తనకోటకు తిరిగివెళ్ళి రాజీఒడంబడిక పత్రంతో పాటు రెండు వేల ఒంటెలు, ఎనిమిది వందల గుర్రాలు, నాలుగు వందల ఈటెలు, నాలుగు వందల యుద్ధకవచాలు కానుకలుగా దైవప్రవక్త (సల్లం)కు పంపాడు.

ఈ వ్యవహారాలన్నీ ముగిసిన తర్వాత దైవప్రవక్త(స) కాస్తంత ఊపిరి పీల్చుకున్నారు. ఇక తబూక్‌లో ఉండవలసిన పని లేదు. ఆహారపదార్థాలు కూడా చాలా మటుకు తగ్గిపోయాయి. అందువల్ల మదీనా బయలుదేరవలసిందిగా దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞాపించారు. అప్పుడు ముజాహిద్‌లు మూటాముల్లెలు సర్దుకొని మదీనా తిరుగుముఖం పట్టారు.

దైవప్రవక్త (సల్లం) సైన్యం తీసుకొని మదీనా సమీపంలోని ఓ చోటికి రాగానే దేవుడు ఖుర్‌ఆన్‌లోని "తౌబా సూరా" (9వ అధ్యాయం) అవతరింపజేశాడు.

"ఇంకా కొందరున్నారు. వారు(ఇస్లాంకు) విఘాతం కలిగించే ఉద్దేశ్యంతో ఒక మసీదు నిర్మించారు. వారక్కడ సత్యవ్యతిరేక కార్యకలాపాలు సాగించడానికి, విశ్వాసుల ఐక్యతను చెడగొట్టి వారిలో చీలికలు సృష్టించడానికి నిర్ణయించుకున్నారు. అంతేకాదు, ఇంతకుముందు దేవునితో, ఆయనప్రవక్తతో యుద్ధంచేసి (పరాజయంపాలై) ఉన్నవారికి ఆశ్రయంగా (రహస్య స్థావరంగా) ఉంటుందన్న ఉద్దేశ్యంతో కూడా ఈ మసీదు నిర్మించారు.

వారు మంచి తప్ప తమకు మరో ఉద్దేశ్యం లేదని ప్రమాణంచేసి మరీ చెబుతారు. కాని వారు పచ్చిఅబద్ధాలకోరులని దేవుడు సాక్ష్యమిస్తున్నాడు. కనుక నీవు ఎన్నటికీ ఆ మసీదులో అడుగుపెట్టకు. మొదటినుండీ దైవభీతి పునాదిపై నిర్మించిన మసీదు మాత్రమే ప్రార్థన చేయడానికి నీకు యోగ్యమైనది. అక్కడ పరిశుద్ధంగా (పవిత్రంగా) ఉండగోరే వారు కూడా ఉన్నారు. దేవుడు పరిశుద్ధత పాటించేవారినే ప్రేమిస్తాడు." (ఖుర్‌ఆన్-9:107,108)

"ఇద్దరు వ్యక్తులున్నారు. వారిలో ఒకడు తన కట్టడాన్ని దైవభీతి, దైవప్రసన్నతలనే పునాదులపై నిర్మించాడు. రెండోవాడు తన కట్టడాన్ని నీటి ప్రవాహానికి లోతట్టు భాగం మట్టి కొట్టుకుపోయి డొల్లగా మారిన నదీతీరంపై నిర్మించాడు. తర్వాత అది కాస్తా అతడ్ని తీసుకొని నేరుగా నరకాగ్నిలో పడిపోయింది. మరి ఈ ఇద్దరిలో ఎవరు శ్రేష్ఠులు? మీరే ఆలోచించండి. అలాంటి దుర్మార్గులకు దేవుడు ఎన్నటికీ సన్మార్గం చూపడు. వారు నిర్మించిన ఈ (పునాదులు లేని) కట్టడం వారిహృదయాల్లో ఎల్లప్పుడూ అపనమ్మకాన్నే పెంచిపోషిస్తుంది; వారి హృదయాలు ముక్కలు ముక్కలుగా పగిలిపోతే తప్ప (ఈ అపనమ్మకపు జాడ్యం వారిని ఓ పట్టాన వదలిపెట్టదు). దేవుడు సర్వం తెలిసినవాడు, మహా వివేకవంతుడు." (9:109,110)

ఈ ఆదేశం అందగానే దైవప్రవక్త (సల్లం) కపటులు నిర్మించిన (జిరార్) మసీదును పడగొట్టండని చెప్పి కొందరు అనుచరుల్ని ముందుగా మదీనా పంపించారు. వారు గుర్రాల మీద వేగంగా వెళ్ళి ఆ మసీదును నామరూపాల్లేకుండా నేలమట్టం చేశారు. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) తన అనుచరులతో మదీనా తిరిగొచ్చారు.

## 53. తాయిఫ్ వాసుల ధర్మపరివర్తన

తాయిఫ్ నగరంలో ఉండే సఖీఫ్ తెగ తిరుగుబాటుకు పాల్పడంతో దైవప్రవక్త (స) తాయిఫ్‌ను ముట్టడించి విజయం సాధించలేక మదీనా వెళ్ళిపోయిన సంఘటన గురించి



గతపేజీలలో మనం తెలుసుకున్నాం. సఖీఫ్‌తెగ అగ్రనాయకుల్లో ముఖ్యుడయిన ఉర్వా ముట్టడి సమయంలో తాయిఫ్‌లో లేడు. తాయిఫ్ తిరిగొచ్చిన తరువాత దైవప్రవక్త (స) వచ్చిపోయారని తెలిసింది. వెంటనే అతను మదీనా వెళ్ళాడు. మదీనాలో దైవప్రవక్త (స)ను కలుసుకొని ఇస్లాం స్వీకరించాడు.

తరువాత ఉర్వా (రజి) ఇలా అన్నారు: "దైవప్రవక్తా! నేనిప్పుడు మా పట్నానికి వెళ్ళి మా తెగవాళ్ళకు ఇస్లాం సందేశం అందజేస్తాను. వారికి దైవధర్మంలోని శుభాలను గురించి తెలిపి ఇస్లాం స్వీకరించమని నచ్చజెబుతాను."

తాయిఫ్ ప్రజలకు ఇస్లాం గురించి చెప్పడం అంత తేలిక కాదు. వాళ్ళు ఎంత గర్విష్ఠులో దైవప్రవక్త (స)కు బాగా తెలుసు. అందుకే ఆయన ఉర్వా (రజి)ని వారిస్తూ- "ఉర్వా! అలా చేశావంటే వారు నీకు బద్ధవిరోధులైపోతారు. నిన్ను వధించడానికైనా వెనుకాడరు" అని తన ఆందోళన వెలిబుచ్చారు.

దానికి హజ్రత్ ఉర్వా (రజి) "దైవప్రవక్తా! ఆందోళన చెందకండి. అలా జరగదు. వారు నన్ను ఎంతో గౌరవిస్తారు. తమ కొడుకులకంటే కూడా ఎక్కువ అభిమానిస్తారు. తమ ప్రాణాలకన్నా మిన్నగా చూసుకుంటారు" అని అన్నారు.

ఆ తర్వాత ఆయన మదీనా నుండి బయలుదేరి చీకటిపడే సమయానికి తాయిఫ్‌కు చేరుకున్నారు. సాధారణంగా ఆయన నగరంలో ప్రవేశించి ముందుగా "లాత్" మందిరానికి వెళ్ళేవారు. ఆ మందిరం చుట్టూ ప్రదక్షిణ చేసి, పూజ చేసిన తరువాతనే ఆయన ఇంటికి వెళ్ళేవారు. అయితే ఈసారి ఉర్వా (రజి) అలా చేయకుండా నేరుగా ఇంటికి వెళ్ళారు. ఆయనలో కొత్తగా వచ్చిన ఈ మార్పు చూసి సఖీఫ్ తెగ ప్రజలు ఆశ్చర్యపోయారు. మరునాడు ఉర్వా (రజి) ప్రజలను సమావేశపరచి ఇస్లాంను గురించి హితోపదేశం చేయగానే జనం ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అల్లరికి పాల్పడ్డారు. అదే సమయంలో కొందరు దుండగులు ఆయన్ని చంపి పొట్టనపెట్టుకున్నారు.

సఖీఫ్ తెగవాళ్ళు ఇస్లాంను పెద్ద విపత్తుగా తలిచారు. అందుకే వారు హజ్రత్ ఉర్వా (రజి)ను తమ శ్రేయోభిలాషి, జాతీయ నాయకుడన్న గౌరవం కూడా లేకుండా హతమార్చారు. వారు కేవలం ఇస్లాం వ్యాప్తిని అరికట్టేందుకు తమ ప్రియతమ నాయకుడ్ని బలి తీసుకున్నారు. మరి వారి కోరిక నెరవేరిందా? లేదు. వారనుకున్నట్లు ఇస్లాంజ్యోతి క్షీణించలేదు. అది మరింత వెలిగిపోతూ నేల నాలుగుచెరగులా కాంతి విరజిమ్మసాగింది. ఉర్వా (రజి) కొడుకు, పినతండ్రి కొడుకు హృదయాల్ని కూడా అది జ్యోతిర్మయం చేసింది. తక్షణమే వారు దైవప్రవక్త (సల్లం) సన్నిధికి పోయి ఇస్లాం స్వీకరించారు. ఆ తర్వాత కొంతకాలనికే అనేక తెగల్లో ఇస్లాం ప్రభంజనం వీచసాగింది. ఇక సఖీఫ్ తెగ ఒక్కటే బహుదైవారాధనను అంటిపెట్టుకొని ఉంది.

సఖీఫ్ నాయకులు పరిస్థితి గమనించి ఇస్లాంని ఆశ్రయించడం తప్ప మార్గాంతరం లేదని భావించారు. ఇస్లామే నిజమైన ధర్మమని కూడా వారి అంతరాత్మలు ఘోషించాయి. అంచేత కొన్నాళ్ళకు వారు చర్చల కోసం ఒక ప్రతినిధివర్గాన్ని మదీనా పంపించారు.

ఈ ప్రతినిధులు మదీనా చేరుకొని దైవప్రవక్త (స)ను కలుసుకున్నారు. వారి కోసం ముస్లింలు మసీదు పక్కనే ఓచోట శిబిరాలు వేశారు. చర్చలు జరిపించడానికి హజ్రత్ ఖాలిద్ బిన్ సయీద్ (రజి) మధ్యవర్తిగా నియమించబడ్డారు.

సఖీఫ్ తెగ ప్రతినిధులు శిబిరాల్లో ఉండసాగారు. మసీదులో దైవప్రవక్త (సల్లం) నమాజ్ చేయిస్తున్నప్పుడు వీరు ఆయన ఖుర్ఆన్ పఠనాన్ని ఎంతో జాగ్రత్తగా వినేవారు. ప్రవక్త అనుచరులు నమాజ్ చేస్తున్నప్పుడు, తక్బీర్ పలుకుతున్నప్పుడు కూడా వారు శిబిరాల నుండి తొంగిచూస్తూ జాగ్రత్తగా గమనించేవారు.

చర్చలు ప్రారంభమయ్యాయి. సఖీఫ్ తెగవాళ్ళ అభిప్రాయాలేమిటో తెలుసుకోవడానికి హజ్రత్ ఖాలిద్ బిన్ సయీద్ (రజి) వచ్చారు. "మేము ఇస్లాం స్వీకరిస్తాం. మాతెగవాళ్ళు కూడా స్వీకరిస్తారు. అలా మేము మీతో రాజీ కుదుర్చుకుంటాం. అయితే కొన్ని షరతులు.." అన్నాడు ప్రతినిధివర్గం నాయకుడు అబ్దయాలైల్.

"ఏమిటా షరతులు?" అడిగారు హజ్రత్ ఖాలిద్ (రజి). "మూడేండ్ల వరకు మీరు మా దేవుళ్ళ జోలికి రాకూడదు. అప్పటిదాకా మేము నమాజ్ చెయ్యకపోయినా మమ్మల్ని విడిచిపెట్టాలి" అన్నాడు అబ్దయాలైల్.

ఖాలిద్ బిన్ సయీద్ (రజి) ఈ షరతుల్ని దైవప్రవక్త (స)కు చెబితే, ఆయన వాటిని తిరస్కరించారు. అప్పుడు సఖీఫ్ తెగవాళ్ళు ఒక సంవత్సరమైనా గడువు ఇవ్వమని అడిగారు. దానికీ దైవప్రవక్త (స) ఒప్పుకోలేదు. కనీసం ఒక నెలయినా గడువు ఇవ్వమని మనవిచేశారు వారు. దైవప్రవక్త (స) ఆ షరతును కూడా తిరస్కరించారు.

"అయితే నమాజ్ చెయ్యకుండా ఉండేందుకు మమ్మల్ని అనుమతించండి" అంటూ వారు తమ రెండవ షరతును పునరుక్తం చేశారు. "ఏ ధర్మంలో నమాజ్ ఉండదో ఆ ధర్మం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు" అంటూ దైవప్రవక్త (స) ఈ షరతును కూడా వ్యతిరేకించారు.

ప్రతినిధి వర్గం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఒక్క షరతు కూడా నెరవేర లేదు. దైవప్రవక్త (సల్లం) తన వైఖరిని ఎలాంటి పరిస్థితిలోనూ మార్చుకోబోరని, ఆయన చెప్పిందానికి తిరుగులేదని గ్రహించి వారు తమ షరతుల్ని ఉపసంహరించుకున్నారు. అయితే తమ విగ్రహాలను మాత్రం తమ చేతులతో విరగొట్టేలా వత్తిడిచేయవద్దని విజ్ఞప్తి చేసుకున్నారు. దైవప్రవక్త (సల్లం) ఈ షరతును అంగీకరించారు.

ఆ విధంగా సఖీఫ్ తెగ ప్రతినిధులు ఇస్లాం స్వీకరించారు. అది రమజాన్ నెల. కనుక చర్చలు ముగిసి వారు ఇస్లాం సీకరించేనాటికి ఆ నెలలో ఇంకా ఎన్నిరోజులు మిగిలి ఉన్నాయో, అన్ని రోజులు ఉపవాసవ్రతాలు పాటించవలసి వచ్చింది. హజ్రత్ బిలాల్ (రజి) వారి కోసం ప్రతిరోజూ సహ్రీ, ఇఫ్తార్ల ఏర్పాటు చేసేవారు.

చర్చలు ముగిసిన తరువాత కూడా వారు మదీనాలోనే కొన్నాళ్ళపాటు అతిథులుగా ఉండిపోయారు. తరువాత తాయిఫ్ తిరిగి వెళ్ళిపోవడానికి నిశ్చయించుకున్నారు. అప్పుడు దైవప్రవక్త (స) ఓ ఒప్పందం రాయించారు. సఖీఫ్తెగ ప్రతినిధులు ఈ ఒడంబడిక పత్రం



తీసుకొని తాయిఫ్కు తిరిగి వెళ్ళిపోయారు. అక్కడ వీరు తమ తెగవాళ్ళకు చర్చల వివరాలు, ఒప్పందంలోని అంశాలు తెలిపారు. అప్పుడు సఖీఫ్తెగ ప్రజలు ఒప్పందంలోని షరతులన్నీ సంతోషంగా అంగీకరించారు. ఆ తరువాత అందరూ మూకుమ్మడిగా ఇస్లాం స్వీకరించి సరికొత్త జీవితం ప్రారంభించారు.

మరి నిన్నటివరకు ధూపదీప నైవేద్యాలతో అట్టహాసంగా పూజలందుకున్న 'లాత్' గారి సంగతేమిటి? ఇతర చిల్లరమల్లర దేవుళ్ళ విషయం ఏమిటీ?పాపం! అవి ఏ నైవేద్యానికీ నోచుకోలేక విలపించసాగాయి! వైభవమంతా కోల్పోయి దుమ్ము ధూళితో కొట్టుమిట్టాడ సాగాయి!! నిత్యం అసంఖ్యాక భక్తులకు వరాలిచ్చే ఈ దేవుళ్ళు ఈరోజు తమపై ఈగాలు వాలుతున్నా పారదోలలేని నిస్సహాయస్థితిలో, పరమ దయనీయస్థితిలో ఉండిపోయాయి!!! శతాబ్దాల తరబడిగా తిష్ఠవేసివున్న ఆమిథ్యాదైవాలు కొన్నాళ్ళకు మందిరాల నుంచి కూడా తొలగించబడ్డాయి.

## 54. ప్రప్రథమ హజ్ (కాబా) యాత్ర

హిజ్రీశకం 9 వ సంవత్సరంలో హజ్యాత్ర విధిగా చేయబడింది. హజ్ నెలలు కూడా సమీపించాయి. అయితే ఇస్లాం స్వీకరించడానికి అనేక తెగల ప్రతినిధి బృందాలు ఎడతెరిపి లేకుండా మదీనా వస్తుండటం వల్ల దైవప్రవక్త (సల్లం) ఆ యేడు హజ్యాత్రకు బయలు దేరలేక హజ్రత్ అబూబకర్ (రజి)ని పంపడానికి నిర్ణయించారు. హజ్యాత్ర ప్రకటన వినగానే మదీనాలో అనేకమంది ముస్లింలు ఉత్సాహంతో మక్కా బయలుదేరారు. దైవప్రవక్త (స) వారందరికీ అబూబకర్ (రజి)ని నాయకునిగా నియమించి పంపారు.

హజ్రత్ అబూబకర్ (రజి) యాత్రికుల్ని తీసుకొని మక్కా వెళ్ళిపోయిన తరువాత 'తౌబా'సూరాలోని మొదటి నలభైసూక్తులు అవతరించాయి. ఇవి మక్కా బహుదైవారాధకులకు, హజ్ ఆచారాలకు సంబంధించినవి కనుక వీటిని మక్కా ప్రజలకు అందజేయవలసి ఉంది. అంచేత దైవప్రవక్త (స) అలీ (రజి)ని పిలిపించి ఇలా చెప్పారు:

"అలీ! ఈ దైవసూక్తులు తీసుకొని మక్కా వెళ్ళిపో. ఖుర్బానీరోజు యాత్రికులంతా 'మినా'లో గుమికూడిన తరువాత వారికి ఈ సూక్తులు చదివి విన్పించు. అవిశ్వాసులెవరూ స్వర్గప్రవేశం చేయలేరని స్పష్టంగా చెప్పెయ్యి. ఈ సంవత్సరం బహుదైవారాధకులు (ప్రతిష్ఠాలయం పరిధిలో ప్రవేశించి) హజ్ ఆచారాలు చేయడానికి వీల్లేదని, ఏ ఒక్కరూ నగ్నంగా కాబాప్రదక్షిణ చేయకూడదని ప్రకటన చెయ్యి" అని చెప్పారు ఆయన.

ఆ తరువాత హజ్రత్ అలి (రజి) మదీనా నుండి బయలుదేరి వేగంగా ప్రయాణం సాగించారు. మక్కా చేరుకోకముందే దారిలో ఆయన హజ్రత్ అబూబకర్ (రజి)ని కలుసుకున్నారు. హజ్రత్ అబూబకర్ (రజి) హజ్రత్ అలి (రజి)ని చూసి ఆశ్చర్యపోతూ "ఏమిటీ, నాయకునిగా వచ్చావా లేక అనుచరునిగా వచ్చావా?" అని అడిగారు.

దానికి అలి (రజి) తాను యాత్రిక బృందానికి నాయకునిగా రాలేదని చెప్పారు. ఆ తర్వాత ఆయన దైవప్రవక్త (స) తనకు పురమాయించిన పని గురించి తెలియజేశారు. 'మినా'లో అందరూ చేరిన తరువాత హజ్రత్ అలి (రజి) దైవప్రవక్త (స) ఆదేశం ప్రకారం

ఖుర్‌ఆన్‌లోని తౌబాసూరాకు చెందిన ఈ సూక్తులు పఠించి విన్పించారు:

"మీరు ఒడంబడిక చేసుకున్న బహుదైవారాధకులకు దేవుని తరఫున, ఆయనప్రవక్త తరఫున ఒప్పందం నుండి విముక్తి ప్రకటన (విన్పించు): "మీరిక దేశంలో నాలుగు నెలలు మాత్రమే (ఇష్టానుసారం) సంచరించగలరు. గుర్తుంచుకోండి, మీరు దేవుని పట్టునుండి ఏ మాత్రం తప్పించుకోలేరు. సత్యతిరస్కారుల్ని దేవుడు తప్పక పరాభవం పాల్జేస్తాడు." (9:1,2)

"దేవుని వైపున, ఆయనప్రవక్త వైపున మహాహజ్ దినాన ప్రజలందరికీ ఓ బహిరంగ ప్రకటన (ఇలావిన్పించు): "దేవుడు, ఆయనప్రవక్త బహుదైవారాధకుల పట్ల విసుగెత్తి పోయారు. ఇప్పుడైనా మీరు పశ్చాత్తాపపడి క్షమాపణ కోరితే మీకే మంచిది. ఒకవేళ ముఖం తిప్పుకుంటే గుర్తుంచుకోండి, మీరు దేవుని పట్టునుండి ఏమాత్రం తప్పించుకోలేరు."

"ప్రవక్తా! సత్య తిరస్కారులకు అత్యంత కఠిన శిక్ష పడుతుందని శుభవార్త విన్పించు! అయితే మీతో ఒడంబడిక చేసుకొని దాన్ని పాటించడంలో ఎలాంటి కొరత చేయకపోవడమే గాకుండా, మీకు వ్యతిరేకంగా మరెవరికీ ఎలాంటి సహాయ సహకారాలు అందజేయని బహుదైవారాధకులకు ఈ హెచ్చరిక వర్తించదు. అలాంటివారి పట్ల మీరు కూడా ఒప్పందం గడువు ముగిసేదాకా నిజాయితీగా వ్యవహరించండి. దేవుడు (నిజాయితీతో మసలుకునే) దైవభీతిపరాయణులనే ప్రేమిస్తాడు." (9:3,4)

"పవిత్రమాసాలు (అంటే ప్రకటనలో పేర్కొనబడిన నాలుగు నెలల గడువుకాలం) ముగిసిపోగానే బహుదైవారాధకులను (యుద్ధంలో) ఎక్కడ ఎదురైతే అక్కడ వధించండి. వారిని పట్టుకోండి. చుట్టుముట్టండి. వారికోసం అనువైన ప్రతి చోటా మాటువేసి కూర్చోండి. ఒకవేళ వారు క్షమాపణ చెప్పుకొని నమాజ్, జకాత్ విధులు పాటించడం ప్రారంభిస్తే వారిని వదలిపెట్టండి. దేవుడు గొప్పక్షమాశీలి, అపార దయామయుడు. బహుదైవారాధకుల్లో ఎవరైనా (దైవవాణి వినేందుకు) మీ దగ్గరికి రాదలచుకుంటే దైవవాణి వినేవరకు అతనికి ఆశ్రయం ఇవ్వండి. ఆ తరువాత అతడ్ని అతని భద్రతా స్థలానికి సురక్షితంగా చేర్చండి. వారు (సత్యం ఎరగని) జ్ఞానశూన్యులు. అందువల్ల మీరిలా చేయవలసి ఉంటుంది." (9:5,6)

"ఈ బహుదైవారాధకుల ఒడంబడిక దేవుని దగ్గర, ఆయనప్రవక్త దగ్గర ఎలా నిలుస్తుంది? కాని మీరు ప్రతిష్ఠాలయం (కాబాగృహం) వద్ద ఒప్పందం చేసుకున్న బహుదైవారాధకుల సంగతి వేరు. వారు మీపట్ల సవ్యంగా ఉన్నంతవరకు మీరు కూడా వారిపట్ల సవ్యంగానే ఉండండి. దేవుడు (ఇలాంటి) భయభక్తులు కలవారినే ప్రేమిస్తాడు. వారు తప్ప ఇతర బహుదైవారాధకులతో ఒప్పందం ఎలా సాధ్యమవుతుంది? మీమీద వారు పైచేయిగా ఉంటే మీ విషయంలో ఎలాంటి బంధుత్వాన్నీ ఖాతరుచేయరు. ఒప్పందాన్ని కూడా ఖాతరుచేయరు. వారు కేవలం మాటలతో మిమ్మల్ని తృప్తిపరచడానికి ప్రయత్నిస్తారు. వారి హృదయాలు మాత్రం వాటిని నిరాకరిస్తాయి. వారిలో చాలామంది దుర్జనులే ఉన్నారు." (9:7,8)

"వారు దేవుని సూక్తులు స్వల్పమూల్యానికి అమ్ముకొని, ప్రజలను దైవమార్గం వైపు రాకుండా నిరోధిస్తూ చాలా చెడ్డపని చేస్తున్నారు. వారు విశ్వాసుల విషయంలో ఎలాంటి బంధుత్వాన్నిగాని, ఒప్పందం షరతులుగాని ఖాతరు చేయరు. అన్యాయం, అతిక్రమణలు ఎల్లప్పుడూ వారివైపు నుండే మొదలవుతాయి. ఇప్పటికైనా వారు పశ్చాత్తాపం చెంది నమాజ్,



జకాత్ విధులు పాటించడం ప్రారంభిస్తే వారు మీ ధార్మిక సోదరులవుతారు. వాస్తవికతను అర్థం చేసుకునేవారి కోసం మేము మా ఆజ్ఞలను (ఇలా) వివరిస్తున్నాము." (9:9-11)

"ఒకవేళ వారు (దైవాజ్ఞల పాటింపు విషయంలో) ప్రమాణం చేసిన తరువాత, తమ ప్రమాణాలు భంగపరచి మీ ధర్మంపై దాడిచేయడానికి పూనుకుంటే, అలాంటి అధర్మ ధ్వజ వాహకులతో యుద్ధం చేయండి. వారి ప్రమాణాలు ఇక ఎంతమాత్రం నమ్మదగినవి కావు. వారు బహుశా (ఖడ్గశక్తి ద్వారానే) దారికి వస్తారు." (9:12)

"అవిశ్వాసులు (తమ చేష్టల ద్వారా) సత్యతిరస్కారానికి వ్యతిరేకంగా తమకు తామే సాక్ష్యం ఇచ్చుకున్నారు. వారు చేసుకున్న సత్కార్యాలన్నీ వ్యర్థమయి పోయాయి. వారిక నరకంలోనే శాశ్వతంగా పడిఉంటారు. అలాంటివారు దైవగృహాలకు ధర్మకర్తలయి కూర్చోవడం ఎంతమాత్రం తగదు. దేవుడ్ని, పరలోకాన్ని విశ్వసించినవారే దైవగృహాలకు సేవ చేయడానికి అర్హులవుతారు. వారు నమాజ్ స్థాపిస్తారు; జకాత్ చెల్లిస్తారు; దేవునికి తప్ప మరెవరికీ భయపడరు. అలాంటివారే సన్మార్గంలో నడుస్తారని ఆశ ఉంటుంది." (9:17,18)

"విశ్వాసులారా! బహుదైవారాధకులు అపవిత్రులు గనక ఈ సంవత్సరం తర్వాత వారిని ప్రతిష్ఠాలయం(కాబాగృహం) దరిదాపులకు రానివ్వకండి. ఒకవేళ (మీ వ్యాపారం మందగించి) మీరు లేమికి గురవుతారని భయపడితే (అలా భయపడనవసరం లేదు.) దేవుడు తలిస్తే తన ప్రత్యేక అనుగ్రహంతో మిమ్మల్ని ధనికులుగా చేస్తాడు. దేవుడు సర్వజ్ఞాని, మహా వివేకవంతుడు." (9:28)

"వారు తమ నోటితో దేవుని జ్యోతి (సత్యధర్మం) ఆర్పివేయ గోరుతున్నారు. కాని సత్యతిరస్కారులకు ఎంత వెగటు కలిగినా దేవుడు మాత్రం తన జ్యోతిని నేల నాలుగు చెరగులా ప్రసరింపజేయనిదే వదలిపెట్టడు. సత్యధర్మం బహుదైవారాధకులకు ఏమాత్రం నచ్చక పోయినాసరే ఇది యావత్తు జీవనవ్యవస్థలపై ఆధిక్యత పొందడానికి ఆ దేవుడే తన (అంతిమ) ప్రవక్తకు సత్యాన్ని, హితబోధను ఇచ్చి పంపాడు." (9:32,33)

"మాసమార్పిడి పద్ధతి అవిశ్వాసానికి అదనంగా మరొక అవిశ్వాస చేష్టవుతుంది. దాని ద్వారా బహుదైవారాధకులు (మరింత) మార్గభ్రష్టత్వంలో పడిపోతున్నారు. ఒక యేడు వారు ఒక నెలను ధర్మసమ్మతం చేసుకొని మరొక యేడు దాన్ని నిషేధించుకుంటారు. దేవుడు నిషేధించిన నెలల సంఖ్యను పూర్తిచేయడానికి, ఆ నెలలు ధర్మసమ్మతం కావడానిక్కూడా ఈ విధంగా చేస్తారు. (ఇలా) వారి దుష్కృత్యాలు వారికి పుణ్యకార్యాలుగా తోచేటట్లు చేయబడ్డాయి. దేవుడు (అలాంటి) సత్యతిరస్కారులకు ఎన్నటికీ సన్మార్గం చూపడు." (9:37)

## 55. శాంతిభద్రతలకు సమరమే శరణ్యం

ఏ రాజ్యానికైనా పొరుగు రాజ్యం నుండి ప్రమాదం ఎదురైనప్పుడు ఆ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి యుద్ధం చేయక తప్పదు. అదేవిధంగా ఇస్లామీయ రాజ్యానికి రోమ్ రాజ్యం నుండి ప్రమాదం ఎదురుకావడం వల్ల ముస్లిములు ఆ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి సరిహద్దు ప్రాంతానికి చేరుకున్నారు. అలాంటి క్లిష్ట పరిస్థితులలో యుద్ధం అనివార్యమవుతుంది. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, బలహీనులు

తప్ప దేవుడ్ని, దైవప్రవక్త (స)ను విశ్వసించిన ప్రతి ముస్లింకు జిహాద్ విధి (Obligatory Duty) అవుతుంది. దివ్యఖుర్‌ఆన్‌లోని ఈక్రింది సూక్తులు చూడండి:

“మీరు (దైవమార్గంలో) విధిగా యుద్ధం చేయాలని ఆజ్ఞ అయింది. కాని అది మీకు రుచించడంలేదు. ఒక విషయం మీకు నచ్చక పోవచ్చు. కాని అందులోనే మీ శ్రేయస్సు ఉండవచ్చు. అలాగే ఒక విషయం మీకు నచ్చవచ్చు. కాని అందులోనే మీకు హాని ఉండవచ్చు. (మంచీచెడులు) దేవునికే బాగా తెలుసు, మీకు తెలియదు.” (ఖుర్‌ఆన్–2:216)

“వారు (ప్రపంచంలో) యుద్ధజ్వాలలు రగిల్చినప్పుడల్లా దేవుడు వాటిని చల్లార్చవలసి వస్తున్నది. వారు ఎల్లప్పుడూ ధరణిపై ఏదోఒక ఉపద్రవం సృష్టించడానికే ప్రయత్నిస్తుంటారు. దేవుడు ఇలాంటి కలహకారుల్ని ఎన్నటికీ ప్రేమించడు.” (ఖుర్‌ఆన్–5:64)

“దేవుడు కొందరి ద్వారా కొందరిని నిర్మూలించకపోతే ప్రపంచం అరాచకం, అల్లకల్లోలాలతో నిండిపోతుంది. దేవుడు ప్రపంచ మానవుల పట్ల ఎంతో దయామయుడు. (అందుకే ఆయన అశాంతి, అరాచకాలు నిర్మూలించే ఏర్పాట్లు చేస్తుంటాడు.)” (ఖుర్‌ఆన్–2:251)

“విశ్వాసులారా! మిమ్మల్ని దుర్భరమయిన (నరక) యాతనల నుండి కాపాడగలిగే వ్యాపార పద్ధతిని గురించి మీకు తెలుపమంటారా? మీరు మనస్ఫూర్తిగా దేవుడ్ని, ఆయన ప్రవక్తను విశ్వసించి ధనప్రాణాలు ఒడ్డి దైవమార్గంలో పోరాడండి. మీరు విషయం గ్రహించ గలిగితే అందులోనే మీ శ్రేయస్సు ఉంది.” (ఖుర్‌ఆన్–61:10,11)

“దేవుడు విశ్వాసుల నుండి వారి ధనప్రాణాలు కొనుగోలుచేశాడు. వాటికి బదులుగా వారికోసం స్వర్గం సిద్ధపరచిఉంచాడు. వారు దైవమార్గంలో పోరాడుతూ హతమార్చుతారు లేదా హతమార్చబడతారు. (వారికి స్వర్గం లభిస్తుందని) తౌరాత్‌లో, ఇన్జీల్‌లో, ఖుర్‌ఆన్‌లో వాగ్దానంఉంది. దాన్ని నెరవేర్చేబాధ్యత దేవునిపై ఉంది. వాగ్దానం నెరవేర్చడంలో దేవుడ్ని మించిన వారెవరుంటారు? కనుక దేవునితో మీరు చేసుకున్న ఈ వ్యాపార ఒప్పందం పట్ల ఆనందోత్సవాలు జరుపుకోండి. ఇదే ఘనవిజయం.” (ఖుర్‌ఆన్–9:111)

“విశ్వాసులు దైవమార్గంలో పోరాడుతారు. అవిశ్వాసులు షైతాన్ మార్గంలో పోరాడు తారు. కనుక మీరు (దైవమార్గంలో) షైతాన్ అనుచరమూకతో పోరాడండి. షైతాన్ పన్నే కుటిల పన్నాగాలన్నీ చాలా బలహీనమైనవని తెలుసుకోండి.” (ఖుర్‌ఆన్–4:76)

“విశ్వాసులారా! ఏమైంది మీకు, దైవమార్గంలో (పోరాడేందుకు) బయలుదేరమంటే నేలకు అతుక్కుపోతున్నారు? మీరు పరలోకానికి బదులు ప్రాపంచికజీవితాన్నే ఎక్కువగా ప్రేమిస్తున్నారా? కాని పరలోక (సుఖ)జీవనం ముందు ప్రాపంచిక జీవితసౌఖ్యం మూన్నాళ్ళ ముచ్చట మాత్రమే. ఏమైనప్పటికీ ఈపనికి మీరు ఉపక్రమించకపోతే దేవుడు మీకు వ్యధాభరితమైన శిక్ష విధిస్తాడు. ఆ తరువాత మీ స్థానంలో మరోజాతిని (ఈపని కోసం) ఆవిర్భజేస్తాడు. మీరు దేవునికి ఎలాంటి నష్టం కలగజేయలేరు. ఆయన ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు.” (ఖుర్‌ఆన్–9:38,39)

“వారికి చెప్పు: ఈ ప్రాపంచిక సౌఖ్యాలు క్షణభంగురం. భక్తిపరాయణులకు పరలోక జీవితమే ఎంతో శ్రేష్ఠమైనది, శాశ్వతమైనది.... మృత్యు విషయానికొస్తే, అది మీరు ఎక్కడున్నా, ఎట్టి పరిస్థితిలో వున్నా, చివరికి మీరు పటిష్ఠమైన భవనాల్లో వున్నాసరే వచ్చి తీరుతుంది. దాన్ని ఎవరూ అడ్డుకోలేరు.” (ఖుర్‌ఆన్–4:77,78)



“ప్రవక్తా! వారికిలా చెప్పు: ‘మీ తండ్రులు, కొడుకులు, సోదరులు, భార్యలు, బంధుమిత్రులే గాక మీరు కూడబెట్టుకున్న ఆస్తులు, (సత్యాన్ని విశ్వసిస్తే) మందగించి పోతాయేమోనని మీరు భయపడుతున్న మీవ్యాపారాలు, మీకు ప్రీతికరమైన మీఇండ్లు- ఇవన్నీ మీకు దేవుని కంటే, ఆయన ప్రవక్త కంటే, ఆయన మార్గంలో జరిపే పోరాటం కంటే ఎక్కువ ప్రియమైనవయితే మీ గురించి దేవుని నిర్ణయం వచ్చేదాకా ఎదురుచూడండి. దుర్జనులకు దేవుడు ఎన్నటికీ సన్మార్గావలంబనబుద్ధి ప్రసాదించడు.” (ఖుర్‌ఆన్–9:24)

ముస్లింలు యుద్ధం చేసే పరిస్థితి రావాలని ఎన్నడూ కోరుకోకూడదని, యుద్ధం అనివార్యమైతే మాత్రం స్థిరంగా నిలబడి ధైర్యంగా పోరాడాలని ఇస్లాం చెబుతోంది.

దైవప్రవక్త (స) ఈ విషయాన్నే గురించే బోధిస్తూ ఇలా ప్రవచించారు: “ప్రజలారా! మీరు ఎన్నడూ యుద్ధాన్ని కోరుకోకండి. ఎల్లప్పుడూ శాంతినే కోరుకుంటూ దైవాన్ని ప్రార్థించండి. శత్రువుతో యుద్ధం చేయవలసిన పరిస్థితి వస్తే మాత్రం స్థిరంగా నిలబడి ధైర్యంగా పోరాడండి. గుర్తుంచుకోండి! స్వర్గం ఖడ్గచ్ఛాయల క్రింద ఉంది....” (బుఖారి)

శత్రువు దారుల్‌ఇస్లాంపై అంటే ఇస్లామీయ రాజ్యంపై (ముస్లిం దేశంపై కాదు) దాడి చేసినప్పుడు దారుల్‌ఇస్లాంలోని ప్రతి ముస్లింకు శత్రుదాడిని ఎదుర్కోవడం విధి అవుతుందని ధర్మావగాహన (ఫిఖా) గ్రంథాలన్నిటిలో పేర్కొనడం జరిగింది. దీన్ని “జిహాద్ ఫీసబీలిల్లాహ్” అంటారు. అంటే “దైవమార్గంలో పోరాటం” అని అర్థం. మరో మాటలో చెప్పాలంటే దేవుని ప్రసన్నత కోసం, కేవలం పరలోక ప్రతిఫలాపేక్షతో చేసే పోరాటం అన్న మాట. ఈ మార్గంలో వేసే ప్రతి అడుగూ పాపశమనానికి కారణభూతమవుతుంది.

“అలాగే (దైవమార్గంలో) కొద్దో గొప్పో ఏదయినా ఖర్చుచేస్తే లేదా ధర్మసంస్థాపనా కృషిలో ఏవైనా గుట్టలుమిట్టలు దాటి పురోగమిస్తే ఆ సత్కార్యాలు కూడా (వారి కర్మపత్రంలో) వ్రాయకుండా ఉండటమనేది జరగదు. వారు చేసిన సత్కార్యాలకు దేవుడు వారికి తగిన ప్రతిఫలం తప్పకుండా ప్రసాదిస్తాడు.” (ఖుర్‌ఆన్–9:121)

పేరుప్రతిష్ఠల కోసం, స్వార్థప్రయోజనాల కోసం చేసే పోరాటం జిహాద్ ఫీ సబీలిల్లాహ్ అన్పించుకోదు. ఎవరైనా అలాంటి ఉద్దేశ్యంతో పోరాటం జరిపితే అతనికి పుణ్యఫలం దక్కకపోగా పాపపర్యవసానం మటుకు అతను తప్పకుండా అనుభవిస్తాడు. దైవప్రవక్త (సల్లం) బోధించిన ఈ మహితోక్తులు చూడండి:

“దేవుడు తన మార్గంలో (అంటే ధర్మసంస్థాపన కోసం) పోరాటం సలిపే వ్యక్తికి స్వర్గప్రవేశ భాగ్యమైనా ప్రసాదిస్తాను లేదా పుణ్యం, సమరసొత్తులను అనుగ్రహించి అతడ్ని ఇంటికైనా మరలింప జేస్తాను అని హామీనిస్తున్నాడు. ఆ వ్యక్తి కేవలం దైవప్రసన్నత కోసమే పోరాటం జరపాలి, ఆయన (ఖుర్‌ఆన్) సూక్తుల్ని సమర్థించాలి.” (బుఖారి)

“దైవమార్గంలో (ధర్మసంస్థాపనా కృషిలో) ఒక ఉదయమో లేదా ఒక సాయంత్రమో గడపడం (గడిపినందు వల్ల లభించే పుణ్యఫలం) యావత్ప్రపంచం, ప్రపంచ సంపదలన్నిటి

కంటే ఎంతో శ్రేష్ఠ మైనది.''(బుఖారి, ముస్లిం)

“ప్రతి ముస్లింకు దైవమార్గంలో (ధర్మరక్షణ పోరాటంలో) అయ్యే గాయం, దెబ్బ తగిలినప్పుడు రక్తం కారిపోతూ ఎర్రగా ఎలా ఉండేదో ప్రళయదినాన (తిరిగి బ్రతికించబడే రోజు) కూడా అదేవిధంగా (రక్తం కారుతూ) ఉంటుంది. అయితే ఆ గాయం నుండి కస్తూరి సువాసన వెలువడుతూ ఉంటుంది.'' (బుఖారి, ముస్లిం)

“(ధర్మరక్షణ మార్గంలో పోరాడుతూ) అమరగతుడయిన ఒక్క వీరయోధుడు (షహీద్) తప్ప స్వర్గంలో ప్రవేశించిన ఏవ్యక్తి కూడా ప్రపంచంలోని సంపదలన్నీ ఇవ్వబడతాయన్నా సరే, మళ్ళీ ఇహలోకానికి పోవడానికి ససేమిరా ఇష్టపడడు. అమరగతుడయిన వీరయోధుడు అమరగతి (షహాదత్)కి సంబంధించిన గౌరవోన్నతులు చూసివుంటాడు గనక, అతను తిరిగి ఇహలోకానికి వెళ్ళి (దైవమార్గంలో) పది సార్లు అయినా వీరమరణం పొందాలని కోరుకుంటాడు.'' (బుఖారి)

“ఒకతను దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి ‘ధర్మయుద్ధానికి (జిహాద్‌కు) ప్రత్యామ్నాయం కాగల సత్కార్యం ఏదైనా ఉంటే నాకు తెలియజేయండి’ అన్నాడు. దానికి దైవప్రవక్త (సల్లం) ‘ధర్మయుద్ధానికి సమానమైన సత్కార్యం ఏదీ ఉన్నట్లు నాకు కన్పించడం లేదు’ అని అన్నారు. ఆ తరువాత కాస్సేపటికి ఆయన ఇలా అన్నారు: ‘అయితే నువ్వొక పని చెయ్యి. ముజాహిద్ (యోధు)లు ధర్మయుద్ధానికి వెళ్ళిపోయినప్పుడు నీవు మసీదుకు వెళ్ళి నిరంతరాయంగా నమాజులు చేస్తూవుండు. అలాగే మధ్యలో ఒక్కసారి కూడా విరమించకుండా నిరంతరాయంగా ఉపవాసవ్రతాలు కూడా పాటిస్తూవుండు. మరి నువ్విలా చేయగలవా?' దానికా వ్యక్తి ‘ఇలా ఎవరు చేయగలరండీ!’ అన్నాడు.'' (బుఖారి)

జిహాద్‌కు ఇంత ప్రాముఖ్యం ఉన్నందునే దైవప్రవక్త (సల్లం) తబూక్ దండయాత్ర నుంచి తిరిగొచ్చిన తరువాత ఆ దండయాత్రలో పాల్గొనని ముస్లింలను నిలదీసి కారణం అడిగారు. కపటవిశ్వాసులు రకరకాల సాకులు చెప్పి తప్పించుకున్నారు. అయితే దండయాత్రలో పాల్గొనలేకపోయిన కొందరు చిత్తశుద్ధి కలిగిన ముస్లింలు సాకులు చెప్పకుండా పశ్చాత్తాపంతో నిజం ఒప్పుకున్నారు. అలాంటి ముస్లింలు ఏడెగురు ఉన్నారు.

ఈ ఏడుగురు బద్ర్, ఉహుద్, తదితర యుద్ధాలలో పాల్గొన్నారు. కాని తబూక్ దండయాత్రలో బద్ధకం, అలసత్వాల కారణంగా పాల్గొనలేకపోయారు. అయితే దైవప్రవక్త (స) తబూక్ దండయాత్ర నుంచి తిరిగొచ్చిన తర్వాత అందులో పాల్గొననివారిని గురించి విచారణ జరపనారంభించగానే వారు తప్పు తెలుసుకొని పశ్చాత్తాపపడ్డారు. విచారణకు ముందే వారిలో నలుగురు తమనుతాము ఒక స్తంభానికి కట్టుకొని (దేవుడు) తమను క్షమించేవరకూ లేదా తాము చనిపోయేవరకూ నిద్రాహారాలు మానేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఆవిధంగా వారు అనేక రోజులు గడిపి బలహీనమైపోయి స్పృహతప్పారు. చివరికి దేవుడు, క్షమించాడని తెలియగానే వారు ఆనందభరితులయ్యారు.

“కొందరు తమతప్పు ఒప్పుకున్నారు. వారిది మిశ్రమఆచరణ. కొన్ని పుణ్యకార్యాలు, కొన్ని పాపకార్యాలు చేశారు. త్వరలోనే దేవుడు వారిపై తన కటాక్ష వీక్షణలు ప్రసరింపజేస్తాడు.



దేవుడు గొప్ప క్షమాశీలి, అపార దయానిధి. కనుక ప్రవక్తా! వారి సంపద నుండి దానం స్వీకరించి తద్వారా వారిని పరిశుద్ధపరచు. పుణ్యమార్గంలో వారిని పురోగమింపజేయి. వారికోసం ప్రార్థనచేయి. నీప్రార్థన వారి మనస్సుకు తృప్తి నిస్తుంది. దేవుడు సమస్త విషయాలు వింటున్నాడు. ఆయన సర్వం ఎరిగినవాడు.” (ఖుర్ఆన్-9:102,103)

మిగతా ముగ్గురు కూడా చిత్తశుద్ధిగల విశ్వాసులే. లోగడ ఇస్లాం కోసం అనేక త్యాగాలు చేసినవారే. కాని తబూక్‌దండయాత్ర సమయంలో బద్ధకం వారిని గడప దాట నివ్వలేదు. దైవప్రవక్త (స) విచారణ జరిపినప్పుడు కపటవిశ్వాసుల్లా అబద్ధాలు చెప్పి తప్పించుకోవడానికి బదులు వారు నిజాన్ని చెప్పేశారు. అప్పుడు దైవప్రవక్త (స) అందుకు శిక్షగా వారితో ఎవరూ మాట్లాడకూడదని ముస్లింలందరికీ తాకీదు చేశారు. ప్రవక్త ఆజ్ఞతో ముస్లింలందరూ ఆ ముగ్గురితో మాట్లాడకుండా సంఘబహిష్కణ చేశారు. ఈవిధంగా యాభై రోజులు గడచిపోయాయి.

ఆ రోజుల్లోనే ఆ ముగ్గురిలో కాబ్ బిన్ మాలిక్ (రజి) అనే ముస్లిం బజారున నడచిపోతుంటే సిరియా నుండి ఒకతను వచ్చి గస్సాన్ రాజు రాసిన ఒక లేఖను ఆయనకు అందించాడు. అందులో గస్సాన్ రాజు హజ్రత్ కాబ్ (రజి)ని సంబోధిస్తూ “మీ మనిషి మీ మీద దుర్భర దౌర్జన్యం చేస్తున్నట్లు విన్నాం. మీరు ఆ అవమానం సహించేటంత అధములు కారు. అప్రయోజకునిగా భావించి వదిలెయ్యాల్సిన మనిషి కూడా కాదు. కనుక మీరు మా దగ్గరకు వచ్చేయండి. మేము మిమ్మల్ని గౌరవిస్తాం'' అని రాశాడు. హజ్రత్ కాబ్ (రజి) దాన్ని చదివి మరోవిపత్తు వచ్చిపడిందనుకుంటూ అప్పటికప్పుడు దాన్ని పొయ్యిలోకి విసిరి కాల్చిపారేశారు.

ఇలా నలభై రోజులు గడచిన తరువాత భార్యకు కూడా దూరంగా ఉండాలని దైవప్రవక్త (సల్లం) ఆదేశించారు.... అప్పుడు హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ (రజి) భార్యను పుట్టింటికి పంపివేశారు. అలా మరో పదిరోజులు గడచిపోయాయి. చివరికి ఓరోజు ఫజ్ర్ నమాజ్ చేసిన తరువాత ఇంటికప్పు మీద విచారవదనంతో కూర్చొనివుంటే ఒకతను వచ్చి“కాబ్! నీకు శుభం కలుగుగాక!” అన్నాడు. ఈమాట వినగానే హజ్రత్ కాబ్ (రజి) అప్రయత్నంగా దైవసన్నిధిలో సాష్టాంగపడ్డారు. ఆ తరువాత ఒకరి తర్వాత మరొకరు అనేకమంది ముస్లింలు “నీ క్షమాపణ స్వీకరించబడింద'ంటూ ఆయనకు అభినందనలు తెలియజేయడం ప్రారంభించారు.

“మరికొందరున్నారు. వారి వ్యవహారం (ఇంకా పరిష్కారం కాలేదు.) దేవుని ఆజ్ఞ కోసం ఆపిఉంచబడింది. దేవుడు తలచుకుంటే వారిని శిక్షించవచ్చు లేదా క్షమించవచ్చు. దేవుడు సర్వం తెలిసినవాడు, మహా వివేకవంతుడు.” (ఖుర్ఆన్-9:106)

“వ్యవహారం వాయిదావేయబడిన ఆముగ్గుర్ని కూడా కరుణించాడు. భూమివిశాలం గాఉన్నా అదివారికి ఇరుకైపోయింది. చివరికి వారిప్రాణాలే వారికి భారమైపోయాయి. దేవుని పట్టునుండి తప్పించుకోడానికి ఆయన కరుణాశ్రయం తప్ప ఎలాంటి ఆశ్రయం లేదని వారు గ్రహించారు. అప్పుడు దేవుడు దయతో వారివైపు మరలాడు, వారు తనవైపు మరలి వచ్చేందుకు. దేవుడు గొప్పక్షమాశీలి, అమిత దయామయుడు.” (ఖుర్ఆన్-9:118)

# 56. ఇస్లాంలో బలత్కారం లేదు

తబూక్ దండయాత్రలో శత్రువుల నుండి ఎలాంటి కవ్వింపుచర్యలు లేనందున ముస్లింయోధులు ఖడ్గాలు వరల్లో నుంచి తీయకుండా వెనుదిరిగారు. దీన్నిబట్టి ఇస్లాంలో కేవలం రాజ్యవిస్తరణ కోసం పొరుగురాజ్యాలపై దాడిచేసి రక్తపాతం జరిపే ప్రసక్తి లేదని తెలుస్తోంది. సామ్రాజ్యవాదం (Imperialism), రాజ్యవిస్తరణ  కాంక్ష ఇస్లాంలో నిషిద్ధం. అలాగే ఇస్లాంలో మతదురభిమానంతో పొరుగురాజ్యాలపై దాడిచేసి అక్కడి ప్రజలను బలవంతంగా మతమార్పిడులు చేయించే ప్రసక్తి కూడా లేదు. ఇస్లాం ఖడ్గంద్వారా వ్యాపించిందనే విషయం సామ్రాజ్యవాదులు సృష్టించిన 'అపోహ' తప్ప మరేమీ కాదు.

ఇస్లామేతర రాజ్యాలు ఆనాడైనా, ఈనాడైనా స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాల కోసం లేదా తీవ్రమైన మతదురభిమానంతో బలహీన రాజ్యాలపై దాడిచేసి అక్కడి పౌరుల్ని సైతం ఊతకోసి విధ్వంసకాండ సృష్టిస్తాయి. అలాంటి రాజ్యాల విధ్వంసస్వభావం గురించి ఖుర్‌ఆన్ ఇలా పేర్కొన్నది: "రాజులు ఏదైనా రాజ్యంలో జొరబడితే దాన్ని సర్వనాశనం చేస్తారు. ఆ రాజ్యంలోని గౌరవనీయుల్ని పరాభవం చేస్తారు." (27:34)

సాధారణంగా ప్రతి సిద్ధాంతం సదుద్దేశ్యంతోనే ఏర్పడుతుంది. ఆ సిద్ధాంతాన్ని నమ్మేవారు కూడా ప్రారంభంలో దాన్ని పూర్తిగా, గట్టిగా పాటిస్తారు. ఆ తరువాత వారి సైద్ధాంతిక జీవితం క్రమంగా బలహీనమైపోతుంది. వారి అధికసంఖ్యాకుల్లో అతివాదాలు, అంధవిశ్వాసాలు చోటుచేసుకుంటాయి. తత్ఫలితంగా వారు అనేక చెడులకు గురయిపోతారు. ఈనాడు ముస్లింల పరిస్థితి కూడా ఇలాగే తయారయింది.

కాబట్టి ఏ ధర్మం లేక ఏ సిద్ధాంతం గురంచయినా ఒక అభిప్రాయానికి రావడానికి ముందు ఆ ధర్మాన్ని లేక ఆ సిద్ధాంతాన్ని నిష్పక్షపాతంగా, కూలంకషంగా అధ్యయనం చేయాలే కాని దాని అనుయాయుల ఆచరణ చూసి నిర్ణయానికి రావడం బుద్ధిమంతుల లక్షణం అన్పించుకోదు. కాని ఇస్లాంనే టార్గెట్‌గా చేసుకున్న మతదురభిమానులు ముస్లింల ఆచరణను చూడరు. ముస్లింలపై అపనిందలు మోపి, ఆ సాకుతో ఇస్లాంను నిందించి దాన్ని అంతమొందించడమే వారు ధ్యేయంగా పెట్టుకున్నారు. కారణం ఇస్లాం వ్యాప్తిలో వారి స్వార్థప్రయోజనాలకు కాలం చెల్లే సూచనలు కన్పించడమే.

దైవప్రవక్త (స)ని ఆనాటి అరబ్ బహుదైవారాధకులు ఆయన చిన్ననాటితనం నుంచి నలభై ఏళ్ళ వయస్సువరకూ ఆయన సత్యసంధత, నీతినిజాయితీలు ఎరిగినవారే. వారే ఆయనకు సత్యసంధుడు (సాదిఖ్) అని, నిజాయితీ పరుడు (అమీన్) అని బిరుదులిచ్చి ప్రశంసించారు. కాని అలా సత్యసంధుడిగా, నిజాయితీపరుడిగా కొనియాడబడిన ఆ మనిషే దైవప్రవక్తగా ముందుకు రాగానే వారాయనకు బద్ధశత్రువులైపోయారు.

"ముహమ్మద్! వారి మాటలవల్ల నీకు బాధ కలుగుతుందని మాకు తెలుసు. కాని ఈ దుర్మార్గులు నిన్ను నిరాకరించడంలేదు. వారసలు దేవుని సూక్తులు నిరాకరిస్తున్నారు." (6:33)

ఈ విషయాన్ని ఇక్కడ ఖుర్‌ఆన్ మాత్రమే కాదు, కరుడుగట్టిన సత్యవిరోధి, ఖురైష్ జాతి అగ్రనాయకుడయిన అబూజహల్ కూడా వ్యక్తపరిచాడు. అతను ఒకసారి దైవప్రవక్త



(సల్లం)తో మాట్లాడుతూ "మేము నిన్ను అసత్యవాదని అనడం లేదు; నీవు ప్రచారం చేస్తున్న దాన్ని మాత్రమే మేము అసత్యంగా పరిగణిస్తున్నాం" అన్నాడు.

ఇంతకూ ఖురైష్ నాయకులు సత్యాన్ని ఎందుకు నిరాకరిస్తున్నారో చూడండి. బద్ర్ యుద్ధసమయంలో అఖ్నస్ అనే నాయకుడు అబూజహల్‌తో రహస్య సమాలోచనలు జరుపుతూ "ఇక్కడ మనిద్దరం తప్ప మూడో వ్యక్తి లేడు. ఒక విషయం అడుగుతున్నా, నిజం చెప్పు. ముహమ్మద్‌ని నీవు సత్యసంధుడుగా భావిస్తున్నావా లేక అబద్ధీకుడుగా భావిస్తున్నావా?" అని అడిగాడు. దానికి అబూజహల్ ఇలా అన్నాడు: "దైవసాక్షి! ముహమ్మద్ సత్యసంధుడనడంలో సందేహం లేదు. అతనింతవరకు ఒక్కసారి కూడా అబద్ధమాడ లేదు. కాని రాజ్యాధికారం, సైనికప్రాబల్యం, దైవదౌత్యం, పేరు ప్రతిష్ఠలు అన్నీ ఖుసయ్యి సంతతికి లభిస్తే, ఇక ఇతర ఖురైషీయులకు దక్కేదేముంది?"

"ఇది సర్వలోక ప్రభువు నుండి అవతరించిన వాణి. ఇలాంటి వాణిని మీరు నిర్లక్ష్యం చేస్తున్నారా? దీన్ని నిరాకరించడమే బ్రతుకుతెరువుగా పెట్టుకున్నారా?" (ఖురాన్. 56:80-82)

ఇస్లాం అంటే శాంతి అని మనం గత పేజీలలో తెలుసుకున్నాం. కనుక ఇస్లాం ఎల్లప్పుడూ శాంతినే కోరుకుంటుంది. అన్యాయాన్ని అంతమొందించి, దౌర్జన్యాన్ని దూరం చేసి శాంతిభద్రతలను నెలకొల్పడం జరిగినప్పుడు ప్రజలు ప్రశాంతంగా ఆలోచించి మంచేదో చెడేదో, సత్యమేదో అసత్యమేదో నిర్ణయించుకోగల్గుతారు. అలాంటి వాతావరణంలో ప్రజలు సహజంగానే ప్రకృతి ధర్మమయిన ఇస్లాం వైపు దృష్టి సారిస్తారు. ఇక్కడే మతదురభిమానులకు, స్వార్థపరులకు ప్రమాదం కన్పిస్తుంది.

అంచేత అలాంటి వాతావరణం ఏర్పడకుండా అశాంతి, అస్థిరతల అగ్నిజ్వాలలు ఎల్లప్పుడూ ఉండేలా వారు ముస్లింజగత్తులో తరచుగా ఏదోఒక ఉపద్రవం రేకెత్తిస్తూనే ఉంటారు. నేడు అపారణ్వాయుధాలతో బలుపెక్కిన అప్రాచ్యులు చేస్తున్న పని ఇదే. ఇస్లాం గురించి అపార్థాలు-అపోహలు సృష్టించడం, దౌర్జన్యం-దోపిడీ ధోరణులకు వ్యతిరేకంగా గళంవిప్పే ముస్లింలను టెర్రరిస్టులగా చిత్రించి ప్రచారం చేయడం వారి నిత్య కృత్యాలు. అప్పటికీ ఈ ప్రయత్నాలు ఫలించకపోతే ప్రపంచానికి మాటిమాటికి టెర్రరిజం బూచీ చూపిస్తూ ముస్లిందేశాలపై విరుచుకుపడి వాటిని సర్వనాశనం చేస్తారు.

వాస్తవం ఎల్లకాలం దాగివుండదు. శాంతికాముకులు, న్యాయప్రియులు వారి విధ్వంసకాండలు, స్టేట్ టెర్రరిజాలను గమనిస్తూనే ఉన్నారు. హద్దుమీరిన వారి హింసా దౌర్జన్యాలను అర్థంచేసుకుంటున్న జనసామాన్యం కూడా విసిగెత్తిపోతున్నారు. కాని వారి వినాశకారీతనానికి వ్యతిరేకంగా నోరువిప్పడానికి ఎవరూ సాహసించలేకపోతున్నారు. ఇస్లాం ఖడ్గంద్వారా వ్యాపించిందని, టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తుందని నమ్మేరోజులు క్రమంగా అంతరిస్తున్నాయి. ఇలాంటి దుష్ప్రచారంతో ముస్లిం దేశాలలో విధ్వంసానికి పాల్పడిన పాశ్చాత్య దేశాలలోనే ప్రజలు ఇప్పుడు ఇస్లాం వైపు దృష్టిసారించి ప్రశాంతంగా ఆలోచిస్తున్నారు. అంతేకాదు ఇప్పుడు పాశ్చాత్యదేశాలలోనే ఇస్లాం అత్యధికంగా విస్తరిస్తోంది.

పాతికేళ్ళ క్రితం మనదేశంలోని తమిళనాడులో అగ్రవర్ణాల హింసా వేధింపులు భరించలేక కొన్ని దళితకుటుంబాలు మూకుమ్మడిగా ఇస్లాం స్వీకరించినప్పుడు కూడా

ఈ శక్తులు గగ్గోలుపెట్టాయి. అయితే దుష్ప్రచారం చేయడానికి వారికక్కడ ఖడ్గాలుగాని, తుపాకులుగాని కన్పించలేదు. అంచేత వారప్పుడు గల్ఫ్‌దేశాల నుండి పెట్రోడాలర్ల బూచీ తెచ్చి మీడియా భూతద్దం ద్వారా జనానికి చూపించారు.

"వారు తమ నోటితో దేవుని జ్యోతి (సత్యధర్మం) ఆర్పివేయ గోరుతున్నారు. కాని సత్యతిరస్కారులకు ఎంత వెగటు కలిగినా దేవుడు మాత్రం తన జ్యోతిని నేల నాలుగు చెరగులా ప్రసరింపజేయనిదే వదలిపెట్టడు." (ఖుర్‌ఆన్–9:32)

ఇస్లాం ప్రకారం ఈ ప్రపంచం మానవులకు ఒక పరీక్షా వేదిక. సృష్టికర్త మానవులకు మంచీ-చెడు, సత్యం-అసత్యం, ధర్మాధర్మాలను విచక్షణ చేసి తాము కోరుకున్న దాన్ని అవలంబించే స్వేచ్ఛ ప్రసాదించాడు. ఈ పరీక్షాప్రపంచంలో ఇలాంటి స్వేచ్ఛ ప్రసాదించ బడిన ప్రజలను ఇస్లాం ధర్మావలంబన కోసం ఎలా బలవంతం చేస్తుంది? తానిచ్చిన స్వేచ్ఛను తానే హరిస్తుందా? తాను నిర్దేశించిన సూత్రాలను తానే ఉల్లంఘిస్తుందా? ధర్మావలంబనలో ఏవిధమైన బలత్కారం లేదని ఖుర్‌ఆన్ స్పష్టంగా పేర్కొన్నది.

"మేము ముహమ్మద్(స)ని యావత్మానవాళికోసం దైవప్రవక్తగా నియమించాం. దీనికి దేవుని సాక్ష్యమే చాలు. కనుక ఎవరు దైవప్రవక్తకు విధేయులై నడచుకుంటారో, వారు దేవునికి విధేయులై నడచుకున్నట్లే. అలాచేయకుండా ముఖం తిప్పుకుంటే తిప్పుకోని. అలాంటివారి కోసం మేము నిన్ను పర్యవేక్షకునిగా నియమించి పంపలేదు." (4:79,80)

"దేవుని సూక్తుల్ని, ఆయన సందేశాన్ని (ప్రజలకు) చేరవేయడమే నాపని. అదితప్ప మరోబాధ్యత లేదు నామీద." (ఖుర్‌ఆన్–72:22)

"నీ ప్రభువు తలిస్తే భూవాసులంతా విశ్వసించేవారు. కాని నీవు ప్రజల్ని బలవంతంగా విశ్వాసులుగా మార్చదలిచావా? దైవాజ్ఞ లేనిదే ఏఒక్కడూ విశ్వసించలేడు." (ఖుర్‌ఆన్–10:99)

"ధర్మస్వీకరణలో ఎలాంటి బలాత్కారం లేదు. సత్యం అసత్యం నుండి స్పష్టంగా వేరు చేయబడింది. కనుక ఇకనుండి మిథ్యాదైవాలను నిరాకరించి అల్లాహ్‌ను విశ్వసించినవాడు ఎన్నటికీ ఏమాత్రం చెక్కుచెదరని దృఢమైన ఆశ్రయం పొందినట్లే." (ఖుర్‌ఆన్–2:256)

"ప్రవక్తా! నీవు మటుకు హితబోధ చేస్తూనే ఉండు. నీ పని హితబోధ చేయడమే గాని, వారిని బలవంతంగా దారికి తెచ్చే బాధ్యత నీమీద లేదు." (ఖుర్‌ఆన్–88:21,22)

19వ శతాబ్దపు పాశ్చాత్యమేధావి సర్ ఆర్నాల్డ్ తన గ్రంథం 'ప్రీచింగ్ ఆఫ్ ఇస్లాం'లో ఇలా రాశాడు: "ఆ కాలంలో క్రైస్తవులు ముస్లింలతో తమకున్న సత్సంబంధాల వలనే ఎలాంటి వత్తిడి, బలత్కారాలు లేకుండా ఇస్లాం స్వీకరించారని తెలుస్తోంది. ముహమ్మద్ (స) అనేక క్రైస్తవ తెగలతో శాంతి ఒడంబడికలు చేసుకున్నారు. వాటి ప్రకారం ఆయన ఆ క్రైస్తవుల రక్షణబాధ్యత తనపైనే వేసుకున్నారు. వారికి తమ మతాన్ని స్వేచ్ఛగా అనుస రించేందుకు అవసరమైన సౌకర్యాల కల్పనకు హామీనిచ్చారు. ఇస్లాంకు పూర్వం వారి మతనాయకులకు ఉండిన హక్కులు, అధికారాలను యధాతథంగా ఉండనిచ్చారు.... హిజ్రీశకం ఒకటో శతాబ్దానికి చెందిన ముస్లిం విజేతలు అరబ్ క్రైస్తవుల పట్ల కనబరచిన మతసహన వైఖరిని, ఆ తరువాత వచ్చిన తరాలు దాన్ని కొనసాగించిన తీరును చూసి



ఇస్లాం స్వీకరించారంటే వారు తమ ఇష్టపూర్వకంగా, మనస్ఫూర్తిగానే ఇస్లాం స్వీకరించా రని మనం గట్టిగా చెప్పగలం."

ఎడ్వర్ట్ గిబ్బన్ "హిస్టరీ ఆఫ్‌ది సలసిన్‌ఎంపైర్" గ్రంథంలో తన అభిప్రాయం ఇలా వెలిబుచ్చాడు: "ముహమ్మద్ (స) జీవితం మహోన్నతంగా విజయవంతం కావడానికి ప్రభావంచూపిన సాధనం నైతికశక్తి మాత్రమే. అందులో ఖడ్గానికి ఎలాంటి పాత్ర లేదు."

మలేషియా, ఇండోనేషియా, చైనా, ఫిలిప్పీన్ దేశాల్లో ముస్లింసైన్యాలు కాలు కూడా మోపలేదు. మరి అక్కడి ప్రజల ఇస్లాం స్వీకరణ వెనుక ఏ ఖడ్గం పని చేసింది? అది నైతికఖడ్గం మాత్రమే. నిజం చెప్పాలంటే ఇస్లాం ఖడ్గం ద్వారా వ్యాపించిందని దుష్ప్రచారం చేస్తున్న పాశ్చాత్యశక్తులే హింసాదౌర్జన్యాలతో బలవంతపు మతం మార్పిడు లకు శ్రీకారం చుట్టాయి. స్పెయిన్‌లో జరిగిన ముస్లిం నరమేధం ఎవరికి తెలియదు? అక్కడ క్రైస్తవులు ముస్లింల నిర్మూలన కోసం మతపరమైన న్యాయస్థానాలు నెలకొల్పి వారికి కనీవినీ ఎరగని భయంకరమైన శిక్షలు విధించాయి. కొందరు ముస్లింలను సజీవ దహనం చేశారు; మరికొందరి కళ్ళు పీకేశారు; ఇంకొందరి గోళ్ళు లాగిపారేశారు. ఇలా వేలాది ముస్లింల అవయవాలు కోసిపారేశారు. అయినా వారి మతంమార్పిడి కోర్కెలు నెరవేరలేదు. దాంతో వారు మరింత ప్రతీకారంతో ఉడికిపోతూ సైనిక ఉక్కుపాదంతో లక్షల మందిని పొట్టన పెట్టుకొని రక్తదాహం తీర్చుకున్నారు. అలాంటి మతదురహం కారులు ఏ ముఖం పెట్టుకొని ఇస్లాం ఖడ్గం ద్వారా వ్యాపించిందని చెబుతున్నారు?

## 57. శ్రేష్ఠసమాజం బాధ్యతలు

ఇస్లాం ముస్లిం సముదాయాన్ని శ్రేష్ఠ సమాజంగా నియమించి, శ్రేష్ఠసమాజం అయిన దృష్ట్యా అది నిర్వహించవలసిన బాధ్యతలను కూడా నిర్దేశించింది.

"విశ్వాసులారా! ఇకనుండి ప్రపంచ మానవులకు మార్గదర్శనం చేస్తూ వారిని సంస్క రించడానికి రంగంలోకి తీసుకురాబడిన శ్రేష్ఠసమాజం మీరే. మీరు మంచి పనులు చేయమని ప్రజలను ఆదేశిస్తారు. చెడుల నుండి వారిస్తారు." (ఖుర్‌ఆన్–3:110)

"విశ్వసించిన స్త్రీ పురుషులంతా ఒకరికొకరు స్నేహితులు, శ్రేయోభిలాషులు. వారు (ప్రజలకు) మంచి విషయాలు బోధిస్తారు. చెడువిషయాల నుండి వారిస్తారు." (9:71)

"వీరికి మేము ధరణిలో రాజ్యాధికారమిస్తే ప్రార్థనా (నమాజ్) వ్యవస్థ నెలకొల్పుతారు. జకాత్ చెల్లిస్తారు. మంచిని గురించి ఆదేశిస్తారు. చెడుల్ని అరికడ్తారు." (ఖుర్‌ఆన్–22:41)

అయితే పాలకులు ప్రజల పట్ల ఎలా ప్రవర్తించాలి? దీన్ని గురించి దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ప్రజలకు సౌలభ్యం కలగజేయండి, కష్టాల్లో పడవేయకండి. వారికి శుభవార్తలు అందజేయండి, ద్వేషం రగుల్కొల్పే మాటలు చెప్పకండి." (బుఖారి)

దైవప్రవక్త (సల్లం) హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి)ను యమన్ (రాష్ట్రాని)కి (గవర్నర్‌గా) పంపుతూ ఆయనకు ఇలా హితోపదేశం చేశారు: "ప్రజలకు సౌలభ్యాలు కలగజేయండి, కాఠిన్యాలలోకి నెట్టకండి. శుభవార్తలు అందజేయండి, ద్వేషం కల్గించే మాటలు చెప్పకండి." (బుఖారి)

మంచిని వ్యాపింపజేసే, చెడును అరికట్టే పని కోసం ప్రత్యేకంగా కొందరు తప్పక ఉండాలని ఖుర్ఆన్ ముస్లింలను ఇలా ఆదేశిస్తోంది:

“మీలో ఒకవర్గం (ప్రజల్ని) మంచి వైపునకు పిలిచేవారు, సత్కార్యాలు చేయమని ఆజ్ఞాపించేవారు, చెడు పనుల నుండి వారించేవారు తప్పకుండా ఉండాలి. అలాంటి వారే (ఇహపరలోకాల్లో) సాఫల్యం చెందేవారు.” (ఖుర్ఆన్-3:104)

“మేము సృష్టించినవారిలో ఒకవర్గం (ఎల్లప్పుడూ ప్రజలకు) సత్యం వైపుకే దారి చూపుతుంది; సత్యానికి అనుగుణంగానే నిర్ణయాలు చేస్తుంది.” (ఖుర్ఆన్-7:181)

“దేవుని (సందేశం) వైపు (ప్రజలను) పిలిచి, సత్కార్యాలు చేసి, తాను దైవవిధేయుణ్ణని పలికినవాని మాటకంటే శ్రేష్ఠమైన మాట మరెవరిది అవుతుంది?” (ఖుర్ఆన్-41:33)

పైన పేర్కొన్న ఖుర్ఆన్ సూక్తుల్ని బట్టి ప్రజలకు సత్యం-సత్కార్యాలను గురించి ఉపదేశించడం, సమాజంలోని చెడుల్ని నిర్మూలించడానికి కృషి చేయడం ముస్లింల విధ్యుక్తధర్మం అని, తప్పకుండా పాటించవలసిన విధి అని తెలుస్తోంది. దీనికోసం ముస్లింలు ఉండే ప్రాంతంలో ప్రత్యేకంగా ఒక వ్యవస్థీకృత సంఘం ఉండాలని కూడా తెలుస్తోంది. ఆ సంఘం తన బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తున్నంత వరకు ఇస్లాం ఆ ప్రాంతంలోని ఇతర ముస్లింలను ఆక్షేపించదు. ఒకవేళ ఆప్రాంతపు వ్యవస్థీకృత సంఘం తన బాధ్యతల్ని నిర్వహించడం మానేస్తే లేదా అసలక్కడ అలాంటి వ్యవస్థీకృత సంఘం అన్నదే లేకపోతే అప్పుడా ప్రాంతంలోని చైతన్యవంతులైన ప్రతి ముస్లింపై “మంచిని వ్యాపింపజేసే, చెడును అరికట్టే పని చేయడం ‘విధి’ అవుతుంది.

హజ్రత్ అబూబకర్ (రజి) దైవప్రవక్త (స) చేసిన ఒక హితువును ఇలా తెలియజేశారు: “ప్రజలు చెడు విషయం చూసి దాన్ని నిరోధించడానికి ప్రయత్నించకపోతే, దుర్మార్గుడ్ని దౌర్జన్యం చేస్తుండగా చూసి అడ్డుకోకపోతే త్వరలోనే వారందరిపై దైవశిక్ష విరుచుకుపడే ప్రమాదం లేకపోలేదు. కనుక దైవసాక్షిగా చెబుతున్నాను. (ప్రజలకు) మంచిని బోధించడం, వారిని చెడుల నుండి వారించడం మీ విధ్యుక్త ధర్మం. ఈ పని చేయకపోతే దేవుడు మీమీద పరమ దుర్మార్గులను (పాలకులుగా) రుద్దుతాడు. వారు మిమ్మల్ని ఘోరమైన కష్టాలకు గురిచేస్తారు. అప్పుడు మీలోని సజ్జనులు దేవుడ్ని (ఎంత దీనంగా) వేడుకున్నా వారి వేడుకోలు స్వీకరించబడదు.” (మిష్కాత్)

మంచిని వ్యాపింపజేసే, చెడును అరికట్టే పని నోటితో లేదా కలంతో చేస్తే అది కూడా జిహాద్ క్రిందికే వస్తుంది. ఈ విషయాన్ని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: “క్రూరుడైన పాలకుడి ముందు సత్యం, న్యాయం గురించి మాట్లాడటమే అన్నిటికంటే ఎంతో శ్రేష్ఠమైన జిహాద్ (పోరాటం).” (అబూదావూద్, తిర్మిజి)

తొలి నలుగురు ఖలీఫాల దైవప్రాతినిధ్య ప్రజాస్వామ్య వ్యవస్థ క్రమంగా పతనమై నియంతృత్వ రాజరిక వ్యవస్థ ఉనికిలోకి వచ్చిన తరువాత ముస్లింలలో ఈ ‘విధి’ పట్ల ఆసక్తి తగ్గిపోయింది. అప్పుడు ఇమామ్ అబూహనీఫా (రహ్మ), మరికొందరు సమాజ శ్రేయోభిలాషులు దీని ఆవశ్యకత, ప్రాముఖ్యతలను గురించి ప్రజలకు బోధించేవారు.



ఆ కాలంలోనే ఖురాసాన్ ప్రాంతానికి చెందిన సుప్రసిద్ధ ఫిఖ్హావేత్త ఇబ్రాహీం అస్సాయిగ్ ఇమామ్ అబూహనీఫాని కలుసుకొని ఈ ‘విధి’ ఆవశ్యకతను గురించే అడిగారు. దానికి ఇమామ్ అబూహనీఫా దైవప్రవక్త (స) ప్రవచించిన ఈహదీస్ చెప్పారు:

“యావన్మంది అమరవీరుల్లో హమ్జా(రజి) బిన్ అబ్దుల్‌ముత్తలిబ్ శ్రేష్ఠుడైన అమర వీరుడు. ఆ తరువాత క్రూరపాలకుడికి మంచిని బోధించి, అతడ్ని చెడు నుంచి వారించి తత్కారణంగా హతమార్చబడేవాడు శ్రేష్ఠుడైన అమరవీరుడు (షహీద్) అవుతాడు.”

ఈ హదీసు విన్న తర్వాత ఆ ఫిఖ్హావేత్త ఖురాసాన్‌కు తిరిగి వెళ్ళిపోయి ఆ కాలంలోని అబ్బాసీ రాజ్యస్థాపకుడు అబూముస్లింని అతని హింసాదౌర్జన్యాల పట్ల తీవ్రంగా విమర్శించారు, అనేక సార్లు విమర్శించారు. అలా విమర్శిస్తూ చివరికి ఆ దుర్మార్గుడి చేత ఘోరంగా హతమార్చబడ్డారు. (అహ్కాముల్‌ఖుర్ఆన్-ఖిలాఫత్ ఓములూకియత్)

ఇలాంటి మహత్తర విధిని ప్రతి ముస్లిం నిర్వహించగలడా? రాజ్యాధికారం ఉన్న చోట ప్రభుత్వం ఈ బాధ్యతను తప్పనిసరిగా నిర్వహించవలసి ఉంటుంది. రాజ్యాధికారం ఉన్నా లేకపోయినా ప్రతి ముస్లిం తన శక్తిసామర్థ్యాలను బట్టి ఈ బాధ్యత నెరవేర్చవలసి ఉంటుంది. దీన్ని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

“మీలో ఎవరైనా చెడును చూస్తే దాన్ని చేత్తో (అంటే శక్తి, అధికారంతో) అరికట్టాలి. చేత్తో అరికట్టే శక్తి లేకపోతే నోటితో అరికట్టాలి. నోటితో అరికట్టే శక్తి (ధైర్యం) కూడా లేకపోతే కనీసం మనసులోనైనా చెడును చెడుగా భావించాలి. (అంటే ఆ చెడును అసహ్యించుకొని దానికి దూరంగా మసలుకోవాలి.) ఈ (చివరి)వైఖరి అత్యంత బలహీనమైన విశ్వాసంగా పరిగణించబడుతుంది.” (సహీముస్లిం)

పై హదీసు వెలుగులో ఒక సంస్థ అధిపతి తన క్రింది ఉద్యోగులు సంస్థాగతంగా ఏదైనా తప్పు చేస్తుంటే దాన్ని తన అధికారశక్తితో నిరోధిస్తాడు. ఒక పోలీసు ఆఫీసర్ తన కార్యాచరణ పరిధిలో ఎవరైనా దొంగతనానికి పాల్పడితే లేదా అశ్లీలచేష్టలకు ఒడిగడితే లేదా ఎవరి మీదైనా దౌర్జన్యం చేస్తుంటే సదరు వ్యక్తిని అరెస్టు చేస్తాడు. ఒక రాజ్యాధినేత తన రాజ్యంలో తలెత్తే అన్యాయం-అక్రమాలను, ఇతర చెడులను నిర్మూలించడానికి కృషిచేస్తాడు. ఇవన్నీ ముస్లింలు చేయవలసిన పనులే.

అయితే వీటిని తమకుండే అధికారం ద్వారా మాత్రమే చేయగలుగుతారు. అలాంటి అధికారాలేమీ లేని ముస్లింలు నోటితో, కలంతో మాత్రమే చెడుల్ని అరికట్టడానికి ప్రయత్నిస్తారు. ఆ సామర్థ్యం కూడా లేని ముస్లింలు సమాజంలోని చెడుల్ని చూసి కనీసం మనసులోనైనా వాటిని అసహ్యించుకోవాలి. ఆమాత్రం కూడా చేయని ముస్లింల విశ్వాసం ఈ హదీసు ప్రకారం అనుమానాస్పదమైనదే.

“ప్రవక్తా! అవిశ్వాసుల మాట ఎన్నటికీ వినకు. ఈ ఖుర్ఆన్ తీసుకొని వారితో అవిశ్రాంత పోరాటం జరుపుతూ ఉండు.” (దివ్యఖుర్ఆన్-25:52)

పైసూక్తి మూలభాషలో “జిహాద్” అనే పదం వచ్చింది. ఆ జిహాద్ ఖడ్గం తీసుకొని కాదు, ఖుర్ఆన్ తీసుకొని చేయాలని ఉంది. ఇక్కడ ఖుర్ఆన్ సూక్తులతో హితోపదేశం

చేస్తూ ప్రజాభిప్రాయాన్ని మలచాలని ఆజ్ఞాపించబడింది. ఇలా ప్రజాభిప్రాయాన్ని మలచడానికి చేసే ఎలాంటి కృషి అయినా అది జిహాద్‌గానే పరిగణించబడుతుంది. ఈ కృషితో లక్ష్యం నెరవేరి, లక్ష్యానికి అనుగుణమైన ఒక స్వతంత్ర రాజ్యం ఏర్పడినా శత్రువులు ఆ లక్ష్యాన్ని తుదముట్టించడానికి ఆయుధాలతో దాడిచేయడానికి వస్తే దాన్ని ఎదుర్కోవడానికి చేయవలసిన చివరి జిహాదే సాయుధపోరాటం. అంతేగాని, శాంతిభద్రతలతో పాటు భావప్రకటనా స్వేచ్ఛ, మానవహక్కుల పరిరక్షణ ఉండే ఇస్లామేతర రాజ్యాలలో జిహాద్ పేరుతో రక్తపాతం జరపడానికి ఏ ముస్లింకూ ఇస్లాం అనుమతివ్వదు.

ఇస్లాంకు మారుపేరైన శాంతి సందేశాన్ని ప్రజలకు అందజేసే బాధ్యత ముస్లిం సముదాయంపై ఉన్నందున ఆ మార్గంలో చేసే ప్రతికృషీ జిహాద్ (Struggle) కిందికే వస్తుంది. నోటితో, కలంతో, సాహిత్యపంపిణి ద్వారా ప్రజాభిప్రాయాన్ని మలిచే ప్రయత్నం; దానికోసం శ్రమించడం, ధనత్యాగం చేయడం కూడా జిహాద్ క్రిందికే వస్తాయి.

మరి ప్రపంచ ముస్లింలందరిలో ఈవిధంగా ఎంతమంది చేస్తున్నారు? ఒక్క శాతం మంది కూడా చేస్తున్నట్లు కానరావడం లేదే! అలా చేయకపోగా ఈనాడు ముస్లింలలో అత్యధికమంది అనేక చెడులలో కూరుకుపోయి అనైక్యతా, అంతర్విభేదాలతో సతమతమవుతున్నారు. అయినా ఇస్లాంవ్యతిరేక శక్తులు ఆమాత్రం ముస్లింల ఉనికిని కూడా సహించలేక టెర్రరిజం పేరుతో హింసా, విధ్వంసకాండలకు పాల్పడుతున్నాయి.

ఇస్లాంవ్యతిరేక శక్తులు గడ్డంపెట్టుకొని ఇస్లాం ఆజ్ఞల్ని గురించి మాట్లాడే ముస్లిం యువకుల్ని తీవ్రవాదులుగా చిత్రించి ముస్లిమేతరుల్లో ఇస్లాం హింసను, తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తుందన్న భావన కలగచేస్తున్నాయి. ఇంకా చెప్పాలంటే ఈ శక్తులు తమ ప్రచార-ప్రసార సాధనాల ద్వారా, కుప్పలు కుప్పలుగా పడివున్న తమ భయంకర మారణాయుధాలతో ముస్లింల ఉనికినే మట్టు పెట్టడానికి ప్రయత్నిస్తున్నాయి.

"యూదులుగాని, క్రైస్తవులుగాని వారి ఆచార వ్యవహారాలను నీవు పాటించనంత వరకూ నీతో ఎన్నటికీ రాజీపడరు. కనుక దేవుడు చూపిన మార్గమే సన్మార్గమని వారికి స్పష్టంగా చెప్పు. ఒకవేళ నీకు (మా గ్రంథ) జ్ఞానం అందిన తరువాత కూడా నీవు వారి మనోవాంఛల్ని అనుసరిస్తే మాత్రం నిన్ను దేవుని బారినుండి కాపాడేవాడే ఉండడు. ఏ స్నేహితుడూ, సహాయకుడూ మా పట్టు నుంచి నిన్ను కాపాడలేడు. (ఖుర్ఆన్-2:120)

## 58. చేసిన మేలు మరచిన అప్రాచ్యులు

పాశ్చాత్యుల దృష్టిలో నియంతృత్వ పాలన చెడ్డ వ్యవస్థ. అయితే నియంతృత్వం స్థానంలో ఇస్లామీయ పాలనా వ్యవస్థ ఏర్పడితే అది వారి దృష్టిలో మరింత చెడ్డ వ్యవస్థ అవుతుంది. అందుకే వారు ఇస్లామీయ వ్యవస్థను అప్రతిష్ఠ పాలుచేయడానికి కావాలనే దుష్ప్రచార ఉద్యమాన్ని ప్రారంభించారు.

వారి అభిప్రాయం ప్రకారం మానవహక్కులను గౌరవించే, ప్రజలకు ఆర్థిక స్వేచ్ఛ, ఆర్థిక సుఖాలను అందజేయగలిగే విస్తృత దృక్పథంగల ప్రభుత్వాన్ని స్థాపించే సత్తా ఇస్లాంకు లేదు. వారి దృష్టిలో మానవ హక్కులను గౌరవించడమంటే వ్యక్తికి అతని



వ్యక్తిగత, సామూహిక జీవితాల్లో అన్నిరకాల చెడులకు, అశ్లీలచేష్టలకు, విచ్చలవిడితనానికి పాల్పడేస్వేచ్ఛ కావాలి. మరోవైపు పెట్టుబడీదారులకు వడ్డీతో కూడిన ఆర్థికవిధానాల ద్వారా పేదల రక్తాన్ని పిండుకునే స్వేచ్ఛ ఉండాలి; వారి హద్దుమీరిన లాభార్జనా కార్యకలాపాలు సాగేందుకు ఎలాంటి ఆంక్షలు, ఆటంకాలు ఉండకూడదు.

ఇలా అసభ్యకరాలకు, కుచేష్టలకు సైతం పాల్పడేందుకు వ్యక్తికి విశృంఖల స్వేచ్ఛ; పేదల రక్తం పీల్చుకునేందుకు పెట్టుబడిదారులకు, భూస్వాములకు ఆంక్షలులేని ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలన్నదే పాశ్చాత్యసమాజం సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ప్రాతిపదికపై ప్రపంచ జాతులను తమకు అనుకూలంగా మలచుకొని వాటిపై ఆధిపత్యం వహించడానికి యూరోపియన్లు ప్రయత్నిస్తున్నారు. అయితే సమానత్వం, సాంఘికన్యాయాలతో కూడిన ఇస్లామీయ వ్యవస్థ ముందు ఈ సిద్ధాంతం ప్రాతిపదికలు ప్రపంచ జాతులను ఎంతోకాలం కట్టి ఉంచలేవని యూరోపియన్లు నేడు భావించసాగారు. ఈ కారణంగానే వారు ఇస్లాంకు బద్ధశత్రువులయి పోయారు. నిజం చెప్పాలంటే పాశ్చాత్యుల ఇస్లాం వ్యతిరేక భావాలకు ఊపిరి పోస్తున్నది జియోనిష్టులే (యూదులే).

జియోనిస్టులు (యూదులు) తమ అసలు లక్ష్యమైన "అఖండ ఇజ్రాయీల్" సాధన కోసం క్రైస్తవజనాభా అధికంగావున్న అమెరికా, బ్రిటన్, ఇతర యూరప్ దేశాలకు ముస్లిందేశాలపై రాజకీయ పెత్తనాన్ని, అక్కడి సిరిసంపదల్ని ఎరగా చూపి వాటిని పావులుగా వాడుకుంటున్నారు. ఈ మార్గం సుగమం చేయడానికి మొట్టమొదట అఫ్గనిస్తాన్, ఇరాఖ్‌ల నడుములు విరగ్గొట్టి తద్వారా ముందుకు సాగాలన్నది వారి దుష్ట పథకం. ఈ దుష్టపథకంలో వారు చాలావరకు విజయం సాధించారనే చెప్పాలి. అయితే ఇస్లామిస్టుల రూపంలో వారికి కన్పిస్తున్న "టెర్రరిజంభూతం" వారినింకా వెంటాడుతూనే ఉంది. ముఖ్యంగా అఫ్గనిస్తాన్, పాకిస్తాన్, ఇరాఖ్‌లలో 'ఈ భూతం' మాటిమాటికి కన్పిస్తూ వారిని చికాకు పరుస్తోంది.

అఫ్గనిస్తాన్‌లో ఇస్లాంయోధులకు వ్యతిరేకంగా తమకు మద్దతు నిస్తున్న నార్దర్న్ అలైయన్స్ ట్రైబల్ ముస్లింల ముందు అమెరికా సైనికాధికారులు కొన్ని డాలర్ నోట్లు పడవేయడం మినహా వారిని ఇప్పటికీ కుక్కలకన్నా నీచంగా చూస్తున్నారు. ఆ నార్దర్న్ అలైయన్స్‌లో పనిచేసి మానేసిన ఒక ముస్లిం అనుభవాలు అతని నోటే వినండి:

"నేను చెప్పుకోవడానికి ముస్లింనే. ముస్లిం కుటుంబంలోనే పుట్టాను. ఇస్లాం అంటే ఏమిటో, విశ్వాసం అంటే ఏమిటో, సత్యం అంటే ఏమిటో, అసత్యం అంటే ఏమిటో, మంచేమిటో, చెడేమిటో నాకు బొత్తిగా తెలియదు.... అఫ్గనిస్తాన్‌పై అమెరికా దాడి చేసినప్పుడు అమెరికా అధికారులు మాకు పెద్దఎత్తున డాలర్లు పంచిపెట్టారు. డాలర్లు తమ పని చేసుకుపోయాయి. తాలిబాన్లు, అరబ్ యోధులు తమ శక్తినంతా ధారపోసి తీవ్రంగా ప్రతిఘటించారు. కాని అమెరికా భారీఆయుధాల ముందు వారు నిలువలేక పారిపోయారు. ఆ తరువాత అఫ్గనిస్తాన్‌లో అమెరికా సైనికులు, నార్దర్న్‌అలైయన్స్ వారు జరిపినంతటి దుర్భర దౌర్జన్యకాండ మరెక్కడా జరగలేదు. నార్దర్న్‌అలైయన్స్‌లో అప్పుడు నేనూ ఉన్నాను. అమెరికన్లు జరిపిన హింసాకాండను కూడా చూశాను....

ఖందార్‌లో ఒక అమెరికన్ సైనికాధికారితో నాకు స్నేహమయింది. మేమిద్దరం పిచ్చాపాటిగా మాట్లాడుకునేవాళ్ళం. ఇద్దరం కలసి మద్యం సేవించేవాళ్ళం. అలాంటి పరిస్థితిలో ఒకసారి నేను మాట్లాడుతూ "మీరు తాలిబాన్లను, అరబ్‌యోధులను దూషించడానికి కారణం అర్థమవుతోంది కాని, మేము శక్తివంచనలేకుండా మీకు మా సహాయసహకారాలు అందజేస్తున్నప్పటికీ మమ్మల్ని మీరు దూషించడమే నాకు అర్థం కావడం లేదు" అని అన్నాను. అమెరికన్ అధికారి ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్నాడు. అతను నామాటలు వినగానే మొదట నన్ను, యావత్తు ప్రపంచ ముస్లింలను ఘోరమైన ఒకతిట్టు తిట్టాడు. తరువాత ఇలా అన్నాడు:

"ఎవరైనా ఒక్కసారి కలిమా పఠించడంగాని లేదా ముస్లింకుటుంబంలో పుట్టడం గాని జరిగితే అతనిలో ఎక్కడో ఓచోట ఇస్లాం విశ్వాసకణం తప్పక మిగిలివుంటుంది. జీవితంలో ఎప్పటికైనా దాన్నతను వ్యక్తపరుస్తాడు. కనుక మాదృష్టిలో ఈ రోగానికి ఒకేఒక చికిత్స ఉంది. మొదట మేము ముస్లింలకు ధనాశ చూపి వాళ్ళను కొని వారి మత విశ్వాసాన్ని బలహీనపరుస్తాం. తరువాత వాళ్ళను శాశ్వతంగా అంతమొందిస్తాం. బోస్నియాలో మేము ఈ పనే చేశాము. పాలస్తీనాలో కూడా ఈ పనే చేస్తున్నాం. ఇప్పుడు అఫ్గనిస్తాన్, ఇరాఖ్‌లలో కూడా మేము ఈ పనే చేస్తున్నాం.

"మోమింద్‌ఖాన్! బోస్నియా ముస్లింల కంటే మీరేమంత ధైర్యవంతులు, స్వేచ్ఛా ప్రియులు కాదు. వారి రెండు మూడు తరాలవారు మాతో కలసి తిన్నారు, తాగారు. వారి వృద్ధులకు ఖుర్‌ఆన్ ఏమిటో, మసీదులేమిటో తెలియదు. వారి యువకులు మాతో కలిసి నైట్‌క్లబ్బుల్లో రేయింబవళ్ళు గడిపేవారు. వారు మాతో కలసి మద్యం కూడా సేవించేవారు, పందిమాంసం కూడా తినేవారు. అయినప్పటికీ మా మతస్థులు వారిపట్ల ఎలా ప్రవర్తించారో నీకు తెలుసు."

"బోస్నియా ముస్లింలు ఆచరణపరమైన ముస్లింలు కాదన్నది నిజమే. కాని వారి పేర్లు ముస్లింపేర్లే కదా! అలాగే నార్త్రన్‌అలైయన్స్ ముస్లింలు మాకు పూర్తి సహాయసహ కారాలు అందించిన మాట కూడా నిజమే. కాని వీరి పేర్లు కూడా ముస్లింపేర్లే కదా! పైగా వారు మాకోసం చేసిన పనులు మనస్ఫూర్తిగా చేసినవి కావు, ధనాశలో పడి చేశారు. ప్రపంచంలో రెండు రకాల ముస్లింలు మాత్రమే ఉన్నారు. ఒకటి, తాలిబాన్‌లు, అరబ్‌యోధుల్లాంటి నిస్వార్థపరులైన ముస్లింలు. రెండు, నార్త్రన్‌అలైఆన్స్ ముస్లిము ల్లాంటి ధనాశపరులైన కుక్కలు, పందులు,...."

"మిత్రమా! అమెరికాలో మాకు ఎలాంటి సౌఖ్యాలు, సౌకర్యాలున్నాయో అఫ్గనిస్తాన్ లో వాటిని గురించి ఊహించనైనా లేము. అఫ్గనిస్తాన్ సుందరమైన దేశం కాదు. ఇక్కడ బంగారుగనులు కూడా లేవు. అయినా అఫ్గనిస్తాన్‌పై దాడిచేసి గుంతలు పడిన రోడ్లు, బంజరుకొండలు ఉన్న ఈ దేశంలో మేము కూర్చున్నామంటే దానికి ఓ ప్రత్యేక కారణం ఉంది. ప్రస్తుతశతాబ్దం క్రైస్తవులు-యూదులు ప్రాబల్యం వహించే, ముస్లింలు అంత మయ్యే దశాబ్దం కానున్నది. అఫ్గనిస్తాన్‌లో తాలిబాన్‌లను, అరబ్‌యోధులను అంతమొం దించకుండా ఇరాఖ్‌పై దాడిచేస్తే అది మాకెన్నో ఇబ్బందులు తెచ్చిపెట్టవచ్చు. అంచేత



ఇరాఖ్‌పై దాడి, ఆ తర్వాత మధ్యప్రాచ్యంలో అఖండ యూదసామ్రాజ్యం స్థాపన కోసం ముందు అఫ్గనిస్తాన్‌లోని ఇస్లామీయయోధుల నడుములు విరగ్గొట్టవలసి వచ్చింది."

"ముస్లిం పంక్తులలో నీలాంటి ధనాశపరులైన ముష్టివెధవలు ఉండటం మాకెంతో ఆనందంగా ఉంది. నీలాంటివాళ్ళ సహకారంతో మాకు అఫ్గనిస్తాన్‌లో విజయం లభిం చింది. ఆ తరువాత కూడా మేము ముస్లింజగత్తుపై విజయపరంపరలు సాధించడానికి, సిలువప్రాబల్య పతాకాలు ఎగరవేయడానికి ప్రారంభించే పవిత్ర యుద్ధంలో ముస్లిం జగత్తు నుంచి మాకు వేలాదిమంది మోమింద్‌ఖాన్‌లు లభిస్తారు...."

....యధాప్రకారం ఓరోజు ఖంధార్ జైలు నుంచి ఇంటరాగేషన్ కోసం పొడవైన గడ్డాలున్న కొందరు అరబ్ ఖైదీలను ఖంధార్ ఎయిర్ పోర్టుకు తీసుకురావడం జరిగింది. మొదట వారిని ఇనుప సంకెళ్ళతో కాళ్ళుచేతులు కట్టివేశారు. తరువాత వారి శిరోజాలు, గడ్డాలు, కనుబొమలు గొరిగించి వారిని భయంకరమైన చిత్రహింసలకు గురిచేశారు. ఆ తరువాత ఒక అమెరికన్ అధికారి వారి ముందు నిలబడి ఇలా ప్రసంగించాడు:

"మీరు గౌరవం, సాఫల్యాలు ధర్మాన్ని ఆచరించడం వల్ల లభిస్తాయిని అంటారు. మీ ముహమ్మద్ (సల్లం) ఆజ్ఞ కనుక గడ్డాలు పెట్టుకుంటున్నామని చెబుతారు. ఇస్లాం ప్రాబల్యం, సిలువను విరగొట్టే కలలు కంటున్న ముస్లింలారా! మీ స్థాయి ఏమిటో, మీరెంతటివాళ్ళో ఆలోచించుకోండి. మీకు ఎలాంటి ఇళ్ళు లేవు, స్వస్థలాలు లేవు. మీ మాతృదేశాలలో మీ కోసం ఉరితాళ్ళు ఎదురుచూస్తున్నాయి. మీ పాదాల కింది నుంచి మేము అఫ్గనిస్తాన్‌ని లాక్కున్నాము. మీ కిప్పుడు ప్రపంచంలో ఎక్కడా ఆశ్రయం లేదు. అఫ్గనిస్తాన్‌లో మీరు నిర్మించుకున్న ఇండ్లను మేము నేలమట్టం చేశాం. మా బాంబు దాడులు మీనుండి మీ పసిపిల్లలను లాగివేశాయి. పరదా పాటించడం ఖుర్‌ఆన్ ఆజ్ఞ అని మీరు ఏడేసి పరదాల చాటున దాచిన మీ తల్లులు, అక్కచెల్లెళ్ళు, భార్యలు, కుమార్తెలు మా లైంగికేచ్ఛకు బలయిపోయారు...."

"బాగా వినండి. మేము మిమ్మల్ని అణచివేస్తాం, నలిపేస్తాం, తొక్కివేస్తాం. ఇతర ముస్లింలకు కనువిప్పు కలిగేలా మేము మీకు చావును కోరుకునేటటువంటి నరక యాతనలకు గురిచేస్తాం.....మీరు మొత్తం ప్రపంచంలోనే పెద్ద టెర్రరిస్టులు. మీ ధర్మం టెర్రరిజాన్ని బోధిస్తుంది. మీ ఖుర్‌ఆన్ టెర్రరిస్టు శిక్షణ ఇస్తుంది. మీ ప్రవక్త ప్రపంచంలో అందరికంటే అతిపెద్ద టెర్రరిస్టు. (దైవం క్షమించుగాక). మేము మీ మతాన్ని తుడిచి పెడతాం. మీ ఖుర్‌ఆన్‌ని కాల్చిపారేస్తాం. (దైవం క్షమించుగాక.)......"

అమెరికా అధికారి చేసిన ఈప్రసంగం తర్వాత సంకెళ్ళతో బంధించబడిన ఖైదీలలో ఓ అరబ్‌ఖైదీ ముందుకొచ్చి అదురూ బెదురూ లేకుండా ఇంగ్లీషులో ఇలా మాట్లాడాడు:

"మిస్టర్! జాతుల గతచరిత్ర వాటి వర్తమాన చరిత్రకు అద్దంలాంటిది. రా. మన ఉభయజాతుల గతచరిత్రలను ఓసారి పరిశీలిద్దాం. మిమ్మల్ని మీరు గొప్ప ప్రజాస్వామ్య ధ్వజవాహకులని, శాంతికాముకులని చెప్పుకుంటారు. మేము మీదృష్టిలో టెర్రరిస్టులం! మేము కాదు, మీరే పెద్ద టెర్రరిస్టులు. మన ఉభయుల గత చరిత్రలేమిటో చరిత్ర గ్రంథాలలో భద్రపరచబడి ఉన్నాయి. సిలువపూజారులు బైతుల్‌ముఖద్దస్ (జెరూసలేం)పై

విజయపతాకం ఎగరవేసిన వెంటనే ముస్లింలపై మారణకాండ జరిపి రక్తపుటేరులు ప్రవహింపజేశారు. వారి గుర్రాలగిట్టలు ముస్లింల నెత్తుటితో తడిసిపోయాయి. పట్టణ వీథుల్లో ముస్లింల రక్తం వర్షపునీరులా ప్రవహించింది. మీయీ వైఖరికి భిన్నంగా సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబి బైతుల్ ముఖద్దస్‌ని జయించిన తరువాత క్రైస్తవుల పట్ల కనబరచిన న్యాయవైఖరి ఎలాంటిదో మీ చరిత్రకారులకు కూడా తెలుసు."

"స్పెయిన్ చరిత్రను ఓసారి గుర్తుకు తెచ్చుకోండి. స్పెయిన్‌లో మేము మీకు ఎన్నెన్నో భాగ్యాలు ఇచ్చాము. విద్య, వివేకం, వైద్యం, విజ్ఞానం, ఐశ్వర్యం- ఒకటేమిటీ, అనేక సంపదలతో స్పెయిన్ ఖజానాలు నింపేశాము. మేము యూరప్‌కు వ్రేలు పట్టుకొని నడిపించాము; చేయి పట్టుకొని వ్రాయించడం నేర్పాము. మీ విశ్వవిద్యాలయాల్లో, పరిశోధనాశాలల్లో మా మేధావులు, వైజ్ఞానికులు, తాత్వికులు వ్రాసిన పుస్తకాలను శతాబ్దాల తరబడి చదివించడం జరుగుతుండేది. అది మీ పాదరీలు, పోపులు తాము అజ్ఞానులుగా ఉండటాన్ని గర్వకారణంగా భావిస్తుండిన కాలం. ఒకవేళ ఎవరైనా క్రైస్తవుడు ముస్లింలతో ప్రభావితుడయి జ్ఞానార్జన కోసం ప్రయత్నిస్తే చర్చిఅధికారులు అతడ్ని సజీవసమాధి చేసేవారు."

"ఈ యదార్థాలన్నీ చరిత్ర పుస్తకాలలో భద్రపరచబడి ఉన్నాయి. మీకు ధైర్యముంటే వాషింగ్టన్‌లోని ఏదైనా లైబ్రరీకు వెళ్లాం పదండి. నగరం మీదే, లైబ్రరీ మీదే, అందులోని పుస్తకాలు కూడా మీవే. మేము అధికారంలో, ఉచ్ఛదశలో ఉన్నప్పుడు మీపట్ల మేము ఎలా వ్యవహరించామో మీ పుస్తకాలే తీర్పిస్తాయి. ఈనాడు మీరు ఉచ్ఛదశలో ఉండి మా పట్ల మీరు ఎలా ప్రవర్తిస్తున్నారో పాలస్తీనాలోని ప్రతి అంగుళం భూభాగం సాక్ష్యం ఇస్తోంది. యూదులు ఈనాడు మీ తలలపై బలవంతపు కిరిటాలయి కూర్చున్నారు. వారు మీ మెడలపై ఎక్కి మీచేత ముస్లింల మీద దౌర్జనకాండలు జరిపిస్తున్నారు. ఈ యూదులకే మేము స్పెయిన్‌లో చోటిచ్చాం, ఆశ్రయమిచ్చాం, ఆదరించాం, గౌరవించాము. కాని స్పెయిన్ మీ అధికారంలోకి వచ్చిన తరువాత మీరు ఈ యూదుల్ని దేశం నుండి తరిమికొట్టారు. అప్పుడు ఉస్మానియా ఖిలాఫత్ ప్రభుత్వం వారికోసం తన ద్వారాలు తెరచిపెట్టింది."

"రండి, మీ మేధావులు, చరిత్రకారుల సమక్షంలో నాతో సంభాషణ జరపండి. వాస్తవాలు వీటికి వ్యతిరేకంగా ఉంటే మీరన్నట్లు మేము నిజంగా టెర్రరిస్టులమే. కాని వాస్తవాలు ఇవే అయితే మీ ఇష్టం; మీ హృదయాలు, అంతరాత్మలు ఎలా మసిబారి ఉన్నాయో, అలా మీ ముఖాలక్కూడా మసిపూసుకొని పాడుచేసుకోండి. నల్ల హృదయాలతో, నల్ల అంతరాత్మలతో వున్న తెల్లమొహాలకు నల్లపనులు శోభించవు.... సత్యాసత్యాల సంగ్రామ పరంపర ప్రారంభమయింది. ఈ సంగ్రామంలో అసత్యం పరాజయం పాలవుతుంది. సత్యమే విజయం సాధిస్తుంది. ఈనాడు మేమీ సత్యవిజయం చూడలేక పోతే మా భావితరాలు దైవచిత్తమయితే తప్పక చూస్తాయి."

"మీరు ఉసామా బిన్‌లాదిన్, ముల్లాఉమర్‌ల పేర్లను ఆసరగా తీసుకొని ముస్లింలపై హింసాకాండకు పాల్పడ్డారు. మీ యుద్ధం అసలు ముస్లింలకు వ్యతిరేకంగా కాదు,



ఇస్లాంకు వ్యతిరేకంగా జరుగుతోంది. మీరు ఇస్లాం వాస్తవికత, సత్యతల పట్ల భయపడుతున్నారు. ప్రపంచంలో పెరుగుతున్న ఇస్లాం ప్రభావం, ప్రాబల్యాలు చూసి బెంబేలెత్తిపోతున్నారు. కాని ఒక విషయం గర్తుంచుకోండి. ఇస్లాంను తుడిచిపెట్టేందుకు మీరు పన్నుతున్న కుట్రలు కుతంత్రాలు చివరికి మీకే ఉరిత్రాడులుగా మారుతాయి...."

అరబ్ యువకుని ప్రసంగం ముగిసిన తరువాత ఆ అమెరికన్ అధికారి బెల్లం కొట్టిన రాయిలా కాస్సేపు మౌనంగా నిలబడ్డాడు. ఆ తరువాత ఓ గావుకేక పెట్టి అక్కడ్నుంచి చరచరా వెళ్ళిపోయాడు. ఇతర అధికారులు కూడా పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ అతని వెనకాలే నడిచారు....

(త్రైదిన ఉర్దూపత్రిక 'దావత్' 1-6-05, 4-6-05 సంచికల సౌజన్యంతో)

ప్రశాంతహృదయంతో, నిష్పక్షపాతంగా ఆలోచించేవారు అసలు టెర్రరిస్టులు ఎవరో సులభంగా అర్థం చేసుకోగలుగుతారు. పాశ్చాత్య రచయితలు, చరిత్రకారులు వాస్తవాలను వక్రీకరిస్తూ ఇస్లాం గురించి అనేక అపార్థాలు సృష్టించారు. ఆ అపార్థాలలో ఇస్లాం బానిసవ్యవస్థను ప్రోత్సహిస్తుందనే విషయం కూడా చోటుచేసుకుంది. కాని దేశమంతటా బానిస విమోచనోద్యం ప్రారంభించి దాన్ని విజయశిఖరాలకు చేర్చిన ఘనత ప్రపంచంలో ఒక్క ఇస్లాంకు మాత్రమే దక్కుతుంది.

ఇస్లాం ప్రారంభ దశలో అరేబియాలో ఎంతమంది బానిసలు ఉండేవారో, ఇస్లాం అరేబియా దాటి ఇతర అనేకదేశాలలో వ్యాపించిన ఉచ్ఛదశలో వారిలో ఒక్కశాతం కూడా లేరని ఇస్లాంచరిత్ర అధ్యయనం చేసిన సహృదయులందరికీ తెలుసు. మరోవైపు ఇస్లాంను తూలనాడటమే పనిగా పెట్టుకున్న అమెరికా వికృతముఖం కూడా వారికి తెలుసు. ఆ వికృతముఖం రూపురేఖలను స్వయంగా అమెరికా రచయితే తన ప్రఖ్యాత గ్రంథం "రూట్స్" ద్వారా ప్రపంచం ముందు వెల్లడిచేశాడు. ఆ గ్రంథంలోని విషయాలు సంక్షిప్తంగా తెలుగులో కూడా 'ఏడు తరాలు' పేరుతో అనువదించబడ్డాయి.

నాలుగు శతాబ్దాల క్రితం మధ్య ఆఫ్రికా అడవుల్లో ప్రశాంత జీవితం గడుపుతుండిన నిరుపేద ట్రైబల్ ముస్లింలను అమెరికా టెర్రరిస్టులు బలవంతంగా తమ దేశానికి లాక్కొచ్చి అనేక విధాల వేధించి, వారి స్త్రీలపై అత్యాచారాలు జరిపి, మోయలేని బరువులు మోపి, చివరికి వారిని క్రైస్తవులుగా మారిపోయేలా చేసిన వైనం మనం ఈ పుస్తకంలో వివరంగా చూడవచ్చు.

ఈనాడు అఫ్గనిస్తాన్, ఇరాఖ్, పాలస్తీనా, లెబనాన్, ఇథియోపియాలలో ఘోరమైన హత్యలు, అత్యాచారాలు చేస్తూ అరాచకం, అల్లకల్లోలతో మారణహోమం సృష్టిస్తూ రాజ్యహింసకు పాల్పడుతున్న అమెరికా, బ్రిటన్‌ల సంగతి ఎవరికి తెలియదు?

# 59. జిజ్యా (రక్షణ రుసుం)

ఇస్లాంకు సంబంధించిన అనేక విషయాలతో పాటు జిజ్యా (రక్షణ రుసుం) వ్యవహారం కూడా అప్రాచ్యుల దుష్ప్రచార జాలంలో పడిపోయింది.

మన దేశంలో బ్రిటిష్ పాలకులు పోతూపోతూ 'విభజించి పాలించు' పాలసీతో హిందూ-ముస్లింల మధ్య చిచ్చు పెట్టడానికి పన్నిన కుట్రలలో చరిత్రను వక్రీకరించడం కూడా ఉంది. ముఖ్యంగా వారు ఔరంగజేబు చరిత్రపై విరుకుపడ్డారు. ఆయన ముస్లిమేతల నుండి వసూలు చేస్తుండిన రక్షణ రుసుం (జిజ్యా)ను జుట్టు పన్నుగా వక్రీకరించారు. అంటే ఇస్లాంలో జుట్టు పెంచడం నిషిద్ధం అయినట్లు, జుట్టు పెంచే ముస్లిమేతరులు జరిమానాగా జిజ్యా చెల్లించాలన్నట్లు భావన కల్పించారు. మరొక వైపు ఔరంగజేబు తన సొంతానికి కావలసిన పైకం ప్రభుత్వ బొక్కసం నుండి తీసుకోకుండా టోపీలు, ఖుర్‌ఆన్ ప్రతులు అమ్ముకొని సంపాదించేవాడని కూడా మన తెల్లదొరలు చరిత్రలో వ్రాసిపోయారు.

కాని ఈ రెండు విషయాలు పరస్పరం విరుద్ధంగా ఉన్నట్లు అన్పిస్తున్నా దాన్ని గురించి పెద్దపెద్ద మేధావులు సైతం ప్రశాంతంగా ఆలోచించకుండా జుట్టుపన్నునే పట్టుకొని వ్రేలాడుతూ ఇస్లాం వైపు అనుమానాస్పదంగా చూడసాగారు. సరే ఇస్లాంలో జుట్టు పెంచడం నిషిద్ధం అయితే, ముస్లిలంతా కాకపోయినా నిష్ఠగా మతాచారాలు పాటించే ముస్లింలందరైనా జుట్టు గొరిగించి బోడిగుండ్లు చేయించుకున్నారా? లేదే! ఇలా ఆలోచిస్తే బ్రిటిష్ చరిత్రకారుల వక్రబుద్ధి స్పష్టంగా మన ముందుకు వస్తుంది.

విజేత పాలకులు పరాజిత పాలకుల నుండి పన్ను లేక మరేదైనా రూపంలో ధనం వసూలు చేసే సంప్రదాయం అనేక దేశాల్లో పూర్వం నుండి వస్తోంది. ఇది లొంగిపోయి రక్షణ పొందినందుకు చెల్లించే మూల్యం తప్ప మరేమీ కాదు. 'జిజ్యా'ను గురించి దివ్య ఖుర్‌ఆన్ ఇలా పేర్కొంటున్నది:

"గ్రంథప్రజల్లో దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించనివారితో యుద్ధం చేయండి. దేవుడు, ఆయనప్రవక్త నిషేధించినవాటిని వారు నిషేధితాలుగా పరిగణించడంలేదు. సత్యధర్మాన్ని తమ జీవనధర్మంగా చేసుకోవడంలేదు. కనుక వారు మీకు పూర్తిగా లొంగిపోయి తమ చేతులారా జిజ్యా చెల్లించనంతవరకూ వారితో పోరాడండి." (9:29)

ఈ సూక్తిలో గ్రంథప్రజలంటే యూదులని అర్థం. యూదులు తమ గ్రంథంలోని విషయాలనూ సరిగా పాటించరు, ముహమ్మద్ (స) ప్రస్తావన వారి మతగ్రంథంలో ఉన్నప్పటికీ ఆయన తెచ్చిన ధర్మాన్ని కూడా విశ్వసించడానికి సిద్ధంగా లేరు. పైపెచ్చు ముహమ్మద్ ప్రవక్త (స)ను, ఆయన ధర్మాన్ని అంతం చేయడానికి పూనుకున్నారు. కాబట్టి ఇలాంటి కుట్రదారులు పూర్తిగా లొంగిపోయి జిజ్యా చెల్లించనంతవరకూ వారితో పోరాడాలని ఈ సూక్తిలో విశ్వప్రభువు ముస్లింలను ఆదేశిస్తున్నాడు.

ఇస్లాం ధర్మశాస్త్రం ప్రకారం గ్రంథప్రజలు లొంగిపోయి జిజ్యా చెల్లించడానికి అంగీకరిస్తే వారికి తమ మత విశ్వాసాలు, సంప్రదాయాల ప్రకారం నడచుకునే స్వేచ్ఛ ఉంటుంది. అయితే తమ దుర్మార్గపు చట్టాలను అమలుపరచి దేశంలో అరాచకం, అల్లర్లు సృష్టించడానికి మాత్రం వారికి అనుమతివ్వడం జరగదు.

జిజ్యా అంటే, ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరులు తమ మతాచారాలు పాటించడానికి పొందే స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు, విదేశీశక్తుల దాడుల నుంచి ప్రభుత్వం



కల్పించే రక్షణకు ప్రతిఫలంగా ఇస్లామీయ ప్రభుత్వానికి ప్రతియేటా చెల్లించవలసిన "రక్షణ రుసుం" అన్నమాట. ఇమాం అబూయూసుఫ్ (రహ్మ) ప్రకారం ముస్లిమేతరుల్లో స్తోమత కలిగిన పురుషులు మాత్రమే జిజ్యా చెల్లించవలసి ఉంటుంది. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, వికలాంగులు, శాశ్వత వ్యాధిగ్రస్తులు, సన్యాసులు, దేవాలయాల్లో పనిచేసే ఉద్యోగులు జిజ్యా చెల్లింపు నుండి మినహాయించబడ్డారు.

దీనికి భిన్నంగా జకాత్ ఆర్థికస్తోమత కలిగిన ప్రతిముస్లిం తప్పనిసరిగా ప్రభుత్వానికి చెల్లించవలసి ఉంటుంది. స్త్రీలైనా, పిల్లలైనా, వృద్ధులైనా, వికలాంగులైనా, మరెవరైనా సరే స్థితిపరులై ఉంటే చాలు, వారు విధిగా జకాత్ చెల్లించాలి. అంతేకాదు, విదేశీశక్తుల నుండి ప్రమాదం ఎదురైనప్పుడు శారీరక శక్తి ఉండే ప్రతిముస్లిం పురుషుడు తప్పని సరిగా యుద్ధంలో పాల్గొనవలసి ఉంటుంది. ముస్లిమేతరులు ఆ యుద్ధంలో పాల్గొనవ సరం లేదు. ముస్లిమేతరులు జిజ్యా చెల్లిస్తున్నందున వారి ధన మాన ప్రాణాలకు రక్షణ చేకూర్చడానికి ముస్లింలే విదేశీశక్తులతో పోరాడవలసి ఉంటుంది.

పూర్వం బలహీనుడైన రాజు బలవంతుడైన రాజు ముందు లొంగిపోయినప్పుడు అతను బలవంతుడైన రాజుకు కప్పం చెల్లించడం అందరికీ తెలిసిన విషయమే. ఈ విధంగా అతను ఇకముందు తిరుగుబాటు వైఖరి అవలంబించకుండా సామంతరాజుగా మసలుకుంటానని అంగీకరిస్తాడన్న మాట. ఇస్లాంలో జిజ్యా ఇంతకంటే ఎంతో ఉన్నత మైన విషయం. జిజ్యా అనేది ఇస్లామీయ రాజ్యంలో నివసించే ముస్లిమేతరుల మతస్వేచ్ఛ కోసం, వారి ధన-మాన-ప్రాణ రక్షణ కోసం వారి నుండి వసూలు చేసే భద్రతారుసుం. ఈవిధంగా ఉభయవర్గాల మధ్య శాంతిఒడంబడిక జరుగుతుంది.

పరాజితులైన ముస్లిమేతరులు విజేతలైన ముస్లింలతో రాజీఒప్పందం చేసుకున్న ప్పుడే వారికిలా ముస్లింలు రక్షణ కల్పించరు. ఒప్పందం చేసుకోక పోయినా వారికి రక్షణ కల్పించవలసి ఉంటుంది. ఫిఖావేత్తలు ఈవిషయాన్ని ఇలా వివరించారు: "ముస్లింలు ఏదైనా రాజ్యాన్ని జయించినప్పుడు పరాజితరాజ్య పౌరులతో ఒప్పందం జరగకపోయినా వారా ముస్లిమేతరుల్ని జిమ్మీలుగానే పరిగణించి, వారిపై జిజ్యా విధించి, వారి ధన ప్రాణాల రక్షణ బాధ్యత తీసుకోవలసి ఉంటుంది." (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

జిజ్యా ప్రతి ముస్లిమేతరపౌరుడు సులభంగా చెల్లించగలిగేలా నామమాత్రంగా నిర్ణయించబడుతుంది. హజ్రత్ అబూబకర్ (రజి) పాలనాకాలంలో సేనాపతి ఖాలిద్ బిన్ వలీద్ (రజి) హైరాప్రాంతం ప్రజలకు రాసిచ్చిన సంధిపత్రంలో "నిరుపేదలు, నిరాధారులను మినహాయించి మిగిలినజనాభా అంతటికీ 60 వేల దిర్హమ్‌లు, అంటే ఒక మనిషి యేడాదికి 10 దిర్హమ్‌లు (ఈనాటి మన లెక్క ప్రకారం 120 రూపాయలు)" మాత్రమే విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర విషయాలను గురించి ఇలా పేర్కొనడం జరిగింది:

"వారి ఆరాధనాలయాలను, వారి దేవతావిగ్రహాలను ధ్వంసం చేయడంగాని, వారు తమ శత్రువుల నుండి కాపాడుకోవడానికి నిర్మించుకున్న కోటలను పడగొట్టడం గాని జరగదు. వారిని శంఖారావం గావించకుండా, సిలువ ఊరేగింపులు జరుపుకో నీయకుండా నిరోధించడం కూడా జరగదు." (కితాబుల్‌ఖిరాజ్)

రెండవ ఖలీఫా ఉమర్ (రజి) పాలనాకాలంలో ముస్లింలు అనేక ప్రాంతాలను జయించారు. కాని ఏ పరాజిత ప్రాంతంలోనూ ముస్లిమేతరుల ఆరాధనాలయాలను పడ్డగొట్టడం జరగలేదని, వాటిని యధాతథంగా ఉంచడం జరిగిందని ఇమామ్ అబూ యూసుఫ్ (రహ్మలై) తన గ్రంథం 'కితాబుల్‌ఖిరాజ్'లో పేర్కొన్నారు.

జిజ్యా లక్ష్యం ముస్లిమేతరులపై జరిమానా విధించడంగాని, ప్రభుత్వధనాగారాన్ని నింపడంగాని కాదు. వారు దేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా తమ మతాచారాల ప్రకారం శాంతిగా జీవితం గడిపేలా చేయడమే జిజ్యా లక్ష్యం. అందుకే బలవంతంగా జిజ్యా వసూలు చేయడం ఇస్లాంలో నిషిద్ధంగా పరిగణించబడింది. దీన్ని గురించి హదీస్, ఫిఖాగ్రంథాల్లో అనేక ఆజ్ఞలు, ఉల్లేఖనాలు ఉన్నాయి.

ఉదాహరణకు- రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలంలో ఒకసారి ఓ పెద్ద మొత్తం జిజ్యా తీసుకురావడం జరిగింది. హజ్రత్ ఉమర్ (రజి) అంత పెద్ద ధనరాసి చూసి వసూలు చేసితెచ్చిన వారితో "మీరు ప్రజలను నాశనం చేశారు" అన్నారు. దానికి జిజ్యా వసూలు చేసినవారు "దైవసాక్షి! మేము చాలా మృదువుగా వ్యవహరించి వసూలు చేశాం" అని సమాధానమిచ్చారు. హజ్రత్ ఉమర్ (రజి) "వారిని కొట్టకుండా, నిర్బంధించకుండా వసూలు చేశారా?" అని అడిగారు. దానికి వారు "కొట్టకుండా, నిర్బంధించకుండానే వసూలు చేశాం" అన్నారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) దాన్ని ప్రభుత్వ ధనాగారంలో జమచేయడానికి అనుమతించారు.

హజ్రత్ ఉమర్ (రజి) దగ్గరికి ఇరాఖ్ నుండి రెవెన్యూపైకం వచ్చినప్పుడు కూఫా నుండి పదిమంది, బస్రా నుండి పదిమంది ఉన్నతాధికారులు రాజధానికి వచ్చేవారు. వారు ఖలీఫా ముందు నాలుగు సార్లు దేవుని పేరుతో ప్రమాణం చేస్తూ "మేము ఏ ముస్లింపై, ఏ జిమ్మీ (ముస్లిమేతరుని)పై దౌర్జన్యం చేసి ఈ ధనం వసూలుచేయ లేదు" అని చెప్పేవారు. (ఖిలాఫత్ ఓములూకియత్-కితాబుల్‌ఖిరాజ్)

ఖలీఫా అలి (రజి) ఒక వ్యక్తిని ఉక్బురా ప్రాంతానికి పాలకుడిగా నియమిస్తూ అతనికిలా ఉపదేశించారు: "రెవెన్యూ(జిజ్యా) వసూలు చేయడంలో కఠినంగా వ్యవహరించకూడదు. వారు తమ ఆవులు, గాడిదలు, బట్టలు లేదా ఇతర వస్తువులు గత్యంతరంలేక అమ్ముకునేలా వారిపై వత్తిడి చేయకూడదు. వారిపట్ల మృదువుగా ప్రవర్తించాలి."

ప్రవక్త అనుచరుడు హకీం బిన్‌హిజాం (ర) ఓసారి పాలస్తీనా రెవెన్యూ అధికారులు కొందరు జిజ్యా వసూలు చేయడంలో కఠినంగా ప్రవర్తించడం చూసి వారిని వారిస్తూ "ఇహలోకంలో ప్రజలను బాధ పెట్టేవారిని ప్రళయదినాన దేవుడు బాధ పెడ్తాడని దైవప్రవక్త (స) చెబుతుంటే విన్నాను నేను" అని అన్నారు. (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

ఇస్లాం ఖడ్గంద్వారా వ్యాపించిందనే మాట నిజమైతే యుద్ధం ఆపి ముస్లిమేతరుల నుండి జిజ్యా వసూలు చేయనవసరం లేదు. జిజ్యా వసూలు చేస్తూ వారికి మతస్వేచ్ఛ ఇవ్వడంతోపాటు వారి ధనమానప్రాణ రక్షణ బాధ్యత తీసుకోనవసరం లేదు. ముస్లిమేతర పౌరుల ధనప్రాణాలకు రక్షణ కల్పించలేని ఇస్లామీయ ప్రభుత్వానికి వారి నుండి జిజ్యా



వసూలుచేసే హక్కుండదు. ప్రఖ్యాత యూద పండితుడు జర్జి జైదాన్ "ఇస్లామీయ సంస్కృతీ చరిత్ర" అనే తనగ్రంథంలో 'జిజ్యా'ను గురించి రాస్తూ ఇలా పేర్కొన్నాడు:

"ముస్లింలు యర్మూక్‌యుద్ధంలో శత్రువుల్ని ఎదుర్కోవలసిన పరిస్థితి రాకముందు హమాస్ పట్టణం ముస్లింల అధీనంలోనే ఉండేది. అయితే వారు పరిస్థితి గమనించి హమాస్‌వాసుల నుండి లోగడ వసూలుచేసిన జిజ్యా వారికి తిరిగిచ్చివేస్తూ- 'మేమిప్పుడు పెద్దసమస్య (యుద్ధం)లో చిక్కుకున్నాం. ఈ స్థితిలో మేము మీకు రక్షణ కల్పించలేం. అంచేత మీకిష్టమైన రీతిలో మీరంతట మీరే స్వీయరక్షణ ఏర్పాట్లు చేసుకోండి' అన్నారు. హమాస్‌వాసులు ఈమాట విని 'మేమింతకు ముందు అనుభవించిన దౌర్జన్యాలకన్నా మీరాజ్యం, మీ న్యాయదృష్టే మాకెంతో ప్రియమైనవి. మేము మీ యోధులతో కలసి హమాస్ పట్టణాన్ని హెర్క్యులస్ సేనల నుండి కాపాడుతాం' అని చెప్పారు."

హమాస్‌వాసులైన ఈ క్రైస్తవులు, ముస్లింలతో కలసి ఎవరితో పోరాడుతామని చెప్పారో వారూ క్రైస్తవులే. వారిపై వారిమతస్థులే దుర్భరదౌర్జన్యాలు జరిపారు. ముస్లింలు అలాంటి పీడితుల్ని కాపాడి ఆశ్రయం కల్పించారు. ఇప్పుడా ఆశ్రయం, రక్షణ కల్పించ లేని స్థితిలో ఉన్నందున లోగడ వారినుండి వసూలు చేసిన జిజ్యా తిరిగివ్వడానికి సిద్ధమయ్యారు. ముస్లింల ఈ న్యాయదృక్పథమే హమాస్ క్రైస్తవుల్ని ప్రభావితం చేసింది.

యూద పండితుడు జర్జి జైదాన్ జిజ్యా ముస్లిమేతరులపై విధించిన జరిమానా లేక శిక్ష అని, ఇస్లాం ఖడ్గం ద్వారా వ్యాపించిందని భావించివుంటే ఈవిధంగా తన గ్రంథంలో ముస్లింల న్యాయదృష్టిని గురించి పేర్కొనేవాడే కాదు.

దైవప్రవక్త (సల్లం) ఇహలోకం వీడిపోయిన వంద సంవత్సరాల తరువాత పరిస్థితి క్రమంగా మారిపోయింది. ఇస్లాం పట్ల ముస్లింల విశ్వాసం బలహీనమైపోయింది. వారిలో నిజమైన జిహాద్ స్పిరిట్ క్షీణించింది. అందుకే అఫ్ఘానిస్థాన్ చక్రవర్తి రుత్బీల్ ఇస్లామీయ రాజ్యానికి చెల్లిస్తుండిన జిజ్యా చెల్లించడానికి నిరాకరించాడు. అదేలాగో చూడండి-

సజస్తాన్ (ప్రస్తుత అఫ్గనిస్తాన్)రాజు రుత్బీల్ అనేక సంవత్సరాల నుంచి ఇస్లామీయ రాజ్యానికి ప్రతియేడూ జిజ్యా చెల్లిస్తుండేవాడు. ఇస్లామీయ రాజ్యాన్ని యజీద్ బిన్ అబ్దుల్‌మలిక్ ఖలీఫాగా పాలిస్తున్న కాలంలో రెవెన్యూ అధికారులు యధాప్రకారం ఒక సంవత్సరం జిజ్యా వసూలు చేయడానికి రుత్బీల్ ఆస్థానానికి చేరుకున్నారు. రుత్బీల్ ఆ ముస్లింలను ఎగాదిగా చూసి ఇలా ప్రశ్నించాడు:

"ఇదివరకు ప్రతి సంవత్సరం జిజ్యా కోసం వస్తుండినవారు ఎక్కడికి పోయారు మీరొచ్చారు? వారి కడుపులు పస్తులుండేవారి కడుపుల్లా లోపలికి పీక్కుపోయి ఉండేవి. వారి నుదుళ్ళ మీద నల్ల బొడిపులు ఉండేవి. వారు ఖర్జూరమట్టల చెప్పులు తొడుక్కునే వారు. వారిప్పుడు ఏమయిపోయారు?"

దానికి ముస్లిం అధికారులు "వారు ఇహలోకం వీడిపోయారు" అని చెప్పారు. రుత్బీల్ ఈమాట విని "మీముఖాలు వారిముఖాల కంటే ఎక్కువ కళాపెళలాడుతున్నా వారు మీకంటే గొప్ప వాగ్దానపాలకులు, మీకంటే ఎక్కువ బలవంతులు" అని అన్నాడు.

రుత్బీల్ ఇలామాట్లాడిన తర్వాత జిజ్యా చెల్లించడానికి నిరాకరించాడు. ఈవిధంగా ఆ రాజ్యం దాదాపు అర్ధశతాబ్దం వరకు ఇస్లామీయ రాజ్యం నుండి వేరయి స్వతంత్రంగా ఉండిపోయింది. ఇక్కడ రుత్బీల్ గతకాలం ముస్లింల సద్గుణ సంపత్తిని కొనియాడి పరోక్షంగా ఇస్లాం ఔన్నత్యాన్ని ప్రశంసించాడు. ఆ తరువాత వచ్చిన ముస్లింలను పరోక్షంగా తెగిడాడంటే అది వారి తప్పేకాని ఇస్లాం లోపం ఎంతమాత్రం కాదు.

పాశ్చాత్య మేధావులు వాస్తవాలు కప్పిపుచ్చి, జిజ్యాని ముస్లిమేతరులపై రుద్దిన బలవంతపు సుంకం అని, జుట్టు పన్నని; జిహాద్‌ని ఇస్లాం వ్యాప్తి కోసం జరిపే మత యుద్ధమని దుష్ప్రచారం చేశారు.

## 60. ముస్లిమేతరులతో శాంతి ఒప్పందం

ముస్లిమేతరులతో చేసుకున్న ఒడంబడికను ఉల్లంఘించడానికి ఏ ముస్లింకూ అధికారం లేదు. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఒడంబడికదారుల ప్రాణ రక్షణ గురించి ముస్లింలకు గట్టిగా తాకీదు చేస్తూ ఇలా ప్రవచించారు:

"ఏ ముస్లిం అయినా ఒడంబడికదారునిపై దౌర్జన్యం చేస్తే లేదా అతని హక్కుల్ని తగ్గిస్తే లేదా అతనిపై అతని శక్తికి మించిన బరువు మోపితే లేదా అతని వస్తువేదైనా అతని అభీష్టానికి వ్యతిరేకంగా తీసుకుంటే ప్రళయదినాన నేనా ముస్లింకు వ్యతిరేకంగా వకీలునై (దేవుని ముందు) వాదిస్తాను." (అబూదావూద్)

"ఏ ముస్లిం అయినా ఒడంబడికదారుడ్ని చంపడం జరిగితే అతను స్వర్గసువాసన ఆఘ్రాణించే అదృష్టానికి కూడా నోచుకో లేడు. స్వర్గసువాసన నలభై సంవత్సరాల పాటు ప్రయాణం చేసినంత దూరం దాకా వ్యాపిస్తుంది." (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

దైవప్రవక్త (సల్లం) కాలంలో ఒక ముస్లిం ఓ జిమ్మీని (ముస్లిమేతరుడ్ని) చంపాడు. అందువల్ల దైవప్రవక్త (సల్లం) ఆ ముస్లింని వధించమని ఉత్తర్వు జారీచేశారు. ఆ సందర్భంలో ఆయన "ఆ బాధ్యత వహించడానికి అందరికంటే నేనే ఎక్కువ హక్కు దారుడ్ని" అని అన్నారు. (ఇనాయా షరై హదాయా)

హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలంలో బకర్ బిన్‌వాయిల్ తెగకు చెందిన ఒక ముస్లిం హైరా (ప్రాంతాని)కి చెందిన ఒక జిమ్మీని చంపాడు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) హంతకుడ్ని హతుని వారసులకు అప్పగించమని ఆదేశించారు. దాని ప్రకారం హంతకుడ్ని హతుని వారసులకు అప్పగిస్తే వారతడ్ని హతమార్చారు. (బుర్హాన్)

ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) ఇలా అన్నారు: "నేను మీకు ఉపదేశిస్తున్నాను. జిమ్మీల (ఇస్లామీయ రాజ్యంలో నివసించే ముస్లిమేతరుల)తో చేసుకున్న ఒప్పందం నెరవేర్చండి. వారి రక్షణ కోసం (అవసరమైతే విదేశీశక్తులతో) యుద్ధం చేయండి. వారిపై వారి శక్తికి మించిన శిస్తుభారం వేయకండి." (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

నాల్గవ శ్రేష్ఠ ఖలీఫా హజ్రత్ అలి (రజి) పాలనాకాలంలో ఒక ముస్లిం ఒక జిమ్మీని చంపాడన్న అభియోగం వచ్చింది. నేరం రుజువైన తరువాత హజ్రత్ అలి (రజి) ఖిసాస్



(ప్రతీకారం) ఉత్తర్వు జారీచేశారు. అయితే హతుని సోదరుడు వచ్చి "నేను హంతకుడ్ని క్షమించాను" అన్నాడు. హజ్రత్ అలి (రజి) దాంతో తృప్తిచెందక "నిన్ను (ముస్లిం)జనం బెదిరించి ఉంటారనుకుంటాను" అన్నారు. దానికి హతుని సోదరుడు "అదేమీ లేదు. నాకు రక్తపరిహారం లభించింది. హంతకుడ్ని చంపడం వల్ల నా సోదరుడు మళ్ళీ బ్రతికి రాలేడని నాకు తెలుసు" అని అన్నాడు. హజ్రత్ అలి (రజి) ఈమాట విని హంతకుడ్ని విడుదల చేశారు. ఆ సందర్భంలో ఆయన ఇలా అన్నారు:

"వారు తమ ఆస్తులు మన ఆస్తుల్లా, తమ రక్తం మన రక్తంలా గౌరవప్రదమైన విగా ఉండేందుకే మనతో ఈ బాధ్యతాఒప్పందం చేసుకున్నారు." (దుర్రెముఖ్తార్)

దైవనిర్ణీత శిక్షాస్మృతి విషయంలో ముస్లిం, ముస్లిమేతరుడు (జిమ్మీ) ఇద్దరూ సమానమే. నేర వ్యవహారాల్లో ముస్లింలకు ఏ శిక్షలు విధిస్తారో జిమ్మీలకు కూడా అవే శిక్షలు విధిస్తారు. జిమ్మీ సొత్తు ముస్లిం దొంగిలించినా, ముస్లిం సొత్తు జిమ్మీ దొంగిలించినా ఇద్దరికీ హస్తఖండన శిక్ష విధించబడుతుంది. అలాగే జిమ్మీ ముస్లింస్త్రీతో వ్యభిచరించినా, ముస్లిం జిమ్మీస్త్రీతో వ్యభిచరించినా ఉభయులకూ ఒకే విధమైన శిక్ష పడుతుంది. (కితాబుల్‌ఖిరాజ్)

"ముస్లిం ఎవరైనా జిమ్మీకు చెందిన సారాయిని, పందిని సైతం నష్టపరచినా దానికీ ఆ ముస్లిం నష్టపరిహారం ఇచ్చుకోవాల్సిందే." అలాగే "నోటితో లేక కాలితో బాధించడం, కొట్టడం, తిట్టడం, పరోక్షనిందకు పాల్పడటం ముస్లిం విషయంలో ఎలా నిషిద్ధమో జిమ్మీ ముస్లిమేతరుని విషయంలోనూ నిషిద్ధమే." (దుర్రెముఖ్తార్)

ఇస్లామీయ రాజ్యంలోని జిమ్మీ ముస్లిమేతరులు ఎంత పెద్ద నేరం చేసినా వారితో చేసుకున్న ఒప్పందాన్ని ముస్లింలు తెంచకూడదు. చివరికి వారు జిజ్యా చెల్లించడం మానేసినా, ముస్లింని చంపినా, ముస్లిం మహిళను చెరచినా, దైవప్రవక్త (సల్లం) విషయంలో ఏదైనా అపచారం తలపెట్టినా ఒప్పందం భంగం కాదు. అయితే జిమ్మీలు ఇస్లామీయ రాజ్యం వదలి శత్రువులతో చేతులు కలిపితే లేదా ఇస్లామీయ రాజ్యంపై బహిరంగంగా తిరుగుబాటు చేస్తూ అరాచకం, అల్లర్లు సృష్టిస్తే మాత్రం ఒప్పందం దానంతటదే భంగమైపోతుంది. (ఫతహుల్ ఖదీర్)

జిమ్మీలకు వారి వ్యక్తిగత సమస్యలు వారి ధర్మశాస్త్రం(Personal Law) ప్రకారం పరిష్కరించుకునే హక్కుంటుంది. అయితే ఇస్లాంకు వ్యతిరేకంగా వారి మతాచారాల్లో ఉండే కొన్ని పనులను తాము అధికసంఖ్యాకులుగా ఉండే ప్రాంతాలలో మాత్రమే నిర్వహించుకోవచ్చు. ముస్లింలు అధికసంఖ్యాకులుగా ఉండే ప్రాంతాలలో నిర్వహించు కోవడానికి ప్రభుత్వ అనుమతి తీసుకోవలసి ఉంటుంది. ప్రభుత్వం అలాంటి అనుమతి ఇవ్వొచ్చు లేదా నిరాకరించవచ్చు. ఉదా:- మద్యం, పందుల అమ్మకం; సిలువ, విగ్రహాల ఊరేగింపు, శంఖారావం మొదలైన పనులు. (అల్‌జిహాద్‌ఫిల్‌ఇస్లాం)

నజ్రాన్ వాసులకు, దైవప్రవక్త (స)కు (అంటే ముస్లింలకు) మధ్య జరిగిన ఒక శాంతి ఒడంబడికలో దైవప్రవక్త (స) వారికి ఈవిధంగా హామీ ఇచ్చారు:

"నజ్రాన్ క్రైస్తవులకు, వారి పొరుగు ప్రజలకు దేవుని రక్షణ ఉంది. దాని బాధ్యత దైవప్రవక్త ముహమ్మద్ (స)పై ఉంది. వారి ప్రాణాలకు, మతానికి, భూములకు, ఆస్తులకు, వారి ప్రజలకు, ప్రతినిధులకు, ఒంటెలకు, మతచిహ్నాలకు, అన్నిటికీ రక్షణ ఉంది. ఇప్పటివరకు వారు ఏ స్థితిలో ఉన్నారో అదే స్థితిలో వారిని యధాతథంగా ఉంచడం జరుగుతుంది. వారి హక్కుల్లో ఏహక్కునూ, వారి మతచిహ్నాల్లో ఏచిహ్నాన్నీ మార్చివేయడం జరగదు. వారి ఏ ధర్మకర్త (బిషప్) నుండీ అతని ధర్మకర్తుత్వాన్ని, వారి ఏసన్యాసి నుండీ అతని సన్యాసత్వాన్ని, వారి ఏచర్చీ సేవకుడ్ని అతని చర్చీసేవ నుండి తొలగించడం జరగదు. వారి ధర్మాదాయ ఆస్తులు ఎంత ఉన్నా, వాటి జోలికి పోవడం జరగదు. యుద్ధసేవ లేక యుద్ధఖర్చుల కోసం వారిని బలవంతం చేయడం జరగదు. వారి (పంట)భూములు సైన్యం చేత నాశనం చేయబడవు. వారిపై ఎవరైనా అభియోగం మోపితే న్యాయంగా తీర్పివ్వబడుతుంది. నజ్రాన్‌వాసులు ఇటు దౌర్జన్యపరులూ కాలేరు, అటు పీడితులూ కాలేరు. అయితే గతంలో ఎవరైనా వడ్డీ తినివుంటే దానికి నేను బాధ్యుడ్ని కాను. వారిలో ఒకరు చేసిన నేరానికి మరొకరిని పట్టుకోవడం జరగదు. ఈ ఒప్పందంలో రాయబడిన విషయాలకు దేవుని రక్షణ, దైవప్రవక్త ముహమ్మద్ (స) బాధ్యత ఉంటాయి. దేవుని ఆజ్ఞ వచ్చేదాకా, వారు శ్రేయోభిలాషులుగా ఉంటూ ఒప్పందం ప్రకారం తమపై మోపబడిన హక్కులు నిర్వర్తిస్తున్నంత కాలం శాశ్వతంగా దేవుని రక్షణ, దైవప్రవక్త ముహమ్మద్ (స) బాధ్యత ఉంటాయి." (కితాబుల్ ఖిరాజ్)

హజ్రత్ అబూబకర్ (రజి) పాలనాకాలంలో హైరా ప్రాంతం వాసులకు రాసిచ్చిన ఒడంబడికలో ఈ విషయాలు ఉన్నాయి: "వారి ఏ చర్చీనీ, ఏ దేవతావిగ్రహాన్ని ధ్వంసం చేయడం జరగదు. వారు తమశత్రువుల నుండి కాపాడుకోవడానికి కట్టుకున్న కోటలలో ఏ ఒక్కదాన్నీ పడగొట్టడం జరగదు. వారిని శంఖారావం గావించడాన్ని, పండుగరోజుల్లో సిలువ ఊరేగింపులు జరుపుకోవడాన్ని నిరోధించడం జరగదు."(కితాబుల్ ఖిరాజ్)

హజ్రత్ ఉమర్ (రజి) జెరూసలేం వాసులకు రాసిచ్చిన ఒడంబడికలో ఈ విషయాలున్నాయి: "వారికి, వారి ధనప్రాణాలకు, చర్చీలకు-సిలువలకు, వారి ఆరోగ్యవంతులకు-వ్యాధిగ్రస్తులకు రక్షణహామీ ఉంది. ఈ రక్షణహామీ ఏలియా సముదాయానికంతటికీ ఉంది. వారి చర్చీలను ముస్లింల ఇండ్లుగా మార్చేయడం లేదా ధ్వంసం చేయడం, వారి ఆవరణలను-భవనాలను తగ్గించడం, వారి సిలువలకు, ఆస్తులకు నష్టం కలగజేయడం, మతవ్యవహారంలో వారిని బలవంతం చేయడం, వారికి ఏవిధమైన బాధ పెట్టడం జరగదని హామీ ఇస్తున్నాం." (కితాబుల్ ఖిరాజ్)

## 61. శ్రేయోరాజ్యంలోని పాలకులు

ఇస్లాంలో ముస్లిమేతరులకు వ్యతిరేకంగా జరిపే జిహాద్ లక్ష్యం ధర్మపరిరక్షణతోపాటు వారి నుండి అరాచకం అల్లకల్లోల విశృంఖుల స్వేచ్ఛను హరించి, వారిని నైతిక మానవీయ విలువలకు కట్టుబడి ఉండే నిజమైన స్వేచ్ఛను ప్రసాదించడమే. హింసా,



దౌర్జన్యం, కల్లోలం, తిరుగుబాటు చర్యలను అణచివేయడానికి మాత్రమే ఇస్లాంలో ఖడ్గ ప్రయోగం జరుగుతుంది. ఇస్లామీయ రాజ్యంలో ముస్లిములైనా, ముస్లిమేతరులైనా అందరికీ సమానహక్కులు ఉంటాయి. ప్రగతివికాసాలకు అందరికీ సమాన అవకాశాలు ఉంటాయి. అందరికీ ఒకేవిధమైన న్యాయం లభిస్తుంది.

ఇస్లామేతర వ్యవస్థలలో రాజ్యాంగం, చట్టాలు ఎంత అందంగా రూపొందించుకున్నా ఆచరణలో మాత్రం విజేత వర్గం పరాజిత వర్గాన్ని ఎల్లప్పుడూ బానిసలుగా, ద్వితీయశ్రేణి పౌరులుగానే పరిగణిస్తుంది. ఆ భావనతోనే దాని ప్రవర్తన ఉంటుంది. పూర్వం రాజులు పరాజిత వర్గం పట్ల, అల్పసంఖ్యాకుల పట్ల, తమ మతంకాని వారి పట్ల ఇలాగే వ్యవహరించారు.

ఎక్కడో ఎందుకు, ఆధునిక కాలంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వహించే పాలకుల ప్రవర్తన, పనితీరును పరిశీలిస్తే అందులో మనకు నేతిబీరకాయ ప్రజాస్వామ్యం స్పష్టంగా కన్పిస్తుంది. ఈనాటి ప్రజాస్వామ్యవ్యవస్థలలో జాతీయ అల్పసంఖ్యాకులు సిద్ధాంతపరంగా ప్రభుత్వంలో భాగస్థులుగానే పరిగణించబడతారు. కాని ఆచరణలో మాత్రం అధిక సంఖ్యాకులే ప్రధానపాత్ర వహిస్తారు. అల్పసంఖ్యాకులు ద్వితీయశ్రేణి పౌరులుగా మారి తమ న్యాయమైన హక్కులు కోల్పోతారు. అంతేకాదు, అధికసంఖ్యాకుల ప్రయోజనాల కోసం హత్యా రక్తపాతాలతో అల్పసంఖ్యాకుల్ని నామరూపాల్లేకుండా తుడిచిపెట్టడమైనా జరుగుతుంది లేదా అల్పసంఖ్యాకులపై రకరకాల వత్తిడులు తెచ్చి వారు తమ ప్రత్యేక ప్రతిపత్తిని వదలుకొని అధికసంఖ్యాకుల్లో కలసిపోయేలా చేయడమైనా జరుగుతుంది.

ఒక సుస్థిరమైన రాజ్యంలో అస్థిరత, అరాచకాలకు దారితీసే విషయాలేమిటి? వ్యక్తుల మధ్య అయినా, వర్గాల మధ్య అయినా ఘర్షణ ఎందుకు ఎక్కడ మొదలవుతుంది? న్యాయానికి తిలోదకాలిచ్చి అత్యధిక ప్రయోజనాల కోసం ఒకరి హక్కులు మరొకరు కొల్లగొట్టడానికి ప్రయత్నించినప్పుడే సంఘర్షణ ప్రారంభమవుతుంది. అందుకే హక్కుల పోరాట సంఘాలు, హక్కుల సంఘర్షణ సమితులు ఉనికిలోకి వచ్చి వీధిన పడతాయి. అప్పుడు శాంతిభద్రతల పేరిట రక్షకభటులు రంగంలోకి దిగి తమ లాఠీలకు, తుపాకులకు పనిజెబుతారు. బలాబలాల పోటీలో పరిస్థితి మరింత ఉద్రిక్తమై చివరికి ఘోరమైన రక్తపాతంతో అదుపులోకి వస్తుంది.

అలాంటి నిశ్శబ్ద వాతావరణంలో అన్యాయం యధాతథంగా తిష్టవేసి శాంతికపోతాన్ని వెక్కిరిస్తూ ఉంటుంది. ఆ నిశ్శబ్ద వాతావరణంలోని సుస్థిరత నివురు గప్పిన నిప్పులా మాత్రమే ఉండిపోతుంది. పరిపాలనలో నిజమైన సుస్థిరత బలప్రయోగాల ద్వారా ఎన్నటికీ సాధ్యంకాదు, న్యాయం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. అప్పుడే నిజమైన శ్రేయోరాజ్యం కూడా ఉనికిలోకి వస్తుంది.

ఇస్లాం ఏవిధమైన పక్షపాతం, మతదురభిమానం లేకుండా అందరికీ సమానమైన హక్కులు, ఒకే విధమైన న్యాయం చేకూర్చుతుంది. దీనికి దాని గతచరిత్రే సాక్ష్యం. ఇక్కడ మనం ముందుగా శ్రేయోరాజ్యాన్ని నడిపే పాలకుల హోదా, స్థానాలు ఏమిటో

తెలుసుకుందాం. దివ్యఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు గమనించండి:

“నీ ప్రభువు దైవదూతలతో ‘భూలోకంలో నేనొక ఖలీఫాని నియమించబోతున్నా’ నని అన్నప్పుడు దైవదూతలు ఏమన్నారో తెలుసా? ‘ఏమిటీ! మీరు ప్రపంచ వ్యవస్థను ఛిన్నా ఛిన్నం చేసి, రక్తపాతానికి వడిగట్టేవాడ్ని భూలోకంలో నియమించబోతున్నారా? మేము మిమ్మల్ని అనుక్షణం స్తుతిస్తూ, మీ పవిత్రతను స్తుతిస్తూనే వున్నాంకదా?” అని అన్నారు. దానికి దేవుడు “మీకు తెలియని విషయాలెన్నో నాకు తెలుసు” అన్నాడు.” (2:30)

“జబ్బూర్‌లో మేము హితోపదేశం చేసిన తర్వాత, మాపుణ్యదాసులు భూమికి వారసు లవుతారని వ్రాశాం. భక్తిపరులకు ఇందులో గొప్ప సందేశం ఉంది.” (21:104,106)

అతనితో మేమిలా అన్నాం: “దావూద్! మేము నిన్ను ప్రపంచంలో (మా)ప్రతినిధిగా నియమించాం. కనుక నీవు ప్రజలను న్యాయంగా పాలించు. మనోవాంఛలకు బానిస కాకు. అవి నిన్ను దైవమార్గం నుండి తప్పిస్తాయి. దైవమార్గం తప్పి పరలోక తీర్పుదినాన్ని మరచి పోయేవారికి ఘోరమైన శిక్ష పడుతుంది.” (38:26)

(ఇస్రాయీల్ సంతతి ప్రజలారా!) “మీప్రభువు త్వరలోనే మీ శత్రువుల్ని తుద ముట్టించి వారి స్థానంలో మిమ్మల్ని పుడమిపై (తన) ప్రతినిధులుగా నియమిస్తాడు. అప్పుడు మీరెలా నడుచుకుంటారో చూస్తాడు.” (7:129)

ప్రపంచంలోని ఏ భూభాగంలోనైనా దేవుడు ఏ జాతికి రాజ్యాధికారం ప్రసాదిస్తాడో ఆ జాతి అసలుస్థానం దైవప్రాతినిధ్యం (ఖిలాఫత్) అయివుంటుంది, మన దేశంలో బ్రిటిష్ పాలనలోని వైశ్రాయ్ స్థానంలా. అయితే ఆ జాతి తన అసలు యజమాని, విశ్వ పాలకుడైన దేవునికి పూర్తిగా విధేయురాలై ఆయన ఆజ్ఞల్ని పాటిస్తున్నప్పుడే అది చేసే పరిపాలన నిజమైన దైవప్రాతినిధ్య పాలనవుతుంది.

“ప్రపంచంలో అధికులు కావాలనుకొని అరాచకం సృష్టించగోరని వారికి మాత్రమే మేము పరలోక (స్వర్గ)ధామం కేటాయిస్తాం.” (ఖుర్‌ఆన్-28:83)

“మీ పూర్వీకులను దేవుడు ఏవిధంగా లోకంలో ఖలీఫా (దైవప్రతినిధి)గా చేశాడో అదేవిధంగా మీలో విశ్వసించి సత్కార్యాలు చేసేవారిని కూడా ఖలీఫాగా చేస్తానని ఆయన వాగ్దానం చేస్తున్నాడు.... అయితే వారు నన్ను మాత్రమే ఆరాధించాలి. నాకు మరెవరినీ సాటి కల్పించకూడదు.” (ఖుర్‌ఆన్-24:55)

“వీరు (ఎంతో నీతిమంతులు), వీరికి మేము ధరణిలో రాజ్యాధికారమిస్తే ప్రార్థనా (నమాజ్) వ్యవస్థ నెలకొల్పుతారు. (పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ చెల్లిస్తుంటారు. (ప్రజలను) మంచిని గురించి ఆదేశిస్తారు. చెడుల్ని అరికడ్తారు.” (ఖుర్‌ఆన్-22:41)

“వారు పరస్పరం సలహా సంప్రదింపులతో తమ వ్యవహారాలు నడుపుకుంటారు.” (దివ్యఖుర్‌ఆన్-42:38)

ఈ సూక్తి సామూహిక వ్యవహారాల్లో నియంతృత్వ పోకడల్ని, ఏకసత్తాక ధోరణుల్ని అరికడ్తూ, ఇస్లామీయధర్మశాస్త్రం పరిధిలో ప్రజాస్వామ్య విధానాన్ని ప్రోత్సహిస్తోంది.



దైవప్రవక్త (స), ఆ తర్వాత వచ్చిన తొలి నలుగురు ఖలీఫాలు ధర్మశాస్త్రం పరిధిలోకిరాని సామూహికవ్యవహారాల్లో తోటిముస్లింలతో సలహాసంప్రదింపులు జరిపి సమిష్టినిర్ణయాలు తీసుకునేవారు. దేవుడు తన ప్రవక్త (స)ను తనఆజ్ఞల పరిధిలోకిరాని వ్యవహారాలను గురించి అనుచరులతో సంప్రదించి నిర్ణయం తీసుకోవాలని ఇలా ఆదేశిస్తున్నాడు: “నీవు తలపెట్టే పనుల విషయంలో వారిని సంప్రదిస్తూ ఉండు.” (ఖుర్‌ఆన్-3:159)

ఖుర్‌ఆన్, హదీసులతో కూడిన ధర్మశాస్త్రం ఇస్లామీయరాజ్యానికి శాశ్వత రాజ్యాంగ మవుతుంది. అందులో మార్పులు, చేర్పులు చేయడానికి ఎవరికీ ఎలాంటి అధికారం లేదు. ధర్మశాస్త్రం పరిధిలోకిరాని వ్యవహారాల్లో మాత్రమే రాజ్యాధినేత ప్రజాప్రతినిధుల్ని సంప్రదించి నిర్ణయం తీసుకుంటాడు. రాజ్యాధినేత తప్పుడు నిర్ణయం తీసుకుంటే ప్రజలకు అతడ్ని విమర్శించే, అతని నిర్ణయాన్ని ఉపసంహరింపజేసే హక్కుంటుంది. సన్మార్గగాములైన తొలి నల్గురు ఖలీఫాలు ప్రజలకు నిర్భయంగా తమఅభిప్రాయాల్ని వెలిబుచ్చడానికి, తప్పు చేసినప్పుడు తమను విమర్శించడానికి పూర్తి స్వేచ్ఛనిచ్చారు.

ఓసారి ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) జుమాప్రసంగం చేస్తూ, వివాహంలో నాల్గొం దల దిర్హంలకు మించి మహర్ చెల్లించడానికి అనుమతివ్వకూడదని ప్రతిపాదన చేశారు. అప్పుడో స్త్రీ లేచి “అలా ఆదేశించే అధికారం మీకు లేదు. ఖుర్‌ఆన్ మహర్‌గా ఎంతపెద్ద ధనరాసి ఇవ్వడానికైనా అనుమతిస్తుంటే దానికి హద్దులేర్పరచేందుకు మధ్యలో మీరెవరు?” అని విమర్శించింది. దాంతో ఆయన తన ప్రతిపాదన వెనక్కి తీసుకున్నారు.

మరొకసారి ఆయన్ని హజ్రత్ సల్మాన్ ఫార్సీ (రజి) నిండుసభలో పట్టుకొని “అందరికీ లెక్కప్రకారం ఒక్కొక్క దుప్పటే వచ్చింది కదా, మరి మీరు ఇంతపెద్ద చొక్కా ఎలా కుట్టించుకున్నారు? దానికి రెండు దుప్పట్లయితేగాని సరిపోదు” అని అడిగారు. హజ్రత్ ఉమర్ (రజి) భారీకాయంగల ఎత్తయిన మనిషి. అందువల్ల ఆయన చొక్కా కుట్టించుకోవడానికి తన భాగానికి వచ్చిన దుప్పటి సరిపడనందున తన కుమారుని వాటాకు వచ్చిన దుప్పటి అడిగి తీసుకొని చొక్కా కుట్టించుకున్నారు. ఆ విషయమే ఆయన తన కుమారుని చేత చెప్పించారు.

దైవప్రవక్త (సల్లం) మహితోక్తులు వినండి. ఆయన ఇలా ప్రవచించారు:

“మీరు తప్పనిసరిగా దైవగ్రంథాన్ని అనుసరించాలి. దైవగ్రంథాన్ని అనుసరించడం మీ విధి. అందులో దేవుడు ధర్మసమ్మతం చేసిన విషయాలను మీరు ధర్మసమ్మతం చేసుకోవాలి; దేవుడు నిషేధించినవాటిని మీరు నిషేధించుకోవాలి.” (ముస్నద్‌అహ్మద్)

“దేవుడు కొన్ని విధులు నిర్ణయించాడు, వాటిని వృథాచేయకండి. ఆయన కొన్ని హద్దులు నిర్ణయించాడు, వాటిని అతిక్రమించకండి. కొన్ని విషయాల్లో ఆయన కావాలనే (విశదీకరించకుండా) మౌనం వహించాడు, వాటి లోతులకు పోకండి.” (మిష్కాత్)

“నేను మీ దగ్గర రెండు వస్తువులు వదలిపోతున్నాను. దైవగ్రంథం (దివ్యఖుర్‌ఆన్), దైవప్రవక్త సంప్రదాయం (హదీసు). ఈ రెండిటిని దృఢంగా పట్టుకొనివుంటే మీరు ఎన్నటికీ మార్గభ్రష్టులు కాలేరు.” (మువత్తా, కన్జుల్ అమ్మాల్)

"మీమీద పాలకుడిగా బట్టతల నీగ్రో బానిసయినా సరే నియమించడం జరిగితే అతని మాట వినండి, అతనికి విధేయత చూపండి." (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

"మీలో ప్రతివ్యక్తీ బాధ్యతాయుతుడైన సంరక్షకుడే. కనుక అతను తన సంరక్షణలో ఉండేవారిని గురించి ప్రశ్నించబడతాడు. పాలకుడు తన పాలితప్రజలకు సంరక్షకుడు. అతను తన ప్రజల విషయంలో బాధ్యుడవుతాడు. పురుషుడు తన భార్యాపిల్లలకు సంరక్షకుడు. అతను వారి విషయంలో బాధ్యుడవుతాడు. స్త్రీ తనభర్త ఇంటికి, అతని పిల్లలకు సంరక్షకురాలు. ఆమె వారి విషయంలో బాధ్యురాలవుతుంది." (బుఖారి)

"ముస్లింల ప్రభుత్వంలో ఏదైనా పదవి చేపట్టిన ఏఅధికారి అయినా తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడానికి చిత్తశుద్ధితో పనిచేయకపోతే, తన ప్రాణాన్ని సైతం ఖాతరుచేయకుండా గట్టి కృషి చేయకపోతే అతను (తోటి)ముస్లింలతో పాటు స్వర్గంలో ఎన్నటికీ ప్రవేశించలేడు." (ముస్లిం)

"మన ప్రభుత్వంలో ఏదైనా హోదా చేపట్టిన ఏమనిషి అయినా భార్యావిహీనుడై ఉంటే పెళ్ళి చేసుకోవచ్చు; సేవకుడు లేకపోతే ఒక సేవకుడ్ని పెట్టుకోవచ్చు; నివసించడానికి ఇల్లు లేకపోతే ఒక ఇంటిని తీసుకోవచ్చు; వాహనం లేకపోతే ఒక వాహనం కూడా తీసుకోవచ్చు. అంతకుమించి మరే వస్తువునైనా సంపాదించడానికి పాల్పడితే అలాంటి మనిషి దొంగగా, నమ్మకద్రోహిగా పరిగణించబడతాడు." (కన్జుల్ అమ్మాల్)

"అబూజర్! నీవు చాలా బలహీనుడివి. ప్రభుత్వ హోదా అనేది ఎంతో నిజాయితీతో కూడిన వ్యవహారం (అమానత్). ఆ హోదాకు సంబంధించిన హక్కు పూర్తిగా నిర్వహించలేని, తనపై మోపబడిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చలేని వ్యక్తికి ప్రళయదినాన అది (తీవ్రమైన) పశ్చాత్తాపానికి కారణభూతమవుతుంది." (కన్జుల్ అమ్మాల్)

"ఈ ఐశ్వర్యం ఎంతో రుచికరమైన వస్తువు. ఎవరైనా దీన్ని న్యాయంగా, ధర్మసమ్మతంగా సంపాదించి న్యాయమైన చోట వెచ్చిస్తే అతని కోసం ఆ సంపద (పరలోక) అన్నంమూట అవుతుంది. దీనికి భిన్నంగా ఐశ్వర్యాన్ని అన్యాయంగా, అక్రమంగా సంపాదించిన మనిషి కడుపునిండా తిన్నా తృప్తిచెందని వ్యక్తిలాంటి వాడవుతాడు." (ముస్లిం)

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) బోధించిన ఈ హదీసుల్ని బట్టి దేశపరిపాలన ఎంత నిజాయితీ, బాధ్యతలతో కూడిన వ్యవహారమో స్పష్టమవుతోంది. ఈ కారణంగానే రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) తన బాధ్యతల్ని గుర్తుచేసుకుంటూ ఓసారి ఇలా అన్నారు: "ఫిరాత్ నదీతీరాన ఒక మేకపిల్ల చచ్చిపడివున్నా దాన్ని గురించి కూడా దేవుడు నన్ను నిలదీస్తాడేమోనని నాకు భయంగా ఉంది." (కన్జుల్ అమ్మాల్)

హజ్రత్ అబూబకర్ (రజి) ఖలీఫాగా ఎన్నుకోబడిన సందర్భంలో ఆయనిలా ప్రసంగించారు: "ప్రజలారా! నేను మీకంటే ఎక్కువ శ్రేష్ఠుడ్ని కాకపోయినా మీరు ప్రభుత్వ నిర్వహణబాధ్యత నాకప్పగించారు. మీలో అందరికంటే ఎక్కువ బలవంతుడు నేనతనికి అతని హక్కు ఇప్పించనంత వరకు నాదృష్టిలో బలహీనుడే. మీలో అందరికంటే ఎక్కువ బలహీనుడు నేనతనికి అతనిహక్కు ఇప్పించనంత వరకు నాదృష్టిలో బలవంతుడే.



ప్రజలారా! నాస్థాయి మీలో ఒక సాధారణ మనిషి స్థాయికంటే ఎక్కువ కాదు. కాబట్టి నేను సన్మార్గంలో నడచినంత కాలం మీరు నాకు విధేయులై ఉండండి. ఒకవేళ నేను సన్మార్గం తప్పి నడవడం చూస్తే మీరు నన్ను సరిచేయండి." (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

హజ్రత్ అబూబకర్ (రజి) గతంలో వస్త్రవ్యాపారం చేస్తుండేవారు. అందువల్ల ఆయన ఖలీఫాగా ఎన్నికయిన మరుసటి రోజు నుంచే యధాప్రకారం బట్టలమూట భుజాన వేసుకొని బయలుదేరారు. దారిలో హజ్రత్ ఉమర్ (రజి) తారసపడి "మీరిప్పుడు ముస్లింలకు (దేశానికి) నాయకుడయ్యారు. మీకీ పని శోభించదు" అన్నారు. దానికి అబూబకర్ (రజి) "మరి నేను నా భార్యాపిల్లల్ని ఎలా పోషించుకోవాలి?" అన్నారు. "ఆ ఏర్పాటు (మన కోశాధికారి) అబూఉబైదా చేస్తారు, పదండి ఆయన దగ్గరకు" అన్నారు ఉమర్ (ర). చివరికి ముహాజిర్ ముస్లింలలో మధ్యతరగతి వ్యక్తి సంపాదనను దృష్టిలో పెట్టుకొని ఖలీఫాకు సంవత్సరానికి దాదాపు నాలుగువేల దిర్హమ్‌లు (ఈనాటి మన లెక్క ప్రకారం నెలకు సుమారు నాలుగు వేల రూపాయలు) జీతం నిర్ణయించబడింది.

అయితే హజ్రత్ అబూబకర్ (రజి) రెండేళ్ళపాలన తరువాత తనకు మరణ కాలం సమీపించినప్పుడు, తన ఆస్తి నుంచి ఎనిమిది వేల దిర్హమ్‌లు తీసి ప్రభుత్వ ధనాగారంలో జమ చేయాలని వీలునామా రాశారు. (ఖిలాఫత్ ఓములూకియత్)

హజ్రత్ ఉమర్ (రజి) ఓ ప్రసంగంలో తనహోదాను గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు: "మీ (ప్రజా)ధనంతో నాసంబంధం ఒక అనాథధనంతో అతని సంరక్షకునికున్న సంబంధం వంటిదే. నేను స్థితిపరుడినైతే ఇందులో నుంచి చిల్లిగవ్వ కూడా తీసుకోను; పేదవాడినైతే నాసేవకు లభించేటంత ప్రతిఫలమే తీసుకుంటాను. మీహక్కులు కొన్ని నాపై ఉన్నాయి. వాటిని గురించి మీరు నన్ను డిమాండ్ చేయవచ్చు. మీ ఆదాయం నుండి, 'ఫై'(సమరసొత్తు) రూపంలో దైవం మీకిచ్చిన సంపద నుండి (ప్రభుత్వ) రెవెన్యూ ఖాతాకు రావలసిన దానికంటే ఎక్కువ పన్నులు నేను వసూలు చేయను. ధర్మసమ్మతమైనంత పన్ను మాత్రమే వసూలు చేయడం నా బాధ్యత. నాచేతికి వచ్చే ధనాన్ని నేను ధర్మసమ్మతంగా తప్ప మరేవిధంగాను ఖర్చుచేయకుండా ఉండేలా మీరు నన్ను అదుపులో ఉంచవచ్చు. ఇది నామీద మీకున్న హక్కు." (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

ఇస్లాం తన న్యాయాన్ని మాటలకు, రాతలకు మాత్రమే పరిమితం చేయలేదు. మహాప్రవక్త ముహమ్మద్ (స), ఆయన నలుగురు శ్రేష్ఠఖలీఫాలు దీన్ని ఆచరణ ద్వారా లోకానికి చూపించారు. ఇలాంటి సంఘటనలతో ఇస్లాం చరిత్ర నిండిపోయివుంది.

హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో ఈరాన్ నుండి ఉత్తరాఫ్రికా వరకూ ఇస్లాం విజయపతాకాలు రెపరెపలాడాయి. సమరసొత్తు, జకాత్, జిజ్యా రూపాల్లో ప్రతి ఏడూ కోట్లాది దిర్హమ్‌లు ప్రభుత్వ ధనాగారంలోకి చేరుతుండేవి. అయినప్పటికీ ఆ మహాసామ్రాజ్యాన్ని ఏలే ఖలీఫా పరిస్థితి ఎంత దయనీయంగా ఉండేదో చూడండి.

ఆయన ఒంటిపై పదేసి అతుకులతో కూడిన ముతకబట్టలు, కాళ్ళకు చిరిగిన చెప్పులు, తలమీద చింపిరితలపాగ మాత్రమే ఉండేవి. సామాన్య ముస్లింలలో ఖలీఫా

ఎవరో అరబ్బేతరులకు, విదేశీ దౌత్యవేత్తలకు ఎవరైనా చెప్పేవరకు తెలిసేది కాదు. ఆ రాజాధిరాజు సిరియా పర్యటనకు వెళ్ళి జెరూసలేం (బైతుల్‌మఖ్దిస్)లో ప్రవేశించినప్పుడు అక్కడి క్రైస్తవులు ఖలీఫా ఎవరో, ఆయన సేవకుడెవరో గుర్తించలేకపోయారు.

ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి), ఆయన సేవకుడు ఒంటెపై వంతులవారిగా కూర్చొని ప్రయాణం చేస్తూ నగరంలో ప్రవేశించే సమయానికి ఒంటెపై కూర్చునే వంతు సేవకునికి వచ్చింది. సేవకుడు ఎంత బ్రతిమాలినా హజ్రత్ ఉమర్ (ర) వినకుండా అతడ్ని ఒంటెపై ఎక్కించి తాను ఒంటె ముకుతాడు పట్టుకొని కాలినడకనే నగరంలో ప్రవేశించారు. స్థానిక ముస్లింలు ఆయన దగ్గరకు వచ్చి సలాం చేస్తూ స్వాగతిస్తుంటే, "ఏమిటీ ఇతనా ముస్లింల చక్రవర్తి!" అంటూ క్రైస్తవులు ఆశ్చర్యచకితులైపోయారు.

ఇక్కడ ఒక విషయం ప్రస్తావిస్తే సందర్భోచితంగా ఉంటుంది. కాస్త చరిత్ర పుటలు తిప్పి వెనక్కి వెళ్ళండి.... దైవప్రవక్త (సల్లం) అనేక రాజులతో పాటు రోమ్ చక్రవర్తికి కూడా శాంతిసందేశం లేఖ రాయించి పంపిన సందర్భం.

అప్పుడు రోమ్ చక్రవర్తి పాలస్తీనా పర్యటనకు వచ్చి జెరూసలేంలో ఆగివున్నాడు. అతను వ్యాపారం కోసం అక్కడికి వచ్చిన కొందరు అరబ్ బహుదైవారాధకుల్ని పిలిపించి ముహమ్మద్ (స) గుణగణాలు, వంశం వగైరా విషయాల్ని గురించి అడిగాడు. వారు చెప్పిన సమాధానాలు విన్న తరువాత రోమ్ చక్రవర్తికి మహనీయ ముహమ్మద్ (స) తప్పకుండా దైవప్రవక్తే అని నమ్మకం కలిగింది. అప్పుడతను తన సింహాసనం క్రింది నేల వైపు చూపిస్తూ "అయితే అతని సామ్రాజ్యం ఇక్కడ దాకా విస్తరిస్తుంది" అన్నాడు.

మహాప్రవక్త ముహమ్మద్ (స) గురించిన బైబిల్ భవిష్యవాణి వెలుగులో ఆనాడు రోమ్ చక్రవర్తి చెప్పిన మాట హజ్రత్ ఉమర్ (రజి) పాలనలో నిజమయింది. ఆయన బైతుల్‌మఖ్దిస్‌లో ప్రవేశించేటప్పటికి ఆ నగరం ముస్లింల అధీనంలోకి వచ్చింది. అయినప్పటికీ అక్కడ ఇస్లాం వ్యాప్తి కోసం రక్తపాతం జరగలేదు. కారణం కాలినడకన నగరంలో ప్రవేశించిన ఆ ఖలీఫా శ్రేయోరాజ్య పాలకుడు కావడమే.

పారశీకంలోని ఒక పట్టణాన్ని ముస్లింలు దిగ్బంధించి యుద్ధం చేస్తారు. దిగ్బంధానికి గురయిన పార్శీలు తమ శక్తినంతా ధారపోసినా ముస్లింలను ఎదిరించలేక దాదాపు ఓడిపోయే దశకు చేరుకున్నారు. సరిగ్గా అలాంటి పరిస్థితిలోనే ఇస్లామీయ సైన్యంలోని ఒక బానిస సైనికుడు తాము పట్టణవాసులకు రక్షణ హామీ ఇస్తున్నట్లు ఒక కాగితంలో రాసి దాన్ని బాణం ద్వారా పట్నంలోకి విసురుతాడు. ఈ విషయం తెలియని ముస్లిం యోధులు మరుసటి రోజు పట్టణంపై దాడిచేయడానికి సిద్ధమవుతారు. అప్పుడు పార్శీలు రక్షణ హామీ పత్రం తీసుకొని పట్టణ ప్రధానద్వారం తెరచి బయటికి వస్తారు. బయటికి వచ్చి "ఒక ముస్లిం సైనికుడు మాకు రక్షణ హామీ పత్రం రాసిచ్చాడు కదా, ఇక మీరెందుకు మాపై దాడిచేయడానికి వచ్చారు?" అని అడుగుతారు.

ముస్లిం సేనాపతి రక్షణహామీ పత్రం చూసి, ఒక బానిస రాసిచ్చిన హామీపత్రానికి ఎంత విలువ ఉంటుందో, అతని రక్షణహామీని అమలుపరచవచ్చా లేదా అని



ఆలోచనలో పడిపోయాడు. ఆ విషయం గురించే ఖలీఫాకు ఉత్తరం రాశారు ఆయన. దానికి ఖలీఫా ఉమర్ (రజి) సమాధానమిస్తూ "బానిస ముస్లిం కూడా ఇతర ముస్లింల వంటివాడే. ఇతర ముస్లింల బాధ్యతలకు ఎంత విలువ ఉంటుందో బానిస ముస్లిం బాధ్యతకు కూడా అంతే విలువ ఉంటుంది. కనుక ఆ బానిస సైనికుడు ఇచ్చిన రక్షణహామీని అమలుపరచాలి" అని ఆజ్ఞాపించారు.

# 62. ఇస్లాంలో న్యాయవ్యవస్థ

"విశ్వాసులారా! న్యాయానికి కట్టుబడి ఉండండి. స్వయంగా మీకుగాని, మీ తల్లి దండ్రులకుగాని లేదా మీ బంధువులకుగాని నష్టం వాటిల్లినా సరే దేవుని కోసం నిజమైన సాక్ష్యం ఇవ్వండి. కక్షిదారుడు ధనికుడైనా, పేదవాడైనా వారి విషయంలో మీకంటే దేవుడే ఎక్కువ శ్రేయోభిలాషి. కనుక మీరు మీ మనోవాంఛల్ని అనుసరిస్తూ న్యాయానికి తిలోదకాలు ఇవ్వకండి. ఒకవేళ మీరు విషయాన్ని వక్రీకరిస్తే లేదా నిజాన్ని దాటవేస్తే మీరు చేసేదంతా దేవుడు గమనిస్తుంటాడని తెలుసుకోండి." (దివ్యఖుర్‌ఆన్–4:135)

"విశ్వాసులారా! దేవునికోసం నీతీనిజాయితీలకు కట్టుబడిఉంటూ, న్యాయమైన సాక్ష్యం ఇవ్వండి. ఇతరులపట్ల విరోధం ఉన్నాసరే మీరు న్యాయానికి తిలోదకాలు ఇవ్వకూడదు. ఎల్లప్పుడూ న్యాయంగానే వ్యవహరించాలి. దైవభీతిపరాయణత అంటే అదే. (ఖుర్‌ఆన్.5:8)

"దేవుడు మిమ్మల్ని న్యాయంగా వ్యవహరించాలని, మేలు చేయాలని, బంధువుల పట్ల దయతో మెలగాలని ఆదేశిస్తున్నాడు." (16:90)

"ముస్లింలారా! దేవుడు మిమ్మల్ని ఆదేశిస్తున్నాడు: ఎవరైనా మిమ్మల్ని నమ్మి ఏదైనా వస్తువు మీదగ్గర భద్రపరిస్తే తిరిగి వారికి సురక్షితంగా అప్పగించండి. ప్రజల మధ్య ఏదైనా వ్యవహారం తీర్చవలసివస్తే న్యాయంగా తీర్చండి." (ఖుర్‌ఆన్–4:58)

దైవప్రవక్త (సల్లం) ప్రవచించిన ఈ మహితోక్తులు చూడండి:

"నేను మీమధ్య న్యాయం చేకూర్చడానికి పంపబడ్డాను." "ఎవరైనా ఓ జానెడు భూమి అయినా బలవంతంగా స్వాధీనం చేసుకుంటే దేవుడు అతని మెడలో ఏడు భూమండలాల కంఠపాశం వేస్తాడు." (ముస్లిం)

"ప్రజలారా! వినండి. మీ ప్రభువు ఒక్కడే. అరబ్బీయుడిపై అరబ్బేతరునికి, అరబ్బేతరునిపై అరబ్బీయుడికి, నల్లవాడిపై తెల్లవాడికి, తెల్లవాడిపై నల్లవాడికి దైవభీతి పరాయణత ప్రాతిపదికపై తప్ప ఎలాంటి ఘనతా ఔన్నత్యాలు లేవు." (బైహఖి)

మక్కాలో దైవప్రవక్త (స) దగ్గరికి తీర్పుకోసం ఒక వ్యవహారం వచ్చింది. మఖ్జూమ్ తెగకు చెందిన ఫాతిమా బిన్త్ అసద్ అనే స్త్రీ దొంగతనం చేసి పట్టుబడింది. ధర్మశాస్త్రం ప్రకారం ఆమెకు హస్తఖండనశిక్ష పడుతుంది. కాని ఆమె బంధువులు దైవప్రవక్త (స)కు ప్రియ అనుచరుడైన హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి) ద్వారా సిఫారసు చేయించుకోవడానికి వచ్చారు. ఉసామా (రజి) హస్తఖండన శిక్ష నుండి ఆమెను తప్పించమని మనవి చేశారు. ఈ మాట వినగానే దైవప్రవక్త (స) ముఖం జేవురించింది.

"ఏమిటీ? నువ్వు నా దగ్గర దేవుడు నిర్ణయించిన శిక్షాస్మృతి విషయంలో సిఫారసు చేయడానికి వచ్చావా!" అన్నారు ఆయన ఉరిమిచూస్తూ. "దైవప్రవక్తా! (తప్పయి పోయింది.) నా పాపక్షమాపణ కోసం దైవాన్ని ప్రార్థించండి" అన్నారు హజ్రత్ ఉసామా (రజి).

ఆ తర్వాత దైవప్రవక్త (స) ప్రజలను సమావేశపరచి ఇలా అన్నారు: "మీకు పూర్వం ఉండిన జాతులు పేరుపలుకుబడులు గల ఉన్నత వంశస్థుడెవరైనా దొంగతనం చేస్తే అతనికి శిక్ష విధించకుండా వదలిపెట్టేవారు; అదే బలహీన వర్గం లేదా పేరుపలుకుబడులు లేని మనిషి దొంగతనంచేస్తే మాత్రం శిక్ష విధించేవారు. ఈ కారణంగానే ఆనాటి జాతులు నాశనమయ్యాయి. నాప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! ముహమ్మద్ కూతురు ఫాతిమా దొంగతనంచేసినా నేను ఆమె చేతిని కూడా నరికేస్తాను."

తరువాత ఆయన దొంగతనం చేసిన ఆ స్త్రీకి హస్తఖండన శిక్ష విధించారు. వెంటనే దాన్ని అమలుపరచడం కూడా జరిగింది. ఈ సంఘటనతో నేరప్రవృత్తికల ఇతరులు కూడా అనేకమంది తమ నడవడికను సరిదిద్దుకొని ఇస్లాంకు చేరువయిపోయారు.

(బుఖారి, ముస్లిం తదితర హదీసుగ్రంథాల ఆధారంగా)

హజ్రత్ ఉమర్ (రజి) పాలనాలోని కొన్ని సంఘటనల్ని గురించి తెలుసుకుందాం-

ఈజిప్టు గవర్నర్ అయిన హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కుమారుడు అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి) ఒక వ్యక్తిని కొట్టారు. ఆ వ్యక్తి ఖలీఫా దర్బారులో ఫిర్యాదు చేస్తే హజ్రత్ ఉమర్ (రజి) అతని చేతనే అబ్దుల్లా (రజి)ను కొరడా దెబ్బలు కొట్టించారు.

ఈజిప్టు గవర్నర్ హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) దగ్గర చాల ధనం పోగయిఉందని ఆరోపణ రావడంతో హజ్రత్ ఉమర్ (రజి) "గవర్నర్ పదవికి పూర్వం మీ దగ్గర ఇంత ధనం ఉండేది కాదు, ఇప్పుడీ ధనం మీకు ఎక్కడ్నుంచి వచ్చింద"ని వివరణ కోరుతూ ఆయనకు లేఖ రాశారు. దానికి హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) సమాధానమిస్తూ "నా రాష్ట్రం సారవంతమైన ప్రాంతం. అంచేత నా దగ్గర నా ఖర్చులు పోను చాలా డబ్బు మిగులుతుంది" అని అన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈ సమాధానంతో సంతృప్తి చెందక విచారణ కోసం ముహమ్మద్ బిన్ మస్లిమాకు సర్వాధికారలిచ్చి ఈజిప్టు పంపారు. ముహమ్మద్ (రజి) ఈజిప్టు వెళ్ళి అమ్ర్ బిన్ ఆస్ (రజి) గత ఆస్తి విలువెంతో, దానిపై ఎంత ఆదాయం వస్తుందో లెక్కకట్టి అదంతా పోగా మిగిలిన ధనాన్ని జప్తు చేసుకొని ప్రభుత్వ ధనాగారంలో జమచేస్తారు. ఎంతో విశాలమైన రాష్ట్రానికి గవర్నర్ అయిన అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఇదంతా చూసి కూడా నోరు మెదపలేక పోయారు.

హజ్రత్ ఉమర్ (ర) కుమారుడు అబూసెహ్మా ఒకసారి (సహవాస దోషంతో) సారా తాగి సాధారణ నేరస్థుడిలా పట్టుబడతారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) అతనికి ఎనభై కొరడా దెబ్బలు తగిలిస్తారు. కన్నకొడుకని కూడా కనికరించకుండా ఇతర నేరస్థులకు కొట్టినట్లే గట్టిగానే కొట్టారు. ఆ దెబ్బలకు తాళలేక ఆ యువకుడు ప్రాణం వదులుతాడు.

బస్రా గవర్నర్ హజ్రత్ ముగీరా బిన్ షాబా (రజి)కు ఒక స్త్రీతో అక్రమ సంబంధం ఏర్పడిందని ఖలీఫా దర్బారులో ఆరోపణ వచ్చింది. హజ్రత్ ఉమర్ (రజి) వెంటనే



అబూమూసా అష్అరి (రజి)ని పిలిపించి "బస్రాలో షైతాన్ నివాసం ఏర్పరచుకున్నాడు. మీరక్కడికి పోయి పరిస్థితి పరిశీలించి సాక్షులతోసహా ముగీరాను మదీనా పంపండి"అని ఆదేశించారు. ఈ ఆజ్ఞ ప్రకారం ముగీరా (రజి) మదీనా పంపబడతారు. న్యాయస్థానంలో విచారణ ప్రారంభమవుతుంది. కాని నలుగురు సాక్షుల్లో ఒక సాక్షి తానా స్త్రీని సరిగ్గా చూడలేదని చెప్పడంతో నేరం రుజువు కాలేదు. దాంతో హజ్రత్ ఉమర్ (రజి) హజ్రత్ ముగీరా (రజి)ను విడుదల చేస్తారు. విడుదల చేస్తూ "సాక్ష్యం పూర్తయితే (నేరారోపణ నిజమని తేల్తే) నేను మీకు శిలాశిక్ష విధించి హతమార్చేవాడ్ని" అని అన్నారు.

హజ్రత్ ముగీరా (రజి) ప్రవక్త ముఖ్యఅనుచరుల్లో ఒకరు. రాజకీయంగా, యుద్ధ పరంగా ఇస్లాంకు గొప్ప సేవలు అందజేశారు. ఆనాటి అరేబియాలో నలుగురు ప్రముఖ యుద్ధవ్యూహకర్తలో ఈయన ఒకరు. ఈవిధంగా హజ్రత్ ముగీరా గొప్ప ప్రజానాయకునిగా, యుద్ధ తాంత్రికునిగా, బస్రారాష్ట్ర గవర్నర్‌గా పేరుగాంచారు. కాని అవేవీ ఇస్లామీయ న్యాయస్థానంలో ఆయనకు ఏమాత్రం ఉపయోగపడలేదు.

నాల్గవ ఖలీఫా హజ్రత్ అలి (రజి) రాజధాని నుండి సిఫ్ఫీన్ యుద్ధానికి బయలు దేరుతూ యుద్ధకవచం కోసం వెతికితే అది కన్పించలేదు. యుద్ధం నుంచి తిరిగొచ్చినప్పుడు ఆ కవచం ఒక యూదుడి దగ్గర కన్పించింది. అలి (రజి) ఆ యూదుడ్ని తన కవచం గురించి అడిగితే అది తనదేనని, తన దగ్గర ఎప్పటినుంచో ఉందని అతను బుకాయించ డానికి ప్రయత్నించాడు. యూదుడు అబద్ధమాడు తున్నట్లు అలి (రజి) గ్రహించారు. అయినప్పటికీ ఆయన తన ఖలీఫా పదవితో అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా ఒక సాధారణ ముద్దాయి మాదిరిగా న్యాయస్థానానికి వెళ్ళి అతనిపై ఫిర్యాదు చేశారు.

న్యాయమూర్తి రాజ్యాధినేతను చూసి గౌరవిస్తూ లేచి నిల్చోలేదు, తిరుగులేని ఆయన అధికారానికి భయపడి కూడా ఆయనకు అనుకూలంగా తీర్పివ్వలేదు. సాధారణ ప్రజలను విచారించినట్లే ఖలీఫాను కూడా విచారిస్తూ "ఈ కవచం మీదేనని రుజువేమిటీ?" అని ప్రశ్నించాడు. అప్పుడు హజ్రత్ అలి (రజి) తన సేవకుడు ఖంబర్‌ని, తన కుమారుడు దైవప్రవక్త (స) మనవడైన ఇమామ్ హుసైన్ (రజి)ని సాక్షులుగా ప్రవేశపెట్టారు.

న్యాయమూర్తి ఆ సాక్షుల్ని చూసి "హుసైన్ (రజి) మీ కుమారుడే గనక ఆయన సాక్ష్యం నమ్మదగినది కాదు. తండ్రి అభియోగానికి కొడుకు సాక్ష్యాన్ని అంగీకరించ లేము" అంటూ ఖలీఫా సాక్ష్యాలను త్రోసిపుచ్చాడు.

పాపం! ఖలీఫాగారి కేసు వీగిపోయింది. అయితే ఈ వ్యవహారం, న్యాయవైఖరి చూసిన ఆ యూదుడు ముందుకు వచ్చి బిగ్గరగా ఇలా అన్నాడు: "నేను అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ (స) ఆ దేవుని ప్రవక్త అని సాక్ష్యమిస్తున్నాను. ఏ ధర్మంలో ఇలాంటి న్యాయం ఉందో అదే సత్యధర్మం."

(సైయూతి-ఖిలాఫత్ ఓములూకియత్)

"ఆ దేవుడే ఆకాశాన్ని, త్రాసుని కూడా సృష్టించాడు. కనుక మీరు త్రాసు సమతూకం చెడగొట్టకండి." (దివ్యఖుర్ఆన్-55:7)

# 63. న్యాయవ్యవస్థ ప్రాతిపదికలు

నీతినిజాయితీలు గోతిలోపడి శరవేగంతో అడుగంటి పోతున్న నేటి కాలంలో ‘నేరస్థులకు కఠినశిక్షలు విధించాల’ని ఎవరైనా అంటే “దారుణం! ఘోరం!! నేరస్థుడ్ని సంస్కరించాలేగాని, మరీఅంత కఠినశిక్ష విధిస్తారా? ఇది మానవహక్కుల ఉల్లంఘన కాదా??” అంటారు మానవీయ విలువల ధ్వజవాహకులనబడే మన అప్రాచ్య మేధావులు. ఇక ఇస్లాం శిక్షాస్మృతిని ప్రస్తావిస్తే చాలు “మతోన్మాదులు మధ్యయుగాల శిక్షల్ని గురించి చెబుతున్నారు చూడండి” అని గోలచేస్తూ తమ అక్కసు వెళ్ళబుచ్చుకుంటారు.

## న్యాయ దృక్పథం

“ముహమ్మద్! దేవుడు నీకు చూపినమార్గం అనుసరించి నీవు ప్రజల వ్యవహారాలు పరిష్కరించడానికి మేము సత్యపూరితమైన గ్రంథం నీపై అవతరింపజేశాం. కనుక నీవు నీతిలేని వారివైపు నిలబడి వాదించకు.” (ఖుర్ఆన్.4:105,106)

“ప్రపంచజీవితంలో మీరు వారిపక్షాన వాదించగలరు కాని ప్రళయదినాన వారిపక్షాన దేవుని ముందు ఎవరు వాదిస్తారు? అసలక్కడ వారిని కాపాడే నాథుడెవరు?” (4:109)

“ఎవరైనా ఏదైనా నేరం చేసి దాన్ని ఏపాపం ఎరగని అమాయకునిపై మోపితే, ఇక అతను ఘోరమైన అపనిందను, స్పష్టమైన పాపాన్ని మూటకట్టుకున్నట్లే.” ((4:112)

“నీ ప్రభువు సాక్షి! వారు తమ వివాదాల పరిష్కారం కోసం నిన్ను న్యాయనిర్ణేతగా అంగీకరించి, వాటిపై నీవిచ్చే తీర్పుపట్ల ఏమాత్రం తటపటాయించకుండా ఆసాంతం స్వీకరించనంత వరకూ వారు నిజమైన విశ్వాసులు కాలేరు.” (ఖుర్ఆన్-4:65)

“విశ్వాసులారా! న్యాయానికి కట్టుబడి ఉండండి. మీకుగాని, మీ తల్లి దండ్రులకుగాని, మీ బంధువులకుగాని నష్టం వాటిల్లినా సరే దేవుని కోసం నిజమైన సాక్ష్యం ఇవ్వండి. కక్షిదారుడు ధనికుడైనా, పేదవాడైనా వారి విషయంలో మీకంటే దేవుడే ఎక్కువ శ్రేయోభిలాషి. కనుక మీరు మీ మనోవాంఛల్ని అనుసరిస్తూ న్యాయానికి తిలోదకాలివ్వకండి.” (4:135)

“మేమిద్దరం ఒక వ్యాజ్యానికి సంబంధించిన వాది, ప్రతివాదులం. మాలో ఒకడు రెండోవాడిపై అన్యాయానికి పాల్పడ్డాడు. మీరు మాఇద్దర్ని గురించి న్యాయంగా తీర్పు చేయండి. అన్యాయం చేయకండి. మాకు సరైన మార్గం చూపండి. ఇతను నా సోదరుడు. ఇతని దగ్గర తొంభైతొమ్మిది గొర్రెలున్నాయి. నాదగ్గర ఒకే గొర్రె ఉంది. ఆ ఒక్కదాన్ని కూడా తనకివ్వమని అంటున్నాడితను. ఇతను మాటలతో నన్ను లోబరచుకున్నాడు.’ దావూద్ ఇలా చెప్పాడు: ‘ఇతను తన గొర్రెల్లో నీగొర్రెను కూడా కలుపుకుంటాను ఇవ్వమని అడిగి, నిజంగా నీకు చాలాఅన్యాయం చేశాడు. కలసిమెలసి పనిచేసేవాళ్ళు సాధారణంగా ఒకరికొకరు అన్యాయానికి పాల్పడతారు. కాని సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేసేవారు అలా చేయరు. అలాంటి నిజాయితీపరులు బహుకొద్దిమంది మాత్రమే ఉంటారు.” (ఖుర్ఆన్-38:22-24)

దైవప్రవక్త (స) ప్రవచనం: “(న్యాయా)అధికారి తన (జ్ఞాన)పరిధి మేరకు శక్తివంచన లేకుండా కృషి చేసినప్పుడు సరైన తీర్పు వెలువడితే అతనికి రెట్టింపు పుణ్యం లభిస్తుంది. ఒకవేళ తప్పుడు తీర్పు వెలువడితే అప్పుడతనికి ఏకపుణ్యం లభిస్తుంది.” (బుఖారి)



(తొలి శ్రేష్ఠ ఖలీఫా) హజ్రత్ అబూబకర్ (ర) నజస్తాన్‌లో (న్యాయమూర్తి హోదాలో) ఉన్న తన కుమారునికి ఇలా ఉత్తరం రాశారు: “న్యాయాధికారి కోపంగా ఉన్నప్పుడు ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్న వివాదం గురించి తీర్పివ్వడం అతనికి తగదని దైవప్రవక్త (స) ప్రవచిస్తుండగా నేను విన్నాను. కాబట్టి నీవు కోపంగా ఉన్నప్పుడు ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం గురించి ఎన్నటికీ తీర్పివ్వకు.” (బుఖారి, ముస్లిం)

న్యాయాధికారి నేరస్థుడి పట్ల దయతో లేక మెతక వైఖరితో దేవుడు నిర్ణయించిన శిక్షను ఏమాత్రం తగ్గించకూడదు. అలాగే నేరస్థుడి పట్ల కఠిన వైఖరితో దైవనిర్ణీత శిక్షను ఏమాత్రం హెచ్చించడానిక్కూడా వీల్లేదు. దీన్ని గురించి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు:

“ప్రళయదినాన నిర్ణీత శిక్షలో ఒక కొరడాదెబ్బ తగ్గించి శిక్ష విధించిన న్యాయాధికారిని ప్రవేశపెడ్తారు. “ఇలా ఎందుకు చేశావు నీవు?” అని అడుగుతాడు (దేవుడు). దానికి అతను “మీ దాసులపై కనికరంతో ఇలా చేశాను” అనంటాడు. అప్పుడు (దేవుడు) “నీవు వారి విషయంలో నాకంటే ఎక్కువ దయామయుడవైపోయావా?” అంటాడు. తరువాత “ఇతడ్ని తీసికెళ్ళి నరకంలో పడేయండి” అని ఆజ్ఞాపిస్తుంది. అలాగే నిర్ణీత శిక్ష కంటే ఒక కొరడాదెబ్బ ఎక్కువ శిక్ష విధించిన మరొక న్యాయాధికారిని ప్రవేశపెడ్తారు. “నీవు ఇలా ఎందుకు చేశావ?”ని అడుగుతాడు దేవుడు. దానికతను “ప్రజలు నీ అవిధేయతను మానుకుంటారని ఇలా చేశాను” అనంటాడు. దేవుడు ఈమాట విని “వారి విషయంలో నీవు నాకంటే ఎక్కువ తెలివిగలవాడవా?” అనంటాడు. తరువాత “ఇతడ్ని తీసికెళ్ళి నరకంలో పడేయండి” అని ఆజ్ఞాపిస్తుంది. (తఫ్సీరే కబీర్- ఆరోభాగం)

## సాక్ష్యం

“విశ్వాసులారా! దేవుని కోసం నీతి నిజాయితీలకు కట్టుబడిఉంటూ, న్యాయమైన సాక్ష్యం ఇవ్వండి, ఇతరుల పట్ల విరోధం ఉన్నాసరే ” (ఖుర్ఆన్-5:8)

“విశ్వాసులారా! మీలో ఎవరికైనా మరణ సమయం ఆసన్నమైనప్పుడు అతను వీలునామా రాయదలిస్తే, అందుకు మీలో నిజాయితీపరులైన ఇద్దరు వ్యక్తులు సాక్షులుగా ఉండాలి. మీరు ప్రయాణంలో ఉన్నప్పుడు అక్కడ మరణ సమయం ఆసన్నమైతే ముస్లిమేతరుల నుండయినా సరే ఇద్దర్ని సాక్షులుగా పెట్టుకోండి.”

“ఒకవేళ వారి నిజాయితీ పట్ల మీకేదైనా అనుమానంవస్తే, ప్రార్థన తర్వాత వారిద్దరి చేత (మసీదులో) ప్రమాణం చేయించాలి. వారు దేవుని మీద ప్రమాణం చేస్తూ ఇలా పలకాలి: “మేము ఎలాంటి స్వార్థప్రయోజనాల కోసం ఈ సాక్ష్యాన్ని వాడుకోము, మా బంధువులైనా సరే (మేము పక్షపాతం చూపము). దేవుని కోసం చెప్పే సాక్ష్యాన్ని మేము ఎన్నటికీ దాచము. అలా చేస్తే మేము పాపాత్ములలో చేరిపోతాము.” (ఖుర్ఆన్-5:106)

“అయితే అలా ప్రమాణం చేసి కూడా వారు అన్యాయం, పక్షపాతాలకు పాల్పడితే వారిస్థానంలో వారికంటే యోగ్యులైన మరోఇద్దరు సాక్షులుగా ముందుకు రావాలి. ఈ సాక్షులు అన్యాయానికి గురైనవారయి, మృతునికి సన్నిహితులై ఉండాలి. వారు (మసీదులో నిలబడి) దేవుని మీద ప్రమాణం చేసి ‘వారి సాక్ష్యం కంటే మా సాక్ష్యం నిజమైనది; మేము

మా సాక్ష్యంలో ఎలాంటి హద్దుమీరలేదు. అలా చేస్తే మేము దుర్మార్గులలో చేరినవారమవు తాము' అని పలకాలి. ఇలాంటి పద్ధతి వల్ల ప్రజలు సరైన సాక్ష్యమిస్తారని ఆశ ఉంటుంది. లేదా వారు తాము ప్రమాణం చేసిన తర్వాత రెండోవర్గం చేసే ప్రమాణం తమకు వ్యతిరేకంగా ఉంటుందేమోనని భావించయినా భయపడతారు." (ఖుర్ఆన్-5:107,108)

"శీలవతుపై అపనింద మోపి, దానికి నల్గురు సాక్షులు తీసుకురానివారిని ఎనభై కొరడాదెబ్బలు కొట్టండి. అలాంటివారి సాక్ష్యాన్ని ఇక ఎన్నటికీ స్వీకరించకండి." (24:4,5)

"ఇక భార్యలపై అపనింద మోపిన భర్తలు, దానికి తాము తప్ప మరెవరూ సాక్షులు లేనప్పుడు వారిలో ఒకరు నాలుగు సార్లు దేవుని మీద ప్రమాణంచేసి తన ఆరోపణ నిజమే నని సాక్ష్యం చెప్పాలి. అయిదోసారి తన ఆరోపణ అబద్ధమైతే తనపై దేవుని అభిశాపం పడుగాకని పలకాలి. అలాగే స్త్రీ కూడా నాలుగు సార్లు దేవుని మీద ప్రమాణం చేసి అతని ఆరోపణ అబద్ధమని సాక్ష్యమివ్వాలి. ఐదోసారి, అతని ఆరోపణ నిజమైతే తనపై దైవాగ్రహం విరుచుకుపడుగాకని పలకాలి. ఇలా ఆమెకు శిక్ష తప్పుతుంది." (ఖుర్ఆన్-24:6-9)

"వారి గడువు కాలం ముగిసే సమయం ఆసన్నమైనప్పుడు వారిని (వేధించకుండా) మంచిపద్ధతితో ఆపిఉంచండి, లేదా (విడాకులిచ్చి పంపివేయడం తప్పదనుకుంటే) మంచిగా వారి నుండి విడిపోండి. (అప్పుడు) మీలో న్యాయం పాటించే ఇద్దరు వ్యక్తుల్ని సాక్షులుగా పెట్టుకోండి. (వారు) దేవుని కోసం ఉన్నదిఉన్నట్లు సరిగ్గా సాక్ష్యమివ్వాలి." (65:2)

"(అప్పు దస్తావేజులో) మీలో ఇద్దరు పురుషుల్ని సాక్షులుగా పెట్టుకోండి. పురుషులు ఇద్దరు లభించకపోతే ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలయినా చాలు. వారిలో ఒకస్త్రీ మరచిపోతే రెండోస్త్రీ అయినా గుర్తుచేస్తుంది. సాక్షులు మీకు ఆమోదయోగ్యమైనవారుగా ఉండాలి. సాక్ష్యం కోసం పిలిచినప్పుడు సాక్షులు నిరాకరించకూడదు..... మీరు వ్యాపార ఒప్పందాలు చేసుకునేటప్పుడు (కూడా) సాక్ష్యం పెట్టుకోండి." (ఖుర్ఆన్-2:282)

ఇమామ్ అబూయూసుఫ్, ఇమామ్ ముహమ్మద్ అబద్ధపు సాక్ష్యం గురించి ఒక ధార్మికతీర్పు ఇస్తూ "న్యాయస్థానంలో అసత్యసాక్ష్యమని రుజువయితే సంబంధిత వ్యక్తికి సుదీర్ఘ జైలుశిక్ష విధించాలి; అతను అబద్ధీకుడని ప్రచారం చేయాలి" అన్నారు.

ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) కాలంలో ఒకతను ఇచ్చిన సాక్ష్యం అబద్ధమని న్యాయస్థానంలో రుజువయింది. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ఆ వ్యక్తిని ఒక రోజల్లా బహిరంగ ప్రదేశంలో నిలబెట్టి, ఫలానామనిషి కొడుకు ఫలానావ్యక్తి అసత్యసాక్షి. ఇతడ్ని గుర్తుపెట్టుకోండి అని చాటింపు వేయించారు. ఆ తర్వాత అతడ్ని జైల్లో పెట్టారు.

## 64. హత్యానేరం

"కీడుకు ప్రతీకారం అలాంటి కీడే. ఐతే ఎవరైనా ప్రతీకారం చేయకుండా ప్రత్యర్థిని క్షమించి పరిస్థితి చక్కబరిస్తే అతనికి (దాని) ప్రతిఫలమిచ్చే బాధ్యత దేవునిపై ఉంది. దేవుడు దౌర్జన్యపరుల్ని ప్రేమించడు. దౌర్జన్యం జరిగిన తర్వాత (హద్దుమీరకుండా) బదులు తీర్చుకుంటే తప్పులేదు. ఇతరులపై దౌర్జన్యం చేస్తూ దేశంలో అన్యాయంగా కల్లోలం రేపే వారినే మాత్రమే తప్పుపట్టాలి. అలాంటివారికి దుర్భరశిక్ష ఉంది." (ఖుర్ఆన్-42:40-42)



### హత్య-రక్తపరిహారం

ఈనాటి నాగరిక ప్రపంచం హత్యానేరాన్ని కూడా పెద్ద సీరియస్‌గా తీసుకోవడం లేదు. మరణశిక్ష విధించి మనిషికి జీవించేహక్కు లేకుండాచేయడం మానవత్వం కాదట! అంచేత ఇప్పుడు యావజ్జీవ జైలుశిక్ష అని చెప్పి 14 ఏళ్ళశిక్ష మాత్రమే విధిస్తున్నాయి మన కోర్టులు. 14 ఏళ్ళ తర్వాత ఆ నేరస్థుడు విడుదలై వచ్చి ప్రతీకారంతో ఉడికిపోతూ మరో అయిదారుగురిని హత్యచేసినా చేయవచ్చు. ఒక నేరస్థుడి జీవించే హక్కు కోసం అయిదారుగురు అమాయకుల ప్రాణాలు బలికావడమే సరైన న్యాయమా?

"ఎవరైనా ప్రతీకార హత్య(శిక్ష)గా లేక ధరణిపై కల్లోలం రేకెత్తించినందుకు శిక్షగా తప్ప ఏ మనిషినైనా చంపితే అతను యావత్ మానవాళిని చంపినట్లే. అలాగే ఎవరైనా ఒక మనిషి ప్రాణం కాపాడితే అతను యావత్ మానవాళిని కాపాడినట్లే." (ఖుర్ఆన్-5:32)

"న్యాయసమ్మతంగా తప్ప దేవుడు నిషేధించిన ఏ ప్రాణినీ చంపకండి. ఎవరైనా అన్యాయంగా చంపబడితే అతని వారసులకు మేము బదులుతీర్చుకునే అధికారమిచ్చాం. అయితే వారసుడు (హంతకుడ్ని) వధించడంలో హద్దుమీరకూడదు." (ఖుర్ఆన్-17:33)

"విశ్వాసులారా! మీకోసం హత్య వ్యవహారంలో రక్తపరిహారానికి సంబంధించిన ఆజ్ఞ జారీచేశాం. స్వేచ్ఛాపరునికి బదులు స్వేచ్ఛాపరుడ్ని, బానిసకు బదులు బానిసను, స్త్రీకి బదులు స్త్రీని హతమార్చాలి. ఒకవేళ హంతకుని పట్ల అతని సోదరుడు (హతుని బంధువు) మృదువైఖరి అవలంబించడానికి సిద్ధపడితే, రక్తపరిహార సమస్య సామరస్యంగా పరిష్కారమవ్వాలి. దానిప్రకారం హంతకుడు నిర్ణీత రక్తపరిహారాన్ని సంతోషంగా ఇచ్చేయాలి. ఇది మీప్రభువు నుండి లభిస్తున్న సౌలభ్యం, దైవానుగ్రహం. ఆపై కూడా ఎవరైనా హద్దుమీరితే అతనికి దుర్భరశిక్ష పడుతుంది. కనుక బుద్ధిమంతులారా! (ఇలాంటి) ప్రతిక్రియలోనే మానవజీవితానికి భద్రత ఉందని తెలుసుకోండి. తద్వారా మాత్రమే మీరు హత్యారక్తపాతాలకు దూరంగా ఉండగలుగుతారు." (ఖుర్ఆన్-2:178,179)

"పొరపాటున తప్ప తోటివిశ్వాసిని చంపడం ఏ విశ్వాసికీ శోభించదు. పొరపాటున చంపడం జరిగితే అందుకు ఒక బానిసముస్లింకు స్వేచ్ఛనిచ్చి హతుని వారసులకు రక్త పరిహారం చెల్లించాలి. ఒకవేళ వారు క్షమిస్తే అది వేరేవిషయం. అయితే హతుడు మీ శత్రు వర్గానికి చెందినవాడై, విశ్వాసి కూడా అయివుంటే, ఒక ముస్లిం బానిసకు స్వేచ్ఛనిస్తే చాలు. హతుడు మీరు శాంతిఒప్పందం చేసుకున్నజాతికి చెందినవాడైతే, మీరు హతుని వారసులకు రక్తపరిహారంతోపాటు ఒక బానిసముస్లింకు సేచ్ఛనివ్వాలి. స్వేచ్ఛ నివ్వడానికి బానిస లేకపోతే హంతకుడు వరుసగా రెండునెలలు ఉపవాసం పాటించాలి...." (ఖుర్ఆన్-4:92)

దైవప్రవక్త (స) హితోక్తి: "అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ దేవుని సందేశహరుడని సాక్ష్యమిచ్చిన ఏముస్లింనీ చంపడం ధర్మసమ్మతంకాదు. కాని మూడు కారణాల్లో ఒక కారణంపై చంపవచ్చు. 1) (ఎవరినైనా హత్యచేస్తే) ప్రాణానికి బదులు ప్రాణంతీసే చట్టం అమలుపరచబడుతుంది. 2) వివాహితుడైవుండి కూడా వ్యభిచారం చేసినప్పుడు. 3) ఇస్లాం వదలి ముస్లింసమాజం నుండి వేరైనప్పుడు." (బుఖారి, ముస్లిం)

హుజైల్ తెగకు చెందిన ఇద్దరు స్త్రీలు పరస్పరం పోట్లాడుకున్నారు. వారిద్దరిలో ఒకామె (గర్భవతి అయిన) రెండో స్త్రీ పైకి ఒక రాయి విసిరి కొట్టింది. అది కాస్తా ఆమె కడుపుకు తగిలి కడుపులోని పిల్లవాడు చచ్చిపోయాడు. ఈ వ్యవహారం దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చినప్పుడు ఆయన దానిపై తీర్పిస్తూ "మగపిల్లవాడైనా, ఆడపిల్లయినా ఈ శిశువుకు సంబంధించి రక్తపరిహారంగా ఒక బానిసను గాని లేదా బానిసరాలిని గాని (హంతకురాలి తరపున) ఇచ్చుకోవాలి" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

**దొమ్మీ కేసు**:- ఒకవేళ కొందరు వ్యక్తులు కలసి ఒక వ్యక్తిని చంపితే హంతకులందరికీ మరణశిక్ష విధించాలి. ఇమామ్ అబూహనీఫా, ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయి (రహ్మాలై)ల అభిప్రాయం ఇదే. ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) దృక్పథం కూడా ఇదే. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మాలై) మాత్రం 'ఒక వ్యక్తిని అనేకమంది కలసి హత్య చేసినప్పుడు వారందరికీ మరణశిక్ష విధించకూడదని అభిప్రాయపడ్డారు.

హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలంలో ఓ స్త్రీ భర్త చనిపోయిన తర్వాత మరొకడ్ని వివాహమాడింది. ఆమెకు మొదటి భర్త వల్ల కలిగిన ఓ కొడుకు ఉన్నాడు. రెండవ భర్త ఆమెతో "ఈ అబ్బాయి మనకు అడ్డంకిగా ఉన్నాడు. ఇతడ్ని చంపేద్దాం" అన్నాడు. దానికి ఆ స్త్రీ మొదట్లో ఒప్పుకోకపోయినా తరువాత అతని మాయాజాలంలో పడి ఒప్పుకుంది. ఈవిధంగా అతను కొందరు కిరాయి మనుషుల చేత ఆ బాలుడ్ని చంపివేయించాడు. ఈ కేసు అప్పటి యమన్ రాష్ట్ర గవర్నరయిన హజ్రత్ అలి (రజి) ముందుకు వచ్చింది. ఆయన విషయం ఖలీఫా ఉమర్ (రజి)కు తెలియజేసి పరిష్కారం అడిగారు. ఖలీఫా ఉమర్ (రజి) హంతకులందరికీ మరణశిక్ష విధించాలని ఆజ్ఞాపిస్తూ "ఒకవేళ యమన్ రాజధాని 'సనా' పట్నంలోని ప్రజలంతా కలసి ఆ హత్యలో పాల్గొనివుంటే నేను వారందరికీ మరణశిక్ష విధించి చంపివేయిస్తాను" అని అన్నారు.

### తిరుగుబాటు-అరాచకాలు

"దేవునికి ఆయనప్రవక్తకు వ్యతిరేకంగా పోరాడేవారికి, ధరణిలో కలహాలు రేకెత్తిస్తూ తిరిగేవారికి శిక్షగా వారిని హతమార్చాలి; లేదా ఉరికంబం ఎక్కించాలి; లేదా ఒక చేయి, దానికి అభిముఖంగా వున్న ఒక కాలు నరికివేయాలి; లేదా దేశబహిష్కరణ చేయాలి. ఇవి ఇహలోకంలో వారికిలభించే అవమానం, అప్రతిష్ఠలు. పరలోకంలో ఇంత కంటే ఘోరమైన శిక్ష ఉంటుంది. అయితే మీస్వాధీనంలోకి రాకముందే వారు తాము చేసిన నిర్వాకానికి పశ్చాత్తాపంచెంది తమ నడవడికను సరిదిద్దుకుంటే (ఇకవారి జోలికి పోకూడదు.) దేవుడు క్షమించేవాడని, కరుణించేవాడని తెలుసుకోండి." (ఖుర్ఆన్-5:33,34)

"ప్రజలు నిన్ను పవిత్ర మాసాలలో యుద్ధం చేయడం గురించి అడుగుతున్నారు. వారికిలా చెప్పు: "ఆ మాసాలలో యుద్ధం చేయడం ఘోరమైన విషయం. అయితే దైవ మార్గంలో అవరోధాలు సృష్టించడం, దేవుడు పంపినసందేశాన్ని నిరాకరించడం, దైవభక్తుల్ని ప్రతిష్ఠాలయంలో ప్రవేశించనీయకుండా నిరోధించడం, అక్కడ ఉండే వారిని బయటికి గెంటివేయడం- ఇవి దేవునిదృష్టిలో అంతకన్నా ఘోరమైన చర్యలు. హింసా పీడనలు హత్యా రక్తపాతాల కన్నా చాలా ఘోరమైనవి." (ఖుర్ఆన్-2:217)



"విశ్వాసులారా! అరాచకం పూర్తిగా సమసిపోయి సర్వత్రా దైవధర్మం నెలకొనేదాకా అవిశ్వాసులతో పోరాడండి. వారు తమవైఖరి మార్చుకుంటే (ఇక వారి జోలికి పోకండి.) వారి వ్యవహారం దేవుడే చూసుకుంటాడు. మార్చుకోకపోతే మీ సంరక్షకుడు దేవుడేనని తెలుసుకోండి. ఆయన అందరికంటే మంచి సంరక్షకుడు, సహాయకుడు." (8:39,40)

"వారు తమ నోటితో దేవునిజ్యోతి (సత్యధర్మం) ఆర్పి వేయగోరుతున్నారు. కాని సత్య తిరస్కారులకు ఎంత వెగటు కలిగినా దేవుడు తన జ్యోతిని నేల నాలుగుచెరగులా ప్రసరింప జేయనిదే వదలిపెట్టడు." (ఖుర్ఆన్-9:32,33)

## 65. మతభ్రష్టత్వం శిక్ష

ఇస్లాంను అప్రతిష్ఠ పాల్జేయడానికి కొందరు మతదురభిమానులు ఇస్లాం ముసుగుతో ముస్లిం సమాజంలో దూరి లేనిపోని అపార్థాలు సృష్టిస్తారు. పైగా ఈ సంఘవిద్రోహ శక్తులు ముస్లిమేతరుల్లో ఇస్లాం పట్ల, ముస్లింల పట్ల శత్రుభావం కలిగించి కల్లోలం కూడా సృష్టిస్తారు. అందువల్ల ఇస్లాం ఇలాంటి కపటులు, కలహకారుల కోసం కూడా మరణదండనగా మతభ్రష్టత శిక్ష ప్రతిపాదించింది.

"మీలో ఎవరైనా ఈ ధర్మాన్ని వదలి అవిశ్వాసిగా మారి, చివరికి అదేస్థితిలో చనిపోతే అతని ఇహపర కర్మలన్నీ వ్యర్థమైపోతాయి. ఇలాంటి ఉభయభ్రష్టులే నరకవాసులు. నరకంలోనే వారు ఎల్లకాలం పడివుంటారు." (ఖుర్ఆన్-2:217)

దైవప్రవక్త (స) పై సూక్తిని దృష్టిలో పెట్టుకొని "తన ధర్మాన్ని మార్చుకున్నవాడ్ని హతమార్చండ"ని ఆదేశించారు ఒక హదీస్‌లో. ఆయన యమన్‌లో ఒక మతభ్రష్టుడికి మరణదండన శిక్ష విధించి దాన్ని అమలు చేయించడం కూడా జరిగింది. మతభ్రష్టుడి మరణశిక్ష విషయమై ధర్మవేత్తల్లో ఏకాభిప్రాయం ఉంది. అయితే అలాంటి మనిషికి నచ్చజెబుతూ పునరాలోచన కోసం మూడు రోజులు వ్యవధి ఇవ్వవలసి ఉంటుంది. అప్పటికీ అతను దారికి రాకపోతే మరణశిక్ష పడుతుంది.

ఈ విషయంలో ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) అభిప్రాయం ప్రకారం స్త్రీలకు మినహాయింపు ఉంది. కాని ఇతర ఇమాముల అభిప్రాయం ప్రకారం మతభ్రష్టులయిన స్త్రీలకు కూడా మరణశిక్ష విధించాలి.

## 66. దొంగతనం

ఇక దొంగతనం నేరాలకు ఈనాడు విధించే శిక్షల్ని గురించి చెప్పనక్కర లేదు. కొన్నాళ్ళు లేదా కొన్ని నెలల సాధారణ జైలుశిక్ష మాత్రమే విధిస్తున్నారు. ఫలితంగా నేడు దొంగలు బాగా బరితెగించి లక్షలు, కోట్ల ఆస్తులు దొంగిలించడానికి పాల్పడుతున్నారు. బంగారుగాజుల కోసం చేతులు నరకడానికి, అడ్డుకున్నవారిని హతమార్చడానికి సైతం వెనుకాడటం లేదు. ఇస్లామీయరాజ్యంలో ఖుర్ఆన్ విధించే శిక్ష చూడండి:

"స్త్రీ ఐనా, పురుషుడైనా దొంగతనంచేస్తే ఇద్దరికీ చెయ్యి నరికివేయండి. ఇది వారు సంపాదించుకున్నదానికి ప్రతిఫలం. దేవుని తరఫున కనువిప్పు కల్గించే శిక్ష." (5:38)

దొంగకు శిక్షగా ఒక చేయి మాత్రమే నరకవలసిఉంటుంది. ఇస్లామీయరాజ్యంలో సర్వత్రా "ఆర్థికన్యాయం" నెలకొన్న తరువాతనే హస్తఖండన శిక్షలు అమలు జరపాలి. అయితే (యుద్ధంలోవాడే) ఒక డాలు విలువకులోపు వస్తువుని దొంగిలిస్తే చేతిని నరక కూడదని దైవప్రవక్త (స) అన్నారు. అలాగే పండ్లు, కూరగాయలు, ఆహారవస్తువుల్ని (పరిమిత స్థాయిలో) దొంగిలించినా హస్తఖండన శిక్ష ఉండదని చెప్పారు. ఇమామ్ అబూహనీఫా (రహ్మ) ప్రకారం పండ్లు, కూరగాయలు, మాంసం, వండిన ఆహారం, నూర్పిడికాని ధాన్యం, ఆటవస్తువులు, వాయిద్యపరికరాలు వగైరా విషయంలో హస్త ఖండన శిక్ష లేదు. అయితే వీటికి తేలికపాటి శిక్షలు ఉంటాయి.

మదీనాలో బషీర్ అనేవాడు ఒకతని యుద్ధకవచం దొంగిలించాడు. అధికారులు ఆరాతీయడానికి ప్రయత్నించినప్పుడు బషీర్ ఆ దొంగసొత్తును ఒక యూదుని ఇంట్లో దాచిపెట్టాడు. కవచం యజమాని బషీర్ మీద అనుమానం వెలిబుచ్చాడు. దైవప్రవక్త (స) విచారిస్తే బషీర్, అతని బంధువులు కూడబలుక్కొని దొంగతనాన్ని ఆ యూదుని పైకి నెట్టివేశారు. యూదుడ్ని విచారిస్తే తానేపాపం ఎరగనని అన్నాడు.

అయితే బషీర్ బంధువులంతా బషీర్ వైపున వకాల్తా పుచ్చుకొని ఆ యూదుడు దైవప్రవక్త (స)ను నిరాకరించిన అవిశ్వాసి అయినందున అతని మాటలు నమ్మకూడ దని, తాము చెబుతున్నదే నిజమని గట్టిగా వాదించారు. ఈ వాదన విన్న దైవప్రవక్త (స) బషీర్‌కు అనుకూలంగా తీర్పివ్వడానికి సిద్ధమయ్యారు. సరిగ్గా ఆ సమయంలో ఈ సూక్తులు (4:105-113) అవతరించాయి. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆ ముస్లింకు వ్యతిరేకంగా, యూదునికి అనుకూలంగా తీర్పిచ్చారు.

కోర్టుకు కళ్ళుండవన్న సంగతి అందరికీ తెలిసిందే. న్యాయాధికారి వ్యవహార పరి ష్కారంలో ఎంత సమర్థుడైనప్పటికీ తన ముందుకు వచ్చిన సాక్ష్యాలు, వాదనలను బట్టే తీర్పివ్వగలడు. మతం ముసుగు కప్పుకున్న దుర్మార్గులను గుర్తించడం చాలా కష్టమైన పని. అందువల్ల ఇస్లామీయ పాలనలోనూ ఒక్కోసారి అమాయకులైన ముస్లిమేతరులు సైతం శిక్షకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. అలాంటి స్థితిలో దైవప్రవక్త (స) ముస్లి మేతరుల పట్ల అన్యాయానికి పాల్పడే ముస్లింలను హెచ్చరిస్తూ ఇలా అన్నారు:

"ఎవరైనా ఒక ముస్లిం ఒడంబడికదారుడైన ముస్లిమేతర పౌరునిపై దౌర్జన్యం చేసినా, అతనిహక్కు కాజేసినా, అతనిశక్తికి మించిన భారం వేసినా, లేదా అతని వస్తువే దైనా బలవంతంగా తీసుకున్నా ప్రళయదినాన దైవన్యాయస్థానంలో జరిగే విచారణలో నేనా ముస్లిమేతరుని తరపున న్యాయవాదిగా నిలబడతాను." (అబూదావూద్)

## 67. మద్యం, మత్తుపదార్థాలు

ఇస్లాం మద్యం, మత్తుపదార్థాలను పూర్తిగా నిషేధించింది. అంటే దాన్ని తాగడం లేక తినడం, అమ్మడం, కొనడం, ఈ వ్యవహారాల్లో సహకరించడం మొదలైన పనులన్నీ నిషేధించబడ్డాయి. అంతేకాదు, వాటిని శిక్షార్హమైన నేరాలుగా పరిగణించింది.



"విశ్వాసులారా! మద్యం, జూదం, దైవేతరాలయాలు, పాచికల జోస్యం- ఇవన్నీ అసహ్యకరమైన పైశాచిక విషయాలు. వాటికి దూరంగా ఉండండి, మీ జీవితం సార్థక మవుతుంది. మద్యం, జూదాల ద్వారా షైతాన్ మీమధ్య విరోధం, విద్వేషబీజాలు నాటి మిమ్మల్ని దైవధ్యానం, ప్రార్థనల నుండి నిరోధించగోరుతున్నాడు. కనుక ఇకనైనా మీరు వాటిని మానుకోండి. దైవాజ్ఞలను, ఆయన ప్రవక్త హితవుల్ని పాటించండి. వాటిని పాటించకుండా ముఖం తిప్పుకుంటే మాత్రం (మీకే నష్టం), ఆదేశాన్ని యథాతథంగా అందజేయడమే మా ప్రవక్త బాధ్యత." (ఖుర్ఆన్-5:90-92)

కొందరు మద్యం గురించి దైవప్రవక్త (స) ముందు ప్రస్తావిస్తూ "దీన్ని యూదులకు కానుకగా ఇవ్వచ్చా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "మద్యాన్ని నిషేధించిన వాడు (దేవుడు) దాన్ని ఇతరులకు కానుకగా ఇవ్వడాన్ని కూడా నిషేధించాడు" అన్నారు. మరొకతను దీన్ని మందుగా వాడుకోవడానికి అనుమతివ్వమని అడిగాడు. దైవప్రవక్త (స) అనుమతి నిరాకరిస్తూ "అది మందు కాదు, వ్యాధి" అన్నారు.

వేరొకతను వచ్చి "దైవప్రవక్తా! మేము తీవ్రమయిన చలి ఉండే ప్రాంతంలో ఉంటున్నాం. కాయకష్టం కూడా ఎక్కువగా చేయవలసి వస్తుంది. మద్యం వల్ల మాకు కాస్త సేద తీరుతుంది. చలికి తట్టుకునే శక్తి కూడా వస్తుంది" అన్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "మీరు తాగే ఆ పానీయం వల్ల మత్తు కలుగుతుందా?" అని అడిగారు. దానికావ్యక్తి "కలుగుతుంది" అన్నాడు. "అయితే దాన్ని మానుకోవాల్సిందే" అన్నారు దైవప్రవక్త (స). "కాని మాప్రాంతం జనం ఒప్పుకోరే ఎలా?"అన్నాడా వ్యక్తి. "ఒప్పుకోకపోతే వారితో యుద్ధం చేయండి" అన్నారు దైవప్రవక్త (స). (మిష్కాత్)

చెప్పు: "అత్యధికసంఖ్యలో ఉండే అపరిశుద్ధవస్తువులు మిమ్మల్ని ఎంతగా ఆకట్టు కున్నా (అవి పరిశుద్ధవస్తువులు కాజాలవు) పరిశుద్ధం, అపరిశుద్ధం ఎన్నటికీ ఒకటి కాజాలవు. కనుక బుద్ధిమంతులారా! (ప్రతి వ్యవహారంలోనూ) దేవునికి భయపడుతూ మసలుకోండి, మీ జీవితం సార్థకమవుతుంది." (ఖుర్ఆన్-5:100)

హజ్రత్ అనస్ (రజి) కథనం: "సారాయి తాగిన నేరస్థులకు దైవప్రవక్త (స) చెప్పు లతో, బెత్తాలతో కొట్టించి శిక్షించేవారు. మొదటి ఖలీఫా హజ్రత్ అబూబకర్ (రజి) ఇలాంటి నేరస్థులకు నలభై కొరడా దెబ్బల శిక్ష విధించేవారు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: మద్యం తాగిన ఒకతడ్ని తన దగ్గరికి తీసు కొచ్చినప్పుడు దైవప్రవక్త (స) "ఇతణ్ణి వాయించండి" అన్నారు. ఆయన అలా అనగానే మాలో కొందరు చేతులతో, కొందరు చెప్పులతో, కొందరైతే బట్టలతో అతణ్ణి (ఎడాపెడా) కొట్టారు. అతను వెళ్ళిపోయాక కొందరు, "దేవుడు నిన్ను అవమానించుగాక!" అని అతనికి శాపనార్థాలు పెట్టసాగారు. దైవప్రవక్త (స) ఆ మాట విని "అలా అనకండి. అతనికి వ్యతిరేకంగా షైతానుకు సహాయపడకండి" అని అన్నారు. (బుఖారీ)

దైవప్రవక్త (స) కాలంలో సారా తాగినవాడికి శిక్షగా గరిష్ఠస్థాయిలో నలభై కొరడా దెబ్బలు కొట్టడం జరిగేది. అబూబకర్ (రజి) పాలనా కాలంలో నలభై కొరడాదెబ్బల శిక్షే

ఉండేది. ఉమర్ (రజి) పాలనాకాలం తొలిరోజుల్లో కూడా నరభై దెబ్బల శిక్షే ఉండేది. కాని దానివల్ల సారాయి త్రాగేవారు తమ అలవాటు మానుకోలేక పోయారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ఇతర నాయకులతో సంప్రదించి ఈశిక్షను ఎనభై కొరడాదెబ్బలకు పెంచారు. ఇమామ్ మాలిక్, ఇమామ్ అబూహనీఫా (రహ్మలై)లు ఎనభై కొరడాదెబ్బల శిక్షనే నిర్ణయించారు. హజ్రత్ ఉమర్ (రజి) పాలనలో రూయషిద్ అనే వ్యక్తి రహస్యంగా సారాయి అమ్ముతున్న కారణంగా అతని దుకాణాన్ని కాల్చివేయడం జరిగింది.

హజ్రత్ అలి బిన్ అబూతాలిబ్ (రజి) ఇలా అన్నారు: "నేనొకవేళ ఎవరికైనా శిక్ష అమలుపరచినప్పుడు అతను చనిపోతే ఒక్క తాగుబోతు విషయంలో తప్ప నాకెలాంటి విచారంలేదు. శిక్షవల్ల తాగుబోతు చనిపోతే నేనందుకు రక్తపరిహారం ఇప్పిస్తాను. ఎందు కంటే ఈ నేరానికి దైవప్రవక్త (స) ఎలాంటి నిర్ణీత శిక్ష నిర్ధారించలేదు." (బుఖారి)

# 68. అశ్లీలం మీద ఆంక్షలు

ఇస్లాం అశ్లీలం, అత్యాచారాల్ని పూర్తిగా తుడిచిపెట్టి పవిత్ర సమాజాన్ని నిర్మించ గోరుతోంది. అత్యాచారాలు, అక్రమసంబంధాల వల్ల సమాజానికి మూలస్తంభమైన కుటుంబవ్యవస్థ కుంటుపడుతుంది. హత్యలు పెరిగి ప్రజలకు మనశ్శాంతి కరువై పోతుంది. కనుక ఇస్లాం ఇలాంటి చెడులకు కారణమయ్యే అశ్లీల విషయాలన్నిటినీ మొగ్గలోనే త్రుంచివేయదలచింది. అప్పటికీ ఎవరైనా వ్యభిచారానికి పాల్పడితే చట్టం ద్వారా కఠిన శిక్షలు విధిస్తుంది.ఇస్లాం మొట్టమొదట స్త్రీ పురుషుల స్వేచ్ఛాయుత కలియకను నిషేధిస్తుంది. వారి శారీరక, మానసిక వ్యత్యాసాల కారణంగా వారి కార్యా చరణ పరిధులు సాధారణ పరిస్థితులలో వేర్వేరుగా ఉండాలని నిర్దేశించింది.

కనుక ఇస్లాం ఇంటిబాధ్యతల్ని స్త్రీకి, బయటి బాధ్యతల్ని పురుషునికి అప్పగించింది. ఈ పరిధి అతిక్రమించి స్త్రీ బయటికెళ్ళి పురుషుడు చేసే పనుల్లో జోక్యం చేసుకుంటే కుటుంబం పతనమై, సామాజిక సంక్షోభం ఏర్పడుతుంది. నేడు పాశ్చాత్యదేశాల్లో జరుగు తున్నది ఇదే. "ఆడది తిరిగి చెడిపోయింది, మగాడు తిరగక చెడిపోయాడు" అనే సామెత మనకు తెలిసిందే. అందుకే ఇస్లాం పరదావ్యవస్థలోని తొలిసూత్రం ఇలా పేర్కొన్నది:

"మీరు మీఇండ్లలోనే ఆగి ఉండండి. పూర్వం మూఢకాలంనాటి స్త్రీలు తిరిగినట్లు సింగారం చూపుకుంటూ తిరగకండి." (ఖుర్ఆన్-33:33)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "స్త్రీ భద్రంగా దాచబడవలసిన సృష్టితం. ఆమె ఇంటి నుంచి ఎక్కడికైనా బయలుదేరినప్పుడు షైతాన్ ఆమె వైపు తొంగిచూస్తాడు."

స్త్రీ ఇంటి నుంచి బయటికి వెళ్ళవలసి వచ్చినప్పుడు పరపురుషుల వీక్షణల నుంచి తప్పించుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ జాగ్రత్తలలో మొట్టమొదటి జాగ్రత్త పూర్తిస్థాయి పరదా వస్తుంది. విశ్వప్రభువు స్పష్టంగా ఇలా ఆదేశిస్తున్నాడు:

"ప్రవక్తా! నీ భార్యలకు, కుమార్తెలకు, (ఇతర) ముస్లిం మహిళలకు వారు తమ పైటలను తమ (ముఖాల)పై కప్పుకోవాలని చెప్పు. ఇదే సరయిన పద్ధతి. దీనివల్ల వారిని



ఎవరైనా (పోకిరి పురుషులు) గుర్తించి వేధిస్తారనే భయముండదు." (ఖుర్ఆన్-33:59)

"విశ్వాసులారా! షైతాన్ అడుగుజాడల్లో నడవకండి. వాడు తనను అనుసరించే వారికి (ఎల్లప్పుడూ) చెడు, అశ్లీలతలను గురించే దుర్బోధ చేస్తాడు." (ఖుర్ఆన్-24:21)

"ప్రవక్తా! విశ్వసించిన పురుషులు తమ చూపులు (పరస్త్రీలపై పడకుండా వేరే వైపు) మరల్చుకోవాలని, తమ మర్మావయవాలను కాపాడుకోవాలని వారికి చెప్పు. వారికి ఇది చాలా శ్రేష్ఠమైన పద్ధతి. వారు చేసే పనులన్నీ దేవుడు గమనిస్తూనే ఉంటాడు. (అలాగే) విశ్వసించిన స్త్రీలు తమ చూపులు మరల్చుకోవాలని, తమ మర్మావయవాలు కాపాడు కోవాలని వారికి చెప్పు. అదీగాక వారు తమ అలంకరణలను బయటికి కనబడనీయ కూడదు. ఒకవేళ వాటంతటవే బయటపడితే తప్పులేదు. వారు తమ వక్షస్థలాలను ఓణీలతో కప్పుకోవాలి." (ఖుర్ఆన్-24:30,31)

స్త్రీలు బయటికెళ్ళేటప్పుడు సువాసన పూసుకోవడం, సువాసన పూలు పెట్టు కోవడం నిషిద్ధం. అలాగే పురుషదుస్తులు స్త్రీలు, స్త్రీదుస్తులు పురుషులు ధరించడం కూడా నిషిద్ధమే. దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఏస్త్రీ అత్తరు పూసుకొని పురుషుల మధ్యగుండా నడచిపోతుందో ఆమె తిరుగుబోతు స్త్రీ వంటిది." (తిర్మిజి)

"స్త్రీలను అనుకరించే స్త్రీవేష పురుషులు, పురుషుల్ని అనుకరించే పురుషవేష స్త్రీలు మనలోనివారు కారు." (ముస్నద్ అహ్మద్); "స్త్రీ దుస్తులు ధరించే పురుషుల్ని, పురుష దుస్తులు ధరించే స్త్రీలను దైవప్రవక్త (స) శపించారు." (అబూదావూద్)

పరపురుషులతో మాట్లాడవలసి వచ్చినప్పుడు నవ్వుతూ, తుళ్ళుతూ ఎన్నడూ మాట్లాడ కూడదు. అలాగే వారితో మెతకగా కూడా మాట్లాడకూడదు.

"ఒకవేళ మీరు ప్రవక్తభార్యల్ని ఏదైనా అడగదలచుకుంటే తెరవెనుక నిలబడి అడగండి. ఇది చిత్తశుద్ధి కోసం మీకూ, వారికీ ఎంతో మంచి పద్ధతి." (ఖుర్ఆన్-33:53)

"మీరు దేవునికి భయపడే వారైతే (పరపురుషులతో) మెతకదనం వ్యక్తమయ్యేలా మెల్లిగా మాట్లాడకండి. ఆంతర్యంలో 'చెడు' ఉన్నవాడ్ని ఈ మెతకదనం పేరాశకు పురిగొల్పే ప్రమాదం ఉంటుంది. అందువల్ల మీరు పరపురుషులతో మాట్లాడ వలసివచ్చినప్పుడు స్పష్టంగా, కరాఖండిగా మాట్లాడండి." (ఖుర్ఆన్-33:32)

# 69. పరువు నష్టం దావా

సాధారణంగా దుర్జనులు సజ్జనుల ప్రగతి విజయాలకు కారణభూతమైన సద్గుణ సంపత్తిని అలవరచుకోవడానికి బదులు, సజ్జనుల్లో కూడా తమ దుర్గుణాలు, దుర్లక్షణా లను వ్యాపింపజేయడానికి ప్రయత్నిస్తారు. అది సాధ్యంకాని పక్షంలో సజ్జనుల సద్గుణ సంపత్తి, నీతినడవడికల్ని ప్రజల్లో సందేహాస్పదం చేయడానికి వారిపై అపనిందలు మోపడా నికి ప్రయత్నిస్తారు. ఇలాంటి దుర్జనులు ముస్లిమేతరుల్లో కూడా ఉంటారు, ముస్లింలలో కూడా ఉంటారు. ముస్లింలలో ఉంటే మరింత ప్రమాదం. అలాంటివారిని గురించి ప్రారంభంలో ఈ క్రింది ఖుర్ఆన్ సూక్తులు అవతరించాయి:

## శీలవతులపై అపనిందలా?

"శీలవతులైన స్త్రీలపై అపనింద మోపి, దానికి నలుగురు సాక్షులు తీసుకురాలేని వారిని ఎనభై కొరడాదెబ్బలు కొట్టండి. అలాంటివారు చెప్పే సాక్ష్యాన్ని ఇక ఎన్నటికీ స్వీకరించకండి. వారసలు దుర్జనులు." (24:4,5)

ఇది కపటవిశ్వాసులు దైవప్రవక్త (స) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి)పై వేసిన అపనిందకు సంబంధించిన విషయం. దైవప్రవక్త (స), ఆయన అనుచరులు బనీ ముస్తలిఖ్ యుద్ధం నుండి మదీనా తిరిగొస్తూ దారిలో ఒకచోట రాత్రివేళ విడిదిచేశారు. తెల్లవారుజామున హజ్రత్ ఆయిషా (రజి) బహిర్భూమికి వెళ్ళారు. అయితే కంఠహారం ఎక్కడో పడిపోవడంతో ఆమె దాన్ని వెతుక్కుంటూ మళ్ళీ వెనక్కిపోయారు. అయితే ఆమె తిరిగొచ్చేలోగా సైన్యం అక్కడ్నుంచి బయలుదేరి వెళ్ళిపోయింది. ఆమె అంబారీలో కూర్చున్నారనుకొని నలుగురు సైనికులు దాన్ని ఎత్తి ఒంటె మీద పెట్టారు. అలా ఖాళీ అంబారీతో సైన్యం వెళ్ళిపోయింది.

హజ్రత్ ఆయిషా (రజి) తాను కన్పించకపోతే వాళ్ళే వెతుక్కుంటూ వస్తార్లే అని తలచి ఆ ప్రదేశంలోనే దుప్పటి కప్పుకొని పడుకున్నారు. కాకతాళీయంగా ఒక సైనికుడు వెనకుండిపోయాడు. అతనామెను చూసి విచారం వెలిబుచ్చుతూ, ఎంతో గౌరవంతో ఆమెకు దగ్గరగా ఒంటెను తెచ్చి కూర్చోబెట్టాడు. ఆమె ఒంటెక్కి కూర్చున్నారు. అతను పగ్గం పట్టుకొని నడిపించుకుంటూ మధ్యాహ్నానికల్లా సైన్యాన్ని చేరుకున్నాడు.

కపటులు ఈదృశ్యం చూసి ఆయిషా (రజి) మీద లేనిపోని దుమారం లేవదీశారు. ఇది ఆనోటా ఈనోటా ప్రాకి మొత్తం సైన్యంలో వ్యాపించింది. దీనిపట్ల దైవప్రవక్త (స), ఆయన అనుచరులు తీవ్రఆందోళన చెందారు. నెలరోజుల దాకా ముస్లింలపై విషాద ఛాయలు అలుముకున్నాయి. తర్వాత ఆమె పవిత్రురాలని దైవవాణి అవతరించింది.

"ఈ నిందారోపణ వినగానే విశ్వాసులైన స్త్రీపురుషులు అనుమానానికి గురి కాకుండా సహృదయంతో ఎందుకు ఉండలేదు? మీరు అప్పటికప్పుడు 'ఇది నిరాధారమైన అపనింద'ని ఎందుకు ఖండించలేదు? వారు (తమ ఆరోపణను నిరూపించుకోవడానికి) నలుగురు సాక్షుల్ని ఎందుకు తీసుకురాలేదు?" (ఖుర్ఆన్-24:12,13)

"మీ మీద ఇహపరలోకాల్లో దేవుని అనుగ్రహం, ఆయన కరుణా కటాక్షాలే గనక లేకపోయివుంటే, మీరు ఏ(నిరాధారమైన) మాటల్లో పడిపోయారో వాటి పర్యవసానంగా మీపై ఘోర విపత్తు వచ్చిపడేది. ఈ అసత్యారోపణ (ఎంతచెడ్డ విషయమో ఆలోచించండి. అది) మీలో ఒకరినుంచి మరొకరికి (కార్చిచ్చులా) వ్యాపిస్తూ పోయింది. వాస్తవం ఏమిటో తెలియనిమాట మీనోట వెలువడింది. మీరు దాన్ని సాధారణ విషయమని భావిస్తుండేవారు. కాని దేవునిదృష్టిలో ఇది చాలా తీవ్రమైన విషయం." (ఖుర్ఆన్-24:14,15)

"ఈసంగతి వినగానే "ఇలాంటిమాటలు అనడం మనకుతగదు. దేవుడు పరిశుద్ధుడు. ఇది పచ్చిఅపనింద" అని మీరెందుకు అనలేదు? మీరు విశ్వాసులైతే ఇకముందు ఎన్నటికీ ఇలాంటి చేష్టలకు పాల్పడకూడదని దేవుడు మీకు ఉపదేశిస్తున్నాడు." (24:16-18)



"విశ్వాసులలో అశ్లీలవిషయాలు వ్యాపించాలని కోరుకునేవారు ఇటు ప్రపంచంలోనూ, అటు పరలోకంలోనూ వ్యధాభరితమైన శిక్షకు అర్హులవుతారు. (సమాజం మీద అశ్లీలం ఎంత దుష్ప్రభావం వేస్తుందో) దేవునికి తెలుసు, మీకు తెలియదు." (ఖురాన్-24:19)

"శీలవతులైన అమాయక ముస్లిం మహిళలపై లేనిపోని అపనిందలు మోపేవారు ఇటు ప్రపంచంలోనూ, అటు పరలోకంలోనూ శాపగ్రస్తులవుతారు. వారికోసం కఠినాతి కఠిన శిక్ష కాచుకొని ఉంది. ఇలా అపనిందలు మోపేవారు తమ నోళ్ళు, కాళ్ళు, చేతులే తమ అకృత్యాల్ని గురించి సాక్ష్యమిచ్చే రోజొకటి వస్తుందని మరచిపోకూడదు." (24:23-25)

## ఖజఫ్ (అపనింద)

24:4,5 సూక్తులలో శీలవతులైన ముస్లిం మహిళలపై ఎవరైనా అపనింద వేస్తే దానికి నలుగురు సాక్ష్యుల్ని తీసుకురావాలని దేవుడు ఆదేశించాడు. ఈ ఆదేశం ముస్లింలలో అనేక ప్రశ్నలను లేవదీసింది. ఒక స్త్రీ దుర్నడతను చూసి పరపురుషుడు సహనం వహించగలుగుతాడు. సాక్షుల్ని తీసుకురాలేనివాడు ఆ ప్రస్తావననే ఎత్తడు. కాని స్వయంగా భార్యే ఆ పాడుపనికి పాల్పడటం కళ్ళారా చూసినప్పుడు భర్త ఏం చెయ్యాలి?

అతను నలుగురు సాక్ష్యుల్ని తీసుకురాలేడు. ఒకవేళ ఆమెను హతమార్చితే హంతకుడిగా శిక్షకు గురికావలసి వస్తుంది. సహిస్తే అమె మరింత బరితెగించవచ్చు. లేదా ఆ పాడుపని ఒకర్నుండి మరొకరికి నిశ్శబ్దంగా ప్రాకి సంఘంలో అతను తలెత్తుకొని తిరగలేని పరిస్థితి వస్తుంది. పోని విడాకులిచ్చి వదలించుకుంటే ఆమె, ఆమె ప్రియుడు ఏశిక్షకు గురికాకుండా యదేచ్ఛంగా తిరుగుతూ సంఘంలో అశ్లీలతను వ్యాపింపజేస్తారు. పైగా ఆమె కనే అక్రమసంతానం భర్త పాలిట గుదిబండయి పోతుంది.

ఈ ప్రశ్నలు మొదట్లో హజ్రత్ సాద్ బిన్ ఉబాదా (రజి) ముందుకు వచ్చాయి. అప్పుడాయన వ్యాఖ్యానిస్తూ "ఒకవేళ ఇలాంటి వ్యవహారం దురదృష్టవశాత్తు నా ఇంట్లో నా కళ్ళ ముందు జరిగితే నేను సాక్ష్యుల కోసం వెతికే పని చేయకుండా అప్పటికప్పుడు ఖడ్గంతో ఈ సమస్యను పరిష్కరిస్తాను" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

ఆ తర్వాత కొన్నాళ్ళకే కొందరు ఇలాంటి వ్యవహారాలు దైవప్రవక్త (స) సన్నిధికి తెచ్చారు. అలాంటివారిలో ఒకతను వచ్చి ఇలా విన్నవించుకున్నాడు: "దైవప్రవక్తా! ఒకవేళ ఎవరైనా తన భార్య పక్కలో పరపురుషుడు ఉండటం చూసినప్పుడు, ఆ సంగతి అతనినోట వెలువడితే మీరతనికి అపనింద శిక్ష విధిస్తారు. ఆమెను చంపేస్తే మీరతనిపై హత్యానేరం మోపి అతడ్ని వధిస్తారు. మిన్నకుండిపోతే లోలోన మండిపోతూ బాధపడతాడు. అలాంటి పరిస్థితిలో అతనేం చేయాలి?" దైవప్రవక్త (స) ఈమాట విని "దేవా! ఈ సమస్యను నీవే పరిష్కరించాలి" అని దైవాన్ని ప్రార్థించారు. (బుఖారి, ముస్లిం)

## లిఆన్ (ప్రమాణం చేయడం)

అయితే ఈసమస్య గురించి దైవాజ్ఞ రాకపూర్వమే హజ్రత్ హిలాల్ బిన్ఉమయ్య (రజి) వచ్చి తాను కళ్ళారాచూసిన తనభార్య నిర్వాకం గురించి దైవప్రవక్త (స) ముందు ఏకరవుపెట్టుకున్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని "సాక్ష్యం తీసుకురా. సాక్ష్యం తీసుకు

రాలేకపోతే నీకు అపనింద శిక్ష విధించడం జరుగుతుంది'' అని అన్నారు. అక్కడే కూర్చున్న ఇతర ముస్లింలు ఈమాట విని తీవ్రఆందోళన వ్యక్తపరిచారు.

హజ్రత్ హిలాల్ (ర) మాత్రం కంగారుపడకుండా ''మిమ్మల్ని ప్రవక్తగా నియమించి పంపిన దేవుని సాక్షిగా చెబుతున్నాను. నేను నాకళ్ళారా చూసి, చెవులారా విన్న సంఘట నను మీదృష్టికి తెస్తున్నాను. నా విషయంలో దేవుడు నావీపును కాపాడే ఆజ్ఞ అవతరింప జేస్తాడని నాకు నమ్మకం ఉంది'' అని అన్నారు. అప్పుడీ సూక్తులు అవతరించాయి:

"ఇక భార్యలపై అపనిందమోపిన భర్తలు, దానికి తాముతప్ప మరెవరూ సాక్షులు లేని పక్షంలో (ఇలా చేయవలసిఉంటుంది:) వారిలో ఒకరు నాలుగుసార్లు దేవుని మీద ప్రమాణంచేసి తన ఆరోపణ నిజమేనని సాక్ష్యం చెప్పాలి. అయిదోసారి తన ఆరోపణ అబద్ధమయితే తనపై దేవుని అభిశాపం పడుగాకని పలకాలి." (ఖుర్ఆన్-24:6,7)

"అలాగే స్త్రీ కూడా నాలుగుసార్లు దేవుని మీద ప్రమాణం చేసి అతని ఆరోపణ అబద్ధమని సాక్ష్యమివ్వాలి. అయిదో సారి, అతని ఆరోపణ నిజమయితే తనపై దైవాగ్రహం విరుచుకుపడుగాకని పలకాలి. ఈవిధంగా ఆమెకు శిక్ష తప్పుతుంది." (ఖుర్ఆన్-24:8,9)

## భర్త ఫిర్యాదు పునఃపరిశీలన

ఈ సూక్తులు అవతరించిన తరువాత దైవప్రవక్త (సల్లం) వాటి ప్రకారం తీర్పు చేయడానికి హజ్రత్ హిలాల్ బిన్ ఉమయ్యి (రజి)ని, ఆయన భార్యను పిలిపించారు. వారిద్దరికి ఈ సూక్తుల్లోని దైవాజ్ఞ విన్పించి "బాగా ఆలోచించుకోండి. ఇహలోక యాతన కంటే పరలోక యాతన చాలా కఠినంగా ఉంటుంది'' అని అన్నారు.

హజ్రత్ హిలాల్ ఈమాట విని "ఈమెపై నేను నిజమయిన నిందనే మోపాను'' అన్నారు. ఆయనభార్య "ఇది పచ్చిఅబద్ధం'' అన్నది. దైవప్రవక్త (స) వారిద్దరి మాటలు విన్నాక "ఇప్పుడు మీరిద్దరూ ప్రమాణం చేయాలి'' అని ఆదేశించారు.

ఈ ఆదేశం వినగానే ముందుగా హజ్రత్ హిలాల్ (రజి) లేచి ఖుర్ఆన్ ఆజ్ఞ ప్రకారం ప్రమాణం చేయడం ప్రారంభించారు. ప్రమాణం సందర్భంలో దైవప్రవక్త (సల్లం) "మీరిద్దరిలో ఒకరు తప్పకుండా అబద్ధీకులని దేవునికి తెలుసు. మరి మీరిద్దరిలో ఎవరైనా చేసిన తప్పుకు పశ్చాత్తాపపడతారా?'' అని మాటిమాటికి అడిగేవారు.

హజ్రత్ హిలాల్ (రజి) అయిదవ సారి ప్రమాణం చేయడానికి ముందు సభికుల్లో కొందరు ఆయనతో "హిలాల్! దైవానికి భయపడు. పరలోక యాతన కంటే ఇహలోక యాతన చాలా తేలిగ్గా ఉంటుంది. అయిదో సారి ప్రమాణం నీకు యాతన తెచ్చి పెడ్తుంది'' అని అన్నారు. దానికాయన సమాధానమిస్తూ "ప్రపంచంలో నా వీపును కాపాడిన దేవుడు పరలోకంలో కూడా నన్ను (నరక)యాతన నుండి కాపాడుతాడు'' అని అన్నారు. ఈమాట చెప్పి ఆయన అయిదో సారి కూడా ప్రమాణం చేశారు.

తరువాత ఆయన భార్య కూడా ప్రమాణం చేయడం ప్రారంభించింది. అయిదో సారి ప్రమాణం చేయడానికి ముందు సభికులు ఆమెతో కూడా "దైవానికి భయపడు. పరలోక యాతన కంటే ప్రపంచయాతన భరించడం తేలిక. ఈ అయిదో సారి ప్రమాణం



నీపై దైవశిక్ష పడటానికి కారణమవుతుంది'' అని అన్నారు. ఈమాట వినగానే ఆస్త్రీ ఓ క్షణం సందిగ్ధంలో పడింది. దాంతో జనం ఇక ఆమె చేసిన తప్పు ఒప్పుకుంటుందని తలచారు. కాని ఆమె తేరుకొని "నేను శాశ్వతంగా నా తెగవాళ్ళను అవమానపరచ లేను'' అన్నది. ఆ తర్వాత ఆమె అయిదో సారి కూడా ప్రమాణం చేసింది.

ఆ తరువాత దైవప్రవక్త (స) వివాహవిచ్ఛేదం చేసి వారిద్దరిని వేరు చేయించారు. అప్పుడాయన ఇలా తీర్పిచ్చారు: "ఈమె (కడుపులోని) పిల్లవాడు తండ్రికొడుకుగా కాకుండా తల్లికొడుకుగా పరిగణించబడతాడు. ఇకనుండి ఈమెపైగాని, ఈమె పిల్లవాడి పైగాని నిందవేయడానికి ఎవరికీ అధికారం లేదు. ఈమెపై లేదా ఈమె కొడుకుపై నిందవేసేవారు ఖజఫ్ (అపనింద) శిక్షకు అర్హులౌతారు. ఈమె తలాఖ్ తీసుకోవడంగాని, వితంతువై పోవడంగాని జరగక ముందే భర్త నుండి వేరుచేయబడుతోంది గనక ఇద్దత్ కాలంలో ఆశ్రయం, పోషణఖర్చులు పొందడానికి ఈమెకు ఎలాంటి హక్కులేదు.''

తీర్పు ముగిసిన పిదప దైవప్రవక్త (స) మాట్లాడుతూ "ఈమె ప్రసవించిన తర్వాత పిల్లవాడి రూపురేఖలు పరిశీలించండి. పిల్లవాడిలో హిలాల్ పోలికలుంటే హిలాల్ కొడుకు అవుతాడు; నిందితుడి పోలికలుంటే అతని కొడుకే అవుతాడు'' అని అన్నారు. కొంతకాలానికి ఆ స్త్రీ ప్రసవించింది. చూస్తే పిల్లవాడిలో నిందితురాలి ప్రియుడి పోలికలే కన్పించాయి. దైవప్రవక్త (స) ఈసంగతి విని "ప్రమాణాల పద్ధతి లేకపోయివుంటే నేనీ స్త్రీపట్ల చాలా కఠినంగా వ్యవహరించేవాడ్ని'' అని అన్నారు.

(ఈ సంఘటన సుప్రసిద్ధ హదీసు గ్రంథాలన్నిటిలోనూ పేర్కొనబడింది.)

## దైవప్రవక్త(స) చేసిన మరికొన్ని తీర్పులు

బుఖారి, ముస్లిం, అబూదావూద్, నసాయి వగైరా హదీసు గ్రంథాలలో సహెల్ బిన్ సాద్ సాదీ, ఇబ్నెఉమర్ (రజి)లు ఉల్లేఖించిన కథనాల ప్రకారం ఉవైమర్ (రజి)ని, ఆయన భార్యను ప్రమాణం చేయించడానికి మసీదుకు పిలిపించడం జరిగింది. ప్రమాణం చేయించే ముందు దైవప్రవక్త (సల్లం) వాళ్ళిద్దర్నీ హెచ్చరిస్తూ "మీరిద్దరిలో ఒకరు అబద్ధీకులని దేవునికి బాగా తెలుసు. మరి మీలో ఎవరైనా పశ్చాత్తాపపడుతూ తప్పు ఒప్పుకుంటారా?'' అని అడిగారు. కాని వారిద్దరిలో ఎవరూ తప్పు ఒప్పుకోలేదు. అంచేత దైవప్రవక్త (సల్లం) ఇద్దరి చేతా ప్రమాణం చేయించారు.

ప్రమాణం చేసిన తరువాత ఉవైమర్ (రజి) మాట్లాడుతూ "దైవప్రవక్తా! ఇప్పుడు నేనీ స్త్రీని నా దాంపత్యంలో కొనసాగనిస్తే నేను అబద్ధీకుణ్ణవుతాను'' అన్నారు. ఈమాట చెప్పి వెంటనే ఆయన ప్రవక్త అనుమతి తీసుకోకుండానే తనభార్యకు ఒకేసారి మూడు తలాఖులు ఇచ్చేశారు. దైవప్రవక్త (స) ఆయనిచ్చిన విడాకుల్ని ఆమోదించి భార్యాభర్తల మధ్య వివాహవిచ్ఛేదం చేయించారు. ఆ సందర్భంలో ఆయన మాట్లాడుతూ "ఇది పరస్పరం ప్రమాణం చేసే దంపతుల మధ్య చేయించే వివాహవిచ్ఛేదం'' అని అన్నారు.

ఈ హదీసు ఉల్లేఖించిన సహెల్ బిన్ సాద్ (రజి) దీనిపై వ్యాఖ్యానిస్తూ "ఇలా ప్రమాణం చేసే దంపతుల మధ్య వివాహవిచ్ఛేదం చేయించడం ప్రవక్త సంప్రదాయమై

పోయింది. ఆ తరువాత ఇకఎన్నటికీ వారిద్దరు ఏకం కావడానికి వీల్లేదు" అని అన్నారు. "అప్పుడా స్త్రీ గర్భవతిగా ఉండింది. ఆ గర్భం తాను చేసింది కాదని ఉవైమర్ అన్నాడు. అంచేత శిశువు తల్లికొడుకుగా పరిగణించడం జరిగింది. ఇలా ఆ శిశువు తల్లిఆస్తికి, తల్లి అతనిఆస్తికి వారసులయ్యేలా సంప్రదాయం ఏర్పడింది" అని కూడా అన్నారాయన.

మరో ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) దంపతుల చేత ప్రమాణం చేయించిన తరువాత "ఇప్పుడు మీ విచారణ బాధ్యత దేవునిపై ఉంది. మీ ఇద్దరిలో ఒకరు తప్పక అబద్ధీకులని దేవునికి తెలుసు" అని అన్నారు. తర్వాత ఆయన భర్తతో "ఇక ఈమె నీ భార్యగా ఉండదు. ఈమెపై పెత్తనం చేయడానికి నీకెలాంటి అధికారం లేదు. ఈమెపై ఎలాంటి దుశ్చర్యకైనా పాల్పడేందుకు నీకు హక్కు లేదు" అని అన్నారు.

అప్పుడతను "మరి నా ధనం సంగతేమిటీ?" అనడిగాడు. దానికి దైవప్రవక్త (స) "ఆ ధనం తీసుకోడానికి నీకధికారం లేదు. ఒకవేళ నీ ఆరోపణ నిజమైనా ఆమె ద్వారా నీవు ధర్మసమ్మతంగా అనుభవించిన దాంపత్యసుఖానికి ఈ ధనం బదులవుతుంది. నీ ఆరోపణ అబద్ధమైతే అది మరింత దూరమైపోతుంది" అనిఅన్నారు. (బుఖారి, ముస్లిం)

## గర్భధారణ గురించి కొన్ని చిక్కు సమస్యలు

వేరొక ఉల్లేఖనం ప్రకారం ఒక గ్రామీణీడు వచ్చి "నాభార్య నల్ల పిల్లవాడ్ని కన్నది. (నాకు ఆమె శీలం పట్ల అనుమానముంది.) అన్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "నీ దగ్గర ఒంటెలు ఉన్నాయా?" అని అడిగారు. దానికా వ్యక్తి ఉన్నాయన్నాడు. "వాటి రంగు ఎలా ఉంది?" అనడిగారు దైవప్రవక్త (స). ఎర్రగా ఉందన్నాడు అతను. "వాటిలో బూడిదరంగు ఒంటెలు కూడా ఉన్నాయా?" ప్రశ్నించారు దైవప్రవక్త (స). ఉన్నాయన్నాడా పల్లెవాసి. "మరి ఆరంగు ఎక్కడ్నుంచి వచ్చింది?" అనడిగారు దైవప్రవక్త (స). "బహుశా వాటి తాతముత్తాలలో ఎవరి రంగయినా వచ్చిఉంటుంది" అన్నాడా వ్యక్తి.

"అదేవిధంగా నీఈ పిల్లవాడికి కూడా తాతముత్తాలలో ఎవరి రంగయినా వచ్చి ఉంటుంది" అని చెప్పారు దైవప్రవక్త (స). ఇలా ఆ పల్లెవాసికి దైవప్రవక్త (స) పిల్లవాడి సంబంధాన్ని తిరస్కరించడానికి అనుమతి ఇవ్వలేదు. (బుఖారి, ముస్లిం)

స్త్రీ పెళ్ళయిన ఆర్నెల్లకే ప్రసవిస్తే ఎవరికైనా అనుమానం వస్తుంది. కాని గర్భం ధరించి, బిడ్డను కని, పాలుపట్టడానికి ముప్ఫయి నెలలు పడ్తుందని 46:15 సూక్తిలో ఉంది. 2:233 సూక్తిలో తల్లులు తమ బిడ్డలకు పూర్తిగా రెండేళ్ళు పాలుపట్టాలని ఉంది. 31:14 సూక్తిలో బిడ్డ పాలువదలడానికి రెండేళ్ళు (24 నెలలు) పట్టిందని ఉంది. దీన్నిబట్టి స్త్రీ కనీసం 6 నెలల్లో గర్భం ధరించి, పూర్తిస్థాయి బిడ్డను కనడం సాధ్యమేనని తెలుస్తోంది. అంచేత షరీఅత్‌వేత్తలు ఏస్త్రీ అయినా పెళ్ళయిన ఆర్నెల్లకు బిడ్డను కంటే, దాని కారణంగా ఆమె మీద వ్యభిచారనింద మోపడానికి వీల్లేదని నిర్ణయించారు.

ఒక్కోసారి స్త్రీ గర్భధారణ ఆమె భర్త వల్ల ఏర్పడిందో, ప్రియుడి వల్ల ఏర్పడిందో తెలుసుకోవడం సాధ్యం కాదు. భర్త తన భార్య వ్యభిచరిస్తుండగా చూడకపోయినా ఆమె చేష్టలు, ఆమె ప్రియుడి రాకపోకలను బట్టి అతనికి తప్పకుండా అనుమానం వస్తుంది.



అలాంటి పరిస్థితిలో అతను లిఆన్ (ప్రమాణం) చేయలేడు. పుట్టిన బిడ్డను అతను మనస్ఫూర్తిగా స్వీకరించనూ లేడు. మహాఅయితే అతను అనుమానం బలపడిన తర్వాత ఆమెకు విడాకులిచ్చి వదిలించుకోవడానికి మాత్రమే ప్రయత్నిస్తాడు.

అయినా కాన్పు తర్వాత బిడ్డ సమస్య అలాగే ఉండిపోతుంది. ఈ రోజుల్లో డి.యన్.ఎ. పరీక్షలొచ్చాయి. వీటి ద్వారా ఈ సమస్య చాలావరకు పరిష్కారం కావచ్చు. అయితే ఒక్కోసారి డి.యన్.ఎ. పరీక్షలు కూడా విజయవంతం కాకపోవచ్చు. అప్పుడు పరిస్థితి ఏమిటీ? ఈ సమస్యను దైవప్రవక్త (సల్లం) ఇలా పరిష్కరించారు:

"ఎవరి పడక మీద పుట్టిన శిశువు వారిదే అవుతుంది. వ్యభిచారికి మాత్రం రాళ్ళు (కాచుకొని) ఉంటాయి. (అంటే శిలాశిక్ష పడుతుంది.)" అన్నారు ఆయన. (బుఖారి)

దైవప్రవక్త (సల్లం) 'లిఆన్' (ప్రమాణం) గురించి మాట్లాడుతూ ఇలా అన్నారు: "ఏస్త్రీ అయినా తన భర్త కుటుంబానికి చెందని పిల్లవాడ్ని (అక్రమ సంతానాన్ని) ఆ కుటుంబంలోకి తెచ్చి దూర్చితే ఆమెతో దేవునికి ఎలాంటి సంబంధం ఉండదు. దేవుడు ఆమెను ఎన్నటికీ స్వర్గానికి పంపడు. అలాగే ఎవరైనా పురుషుడు తనవైపు పిల్లవాడు (ప్రేమగా) చూస్తున్నా ఆ పిల్లవాడితో ఉన్న జన్మసంబంధాన్ని నిరాకరిస్తే ప్రళయదినాన దేవుడు అతని వైపు కన్నెత్తి కూడా చూడడు; యావత్తు మానవుల ముందు అతడ్ని అవమానం పాలుజేస్తాడు." (అబూదావూద్, నసాయి. దార్మి)

# 70. వివిధ మతాలలో వ్యభిచార శిక్షలు

ఇస్లాం ఇలా వ్యభిచారానికి దారితీసే అశ్లీల చేష్టలపై ఆంక్షలు విధించినప్పటికీ వాటన్నిటినీ ఉల్లంఘించి ఎవరైనా వ్యభిచారానికి పాల్పడితే అతనికి చట్టపరమైన శిక్ష విధిస్తుంది. వ్యభిచారం దాదాపు అన్ని మతాల్లోనూ పాపకార్యమే. సభ్యతా నాగరికతల దృష్ట్యా కూడా ప్రతి యుగంలోనూ మానవసమాజాలు దీన్ని చెడ్డవిషయంగానే పరిగణించాయి. మానోవాంఛలకు బానిసలై స్త్రీని సెక్స్‌సింబల్‌గా భావించే కొందరు తప్ప ఎవరూ ఎన్నడూ వ్యభిచారం దుష్కార్యమనే విషయంలో విభేదించలేదు.

"వ్యభిచారం దరి దాపులకుపోకండి. అది చాలా హేయమైనది, పరమ చెడ్డదారి. (అంటే నరకానికి గొనిపోయే దారి.)"– (ఖుర్ఆన్–17:32)

అయితే వ్యభిచారానికి చట్టపరంగా విధించే శిక్ష విషయంలో భేదాభిప్రాయాలు ఉన్నాయి. ఇవి ముఖ్యంగా రెండురకాలుగా ఉన్నాయి. ఒకటి, చట్టపరంగా శిక్షార్హంకాని సాధారణ వ్యభిచారం (Fornication). రెండు, శిక్షార్హమైన వ్యభిచారం (Adultery). ఒకే విధమైన శిక్ష కాకుండా వేర్వేరుశిక్షలు ఉండాలనే విషయంలో మతాలు విభిన్నపద్ధతులు అవలంబించాయి. బైబిల్లో అవివాహిత స్త్రీని వల్లో వేసుకొని వ్యభిచరించిన పురుషుడికి మహర్ ధనమంత నగదు రూపంలో జరిమానా విధించబడుతుంది.

"ఎవరైనా నిశ్చితార్థంకాని కన్యను మభ్యపెట్టి ఆమెతో వ్యభిచరిస్తే అతను తప్పకుండా మహర్ చెల్లించి ఆమెను పెళ్ళి చేసుకోవాలి. ఒకవేళ ఆ పిల్లతండ్రి

అతనికిచ్చి పెళ్ళి చేయడానికి అంగీకరించకపోతే ఆ మనిషి కన్యలకు చెల్లించేటంత మహర్ ఆమెకు నగదు రూపంలో ఇవ్వవలసి ఉంటుంది.'' (పాతనిబంధన)

మరొక అధ్యాయంలో ''పిల్లతండ్రికి యాభై తులాల వెండి పరిహారంగా ఇవ్వా ల''ని; వేరొక అధ్యాయంలో ''ఎవరైనా మతగురువు (ప్రీస్ట్) కూతురితో వ్యభిచరిస్తే అతడ్ని ఉరితీయాలని, ఆ బాలికను సజీవంగా కాల్చివేయాల''ని ఉంది.

మనుస్మృతిలోనూ దాదాపు ఇలాంటి శిక్షలే ఉన్నాయి: ''ఎవరైనా తన కులానికి చెందిన కన్యతో ఆమె అంగీకారంతో వ్యభిచరిస్తే అతనికి ఎలాంటి శిక్ష లేదు. ఆ కన్య తండ్రి ఒప్పుకుంటే ప్రతిఫలం ముట్టజెప్పి ఆమెను పెళ్ళాడవచ్చు. అయితే పురుషుడు నీచకులస్థుడై, కన్య ఉన్నతకులస్థురాలై ఉన్నప్పుడు ఆమెను ఇంటినుండి గెంటేయాలి. పురుషునికి అవయవఖండన శిక్ష విధించాలి. (అధ్యాయం-8, శ్లోక్-365,366). ఆ కన్య బ్రాహ్మణ కులానికి చెందినదైతే ఇది సజీవదహన శిక్షగా మారి పోతుంది. (శ్లోక్-377)

సాధారణంగా పురుషుడు వివాహిత స్త్రీతో ఆమె అంగీకారంతో వ్యభిచరిస్తే ఇతర మతాలలో ఇద్దరికీ శిక్షలుంటాయి. ప్రాచీనఈజిప్టు సంస్కృతిలో పురుషుడ్ని కర్రలతో చితకబాదాలని, స్త్రీముక్కు కోసేయాలని ఉంది. ప్రాచీన ఈరాన్, బాబిలోనియాలోనూ దాదాపు ఇలాంటి శిక్షలే ఉండేవి. హిందూశాస్త్రం ప్రకారం స్త్రీని కుక్కల చేత కరిపించాలి; పురుషుడ్ని వేడిపడక మీద పండబెట్టి నలువైపుల నుంచి అగ్నిమంటలు పెట్టాలి.

బైబిల్ పాతనిబంధనం ప్రకారం ''ఎవరైనా పురుషుడు వివాహిత స్త్రీతో వ్యభిచరిస్తే ఇద్దర్నీ హతమార్చాలి'' అని ఉంది. (22,23); మరొక చోట ఇలా ఉంది:''ఎవరైనా నిశ్చితార్థం జరగకుండా ఉన్న కన్యను మభ్యపెట్టి ఆమెతో సంభోగం జరిపితే ఆమెను తప్పకుండా మహర్ ఇచ్చి వివాహం చేసుకోవలసి ఉంటుంది. ఒకవేళ ఆ బాలిక తండ్రి ఆమెను అతనికి ఇవ్వడానికి ఒప్పుకోకపోతే అతను కన్యలకు ఇచ్చేటంత మహర్ ఆమెకు నగదు రూపంలో ఇచ్చివేయాలి.'' (అధ్యాయం-22, సూక్తులు-16,17)

అయితే ఈసా (అలైహి)కు చాలా పూర్వమే యూద ధర్మవేత్తలు, నాయకులు, ప్రజలు అందరూ ఈ చట్టాన్ని రద్దు చేశారు. ఇది బైబిల్‌లో వ్రాయబడినప్పటికీ, దీన్ని దైవశాసనం అని భావించబడుతున్నప్పటికీ ఆచరణాత్మకంగా అమలుపరచడం జరిగేది కాదు. ఈసా (అలైహి) సత్యసందేశ ప్రచారం ప్రారంభించినప్పుడు, యూదులు ఆ ఉద్య మాన్ని నిరోధించడానికి చేసిన ప్రయత్నాలన్నీ ఫలించకపోవడంతో వారొక పన్నాగం పన్నారు. ఆయన దగ్గరకు ఒక వ్యభిచారిణి పట్టితెచ్చి ఈమెను గురించి తీర్పుచేయండి అన్నారు. (యూహన్న:అధ్యాయం-8, సూక్తి-1-11). హజ్రత్ ఈసా (అలై) ఆమెను బావిలో గాని, గోతిలోగాని దూకేలా వత్తిడి చేయవచ్చని; ఒకవేళ ఆయన కనికరించి శిలాశిక్షకు బదులు మరేదైనా శిక్ష విధిస్తే 'చూడండి, ఈ వింత ప్రవక్తగారు ప్రాపంచిక ప్రయోజనాల కోసం దైవచట్టాన్ని మార్చివేశారు' అంటూ దుష్ప్రచారం చేయవచ్చని వారు భావించారు.

హజ్రత్ ఈసా (అలైహి) శిలాశిక్ష విధించారలని చెబితే దానివల్ల ఒకవైపు రోమ్ చట్టాలతో ఘర్షణ వస్తుంది; మరోవైపు 'ఈ ప్రవక్తగారిని నమ్మండి, చూడండి ఇకనుండి



తౌరాత్ ధర్మశాస్త్రమంతా మీ వీపులపై, ప్రాణాలపై రుద్దబడుతుంది' అని జనంలో బాగా దుష్ప్రచారం చేయవచ్చని యూదులు ఎత్తుగడ వేశారు. అయితే హజ్రత్ ఈసా (అలై) ఒకేఒక మాటతో వారి ఎత్తుగడను చిత్తుచేశారు. ''మీలో ఏపాపం చేయని పవిత్రుడు ఎవరైనా ముందుకు వచ్చి ఈమెపై రాళ్ళు రువ్వండి'' అన్నారు ఆయన. ఈమాట విన గానే ఆ యూదమతపండితుల మూకంతా ఒక్కొక్కరే నోరు మూసుకొని వెళ్ళిపోయారు. ధర్మశాస్త్ర సమర్థకుల నైతిక పరిస్థితి బండారం పూర్తిగా బట్టబయలైపోయింది. చివరికి ఆ స్త్రీ ఒక్కతే అక్కడ ఉండిపోయింది. హజ్రత్ ఈసా (అలైహి) ఈ వ్యవహారం గురించి తీర్పు చేయడానికి న్యాయమూర్తిగా రాలేదు. నేరారోపణకు సంబంధించిన సాక్ష్యాలు కూడా ప్రవేశపెట్టబడలేదు. అదీగాక దైవచట్టాలను అమలుపరిచేందుకు ఇస్లామీయ ప్రభుత్వం కూడా లేదు. అందువల్ల ఆయన ఆ స్త్రీకి హితోపదేశం చేసి పంపివేశారు.

ఈ సంఘటనతో పాటు హజ్రత్ ఈసా (అలై) వివిధ సందర్భాలలో చెప్పిన కొన్ని హితోక్తులకు క్రైస్తవులు వక్రభాష్యం చెప్పి వ్యభిచార నేరానికి వేరే రూపం కల్పించారు. వారి దృష్టిలో అవివాహిత పురుషుడు అవివాహిత స్త్రీతో వ్యభిచరిస్తే పాపమే కాని, శిక్షార్హ మైన నేరం కాదు. ఒకవేళ వారిద్దరు లేక ఎవరైనా ఒకరు వివాహితులై ఉంటే మాత్రమే అది నేరం అవుతుంది. దానికి శిక్షేమిటో చూడండి. వ్యభిచారం చేసిన పురుషుడి భార్య తనభర్త తనకు అన్యాయం చేశాడని ఫిర్యాదుచేసి అతన్నుండి విడిపోయే డిక్రీ తీసుకో వచ్చు. ఇక వ్యభిచారం చేసిన స్త్రీ భర్త తనభార్యకు వ్యతిరేకంగా ఫిర్యాదుచేసి విడాకుల డిక్రీ తీసుకోవడమే గాక తనభార్య శీలాన్ని చెడగొట్టిన పురుషుడి నుండి నష్టపరిహారం వసూలుచేసే హక్కు కూడా అతనికుంటుంది. ఇంతవరకు బాగానే ఉందనిపిస్తుంది. కాని అలా డిక్రీ తీసుకున్న ఆ స్త్రీకిగాని, పురుషుడికిగాని పునర్వివాహం చేసుకునే అధికారం లేదు. క్రైస్తవచట్టం ప్రకారం వారిక జీవితాంతం పునర్వివాహం చేసుకోకుండా సన్యాసుల్లా ఉండిపోవాల్సిందే. ఇలా సన్యాసులుగా ఉండదలచినవారు తమ జీవిత భాగస్వాముల విశ్వాసఘాతుక చర్యల్ని గురించి క్రైస్తవన్యాయస్థానంలో ఫిర్యాదు చేసుకో వచ్చు. ఇలాంటి వివిధ భావనలే ఈనాటి పాశ్చాత్య చట్టాలకు ప్రాతిపదికలయ్యాయి. వారి దృష్టిలో వ్యభిచారం అనైతికం, చెడ్డవిషయం, పాపకార్యమే గాని, నేరం మాత్రం కాదు. వారి దగ్గర బలవంతంగా చేసే మానభంగం మాత్రమే నేరమవుతుంది.

## 71. ఇస్లాంలో వ్యభిచార శిక్ష

వీటన్నిటికి భిన్నంగా ఇస్లాం దృష్టిలో వ్యభిచారం ఎలాంటిదైనా నేరమే. వ్యభిచారి ధర్మసమ్మతమైన మార్గం వదలి అక్రమానికి పాల్పడినందున అతను ఇహలోకంలో కూడా శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. కాకపోతే మానభంగం వ్యవహారంలో పురుషునికి మాత్రమే శిక్ష పడుతుంది. ఇస్లాం పవిత్రమైన కుటుంబవ్యవస్థ, ఆరోగ్యవంతమైన సమాజం, అశ్లీలరహితమైన సభ్యతాసంస్కృతులను కోరుకుంటుంది. దానికోసం వ్యక్తు లలో ఏకదైవరాధనా భావనతో పాటు, పరలోక జవాబుదారీభావన కల్గించి వారిని సంస్క రించడానికి ప్రయత్నిస్తుంది. లైంగిక తృప్తి కోసం వివాహం, విడాకులు, పునర్వివాహం వగైరా అవకాశాలు కల్పిస్తుంది. వ్యభిచారానికి దారితీసే అశ్లీల చేష్టలన్నిటిని అరికట్టే

చర్యలను తీసుకుంటుంది. అప్పటికీ రోగనివారణ కాకపోతే వ్యభిచార నిరోధానికి చివరి ఆయుధంగా మాత్రమే చట్టపరమైన శిక్షలు ప్రతిపాదిస్తుంది.

ఇస్లాం వ్యభిచారాన్ని హిజ్రీశకం-3లోనే శిక్షార్హమైన చర్యగా నిర్ణయించింది. అయితే అప్పుడది ప్రభుత్వ న్యాయస్థానంలో తీర్పివ్వబడే స్థాయి నేరంగా కాకుండా కుటుంబ స్థాయి నేరంగా మాత్రమే నిర్ణయించబడింది. సదరు కుటుంబ సభ్యులే వ్యభిచారికి శిక్ష విధించేలా దివ్యఖుర్ఆన్‌లో ఈవిధంగా దైవాజ్ఞ వెలువడింది:

"మీ స్త్రీలలో ఎవరైనా సిగ్గుమాలిన పనికి పాల్పడితే, అందుకు మీలో నలుగురిని సాక్షులుగా తీసుకురావాలి. ఆ నలుగురు సాక్ష్యమిస్తే, అప్పుడు ఆ స్త్రీలను వారి ఇండ్లలో నిర్బంధించాలి. వారికి (సహజ)మరణం వచ్చేదాకా లేదా దేవుడు వారికేదైనా దారి చూపే దాకా ఇలా నిర్బంధంలో ఉంచాలి. మీలోఎవరైనా (స్త్రీపురుషులు) ఈ దుశ్చర్యకు వడిగట్టే వారిద్దర్నీ శిక్షించాలి. వారు పశ్చాత్తాపం చెంది తమను తాము సంస్కరించు కుంటే వారిని వదలిపెట్టాలి. దేవుడు అమిత క్షమాశీలి, అపార కృపాశీలుడు." (ఖుర్ఆన్-4:15,16)

ఆ తర్వాత మూడేండ్లకు రెండవ ఆజ్ఞ ఇలా వచ్చింది: "వ్యభిచారి, వ్యభిచారిణి-వీరిద్దరిలో ప్రతిఒక్కరికీ వందేసి కొరడాదెబ్బలు కొట్టండి. మీరు దేవుడ్నీ, అంతిమదినాన్నీ విశ్వసించినవారైతే దైవధర్మం విషయంలో వారిపట్ల మీరు సానుభూతి వెలిబుచ్చకూడదు. వారిని శిక్షించేటప్పుడు కొందరు విశ్వాసులు దగ్గర ఉండాలి." (ఖుర్ఆన్-24:2)

శాశ్వతమైన ఈ ఆదేశం వచ్చిన తరువాత గతంలో వచ్చిన కుటుంబ స్థాయి ఆజ్ఞ రద్దయిపోయింది. ఇకనుంచి వ్యభిచారం ప్రభుత్వానికి పట్టుబడే చట్టపరమైన నేరం (Cognizable Offence)గా పరిగణించబడింది. ఇది అవివాహిత స్త్రీపురుషుల వ్యభిచార నేరానికి విధించబడే సాధారణ శిక్ష. పైన పేర్కొన్న (4:15,16) సూక్తులు చూడండి.

తర్వాత అదే అధ్యాయంలో మరికొంచెం ముందుకుపోయి ఇలా పేర్కొనబడింది: "మీలో ఎవరికైనా విశ్వసించిన స్వతంత్ర స్త్రీలను వివాహమాడే స్తోమత లేకపోతే అలాంటివారు తమ అధీనంలోకి వచ్చిన ముస్లిం బానిస స్త్రీలను వివాహమాడాలి.... ఒకవేళ వారు వివాహబంధంలోకి వచ్చి భద్రత పొందిన తర్వాత దుర్నడతకు పాల్పడితే అలాంటి వారికి స్వతంత్ర స్త్రీలకు విధించే శిక్షలో సగం శిక్ష విధించాలి." (ఖుర్ఆన్-4:25)

4:15 సూక్తిలో పేర్కొనబడిన స్త్రీ అవివాహిత స్త్రీ అని 4:25 సూక్తిని బట్టి స్పష్టంగా తెలుస్తోంది. 4:25 సూక్తిలో "మీలో ఎవరికైనా విశ్వసించిన స్వతంత్ర స్త్రీలను వివాహ మాడే స్తోమత లేకపోతే..." అనంటే అవివాహిత కుటుంబ స్త్రీ అనే అర్థం వస్తుంది. అయితే వివాహిత స్త్రీకి విధించే శిక్షను గురించి ఖుర్ఆన్‌లో పేర్కొనబడలేదు. అది హదీసుల్లో పేర్కొనబడింది. అనేక హదీసుల్లో వివాహిత వ్యభిచారికి స్త్రీఅయినా, పురుష డయినా రాళ్ళు రువ్వి హతమార్చే శిలాశిక్ష విధించాలని ఉంది.

దైవప్రవక్త (స) "వారి కోసం దేవుడు ఏదైనా మార్గం చూపించేవరకు" అనే 4:15 సూక్తిపై వ్యాఖ్యానిస్తూ "దేవుడు వారి కోసం మార్గం చూపించాడు. వివాహితకు శిలాశిక్ష, అవివాహితకు కొరడాశిక్ష విధించాలి" అని అన్నారు.



హజ్రత్ ఉబాదా బిన్ సామిత్ (రజి) కథనం: ఒకరోజు దైవప్రవక్త (స)పై దివ్యావి ష్కృతి (వహీ) అవతరించింది. దివ్యావిష్కృతి అవతరణ సమయంలో ప్రత్యేక పరిస్థితి దూరమైన తరువాత ఆయన మాట్లాడుతూ "ఇదిగో భద్రపరచుకోండి, దేవుడు ఈ స్త్రీల కోసం సరళ మార్గం సృజించాడు. వివాహితుడు వివాహితతో, అవివాహితుడు అవివాహి తతో వ్యభిచారానికి పాల్పడితే వివాహితులకు వంద కొరడా దెబ్బలతో పాటు శిలాశిక్ష విధించబడుతుంది. అవివాహితులకు వంద కొరడా దెబ్బల తరువాత ఒక సంవత్సరం పాటు దేశబహిష్కరణ శిక్ష విధించబడుతుంది" అని అన్నారు. (ముస్నద్ అహ్మద్)

ద్వితీయ శ్రేష్ఠఖలీఫా హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) కథనం: "దేవుడు ముహమ్మద్ మహనీయుడ్ని (స) సత్య ప్రాతిపదికపై ప్రభవింపజేశాడు. ఆయన (హృదయఫలకం)పై దివ్యఖుర్ఆన్ అవతరింపజేశాడు. దేవుడు అవతరింపజేసిన దానిలో శిలాశిక్షకు సంబం ధించిన సూక్తి కూడా ఉంది. మేము దీన్ని చదివాము, అర్థం చేసుకున్నాం, గుర్తుంచు కున్నాం. దైవప్రవక్త (స) కూడా శిలాశిక్షను అమలుపరచారు. ఆయన తరువాత మేము కూడా శిలాశిక్షను అమలుపరచాము. అయితే ఓ సుదీర్ఘకాలం గడచిన తరువాత ఈ విషయంలో ఎవరైనా 'దైవగ్రంథంలో శిలాశిక్షకు సంబంధించిన సూక్తి ఏదీ మాకు కన్పిం చడంలేదే' అని అంటారేమోనని నేను భయపడుతున్నాను. ఒకవేళ అలా అంటే ముస్లింలు దేవుడు అవతరింపజేసిన ఒక విధిని వదిలేసినవారయి మార్గభ్రష్టులైపోతారు. దైవగ్రంథం ప్రకారం వ్యభిచారానికి పాల్పడిన వివాహిత వ్యక్తికి శిలాశిక్ష నిర్దేశించబడింది. ఇది ముమ్మాటికీ నిజం. కాకపోతే సాక్ష్యాల ద్వారా నేరం రుజువుకావాలి లేదా గర్భధారణ జరిగివుండాలి లేదా నేరస్థుడు నేరాన్ని ఒప్పుకోవాలి." (బుఖారి, ముస్లిం)

కొరడా దెబ్బల శిక్ష కోసం నేరస్థుడు (1)వయోజనుడై (యుక్తవయస్కుడై) ఉండటంతోపాటు (2) చైతన్యవంతుడై ఉండాలి. బాలలకు, బుద్ధిమాంద్యం కలవారికి, ఉన్మాదులకు శిక్ష ఉండదు. బానిసలకు స్వతంత్రునికి విధించే శిక్షలో సగంశిక్ష మాత్రమే ఉంటుంది. (ఒకవేళ బానిస స్త్రీలు వివాహబంధంలోకి వచ్చి భద్రత పొందిన తర్వాత దుర్నడతకు పాల్పడితే అలాంటివారికి స్వతంత్రస్త్రీలకు విధించే శిక్షలో సగం శిక్ష విధించాలి-4:25). శిలాశిక్ష కోసం నేరస్థుడు పైరెండు అర్హతలతో పాటు క్రింద పేర్కొన్నట్లు మరో మూడు అర్హతలు కూడా కలిగివుండాలి:

(1) నేరస్థుడు స్వేచ్ఛాపరుడై ఉండాలి. బానిసకు శిలాశిక్ష ఉండదు.

(2) నేరస్థుడు వివాహితుడై ఉండాలి. శోభనం కూడా జరిగి ఉండాలి.

(3) నేరస్థుడు ముస్లిమైవుండాలి. ఇక్కడ ఇమాముల్లో భేదాభిప్రాయాలున్నాయి.

# 72. జిమ్మీలకు విధించే శిక్షలు

ఇమామ్ షాఫయి, ఇమామ్ అబూయూసుఫ్, ఇమామ్ అహ్మద్ (రహ్మాలై)లు జిమ్మీ వివాహితులు వ్యభిచరించినా వారికీ శిలా శిక్ష విధించబడుతుంది అంటారు. కాని ఇమామ్ అబూహనీఫా, ఇమామ్ మాలిక్ (రహ్మాలై)లు వివాహిత వ్యభిచారి ముస్లిం అయివున్నప్పుడే శిలాశిక్ష విధించబడుతుందని చెబుతారు. దైవప్రవక్త (సల్లం) యూద

నేరస్థులకు శిలాశిక్ష విధించినట్లు హదీసుల ద్వారా తెలుస్తోంది. అయితే దైవప్రవక్త (స) యూద నేరస్థులకు ఇస్లామీయ రాజ్యచట్టం (Law of the Land) ప్రకారం కాకుండా వారి మతపరమైన వ్యక్తిగత చట్టం (Personal Law) ప్రకారం శిలాశిక్ష విధించారని వీరి అభిప్రాయం. ఈ అభిప్రాయాన్ని ఈ క్రింది ఉల్లేఖనాలు ధృవపరుస్తున్నాయి:

ఖైబర్ ప్రాంతపు అగ్రవర్ణయూదులకు చెందిన ఒక పురుషునికి, ఒక స్త్రీకి మధ్య అక్రమసంబంధం ఏర్పడింది. తౌరాత్ గ్రంథం ప్రకారం ఇలాంటి నేరానికి రాళ్ళు రువ్వి చంపే శిక్ష విధించాలి. కాని యూదులు తౌరాత్‌ఆజ్ఞ పాటించకుండా పరస్పరం సంప్ర దించుకొని, ముహమ్మద్ (స)ను మధ్యవర్తిగా స్వీకరించి ఆయన శిలాశిక్ష కాకుండా వేరేశిక్ష చెబితే ఒప్పుకోవాలని, శిలాశిక్షే చెబితే ఒప్పుకోకూడదని నిర్ణయించుకున్నారు.

వారు దైవప్రవక్త (స) దగ్గరకెళ్ళి తీర్పుచేయమని అడిగారు. ఆయన శిలాశిక్ష విధించాలని చెప్పారు. వారు దానికి ఒప్పుకోలేదు. “మరి మీమతంలో ఈ నేరానికి శిక్షేమిటీ?” అని అడిగారాయన. “కొరడాదెబ్బలు కొట్టడం, ముఖానికి మసిబూసి గాడిదపై ఊరేగించడం” అన్నారు వారు. “మీరు ప్రమాణంచేసి, వివాహిత వ్యభిచారులకు తౌరాత్‌లోని శిక్షేమిటో చెప్పండ”ని అడిగారాయన. యూదులు మళ్ళీ అదే శిక్ష గురించి చెప్పారు.

అయితే వారిలో ఒక ప్రముఖ ధర్మవేత్త మౌనంగా ఉండటం చూసి దైవప్రవక్త (స) అతడ్ని ఇలా అడిగారు: “మిమ్మల్ని ఫిరౌన్ బారినుండి కాపాడి, మీకు తూర్(కొండ) దగ్గర ధర్మశాస్త్రం ప్రసాదించిన దేవుడ్ని సాక్షిగా చేసి అడుగుతున్నాను. తౌరాత్‌లో వ్యభిచారికి ఈ శిక్షే ఉందా?” అప్పుడా ధర్మవేత్త ఇలా సమాధానమిచ్చాడు:

“వ్యభిచారికి శిక్ష రాళ్ళురువ్వి చంపడమే. కాని మా ప్రజలలో వ్యభిచారం ఎక్కువై పోవడంతో మా పాలకులు గొప్పవాళ్ళు వ్యభిచారం చేస్తే వదలిపెడ్తూ, చిన్నవాళ్ళు వ్యభిచారం చేస్తే శిలాశిక్ష విధించడం ప్రారంభించారు. అయితే ఈపద్ధతి వల్ల ప్రజలలో నిరసన వ్యక్తమయింది. అప్పుడు మేము తౌరాత్ చట్టాన్ని మార్చి వ్యభిచారులకు కొరడా దెబ్బలు కొట్టి, ముఖానికి మసిబూసి గాడిద మీద ఊరేగించే విధానం ప్రవేశపెట్టాము.”

ఈమాట విని ఇతర ధర్మవేత్తలు నోరుమూసుకున్నారు. చివరికి దైవప్రవక్త తీర్పు ప్రకారమే వ్యభిచరించిన ఆఇద్దరు స్త్రీపురుషుల్ని రాళ్ళు విసిరి హతమార్చడం జరిగింది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) దగ్గరకు కొందరు యూదులు వచ్చి “మాలో ఒకస్త్రీ, ఒకపురుషుడు వ్యభిచారానికి పాల్పడ్డార”ని చెప్పారు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని “తౌరాత్ గ్రంథంలో శిలాశిక్ష గురించి ఏముంద”ని అడిగారు. దానికి యూదులు “మేము వారిని అవమానపరచి కొరడాదెబ్బలు కొడ్తాము” అన్నారు. అప్పుడు (యూదుల్లో ఇస్లాం స్వీకరించివున్న) హజ్రత్ అబ్దుల్లా బిన్ సలాం (రజి) వారి మాటలు విని “మీరు అబద్ధమాడుతున్నారు. తౌరాత్‌లో ఈ నేరానికి శిలాశిక్ష ఉంది” అన్నారు. యూదులు తౌరాత్ తెప్పించి తెరచి చూపించారు.

అప్పుడు వారిలో ఒకతను శిలాశిక్ష ఉన్న ఆదేశం కనపడనీయకుండా దానిమీద చేయి పెట్టి దాని పైన, క్రిందఉన్న వాక్యాలను మాత్రమే చదవసాగాడు. హజ్రత్ అబ్దుల్లా



బిన్ సలాం మళ్ళీ జోక్యం చేసుకుంటూ “నీ చెయ్యి తీసేసి చదువు” అన్నారు. ఆ యూదుడు చేతిని తీస్తే అక్కడ శిలాశిక్ష ఆదేశం స్పష్టంగా ఉంది.

అప్పుడు యూదులు (నిజాన్ని ఒప్పుకుంటూ) “అబ్దుల్లా బిన్ సలాం చెప్పింది నిజమే, తౌరాత్‌లో శిలాశిక్ష ఆదేశం ఉంది” అన్నారు. దాని ప్రకారం దైవప్రవక్త (సల్లం) వారిద్దరికీ శిలాశిక్ష అమలుపరచమని ఆదేశించారు. ఈ ఆదేశానుసారం వ్యభిచారు లిద్దరికీ రాళ్ళురువ్వి శిక్షించడం జరిగింది. (బుఖారి, ముస్లిం)

‘తౌరాత్‌లో వ్యభిచారికి శిలాశిక్ష ఉందని రూఢి అయిన తర్వాత’ దైవప్రవక్త (స) “నేను తౌరాత్‌లో ఉన్న ఆదేశం ప్రకారమే పరిష్కారం చేస్తాను” అన్నారని బుఖారి, ముస్లిం గ్రంథాల్లో ఉంది. వేరొక ఉల్లేఖనంలో “దేవా! వీరు నీ ఆదేశాన్ని మృతప్రాయం చేసిన తర్వాత దీనికి జీవంపోసిన వారిలో నేను మొదటివాడ్ని” అన్నారని ఉంది.

వ్యభిచారం నేరం కావడానికి అంగప్రవేశం జరిగిందని తెలితే చాలు. స్త్రీ పురుషు లిద్దరు ఒకపడక మీద పడుకోవడంగాని, ఒకచోట నగ్నంగా ఉండటంగాని జరిగితే ఆ మాత్రానికే వారిపై వ్యభిచారనింద మోపడాన్ని ఇస్లాం ఒప్పుకోదు. అలాంటి చేష్టలతో పట్టుబడిన నేరస్థులకు ప్రభుత్వం పరిస్థితుల్ని బట్టి తేలికపాటి శిక్షలు విధిస్తుంది. కొరడా దెబ్బల శిక్షయితే పదికి మించకూడదని కొన్ని ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది.

## 73. ప్రభుత్వం నేరస్థుల్ని వేటాడి శిక్షించదు

ఇస్లాం నేరస్థుల్ని పనిగట్టుకొని మరీ వెతికిపట్టుకొని శిక్షలు విధించడాన్ని అంగీకరించదు. ఏదైనా అశ్లీలచేష్ట వల్ల అనుమానం వచ్చినప్పుడు వ్యభిచార నిరూపణ కోసం సదరు స్త్రీపురుషుల్ని డాక్టర్‌చేత పరీక్ష జరిపించి శిక్ష విధించే వరక్కూడా పోదు. ఎవరైనా నేరస్థుడు ప్రభుత్వానికి పట్టుబడకుండా పశ్చాత్తాపం చెంది దైవసన్నిధిలో క్షమాపణ చెప్పుకుంటేచాలు, అదే అతని పాపానికి పరిహారమవుతుంది. ఒకవేళ ప్రభుత్వం ముందు నేరం ఒప్పుకుంటే మాత్రం శిక్ష పడుతుంది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) కథనం: ఒకతను వచ్చి “దైవప్రవక్తా! పట్నం బయట నేను ఒక స్త్రీతో రతిక్రీడ తప్ప అన్నీచేశాను. నాకు మీరిప్పుడు ఏం శిక్ష విధిస్తారో విధించండి” అని అన్నాడు. హజ్రత్ ఉమర్ (రజి) జోక్యం చేసుకుంటూ “దేవుడు నీ పాపం కప్పిపుచ్చినప్పుడు నీవూ దాన్ని అలాగే ఉండనిస్తే బాగుండేది కదా!” అన్నారు.

దైవప్రవక్త (స) ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయారు. దాంతో అతను వెళ్ళిపోయాడు. కాస్సేపటికీ దైవప్రవక్త(స) అతడ్ని పిలిపించి “వినండి. పగటివేళ ఆద్యంతాలలో (ఉదయం, సాయంత్రం), రాత్రివేళ కొంచెం సమయం గడచిన తర్వాత ప్రార్థన చేయండి. నిస్సందేహంగా సత్కార్యాలు దుష్కార్యాలను నిర్మూలిస్తాయి” (11:114) అనే సూక్తి విన్పించారు. అప్పుడొకతను “ఈసూక్తి అతనికి మాత్రమే ప్రత్యేకమా?” అనడిగాడు. దానికి దైవప్రవక్త (స) “కాదు, ఇది అందరికీ వర్తిస్తుంది” అన్నారు. (ముస్లిం, తిర్మిజి)

ఎవరైనా తన నేరం గురించి పూర్తిగా వివరించకుండా నేరం చేసినట్లు అంగీకరిస్తే ఇస్లాం లోతుకుపోయి నీవు చేసిన నేరం ఏమిటని అడగడాన్ని కూడా ధర్మసమ్మతంగా

భావించదు. ఉదాహరణకు ఈ క్రింది సంఘటన చూడండి:

ఒకతను వచ్చి "దైవప్రవక్తా! నేను శిక్షకు అర్హుణ్ణయ్యాను. నాకు శిక్ష విధించండి" అన్నాడు. దానికి దైవప్రవక్త (స), నీవు ఏ నేరానికి అర్హుడయ్యావని అడగలేదు. ఆ వ్యక్తి నమాజ్ ముగిసిన తరువాత లేచి "దైవప్రవక్తా! నేను శిక్షకు అర్హుణ్ణయ్యాను. నాకు శిక్ష విధించండి" అన్నాడుమళ్ళీ. అప్పుడు దైవప్రవక్త (స) "నువ్విప్పుడు మాతో కలసి నమాజ్ చేయలేదా?" అనడిగారు. దానికా వ్యక్తి, చేశాను అన్నాడు. "అయితే దేవుడు నీ పాపం క్షమించాడు" అన్నారు దైవప్రవక్త (స) అతనితో. (బుఖారి, ముస్లిం, అహ్మద్)

వ్యభిచారానికి పాల్పడినవాణ్ణి నేరస్థుడిగా నిర్ధారించడానికి అతనా పని ఎలాంటి వత్తిడి, బలవంతం లేకుండా తన ఇష్టప్రకారం స్వేచ్ఛగా చేశాడని కూడా రుజువుకావాలి. ఒకవేళ ఆ వ్యక్తి బలవంతం, వత్తిళ్ళ వల్ల వ్యభిచరిస్తే అతనికి శిక్ష విధించడం జరగదు. ముఖ్యంగా మానభంగం కేసులో పురుషునికి మాత్రమే శిక్ష విధించి స్త్రీని వదలేయడం జరుగుతుంది. ఖుర్ఆన్‌లో బలవంతంగా పడుపువృత్తిలోకి దించబడే బానిస మహిళల్ని దేవుడు క్షమించే విషయం ఇలా పేర్కొనబడింది:

## 74. మానభంగం శిక్షలు

"మీ బానిసమహిళలు శీలవతులుగా ఉండదలచుకున్నప్పుడు, ప్రాపంచిక ప్రయోజనాల కోసం వారిని మీరు బలవంతంగా పడుపువృత్తిలోకి దించకండి. వారిని ఎవరైనా బలవంతంగా అలా మార్చితే ఆ బలాత్కారం తరువాత వారి విషయంలో దేవుడు ఎంతో క్షమించేవాడు, కరుణించేవాడు (అవుతాడు)." (ఖుర్ఆన్-24:33)

అనేక హదీసుల్లో మానభంగం కేసుల పరిష్కారం గురించిన ప్రస్తావనలున్నాయి. తిర్మిజి, అబూదావూద్‌లలోని ఓ కథనం ప్రకారం "ఒక స్త్రీ నమాజ్ చేయడానికి చీకటిలో బయలుదేరింది. దారిలో ఒకతను ఆమెను పడదోసి మానభంగానికి పాల్పడ్డాడు. అప్పుడామె కేకలు పెట్టింది. ఆ కేకలు విని జనం వచ్చి అతడ్ని పట్టుకొని దైవప్రవక్త (స) ముందు ప్రవేశపెట్టారు. దైవప్రవక్త (స) అతనికి శిలాశిక్ష విధించి స్త్రీని వదలిపెట్టారు."

బుఖారీ గ్రంథంలోని ఒక ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో ఒక వ్యక్తి ఒక బాలికను మానభంగం చేశాడు. హజ్రత్ ఉమర్ (రజి) ఆ వ్యక్తికి కొరడా దెబ్బలు కొట్టించి, బాలికను వదలిపెట్టారు.

పైన పేర్కొన్న వివరాల్ని బట్టి మానభంగానికి గురయ్యే స్త్రీ వ్యవహారంలో మాత్రం ఇమాములందరి ఏకాభిప్రాయం ఉంది. పురుషుడి వ్యవహారంలోనే భేదాభిప్రాయాలు వచ్చాయి. ఇమామ్ అబూయూసుఫ్, ఇమామ్ ముహమ్మద్, ఇమామ్ షాఫయి, ఇమామ్ హసన్ బిన్ సాలిహ్ (రహ్మలై)ల అభిప్రాయం ప్రకారం పురుషుడు కూడా బలవంతం, వత్తిళ్ళ వల్ల రమించవలసి వచ్చినప్పుడు అతనూ క్షమాపణకు అర్హుడవుతాడు.

ఇమామ్ జుఫర్ (రహ్మలై) దీన్ని అంగీకరించకుండా రతిక్రీడ పట్ల ఆసక్తి, ఉద్దేశ్యం లేకుండా అంగస్తంభన జరగదు గనక ఎలాంటి పరిస్థితిలోనైనా వ్యభిచారానికి పాల్పడిన పురుషుడు నేరస్థుడిగా, శిక్షార్హుడిగానే పరిగణించబడతాడని అభిప్రాయపడ్డారు.



ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) తన అభిప్రాయం ఇలా వ్యక్తపరిచారు: "ఒకవేళ ప్రభుత్వంగాని, ప్రభుత్వాధికారిగాని రతిక్రీడ కోసం పురుషుణ్ణి బలవంతం చేస్తే అలాంటి ప్రభుత్వానికి అతణ్ణి శిక్షించే అధికారంలేదు. కాని పురుషునికి బలవంతంగా అంగస్తంభన జరగదు గనక ఇతరులు బలవంతం చేస్తే మాత్రం అతనికి శిక్ష పడుతుంది."

పై మూడు అభిప్రాయాల్లో మొదటి అభిప్రాయమే సరైనదని చెప్పాలి. ఎవరైనా దుర్మార్గుడు ఒ సచ్ఛీలుణ్ణి బలవంతంగా పట్టుకొని జైల్లోగాని లేదా ఏదైనా గదిలోగాని త్రోసి, ఆ గదిలోకి ఓ అందమైన యువతిని దిగంబరంగా చేసి పంపి అనేక రోజులదాకా గది మూసి ఉంచడం జరిగితే ఆ పురుషుడు సహనం కోల్పోయి రతిక్రీడ జరపకుండా ఉండలేడు. అప్పుడా దుర్మార్గుడు నలుగురిని సాక్షులుగా చేసి వ్యవహారం న్యాయస్థానం ముందు పెడితే, న్యాయస్థానం వాస్తవ పరిస్థితుల్ని విస్మరించి ఆ స్త్రీపురులిద్దరికీ కొరడాశిక్షగాని, శిలాశిక్షగాని విధించడం న్యాయమేనా?

అదేవిధంగా ఎవరినైనా జైల్లో వేసి మద్యం తప్ప మరేపానీయం ఇవ్వనప్పుడు అతను తీవ్రమైన దప్పికతో గత్యంతరంలేక మద్యం తాగితే ఆ మాత్రానికే అతనికి శిక్ష విధించడం న్యాయమవుతుందా? నేరపరిశోధనకు కేవలం సంకల్పం సరిపోదు. దానికి స్వేచ్ఛాయుతమైన సంకల్పం కావాలి. ఎవరినైనా ఉద్దేశపూర్వకంగానే నేరం చేసేలా బలవంతంగా ఇలాంటి పరిస్థితులు కల్పిస్తే కొన్ని సందర్భాలలో అతనసలు నేరస్థుడే కాలేడు; కొన్ని సందర్భాలలో అతని నేరం చాలా తేలికగా ఉంటుంది.

ఇస్లాం వ్యభిచారికి, వ్యభిచారిణికి వ్యతిరేకంగా చర్యతీసుకునే అధికారం ప్రభుత్వానికి తప్ప మరెవరికీ ఇవ్వదు. అలాగే నేరం రుజువైన తరువాత శిక్ష విధించే అధికారం న్యాయస్థానానికి తప్ప ఎవరికీ లేదు. వ్యభిచార నేరశిక్ష రాజ్యానికి సంబంధించిన చట్టం. వ్యక్తులకుగాని, ప్రభుత్వేతర సంస్థలకుగాని ఈ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే అధికారం ఏమాత్రం లేదు.

అలాగే ఇస్లామీయ చట్టం నేరాంగీకారం కోసం నిందితుడిపై ఏవిధమైన వత్తిడి చేయదు. ఇందులో నిందితుడు తన నేరాన్ని తప్పకుండా అంగీకరించాలన్న రూల్ ఏదీ లేదు. నిందితుడి నేరం గురించి ప్రజలకు తెలిస్తే వారా విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తప్పకుండా తీసుకురావాలన్న రూల్ కూడా లేదు. ఒకవేళ విషయం ప్రభుత్వం దృష్టికి వస్తే మాత్రం నిందితుడికి శిక్ష తప్పదు. వీటిని గురించి ఈ హదీసులు చూడండి:

"మీలో ఎవరైనా ఇలాంటి అశ్లీల చేష్టలో కాలుజారడం జరిగితే ఆ పాపాన్ని దేవుడు కప్పిపుచ్చిన తెరలో అలాగే దాగి ఉండనివ్వండి. ఒకవేళ నిందితుడు మా ముందు తన తెరను పెకెత్తితే మాత్రం మేమతనిపై దైవగ్రంథంలోని చట్టాన్ని అమలుజరిపి తీరుతాం" అన్నారు దైవప్రవక్త (స).

అబూదావూద్, నసాయి గ్రంథాల్లోని ఒక హదీసు ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "నేరాలు-శిక్షల విషయంలో మీరు పరస్పరం క్షమించుకోండి. ఒకవేళ ఏదైనా నేరం గురించిన నివేదిక నా దగ్గరకు వస్తే మాత్రం దానికి శిక్ష తప్పనిసరి అవుతుంది."

ఇస్లామీయచట్టం ప్రకారం నేరానికి తగిన శిక్షే విధించబడాలిగాని, నిందితుడు శిక్ష నుండి తప్పించుకోవడానికి ఏదైనా మూల్యం చెల్లిస్తే అది చెల్లదు. అనేక హదీసుగ్రంథాలలో వచ్చిన ఒక ఉల్లేఖనం ప్రకారం ఒక యువకుడు ఒకతని దగ్గర జీతానికి పనిచేస్తూ ఓసారి ఆ యజమాని భార్యతో రమించాడు. యువకుని తండ్రి అతని యజమానికి వంద మేకలు, ఒక బానిస స్త్రీని ఇచ్చి సమస్యను పరిష్కరింపజేసుకున్నాడు. అయితే ఈ వ్యవహారం దైవప్రవక్త (సల్లం) దృష్టికి వచ్చినప్పుడు ఆయన యువకుని తండ్రిని పిలిపించి "నీ మేకలు, నీ బానిసరాలు వాపసు తీసుకో. (నీ కొడుక్కు శిక్ష పడుతుంది)" అన్నారు. తరువాత ఆయన వ్యభిచారికి, వ్యభిచారిణికి శిక్ష విధించారు.

దీన్నిబట్టి ఇస్లాంలో పరిహారం, ప్రతిఫలాల ఇచ్చిపుచ్చుకోవడాల ద్వారా సమస్యను తొక్కిపట్టడం నిషిద్ధమని తెలుస్తోంది. అంతేకాదు, స్త్రీ మానానికి ధన కనక వస్తు రూపేణ విలువ కట్టడం కూడా నిషిద్ధమని తెలుస్తోంది.

# 75. నేరనిరూపణ సాక్ష్యం

వ్యభిచారానికి సరైన సాక్ష్యాధారాలు లేకుండా కేవలం వినికిడి సమాచారంతో ప్రభుత్వం వ్యభిచారికి శిక్ష విధించలేదు. దైవప్రవక్త (స) కాలంలో మదీనాలో ఓ పచ్చి వ్యభిచారిణి ఉండేది. ఆమె అశ్లీలతను గురించి ప్రజలందరికీ తెలుసు. కాని సరైన సాక్ష్యాధారాలు లభించనందున ఆమెకు దైవప్రవక్త (స) శిలాశిక్ష విధించలేకపోయారు. ఈమె ప్రస్తావన హదీసుగ్రంథాల్లోని అనేక ఉల్లేఖనాలలో ఉంది. ఒక ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఆ వ్యభిచారిణి గురించి ప్రస్తావిస్తూ "నేను సాక్ష్యాధారాలు లేకుండా శిలాశిక్ష విధించేవాణ్ణయితే ఆ స్త్రీకి తప్పకుండా శిలాశిక్ష విధించేవాడ్ని" అని అన్నారు.

ఇస్లాం నేరనిరూపణ సాక్ష్యాల విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకుంటుంది. వ్యభిచార నిరూపణకు ముఖ్యంగా నాలుగు జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది.

(1) ఖుర్ఆన్‌లోని 4:15, 24:4 సూక్తుల ప్రకారం వ్యభిచార నిరూపణకు కనీసం నలుగురు ప్రత్యక్ష సాక్షులు ఉండాలి.

(2) చట్టం ప్రకారం సాక్షులు నమ్మదగినవారైఉండాలి. వారు ఇదివరకటి ఏదైనా వ్యవహారంలో అసత్యసాక్ష్యం చెప్పనివారైఉండాలి. నమ్మకద్రోహులై ఉండకూడదు. గతంలో శిక్ష అనుభవించనివారైఉండాలి. నిందితునిపట్ల శత్రుభావం లేనివారై ఉండాలి.

(3) సాక్షులు నిందితుడ్ని, నిందితురాలిని వ్యభిచారం చేస్తుండగా బావిలో చాంతాడును చూసినట్లు కళ్ళారా చూశామని సాక్ష్యం ఇవ్వాలి.

(4) ఎప్పుడు, ఎక్కడ, ఎవరు ఎవరితో వ్యభిచరించారన్న విషయంపై సాక్షుల్లో ఏకాభిప్రాయం ఉండాలి. ఆ నలుగురిలో ఏ ఒక్కడు ఏ విషయంలో విభేదించినా మొత్తం సాక్ష్యం నీరుగారిపోతుంది.

వ్యభిచారానికి ఇలాంటి సాక్ష్యం లభించడం సాధ్యమేనా? నూటికో కోటికో ఒకటి లభించడం కూడా కష్టమేనని పై షరతులు చూస్తే ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది.



పోతే భర్తవిహీనురాలికి జరిగే గర్భధారణ విషయంలో ధర్మవేత్తల మధ్య భేదాభిప్రాయాలున్నాయి. లక్షలో ఒక్క వ్యవహారమైనా సరే పురుషవీర్యకణం ఏవిధంగా, ఏ రూపంలోనైనా స్త్రీ గర్భంలో ప్రవేశించే అవకాశం ఉండవచ్చు గనక, కేవలం గర్భధారణ నేరనిరూపణకు దృఢమైన సాక్ష్యం కాజాలదని అధికసంఖ్యాక ధర్మవేత్తల అభిప్రాయం. శిలాశిక్ష లేక కొరడాశిక్ష లాంటి భయంకరమైన శిక్ష విధించడానికి నలుగురి సాక్ష్యమైనా కావాలి లేదా స్వయంగా నిందితురాలైనా తన నేరాన్ని ఒప్పుకోవాలి. శిక్ష విధించడానికి ఇస్లామీయ చట్టంలో కొన్ని మౌలిక సూత్రాలున్నాయి.

ఈ మౌలికసూత్రాల్లో ఒకటి- అనుమానం అనేది నేరస్థుడికి శిక్ష విధించడానికి బదులు అతడ్ని క్షమించడానికి మాత్రమే ప్రేరణగా ఉండాలి. దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "శిక్షలను వీలైనంతవరకు నిరోధించండి." (ఇబ్నెమాజ)

మరొక హదీసులో ఆయన ఇలా అన్నారు: "శిక్షలను వీలైనంతవరకు ముస్లింలకు దూరంగా ఉంచండి. నిందితుడ్ని శిక్ష నుండి తప్పించడానికి ఏవిధమైన మార్గం దొరికినా అతడ్ని వదలిపెట్టండి. న్యాయాధికారి నిందితుడికి శిక్ష విధించడంలో చేసే పొరపాటు కన్నా అతడ్ని క్షమించడంలో చేసే పొరపాటే శ్రేష్ఠమైనది." (తిర్మిజి)

దీన్నిబట్టి నేరస్థుల్ని వెతికివెతికి పట్టుకొని తీవ్రమైన శిక్షలు విధించడం ఇస్లాం లక్ష్యం కాదని, సమాజసంస్కరణే దాని అసలులక్ష్యమని తెలుస్తోంది. దైవప్రవక్త (సల్లం) కాలంలో ఇలాంటి సాక్ష్యాలతో ఒక్క వ్యభిచార వ్యవహారం కూడా విచారణకు రాలేదు. రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) పాలనలోని పన్నెండేండ్ల కాలంలో ఒకేఒక కేసు విచారణకు వచ్చింది. చివరికి అదికూడా ఒక సాక్షి పలికిన అనుమానాస్పదమైన మాటల కారణంగా వీగిపోయింది. ఆ కేసు వివరాలు ఇలా ఉన్నాయి:

బస్రా రాష్ట్ర గవర్నర్ ముగీరా బిన్ షాబా (రజి)తో మరొక వ్యక్తి అబూబక్రాకు చాలా కాలం నుంచి సత్సంబంధాలు లేవు. వారిద్దరి ఇండ్లు రోడ్డు పక్కన ఎదురెదురుగా ఉన్నాయి. అలాంటి పరిస్థితిలో ఓరోజు రాత్రి హఠాత్తుగా తీవ్రమైన గాలి వీచడంతో ఇద్దరి ఇండ్ల కిటికీలు తెరచుకున్నాయి. అబూబక్రా కిటికీ రెక్కలు మూసేద్దామని లేచి వెళ్తే అతనికి ఎదురింటి కిటికీ లోపల గవర్నర్ ముగీరా రతిక్రీడలో లీనమైఉన్న దృశ్యం కన్పించింది. అతను తనఇంట్లోనే వున్న మరోముగ్గురు మిత్రుల్ని పిలిచి ఆ శృంగార దృశ్యం చూడమని పురమాయిస్తూ ఈ అశ్లీల చేష్టకు మీరూ సాక్షులుగా ఉండండని అన్నాడు. నాఫె బిన్ కలదా, జియాద్, షిబల్ అనే ఆ ముగ్గురు మిత్రులు ఆ దృశ్యం చూసి 'ఈ స్త్రీ ఎవర'ని అడిగారు. 'ఈమె ఉమ్మె జమీల్' అన్నాడు అబూబక్రా.

మరునాడు ఈ వ్యవహారం హజ్రత్ ఉమర్ (రజి) దగ్గరకు వచ్చింది. వెంటనే ఆయన హజ్రత్ ముగీరా (రజి)ను గవర్నర్ పదవి నుంచి సస్పెండ్ చేసి ఆయన స్థానంలో హజ్రత్ అబూమూసా అష్అరీ (రజి)ని గవర్నర్‌గా నియమించి పంపారు. తరువాత బస్రా నుంచి నిందితుడ్ని సాక్షులతో సహా రాజధాని మదీనాకు పిలిపించారు. విచారణ చేస్తున్నప్పుడు అబూబక్రా, మరోఇద్దరు (షిబల్, నాఫె) తాము ముగీరాను ఉమ్మెజమీల్‌తో రమిస్తుండగా చూశామని సాక్ష్యం చెప్పారు. అయితే నాల్గవ సాక్షి జియాద్ మాత్రం

తనకా స్త్రీ స్పష్టంగా కన్పించలేదని, అంచేత ఆమె ఉమ్మెజమీలేనని గట్టిగా చెప్పలేనని అన్నాడు. హజ్రత్ ముగీరా (ర) సాక్షులు తనను చూస్తుండిన వైపు నుండి స్త్రీని స్పష్టంగా చూడలేరని విచారణలో రుజువు చేశారు. అంతేకాదు, తన భార్య, ఉమ్మెజమీల్ రూపురేఖల్లో దాదాపు ఒకేలా ఉంటారని కూడా ఆయన రుజువు చేశారు. వేరొక వైపు ఉమర్ (రజి) పాలనలో అధికార గృహంలో భార్యాసమేతంగా నివసిస్తుండిన ఒక రాష్ట్ర గవర్నర్ పరస్త్రీని పిలిపించుకొని వ్యభిచరించలేడని పరిస్థితులు సూచిస్తున్నాయి.

పై కారణాలుగా సాక్షులు లేనిపోని అనుమానాలకు పోయి హజ్రత్ ముగీరాపై నిందవేశారు గనక ఆయన్ని వదిలేయడం జరిగింది. అయితే హజ్రత్ ఉమర్ (ర) సాక్షులలో అబూబక్రా, నాఫె, షిబల్‌లకు నిందితుడిపై అపనింద మోపిన నేరానికి "శీలవతులైన స్త్రీలపై అపనింద మోపి, దానికి నలుగురు సాక్షులు తీసుకురాలేనివారిని ఎనభై కొరడా దెబ్బలు కొట్టండి" (24:24) అనే ఖుర్‌ఆన్‌సూక్తి ప్రకారం కొరడా శిక్ష విధించారు.

(ఇబ్నుల్‌అరబి-అహ్కాముల్ ఖుర్‌ఆన్, రెండవభాగం)

ఈ కేసులో సాక్షులకు విధించిన శిక్ష ప్రత్యేక పరిస్థితుల్లో తీసుకున్న నిర్ణయం మాత్రమే. సాధారణ పరిస్థితుల్లో సాక్షుల పొరపాట్లకు వారిని శిక్షించడం జరగదు.

వ్యభిచార నేరనిరూపణ కోసం సాక్ష్యాధారాలు లేకుండా నిందితుడు తన నేరాన్ని ఒప్పుకున్నా సరిపోతుంది. అయితే నిందితుడు తాను పరస్త్రీతో వ్యభిచరించినట్లు స్పష్టమైన పదజాలంతో చెప్పాలి. న్యాయస్థానం కూడా నిందితుడు ఎలాంటి బలవంతం వత్తిళ్ళు లేకుండా, పూర్తి స్వేచ్ఛతో, స్పృహతోనే వ్యభిచారం చేశాడని నిర్ధారించుకోవాలి. ఇక శిక్ష అమలుపరుస్తున్నప్పుడు నిందితుడు తాను వ్యభిచారం చేయలేదని మాట మార్చడం జరిగితే అతడ్ని శిక్షించకుండా వదిలేయాలి.

ఈ విషయంలో 'మాయిజ్ బిన్‌మాలిక్ అస్లమీ' వృత్తాంతం చాలా ప్రసిద్ధిచెందింది. ముఖ్యమైన హదీసుగ్రంథాలన్నిటిలోనూ ఈసంఘటన పేర్కొనబడింది. ఈ యువకుడు అస్లం తెగకు చెందిన అనాథబాలుడు, హజ్రత్ హజ్జాల్ బిన్ నుఐమ్ (రజి) సంరక్షణలో పెరిగాడు. అతను ఓసారి బానిసత్వం నుంచి విముక్తిపొందిన ఒక యువతితో వ్యభిచరించాడు. హజ్రత్ హజ్జాల్ (రజి) ఈ సంగతి తెలుసుకొని "దైవప్రవక్త (స) దగ్గరికెళ్ళి చెప్పెయ్యి, బహుశా ఆయన నీ పాపక్షమాపణ కోసం దైవాన్ని ప్రార్థిస్తారు" అని చెప్పారు. ఆ యువకుడు దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి విషయం చెప్పాడు. వివరాలు చూడండి:

## 76. నేరవిచారణ విధానం

"దైవప్రవక్తా! నేను వ్యభిచారం చేశాను, నన్ను పరిశుద్ధ పరచండి."

దైవప్రవక్త (సల్లం) ఈమాట విని ముఖం పక్కకు తిప్పుకున్నారు.

యువకుడు దైవప్రవక్త (స) ముందుకు వచ్చి మళ్ళీ అదే మాటన్నాడు. దైవప్రవక్త (స) మళ్ళీ ముఖం పక్కకు తిప్పుకున్నారు. అతను మూడోసారి కూడా దైవప్రవక్త (స) ముందుకొచ్చి అదే మాటన్నాడు. దైవప్రవక్త (స) మూడోసారి కూడా ముఖం పక్కకు



తిప్పుకున్నారు. హజ్రత్ అబూబకర్ (రజి) జోక్యం చేసుకుంటూ "జాగ్రత్త! నువ్వు నాల్గవ సారి కూడా వ్యభిచారం చేసినట్లు ఒప్పుకున్నావంటే దైవప్రవక్త నీకు శిలాశిక్ష విధిస్తారు" అని హెచ్చరించారు. కాని ఆ యువకుడు నాల్గవసారి కూడా అదే మాటన్నాడు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆ యువకుని వైపు తిరిగి "అబ్బాయ్! నువ్వు బహుశా దురుద్దేశ్యంతో చూశావేమో లేదా చెయ్యిపట్టి లాగావేమో లేదా కౌగిలించుకొని ముద్దాడావేమో! (ఈ చేష్టల్నే నువ్వు వ్యభిచారమని భావించి ఉంటావు)" అని అన్నారు.

దానికా యువకుడు "లేదండీ, నేను వ్యభిచారమే చేశాను" అన్నాడు.

"ఆ స్త్రీ, నువ్వు ఒకే పడక మీద (కలసి) పడుకున్నారా?"

"ఔనండీ, నేను, ఆమె అలాగే పడుకున్నాం."

"ఏమిటి, నువ్వు నిజంగా సంభోగించావా?"

"ఔనండీ, నేను నిజంగానే సంభోగించాను."

"నీ అవయవం ఆమె అవయవంలోకి మాయమైనంత వరకు పోయిందా?"

దానికీ ఆ యువకుడు ఔనన్నాడు.

"అంటే బావిలోకి చాంతాడులా, సుర్మాసీసాలోకి పుడకలా మాయమైపోయిందా?"

దానికీ ఆ యువకుడు ఔనన్నాడు.

"అసలు నీకు వ్యభిచారం అంటే ఏమిటో తెలుసా?" అడిగారు దైవప్రవక్త (స).

"తెలుసండీ. ఒక భర్త తన భార్యతో ధర్మసమ్మతమైన రీతిగా చేసే పనిని నేను ఆ స్త్రీతో అధర్మ రీతిగా చేశాను" అన్నాడా యువకుడు.

"సరే, నీకు పెళ్ళయిందా?" అడిగారు దైవప్రవక్త (సల్లం).

"అయిందండీ!" చెప్పాడా యువకుడు.

"నువ్వు సారాయి ఏమైనా తాగలేదు కదా?"

"సారాయి ఏమీ తాగలేదండీ!"

అప్పుడొకతను లేచి అతని నోటి వాసనచూసి సారాయి తాగలేదని నిర్ధారించాడు.

దైవప్రవక్త (స) వ్యవహారాన్ని మరింత క్షుణ్ణంగా పరిశోధించడానికి యువకుడుండే వీథిలోని కొందరు ప్రజల్ని పిలిపించి "ఇతనికి పిచ్చేమైనా పట్టలేదు కదా?" అనడిగారు. దానికి వారు "ఇతనిలో పిచ్చేమీ ఉన్నట్లు మేమింతవరకు చూడలేదు" అన్నారు.

దైవప్రవక్త (సల్లం) యువకుని సంరక్షకుడితో "నువ్వితని చేష్టని కప్పిపుచ్చి ఉంటే నీకోసం ఎంతో బాగుండేది" అన్నారు. ఆ తరువాత ఆ యువకుడికి శిలాశిక్ష విధించారు.

అప్పుడు కొందరు ఆ యువకుడ్ని పట్నం బయటికి తీసికెళ్ళి ఓచోట నిలబెట్టి అతనిపై రాళ్లురువ్వారు. పాపం, యువకుడు రాళ్ళదెబ్బలకు తాళలేక "ప్రజలారా! నన్ను దైవప్రవక్త దగ్గరకు తీసికెళ్ళండి. దైవప్రవక్త నన్ను చంపించరని చెప్పి నా తెగవాళ్ళు నన్ను

మోసగించారు" అంటూ గగ్గోలు పెట్టాడు. కాని రాళ్ళు రువ్వేవారు అదేమీ పట్టించుకోకుండా ఆ యువకుడ్ని హతమార్చివేశారు. దైవప్రవక్త (స) విషయం తెలిసిన తర్వాత విచారం వెలిబుచ్చుతూ "జనం అతడ్ని ఎందుకు వదిలెయ్యలేదు. నా దగ్గరకు తీసుకొస్తే బహుశా పశ్చాత్తాపం చెందేవాడు, దేవుడు అతడ్ని క్షమించేవాడు కదా!" అని అన్నారు.

ఇంతకంటే ఆసక్తికరమైన మరో సంఘటన వినండి. గామిద్ తెగకు చెందిన ఓస్త్రీ వచ్చి తాను వ్యభిచారం చేసినట్లు నాలుగుసార్లు అంగీకరించింది. ఆమెకు అక్రమ గర్భ ధారణ కూడా జరిగింది. ఆమె తన నేరాన్ని మొదటిసారి అంగీకరించినప్పుడే దైవప్రవక్త (స) "సరేలే, వెళ్ళిపో. పశ్చాత్తాపం చెంది దైవాన్ని క్షమించమని ప్రార్థించు" అన్నారు.

కాని ఆస్త్రీ "దైవప్రవక్తా! మీరు నా వ్యవహారం మాయిజ్ వ్యవహారంలా దాటవేయ జూస్తున్నారా? నేను వ్యభిచారం వల్లనే గర్భం దాల్చాను" అని అన్నది.

"అయితే నువ్వు ప్రసవించిన తరువాత రా, చెబుతాను" అన్నారు దైవప్రవక్త (స).

కొంతకాలానికి ఆమె ప్రసవించింది. ప్రసవించిన తర్వాత చంటిపిల్లవాడ్ని తీసుకొని మళ్ళీ దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "ఇప్పుడు నన్ను పరిశుద్ధపరచండి" అన్నది.

దైవప్రవక్త (స) ఆ పిల్లవాడి వైపు చూస్తూ "పిల్లవాడికి పాలుపట్టు. పాలు తాగడం మానేసిన తరువాత రా" అని ఆదేశించారు ఆమెను.

ఆ స్త్రీ వెళ్ళిపోయి పిల్లవాడికి పాలు పట్టనారంభించింది. కొంతకాలానికి పాలు మాన్పించి చేతిలో ఓ రొట్టెముక్క తీసుకొని దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చింది. పిల్లవాడికి రొట్టెముక్క తినిపించిచూపుతూ "దైవప్రవక్తా! చూడండి, ఇప్పుడీ పిల్లవాడు పాలు తాగడం మానేసి రొట్టె తినడం మొదలెట్టాడు" అని అన్నది. అప్పుడు దైవప్రవక్త (స) పిల్లవాడ్ని సంరక్షణ కోసం ఒకతనికి అప్పగించి ఆ స్త్రీకి శిలాశిక్ష విధించారు.

ఇలాంటి కఠినమైన షరతులతో కూడిన సాక్ష్యాలతో నిందితుడి నేరాన్ని రుజువు చేసి శిక్షించడం ఇస్లామీయ రాజ్యంలో చాలా కష్టం. ఒకవేళ నేరం రుజువయితే మాత్రం నేర ప్రవృత్తి కలవారికి గుణపాఠం కలిగేలా సదరు నేరస్థుడ్ని బహిరంగ ప్రదేశంలో తీవ్రంగా శిక్షించడం జరుగుతుంది. ఇలాంటి నేరవిచారణ విధానంలో సమాజసంస్కరణ గోచరిస్తుందో, ప్రజావేధింపు ద్యోతకమవుతుందో సంఘశ్రేయోభిలాషులు ఆలోచించాలి.

పై మూడు అభియోగాల ద్వారా వ్యభిచారం చేశానని అంగీకరించిన నేరస్థుడ్ని న్యాయాధికారి, నీవు ఎవరితో వ్యభిచరించావని అడగడనే విషయం రుజువవుతోంది. ఒకవేళ అలా అడిగితే ఒకరికి బదులు ఇద్దరికి శిక్ష విధించవలసి వస్తుంది. కాని ఇస్లాం జనానికి శిక్షలు విధించడమే పనిగా పెట్టుకొని వాటి కోసం కాచుకొని ఉండదు.

ఒకవేళ నేరస్థుడు ఈ నిర్వాకంలో పాల్గొన్నవాడు ఎవరో చెబితే న్యాయస్థానం ఆ వ్యక్తిని విచారిస్తుంది. ఆ వ్యక్తి నేరం ఒప్పుకుంటే అతనిక్కూడా శిక్ష పడుతుంది; ఒప్పుకోకపోతే అతడ్ని వదలి నేరం అంగీకరించిన నిందితుడికి మాత్రమే శిక్ష పడుతుంది.

దైవప్రవక్త (సల్లం) కాలంలో ఇలాంటి అభియోగం ఒకటి ఆయన దగ్గరికొచ్చింది.



ముస్నద్ అహ్మద్, అబూదావూద్ గ్రంథాలలో వచ్చిన ఉల్లేఖనాల ప్రకారం ఒకతను వచ్చి తాను ఫలానా స్త్రీతో వ్యభిచరించినట్లు దైవప్రవక్త (స) ముందు అంగీకరించాడు. దైవ ప్రవక్త (స) ఆ స్త్రీని పిలిపించి అడిగితే, ఆమె లేదని చెప్పింది. అప్పుడు దైవప్రవక్త (స) ఆమెను వదలి ఆ పురుషునికి మాత్రమే శిక్ష విధించారు.

# 77. శిక్ష అమలుపరచే పద్ధతులు

కొన్నిరకాల నేరాలకు ఫలానా శిక్షలు మాత్రమే విధించాలని దేవుడు నిర్ణయించాడు. ఇలాంటి శిక్షల్ని 'హుదూద్' అంటారు. దేవుడు శిక్షలు నిర్ణయించని నేరాలకు న్యాయస్థానం పరిస్థితుల్ని బట్టి శిక్షలు విధిస్తుంది. ఈ శిక్షల్ని 'తాజిరాత్' అంటారు.

**హుదూద్ :** హత్యానేరానికి మరణశిక్ష విధించాలి (2:178,17:33). పొరపాటున జరిగిన హత్యానేరానికి ఒక బానిసకు స్వేచ్ఛనివ్వడంతో పాటు హతుని వారసులకు రక్త పరిహారం చెల్లించాలి (4:92). ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తూ దేశంలో అరాచకం సృష్టించినవారికి మరణశిక్షగాని, ఒకకాలు-ఒకచేయి నరికే శిక్షగాని లేదా దేశబహిష్కరణ శిక్షగాని విధించాలి (5:33). దొంగతనం నేరానికి హస్తఖండన శిక్ష విధించాలి (5:38). శీలవతులపై అపనింద మోపి దానికి నలుగురు సాక్షులు తీసుకురాలేనివారికి ఎనభై కొరడాదెబ్బల శిక్ష విధించాలి (24:4). అవివాహితుల వ్యభిచార నేరానికి వంద కొరడా దెబ్బల శిక్ష విధించాలి (24:2). వివాహితుల వ్యభిచారానికి శిలాశిక్ష విధించాలి.

**తాజిరాత్ :** మద్యపానం, జూదం, మోసం, అక్రమార్జన వంటి నేరాలకు న్యాయస్థానాలు పరిస్థితుల్ని పరిశీలించి జరిమానా, జైలునిర్బంధం, కొద్దిపాటి కొరడా దెబ్బలు, సంఘబహిష్కరణ, దేశబహిష్కరణ వగైరా శిక్షలు విధిస్తాయి.

నేరనిరూపణ అయిన తరువాత వ్యభిచారికి, వ్యభిచారిణికి విధించవలసిన శిక్షల విషయంలో ఇమాముల మధ్య కాస్తంత భేదాభిప్రాయాలు ఉన్నాయి.

వివాహిత స్త్రీపురుషులు చేసే వ్యభిచార నేరానికి వంద కొరడాదెబ్బలతో పాటు శిలాశిక్ష కూడా విధించాలని ఇమామ్ అహ్మద్, దావూద్ జాహిరి, ఇస్హాఖ్ ప్రముఖులు అభిప్రాయపడ్డారు. వారు తప్ప ఇతర ఇమాములు, ధర్మశాస్త్రవేత్తలంతా ఈ నేరానికి శిలాశిక్ష మాత్రమే విధించాలని అన్నారు.

అవివాహిత స్త్రీపురుషులు చేసే వ్యభిచార నేరానికి వంద కొరడాదెబ్బలతో పాటు సుదూర ప్రాంతానికి బహిష్కరణ లేక జైలునిర్బంధం వంటి శిక్షలు కూడా విధించాలని కొందరు ఇమాములు అభిప్రాయపడ్డారు. ఇమాం అబూహనీఫా, ఆయన అనుచరులైన ఇమామ్ అబూయూసుఫ్, ఇమామ్ జుఫర్, ఇమామ్ ముహమ్మద్‌లు వంద కొరడా దెబ్బల శిక్ష మాత్రమే విధించాలని అన్నారు.

"వివాహిత స్త్రీపురుషుల వ్యభిచార నేరాలకు దైవప్రవక్త (స) శిలాశిక్షతో పాటు, సుదూరప్రాంత బహిష్కరణ, జైలు నిర్బంధం వంటి తాజీరీ శిక్షలు కూడా విధించినట్లు ఏ హదీసులో కూడా లేదు." (మౌలానా మౌదూది-తఫ్హీముల్ ఖుర్ఆన్)

వ్యభిచార శిక్ష అమలుజరిపే తీరును గురించి అనేక హదీసులు, ఫిఖావేత్తల అభిప్రాయాలు ఉన్నాయి. వాటన్నిటిని పరిశీలిస్తే ఈక్రింది విషయాలు తెలుస్తాయి:

❋ కొరడా లేక బెత్తం మరీఅంత గట్టిగాగాని, మరీఅంత నాసిరకంగాని కాకుండా మధ్యరకంగా ఉండాలి.

అలాగే దెబ్బలు చరిచేవాడు మరీఅంత కఠినంగాగాని, మరీఅంత మృదువుగా గాని ప్రవర్తించకూడదు.

❋ కొట్టిన చోటే మళ్ళీ మళ్ళీ కొట్టకూడదు.

❋ ముఖం, మర్మాంగం, శిరస్సులపై కొట్టకూడదు.

❋ నేరస్థుడ్ని కట్టివేసి కొట్టకూడదు. పురుషుడైతే నిలబెట్టి కొట్టాలి; స్త్రీ అయితే కూర్చోబెట్టి కొట్టాలి.

❋ శిక్ష అమలు చేస్తున్నప్పుడు నేరస్థుడు ధరించివున్న బట్టలు తీసెయ్యకూడదు. లావుపాటి బట్టలుంటే తీసేసి సాధారణ దుస్తులు ధరింపజేయవచ్చు.

❋ వాతావరణంలో తీవ్రమైన ఉష్ణోగ్రతగాని, తీవ్రమైన చలిగాని ఉన్న సమయాల్లో కొట్టకూడదు. వేసవికాలంలో చల్లని సమయంలో, శీతాకాలంలో వేడి సమయంలో మాత్రమే కొట్టాలి.

❋ నేరస్థుడు వ్యాధిగ్రస్తుడైవుంటే వ్యాధి నుండి కోలుకొని పూర్తిగా ఆరోగ్యవంతుడయిన తరువాతే శిక్షించాలి.

❋ వ్యాధి నుండి ఇక ఎన్నటికీ కోలుకునే ఆశలేకపోతే లేదా వృద్ధాప్యంతో చాలా బలహీనమైపోయివుంటే వంద ఈనెలు ఉండే ఈనెలకట్టతో ఒకసారి మాత్రమే కొట్టాలి.

❋ గర్భిణీకి కొరడాదెబ్బలు కొట్ట వలసివచ్చినప్పుడు ప్రసవించిన తరువాత ప్రసవమైల దినాలు గడచిపోయే వరకు వేచివుండాలి.

❋ గర్భిణీకి శిలాశిక్ష అమలు జరపవలసివస్తే పుట్టే బిడ్డకు పాలుమాన్పించే కాలం దాకా వేచివుండాలి.

❋ దెబ్బలు తలారుల చేత కొట్టించకూడదు. శిక్షల్ని గురించి షరీఅత్ ఉద్దేశ్యం బాగా తెలిసిన ముస్లింల చేతనే కొట్టించాలి.

❋ నేరం సాక్షుల ద్వారా రుజువయితే సాక్షుల చేతనే దెబ్బలు ప్రారంభం కావాలి. నేరస్థుడే నేరం ఒప్పుకుంటే దెబ్బల ప్రారంభం న్యాయాధికారి చేయాలి.

ఇవీ ఇస్లామీయ న్యాయవ్యవస్థ రూపురేఖలు. పైన పేర్కొనబడిన సాక్ష్య పద్ధతిని, విచారణ విధానాన్ని, శిక్షలు అమలుజరిపే తీరును పరిశీలించే న్యాయప్రియులకు, సంఘశ్రేయోభిలాషులకు ఇస్లాం వ్యక్తిసంస్కరణను, సమాజశ్రేయస్సును మాత్రమే కోరుకుంటుందని సులభంగా గ్రహించగలుగుతారు.

ఇస్లామీయ న్యాయవ్యవస్థ రూపురేఖలతో ఈనాటి పాశ్చాత్య న్యాయవ్యవస్థలు, వాటి అడుగుజాడల్లో నడచుకునే ఇతర న్యాయవ్యవస్థల తీరుతెన్నుల్ని పోల్చిచూడండి.



నిజమైన న్యాయం ఏవ్యవస్థలో ఉందో, అన్యాయం-అక్రమాలకు ఏవ్యవస్థ చోటిస్తుందో ప్రశాంత మనస్సుతో ఆలోచించేవారే అర్థం చేసుకోగలుగుతారు.

ఇస్లాం ధర్మశాస్త్రం ప్రజలకు మధ్యయుగాలనాటి భయంకరమైన అనాగరిక శిక్షలు విధిస్తూ సమాజంలో భయోత్పాతం సృష్టిస్తుందని గోలచేసే నవనాగరిక శిఖామణులకు ఈ వాస్తవాలు కన్పించవు. గుట్టుచప్పుడు కాకుండా జరిగే ఈనాటి ఒళ్ళు గగుర్పొడిచే భయంకరమైన జైలుశిక్షలు, లాకప్ దౌర్జన్యాలు వారికి ఎంతో న్యాయమయిన నాగరిక శిక్షలుగా, సంస్కారవంతమైన విధానాలుగా కన్పిస్తాయి.

నేటి నాగరిక ప్రపంచంలోని చట్టాల ప్రకారం న్యాయస్థానాలే కాదు, ఒక సాధారణ జైలుసూపరిండెంట్‌కు కూడా నేరస్థుడు తన మాటను ధిక్కరిస్తే లేదా దూషిస్తే అతడ్ని కాళ్ళుచేతులు కట్టిపడేసి నగ్నశరీరంపై చర్మం చిట్లిపోయేలా ముప్ఫయి (లాఠీ)దెబ్బలు కొట్టే అధికారం ఉంది. నేరస్థుడి దేహంలోని మాంసం ఛిద్రమై ఎముకలు బయటికీ కనపడేటంతగా తలారి తన చేతిసత్తువ కొద్దీ కొట్టినచోటే అనేకసార్లు కొట్టినా తప్పులేదు.

ఇక పోలీసుల విషయానికి వస్తే, వారు కేవలం అనుమానం కారణాన అదుపులోకి తీసుకునే వ్యక్తులకు పెట్టే భయంకర చిత్రహింసలు నరకయాతనలను తలపింపజేస్తాయి. ఈ చిత్రహింసలకు ప్రాణాలుకోల్పోయే అభాగ్యులు కూడా ఎందరో ఉంటారు. లాకప్ డెత్‌ల కోసం వారికి కుంటిసాకులు ఎన్నో దొరుకుతాయి. శరీరం గగుర్పొడిచే ఈ చిత్రహింసల్ని వాటికి అద్దంపట్టే సినిమాలలో, టీవీఛానళ్ళలో కూడా జనం చూసి పోలీసుల ప్రతాపానికి ఆశ్చర్యంతో నోళ్ళు తెరుస్తున్నారు. అంతేకాదు, అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేయడానికి వచ్చే పేదవాళ్ళను ఈ పోలీసులు చితకబాదే సంఘటనలు కూడా అప్పుడప్పుడు వార్తాపత్రికల్లోకి ఎక్కడం మనం చూస్తున్నాం. అక్రమ సంబంధం నిందపై పట్టుబడే అమాయక స్త్రీల పట్ల పోలీసుల, న్యాయవాదుల ప్రవర్తన కూడా ఎంత ఘోరంగా ఉంటుందో లోకానికి తెలియని విషయం కాదు.

కొందరు ముస్లిమేతరులు వీటన్నిటిని ప్రచార-ప్రసార సాధనాల ద్వారా చూస్తున్నా ఇస్లాంవ్యతిరేకశక్తుల దుష్ప్రచారజాలంలో పడి ఇస్లాం శిక్షాస్మృతిని గురించి అపార్థాలకు గురైపోయారు. ఏ మతం గురించయినా వాస్తవం తెలుసుకోవడానికి ఆ మతానికి సంబంధించిన పండితుల రచనలు మాత్రమే అధ్యయనం చేయడం విజ్ఞుల లక్షణం.

ఇస్లాం పేదరికం-పీడనల్లో పుట్టి జనాదరణ-అవగాహనల ద్వారా అభివృద్ధి చెందింది. మక్కాలో ఇస్లాంఉద్యమం ప్రారంభమైన తొలిదశలోనే ఖుర్‌ఆన్ ఇస్లాం వ్యాప్తి గురించి ఇలా పేర్కొన్నది: “మేమీ భూభాగాన్ని నలువైపుల నుంచి నరుక్కుంటూ ఎలా నడచివస్తున్నామో వారు గ్రహించడం లేదా?” (13:41)- అంటే అరేబియాలో ఒకవైపు ఇస్లాం నలుమూలలా అతివేగంగా వ్యాపిస్తూ ముస్లిం జనసంఖ్య నానాటికి అధికమవుతుంటే, మరోవైపు బహుదైవారాధకుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోందని అర్థం.

(-సమాప్తం-)